

లఘుకౌముదీ మార్గదర్శిని.

ద్వితీయ భాగము

ఆనందవల్లీ గ్రంథమాల
శ్రీ వేంకటేశ్వరపురం - అనంతపురం.

శ్రీమద్వరదరాజకృత

మార్గదర్శినీ నామకాంధ్రవ్యాఖ్యా సముపేత.

లఘు సిద్ధాంత కౌముది

ద్వితీయ భాగము



వ్యాఖ్యాత :


భాషాప్రవీణ : డా॥ శలాక రఘునాథశర్మ ఎం ఏ, పిహెచ్.డి,


రీడరు, తెలుగుశాఖ - స్నాతకోత్తర విద్యాకేంద్రము, అనంతపురం.

ప్రథమ ముద్రణ
ప్రతులు వేయి :
ఫిబ్రవరి 1981.

మూల్యము : పది రూపాయలు.

ప్రతులకు :
శ్రీమతి శలాక రాజేశ్వరి,
B-4 పి. టి. సెంటర్ క్వార్టర్స్
శ్రీ వేంకటేశ్వరపురం (P. O.)
అనంతపురం - 515 003.







అక్షరాంజలి



కలియుగదైవము శ్రీ అలమేలుమంగాంబా సహిత శ్రీనివాసస్వామి కృపా వీక్షణము ఈ గ్రంథప్రకాశమునకు నిదానము.

'రచయితలకు ఆర్థిక సాహాయ్యము' అను పథకములో తిరుమల తిరుపతి దేవస్థానమువారు ఈ గ్రంథ ముద్రణమునకు రు 4480/- లు విరాళముగా నొసంగియున్నారు. స్వామిధనమును సత్కార్యములకు సదుద్దేశములో వినియోగించుచున్న దేవాలయ ధర్మకర్తృ సంఘ సభ్యులకు, ముఖ్యముగా కార్యనిర్వహణాధికారి శ్రీ పి. వి. ఆర్. కె. ప్రసాద్, I. A. S. గారికి కృతజ్ఞతాపూర్వక నమస్సులు.

మరియు నీ విషయమున తగువిధముగా తోడ్పడిన 'సప్తగిరి' సంపాదకులు శ్రీ కె. సుబ్బారావు M. A., గారికి నమస్సులు.

సౌజన్య సంభావనము

పరబ్రహ్మస్వరూపులైన గురువర్యులు శ్రీ శ్రీ బ్రహ్మశ్రీ పేరి వేంకటేశ్వర శాస్త్రిగారికి, బ్రహ్మశ్రీ రామచంద్రుల కోటేశ్వరశర్మగారికి, డా॥ దివాకర్ల వేంకటావధానిగారికి, కీ॥ శే॥ డా॥ పాటిబండ మాధవశర్మగారికిని—

అధ్యయన కాలమున అయిదేండ్లు వాత్సల్యరసమును కురిపించిన కీ॥ శే॥ బ్రహ్మశ్రీ గరికపాటి పట్టాభిరామశాస్త్రిగారికిని, రామమూర్తిగారికిని, స్వర్లోకవాసిని సుబ్బమ్మగారికిని, గురుపత్ని శ్రీమతి వరలక్ష్మమ్మగారికిని—

నిరంతరము ప్రేమాదరముల ననుగ్రహించు శ్రీశ్రీశ్రీ లక్ష్మణయతీంద్ర గురువర్యులకును—

గ్రంథముద్రణమునకు యథాశక్తి ఆర్థికసాహాయ్యము నందించిన కుమారి సంధ్యా వందనం గోదావరీబాయి M. A., బ్రహ్మశ్రీ గణపవరపు వేంకటసాంబమూర్తి శాస్త్రి, పూజ్యశ్రీ జాటూరు రమణయ్య, పూజ్యశ్రీ శతావధాని పి. వి. సుబ్బన్న, చిరంజీవి పి సత్యనారాయణ. M. A., గార్లకును—

గ్రంథముద్రణమున కవసరమగు ధనమును రు 10,000 లను ఋణరూపమున అందించిన ఆంధ్రబ్యాంకువారికి, ముఖ్యముగా పి జి సెంటరుబ్రాంచి మేనేజరు శ్రీ సులేమాన్ బాషా M. Com., గారికిని, వారి ఉద్యోగిబృందమునకు—

ఈ సర్వకార్యమును స్వకార్యముగా నిర్వహించిన మా అక్కాబావలు లక్ష్మీ సౌభాగ్యవతి ఆంజనేయశాస్త్రి దంపతులకు

అతిస్వల్పకాలములో గ్రంథమును సుందరముగా నిర్దుష్టముగా ముద్రించి యిచ్చిన వెరైటీ ప్రెస్ అధిపతి శ్రీ దుగ్గిరాలసూర్యప్రకాశరావుగారికి, ప్రెస్ కార్మికులు, శ్రీ గొరిపర్తి వీరాస్వామి, శ్రీ పప్పు కృష్ణ, శ్రీ గెద్దం వీరభద్రరావు శ్రీ వడాల నాగేశ్వరరావు గార్లకును—
కృతజ్ఞతాపూర్వక నమఃకుసుమాంజలి.

ఈ పనిలో నా కెంతయో సహకరించిన తమ్ముడు చి॥ నాగేంద్రశర్మకును, మేనల్లుడు చి॥ వేంకటనాగేంద్రకుమారునకును, చి॥ వెలిచేటి రాజేశ్వరరావు, దుగ్గిరాల సూర్యప్రకాశరావుగారికుమారులు చి॥ వేంకటరామలక్ష్మీనారాయణరావు, చి॥ వేంకటేశ్వరరావులకు—శుభాశీస్సులు.

సారస్వత వ్యాసంగమున మునిగితేలు నాకు సంపూర్ణ సహకారమిచ్చి సంసార నిర్వహణభారమును సమర్థముగా వహించు నాయిల్లాలు చి॥ సౌ॥ రాజేశ్వరి సహన సౌజన్యములను గూర్చియు ఈ సందర్భమున ఏదో చెప్పవలయుననియే యున్నది.

రౌద్రిమాఘశుద్ధత్రయోదశి
18-2-1981 — శ. ర. శ.
తెనాలి.



అంకితము

అస్మద్గురు వర్యులు

కళాప్రపూర్ణ, వ్యాకరణస్థాపకేత్యాది బిరుదవిరాజితులు

కీర్తిశేషులు బ్రహ్మశ్రీ పేరి వేంకటేశ్వరశాస్త్రి

శ్రీచరణులకు



విషయసూచిక

ఇది మార్గదర్శినిలో రెండవభాగము. వ్యాఖ్యానములో ప్రథమ భాగమున అవలంబించిన పద్ధతులే యిందును అవలంబింపబడినవి. తద్ధిత ప్రత్యయములు స్త్రీప్రత్యయప్రకరణమును ఈ భాగమున వ్యాఖ్యాతములైనవి.

శ. ర. శ.

అథ తద్ధితాధికార ప్రకరణము.

అప : ఐదు విధములుగా ప్రవృత్తులు కలవనియు అందు తద్ధితవృత్తి యొకటియనియు సమాసపరిచ్ఛేదమునఁ జెప్పఁబడినది ఙీ, ఆప్ అను స్వరూపము గల స్త్రీ ప్రత్యయాంతములకును, ప్రాతిపదికసంజ్ఞకలవానికిని అర్థవిశేషములలో చేరు ప్రత్యయములను తద్ధితములందురు అష్టాధ్యాయియందు 4-1-76 మొదలుకొని ఐదవ అధ్యాయము తుదివఱకు గల సూత్రములచే ఈ ప్రత్యయములు విధింపఁబడినవి. ఈ తద్ధితవిధానము సంస్కృతభాషలో అతివిస్తారమైనది దీనిని దిఙ్మాత్రదర్శనముగ ఈ గ్రంథభాగమున తెలిసికొందము

ఈ తద్ధితప్రక్రియకు సాధారణమైన ఒకసూత్రము సమాసపరిచ్ఛేదమునఁ జెప్పఁబడినది 'తద్ధితేష్వచామాదేః' - ఞ కారముగాని ణ కారముగాని ఇత్తయిన తద్ధిత ప్రత్యయము పరమగునపుడు పూర్వముననున్న శబ్దస్వరూపముయొక్క అచ్చులలో మొదటిదానికి వృద్ధివచ్చును ఈ సూత్రము విశేషమైన యెల్లతావులందును అనుసంధించుకొనవలయును

ఇందు కొన్ని ప్రత్యయములు కేవల మొక్కొక్క అర్థమునందో లేక రెండు మూడర్థములందో విధింపఁబడును వానికి ప్రత్యేకముగా అపత్యాధికారము, చాతురర్థికము మున్నగువిశేషనామములతో ప్రకరణ విభాగము చేయఁబడినది దానికి ముందు సాధారణప్రత్యయములు కొన్ని చెప్పఁబడుచున్నవి

సాధారణ ప్రత్యయ ప్రకరణమ్

సూ : సమర్థానాం ప్రథమాద్వా 4-1-82

వృ : ఇద మధిక్రియతే ప్రాగ్దిశ ఇతి యావత్.

ప వి : సమర్థానామ్ (6-3) ప్రథమాత్ (5-1) వా (అవ్య)

అ : ఇది ప్రాగ్దిశోవిభక్తిః అనుసూత్రమువఱకు అధికారము

వి : సమర్థానామ్, ప్రథమాత్, వా అను మూడుపదములుగల ఈ సూత్రము అధికారరూపమున ప్రాగ్దిశోవిభక్తిః (5-3-1) అను అవధివఱకు గల సూత్రములలో ప్రవేశించి తెలుపబడును. ఇందు 'సమర్థానామ్' అను పదము

నిర్ధారణషష్ఠ్యంతము. జాతిబట్టిగాని, గుణమునుబట్టిగాని, క్రియబట్టిగాని, సంజ్ఞను బట్టిగాని సముదాయములోనుండి ఒకభాగమును వేరుచేయుటకు నిర్ధారణమనిపేరు. కావున సమర్థానామ్ అనగా సమర్థములలోపల అని అర్థము. ఇచట సమర్థమనగా పరినిష్ఠితము. అనగా సంధికార్యాదులన్నియు పూర్తియయి అర్థమును ఒసగగలశక్తి కలిగి యున్నది అని తాత్పర్యము 'ప్రథమాత్' అనగా మొదటిదానికి పరముగా నని అర్థము. మొదటి దనగా ముందు చెప్పబడుసూత్రములలో మొదటిపదము. దానిచేత వాచ్యములగు పదములని తాత్పర్యము. ఇది యధికారసూత్రము కావున ముందు చెప్పబడుసూత్రములలో విధింపబడు ప్రత్యయములు సమర్థములగు పదములలో మొదటిదానికి పరముగా వైకల్పికముగా వచ్చునను సర్వమును సమకూర్చుము ... యర్థము నొక ఉదాహరణములో పరిశీలింతము తస్యాపత్యమ్ - అతనియొక్క సంతానము ఇందు అర్థసమర్పణశక్తి గల రెండుపదములలో మొదటిది 'తస్య' అనునది దానిచేత వాచ్యమగు దశరథస్య' మున్నగువానికి, విధింపబడిన 'ఇఞ్' మున్నగు ప్రత్యయములు వచ్చునని సూత్రతాత్పర్యము

సూ. ప్రాగ్దీవ్యతోఽణ్ 4-1-83

వృ : తేన దీవ్యతీత్యతః ప్రాగణధిక్రియతే

ప వి ప్రాక్ (1-1) దీవ్యతః (5-1) అణ్ (1-1)

అర్థ : తేన దీవ్యతీత్యాదిసూత్రమునకు పూర్వమువఱకు 'అణ్' అనునది అధికరింపగును

వివ : 4-4-2 వ సంఖ్య గల సూత్రము 'తేనదీవ్యతి ఖనతి జయతి జితమ్' అనునది ఇందలి 'దీవ్యతి' అనుపద మీ సూత్రమున దీవ్యతః అను పదముచే ననుకరింపబడినది దీవ్యతః అనగా 'దీవ్యతి శబ్దముగల సూత్రమువఱకు' అని భావము అంతవఱకు 'అణ్' అను పదము అధికరింపగును అనగా 4-1-84 నుండి 4-4-2 వఱకుగల సూత్రములలో 'అణ్' అను పదమును కలుపుకొనవలయు నని తాత్పర్యము

అవ . ఇట్లు ప్రకరణమున కవసరములగు రెండధికారసూత్రములు చెప్పిన తర్వాత ప్రత్యయమును విధించుసూత్రము చెప్పబడుచున్నది.

సూ. అశ్వపత్యాదిభ్యశ్చ 4-1-84.

వృ : ఏభ్యోఽణ్ స్యాత్ ప్రాగ్దీవ్యతీయేష్వర్థేషు.

సూ : 'అశ్వపత్యాదిభ్యశ్చ' (5-3) చ (అవ్య)

అను : సమర్థానామ్ (6-3) ప్రథమాత్ (5-1) వా (అవ్య) అణ్ (1-1) తద్ధితః (1-1)

అర్థ : అశ్వపత్యాదులకు ప్రాగ్దీవ్యతీయార్థములందు అణ్ ప్రత్యయమగును'

వివ : తద్ధితప్రత్యయములన్నియు నానా యర్థములను వ్యక్తము చేయుచు శబ్దములకు చేర్చబడుచుండును సూత్రములందా యర్థములు నిర్దేశింపబడినవి ఉదా : తస్యాపత్యమ్ - అతనిసంతానము, తేన రక్తం రాగాత్ - దానిచేత నెఱ్ఱపడినది తత్రోద్ధృతమ్ - దానిమీది పైకి తీయబడినది ఇట్లు. ప్రాగ్దీవ్యతీయార్థములనగా 'తేనదీవ్యతి ఖనతి జయతి జితమ్' అను సూత్రమునకు పూర్వమునందు గల అర్థము లందు' అని యర్థము ఆ అర్థములందు అశ్వపతి మున్నగుశబ్దములకు 'అణ్' ప్రత్యయము వచ్చును అనగా అశ్వపతి మున్నగువానికి అణ్ ప్రత్యయము చేర్పగా నేర్పడిన పదము అశ్వపతియొక్క కుమారుడు' మున్నగు అర్థములు కలది యగు నని తాత్పర్యము

ఉదా : అశ్వపతే రపత్యాది - అశ్వపతియొక్క సంతానము మున్నగునది ఈ వాక్యమునందు అశ్వపతేః అపత్యాది అను రెండును సమర్థములైన పదములు వానిలో మొదటిది అశ్వపతేః అనునది దానికి పరముగా ఈ 'అణ్' ప్రత్యయమగునని 'సమర్థానాం ప్రథమాద్వా' అను అధికారసూత్రముచే అర్థమగు చున్నది 'అశ్వపతేః + అణ్' అణ్ అనునది తద్ధితప్రత్యయము' కృత్తద్ధిత సమాసాశ్చ' అను సూత్రముచే తద్ధితాంతమునకు ప్రాతిపదికసంజ్ఞ కలుగును 'అశ్వపతి + ఙస్, అణ్' ఇది ప్రాతిపదికము 'సుపో ధాతుప్రాతిపదికయోః' అను సూత్రముచే ప్రాతిపదికసంజ్ఞ గల దీనియొక్క అవయవమగు సుప్పునకు (ఙస్ అనుదానికి) లుక్కు వచ్చును అశ్వపతి+అణ్'.

ఇట్టిస్థితిలో 'తద్ధితేష్వచామాదేః' అను సూత్రముచే ఆదివృద్ధి వచ్చును ఞిత్తుగాని ణిత్తుగాని యగు తద్ధితప్రత్యయము పరమగునపుడు పూర్వమున నున్న దాని అచ్చులలో మొదటి అచ్చునకు వృద్ధివచ్చును అణ్ ప్రత్యయము ణిత్తగు తద్ధితము. ఇది పరమైనపుడు అశ్వపతి' అను దాని మొదటి అకారమునకు వృద్ధి ఆకారము ఆదేశమగును 'ఆశ్వపతి + అ' - 'యస్యేతిచ' (భ సంజ్ఞకము యొక్క ఇ వర్ణావర్ణములకు, తద్ధితప్రత్యయముగాని ఈకారముగాని పరమగునపుడు లోపమువచ్చును.) అను సూత్రముచే ఇ కారము లోపింపగా ఆశ్వపత్ + అ =

అశ్వపత + సు = ఆశ్వపతమ్ అగును. (అశ్వపతికి సంబంధించినది. అశ్వపతి కుమారుడు, అశ్వపతి కూతురు ఇత్యాదిగా దీనికర్థములు ఆ అర్థానుగుణముగా ఆశ్వపతమ్, ఆశ్వపతః, ఆశ్వపతీ అని మూడులింగములలో రూపములుండవచ్చును) (తద్ధితేష్వచామాదేః, యస్యేతిచ అను సూత్రము స్త్రీప్రకరణమున పలుతావులందు అవసరములగును కావున వాని యర్థమును జాగ్రత్తగా అనుసంధించుకొనదగును)

ఇట్లే గణపతేః అపత్యాది - గణపతియొక్క సంతానము మొదలైనది గణపతి + అణ్, ఆదివృద్ధి, గాణపతి + అ, యస్యేతిచ, ఇకారలోపము గాణపత + సు = గాణపతమ్.

అశ్వపత్యాది గణము : అశ్వపతి (జ్ఞానపతి) శతపతి ధనపతి గణపతి [స్థానపతి యజ్ఞపతి] రాష్ట్రపతి కులపతి గృహపతి (పశుపతి) ధాన్యపతి ధన్వపతి (బంధుపతి ధర్మపతి) సభాపతి ప్రాణపతి క్షేత్రపతి - ఇత్యశ్వపత్యాదిః

ఇక 'అణ్' అనునది సామాన్యప్రత్యయము ఇటుపై కొన్నివిశేష ప్రత్యయములు చెప్పబడుచున్నవి.

సూ. దిత్యదిత్యాదిత్యపత్యుత్తరపదాణ్ణ్యః 4-1-85

వృ. ప్రాగ్దీవ్యతీయేష్వర్థేషు. దితేరపత్యం దైత్యః, అదితే రాదిత్యస్య వా ఆదిత్యః. ప్రాజాపత్యః.

ప. వి. దిత్యదిత్యాదిత్యపత్యుత్తరపదాత్ (5-1) ణ్యః (1-1)

అను. సమర్థానామ్ (6-3) ప్రథమాత్ (5-1) వా (అవ్య)

అర్థ: దితి, అదితి, ఆదిత్య, అను వానికిని, పత్యుత్తరపదములకును అప త్యాద్యర్థమున 'ణ్య' ప్రత్యయము వచ్చును. ఉదా. దితేః అపత్యమ్ - దైత్యః, అదితేః, ఆదిత్యస్య వా అపత్యం ఆదిత్యః, ప్రాజాపత్యః.

వివ : అర్థములలో మొదటినియును, దితి, అదితి, ఆదిత్య అనుపదముల కును, పతిశబ్దము ఉత్తరపదముగా గలవానికిని వారిసంతానము మున్నగు నర్థము లలో 'ణ్య' అను ప్రత్యయము వచ్చును ఇందు ణకారమిత్తు (చుటూ) ణిత్తు కావున ఆదివృద్ధి వచ్చును

ఉదా. దితేః అపత్యమ్ - దితియొక్క కుమారుడు - దితి + ఙస్, ణ్య ప్రాతిపదికసంజ్ఞ, విభక్తిలోపము దితి + య, ఆదివృద్ధి (ఇకారమునకు ఐ) దైతి + య, యస్యేతిచ, ఇకారలోపము, దైత్ + య = దైత్య + సు = దైత్యః (యకారాది ప్రత్యయము పరమగుచున్నను పూర్వము భసంజ్ఞకమగును - యచిభమ్).

అదితేః అపత్యమ్, అదితి పుత్త్రుఁడు, అదితి + ఙస్, ణ్య, అదితి+య ఆదితి + య, ఆదిత్+య=ఆదిత్య + సు = ఆదిత్యః.

ఆదిత్యస్య అపత్యమ్ - ఆదిత్యుని కుమారుఁడు, ఆదిత్య + ఙస్, ణ్య ఆదిత్య + య, యస్యేతిచ, అకారలోపము, 'ఆదిత్య్ + య, అనియుండ 'హలో యమాం యమి లోపః' 8-4-64, హల్లులకు పరముగానున్న యమ్ వర్ణము లకు, యమ్ వర్ణములు పరములగునపుడు, లోపము వైకల్పికముగా నగును అను సూత్రముచే మొదటి యకారమునకు లోపమురాఁగా 'ఆదిత్య' అగును ఆదిత్య+సు ఆదిత్యః యకారలోపము రానిచో రెండు యకారము లున్న రూపముండును. ఆదివృద్ధిచే ఆకారమునకు ఆకారమే వచ్చును

ప్రత్యుత్తరపదమున కుదాహరణము. ప్రజాపతేః అపత్యం పుమాన్ - ప్రజాపతియొక్క సంతానమైన పురుషుఁడు. ప్రజాపతి + ఙస్, ణ్య ప్రాతిపది కత్వము, విభక్తిలోపము, ఆదివృద్ధి, ఇకారలోపము, ప్రాజాపత్య+సు=ప్రాజాపత్యః

వా. దేవాద్య ఞ ఞౌ. (2655).

వృ. దైవ్యమ్ - దైవమ్.

ప వి దేవాత్ (5-1) యఞ్ ఞౌ (1-2).

అర్థ దేవశబ్దమునకు అపత్యాద్యర్థమున యఞ్, అఞ్ అను ప్రత్యయ ములు వచ్చును ఉదా : దైవ్యమ్ - దైవమ్.

వివ దేవశబ్దమునకు సంతానము, అతనికి సంబంధించినది మున్నగు ప్రాగ్దీవ్యతీయార్థములలో యఞ్, అఞ్ అను ప్రత్యయములు పర్యాయముగా నగును ఇందు ఞ కారమిత్తు దానివలన ఆద్యక్షరమునకు వృద్ధివచ్చును (తద్ధితేష్వచామాదేః)

ఉదా : దేవస్య అపత్యమ్ - దేవ + ఙస్, యఞ్, ప్రాతిపదికసంజ్ఞ, విభక్తి లోపము, దేవ + య(ఞ్), దైవ + యస్యేతిచ, అకారలోపము దైవ్ + య = దైవ్య + సు = దైవ్యమ్ 'అఞ్' ప్రత్యయము వచ్చినచో దేవ + అఞ్, దైవ + అ, దైవ + సు=దైవమ్.

వా. బహిషష్టిలోపో యఞ్ చ. (2656).

వృ : బాహ్యః.

ప. వి : బహిషః (6-1) టిలోపః (1-1) యఞ్ (1-1) చ (అవ్య)

అర్థ : 'బహిస్' అను అవ్యయమునకు టి లోపము యఞ్ ప్రత్యయము నగును ఉదా: బాహ్యః

వివ : 'బహిస్' అను అవ్యయమునకు ప్రాగ్దీవ్యతీయార్థములలో యఞ్ ప్రత్యయమగును. అది వచ్చునపుడు టి భాగమునకు లోపము అగును. ప్రత్యయము ఞిత్ అగుటచే ఆదివృద్ధి వచ్చును

ఉదా : బహిః భవః - వెలుపల నున్నవాఁడు, బహిస్ + యఞ్, ఆదివృద్ధి బాహిస్ + య(ఞ్) టి భాగమగు 'ఇస్' అనుదానికి లోపము బాహ్ + య = బాహ్య + సు = బాహ్యః

వా : ఈకక్ చ (2567).

ప. వి : ఈకక్ (1-1) చ (అవ్య)

అర్థ : 'బహిస్' అనుదానికి 'ఈకక్' అను ప్రత్యయము కూడనగును

వివ : ప్రాగ్దీవ్యతీయార్థములలో 'బహిస్' అను అవ్యయమునకు యఞ్ ప్రత్యయమే కాక 'ఈకక్' అను ప్రత్యయముకూడ వచ్చును ఇందు తుది కకారము ఇత్తు (హలన్త్యమ్) అది ఇత్తు అగుటచే వచ్చు కార్యవిశేషము క్రిందిసూత్రముచే తెలుపఁబడుచున్నది.

సూ : కితి చ 7-2-118

వృ : అచామాదేరచో వృద్ధిః స్యాత్ కితి. బాహీకః

ప. వి : కితి (7-1) చ (అవ్య)

అను . తద్ధితేషు (7-3) అచామ్ (6-3) ఆదేః (6-1) వృద్ధిః (1-1).

అర్థ : కిత్తయిన తద్ధితము పరమగునపుడును అచ్చులలో మొదటిదానికి వృద్ధి ఆదేశమగును. ఉదా : బాహీకః

వివ : ఇది 'తద్ధితేష్వచామాదేః' అను సూత్రమునకు తరువాతి సూత్రము. కకారము ఇత్తుగాఁగల తద్ధితప్రత్యయము పరమగునపుడును పూర్వమునమున్న శబ్ద స్వరూపముయొక్క అచ్చులలో మొదటిదానికి వృద్ధి వచ్చును తద్ధితప్రత్యయమున ఞ కారము, ణ కారము, క కారమును ఇత్తులుగానున్నచో, అవి పరమగునపుడు ఆదివృద్ధివచ్చునని తాత్పర్యము.

ఉదా : బహిస్ + ఈకక్. 'ఈకక్ చ' అను దానియందలి చ కారమువలన పూర్వవార్తికమున చెప్పఁబడిన టి లోపము ఈకక్ ప్రత్యయము వచ్చు నప్పుడును వచ్చును ఆదివృద్ధి, టి లోపము, బాహ్ + ఈక=బాహీక+సు=బాహీకః- వెలుపలనున్నవాఁడు.

వా. సర్వత్ర గోరజాది ప్రసఙ్గే యత్. (వా)

వృ : గోరపత్యాది గవ్యమ్.

ప వి : సర్వత్ర (అవ్య) గోః (6-1) అజాదిప్రసఙ్గే (7-1) యత్(1-1)

అర్థ : గోశబ్దమునకు అజాదిప్రసంగమున ప్రాగ్దీవ్యతీయార్థము లన్నింటి యందును యత్ప్రత్యయము వచ్చును. ఉదా : గోః అపత్యాది, గవ్యమ్.

వివ : అజాది ప్రసంగమనగా అచ్చు ఆదియందున్న ప్రత్యయములగు అణ్ మున్నగునవి రాదగు సందర్భములందలి యర్థము. పూర్వవార్తికమగు 'లోమ్నోఽపత్యేషు బహుష్వకారః' అను దానియందు అపత్యార్థముమాత్రమే గ్రహింపఁబడుటచే అదికాక తక్కినయర్థములందును ఈ ప్రత్యయము వచ్చుటకై 'సర్వత్ర' అను పదము గ్రహింపఁబడినది. ఇట్లు గోశబ్దమునకు ప్రాగ్దీవ్యతీయార్థము లన్నింటియందును, అచ్చు ఆది యందుఁగల ప్రత్యయము రావలసియున్న సందర్భమునందు 'యత్' అను తద్ధితప్రత్యయము వచ్చునని సూత్రార్థ మేర్పడినది

ఉదా : గోః అపత్యాది - గోవుయొక్క సంతానము, లేక వికారము (అనగా దానివలన నేర్పడిన క్షీరము మున్నగునది) గో + ఙస్ + యత్. తద్ధితాంతము ప్రాతిపదికసంజ్ఞ కలిగి 'ఙస్' ప్రత్యయమునకు లోపము 'గో + య' వాన్తో యి ప్రత్యయే' అను సూత్రముచే అవాదేశము గ్ + అవ్ + య = గవ్య + సు = గవ్యమ్.

సూ. ఉత్సాదిభ్యోఽఞ్ 4-1-86.

వృ : ఔత్సః.

ప. వి : ఉత్సాదిభ్యః (5-3) అఞ్ (1-1).

అను : తద్ధితాః (1-3) ప్రత్యయః (1-1) సమర్థానామ్ (6-3) ప్రథమాత్ (1-1) వా (అవ్య).

అర్థ : ప్రాగ్దీవ్యతీయార్థములందు 'ఉత్స' మున్నగు శబ్దములకు 'అఞ్' అను తద్ధిత ప్రత్యయము చేయును. ఉదా : ఔత్సః.

వివ : ఉత్స మున్నగు శబ్దములకు 'అతని సంతానము' మున్నగు అర్థము లందు 'అఞ్' అను తద్ధితప్రత్యయము చేయును. ఇందు ఞ కారము ఇత్తు అది తొలగగా నప్పుడు ఆదివృద్ధి వచ్చును

ఉదా : ఉత్సస్య అపత్యం పుమాన్, ఉత్సుని కుమారుడు ఉత్స + ఙస్ + అఞ్, ప్రాతిపదికసంజ్ఞ, విభక్తిలోపము, ఆదివృద్ధి, అకారలోపము ఔత్స + సు = ఔత్సః,

ఉత్సాదిగణము : ఉత్స ఉదపాన వికర వినద మహానద మహానస తరుణ తలున బష్కయాసే పృథివీ (ధేను) పఙ్క్తి జగతీ త్రిష్టుప్ అనుష్టుప్ జనపద భరత ఉశీనర గ్రీష్మ పీలుకుణ 'ఉదస్థానదేశే 57' పృషదంశ భల్లకీయ రథన్తర మాధ్యందిన బృహత్ మహత్ సత్వత్ కురు పఞ్చాల ఇంద్రావసాన ఉష్ణిహ్ కకుభ్ సువర్ణ దేవ 'గ్రీష్మాదచ్ఛన్దసి 58' ఇత్యుత్సాదిః.

వృ : ఇత్యపత్యాది వికారాన్తార్థ సాధారణప్రత్యయాః. ఇట్లు అపత్యార్థము మొదలుకొని వికారార్థము అంతముగాఁ గల సాధారణ ప్రత్యయములు చెప్పఁబడినవి

ఇతి సాధారణ ప్రత్యయ ప్రకరణము

ప్రకరణావలోకనము : ఇందు అపత్యాధికారము మొదలుకొని వికారాధికారము వఱకుఁ గల సాధారణప్రత్యయములు విధింపఁబడినవి. ఈ ప్రకరణమున అణ్, ఞ్య, యఞ్, అఞ్, ఠక్, యత్ అను ప్రత్యయములు ఆ యా శబ్దములకు విధింపఁబడినవి. తద్ధితేష్వచామాదేః, కితిచ అను సూత్రములు ఇందు ఆదివృద్ధిని విధించునవి. 'సమర్థానాం ప్రథమాద్వా', 'ప్రాగ్దీవ్యతోఽణ్' అనునవి అధికార సూత్రములు

అథ అపత్యాధికార ప్రకరణమ్

అప : అపత్యమనగా సంతానము. ఈ ప్రకరణమున ఆ యా శబ్దములకు అతని 'సంతానము' అను అర్థమున వచ్చు తద్ధితప్రత్యయములు విధింపఁబడుచున్నవి. కావున దీనికి అపత్యాధికార ప్రకరణ మనిపేరు

సూ. స్త్రీపుంసాభ్యాం నఞ్స్నఞౌ భవనాత్ 4.1.87.

వృ : ధాన్యానాం భవన ఇత్యతః ప్రాగర్థేష్వాభ్యా మేతౌ స్తః. స్త్రైణః, పౌంస్నః.

వ వి : స్త్రీ పుంసాభ్యామ్ (5-2) నఞ్ స్నఞౌ (1-2) భవనాత్ (5-1).

అను : తద్ధితాః (1-3) ప్రత్యయః (1-1) సమర్థానామ్ (6-1) ప్రథమాత్ (5-1) వా (అవ్య) ప్రాక్ (1-1)

అర్థ : ధాన్యానాం భవనే క్షేత్రే ఖఞ్ అను సూత్రమునకు పూర్వమువరకుంగల అర్థములలో స్త్రీ, పుంస్ అను శబ్దములకు క్రమముగా నఞ్, స్నఞ్ అను ప్రత్యయములు వచ్చును ఉదా : స్త్రైణః, పౌంస్నః

వివ : సూత్రమునందలి 'భవనాత్' అను పదము 'భవన' అను పదము గల సూత్రము అను ఉపదేశము తెలుపును అది ధాన్యానాం భవనే క్షేత్రే ఖఞ్' (5-2-1) అనునది ఈ సూత్రము మొదలుకొని ఆ సూత్రముహద్దుగా గల సూత్రములయందుఁ జెప్పఁబడిన అపత్యము, భవము, సమూహము మున్నగు అర్థములలో స్త్రీ శబ్దమునకు 'నఞ్' అను ప్రత్యయమును, 'పుంస్' శబ్దమునకు 'స్నఞ్' అను ప్రత్యయమును చేరును, ఈ రెంటియందును ఞకారమిత్తు గావున స్త్రీ పుంస్ శబ్దముల అచ్చునకు వృద్ధివచ్చును (తద్ధితేష్వచామాదేః)

ఉదా : స్త్రియాః అపత్యమ్ = స్త్రీ యొక్క సంతానము, స్త్రీణామ్ సమూహః స్త్రీలసముదాయము స్త్రీ + ఙస్ ఆమ్, నఞ్, ప్రాతిపదికసంజ్ఞ విభక్తిలోపము, ఆదివృద్ధి స్త్రై + న, 'అట్కుప్వాఙ్నుమ్ వ్యవాయేఽపి' అనుసూత్రముచే రేఫ యోగమువలన నకారమునకు ణత్వము స్త్రైణ + సు = స్త్రైణః

పుంసః అపత్యమ్, పుంసామ్ సమూహః పుంస్ + ఙస్ ఆమ్ స్నఞ్ పుంస్ + స్న, ఆదివృద్ధి పౌంస్ + స్న ఇచట పౌంస్' అనుదానికి 'స్వాది ష్వసర్వనామస్థానే' అను సూత్రముచే పదసంజ్ఞ కలుగును (క ప్రత్యయము అవధి గాఁగల స్వాది ప్రత్యయములు - సర్వనామస్థానభిన్నములు - పరములగునపుడు పూర్వమునకు పదసంజ్ఞ కలుగును) కావున 'సంయోగాన్తస్య లోపః' అనుసూత్రముచే సకారమునకు లోపము పౌంస్న + సు = పౌంస్నః ఇందు లోపింపఁబడు సకారము ప్రత్యయములోనిదిగా తెలియవలెను స్త్రీషు భవః - స్త్రీలయందున్నవాఁడు, పుంసు భవః = పురుషులయందున్నవాఁడు అను అర్థములయందును ఈ రూపములే యేర్పడును

ఇక అపత్యాధికారసూత్రము చెప్పఁబడుచున్నది.

సూ : తస్యాపత్యమ్ 4-1-92

వృ : షష్ఠ్యన్తాత్ కృతసన్ధేః సమర్థాత్ అపత్యేఽర్థే ఉక్తా వక్ష్యమాణాశ్చ ప్రత్యయా వా స్యుః.

ప వి : తస్య (6-1) అపత్యమ్ (1-1)

అను : సమర్థానామ్ (6-3) ప్రథమాత్ (5-1) వా (అవ్య)

అర్థ : షష్ఠ్యంతమును, కృతసంధియు సమర్థము నగు పదమునకు అపత్యమను నర్థమున ఉక్తములును వక్ష్యమాణములు నగు ప్రత్యయములు వైకల్పికముగా నగును

వివ : 'తస్య' అనునది షష్ఠ్యంతపదమునకు చిహ్నము 'సమర్థానాం ప్రథమాద్వా' అను అధికార సూత్రము చొప్పున సంధ్యాదికార్యము లన్నియు చేయఁబడిన సమర్థమగు షష్ఠ్యంతపదమునకు పరముగా' అనునర్థము కలుగును ఆ షష్ఠ్యంతపదముచే వాచ్యుఁడగు వ్యక్తియొక్క సంతానము అనునర్థమును దెలుపుచు అట్టిపదమునకు ఇంతకుపూర్వము చెప్పఁబడిన అణ్, ఞ్య, అఞ్ మున్నగు ప్రత్యయములును, ఇఁకముందు చెప్పఁబడు ఫక్, ఇఞ్, అఞ్ మున్నగు ప్రత్యయములును చేరును ఇంతకుముందుఁ జెప్పఁబడిన ప్రత్యయములన్నియు ప్రాగ్దీవ్యతీయార్థమునసగును అందపత్యార్థమును గలదు కావున ఆ ప్రత్యయములు కూడ అపత్యార్థమున వచ్చుననునర్థము లభించును 'వా' అను పదము అనువృత్తమగుటవలన ప్రత్యయము రాకుండుటయుఁ గలదు

ఉదా : ఉపగోరపత్యం పుమాన్ - ఉపగువు అనువాని సంతానమైన పురుషుఁడు ఇందు సమర్థమైన షష్ఠ్యంతపదము 'ఉపగోః' అనునది దానికి పరముగా అతనిపుత్త్రుఁడు అనునర్థమును అణ్' ప్రత్యయము (ప్రాగ్దీవ్యతోఽణ్ అను సూత్రమునుఁడి అధికారరూపమున వచ్చినది) చేరును అనగా అణ్' ప్రత్యయాంతమైన ఉపగుశబ్దమునకు ఉపగువుయొక్క సంతానమైన పురుషుఁడు అనియర్థము 'ఉపగు + ఙస్, అణ్, తద్ధితాంతమగుటచే ప్రాతిపదికమగును కావున విభక్తికి లోపము వచ్చును ప్రత్యయము ణిత్తు కావున ఆదివృద్ధి, 'ఔపగు + అ' అనియుండ క్రింది సూత్రమొక కార్యమును విధించుచున్నది

సూ : ఓర్గుణః 6-4-146

వృ : ఉవర్ణాన్తస్య భస్య గుణః స్యాత్తద్ధితే. ఉపగోరపత్య మౌపగవః.

ప వి : ఓః (6-1) గుణః (1-1)

అను : భస్య (6-1) తద్ధితే (7-1)

అర్థ : ఉవర్ణాంతమైన భసంజ్ఞకమునకు, తద్ధితము పరమగునపుడు, గుణము వచ్చును ఉదా ఉపగోరపత్యం పుమాన్ ఔపగవః.

వివ : 'ఓః' అనునది 'ఉ' అనుదానియొక్క షష్ఠ్యంతరూపము, అది 'భస్య' అను దానికి విశేషణము తదంతవిధిచే 'ఉవర్ణాంతమైన' అనునర్థము కలుగును. యకారాదిప్రత్యయము గాని అచ్చు అదియందుఁగల ప్రత్యయముగాని పరముగ నున్నపుడు పూర్వమునకు భసంజ్ఞ కలుగును - (యచిభమ్), ఉవర్ణముఅంతమునఁ గల భసంజ్ఞకమునకు, తద్ధితప్రత్యయము పరమగునపుడు గుణమాదేశమగును 'అలోఽన్త్యస్య' అనుపరిభాషచే తుదిఉవర్ణమునకు ఈ గుణము వచ్చును ఉకారము నకు అంతరతమమైన గుణము ఓకారము

ఉదా: ఔపగు + అ - ఇచట 'అ' అనునది అజాదిప్రత్యయముకావున 'ఔపగు' అనునది భసంజ్ఞకమగును దాని తుది ఉకారమునకు గుణము ఓకారము వచ్చును ఔపగో+అ, అవాదేశము (ఏచోఽయవాయావః) ఔపగవ + సు= ఔపగవః

అప : పూర్వోక్తములైన అణ్, ణ్య, అఞ్, నఞ్, స్నఞ్ ప్రత్యయము లకు అపత్యార్థమున నుదాహరణములు చూపఁబడుచున్నవి

వ్యు : ఆశ్వపతః, దైత్యః, ఔత్సః, స్త్రైణః, పౌంస్నః.

వివ : అశ్వపతేః అపత్యం, అశ్వపతేః' అను పదమునకు 'అశ్వపత్యాదిభ్యశ్చ' అనుసూత్రముచే అణ్ ప్రత్యయము-ఆశ్వపతః

దితేః అపత్యమ్, దితిశబ్దమునకు దిత్యదిత్యాదిత్యపత్యుత్తర పదాణ్ణ్యః' అను సూత్రముచే అపత్యార్థమున ణ్య' ప్రత్యయము - దైత్యః

ఉత్సస్యాపత్యమ్, ఉత్సశబ్దమునకు ఉత్సాదిభ్యోఽఞ్' అనుసూత్రముచే అపత్యార్థమున అఞ్' ప్రత్యయము - ఔత్సః.

స్త్రియాః అపత్యమ్, స్త్రీశబ్దమునకు 'స్త్రీపుంసాభ్యామ్' ఇత్యాదిసూత్రముచే అపత్యార్థమున నఞ్' ప్రత్యయము - స్త్రైణః

పుంసః అపత్యమ్, పుంస్‌శబ్దమునకు స్త్రీపుంసాభ్యామిత్యాది సూత్రముచే అపత్యార్థమున స్నఞ్ ప్రత్యయము - పౌంస్నః.

వీనిప్రక్రియ ఆయా సూత్రములందు చూపఁబడినది

అప : అపత్యమనగా సంతానము ఇది ఒక్క పుత్త్రునికే పరిమితముకాదు. పుత్త్రునిపుత్త్రుఁడు, అతనిపుత్త్రుఁడు మున్నగువారికిని వర్తించును అట్టి అపత్యము

వరు గోత్రము, యువమన్నగుసంజ్ఞలు గలిగి ముందువిధింపబడు ప్రత్యయములు కొన్ని గోత్రాపత్యార్థమునందును, మఱికొన్ని యువాపత్యార్థమునందును వేరును కావున గోత్రనిర్వచనము ఇచటచేయబడుచున్నది దీనితఱువాతిసూత్రమున గోత్ర శబ్ద ప్రయోగము గలదు దానికై యీ సూత్ర మిట నవసరమగుచున్నది

సూ . అపత్యం పౌత్రప్రభృతిగోత్రమ్ 4-1-162

వృ : అపత్యత్వేన వివక్షితం పౌత్రాది గోత్రసంజ్ఞంస్యాత్.

ప వి అపత్యమ్ (1-1) పౌత్రప్రభృతి (1-1) గోత్రమ్ (1-1)

అర్థ : అపత్యరూపమున వివక్షితమైనపౌత్రాదికము గోత్రసంజ్ఞకలది యగును

వివ : అపత్యమనగా సంతానము అని స్థూలమైన యర్థము సంతానమనగా పుత్త్రుఁడు, పుత్త్రిక అని తనకు అనంతరమైన తరమువారిని మాత్రమే చెప్పునా? లేక పౌత్రుఁడు, ప్రపౌత్రుఁడు మున్నగు మూఁడవ, నాల్గవతరములవారిని కూడ బోధించునా? అనగా నిఘంటువునుబట్టి ఇది రెండవతరము వారికే సంజ్ఞ అని తెలియును 'ఆత్మజస్తనయః సూనుః సుతః పుత్త్రః స్త్రియాంత్వమీ ఆహుర్దుహితరం సర్వేఽపత్యం తోకం తయోః సమే' అని నిఘంటువు ఆత్మజుఁడు, తనయుఁడు, సూనుఁడు, సుతుఁడు, పుత్త్రుఁడు ఇవిసమానార్థకములు స్త్రీ లింగమున వీనినుండి ఏర్పడు ఆత్మజ, తనయ మున్నగువానితో దుహిత అను శబ్దముకూడ నీయర్థమున వ్యవహరింపఁబడును అపత్యము, తోకము అనుశబ్దములు, పుత్త్రుఁడు, పుత్త్రిక అను రెండర్థములందును వ్యవహరింపఁబడును' అని పైదానికర్థము దీనినిబట్టి అపత్య శబ్దము పుత్త్రుఁడు, పుత్త్రిక అనునర్థమును మాత్రమే తెలుపును ఇట్టియెడ పౌత్రాదికమైన అపత్యముగోత్రమగుననుట యెట్లుపొసఁగును? అనగా పై నిఘంటువు అపత్యశబ్దముయొక్క స్థూలార్థమునే చెప్పినది 'న పతన్తి పితరో యేన తదపత్యమ్' - ఎవనివలన పితరులు నరకమున పడరో అట్టివాఁడు అపత్యము అను వ్యుత్పత్తినిబట్టి, పౌత్రాదులుకూడ పితామహాదులను నరకమునుండి ఉద్ధరించువారగా మహాభారతాదీతిహాసములయందు ప్రమాణీకరింపఁబడుటచేత పౌత్రాదులకును అపత్య సంజ్ఞ కలుగును ఇది భాష్యసమ్మతమైన విషయము

పై అంశమునుబట్టి అపత్యముగా వివక్షింపఁబడిన పౌత్రుఁడు మున్నగువారికి 'గోత్రము' అనుసంజ్ఞయుండును అనగా ఒక మూలపురుషునినుండి, మూఁడవ, నాల్గవ, ఐదవతరములవారును, ఇంకను తఱువాతివారును ఆ వ్యక్తియొక్క గోత్రము వారుగా వ్యవహరింపఁబడుదురని తాత్పర్యము

పౌత్రుఁడనగా పుత్రుని పుత్త్రుఁడు అపత్యముగా వివక్షింపఁబడినపుడే యాతనికి గోత్రసంజ్ఞ, పౌత్త్రుఁడగుచు నపత్యయున్నపుడు గోత్ర సంజ్ఞయుండదని తెలుపుటకై 'అపత్యత్వేనవివక్షితమ్' అని చెప్పఁబడినది.

అవ : గోత్రాపత్యార్థమున అపత్యాధికారవిహితప్రత్యయముల సంబంధించిన నియమ మొకటి యీ క్రిందిసూత్రముచే చెప్పఁబడుచున్నది.

సూ : ఏకో గోత్రే 4-1-93.

వృ : గోత్రే ఏక ఏవ ప్రత్యయః స్యాత్. ఉపగోర్గోత్రాపత్యమౌపగవః

ప వి : ఏకః (1-1) గోత్రే (7-1)

అర్థ : గోత్రాపత్యార్థమున ఒక్కప్రత్యయమే వచ్చును ఉదా. ఉపగోర్గోత్రాపత్యమౌపగవః

వివ : గోత్రమనగా అపత్యముగా వివక్షింపఁబడినపౌత్రుఁడు మున్నగు వాని పైసూత్రమున వివరింపఁబడినది అట్టి గోత్రాపత్యమును చెప్పునపుడు సమర్థమైన షష్ఠ్యంతమునకు ఒక్కప్రత్యయమే వచ్చును ఈ సూత్రము అపత్యాధికారములోనిదగుటచే 'అపత్యే' ప్రత్యయమనునర్థము సిద్ధించినది ఉపగుని కుమారుఁడు అనునర్థమున ఉపగుశబ్దమునకు అణ్ప్రత్యయముచేరి 'ఔపగవ' అయినది ఔపగవునికుమారుఁడు అనునర్థమున ఔపగవశబ్దమున కొకప్రత్యయమును, మఱలనాతనిపుత్త్రుఁడు అనునర్థమున మఱియొకప్రత్యయము - ఇట్లుబహు ప్రత్యయముల పరంపర చేరుచుండునా? అను శంకకు సమాధానముగా ఈసూత్రము చెప్పఁబడినది 'గోత్రాపత్యము' అనునర్థమున నొక్కప్రత్యయమే చేరును ఆ ప్రత్యయాంతరూపమే పౌత్త్రుని, ప్రపౌత్త్రుని, తదనంతరతరములవారి నందఱ నైనను బోధించునని తాత్పర్యము ఉదాహరణము ఉపగోర్గోత్రాపత్యమ్-ఉపగువు యొక్క-గోత్రాపత్యము ఔపగవః ఔపగవుఁడనఁగా ఉపగుని పుత్త్రుఁడు, పౌత్త్రుఁడు, ప్రపౌత్త్రుఁడు ఇత్యాదిగా సందర్భమునుబట్టి అర్థమును గ్రహింపవచ్చునని సూత్ర భావము ఈ సూత్రమువలన ఒకేశబ్దమునకు అనేకప్రత్యయముల పరంపర చేరు వలసిన ప్రమాదము తప్పినది

సూ : గర్గాదిభ్యో యఞ్ 4-1-105

వృ : గోత్రాపత్యే. గర్గస్యగోత్రాపత్యం గార్గ్యః, వాత్స్యః

ప. వి : గర్గాదిభ్యః (5-3) యఞ్ (1-1)

అను సమర్థానామ్ (6-3) ప్రథమాత్ (5-1) వా (అవ్య) తద్ధితః (1-1) ప్రత్యయః (1-1) తస్య (6-1) అపత్యమ్ (1-1) గోత్రే

అర్థ . గర్గ మొదలగు సమర్థషష్ఠ్యంతములకు గోత్రాపత్యార్థమున 'యఞ్' అను తద్ధితప్రత్యయము చేరును.

వివ గోత్రాపత్యమనగా అపత్యరూపమున విపక్షితమగు (చెప్పఁగోరఁబడిన) పౌత్రుఁడు మొదలగువారు అయర్థమున, గర్గమొదలగువారి షష్ఠ్యంత రూపములకు 'యఞ్' అను తద్ధితప్రత్యయము చేరును ఇందు ఞకారేత్తు కావున గర్గాదిశబ్దములయొక్క ఆదిఅచ్చునకు వృద్ధివచ్చును

ఉదా . గర్గస్య గోత్రాపత్యమ్-గర్గునియొక్క గోత్రమునందలి పురుషుఁడు మనుమఁడు, మునిమనుమఁడు మొ॥వాఁడు గర్గ + ఙస్, యఞ్, విభక్తిలోపము ఆదివృద్ధి, గార్గ + య, యస్యేతిచ, అకారలోపము, గార్గ + య = గార్గ్య + సు = గార్గ్యః

వత్సస్య గోత్రాపత్యం పుమాన్ - వత్సునియొక్క గోత్రాపత్యము వత్స + ఙస్, యఞ్, విభక్తిలోపాదికము వాత్స్య + సు = వాత్స్యః

గర్గాదిగణము : గర్గ వత్స 'వాజాసే' 67 సంకృతి అజ వ్యాఘ్రపాత్ విదభృత్ ప్రాచీనయోగ [అగస్తి] పులస్తి చమస రేభ అగ్నివేశ శఙ్ఖ శట శక ఏక ధూమ అవట మనస్ ధనఞ్జయ వృక్ష విశ్వావసు జనమాన లోహిత శంసిత బభ్రు వల్గు మణ్డు గణ్డు శఙ్కు లిగుగుహలు మన్తు మఙ్క్షు అలిగు జిగీషు మను తన్తు మనాయీ సూను కథక కన్థక ఋక్ష తృక్ష (వృక్ష) [తను] తరుక్ష తలుక్ష తణ్డ వతణ్డ కపికత కురుకత అనడుహ్ కణ్వ శకల గోకక్ష అగస్త్య కుణ్డినీ యజ్ఞవల్క పర్ణవల్క అభయజాత విరోహిత వృషగణ రహూగణ శణ్డిల వణక (చణక) చులుక ముద్గల ముసల జమదగ్ని పరాశర జతూకర్ణ (జాతూకర్ణ) మహిత మన్త్రిత అశ్మరథ శర్కరాక్ష పూతిమాష స్థూరా అదరక (అరరక) ఏలాక పిఙ్గల కృష్ణ (లో) గోలన్ద ఉలూక తితిక్ష భిషజ(భిషక్)[భిష్ణజ] భడిత భణ్డిత దల్భ చేకిత చికిత్సిత దేవహూ ఇన్ద్రహూ ఏకలూ పిప్పలూ బృహదగ్ని [సులోహిన్] సులాభిన్ ఉక్థ కుటీగు - ఇతిగర్గాదిః.

సూ : యఞఞోశ్చ 2-4-64.

వృ : గోత్రే యద్యఞన్తమఞన్తం చ తదవయవయోరేతయోర్లుక్ తత్కృతే బహుత్వే, న తు స్త్రియామ్. గర్గాః, వత్సాః.

య ఞ ఞోః (6-2) చ (అవ్య)

అను : గోత్రే (7-1) బహుషు (7-1) తేన (3-1) ఏవ (అవ్య) అస్త్రియామ్ (7-1) లుక్ (1-1)

అర్థ : గోత్రార్థమున విహితములగు యఞ్, అఞ్ ప్రత్యయము అంతమునం గల శబ్దముల అవయవములగు యఞ్ అఞ్ ప్రత్యయములకు, తత్కృతమైన బహుత్వమున్నపుడు, లుక్కు వచ్చును స్త్రీలింగమున రాదు ఉదా. గర్గాః వత్సాః

ఇవి గోత్రాపత్యము అనునర్థమున విధింపబడిన ప్రత్యయములగు యఞ్, అఞ్ అను ప్రత్యయములకు బహువచనమునందు లుక్కువచ్చును ఇట్లగుటలో కొన్ని నియమములు గలవు ఆ ప్రత్యయము అంతమునం గల శబ్దముల బహుత్వము ఆ ప్రత్యయాంతముచే నయినదియే కావలయును అనగా యఞ్, అఞ్ అను ప్రత్యయములు (గోత్రాపత్యము అనునర్థమున విధింపబడినవి) ఏ శబ్దములకు విధింపబడునో బహువచనప్రత్యయము కూడ ఆ శబ్దమునకే విధింపబడినది కావలయును స్త్రీలింగమునందు లుక్కు కలుగదు

ఉదా : గర్గస్య గోత్రాపత్యాని పుమాంసః - గర్గుని యొక్క గోత్రాపత్యము లయిన పురుషులు - గర్గ + జస్, యఞ్, (గర్గాదిభ్యో యఞ్) విభక్తికి లుక్కు గర్గ + య, దీనికి బహువచన ప్రత్యయము వివక్షితమగునపుడు, ఈ 'యఞ్' ప్రత్యయమునకు ప్రకృతసూత్రముచే లుక్కువచ్చును గర్గ + య + జస్ = జకారమిత్తు (చుటూ) గర్గాస్, గర్గాః ఈ గర్గశబ్దమునకు ప్రథమావిభక్తిలో రూపములు ఇట్లుండును గార్గ్యః - (ఏ) గార్గ్యౌ - (ద్వి) గర్గాః (బహు)

ఇట్లే వత్సస్య గోత్రాపత్యాని పుమాంసః, వత్సుని యొక్క గోత్రాపత్యములగు పురుషులు - వత్స + జస్ + యఞ్, వత్స + యఞ్ + జస్, వత్స + జస్ = వత్సాః,

ఈ రెండు ఉదాహరణములందును, యఞ్ ప్రత్యయమునకు లుక్కు విధింపబడినది కావున దానివలన కలుగు ఆదివృద్ధియును రాదు

ఈ యఞ్, అఞ్ ప్రత్యయములు యఞంత, అఞంతకృతములే కావలయును అనుటచే ప్రియగార్గ్యాః మున్నగుచోటులందు లుక్కురాదు ప్రియులైన గార్గ్యులు కలవారు అను అర్థమున బహుత్వము 'గార్గ్య' అను యఞంతముచే నేర్పడినది కాదు అనగా బహుత్వసంఖ్యలో నున్నవారు గరులు కారు గార్గ్యునియందు ప్రియత్వము గల ఇతర వ్యక్తులు. కావున బహుత్వమిచట అన్యపదార్థకృతము అగుటచే లుక్కురాదు.

స్త్రీలింగమున పిలుక్కు లేదనుటచే 'గార్గీ - గార్గ్యౌ - గార్గ్యః' అను రూపమే యుండును.

అవ : పూర్వము గోత్రసంజ్ఞ తెలుపబడినది. అపత్యవ్యవహారము గలిగిన వ్యక్తులలో కొన్నిలక్షణములు గలవారికి 'యువ' సంజ్ఞ కలుగునని యీ క్రింది సూత్రము చెప్పుచున్నది.

సూ : జీవతి తు వంశ్యే యువా 4-1-163.

వృ : వంశ్యే పిత్రాదౌ జీవతి పౌత్రాదేర్యదపత్యం చతుర్థాది తద్యువసంజ్ఞమేవ స్యాత్.

ప వి . జీవతి (7-1) తు (అవ్య) వంశ్యే (7-1) యువా (1-1)

అను : అపత్యం (1-1) పౌత్ర ప్రభృతి (1-1)

అర్థ : వంశ్యులగు తండ్రిమున్నగువారు జీవించి యుండగా పౌత్రుడు మున్నగువారి సంతానమగు నాల్గవతరము వ్యక్త్యాదికము యువసంజ్ఞకమే యగును

వివ : వంశమనగా తన పుట్టుకకు కారణమైన తండ్రి, తాత మున్నగువారి పరంపర. అందు పుట్టినవాడు వంశ్యుడు అనగా తండ్రి, తాతమున్నగు వ్యక్తులు ఈ సూత్రమునందలి 'తు' అను అవ్యయము అవధారణార్థకము. ఇట్లు యువా, తు = యువసంజ్ఞకమే యగునని యర్థమేర్పడును వంశ్యుడైన తండ్రి మున్నగు వ్యక్తి జీవించియున్నచో పౌత్రుడు మున్నగు వారిసంతానమునకు 'యువ' అను సంజ్ఞయే యుండును కాని గోత్ర సంజ్ఞయుండదు రఘుపు కుమారుడు, అజుడు, అజునికుమారుడు దశరథుడు, అతని పుత్రులు రామాదులు రామాదులు రఘువునకు నాల్గవతరమువారు రఘువు మనుమడగు దశరథునికి గోత్ర సంజ్ఞకలుగును దశరథపుత్రులగు రామాదులకు తండ్రి మున్నగువారు జీవించి యున్నచో గోత్రసంజ్ఞకలుగదు. యువసంజ్ఞ కలుగును వారు సజీవులుకానియెడల రామాదులకును గోత్ర సంజ్ఞ కలుగును. అట్లే రామాదుల పుత్రపౌత్రాదులకు గోత్ర యువసంజ్ఞలు పైనియమానుసారము గలుగుచుండును

ఇట్లు గోత్ర సంజ్ఞయు, యువ సంజ్ఞయు నొక్కవ్యక్తికే కలుగవని తాత్పర్యము.

అవ : ఈ 'యువ' సంజ్ఞ ఉత్తరసూత్రములో వ్యవహరింపబడుచున్నది.

సూ : గోత్రాద్యూన్యస్త్రియామ్ 4-1-94.

వృ : యూన్యపత్యే గోత్రప్రత్యయాన్తాదేవ ప్రత్యయస్స్యాత్ స్త్రియాం తు న యువసంజ్ఞా.

ప వి : గోత్రాత్ (5-1) యూని (7-1) అస్త్రియామ్ (7-1)

అను : తస్య (6-1) అపత్యమ్ (1-1) ప్రత్యయః

అర్థ : 'యువాపత్యము' అనునర్థమున గోత్రప్రత్యయాంతమునకే ప్రత్యయమగును స్త్రీత్వమున యువసంజ్ఞకలుగదు

వివ : గర్గుని మనుమఁడు గర్గునికి గోత్రాపత్యము గర్గుని మనుమని మనుమఁడు, అనగా గర్గునినుంచి అయిదవతరమువాఁడు, తనతండ్రియున్నగువాడు బ్రదికియుండగా గర్గునికి గోత్రాపత్యముగా వ్యవహరింపఁబడఁడు. యువాపత్యముగా వ్యవహరింపఁబడును ఈ అయిదవతరము వ్యక్తిని (గర్గుని మనుమని మనుమనిని) తెలుపుటకు గర్గశబ్దముపై గోత్రాపత్యప్రత్యయము చేర్పవలయునా? లేక యువాపత్య ప్రత్యయమును చేర్పవలయునా ? అనఁగా 'గర్గుని గోత్రాపత్యముఁడు' అనునర్థమున ఏర్పడిన యఞ్ ప్రత్యయాంతమగు 'గార్గ్య' అనునదియే బ్రదికి యున్నతండ్రి గలిగినట్టి, గర్గుని మనుమనిమనుమనిని బోధించునా ? లేక మరల ప్రత్యయము 'గార్గ్య' అనుదానికి చేర్పవలయునా? అను సందేహము నీ సూత్రము తొలఁగించును యువసంజ్ఞగల ఆ అయిదవతరము వ్యక్తిని తెలుపుటకు గోత్రాపత్యప్రత్యయాంతమునకు మరల యువాపత్యప్రత్యయము చేరుననియు సరాసరి మూల ప్రకృతిపై బోధింపఁబడునుంచి యువాపత్యప్రత్యయము చేరదనియు నీసూత్రము యొక్క భావము కావున గోత్రాపత్యప్రత్యయాంతముపై యువాపత్యప్రత్యయము చేరవచ్చును గాని గోత్రాపత్యప్రత్యయము మరియొకటి చేరదని తాత్పర్యము అపత్యము స్త్రీ అయినచో యువసంజ్ఞకలుగదు

అవ : ఈ పైనియమము క్రిందిసూత్రమునందు సమన్వితమగుచున్నది

సూ : యఞిఞోశ్చ 4-1-101

వృ : గోత్రే యౌ యఞిఞౌ తదన్తాత్ ఫక్.

ప వి : యఞిఞోః (6-2) చ (అవ్య)

అను : గోత్రే (7-1) ఫక్ (1-1) ప్రత్యయః (1-1) తద్ధితః (1-1)

అర్థ : గోత్రార్థమున వచ్చిన యఞ్, ఇఞ్ ప్రత్యయము అంతమునఁ గలవానికి ఫక్ ప్రత్యయము చేరును.

వివ: 'గోత్రాపత్యము' అను అర్థమున చేరిన యఞ్, ఇఞ్ అను ప్రత్యయములంతమునఁ గల సమర్థములగు షష్ఠ్యంతరూపములకు వాని సంతానము అను అర్థమున 'ఫక్' అను తద్ధిత ప్రత్యయము చేరును. గోత్రాపత్యమను అర్థమున ప్రత్యయమొకటి చేరినపిదపనదే అర్థమున మఱల ప్రత్యయము చేరదని 'ఏకో గోత్రే' అను నియమము ఉండుటచే, గోత్రాపత్యార్థమున విహితములగు యఞ్, ఇఞ్ ప్రత్యయాంతములకు విధింపఁబడిన యీ ఫక్' ప్రత్యయము యువాపత్యార్థమున నగు ననుట సిద్ధమగును. గోత్రమనగా మనుమఁడు, మునిమనుమఁడు మున్నగు వ్యక్తులు. 'యువ' అనగా బ్రదికియున్నతండ్రిగల ముని మనుమఁడు మున్నగు వ్యక్తులు.

ఉదా. గర్గస్య గోత్రాపత్యమ్ - గర్గుని మనుమఁడు అను అర్థమున 'గర్గస్య' అను షష్ఠ్యంతమునకు గర్గాదిభ్యో యఞ్' అను సూత్రముచే యఞ్ ప్రత్యయము రాఁగా, గర్గ + యఞ్, ఆదివృద్ధి, అకారలోపములు కలిగి, 'గార్గ్య' అగును. గార్గ్యస్యపౌత్రః అను అర్థమున ఆ వ్యక్తికి యువసంజ్ఞయుండిన యెడల (అనగా అతనితండ్రియో తాతయో జీవించియున్నపుడు) గార్గ్యశబ్దమునకు ప్రకృత సూత్రముచే ఫక్' ప్రత్యయము చేరును. గార్గ్య + ఙస్, ఫక్' అనియుండ ప్రాతిపదికత్వము గలిగి సుప్పునకు లుక్కు వచ్చును. గార్గ్య + ఫక్

ఇపు పై యుదాహరణమున క్రిందిసూత్రముచే కార్యవిశేషము విధింపఁబడుచున్నది.

సూ : ఆయనేయీనీయియః ఫఢఖఛఘాం ప్రత్యయాదీనామ్ 7-1-2

వృ : ప్రత్యయాదేః ఫస్య ఆయన్, ఢస్యేయ్, ఖస్య ఈన్, ఛస్య ఈయ్, ఘస్య ఇయ్ ఏతే స్యుః. గర్గస్య యువాపత్యం గార్గ్యాయణః, దాక్షాయణః

ప వి : ఆయనేయీనీయియః (1-3) ఫఢఖఛఘామ్ (6-3) ప్రత్యయాదీనామ్ (6-3)

అర్థ : ప్రత్యయముయొక్క ఆదివర్ణమగు ఫకారమునకు 'ఆయన్', ఢకారమునకు 'ఏయ్,' ఖకారమునకు 'ఈన్,' ఛకారమునకు 'ఈయ్', ఘకారమునకు 'ఇయ్' అను ఆదేశములగును. ఉదా. గర్గుని యువాపత్యము గార్గ్యాయణః, అట్లే దాక్షాయణః.

వివ. ఆయనేయీనీయియః అనుపదమునందు ఆయన్, ఏయ్, ఈన్, ఈయ్, ఇయ్ అను నైదు ఆదేశములు చెప్పబడినవి ప్రత్యయము అనుపేరు గలవానియొక్క మొదటనున్న ఫకారాదివర్ణములకీ యాదేశములు క్రమముగా నగును ఫ=ఆయన్, ఢ=ఏయ్, ఖ = ఈన్, ఛ = ఈయ్, ఘ = ఇయ్ అను రీతిన నివి యాదేశములగును దీనిచే గార్గ్య + ఫక్, అనుచోట, ఫకారమునకు 'ఆయన్' ఆదేశము ఫలోని అకారము ఆయన్ అనుదానికి చేయును ఫ్ + అ = ఆయన్ + అ గార్గ్య + ఆయన్ + అ (క్) కకారమిత్తు నకారమునకు 'అట్కుప్వాఙ్నుమ్వ్యవాయేఽపి' అనుసూత్రముచేణత్వము గార్గ్యాయణ + సు = గార్గ్యాయణః గర్గుని మనుమని మనుమడనియు, వానికి తండ్రియో, తాతయో, ముత్తాతయో జీవించియుండెననియు నీపదమున కర్థము పిత్రాదులు మృతులైన యెడల నితనికి గోత్రసంజ్ఞమాత్రమే యుండును గావున గార్గ్యః' అనియే యగును గార్గ్యస్య పుత్రః' అనునర్థమున గోత్రముకాని యువకాని వివక్షింపబడలేదు కావున వక్ష్యమాణమగు 'ఇఞ్' ప్రత్యయము చేరి 'గార్గిః' యగును కావున గర్గునియువాపత్యము అనునర్థమునసే గార్గ్యాయణః' అను రూప మేర్పడును

ఇట్లే దక్షస్య యువాపత్యమ్' - దక్షునియువాపత్యము - దక్షుని మనుమని మనుమడు (బ్రదికియున్న పిత్రాదులుగలవాడు) అనునర్థమున దాక్షి' అను ఇఞ్ ప్రత్యయాంతముపై ఫక్' ప్రత్యయము (ఇఞ్ ప్రత్యయము అనంతర సూత్రముచే వచ్చును) దాక్షి + ఫక్, కకారమిత్తు, ఫకారమునకు (ఫ) 'ఆయన్' ఆదేశము, దాక్షి + ఆయన, యస్యేతి చ- ఇకారలోపము, దాక్ష్ + ఆయన, షకారయోగముచే నకారమునకు ణకారాదేశము (అట్కుప్వాఙ్) దాక్షాయణ + సు = దాక్షాయణః పిత్రాదులు మృతులైనచో దాక్షిః అనియే యగును

సూ : అత ఇఞ్ 4.1.95

వృ : అపత్యేఽర్థే దాక్షిః.

ప వి. అతః (5-1) ఇఞ్ (1-1)

అను : సమర్థానామ్ (6-3) ప్రథమాత్ (5-1) వా (అవ్య) తస్య (6-1) అపత్యమ్ (1-1) ప్రత్యయః (1-1) తద్ధితః (1-1)

అర్థ : అదంతమై సమర్థమైన షష్ఠ్యంతపదమునకు అపత్యార్థమున ఇఞ్ ప్రత్యయము వైకల్పికముగా నగును ఉదా. దాక్షిః.

వివ : 'అతః' అనునది 'ప్రథమాత్' అనుదానికి విశేషణము కావున తదంత విధిచే 'అదంతమైన' అనునర్థము కలుగును సంధ్యాదికార్యములన్నియు జరిగిన షష్ఠ్యంతపదము హ్రస్వ అకారము అంతమునఁగలదియగుచో దానికి, అతని సంతానము అనునర్థమున 'ఇఞ్' అను ప్రత్యయము చేరును ఇందు ఞకారమిత్తు కావున ఆదివృద్ధి కలుగును

ఉదా దక్షస్య అపత్యం పుమాన్ - దక్షునికుమారుఁడు - దక్ష+ఙస్, ఇఞ్, ప్రాతిపదిక సంజ్ఞ, విభక్తి లోపము, దక్ష + ఇ, ఆది వృద్ధి, దాక్ష + ఇ, యస్యేతి చ - అకారలోపము, దాక్ష్ఇ = దాక్షి + సు = దాక్షిః (దీనినుండియే పైసూత్రమునఁ జూపఁబడిన దాక్షాయణః' అనురూపమేర్పడినది) దాశరథిః' మున్నగురూపము లిట్లే యేర్పడును

అవ . పైసూత్రముచే ఇఞ్ప్రత్యయమురాని 'బాహు' మున్నగువానికిని అపత్యార్థమున ఇఞ్ ప్రత్యయము వచ్చుటను ఈ క్రింది సూత్రము విధించుచున్నది

సూ : బాహ్వాదిభ్యశ్చ 4-1-96

వృ : బాహవిః, ఔడులోమిః ఆకృతిగణోఽయమ్.

ప ౨ . బాహ్వాదిభ్యః (5-3) చ (అవ్య)

అను సమర్థానామ్ (6-3) ప్రథమాత్ (5-1) వా (అవ్య) తస్య (6-1) అపత్యమ్ (1-1) ఇఞ్ (1-1) ప్రత్యయః (1-1) తద్ధితః (1-1)

అర్థ . బాహుమున్నగువానికిని అపత్యార్థమున ఇఞ్ ప్రత్యయము వచ్చును ఉదా బాహవిః, ఔడులోమిః ఇది ఆకృతిగణము

వివ . పైసూత్రమున ఇఞ్ ప్రత్యయము అదంతములకు మాత్రమే విధింపఁబడినది దానిచే ఇఞ్' ప్రత్యయము సిద్ధింపని బాహు, ఉడులోమన్ మున్నగువాని షష్ఠ్యంతములకు అపత్యార్థమున 'ఇఞ్' ప్రత్యయ మీ సూత్రముచే కలుగును

ఉదా : బాహోఽపత్యం పుమాన్. బాహువనువాని పుత్త్రుఁడు. బాహు + ఙస్ + ఇఞ్, ఞకారమిత్తు, విభక్తిలోపము ఆదివృద్ధి కలిగి 'బాహు + ఇ' అగును అకారమునకు వచ్చు వృద్ధి ఆకారమే ఓర్గుణః' అనుసూత్రముచే ఉకారమునకు గుణము బాహో + ఇ, అవాదేశము (ఏచోఽయవాయావః) బాహవ్ + ఇ= బాహవి + సు=బాహవిః

ఉడులోమ్నః అపత్యం పుమాన్ - ఉడులోమునికుమారుఁడు (ఉడువులనగా నక్షత్రములు, అట్టి రోమములు కలవాఁడు ఉడులోముఁడు) ఉడులోమన్ + ఙస్, ఇఞ్ (ఉడులోమన్ శబ్దమునకారాంతము రాజన్ వంటిది), విభక్తిలోపము ఉడులోమన్ + ఇఞ్, తద్ధితేష్వచామాదేః అనుసూత్రముచే ఆద్యక్షరమగు ఉకారము నకు వృద్ధి ఔకారము, ఔడులోమన్ + ఇ, 'నస్తద్ధితే' అనుసూత్రముచే టి లోపము ఔడులోమ్ + ఇ ఔడులోమి + సు = ఔడులోమిః

బాహ్వాదిగణము : బాహు ఉపబాహు ఉపవాకు నివాకు శివాకు వటాకు ఉపనిన్దు (ఉపబిన్దు) వృషలీ వృకలా చూడా బలాకా మూషికా కుశలా భగలా (ఛగలా) ధ్రువకా [ధువకా] సుమిత్రా దుర్మిత్రా పుష్కరసద్ అనుహరత్ దేవశర్మన్ అగ్నిశర్మన్ [భద్రశర్మన్ సుశర్మన్] కునామన్ (సునామన్) పఞ్చన్ సప్తన్ అష్టన్ అమితౌజసః సలోపశ్చ 58 సుధావత్ ఉదఞ్చు శిరస్ మాష శరావిన్ మరీచీ క్షేమవృద్ధిన్ శృఙ్ఖలతోదిన్ ఖరనాదిన్ నగరమర్దిన్ ప్రాకారమర్దిన్ లోమన్ అజీగర్త కృష్ణ యుధిష్ఠిర అర్జున సామ్బ గద ప్రద్యుమ్న రామ [ఉదఙ్క]. ఉదకః సంజ్ఞాయామ్, 60 సంభూయోఽమ్భసోః సలోపశ్చ 61 ఆకృతిగణోఽయమ్ తేన సాత్వకిః జాఙ్ఘిః ఐన్ద్రశర్మిః ఆజధేనవిః ఇత్యాది ఇతిబాహ్వాదిః.

సూ : అనృష్యానన్తర్యే బిదాదిభ్యోఽఞ్ 4-1-104.

వృ : యే త్వత్రా నృషయస్తేభ్యోఽపత్యేఽన్యత్ర తు గోత్రే. బిదస్య గోత్రం బైదః, బైదౌ, బిదాః. పుత్రస్యాపత్యం పౌత్రః, పౌత్రౌ, పౌత్రాః. ఏవం దౌహిత్రాదయః.

ప వి అనృషి (పంచమిలోపించినపదము) అనన్తర్యే (7-1) బిదాదిభ్యః (5-3) అఞ్ (1-1)

అను సమర్థానాం ప్రథమాద్వా, గోత్రే (7-1) తస్య (6-1) అపత్యమ్ (1-1) ప్రత్యయః (1-1) తద్ధితః (1-1)

అర్థ : బిదాదులలో ఋషివాచకములు కాని వానికి అనంతరాపత్యార్థమునను, ఋషివాచకములకు గోత్రార్థమునను 'అఞ్' ప్రత్యయము వచ్చును ఉదా : బిదస్యగోత్రాపత్యమ్, బైదః, బైదౌ, బిదాః పుత్రస్య [illegible] పౌ. పౌ. పౌత్రాః

వివ : బిదాదిగణములో బిద, కశ్యప
పుత్ర, దుహితృమున్నగు ఋషివాచకములు

'ఆనంతర్యే' అను పదమునకు అనంతరము అని యర్థము. అది అపత్యశబ్దముతో నన్వయించి 'అనంతరాపత్యార్థమున' అనునర్థము నిచ్చును. అంతరమనగా వ్యవధానము, అడ్డు. అదిలేనిది అనంతరము. ప్రకృతము అపత్యాధికారము కనుక దేనితో అంతరములేనిది అను ఆకాంక్షకు తరములతో అంతరములేనిది అనునర్థము సిద్ధించును. తండ్రికి కుమారునికిని తరములలో వ్యవధానములేదు. కాతకు మనుమనికి తండ్రి తరము వ్యవధానము. ఆనంతర్యే అనగా 'తరములలో నిట్టి అడ్డులేని' అని అర్థము. 'కొడుకు, కూతురు' అనునర్థమున - అని భావము. ఇది పంచమీవిభక్తి లోపించిన పదము. 'అనృషి' అనుదానికి సంబంధించిన పదము. కావున బిదాదిగణములోని ఋషివాచకములు కాని వానికి వానికొడుకు, కూతురు అనునర్థమునందును, పరిశేష న్యాయమున ఋషివాచకములకు గోత్రాపత్యము అనునర్థమునను అఞ్ ప్రత్యయము చేయునను ఫలితార్థము సిద్ధించినది.

ఉదా : బిదస్య గోత్రాపత్యమ్. బిదశబ్దము ఋషిని తెలుపునది కావున గోత్రార్థమున అఞ్ ప్రత్యయమగును. బిద + ఙస్, అఞ్, విభక్తిలోపము ఞిత్తగుటచే ఆదివృద్ధి, బైద + అ, యస్యేతిచ' అకారలోపము బైద్ + అ = బైద + సు = బైదః

ఈ ప్రత్యయము గోత్రాపత్యార్థమున వచ్చునది అగుటచే ఇది అంతమునం గల దానియొక్క బహుత్వము వివక్షితమగునప్పుడు, ఈ ప్రత్యయమునకు 'యఞఞోశ్చ' అను సూత్రముచే లుక్కువచ్చును. బిద + అఞ్ + జస్ - బిద + జస్ = బిద + అస్, బిదాస్ బిదాః - ఈ విషయము తెలుపుటకే ప్రథమావిభక్తి రూపములు మూడును వృత్తిలో ఉదాహరింపంబడినవి. బైదః (ఏ) బైదౌ (ద్వి) బిదాః (బహు) బైదః - బిదుని మనుమండు మున్నగువాండు - బిదాః - బిదుని మనుమండ్రు మున్నగువారు.

ఋషివాచకములు కాని 'పుత్ర' మున్నగుశబ్దములకు అతని పుత్రుండు లేక 'పుత్రిక' అనునర్థమున మాత్రమే యీ ప్రత్యయము చేయును.

ఉదా . పుత్రస్య పౌత్రః - పుత్రుని పిల్లవాండు పుత్ర + ఙస్ + అఞ్ ప్రాతిపదికత్వము, విభక్తిలోపము, పుత్ర + అ, ఆదివృద్ధి, పౌత్ర + అ, యస్యేతిచ- అకారలోపము, పౌత్ర్ + అ = పౌత్ర + సు = పౌత్రః. దీనికి బహువచనమున 'అఞ్' ప్రత్యయము లోపించదు. ఏలయన నిది గోత్రాపత్యార్థమున వచ్చినది కాదు. యఞఞోశ్చ అను సూత్రమునలోపవిధి, గోత్రాప్రత్యార్థమున విధింపంబడిన యఞ్, అఞ్ ప్రత్యయములకే. గోత్రసంజ్ఞ మనుమండు మొదలుకొని మూండవ

తరము మున్నగువారికే యుండును గాని పుత్త్రికి యుండదు ఈ విషయమును తెలుపుటకే వృత్తిలో పౌత్రః, పౌత్రౌ, పౌత్రాః అని ప్రథమావిభక్తియందలి మూఁడువచనములందును రూపము లుదాహరింపఁబడినవి

ఇట్లే దుహితుః పుత్త్రః - కూతుకొడుకు, దుహితృ + ఙస్, అణ్, దుహితృ + అ, ఆదివృద్ధి, దౌహితృ + అ, యణాదేశము దౌహిత్ర + సు = దౌహిత్రః మొదలగునవి యగును

బిదాదిగణము : బిద ఉర్వ కశ్యప కుశిక భరద్వాజ ఉపమన్యు కిలాత కందర్ప (కిందర్ప) విశ్వానర ఋషిషేణ (ఋష్టిషేణ) ఋతభాగ హర్యశ్వ ప్రియక ఆపస్తంబ కూచవార శరద్వత్ శునక (శునక్) ధేను గోపవన శిగ్రు బిందు [భోగక] భాజన [శమిక] అశ్వావతాన శ్యామాక శ్యామక [శ్యావలి] శ్యాపర్ణ హరిత కిందాస వహ్యస్క అర్కలూష (అర్కలూష) వధ్యోగ విష్ణు వృద్ధ ప్రతిబోధ రథిత రథీతర (రథస్తర) గవిష్ఠిర నిషాద [శబర అలస] మఠర (మృడాకు) సృపాకు మృదు పునర్భూ పుత్ర దుహితృ ననాంద్ర పరస్త్రీ పరశుం చ 66 ఇతి బిదాదిః

సూ : శివాదిభ్యోఽణ్ 1-4-112.

వృ : అపత్యే శైవః గాఙ్గః.

ప వి శివాదిభ్యః (5 3) అణ్ (1-1)

అను. సమర్థానాం ప్రథమాద్వా, తద్ధితః (1-1) ప్రత్యయః (1-1) తస్య (6-1) అపత్యమ్ (1-1)

అర్థ : శివ మున్నగు సమర్థ షష్ఠ్యంతములకు 'సంతానము' అనునర్థమున అణ్ ప్రత్యయము చేరును ఉదా శైవః, గాఙ్గః

వివ ఆతనియొక్క సంతానము అనునర్థమున శివ మున్నగు షష్ఠ్యంతములకు 'అణ్' అను తద్ధితప్రత్యయము వైకల్పికముగా వచ్చును ఇది గోత్రము, యువ అను నర్థమున గాక సామాన్యాపత్యార్థమున ఈశబ్దములకు వచ్చును ఇందు ణకారమిత్తు కావున నిది పరమగునపుడు ఆదివృద్ధి వచ్చును.

ఉదా. శివస్యాపత్యం పుమాన్, శివునియొక్క సంతానము శివ + ఙస్ + అణ్ తద్ధితాంతమగుటచే ప్రాతిపదికసంజ్ఞ కలిగి విభక్తి లోపించును శివ + అ, ఆదివృద్ధి, శైవ + అ, యస్యేతిచ, అకారలోపము, శైవ్ + అ = శైవ + సు = శైవః.

గఙ్గాయాః అపత్యం పుమాన్ - గంగయొక్క కుమారుఁడు, గఙ్గా + ఙస్, అణ్ విభక్తిలోపము, ఆదివృద్ధి, ఆకారలోపము, గాఙ్గ్ + అ = గాఙ్గ + సు = గాఙ్గః

శివాదిగణము శివ ప్రోష్ఠ ప్రోష్ఠిక చణ్డ జమ్భ భూరి దణ్డ కుఠార కకుభ్ (కకుభా) అనభిమ్లాన కోహిత సుఖ సన్ధి ముని కకుత్స్థ కహోడ కోహడ కహూయ కహయ రోధ కపిఞ్జల (కుపిఞ్జల) ఖఞ్జన వతణ్డ తృణకర్ణ క్షీరహ్రద జలహ్రద పరిల [పథిక] పిష్ట హైహయ (పార్షికా) గోపికా కపిలికా జటిలికా బధిరికా మఞ్జీరక (మజీరక) వృష్ణిక ఖఞ్జార ఖఞ్జాల (కర్మార) రేఖ లేఖ ఆలేఖన విశ్రవణ రవణ వర్తనాక్ష గ్రీవాక్ష (విటప పిటక) పిటాక తృక్షాక నభాక ఊర్ణనాభ జరత్కారు (వృధా ఉత్క్షేప) పురోహితికా సురోహితికా సురోహికా ఆర్యశ్వేత (ఆర్యశ్వేత) సుపిష్ట మసురకర్ణ మయూరకర్ణ (ఖర్జూరకర్ణ) కదూరక తక్షన్ ఋష్టిషేణ గఙ్గా విపాశ యస్క లహ్య ద్రుహ్య అయస్థూణ తృణకర్ణ (తృణ కర్ణ) పర్ణ భలన్దన విరూపాక్ష భూమి ఇలా సపత్నీ. 'ద్వ్యచో నద్యాః' 72 'త్రివేణీ త్రివణం చ' 73. ఇతి శివాదిః.

సూ : ఋష్యన్ధక వృష్ణి కురుభ్యశ్చ 4-1-114.

వృ : ఋషిభ్యః - వాసిష్ఠః, వైశ్వామిత్రః అన్ధకేభ్యః - శ్వాఫల్కః వృష్ణిభ్యః - వాసుదేవః కురుభ్యః - నాకులః సాహదేవః

ప. వి : ఋష్య....కురుభ్యః (5-3) చ (అవ్య).

అను : సమర్థానాం ప్రథమాద్వా, ప్రత్యయః (1-1) తద్ధితః (1-1) అణ్ (1-1) తస్య (6-1) అపత్యమ్ (1-1)

అర్థ : ఋషివాచకములకు, అంధక వృష్ణికురు వంశ్యులను దెలుపువానికిని అపత్యార్థమున అణ్ ప్రత్యయము వచ్చును. ఉదా : ఋషివాచకములకు - వాసిష్ఠః, వైశ్వామిత్రః, అన్ధక వంశ్యవాచకములకు - శ్వాఫల్కః, వృష్ణివాచకములకు - వాసుదేవః, కురువాచకములకు - నాకులః సాహదేవః

వివ : ఋషులనగా వేదమంత్రములను దర్శించినవారు. అన్ధక, వృష్ణి, కురు అనునవి వంశములు ఇచట ఈ శబ్దములచే ఆ వంశములందు పుట్టినవ్యక్తులు గ్రహింపఁబడుదురు షష్ఠ్యంతములగు వీనికి, వారిసంతానము అనునర్థమున 'అణ్' ప్రత్యయము చేయును. ప్రత్యయము ణిత్తగుటచే ఆదివృద్ధి వచ్చును.

ఉదా : ఋషివాచకములకు :- వసిష్ఠస్య అపత్యం పుమాన్, వసిష్ఠమహర్షి కుమారుఁడు, వసిష్ఠ + ఙస్, అణ్, విభక్తిలోపము, ఆదివృద్ధి, అకారలోపము, వాసిష్ఠ్ + అ = వాసిష్ఠ + సు = వాసిష్ఠః.

విశ్వామిత్రస్య అపత్యం పుమాన్, విశ్వామిత్రుని కుమారుఁడు, విశ్వామిత్ర + ఙస్, అణ్, విభక్తిలోపము, ఆదివృద్ధి (ఇ > ఐ), అకారలోపము వైశ్వామిత్ర్ + అ = వైశ్వామిత్ర + సు = వైశ్వామిత్రః

అన్ధకవంశ్యవాచకములకు :- శ్వఫల్కస్య అపత్యం పుమాన్ - శ్వఫల్కుఁడను అంధకవంశము వానికుమారుఁడు, శ్వఫల్క + ఙస్ + అణ్, విభక్తి లోపాదికము శ్వాఫల్క్ + అ = శ్వాఫల్క + సు = శ్వాఫల్కః

వృష్ణి వంశ్యవాచకములకు . వసుదేవస్య అపత్యం పుమాన్, వసుదేవుఁడను వృష్ణివంశ్యుని కుమారుఁడు, వసుదేవ + ఙస్, అణ్, వాసుదేవః

కురువంశ్యవాచకములకు .- నకులస్య అపత్యం పుమాన్, నకులుని కుమారుఁడు, నకుల + ఙస్ + అణ్ - నాకులః (నకులుఁడు కురువంశ్యుఁడు)

సహదేవస్య అపత్యం పుమాన్, సహదేవ + ఙస్, అణ్ - సాహదేవః, (సహదేవుఁడును కురువంశ్యుఁడే) విభక్తిలోపము, ఆదివృద్ధి, తుదిఅకారలోపము - అనునవి పై ఉదాహరణము లన్నింటియందును సాధారణములు

సూ : మాతురుత్సంఖ్యాసంభద్ర పూర్వాయాః 4-1-115

వృ : సంఖ్యాదిపూర్వస్య మాతృశబ్దస్య ఉదాదేశస్స్యాదణ్ ప్రత్యయశ్చ. ద్వైమాతురః, షాణ్మాతురః, సాంమాతురః, భాద్ర మాతురః

ప వి : మాతుః (6-1) ఉత్ (1-1) సంఖ్యాసంభద్రపూర్వాయాః (6-1)

అను : సమర్థానాం ప్రథమాద్వా, తస్య (6-1) అపత్యమ్ (1-1)

అర్థ : సంఖ్యావాచకమును, సమ్, భద్ర అనునవియు పూర్వముగఁగల జననీ వాచకమగు మాతృశబ్దమునకు అపత్యార్థమున అణ్ ప్రత్యయమును, ఉదాదేశము నగును. ఉదా : ద్వైమాతురః మొ॥ వి

వివ : సంఖ్యావాచకములనగా ఏక, ద్వి మొ॥వి 'సమ్' అనునది ప్రాదులలో నొకటి. భద్ర అనునది ఒకశబ్దము. ఇవి పూర్వమునఁ గల మాతృ శబ్దమునకు, ఆమెయొక్క సంతానము అనునర్థమున అణ్ ప్రత్యయము వచ్చునపుడు

తుదియున్న ఋకారముయొక్క స్థానమున హ్రస్వఉకారము (ఉత్) వచ్చును. 'సంభద్రపూర్వాయాః' అను స్త్రీలింగగ్రహణమువలన నిచట మాతృశబ్దము తల్లి యనునర్థముగల స్త్రీలింగమే యనుట స్పష్టమైనది లేనిచో 'కొలుచువాఁడు' అను నర్థముగల పుంలింగశబ్దము కూడ గ్రహింపఁబడవలసి వచ్చును.

ఉదా : ద్వయోః మాత్రోః అపత్యం పుమాన్ - ఇద్దఱుతల్లులకుమారుఁడు ద్వి + ఓస్, మాతృ + ఓస్, అణ్, (ఇచట, ద్వి, మాతృశబ్దములకు 'తద్ధితార్థోత్తరపదసమాహారే చ' అనుసూత్రముచే సమాసము. క్రింది యుదాహరణము లందును అదియే సమాసవిధాయకసూత్రము) ద్విమాతృ + అణ్, హ్రస్వఉకారాదేశము ఈ ఉకారము ఋకారస్థానమున విధింపఁబడినదగుటచే రపరముగా వచ్చును (ఉరణ్ రపరః) ద్విమాత్ + ఉర్ + అ, ఆదివృద్ధి, ద్వైమాతుర + సు= ద్వైమాతురః (వినాయకుఁడు) ఇది సంఖ్యాపూర్వమున కుదాహరణము.

షణ్ణాం మాతౄణామ్ అపత్యం పుమాన్ - ఆరుగురు తల్లుల తనయుఁడు షష్ + ఆమ్, మాతృ + ఆమ్ + అణ్, విభక్తిలోపము షకారమునకు జశ్త్వము, షడ్ + మాతృ + అ, అనునాసికసంధి, షణ్మాతృ + అ, ఉదాదేశము షణ్మాతుర్ + అ, ఆదివృద్ధి, షాణ్మాతుర + సు = షాణ్మాతురః (కుమారస్వామి) ఇదియు సంఖ్యాపూర్వమున కుదాహరణము

సమీచీనా మాతా సంమాతా - సమీచీనురాలగుతల్లి, తస్యాః అపత్యమ్, ఆమె యొక్క కుమారుఁడు, సంమాతృ + అణ్, ఉదాదేశము సంమాతుర్ + అ, ఆది వృద్ధి, సాంమాతుర + సు=సాంమాతురః

భద్రమాతుః అపత్యం పుమాన్ - భద్రయైనతల్లియొక్క పుత్త్రుఁడు. భద్ర మాతృ + అణ్, ఉదాదేశము, భద్రమాతుర్ + అ, ఆదివృద్ధి, భాద్రమాతుర + సు = భాద్రమాతురః.

సూ : స్త్రీభ్యో ఢక్ 4-1-120

వృ : స్త్రీప్రత్యయాన్తేభ్యో ఢక్. వైనతేయః.

ప వి : స్త్రీభ్యః (5-3) ఢక్ (1-1)

అను : సమర్థానాం ప్రథమాద్వా, తద్ధితః (1-1) ప్రత్యయః (1-1) తస్య (6-1) అపత్యమ్ (1-1)

అర్థ . స్త్రీ ప్రత్యయాంతములకు అపత్యార్థమున ఢక్ ప్రత్యయము చేరును

ఉదా : వైనతేయః

వివ : ఇచట స్త్రీ శబ్దముచే టాప్, డాప్, చాప్, ఙీప్, ఙీష్, ఙీన్ ఇత్యాది స్త్రీప్రత్యయములు గ్రహింపఁబడవలయును ప్రత్యయగ్రహణపరిభాషచే అవి అంతమునఁగల రూపములు గ్రహింపఁబడును సంధ్యాదికార్యములు చేయఁబడిన షష్ఠ్యంతములగు స్త్రీప్రత్యయాంతములకు, ఆమెయొక్క కుమారుఁడు లేక పుత్త్రి అను నర్థమున 'ఢక్' అను తద్ధిత ప్రత్యయము చేయును ఇందు కకారము ఇత్తు. దానివలన స్త్రీప్రత్యయాంతరూపముయొక్క ఆది యచ్చునకు వృద్ధివచ్చును ఢకారమునకు 'ఆయనేయీనీయియః ఫ ఢ ఖ ఛ ఘాం ప్రత్యయాదీనామ్' అను సూత్రముచే 'ఏయ్' అనునాదేశము వచ్చును అది 'ఢ'లోని అకారముతో కలసి 'ఏయ' అగును.

ఉదా : వినతాయాః అపత్యం పుమాన్ - వినతయొక్క పుమాఁడు వినతా శబ్దము 'టాప్' అను స్త్రీ ప్రత్యయమంతమందుఁ గలరూపము వినతా + ఙస్, ఢక్, ప్రాతిపదికసంజ్ఞ (కృత్తద్ధితసమాసాశ్చ) విభక్తిలోపము వినతా + ఢ (క్), 'ఏయ్' ఆదేశము, ఆదివృద్ధి (ఇ > ఐ) వైనతా + ఏయ, 'యస్యేతిచ' సూత్రముచే ఆకారలోపము వైనత్ + ఏయ = వైనతేయ + సు = వైనతేయః (గరుత్మంతుఁడు).

సూ : కన్యాయాః కనీన చ 4 1-116.

వృ : చాదణ్ కానీనో వ్యాసః కర్ణశ్చ.

ప వి . కన్యాయాః (6-1) కనీన (ప్రథమా విభక్తి లోపించిన పదము) చ (అవ్య)

అను : తస్య (6-1) అపత్యమ్ (1-1) తద్ధితః (1-1) ప్రత్యయః (1-1)

అర్థ : కన్యాశబ్దమునకు, ఆమెయొక్క కుమారుఁడు అనునర్థమున కనీన అను నాదేశము కూడ వచ్చును 'కూడ' అనుటచే అణ్ ప్రత్యయము నగును కానీనుఁడనగా వ్యాసుఁడును, కర్ణుఁడును

వివ : ఇచట 'కన్యా' శబ్దమునకు అవివాహితయగు స్త్రీ అని యర్థము 'కన్యయొక్క సంతానము' అనునర్థమున షష్ఠ్యంతమగు కన్యాశబ్దమునకు అణ్ ప్రత్యయము చేయును అది చేయునపుడు 'కన్యా' శబ్దమునకు 'కనీన' అను నాదేశము కూడ వచ్చును ఇది అనేక వర్ణాదేశమగుటచే కన్యాశబ్దమును మొత్తముగా తొలఁగించి వచ్చును. (అనేకాల్శిత్సర్వస్య) ఇది 'స్త్రీభ్యోఢక్' అనుసూత్రమునకు అపవాదము. అనగా కన్యాశబ్దము కూడ స్త్రీ ప్రత్యయాంతమే కనుక ఆసూత్రముచే 'ఢక్' ప్రత్య

యము ప్రాప్తించుచుండగా దీనిచే అణ్ ప్రత్యయము విధింపబడినది. ణిత్తగుటచే ఆదివృద్ధి యగును.

ఉదా : కన్యాయాః అపత్యం పుమాన్ - కన్యయొక్క కుమారుడు - కన్యా + ఙస్, అణ్, విభక్తిలోపము, కనీన ఆదేశము, కనీన + అ, ఆదివృద్ధి, కానీన + అ, యస్యేతిచ అకారలోపము, కానీన్ + అ, కానీన + సు = కానీనః, అవివాహితయగు సత్యవతికి పరాశర మహర్షివలన నుదయించుటవలన వ్యాసుడును, స్ద్రిదయగు కుంతీదేవికి బుట్టుటవలన కర్ణుడును కానీనులు.

సూ : రాజశ్వశురాద్యత్ 4-1-137

ప ని : రాజశ్వశురాత్ (5-1) యత్ (1-1)

అను : సమర్థానాం ప్రథమాద్వా, తద్ధితః (1-1) ప్రత్యయః (1-1) తస్య (6-1) అపత్యమ్ (1-1)

వివ : సమర్థములై షష్ఠ్యంతములైన రాజన్, శ్వశురశబ్దములకు, 'వాని యొక్క అపత్యము' అనునర్థమున 'యత్' అను తద్ధిత ప్రత్యయము చేయును ఇందు తకార మిత్తు

అవ : పై సూత్రమునందలి రాజశబ్దమున నొకనియమము చెప్పబడు చున్నది.

వా : రాజ్ఞో జాతావేవేతి వాచ్యమ్ (వా 2627)

ప వి : రాజ్ఞః (5-1) జాతౌ (7-1) ఏవ (అవ్య) ఇతి (అవ్య) వాచ్యమ్ (1-1)

వివ : రాజశబ్దమునకు జాతిఅర్థమైనపుడే పై సూత్రముచే విధింపబడిన యత్ ప్రత్యయము వచ్చునని చెప్పదగును అనగా రాజన్ శబ్దమునకు యత్ ప్రత్యయము చేయగా నేర్పడు సముదాయముచేత జాతివాచ్యము కావలయునని తాత్పర్యము ఇది అపత్యాధికారమగుటచే కేవలము 'రాజుయొక్క సంతానము' అనునర్థము కాక క్షత్త్రియ జాతిపురుషుడు' అనునర్థము ఈ ప్రత్యయాంతముచే సిద్ధింపవలయును

ఉదా : రాజ్ఞఃఅపత్యం పుమాన్, రాజన్ + ఙస్ + యత్, విభక్తిలోపము. 'రాజన్ + య' అనియుండ 'నస్తద్ధితే' అను సూత్రముచే టిలోపము ప్రాప్తమగు చున్నది. ఈ క్రింది సూత్రముచే నది వారింపబడుచున్నది.

తద్ధితాధికార ప్రకరణమ్

సూ : యే చాభావకర్మణోః 6-4-168

వృ : యాదౌ తద్ధితే అన్ ప్రకృత్యాస్యాన్నతు భావ కర్మణోః. రాజన్యః.

ప. వి : యే (7-1) చ (అవ్య) అభావకర్మణోః (7-2)

అను : తద్ధితే (7-1) అన్ (1-1) ప్రకృత్యా (3-1)

అర్థ . యకారాది తద్ధిత ప్రత్యయము పరమగునపుడు 'అన్' ప్రకృతితో నుండును భావకర్మార్థములందు మాత్రము అట్లుండదు.

వివ : 'యే' అనునది 'య' అనుదాని సప్తమీ విభక్తి రూపము. అది యవర్ణమును తెలుపును అది తద్ధితే అనుదానికి విశేషణము వర్ణగ్రాహకమైన సప్తమ్యంత విశేషణమునకు తదాదివిధిచే 'యకారాదియైన తద్ధిత ప్రత్యయము పరమగునపుడు' అనునర్థము వచ్చును. 'అన్' అనునది కొన్ని శబ్దముల తుది నుండు అకారనకారముల సముదాయరూపము దానికి యకారాది ప్రత్యయము పరమగు నపుడు ప్రకృతిభావ ముండును అనగా 'నస్తద్ధితే' అనుసూత్రముచే రావలసిన టిలోపము రాదని తాత్పర్యము. భావము, కర్మము అనునర్థములందు వచ్చిన యకారాది తద్ధిత ప్రత్యయము పరమగునపుడు మాత్రము ఈ ప్రకృతిభావము కలుగదు. టిలోపము వచ్చును

ఉదా : రాజ్ఞః అపత్యమ్ - రాజుయొక్క పుత్త్రుడు అనునర్థమున రాజన్ శబ్దమునకు 'యత్' ప్రత్యయము వచ్చును (రాజశ్వశురాద్యత్) రాజన్ + య(త్), నస్తద్ధితే అనుసూత్రముచే నిట 'అన్' అను వర్ణములకు లోపము ప్రాప్తించు చుండగా సూత్రముచే నది వారింపబడినది. కావున రాజన్య = రాజన్య + సు = రాజన్యః. 'జాతావేవ' అనుటచే రాజన్యుడనగా రాజకుమారుడై, రాజ వంశములోని వ్యక్తి యని యర్థము.

ఈ ప్రకృతిభావము భావకర్మార్థములయందు రాదు రాజ్ఞఃకర్మ, రాజుయొక్క కర్మము, లేక రాజ్ఞోభావః రాజుయొక్కభావము అనునర్థములందు అన్లోపము కలిగి 'రాజ్యమ్' అనురూపమేర్పడును. (ఈయర్థములందు 'గుణవచన బ్రాహ్మణాదిభ్యః కర్మణిచ' అను సూత్రముచే 'ష్యఞ్' ప్రత్యయము వచ్చును).

అప : రాజశబ్దమునకు యత్ ప్రత్యయము జాత్యర్థమునందే వచ్చునని వార్తికముచే చెప్పబడినది. దాని ప్రయోజనము పరిశీలింపబడుచున్నది.

వృ : జాతావేవేతికిమ్ ?

అర్థ : జాత్యర్థమునందే యనవేల ? 'రాజన్' శబ్దమునకు రాజశ్వశురాద్యత్, అను సూత్రముచే విధింపఁబడిన ప్రత్యయము జాత్యర్థమునందే వచ్చును. రాజు యొక్క కుమారుఁడయ్యును రాజజాతిత్వములేని వ్యక్తిని తెలుపునపుడు 'యత్' ప్రత్యయము రాదు. సామాన్యప్రత్యయమగు 'అణ్' వచ్చును ఉదా: రాజ్ఞః పుత్రః, రాజుయొక్కకుమారుఁడు (శూద్రాదిస్త్రీలయందు జన్మించినవాఁడు) రాజన్ + ఙస్, అణ్, విభక్తిలోపము. ఇచటను 'అన్' అను భాగమునకు నస్తద్ధితే అను సూత్రముచే టిలోపము ప్రాప్తించుచుండఁగా నీ క్రింది సూత్రము దానినివారించుచున్నది.

సూ : అన్ 6-4-167

వృ : అన్ ప్రకృత్యా స్యాదణి పరే. రాజనః.

ప వి : అన్ (1-1)

అను : ప్రకృత్యా (3-1) అణి (7-1)

అర్థ : అణ్ ప్రత్యయము పరమగునపుడు 'అన్' అనునది ప్రకృతితో నుండును ఉదా : రాజనః

వివ : 'అన్' అనునది అకారనకారముల సముదాయము అది అణ్ అను తద్ధితప్రత్యయము పరమగునపుడు 'నస్తద్ధితే' అనుసూత్రముచే లోపింపవలసి యుండగా నీ సూత్రమున ప్రకృతిభావముచే నిషేధింపఁబడినది. ఉదా : రాజన్ + అ(ణ్)=రాజన + సు=రాజనః.

'రాజన్యః', 'రాజనః' అను వాని అర్థభేదమును గమనింపవలయును. మొదటిదిజాతివాచకము, యత్ ప్రత్యయాంతము. రెండవది కేవలాపత్యార్థకము. అణ్ ప్రత్యయాంతము.

అవ : 'రాజశ్వశురాద్యత్' అనుసూత్రములోని రాజ శబ్దమునకుఁ గల అర్థ విశేషమును, ప్రక్రియావిశేషమును చూచితిమి. ఇపుడు శ్వశురశబ్దమునకు యత్ ప్రత్యయాంతరూపమును చూతము.

వృ : శ్వశుర్యః

వివ : 'శ్వశురస్య' అపత్యం పుమాన్. శ్వశురునియొక్క కుమారుఁడు.

(శ్వశురుఁడు=మామ) శ్వశుర + యత్, 'యస్యేతి చ' అకారలోపము. శ్వశుర్ + య = శ్వశుర్య + సు=శ్వశుర్యః-(మామకొడుకు).

సూ : క్షత్రాద్ఘః 4-1-138.

వృ : క్షత్రియః. జాతావిత్యేవ. క్షాత్రిరన్యః.

ప వి : క్షత్రాత్ (5-1) ఘః (1-1)

అను : తస్య (6-1) అపత్యమ్ (1-1)సమర్థానాం ప్రథమాద్వా, ప్రత్యయః (1-1) తద్ధితః (1-1)

అర్థ : 'క్షత్రస్య' అనుసమర్థ షష్ఠ్యంతపదమునకు అపత్యార్థమున 'ఘ' ప్రత్యయము వచ్చును. ఇదియును జాత్యర్థమునందే. ఉదా : క్షత్రియః ఇతరుఁడు 'క్షాత్రి' అగును

వివ : క్షత్రస్య అపత్యం పుమాన్ - క్షత్రుని పుత్రుఁడై క్షత్రజాతికి చెందినవాఁడు అనునర్థమున క్షత్రశబ్దమునకు 'ఘ' అను తద్ధితప్రత్యయము వచ్చును 'రాజ్ఞో జాతావేవేతి వాచ్యమ్' అను వార్తికమునుండి 'జాతావేవ' అనుభాగమిటకు తెచ్చుకొనఁబడినది కాన ఈప్రత్యయము క్షత్రజాతి వ్యక్తిని బోధించునపుడేవచ్చును.

ఉదా : క్షత్ర + ఙస్, ఘ, విభక్తిలోపము. ఘకారమునకు, 'ఆయనే యీనీయియః ఫ ఢ ఖ ఛ ఘాం ప్రత్యయాదీనామ్' అనుసూత్రముచే 'ఇయ్' ఆదేశము ఘ=ఇయ్+అ=క్షత్రి + ఇయ, యస్యేతిచ-అకారలోపము క్షత్ర్ + ఇయ=క్షత్రియ + సు = క్షత్రియః.

క్షత్రజాతి వ్యక్తికాక 'క్షత్రునికి శూద్రాదిస్త్రీలయందు సముత్పన్నుఁడైన కుమారుఁడు' అనునర్థమున ఈ ప్రత్యయమురాదు. 'అతఇఞ్' అనుసూత్రముచే 'ఇఞ్' ప్రత్యయము వచ్చును. క్షత్ర + ఙస్, ఇఞ్, విభక్తిలోపము, ఆదివృద్ధి, క్షాత్ర + ఇ యస్యేతిచ అకారలోపము. క్షాత్రి + సు=క్షాత్రిః.

సూ : కులాత్ఖః 4-1-138.

వృ : కులీనః తదన్తాదపి; ఆఢ్యకులీనః.

ప వి : కులాత్ (5-1) ఖః (1-1)

అను : సమర్థానాం ప్రథమాద్వా, తద్ధితః (1-1) ప్రత్యయః (1-1) తస్య (6-1) అపత్యమ్ (1-1)

అర్థ : కులశబ్దమునకు అపత్యార్థమున 'ఖ' ప్రత్యయమగును. ఉదా : కులీనః, కులశబ్దాంతమునకును ఈ ప్రత్యయము చేరును. ఆఢ్యకులీనః.

వివ : 'కులముగలవాని సంతానము' అనునర్థమున 'కులస్య' అను సమర్థ షష్ఠ్యంతపదమునకు 'ఖ' ప్రత్యయము చేరును ఇందలి ఖకారమునకు, 'ఆయనేయీనీయియః ఫ ఢ ఖ ఛ ఘాం ప్రత్యయాదీనామ్' అను సూత్రముచే 'ఈన్' ఆదేశమగును. (ఖ్ + అ, ఈన్ + అ = ఈన)

కులస్య అపత్యమ్ కుల + ఙస్, ఖ, విభక్తిలోపము, కుల+ఖ, ఈనా దేశము, కుల + ఈన, యస్యేతిచ అకారలోపము కుల్ + ఈన = కులీన + సు = కులీనః.

ఈ ఖ ప్రత్యయము కులశబ్దాంతమునకు గలదానికిని చేరును ఈ విషయము అష్టాధ్యాయి క్రమములో దీని తరువాతి సూత్రమునందలి 'అపూర్వపదాత్' అను సూత్రముచే జ్ఞాపితమైనది.

ఉదా : ఆఢ్యకులస్య అపత్యమ్, గొప్పకులముగలవానికుమారుడు, ఆఢ్య కుల + ఙస్, ఖ, విభక్తిలోపము, ఈనాదేశము, అకారలోపము, ఆఢ్యకుల్ + ఈన ఆఢ్యకులీన + సు = ఆఢ్యకులీనః.

సూ : రేవత్యాదిభ్యష్ఠక్ 4-1-146

ప వి : రేవత్యాదిభ్యః (5-3) ఠక్ (1-1)

అను : సమర్థానాం ప్రథమాద్వా, తద్ధితః (1-1) ప్రత్యయః (1-1) తస్య (6-1) అపత్యమ్ (1-1)

అర్థ : రేవత్యాదులకు అపత్యార్థమున ఠక్ ప్రత్యయమగును

వివ : రేవతీ మున్నగువాని సమర్థషష్ఠ్యంతపదములకు ఆమె సంతానము అనునర్థమున 'ఠక్' అను తద్ధిత ప్రత్యయము చేరును. ఇందు కకారమిత్తు కావున 'కితిచ' అనుసూత్రముచే ఆదివృద్ధివచ్చును.

ఉదా : రేవత్యాః అపత్యం పుమాన్ - రేవతియొక్క పుత్రుడు, రేవతీ + ఙస్, ఠక్. విభక్తిలోపము, రేవతీ + ఠ, కితిచ, ఆదివృద్ధి (ఏ > ఐ) 'రైవతీ+ ఠ' అనియుండ క్రిందిసూత్రముచే కార్యవిశేషము విధింపబడుచున్నది.

సూ : ఠస్యేకః 7-3-50

వృ : అఙ్గాత్పరస్య ఠస్యేకాదేశః. రైవతికః.

ప. వి : ఠస్య (6-1) ఇకః (1-1)

అను : అఙ్గస్య (6-1)

అర్థ : అంగమునకు పరముగానున్న 'ఠ' అనుదానికి 'ఇక' అనునాదేశము వచ్చును ఉదా రైవతికః

వివ : దేనికి ప్రత్యయము విధింపబడునో అది లేదా గలసముదాయము నకు, ఆ ప్రత్యయము పరముగానుండు, అంగసంజ్ఞయగును (యస్మాత్ప్రత్యయ విధిస్తదాది ప్రత్యయేఽఙ్గమ్) అట్టి అంగసంజ్ఞ కలదానికి పరముగా నున్న 'ఠ' అను దానికి 'ఇక' అనునాదేశము వచ్చును ఈ ఆదేశమున అనేకవర్ణములు గలవు గావున సర్వాదేశమగును

ఉదా : రైవత + ఠ - రైవత + ఇక, యస్యేతిచ, అకారలోపము. రైవత్ + ఇక = రైవతిక + సు = రైవతికః

ఈ రేవత్యాదులకు విధింపబడిన 'ఠక్' ప్రత్యయము 'స్త్రీభ్యో ఢక్' ఇత్యాది సూత్రములచే నగు ఢక్ మున్నగువానికి అపవాదము.

రేవత్యాదిగణము : రేవతీ అశ్వపాలీ మణిపాలీ ద్వారపాలీ వృక వఞ్చిన్ వృకబన్ధు వృకగ్రాహ కర్ణగ్రాహ దణ్డగ్రాహ కుక్కుటాక్ష (కకుదాక్ష) [చామరగ్రాహ] - ఇతి రేవత్యాదిః

సూ : జనపదశబ్దాత్ క్షత్రియాదఞ్ 4-1-168.

వృ : జనపదక్షత్రియవాచకాచ్ఛబ్దాదఞ్ అపత్యే. పాఞ్చాలః.

ప వి : జనపదశబ్దాత్ (5-1) క్షత్రియాత్ (5-1) అఞ్ (1-1)

అను : సమర్థానాం ప్రథమాద్వా, తద్ధితః (1-1) ప్రత్యయః (1-1) తస్య (6-1) అపత్యమ్ (1-1)

అర్థ : జనపదక్షత్రియ వాచకశబ్దమునకు అపత్యార్థమున అఞ్ ప్రత్యయము వచ్చును ఉదా. పాఞ్చాలః

వివ : జనపదమనగా దేశము. క్షత్రియుడనగా క్షత్రకులమున బుట్టిన వాడు. కొన్నిశబ్దములు దేశనామములను, వానినేలు రాజనామములను జెప్పుచుండును. ఉదాహరణమునకు అంగదేశము. అంగుడు. 'అంగ' అనునది ఇటదేశమునకు,

దానిసేల రాజునకును నామము ఇట్టివానిని జనపదక్షత్రియవాచకము లందురు. సమర్థములై షష్ఠ్యంతములైన జనపదక్షత్రియవాచకములకు, 'వానిసంతానము' అను నర్థమున 'అఞ్' ప్రత్యయము చేయుము ఇందు ఇకారమిత్తు కావున వది పరమగు నపుడు ఆదివృద్ధి పిద్ధించును.

ఉదా : పఞ్చాల - ఇది యొకదేశమునకును, దానివేలురాజునకును సంజ్ఞ. పఞ్చాలస్య అపత్యం పుమాన్, పఞ్చాలుని పుత్త్రుఁడు, పఞ్చాల + ఙస్, అఞ్ విభక్తిలోపము, పఞ్చాల + అ (ఞ్) ఆదివృద్ధి, పాఞ్చాల + అ, యస్యేతిచ, అకారలోపము, పాఞ్చాల్ + అ = పాఞ్చాల + సు = పాఞ్చాలః

వా॥ క్షత్రియసమానశబ్దాజ్జనపదాత్తస్యరాజన్యపత్యవత్ (2669)

వృ : పఞ్చాలానాం రాజా పాఞ్చాలః

ప వి : క్షత్రియసమానశబ్దాత్ (5-1) జనపదాత్ (5-1) తస్య (6-1) రాజని (7-1) అపత్యవత్ (అవ్య)

అర్థ : క్షత్రియసమానశబ్దమగు జనపదవాచకమునకు, 'దానిరాజు' అను నర్థమున అపత్యార్థమునందువలె ప్రత్యయమగును ఉదా . పఞ్చాలానాం రాజా పాఞ్చాలః

వివ : ఏశబ్దము ఒక క్షత్రియునికిని, అతనిచే పాలింపఁబడుదేశమునకును వాచకమగునో అట్టిదానికి, 'ఆదేశపురాజు' అనునర్థమున, అపత్యార్థములో ఏ ప్రత్యయము చేయునో ఆ ప్రత్యయము చేయును

ఉదా 'పఞ్చాల' ఇది జనపద క్షత్త్రియ వాచకము 'పంచాలదేశపురాజు' అను నర్థమున దీనికి అపత్యార్థమున పూర్వసూత్రముచే విధింపఁబడిన అఞ్ ప్రత్యయమునే యీవార్తికము విధించినది. పఞ్చాలానాం రాజా-పఞ్చాల + ఆమ్, అఞ్, విభక్తిలోపము, ఆదివృద్ధి, పాఞ్చాల + అ (ఞ్), యస్యేతి చ అకార లోపము, పాఞ్చాల్ + అ=పాఞ్చాల + సు = పాఞ్చాలః.

పై సూత్రవార్తికములనుబట్టి పాంచాలుఁడనునది పంచాలుని కుమారునికిని, పంచాలదేశపురాజునకును సంజ్ఞయగును.

అవ : పై సూత్రమున (జనపదశబ్దాత్-) విధింపఁబడిన 'అఞ్' ప్రత్యయమునకు కొన్ని అపవాదములు చెప్పఁబడుచున్నవి

వా: పూరోరణ్ (2670)

వృ : పౌరవః.

ప. వి : పూరోః (5-1) అణ్.

అర్థ : పూరుశబ్దమునకు అపత్యార్థమున అణ్ ప్రత్యయము చేరును
ఉదా : పౌరవః

వివ : పూరు శబ్దము క్షత్రియవాచకమే కాని జనపదవాచకము కాదు కావున దీనికి అపత్యార్థమున 'అణ్' ప్రత్యయము సామాన్య సూత్రమగు 'తస్యాపత్యమ్' అను సూత్రముచేతనే రావచ్చును కాని 'అణ్' ప్రత్యయముతోపాటు దీనికి తద్రాజసంజ్ఞ (ముందు చెప్పఁబడును) సిద్ధించుటకై యిచట అణ్ ప్రత్యయము పఠింపఁబడినది తద్రాజసంజ్ఞవలని ప్రయోజనము ముందు తెలుపఁబడును

ఉదా . పూరోరపత్యమ్, పూరువుయొక్క కుమారుఁడు, పూరు+ఙస్, అణ్, విభక్తిలోపము, పూరు + అణ్, ఆదివృద్ధి, పౌరు + అ, 'ఓర్గుణః' అను సూత్రముచే ఉకారమునకు గుణము పౌరో + అ, అవాదేశము, (ఏచోఽయవాయావః) పౌరవ్ + అ = పౌరవ + సు = పౌరవః.

వా: పాణ్డోర్డ్యణ్ (2671)

వృ : పాణ్డ్యః.

ప. వి : పాణ్డోః (5-1) డ్యణ్ (1-1)

అర్థ : జనపదక్షత్రియవాచకమగు 'పాణ్డు' శబ్దమునకు అపత్యార్థమునను, తద్దేశాధిపతి అనునర్థమునను డ్యణ్ ప్రత్యయము చేరును.

ఉదా : పాణ్డ్యః

వివ : పాండువనగానిచట ధర్మరాజాదుల తండ్రికాఁడు అతనిపేరు జనపద వాచకము కాదు కావున నీయర్థము తెలియును జనపదవాచకము క్షత్రియవాచకము నైన పాండుశబ్దమునకు, అతనికుమారుఁడు అను నర్థమునను, క్షత్రియసమాన శబ్దాత్ - ఇత్యాది వార్తికమువలన పాండుదేశపురాజు అనునర్థమునను డ్యణ్' అను ప్రత్యయము చేరును ఇది 'అణ్' ప్రత్యయమున కపవాదము. ఇందుడకారణకారము లిత్తులు. డిత్తగుటవలన సూ: 6-4-143 (డిత్తుపరమగునప్పుడు టి భాగమునకు లోపము వచ్చును) అనుసూత్రముచే టి సంజ్ఞకమగు ఉకారమునకు లోపము వచ్చును. ణిత్తగుటచే ఆదివృద్ధి. అకారమునకు ఆకారమే వచ్చును.

ఉదా : పాణ్డోరపత్యం, రాజావా, పాండువుయొక్క పుత్త్రుడు లేక పాండు దేశపురాజు. పాణ్డు + ఙస్, డ్యణ్, విభక్తిలోపము పాణ్డు + డ్యణ్, పాణ్డు + య టిలోపము, పాణ్ + య = పాణ్డ్య పాణ్డ్య + సు = పాణ్డ్యః.

సూ : కురునాదిభ్యో ణ్యః 4-1-172.

వృ : కౌరవ్యః, నైషధ్యః.

ప వి : కురునాదిభ్యః (5-3) ణ్యః (1-1)

అను : జనపద శబ్దాత్ (5-1) క్షత్రియాత్ (5-1) తద్ధితః (1-1) ప్రత్యయః (1-1) తస్య (6-1) అపత్యమ్ (1-1) సమర్థానాం ప్రథమాద్వా

అర్థ : జనపదక్షత్రియవాచకములగు కురుశబ్దమునకు, నకారాది శబ్దములకును 'ణ్య' అను తద్ధితప్రత్యయము వచ్చును ఉదా . కౌరవ్యః, నైషధ్యః

వివ . నాదులనగా నకారము ఆదియందుగలశబ్దములు జనపదక్షత్రియవాచకములగు కురుశబ్దముయొక్క షష్ఠ్యంతరూపమునకు, అట్టివేయగు నకారాదిశబ్దముల షష్ఠ్యంతరూపములకును వరుసగా, వాని కుమారుడు లేక ఆదేశపురాజు అనునర్థములందు 'ణ్య' అను ప్రత్యయము వచ్చును ఇందు ణకారము ఇత్తు (పోవు) దానిచే ఆదివృద్ధి కలుగును

ఉదా కురోరపత్యం = కురువుయొక్క సంతానము, లేక కురూణాం రాజా, కురుదేశముల రాజు కురు + ఙస్ ఆమ్, ణ్య, విభక్తిలోపము కురు + ణ్య, ఆదివృద్ధి, కౌరు + య, ఓర్గుణఃఅనుసూత్రముచే ఉకారమునకు గుణము, కౌరో + య, వాన్తోయి ప్రత్యయే అను సూత్రముచే అవాదేశము కౌరవ్ + య=కౌరవ్య + సు=కౌరవ్యః

నిషధస్య అపత్యం, రాజా వా, నిషధునికుమారుడు లేక నిషధదేశపురాజు నిషధ + ఙస్ + ణ్య, విభక్తిలోపము, ఆదివృద్ధి, నైషధ + య, యస్యేతిచ, అకారలోపము నైషధ్య + సు = నైషధ్యః.

సూ : తే తద్రాజాః 4-1-174.

వృ : అఞాదయ స్తద్రాజ సంజ్ఞాః స్యుః.

ప వి : తే (1-3) తద్రాజాః (1-3)

అర్థ : అఞ్ మున్నగు ప్రత్యయములు తద్రాజ సంజ్ఞకములు.

వివ : జనపదశబ్దాత్ - ఇత్యాదిసూత్రము మొదలుకొని యిట విధింపబడిన అణ్, అఞ్, ఞ్యఙ్, ణ్య - అను ప్రత్యయములకు 'తద్రాజ' అను సంజ్ఞ కలుగును.

అవ : పై సంజ్ఞ క్రింది సూత్రమున ప్రయుక్తమైనది

సూ : తద్రాజస్య బహుషు తేనైవాస్త్రియామ్ 2-4-62.

వృ : బహ్వర్థేషు తద్రాజస్య లుక్, తత్కృతే బహుత్వే న తు స్త్రియామ్, పఞ్చాలాః ఇత్యాది.

ప ని : తద్రాజస్య (6-1) బహుషు (7-3) తేన (3-1) ఏవ (అవ్య) అస్త్రియామ్ (7 1)

అను : లుక్ (1-1)

అర్థ : బహువచనమున తద్రాజప్రత్యయమునకు లుక్కు వచ్చును బహుత్వము తద్రాజప్రత్యయాంతకృతమైనప్పుడే యీలుక్కు అగును స్త్రీత్వమున రాదు ఉదా : పంచాలాః మొ॥ వి

వివ : తద్రాజ ప్రత్యయము చేరిన రూపములయొక్క బహుత్వము వివక్షిత మగునపుడు ఆ తద్రాజప్రత్యయమునకు లుక్కు వచ్చును తద్రాజప్రత్యయము దేనికి చేరునో దానిచే వాచ్యులగు వ్యక్తులకు సంబంధించిన బహుత్వమున్నపుడే యీ లుక్కు వచ్చును లుక్కు అనగా ప్రత్యయముయొక్క అదర్శనము తద్రాజ సంజ్ఞపై సూత్రమున వివరింపబడినది.

ఉదా పఞ్చాలస్య అపత్యాని పుమాంసః, పంచాలునియొక్క సంతానమైన పురుషులు పంచాలశబ్దము జనపదక్షత్రియవాచకము దానికి అపత్యార్థమున 'జనపద శబ్దాత్ క్షత్రియాదఞ్' అను సూత్రముచే 'అఞ్' ప్రత్యయము చేరును 'పఞ్చాల + అఞ్'. ఇపుడు దీనికి బహుత్వసంఖ్య వివక్షితమైనది ఆబహుత్వము పంచాలుని అపత్యములకు సంబంధించినది కావున ప్రకృతసూత్రముచే తద్రాజ సంజ్ఞగల అఞ్ ప్రత్యయమునకు లుక్కువచ్చును పఞ్చాల + (అఞ్) + జస్= పఞ్చాల + అస్=పఞ్చా - లాస్ - పంచాలాః పంచాలుని కుమారులు ఇట్లే తక్కిన ప్రత్యయములకును రూపములుండును

ఈ సూత్రమునుబట్టి తద్రాజప్రత్యయాంతములకు బహువచనమున మాత్రము ప్రత్యయము లోపించును. ఏకద్వివచనములలో ప్రత్యయము లుండును. ప్రత్యయమునుబట్టి వచ్చు ఆదివృద్ధ్యాదికార్యములు ఏకద్వివచనములలోఁ

గన్నట్టును. బహువచనమునఁ గన్పట్టుష క్రింది ప్రథమావిభక్తిరూపములను బట్టి తక్కినవాని మాహించుకొనునది.

శబ్దము	ఏ	ద్వి	బహు	
పంచాల –	పాంచాలః	పాంచాలౌ	పంచాలాః.	ప్ర. వి:
పూరు –	పౌరవః	పౌరవౌ	పూరవః	
పాణ్డు –	పాణ్డ్యః	పాణ్డ్యౌ	పాండవః.	
కురు –	కౌరవః	కౌరవౌ	కురవః.	
నిషధ –	నైషధ్యః	నైషధ్యౌ	నిషధాః.	

ఇత్యాదులరయునది.

సూ : కమ్బోజాల్లుక్ 4-1-175

వృ : అస్మాత్తద్రాజస్యలుక్. కమ్బోజః, కమ్బోజౌ.

ప వి : కమ్బోజాత్ (5-1) లుక్ (1-1)

అను : తద్రాజః (1-3)

అర్థ : కమ్బోజ శబ్దమునకు పరముగానున్న తద్రాజప్రత్యయమునకు లుక్కువచ్చును. ఉదా : కమ్బోజః, కమ్బోజౌ.

వివ : కమ్బోజ శబ్దము జనపద క్షత్రియవాచకము. దానికి, అపత్యార్థము నందును, ఆ దేశమునకురాజు అనునర్థమునందును, జనపదశబ్దాత్ క్షత్రియాదఞ్' అను సూత్రముచేతను, 'క్షత్రియసమానశబ్దాజ్జనపదాత్తస్య రాజన్యపత్యవత్' అను వార్తికముచేతను విహితమైన 'అఞ్' ప్రత్యయమునకు లుక్కువచ్చును లుక్కు వచ్చినను అర్థభంగము కలుగదని తాత్పర్యము.

ఉదా : కమ్బోజస్య అపత్యంపుమాన్. కమ్బోజ + ఙస్, అఞ్, విభక్తి లోపము. కమ్బోజ + అఞ్, ప్రకృతసూత్రముచే అఞ్ ప్రత్యయమునకును లుక్కు (అదర్శనము). కమ్బోజ + సు=కమ్బోజః. కమ్బోజరాజునకును, అతని పుత్త్రునకును ఇది సంజ్ఞ.

తక్కిన తద్రాజప్రత్యయములకు బహువచనమునందు మాత్రమే లుక్కు వచ్చును. దీనికి ఏక ద్వివచనములందును వచ్చుట విశేషము. దానిని సూచించుటకే ఉదాహరణములు కమ్బోజః (ఏ) కమ్బోజౌ (ద్వి) అనునవి చూపఁబడినవి.

అవ : సూత్రమున కమ్బోజశబ్దము యొక్కటికి పరముగా నున్న తద్రాజ ప్రత్యయమునకే లుగ్విధానము చేయఁబడి యుండగా వార్తికకారుఁడు దాని నిట్లు విస్తరించుచున్నాఁడు

వా॥ కమ్బోజాదిభ్య ఇతి వక్తవ్యమ్ (2674).

వృ : చోళః, శకః, కేరళః, యవనః.

ప వి : కమ్బోజాదిభ్యః (5-3) ఇతి (అవ్య) వక్తవ్యమ్ (1-1).

అర్థ : తద్రాజప్రత్యయలోపము కమ్బోజాదిశబ్దములకు అని చెప్పఁదగును. ఉదా . చోళః మొ॥వి.

వివ : ఒక్క కంబోజశబ్దమునకు మాత్రమేకాక, అట్టివేయగు, చోళ, శక, కేరళ మున్నగువానికి పరముగా నున్న తద్రాజప్రత్యయములకును లుక్కు చెప్పవలయునని వార్తికము యొక్క భావము కావున చోళాదిశబ్దములును కమ్బోజశబ్దమువలె చోళుఁడు, చోళునికుమారుఁడు చోళదేశపురాజు అనునర్థములు గలది యగును. ఉదా : చోళస్య అపత్యం, రాజావా, చోళునికుమారుఁడు లేక చోళదేశపురాజు.

ఉదా : చోళ + జస్ + అఞ్, విభక్తిలోపము, ప్రత్యయలోపము. చోళ + సు = చోళః, అట్లే కేరళ + జస్ + అఞ్ = కేరళః, శక + జస్, + అఞ్, శకః, యవన + జస్ + అఞ్, యవనః మొ॥వి.

కంబోజాదిగణము : కమ్బోజ చోళ కేరళ శక యవన ఇతి కంబోజాదిః.

ఇతి అపత్యాధికారప్రకరణము.

ప్రకరణావలోకనము : 'అతనియొక్క అపత్యము' అను నర్థమున నామశబ్దములకు విహితములగు ప్రత్యయము లనేకము లిందు చెప్పఁబడినవి. వీనిని నాలుగు విధములుగా విభజింపనగును (1) కూతురు, కొడుకు అనునర్థము నిచ్చునవి కేవలాపత్యప్రత్యయములు (2) అపత్యముగా వివక్షింపఁబడిన మనుమఁడు మనుమరాలు మున్నగు మూఁడవతరము మొదలుకొని తరువాతితరములవారి నంద ఱను చెప్పు ప్రత్యయములు గోత్రప్రత్యయములు. ఇందు ఏతరమువారిని చెప్ప వలసినను ప్రత్యయమొక్కటియే చేటును (3) జీవత్పితృకులైన మనుమని సంతానము మున్నగువారిని యువాపత్యమందురు. వారిని చెప్పవలసినప్పుడు గోత్ర

ప్రత్యయాంత పై చేరు ప్రత్యయములను యువాపత్య ప్రత్యయములందురు. (4) దేశనామము రాజనామము నొకటియేయగు శబ్దములకు తనిఅపత్యము, ఆ దేశపురాజు అనునర్థమున చేరు ప్రత్యయములు రాజప్రత్యయములు ఈ నాలుగువిధములను సోదాహరణముగ సప్రక్రియముగ నిందు నిరూపింపఁబడినవి.

ఇందలి అణ్, అఞ్ ప్రత్యయములచే నేర్పడు రూపములో భేదమేమియు లేదు. స్వరమున మాత్రము భేదముండును కొన్నియెడల బహువచన ప్రత్యయము పరమగునపుడు లుక్కు వచ్చుట అఞ్ ప్రత్యయమునకు కలదు ఫ = ఆయన, ఢ = ఏయ, ఖ = ఈన, ఘ = ఇయ అను ఓటుగా మారుట యీ ప్రకరణములో చూపితిమి ఫకారమునకు ఈ యా దేశము వచ్చుట మాత్రమిందు ప్రసక్తమగును.

ఇందు విధింపఁబడిన ప్రత్యయము లన్నియు సమర్థషష్ఠ్యంతములకే చేరును ఇందు ప్రత్యయములు పరములగునపుడు తుదినున్న అ, ఆ, ఇ, ఈ లకు యస్యేతిచ అనుసూత్రముచేత లోపమువచ్చుటయు, ఉఊలకు ఓర్గుణః అనుసూత్రముచే గుణమువచ్చుటయు పలుతావుల పరిశీలించితిమి.

అథ చాతురర్థిక ప్రకరణమ్.

అవ . చతురర్థములకు సంబంధించిన ప్రత్యయములుగల ప్రకరణమగుటచే దీనిని చాతురర్థిక ప్రకరణమందురు పూర్వ ప్రకరణమున అపత్యార్థప్రత్యయములు మాత్రమే ప్రధానముగ చెప్పఁబడినవి. ఇందు అనేకములగు నర్థములలో తద్ధిత ప్రత్యయములు విధింపఁబడుచున్నవి ఇందు తుది భాగమున అది ఆదేశమందున్నది' 'దానిచే నేర్పడినది' 'దానికి నివాసమైనది' 'దానికి దూరమైనదికాదు' అను నాలుగర్థములలో ప్రత్యయములు విధింపఁబడుచున్నవి. వానినిబట్టి యీ ప్రకరణమునకు చాతురర్థిక ప్రకరణమను పేరుగలిగినది కొందఱు ఇందలి రక్తాద్యర్థముల నొక ప్రకరణముగా, చాతురర్థిక ప్రకరణము మఱియొక ప్రకరణముగా విభజించిరి ఆ విభాగము మనము సందర్భానుసారముగా గుర్తింపఁగలము. పూర్వప్రకరణము నందు వలెనే యిందును 'సమర్థానాం ప్రథమాద్వా' తద్ధితాః, ప్రత్యయః అను

సరికారములు ప్రవర్తించును ఆదివృద్ధి, తుది ఇవర్ణా వర్ణముల లోపము మున్నగు నవి యథాసంభవముగ నిందును కలుగుచుండును

పూర్వప్రకరణమున 'తస్య' అను షష్ఠ్యంతసూచకపదము అధికృతమైనట్లు, ఇందు తేన, తత్ర, సా, తద్, తస్య అనుపదము లందందు గోచరించును. అవి యాయా విభక్త్యంతములకు సూచకములు వానిని సందర్భానుసారముగా పరిశీలింతము.

సూ : తేన రక్తం రాగాత్ 4-2-1.

వృ : అణ్ స్యాత్. కషాయేణ రక్తం వస్త్రం కాషాయమ్.

ప వి . తేన (3-1) రక్తమ్ (1-1) రాగాత్ (5-1).

అను : అణ్ (1-1) తద్ధితః (1-1) ప్రత్యయః (1-1) సమర్థానామ్ (6-3) ప్రథమాత్ (5-1) వా (అవ్య)

అర్థ : 'దానిచే రంగు వేయఁబడినది' అనునర్థమున తృతీయాంతమైన రాగవాచకశబ్దమునకు పరముగా అణ్ ప్రత్యయ వచ్చును ఉదా : కషాయేణ రక్తం వస్త్రమ్ కాషాయమ్

వివ : 'తేన' అనునది తృతీయా విభక్తి అంతమునఁగలపదమునకు చిహ్నము. రక్తమనగా రంగు వేయఁబడిన వస్తువు రాగవాచకమనగా రంగు వేయుటలో సాధనమగు ద్రవ్యమును తెలుపునది కరణార్థమున రంజ్ ధాతువునకు ఘఞ్ ప్రత్యయము చేరఁగా 'రాగః' అగును. రంగువేయుటలో సాధనముగా ఉపయోగింపఁబడిన కషాయము మున్నగు రాగవాచకశబ్దముల తృతీయాంతరూపములకు, 'దానితో రంగువేయఁబడిన వస్త్రము మున్నగునది' అనునర్థమున, 'అణ్' ప్రత్యయము చేరును ఇందు ణకారము ఇత్తగుటవలన శబ్దమునందు మొదటి అచ్చునకు వృద్ధి వచ్చును

ఉదా : కషాయేణ రక్తంవస్త్రమ్ - కషాయముతో రంగువేయఁబడిన వస్త్రము. ఇందు 'కషాయ' అనునది రాగవాచకము అనగా రంగువేయుటలో సాధనమైన పదార్థము తృతీయాంతముగునావడ మిట సమర్థములైన వానిలో ప్రథమము. అనగా మొదట నుచ్చరింపఁబడినది దానిచే రంగువేయఁబడిన వస్త్రమును బోధించుచు 'కషాయేణ' అనుపదమునకు 'అణ్' ప్రత్యయము చేరును. కషాయ + టా, అణ్, తద్ధితాంతము గావున ఈ మొత్తమునకు ప్రాతిపదిక సంజ్ఞ

కలుగును. (కృత్తద్ధిత సమాసాశ్చ) ప్రాతిపదికావయవములగు సువ్వులకు లుక్కు వచ్చును (సుపోధాతు ప్రాతిపదికయోః) కషాయ + అణ్, ణిత్తగుతద్ధిత ప్రత్యయము పరముగుటచే కషాయ'లోని తొలి అచ్చగు అకారమునకు వృద్ధి ఆకారమాదేశమగును (తద్ధితేష్వచామాదేః) కాషాయ + అ, యస్యేతిచ అను సూత్రముచే తుది అకారమునకు లోపము, కాషాయ్ + అ=కాషాయ+ము = కాషాయమ్ (నపుం)

సూ : నక్షత్రేణ యుక్తః కాలః 4-2-3.

వృ : అణ్ స్యాత్.

ప. వి : నక్షత్రేణ (3-1) యుక్తః (1-1) కాలః (1-1).

అను : తేన (3-1) అణ్ (1-1) తద్ధితః (1-1) ప్రత్యయః (1-1) సమర్థానాం ప్రథమాద్వా

అర్థ : తృతీయాంతమైన నక్షత్రవాచక శబ్దమునకు, 'దానితోకూడిన కాలము' అనునర్థమునందు, అణ్ ప్రత్యయము వచ్చును

వివ . అనువృత్తిగా వచ్చిన 'తేన' అనుపదము నక్షత్రేణ అనుదానితో నన్వయించును. తృతీయాంతమైన నక్షత్రవాచకశబ్దము ఇచట సమర్థములలో మొదటిదిగా నుచ్చరింపఁబడినది తేన నక్షత్రేణయుక్తఃకాలః'- ఆ నక్షత్రముతో కూడినకాలము' అనునర్థమును తెలియఁజేయుచు సమర్థములలో ప్రథమముగు తృతీయాంతమైన నక్షత్రవాచకశబ్దమునకు పరముగా 'అణ్' అను తద్ధితప్రత్యయము వచ్చును.

ఉదా . పుష్యేణ యుక్తమహః – ఇందు 'పుష్యేణ' అనునది నక్షత్రవాచక తృతీయాంతపదము 'అహః' అనునది కాలవాచకశబ్దము (పగలు). ప్రత్యయము చేరిన పిదప నేర్పడురూపము దానిని (అహఃఅనుదానిని) తెలుపును ఎట్లు అహ స్సనగా పుష్యనక్షత్రముతో కూడిన అహస్సు అని యర్థము ఈ యర్థమును తెలుపుటకు పుష్యేణ' అను నక్షత్రవాచకమునకు 'అణ్' ప్రత్యయము చేరును. పుష్య + టా, అణ్, ప్రాతిపదికసంజ్ఞ విభక్తిలోపము పుష్య + అణ్, ఆది వృద్ధి, పౌష్య + అ, యస్యేతిచ అను సూత్రముచే అకారలోపము, 'పౌష్య + అ' అని యుండగా ననంతరకార్యమును క్రింది వార్తికము తెలుపుచున్నది.

వా॥ తిష్యపుష్యయో ర్నక్షత్రాణి యలోప ఇతి వాచ్యమ్. (4200).

వృ : పుష్యేణయుక్తం పౌషమహః, పౌషీరాత్రిః.

ప వి : తిష్యపుష్యయోః (6-2) నక్షత్రాణి (7-1) య (విభక్తిలోపించిన పదము) లోపః (1-1) ఇతి (అవ్య) వాక్యమ్ (1-1)

అర్థ : తిష్య పుష్య అనువాని యకారమునకు, నక్షత్రార్థమున వచ్చిన అణ్ ప్రత్యయము పరమగునపుడు, లోపము చెప్పనగును ఉదా : పౌషమహః, పౌషీరాత్రిః

వివ : నక్షత్రాణి, నక్షత్ర + అణి, అనుదానికి 'నక్షత్రేణయుక్తః కాలః' అను సూత్రముచే విధింపఁబడిన అణ్' ప్రత్యయము పరమగునపుడు అనియర్థము. అట్టియెడ తిష్య, పుష్య అనువాని యకారమునకు లోపము వచ్చును

ఉదా : పైసూత్రమున ఉదాహరింపఁబడిన 'పౌష్య + అ' అనురూపములో యకారమునకు కీవార్తికముచే లోపమురాఁగా పౌష్ + అ=పౌష + సు = 'పౌషమ్' అయినది 'అహః' అనునపుంసకలింగశబ్దమునకు విశేషణమగుటచే నిదియు నపుంసకమయినది.

ఇట్లే పుష్యేణ యుక్తారాత్రిః. పుష్యనక్షత్రముతో కూడిన చంద్రుఁడు గల రాత్రి పుష్య + టా + అణ్ (నక్షత్రేణ యుక్తః కాలః అనుసూత్రముచే అణ్ ప్రత్యయము) విభక్తిలోపము పుష్య + అ (ణ్), ఆదివృద్ధి, పౌష్య + అ, యస్యేతిచ, అకారలోపము, ప్రకృతవార్తికముచే యకారలోపము, పౌష్ + అ = 'పౌష' దీనికి స్త్రీత్వమున ఙీప్' ప్రత్యయము వచ్చును పౌష + ఙీప్ (ఙకార పకారములిత్తులు) పౌష + ఈ, యస్యేతిచ - అకారలోపము, పౌష్ + ఈ = పౌషీ + సు = పౌషీ స్త్రీలింగమగు రాత్రిశబ్దమునకు విశేషణమగుటచే 'పౌషీ' అనునదియు స్త్రీలింగమైనది

అవ . పైని విధింపఁబడిన ప్రత్యయమునకు కొన్నియెడల అదర్శనము క్రింది సూత్రముచే విధింపఁబడుచున్నది

సూ : లుబవిశేషే 4-2-4.

వృ : పూర్వేణ విహితస్యలుప్ స్యాత్ షష్టి దణ్డాత్మకస్య కాలస్యావాన్తర విశేష శ్చేన్న గమ్యతే. అద్యపుష్యః.

ప. వి : లుప్ (1-1) అవిశేషే (7-1).

అను : నక్షత్రేణ (3-1) యుక్తః (1-1) కాలః (1-1) అణ్ (1-1).

అర్థ : అఱువది ఘటికల రూపమున విభజింపఁబడిన కాలముయొక్క అవాంతర విశేషము తెలియఁబడనిచో, పూర్వసూత్రముచే విధింపఁబడిన ప్రత్యయమునకు లుప్పు వచ్చును ఉదా : అద్యపుష్యః.

వివ అవిశేషే అనగా 'విశేషము తెలియఁబడనియప్పుడు' అని యర్థము దేనియొక్క విశేషము? అని ఆకాంక్ష జనించును సందర్భమునుబట్టి 'నక్షత్రేణ యుక్తః కాలః' అనుసూత్రమునందు 'నక్షత్రముతో కూడిన కాలము' అనునర్థమున ప్రత్యయము విధింపఁబడుచున్నది కావున 'కాలము యొక్క విశేషము' అనునర్థము సిద్ధించును కాలముయొక్కవిశేష మనగా నేమి? ఇది పద్దికాలము కాదు. నక్షత్రముతో యుక్తమైనకాలము చంద్రుఁడు ఒక్కొక్క నక్షత్రముతో కూడియుండు కాల ప్రమాణము అఱువది ఘటికలని సిద్ధాంతము అట్లు అఱువది, అఱువది ఘటికలుగా విభజింపఁబడినకాలముయొక్క అవాంతరవిశేషములగు (అందులోని చిన్న చిన్న భాగములు) పగలు, రాత్రి, మధ్యాహ్నము, సాయంకాలము మొదలగునవి వివక్షింపఁబడనియెడల పైసూత్రముచే విధింపఁబడిన ప్రత్యయమునకు లుప్పువచ్చును. 'లుప్' అనునదియు ప్రత్యయముయొక్క అదర్శనమునకు ఒకసంజ్ఞ (ప్రత్యయస్య లుక్ శ్లులుపః)

ఉదా అద్యపుష్యః – ఈ దినము పుష్యనక్షత్రయుక్తమైనకాలము అద్య అనునది ఈరోజు అనునర్థముగల అవ్యయము దీనిచే అఱువది ఘటికల ప్రమాణము గల అహోరాత్రకాలవిశేషమే తెలియఁబడుచున్నది కాని, దాని అవాంతరభేదము లగు పగలు, రాత్రి మున్నగునవి చెప్పఁబడుటలేదు కావున విశేషము గమ్యమాన మగుటలేదు (అవిశేషే) అందువలన 'పుష్యేణ యుక్తః కాలః' అనునర్థమున 'నక్షత్రేణయుక్తః కాలః' అను సూత్రముచే వచ్చిన అణ్ ప్రత్యయమునకు లుప్పు వచ్చును పుష్య + టా + అణ్, విభక్తియు అణ్ ప్రత్యయమును లోపించును పుష్య + సు = పుష్యః

ప్రత్యయము రాకముందు 'పుష్యః' అనుదానికి పుష్యనక్షత్రమని యర్థము ప్రత్యయముచేరి లోపించిన పిదప 'పుష్యః' అనుదానికి పుష్యనక్షత్రముతో కూడిన దినము అనియర్థ మేర్పడును కావున ప్రత్యయము రానేల? పోనేల? అని శంకింపరాదు

అవ : మఱియొక అర్థమున ప్రత్యయము విధింపఁబడుచున్నది.

సూ : దృష్టం సామ 4-2-7.

వృ : తేనేత్యేవ. వసిష్ఠేన దృష్టం వాసిష్ఠం సామ.

వ. వి : దృష్టమ్ (1-1) సామ (1-1).

అను : తేన (3-1) సమర్థానాం ప్రథమాద్వా, అణ్ (1-1) ప్రత్యయః (1-1) తద్ధితః (1-1).

అర్థ : 'అతనిచే దర్శింపఁబడిన సామము' అనునర్థమున ద్రష్టను తెలుపు తృతీయాంతపదమునకు, అణ్ ప్రత్యయము చేయును వసిష్ఠునిచే దర్శింపఁబడిన సామము – వాసిష్ఠమ్

వివ : ఋషులనగా వేదమంత్రములను దర్శించినవారు వేదమంత్రములు కొన్ని కొన్నిటిని కొందఱు కొందఱు ఋషులు దర్శించిరి ఈ సామము ఈ మహర్షిచే దర్శింపఁబడినది (మొట్టమొదటగా నతఁడు దానిని గుర్తించి తదర్థాదికమును లోకమునకు వెల్లడించుటకు ఇట దర్శనమని వ్యవహారము). అనునర్థమున దర్శించిన వ్యక్తిని బోధించు తృతీయాంతపదమునకు, అణ్ ప్రత్యయము చేయును.

ఉదా : వసిష్ఠేనదృష్టం సామ – వసిష్ఠునిచే దర్శింపఁబడినసామము (వేద భాగము). వసిష్ఠ + టా + అణ్, విభక్తిలోపము, ఆదివృద్ధి, వాసిష్ఠ + అ యస్యేతిచ, అకారలోపము వాసిష్ఠ్ + అ=వాసిష్ఠ+సు=వాసిష్ఠమ్ (నపుం)

అవ : పైసూత్రమున కొక అపవాదము చెప్పఁబడుచున్నది.

సూ : వామదేవాడ్డ్యడ్డ్యౌ 4-2-9.

వృ : వామదేవేన దృష్టం సామ, వామదేవ్యమ్.

వ వి : వామదేవాత్ (5-1) డ్యడ్డ్యౌ (డ్యత్, డ్య) (1-2)

అను : తేన (3-1) దృష్టమ్ (1-1) సామ (1-1) సమర్థానాం ప్రథమాద్వా, తద్ధితః, ప్రత్యయః (1-1)

అర్థ : వామదేవశబ్దమునకు అతనిచే దర్శింపఁబడినసామము' అనునర్థమునందు డ్యత్, డ్య అను ప్రత్యయములు వచ్చును. వామదేవునిచే దర్శింపఁబడిన సామము వామదేవ్యము.

వివ : వామదేవునిచే దర్శింపఁబడినసామము అనునర్థమున తృతీయాంతమగు వామదేవశబ్దమునకు పర్యాయముగా డ్యత్, డ్య అను ప్రత్యయములు చేయును, ఈ రెంటియందును డకారమునకు 'చుటూ' అను సూత్రముచే ఇత్సంజ్ఞ కలుగును. డ్యత్ ప్రత్యయమునందు తకారముకూడ ఇత్తే. ఇంక రెంటియందును మిగులునది 'య'

ఒక్కటియే. కావున నేర్పడు రూపమొక్కటియే. స్వరములో భేదమును దెలుపుటకై రెండు ప్రత్యయములు గ్రహింపఁబడినవి (స్వరమనగా ఉదాత్తాదికము)

ఉదా : వామదేవేన దృష్టంసామ - వామదేవ + టా, డ్యత్ డ్య' విభక్తి లోపము 'వామదేవ + య' అనియుండ 'టేః' అను సూత్రముచే 'వామదేవ' అనుదాని టి భాగమగు అకారమునకు లోపము వచ్చును వామదేవ్ + య = వామదేవ్య + సు = వామదేవ్యమ్ (టేః - 6-4-143 డిత్తుపరమగునప్పుడు భసంజ్ఞకముయొక్క టి భాగమునకు లోపమగును).

[వామదేవశబ్దములోని అకారలోపమునకు యస్యేతిచ అనుసూత్రమే చాలును. ప్రత్యయమున డకారము ఇత్తుగా నుండనక్కఱలేదు. కాని స్వరమునకు సంబంధించిన యొక విశేషమును స్ఫురింపఁజేయుటకై ప్రత్యయములు డిత్తులుగా నిర్దేశింపఁబడినవి తదనుగుణముగా 'టేః' అనుసూత్రముచే లోపముచేయఁబడినది].

అవ : మఱియొక అర్థమున ప్రత్యయము విధింపఁబడుచున్నది

సూ : పరివృతో రథః 4-2-14.

వృ : అస్మిన్నర్థేఽణ్ ప్రత్యయః. స్యాత్. వస్త్రైః పరివృతో వాస్త్రో రథః.

ప వి : పరివృతః (1-1) రథః (1-1).

అను : తేన (3-1) ప్రత్యయః (1-1) తద్ధితః, సమర్థానాం ప్రథమాద్వా. అణ్ (1-1)

అర్థ : 'దానిచే పరివృతమైన రథము' అనునర్థమున అణ్ ప్రత్యయమగును ఉదా : వస్త్రముచే పరివృతమైనది, వాస్త్రః, రథః

వివ : 'పరివృతము' = అన్నివైపులను కప్పఁబడినది. అట్టిరథము చెప్పఁబడునపుడు దేనితో కప్పఁబడినదో తద్వాచక తృతీయాంతమునకు అణ్' ప్రత్యయము చేరును.

ఉదా : వస్త్రేణ పరివృతో రథః - వస్త్రముచేఁ గప్పఁబడిన రథము ఇందు రథమును అన్నివైపులను కప్పుటకు ఉపయోగింపఁబడినవస్తువు వస్త్రము. తద్వాచక తృతీయాంతము, వస్త్రేణ అనునది. దానికి ఈ సూత్రముచే 'అణ్' ప్రత్యయము. వస్త్ర + టా + అణ్, ప్రాతిపదికసంజ్ఞ కలిగి విభక్తి (టా) లోపించును. ప్రత్యయము ణిత్తగుటచే ఆదివృద్ధి కలుగును. వాస్త్ర+అ, 'యస్యేతిచ' అకారలోపము, వాస్త్ర్ + అ=వాస్త్ర + సు=వాస్త్రః.

అవ : అర్థాంతరము చెప్పఁబడుచున్నది. 'శేష' అనునది నివృత్తమగు చున్నది.

సూ : తత్రోద్ధృత మమత్రేభ్యః 4-2-14.

వృ: శరావే ఉద్ధృతః. శారావ ఓదనః.

ప. వి : తత్ర (అవ్య) ఉద్ధృతమ్ (1-1) అమత్రేభ్యః (5-3)

అను . సమర్థానాం ప్రథమాద్వా: తద్ధితః: ప్రత్యయః: అణ్ (1-1).

అర్థ : సప్తమ్యంతములగు పాత్రవాచక శబ్దములకు, 'తీసి దానియందుంచఁ బడినది' అనునర్థమున, 'అణ్' ప్రత్యయము వచ్చును ఉదా : శరావమునందు తీసి ఉంచఁబడినది – శారావః ఓదనః

వివ : 'తత్ర' అనుపదము సప్తమ్యర్థకము (దానియందు) : ఉద్ధృతమ్' అనగా తీసి 'ఉంచఁబడినది' అని యర్థము అమత్రములనగా పాత్రములు. ఒక పదార్థమును ఒకచోటినుండి తీసి ఏ పాత్రయందుంతుమో ఆ పాత్రను తెలుపు సప్తమ్యంతపదమునకు 'దానియందుంచఁబడినది' అను నర్థమున 'అణ్' ప్రత్యయము చేయును ఇందు ణకారమిత్తు ఆదివృద్ధి వచ్చును

ఉదా : శరావే ఉద్ధృతః ఓదనః మూకుడునందు తీసి ఉంచఁబడిన అన్నము. ఇందు 'శరావము' ఒకపాత్ర దాని యందుంచఁబడిన పదార్థము ఓదనము ఆ యర్థము నభివ్యక్తముచేయుచు సప్తమ్యంతపాత్రవాచకశబ్దమగు శరావే అనుదానికి పరముగా 'అణ్' ప్రత్యయము వచ్చును. శరావ + ఙి + అణ్ ప్రాతిపదికత్వము, విభక్తిలోపము, శరావ + అ, ఆదివృద్ధి, శారావ + అ, యస్యేతిచ- అకారలోపము, శారావ్ + అ = శారావ + సు=శారావః. మూకుటిలో నుంచఁబడిన అన్నము మొదలగునది.

సూ : సంస్కృతం భక్షాః 4-2-16.

వృ : సప్తమ్యన్తాదణ్ స్యాత్సంస్కృతేఽర్థే యత్సంస్కృతం భక్షాశ్చేత్ తేస్యుః. భ్రాష్ట్రేషు సంస్కృతా భ్రాష్ట్రా భక్షాః.

వ. వి : సంస్కృతమ్ (1-1) భక్షాః (1-3).

అను : తత్ర (అవ్య) అణ్ (1-1) తద్ధితః, ప్రత్యయః, సమర్థానాం ప్రథమాద్వా.

అర్థ : 'అందు సంస్కరింపఁబడినది' అనునర్థమున సప్తమ్యంతపదమునకు అణ్ ప్రత్యయము చేరును సంస్కరింపఁబడినవి భక్షములైనపుడే యీ ప్రత్యయము వచ్చును. ఉదా : భ్రాష్ట్రములందు సంస్కరింపఁబడిన భక్షములు - భ్రాష్ట్రాః.

వివ : సంస్కరించుట యనగా వంట మున్నగు వ్యాపారముచే గుణవిశేషము నొకదానియందు కలుగునట్లు చేయుట సంస్కృతమనగా నట్లు చేయఁబడినది. భక్షములనఁగా తినఁబడుపదార్థములు దేనియందు తినఁబడు పదార్థములు సంస్కరింపఁబడునో దానిని తెలుపు సప్తమ్యంతపదమునకు, సంస్కరింపఁబడిన పదార్థములను తెలియఁజేయుచు, అణ్ ప్రత్యయము వచ్చును

ఉదా : భ్రాష్ట్రేషు సంస్కృతాః, భ్రాష్ట్రము అనగా 'మంగలము' అనఁబడు ఒక విధమగువంటకు పనికివచ్చు మృణ్మయపాత్రము 'అందువండఁబడిన భక్షములు' అనునర్థమున 'భ్రాష్ట్రేషు' అను సప్తమ్యంతపదమునకు 'అణ్' ప్రత్యయము చేరును భ్రాష్ట్ర + సుప్ + అణ్, విభక్తిలోపము, ఆదివృద్ధి అకారమునకు ఆకారమే వచ్చును భ్రాష్ట్ర + అ, 'యస్యేతిచ' అకారలోపము, భ్రాష్ట్ర + అ = భ్రాష్ట్ర, ఇది 'భక్షాః' అను బహువచనాంతమునకు విశేషణమగుటచే దీనికిని ప్రథమాబహువచన ప్రత్యయము చేరును భ్రాష్ట్ర + జస్ = భ్రాష్ట్రాః.

సూ : సా ఽస్య దేవతా 4-2-24.

వృ : ఇన్ద్రో దేవతా ఽస్యేతి ఐన్ద్రం హవిః. పాశుపతమ్, బార్హస్పత్యమ్.

ప వి : సా (1-1) అస్య (6-1) దేవతా (1-1),

అను : సమర్థానాం ప్రథమాద్వా; తద్ధితాః; ప్రత్యయః అణ్ (1-1)

అర్థ : 'అది దానికి దేవత' అనునర్థమున ప్రథమాంతమునకు 'అణ్' ప్రత్యయము చేరును ఉదా : ఇంద్రుఁడు ఈహవిస్సునకు దేవత- ఐన్ద్రమ్, పాశుపతమ్, బార్హస్పత్యమ్.

వివ : ఒకదేవతను పేర్కొని 'అది ఈహవిరాదికమునకు 'దేవత' అను నర్థమును జెప్పవలసినపుడు ప్రథమాంతమగు దేవతావాచక శబ్దమునకు పరముగా అణ్ ప్రత్యయము వచ్చును. సూత్రమున 'సా' అను శబ్దము ప్రథమాంతదేవతావాచకములకు చిహ్నము. 'అర్పణము చేసెడు వస్తువునందు ఉద్దేశ్యవిశేషమైనది

'ఏత' అని నిర్వచించఁబడినది. హవిస్సు నెవరినుద్దేశించి అర్పింతుమో అది 'ఏత'

ఉదా : ఇన్ద్రోదేవతాఅస్యహవిషః. ఈ హవిస్సునకు దేవత ఇంద్రుఁడు. ఇందు దేవతావాచకప్రథమాంతము 'ఇన్ద్రః' అనునది అతని నుద్దేశించి ఈయఁ బడిన హవిస్సు ప్రత్యయాంతముచే తెలుపఁబడును. ఇన్ద్ర + సు + అణ్. విభక్తిలోపము, ఆదివృద్ధి (ఇ > ఐ) ఐన్ద్ర + అ, యస్యేతిచ, అకారలోపము. ఐన్ద్ర + అ=ఐన్ద్ర + సు=ఐన్ద్రమ్ (నపుం).

పశుపతిర్దేవతా అస్య - దీనికి పశుపతిదేవత. పశుపతి సు + అణ్ ('అశ్వ పత్యాదిభ్యశ్చ' అనుసూత్రముచే ఈ యర్థమున 'అణ్' ప్రత్యయము) విభక్తి లోపము, ఆదివృద్ధి, పాశుపతి + అ, యస్యేతిచ, ఇకారలోపము పాశుపత్ + అ = పాశుపత + సు=పాశుపతమ్

బృహస్పతిర్దేవతాఽస్య - దీనికి బృహస్పతిదేవత - బృహస్పతిశబ్దము పత్యుత్తరపదము కావున 'దిత్యదిత్యాదిత్య పత్యుత్తర పదాణ్ణ్యః' అనుసూత్రముచే ఈ యర్థమున 'ణ్య' ప్రత్యయము వచ్చును. బృహస్పతి + సు + ణ్య (ణకారమిత్తు) విభక్తిలోపము, ఆదివృద్ధి (ఋ > ఆర్) బార్హస్పతి + య, యస్యేతిచ ఇకారలోపము బార్హస్పత్య + సు=బార్హస్పత్యమ్

సూ : శుక్రాద్ఘన్ 4-2-26.

వృ : శుక్రియమ్.

ప ప . శుక్రాత్ (5-1) ఘన్ (1-1).

అను : సా (1-1) అస్య (6-1) దేవతా (1-1) సమర్థానాం ప్రథమాద్వా, తద్ధితః, ప్రత్యయః.

అర్థ : 'శుక్రుఁడు దీనిదేవత' అనునర్థమున ప్రథమాంతమగు శుక్రశబ్దము నకు 'ఘన్' ప్రత్యయము వచ్చును ఉదా : శుక్రియమ్.

వివ : ఇది పూర్వసూత్రమున కపవాదము 'శుక్రుఁడు దేవతగాఁగలది'అను నర్థమున 'శుక్రః' అను ప్రథమాంతపదమునకు 'ఘన్' అను ప్రత్యయము చేయును. ఇందు నకారమిత్తు ఘకారమునకు (ఘ-అనుదానికి) 'ఆయనేయీనీయియః ఫ ఢ ఖ ఛ ఘాం ప్రత్యయాదీనామ్' అను సూత్రముచే 'ఇయ్' అను నాదేశము వచ్చును (ఘ+అ=ఇయ్ + అ). ఇందు ఆదివృద్ధికి నిమిత్తము లేదు ఆదివృద్ధికి నిమిత్తములుణిత్తు, ఞిత్తు,కిత్తులు.

ఉదా : శుక్రో దేవతా అస్య - ఈ హవిస్సునకు శుక్రుఁడు దేవత శుక్ర + సు - ఘన్, విభక్తిలోపము, శుక్ర + ఘ, ఇయాదేశము, శుక్ర + ఇయ, యస్యేతి చ అకారలోపము, శుక్ + ఇయ, శుక్రియ + సు = శుక్రియమ్ (నపుం)

సూ : సోమాట్ట్యణ్ 4-2-30.

వృ : సౌమ్యమ్.

ప వి : సోమాత్ (5-1) ట్యణ్ (1-1).

అను . సమర్థానాం ప్రథమాద్వా: తద్ధితః; ప్రత్యయః: సా (1-1) అస్య (6-1) దేవతా (1-1)

అర్థ : 'అది దాని దేవత' అను నర్థమున 'సోమః' అను ప్రథమాంతమునకు ట్యణ్ ప్రత్యయము చేరును. ఉదా : సౌమ్యమ్

వివ : సోమోదేవతా అస్య'-ఈ హవిరాదికమునకు సోముఁడు దేవత అను నర్థము 'సోమః' అనుసమర్థప్రథమాంతమునకు 'ట్యణ్' అను తద్ధిత ప్రత్యయము వచ్చును ఇందు టకారణకారములిత్తులు (చుటూ, హలన్త్యమ్) 'య' మిగులును ణిత్తగుటచే ఆదివృద్ధి

ఉదా : సోమోదేవతా అస్య - సోమ + సు + ట్యణ్, విభక్తిలోపము, సోమ + ట్యణ్, ఆ-వృద్ధి (ఓ > ఔ) సౌమ + య, యస్యేతిచ - అకార లోపము, సౌమ్య + సు=సౌమ్యమ్

సూ వాయ్వృతుపిత్రుషసోయత్ 4-2-31.

వృ : వాయవ్యమ్, ఋతవ్యమ్.

ప. వి : వాయ్వృతు పిత్రుషసః (5-1) యత్ (1-1).

అను : సమర్థానాం ప్రథమాద్వా; తద్ధితః; ప్రత్యయః, సా (1-1) అస్య (6-1) దేవతా (1-1)

అర్థ : 'అది వీనిదేవత' అనునర్థమున ప్రథమాంతములగు వాయు, ఋతు, పితృ, ఉషస్ అనువానికి 'యత్' ప్రత్యయమగును. ఉదా : వాయవ్యమ్, ఋతవ్యమ్.

వివ ఈ యత్ ప్రత్యయము 'సాస్యదేవతా' అనుసూత్రముచే ప్రాప్తమగు 'అణ్' ప్రత్యయమున కపవాదము. వాయుః, ఋతుః, పితా, ఉషః అను ప్రథ

షాంతములకు, వాయ్వాదులు దేవతలుగాఁగల హవిరాదులు అర్థములైనపుడు, యత్ ప్రత్యయము చేరును ఇందును ఆదివృద్ధికి నిమిత్తము లేదు.

ఉదా : వాయుర్దేవతాస్య - వాయువు దేవతగాఁగలది వాయు + సు + యత్, తకారమిత్తు, విభక్తిలోపము. వాయు + య, 'ఓర్గుణః' అను సూత్రముచే ఉకారమునకు గుణము, వాయో + య, 'వాన్తో యి ప్రత్యయే' అనుసూత్రముచే ఓకారమునకు అవాదేశము వాయవ్ + య = వాయవ్య + సు = వాయవ్యమ్.

ఋతుర్దేవతాఽస్య - ఋతువు దేవతగాఁగలది ఋతు + సు + యత్. ఋతు + య, గుణము, ఋతో + య, అవాదేశము, ఋతవ్ + య = ఋతవ్య + సు = ఋతవ్యమ్

అపి : 'పితా దేవతా అస్య - పితృదేవతగాఁగలది పితృ + సు + యత్, విభక్తిలోపము 'పితృ + య' అని యుండ క్రింది సూత్రము కార్యవిశేషమును విధించుచున్నది

సూ : రీఙృతః 7-4-27.

వృ : అకృత్సార్వధాతుకే యకారే చ్వౌ చ పరే ఋతో రీఙాదేశః. 'యస్యేతి చ' పిత్ర్యమ్

ప వి: రీఙ్ (1-1) ఋతః (6-1)

అను : అఙ్గస్య (6-1) అకృత్సార్వధాతుకయోః (6-2) (అవ్య) యి (7-1)

అర్థ : అకృద్యకారమును, అసార్వధాతుకయకారమును [illegible] మును పరమగునపుడు, ఋదంతమైన అంగమునకు రీఙాదేశము వచ్చును. తిచ' అనుసూత్రముచే ఈకారలోపము పిత్ర్యమ్

వివ : 'ఋతః' అనునది 'అంగస్య' అనుదానికి విశేషణము. తదంతవిధిచే 'హ్రస్వఋకారము అంతమునఁగల అంగముయొక్క స్థానమున' అను సర్థము సిద్ధించును (తపరస్తత్కాలస్య, షష్ఠీస్థానేయోగా అను పరిభాషలు సమన్వయించుకొనవలయును). కృత్తు అనగా ధాతువునకు చేరు తిఙ్భిన్న ప్రత్యయము అది కానిది అకృత్తు. సార్వధాతుక మనగా ధాతువులకు చేరు తిఙ్లు శిత్తులునైన ప్రత్యయములు అవికానిది అసార్వధాతుకము. కృత్తుకానిదాని యకారముగాని, సార్వధాతుకము కాని ధాని యకారముగాని, చ్వి ప్రత్యయముగాని పరమగునపుడు ఋదంత

మైన అంగముయొక్క తుదివర్ణమునకు (జిచ్చు) 'రీ(ఙ్)' అను ఆదేశము వచ్చును. (ఙకారమిత్తు) (ఙిత్తుకావున నీయాదేశము తుదివర్ణమునకగును).

ఉదా : పితృశబ్దమునకు 'పితాదేవతాఅస్య' అనునర్థమునందు వాయ్వృతు పిత్రుషసోయత్ అనుసూత్రముచే యత్ ప్రత్యయము వచ్చి పితృ + య అని యేర్పడుట ఈ సూత్రముయొక్క అవతారికలో చూపఁబడినది. పితృ + య - ఇచట యకారము కృత్సంబంధికాదు, సార్వధాతుక ప్రత్యయసంబంధియుకాదు ఇది తద్ధిత ప్రత్యయము కాన పితృ' అను అంగముయొక్క తుదివర్ణమైన ఋకారమునకు రీ' అను నాదేశము వచ్చును పిత్రీ + య, యస్యేతిచ అను సూత్రముచే ఈకారలోపము పిత్ + య = పిత్ర్య + సు = పిత్ర్యమ్.

అవ : 'వాయ్వృతు' ఇత్యాదిసూత్రమునందలి 'ఉషస్' శబ్దమున కుదాహరణము.

వృ : ఉషస్యమ్

వివ : ఉషోదేవతాస్య - ఉషస్సు దీనియొక్క దేవత ఉషస్ + సు యత్, విభక్తిలోపము, ఉషస్ + య=ఉషస్య + సు =ఉషస్యమ్

'సాస్యదేవతా' అనునర్థమున ప్రత్యయములు ఇంతటితో ముగిసినవి

సూ : పితృవ్య మాతుల మాతామహ పితామహాః 4-2-36.

వృ : ఏతేనిపాత్యన్తే. పితుర్భ్రాతా పితృవ్యః, మాతుర్భ్రాతా మాతులః, మాతుఃపితా మాతామహః, పితుఃపితా పితామహః.

ప. వి : పితృవ్య .... పితామహాః (1-3).

అర్థ : ఇవి నిపతింపఁబడుచున్నవి. పితయొక్క భ్రాతపితృవ్యః, మాతయొక్కభ్రాత = మాతులః, మాతయొక్క తండ్రి మాతామహః, పితయొక్క తండ్రి పితామహః.

వివ : పితృమాతృ శబ్దములకు ప్రత్యయవిధానము చేయకయే పాణిని కొన్ని యర్థములందు రూపమును నిపతింపఁజేసెను. తండ్రి సోదరుఁడు అనునర్థమున పితృ

మాతృశబ్దమునుండి 'మాతుల' అనునదియు 'తల్లి తండ్రి' అనునర్థమున మాతృ శబ్దమునుండి 'మాతా మహ' అనురూపమును, 'తండ్రి తండ్రి' అను నర్థమున పితృ శబ్దమునుండి 'పితామహ' అనునదియు నేర్పడునని ప్రత్యయములను పేర్కొనకయే రూపములను ప్రదర్శించెను ప్రక్రియతో నిమిత్తములేక ఈ రూపమిట్లుండునని నిర్దేశించుటను నిపాతమందురు.

కాని వార్తికకారుఁడు వీనికి ప్రకృతివిభాగము నొనరించెను. (1) 'పితుర్భ్రాతరి వ్యత్' పితృశబ్దమునకు అతనిసోదరుఁడు అనునర్థమున 'వ్యత్' ప్రత్యయము. పితృ + జస్ + వ్యత్, పితృవ్య + సు=పితృవ్యః (2) 'మాతుర్డులచ్'- మాతృశబ్దమునకు ఆమె సోదరుఁడు అనునర్థమున 'డులచ్' ప్రత్యయము మాతృ+ జస్, డులచ్, (డకారచకారము లిత్తులు) మాతృ + ఉల, 'టేః' అను సూత్రముచే ఋకారమునకు లోపము. మాత్ + ఉల = మాతుల + సు = మాతులః. (3) 'మాతృ పితృభ్యాం పితరి డామహచ్' - మాతృ పితృశబ్దములకు వారితండ్రి అనునర్థమున 'డామహచ్' ప్రత్యయమగును మాతృ + జస్ + డామహచ్ (డ్, చ్ లు ఇత్తులు) టిలోపము మాత్ +ఆమహ = మాతామహ + సు = మాతామహః పితృ + జస్ + డామహచ్, పిత్ + ఆమహ=పితామహ + సు = పితామహః

సూ : తస్య సమూహః 4-2-37

వృ : కాకానాం సమూహః కాకమ్.

వ వి : తస్య (6-1) సమూహః (1-1)

అర్థ : వానియొక్క సమూహము అనునర్థమున సమర్థషష్ఠ్యంతమునకు అణ్ ప్రత్యయము వచ్చును. ఉదా : కాకులయొక్క సమూహము=కాకమ్.

వివ : 'తస్య' అనునది షష్ఠ్యంత పదమునకు చిహ్నము. దేనియొక్క సమూహము చెప్పఁబడునో తద్వాచకషష్ఠ్యంతమునకు, సమూహమను నర్థమును దెలియఁజేయుచు 'అణ్' ప్రత్యయము వచ్చును.

ఉదా : 'కాకానాం సమూహః' కాకులయొక్క సమూహము. కాక + ఆమ్, అణ్, ప్రాతిపదికసంజ్ఞ, విభక్తిలోపము, కాక్ + అ(ణ్), ఆదివృద్ధి, ఆకార మునకు ఆకారమేయగును. కాక + అ, యస్యేతిచ-అకారలోపము కాక్+అ = కాక+సు=కాకమ్ (నపుం).

సూ : భిక్షాదిభ్యోఽణ్ 4-2-38.

వృ : భైక్షమ్. గర్భిణీనాం సమూహో గార్భిణమ్. ఇహ 'భస్యాఢే తద్ధితే' ఇతి పుంవద్భావే కృతే —

ప. వి : భిక్షాదిభ్యః (5-3) అణ్ (1-1)

అను : తస్య (6-1) సమూహః (1-1) సమర్థానాం ప్రథమాద్వా: తద్ధితః, ప్రత్యయః.

అర్థ : భిక్షాదులకు, 'వానిసమూహము' అనునర్థమున 'అణ్' ప్రత్యయ మగును. ఉదా : భైక్షమ్ గర్భిణులసమూహము అనునర్థమున భస్యాఢే తద్ధితే' అను వార్తికముచే పుంవద్భావము కాఁగా (వక్ష్యమాణసూత్రముచే కార్యము చెప్పఁబడుచున్నది).

వివ : 'తస్యసమూహః' అనుసూత్రముచే భిక్షాదులకు ప్రాప్తమగు అణ్ ప్రత్యయమునకు ఠక్, అఞ్ మొ॥లగు ప్రత్యయము లపవాదములుగా చెప్పఁబడి యుండుటచే వానిని బాధించుటకు మఱల నీసూత్రముచే 'అణ్' ప్రత్యయము విధింపఁబడినది. భిక్షమున్నగువాని షష్ఠ్యంతరూపములకు, 'వాని సముదాయము' అనునర్థమున 'అణ్' ప్రత్యయము చేరును.

ఉదా : భిక్షాణాం సమూహః - భిక్షములసమూహము భిక్షా + ఆమ్, అణ్, విభక్తిలోపము. భిక్షా + అణ్, ఆదివృద్ధి (ఇ> ఐ) భైక్షా + అ, యస్యేతిచ - ఆకారలోపము, భైక్ష్ + అ= భైక్ష + సు= భైక్షమ్ (నపుం)

గర్భః అస్యాః స్త్రీతి గర్భిణీ, గర్భముగలస్త్రీ. ఇచట గర్భశబ్దమునకు 'అది కలది' అనునర్థమున 'ఇన్' ప్రత్యయముచేరి 'గర్భిన్' అగును. దానికి స్త్రీత్వమున 'ఙీప్' ప్రత్యయముచేరి 'గర్భిణీ' అగును ప్రకృతమున గర్భిణీనాం సమూహః, అనునర్థమున అణ్ ప్రత్యయము 'గర్భిణీ + ఆమ్ + అణ్, విభక్తిలోపము, గర్భిణీ + అణ్ అనియుండ, 'భస్యాఢే తద్ధితే' (3928) (ఢ భిన్న తద్ధిత ప్రత్యయము పరమగునపుడు భసంజ్ఞకమైన స్త్రీప్రత్యయాంతరూపమునకు పుంవద్భావమువచ్చును) అను వార్తికముచే 'గర్భిణీ' శబ్దమునకు పుంవద్భావము వచ్చును. అనగా 'ఙీప్' ప్రత్యయము అదృశ్యమగును. గర్భిన్ + అ(ణ్) అని యుండును. ఆదివృద్ధి రాఁగా 'గార్భిన్ + అ' అగును. ఇట్టియెడ 'నస్తద్ధితే' అను సూత్రముచే ఇందలి 'ఇన్' భాగమునకు లోపము రావలసియుండఁగా క్రింది సూత్రము దానిని వారించుచున్నది.

సూ : ఇనణ్యనపత్యే 6-4-164.

వృ : అనపత్యార్థేఽణి ఇన్ ప్రకృత్యా. తేన నస్తద్ధిత ఇతి టిలోపో న.

ప వి : ఇన్ (1-1) అణి (7-1) అనపత్యే (7-1).

అను : ప్రకృత్యా (3-1).

అర్థ : అనపత్యార్థకము అణ్ ప్రత్యయము పరమగునపుడు 'ఇన్' అను నది ప్రకృతితో నుండును దీనిచే 'నస్తద్ధితే' అను సూత్రమువలన నగుటిలోపము రాదు. గార్గిణమ్

వివ : 'అణ్' ప్రత్యయము అనేకార్థములలో విధింపబడినది అపత్యార్థమున విధింపబడినది కాక తక్కిన అర్థములలో విధింపబడిన అణ్ ప్రత్యయము పరమగునపుడు పూర్వమున నున్న శబ్దస్వరూపముయొక్క 'టి' అగు ఇన్' అను నది ప్రకృతితోనుండును అనగా దానికి విధింపబడిన లోపము రాదని తాత్పర్యము

ఉదా : గార్గిన్ + అ, ఇచట అణ్ ప్రత్యయము సమూహమనునర్థమున వచ్చినది. కావున 'నస్తద్ధితే' అనుసూత్రమువలన రావలసిన టిలోపమును ప్రకృతి సూత్రము వారించినది నకారమునకు రేఫయోగమువలన ణత్వము. (అట్ కుప్వాఙ్నుమ్ వ్యవాయేఽపి) గార్గిణ + సు = గార్గిణమ్

అవ : భిక్షాదులలోనిదే యగు పతియొక యుదాహరణము చూపబడు చున్నది.

వృ : యువతీనాం సమూహో యౌవనమ్. శత్రన్తాదను దాత్తా 'దేరఞిత్యఞి యౌవతమ్'.

అర్థ : యువతుల సమూహము అనునర్థమున 'యౌవనమ్' అని యగును. శతృప్రత్యయాంతమునకు ('యువతీ' అనుదానికి) 'అనుదాత్తాదేరఞ్' అనుసూత్రముచే అఞ్ ప్రత్యయము రాగా దానినుండి 'యౌవతమ్' అనియు రూపమగును.

వివ : సంస్కృతమున యౌవనము గలది అనునర్థమున 'యువతిః' అను ఇకారాంతశబ్దమొకటియు, 'యువతీ' అను ఈకారాంతశబ్దమొకటియుగలదు ఇందు మొదటిది 'యువన్' శబ్దమునకు 'తి' అను స్త్రీ ప్రత్యయము చేరగా నేర్పడినది (యూనస్తిః) రెండవది యుధాతువునకు శతృప్రత్యయము చేరగా నేర్పడిన

యువత్ అనుదానికి 'ఉగితశ్చ' అను సూత్రముచే 'జీప్' ప్రత్యయము చేరఁగా నేర్పడినది. ఈ రెండిటికిని సమూహార్థక ప్రత్యయము చేరఁగా మొదటిదానినుండి 'యౌవనమ్' అనియు, రెండవదానినుండి 'యౌవతమ్' అనియు రూపము లేర్పడును ప్రక్రియ సరయుదము.

(1) యువతీనాం సమూహః – (ఇచట తిప్రత్యయాంతము గ్రహింపఁ బడినది) – యువతులసమూహము – యువతి + ఆమ్, అణ్ (భిక్షాదిభ్యోఽణ్) విభక్తిలోపము యువతి+అణ్, 'భస్యాఢేతద్ధితే' అను వార్తికముచే పుంవద్భావము (యువన్ + తి – తిప్రత్యయము పోవును) యువన్ + అణ్, ఆది వృద్ధి, యౌవన్ + అ అనియుండ 'నస్తద్ధితే' అనుసూత్రముచే టిలోపము ప్రాప్తింపఁగా 'అన్' అనుసూత్రము దానిని వారించును యౌవన + సు = యౌవనమ్.

'యు' మిశ్రణామిశ్రణయోః అనుధాతువునకు శతృప్రత్యయము చేర్చినచో 'యువత్' అనురూపమేర్పడును. దీనికి స్త్రీత్వమున 'ఉగితశ్చ' అనుసూత్రముచే 'జీప్' ప్రత్యయ మగును. 'యువతీ' – ఈ శబ్దమునుండి ఏర్పడిన సమూహార్థక రూపము 'యౌవతమ్' అగును. యువతీ + ఆమ్, అఞ్, అనుదాత్తాదేరఞ్ 4-2-44 (అనుదాత్తాంతమై, ఇకారాంతమైన శబ్దమునకు సమూహార్థమున అఞ్ ప్రత్యయమగును) అను సూత్రముచే ఇచట అఞ్ ప్రత్యయము. (భిక్షాది గణములో 'యువతీ' శబ్దములేదు యువతి అను తి ప్రత్యయాంతమే కలదు) విభక్తిలోపము యువతీ + అఞ్, పుంవద్భావము (యువత్ + ఈ, పుంవద్భావముచే 'ఈ' ప్రత్యయము అదృశ్యమగును) యువత్+అఞ్, ఆదివృద్ధి, యౌవత్ + అ = యౌవత + సు=యౌవతమ్.

పుంలింగరూపములోని భేదమునుబట్టి (యువన్, యువత్) ఈరెండురూపము లేర్పడును.

భిక్షాదిగణము : భిక్షా గర్భిణీ క్షేత్ర కరీష అఙ్కార (అఙ్గార) చర్మిన్ (చర్మన్) ధర్మిన్ సహస్ర యువతి పదాతి పద్ధతి అథర్వన్ దక్షిణా (భూతవిషయ శ్రోత్ర). ఇతి భిక్షాదిః

సూ : గ్రామజనబన్ధుభ్యస్తల్ 4-2-43.

వృ : తలన్తం స్త్రియామ్. గ్రామతా, జనతా, బన్ధుతా.

ప వి : గ్రామజన బన్ధుభ్యః (5-3) తల్ (1-1).

అను : తస్య (6-1) సమూహః (1-1) సమర్థానాం ప్రథమాద్వా: తద్ధితః, ప్రత్యయః

అర్థ : గ్రామ, జన, బంధు అను శబ్దములకు 'వానిసమూహము' అనునర్థమున 'తల్' ప్రత్యయము చేరును. తల్ ప్రత్యయాంతము స్త్రీలింగమగును. ఉదా: గ్రామతా, జనతా, బన్ధుతా.

వివ : 'గ్రామాదులసమూహము అనునర్థమున' షష్ఠ్యంతములగు గ్రామ, జన, బంధు అను పదములకు పరముగా 'తల్' అను ప్రత్యయము చేరును ఇందు లకారమిత్తు 'తలన్తం స్త్రియామ్' అను లింగానుశాసనసూత్రమువలన 'తల్' ప్రత్యయము అంతమునఁగల శబ్దములు స్త్రీలింగములగును. వానికి స్త్రీత్వమున 'టాప్' అను ప్రత్యయము చేరునని భావము.

ఉదా : గ్రామాణాం సమూహః - గ్రామముల సమూహము. గ్రామ + ఆమ్ + తల్, విభక్తిలోపము గ్రామ + త(ల్) గ్రామత, స్త్రీత్వమున టాప్ ప్రత్యయము (అజాద్యతష్టాప్), గ్రామత + టాప్ (టకారపకారములిత్తులు) గ్రామత + అ, సవర్ణదీర్ఘము గ్రామతా + సు = గ్రామతా.

ఇట్లే జనానాం సమూహః, జనముల సమూహము, జన + ఆమ్, తల్, జనతా. బన్ధూనాం సమూహః, బంధు + ఆమ్, తల్, బన్ధుతా (బంధువుల సమూహము.)

అవ : పై సూత్రమున కనుబంధముగా నొకవార్తికము చెప్పఁబడుచున్నది.

వా॥ గజసహాయాభ్యాం చేతి వక్తవ్యమ్ (2721).

వృ : గజతా, సహాయతా.

ప. వి : గజసహాయాభ్యామ్ (5-2) చ (అవ్య) ఇతి (అవ్య) వక్తవ్యమ్ (1-1).

అర్థ : గజ, సహాయశబ్దములకును, సమూహార్థమున 'తల్' ప్రత్యయము చెప్పనగును, ఉదా : గజతా, సహాయతా.

వివ : సూత్రములో ఉన్న మూఁడు శబ్దములకే కాక గజ, సహాయ అను వాని షష్ఠ్యంతరూపములకును, 'వానిసమూహము' అనునర్థమున 'తల్' ప్రత్యయము వచ్చునని వార్తిక తాత్పర్యము.

ఉదా : గజానాం సమూహః – గజములసమూహము. గజ+ఆమ్, తల్ గజ+త, గజత+టాప్, గజతా+సు=గజతా.

సహాయానాం సమూహః – సహాయులసమూహము. సహాయ+ఆమ్, తల్, సహాయత+టాప్, సహాయతా+సు=సహాయతా.

వా॥ అహ్నః ఖః క్రతౌ 2722.

వృ : అహీనః.

ప. వి . అహ్నః (5-1) ఖః (1-1) క్రతౌ (7-1).

అర్థ : క్రత్వర్థమున వర్తమానమగు 'అహన్' శబ్దమునకు సమూహార్థమున ఖ ప్రత్యయమగును. ఉదా : అహీనః.

వివ : యజ్ఞసంబంధమైన అహస్సులసమూహము అనునర్థమున షష్ఠ్యంతమగు 'అహన్' శబ్దమునకు, ఖప్రత్యయము వచ్చును, ఇట్టి అహస్సులను పౌత్యాహస్సులందురు. ఇందు ఖకారమునకు ఆయనేయీనీత్యాదిసూత్రముచే 'ఈన్' ఆదేశమగును. (ఖ్+అ=ఈన్+అ=ఈన).

ఉదా : అహ్నాం సమూహః – పౌత్యాహస్సులసమూహము, అహన్ + ఆమ్, ఖ, విభక్తిలోపము అహన్ + ఖ, ఈనాదేశము, అహన్ + ఈన్ + అ 'అహన్+ఈన', 'అహ్నష్టఖోరేవ' అనుసూత్రముచే టిలోపము (అహన్ శబ్దమునకు, ట, ఖ ప్రత్యయములు పరములగునపుడే టిలోపము వచ్చును) అహ్+ఈన=అహీన+సు=అహీనః.

సూ : అచిత్తహస్తిధేనోష్ఠక్ 4-2-47

ప వి : అచిత్తహస్తిధేనోః (5-1) ఠక్ (1-1).

అను : తస్య (6-1) సమూహః (1-1) సమర్థానాం ప్రథమాద్వా: తద్ధితః, ప్రత్యయః

అర్థ : అప్రాణివాచకశబ్దములకును, హస్తి, ధేనుశబ్దములకును, 'వాని సమూహము' అనునర్థమున 'ఠక్' ప్రత్యయము వచ్చును.

వివ : అచిత్తములనగా చిత్తములేనివి. అనగా అప్రాణులు. అప్రాణి వాచకములయొక్కయు, హస్తిధేనుశబ్దములయొక్కయు షష్ఠ్యంతరూపములకు, వాని సమూహము అనునర్థమున 'ఠక్' ప్రత్యయము వచ్చును. ఇందు కకారమిత్తు. కావున 'కితిచ' అనుసూత్రముచే ఆదివృద్ధియగును.

ఉదా : సక్తూనాం సమూహః - సక్తువుల (పేలపిండియొక్క) సమూహము, సక్తువు అప్రాణివాచకము. సక్తు + ఆమ్ + ఠక్, ప్రాతిపదిక సంజ్ఞయు విభక్తి లోపమును రాఁగా సక్తు + ఠక్ అని యగును ఆదివృద్ధి, సాక్తు + ఠ.

ఆవ : అంగ సంజ్ఞకలదానికి పరముగా నున్న 'ఠ' అనుదానికి 'ఇక' ఆదేశ మగునని 'ఠస్యేకః' అనుసూత్రము చెప్పినది. దానివలన పై ఉదాహరణమున 'ఇకాదేశము' ప్రాప్తించుచుండగా నీక్రింది సూత్రముచే అపవాదము చెప్పఁబడు చున్నది.

సూ : ఇసుసుక్తాన్తాత్కః 7-3-50.

వృ : ఇస్, ఉస్, ఉక్ త్ ఏతదన్తాత్ పరస్య ఠస్య కః. సాక్తుకమ్, హాస్తికమ్, ధైనుకమ్.

ప. వి ; ఇసుసుక్తాన్తాత్ (5-1) కః (1-1)

అను : అఙ్గస్య (6-1) ఠస్య (6-1)

అర్థ : ఇస్, ఉస్, ఉక్, త్ అనునవి అంతమునఁగల అంగమునకు పరముగా నున్న 'ఠ' అనుదానికి 'క' అనునాదేశమగును ఉదా : సాక్తుకమ్, ధైనుకమ్.

వివ : ఇది 'ఠస్యేకః' అనుసూత్రమున కపవాదము ఇస్, ఉస్ అనువర్ణ సముదాయములును, ఉక్ ప్రత్యాహారములోని ఉ, ఋ, ఌ అనునవియు, త్ అను వర్ణమును అంతమునఁగల అంగమునకు పరముగానున్న 'ఠ' అనుదానికి 'క' అను నాదేశమగును.

ఉదా : 'సాక్తు + ఠ' (ఇంతవఱకు ప్రక్రియ పైసూత్రవివరణమునఁ జూపఁబడినది). సాక్తు + క = సాక్తుక + సు = సాక్తుకమ్. (సక్తుశబ్దము ఉకారాంతము).

ఇట్లే 'ధేనూనాం సమూహః' - ధేనువుల సమూహము-ధేను + ఆమ్, ఠక్, విభక్తి లోపము, ఆదివృద్ధి (ఏ > ఐ) ధైను + ఠ, కాదేశము, ధైనుక + సు= ధైనుకమ్.

హస్తినాం సమూహః - 'ఏనుఁగులసమూహము' - హస్తిన్ + ఆమ్, ఠక్, విభక్తిలోపము. హస్తిన్ + ఠక్, ఆదివృద్ధి, హాస్తిన్ + ఠ, ఇది ఇసాద్యంతము కాదు కావున 'క' ఆదేశమురాదు. 'ఠస్యేకః' అనుసూత్రముచే ఇకాదేశమే అగును.

'హస్తిన్ + ఠక్, నస్తద్ధితే టిలోపము, హస్త్ + (ఇన్) ఇక = హస్తిక + సు = హాస్తికమ్.

అవ : సమూహార్థక ప్రత్యయములు పూర్తి అయినవి. అర్థాంతరమున ప్రత్యయములు విధింపబడుచున్నవి.

సూ : తదధీతే తద్వేద 4-2-59.

ప వి : తత్ (2-1) అధీతే (క్రియాపదము) తత్ (2-1) వేద (క్రియాపదము).

అను : సమర్థానాం ప్రథమాద్వా, తద్ధితాః, ప్రత్యయః, అణ్ (1-1).

అర్థ : దానినధ్యయనము చేయువాఁడు, దానినెఱుఁగువాఁడు, అనునర్థమున సమర్థద్వితీయాంతపదములకు 'అణ్' ప్రత్యయమగును.

వివ : సూత్రమునందలి 'తత్' అను - రెండుపదములు ద్వితీయాంతమునకు చిహ్నములు. ఆయాశాస్త్రాదులను బేర్కొని వాని నధ్యయనము చేయువాఁడు, వాని యర్థాదుల నెఱిఁగినవాఁడు అనుఅర్థము చెప్పవలసినపుడు, శాస్త్రాదివాచక ద్వితీయాంతములకు 'అణ్' ప్రత్యయము చేరును. అధ్యయనము, వేదనము అను రెండంశము లీసూత్రమున గ్రహింపఁబడినవి. ఇవి రెండును ఏకార్థములుకావా? వీనికి భేదమేమి? భేదము లేనిచో రెంటిని గ్రహింపనేల? అనుశంకలు కలుగ వచ్చును వీనికి భేదము గలదు. గురువు చెప్పిన దానిని వెంట నుచ్చరించుచు వేదాదులను పఠించుట అధ్యయనము. విషయవిమర్శనపూర్వకమైన అర్థజ్ఞానమును పొందుట వేదనము. వేదములను చాలమంది వల్లెవేయుదురు. దానిపేరధ్యయనము భాష్యములను విమర్శించి అర్థజ్ఞానమును పొందుట వేదనము. ఈ రెంటిలో ఏది చెప్పఁబడవలసినను శాస్త్రాది నామములను దెలుపు శబ్దముల ద్వితీయాంతములకు ప్రకృతసూత్రముచే 'అణ్' ప్రత్యయమును, వక్ష్యమాణసూత్రములచే ఆయా అపవాద ప్రత్యయములును వచ్చును.

ఉదా : వ్యాకరణమధీతే వేదవా, వ్యాకరణమునధ్యయనము చేయువాఁడు లేక ఎఱుఁగువాఁడు. ఇందు వ్యాకరణ మొకవిద్య. సూత్రపాఠాదికమును వల్లె వేసెను అనిగాని, అర్థజ్ఞానమును పొందెను అనిగాని దీనికర్థము. వ్యాకరణ + అమ్ + అణ్, ప్రాతిపదిక సంజ్ఞ కలిగి విభక్తి లోపించును. వ్యాకరణ + అణ్.

అవ : పై స్థితిలో ఆదివృద్ధి రావలసియుండగా నపవాదముగా కార్యాంతరము విధింపఁబడుచున్నది.

సూ : న య్వాభ్యాం పదాన్తాభ్యాం పూర్వౌతు తాభ్యామైచ్ 7-3-3.

వృ : పదాన్తాభ్యాం యకారవకారాభ్యాం పరస్య న వృద్ధిః. కింతు తాభ్యాం పూర్వౌ క్రమాదైజావాగమౌ స్తః. వ్యాకరణమధీతే వేద వా వైయాకరణః

ప వి : న (అవ్య) య్వాభ్యామ్ (5-2) పదాన్తాభ్యామ్ (5-2) పూర్వౌ (1-2) తు (అవ్య) తాభ్యామ్ (5-3) ఐచ్ (1-1)

అను : తద్ధితేషు (7-3) అచామ్ (6-3) ఆదేః (6-1) ఞ్ణితి (7-1) కితి (7-1) వృద్ధిః (1-1) అచః (6-1).

అర్థ : పదాంతములైన యకారవకారములకు పరముగా నున్న అచ్చునకు, వృద్ధిరాదు. కాని వానికి పూర్వమున క్రమముగా ఐ ఔ అనునవి యాగమము లగును. ఉదా : వైయాకరణః.

వివ : ఇది తద్ధితేష్వచామాదేః, కితిచ అనుసూత్రముల కపవాదము. కావున ఆరెండు సూత్రములచే ప్రాప్తమగు వృద్ధి నిది కొన్ని సందర్భములలో వారించుచున్నది. ఏ యచ్చునకు ఆ సూత్రములచే వృద్ధిప్రాప్తమగునో ఆ అచ్చు, పదము యొక్క అంతముననున్న యకారవకారములకు పరముగానుండినదగునెడల దానికి వృద్ధిరాదు కాని ఆ యకారవకారములకు పూర్వమున ఐఔవర్ణము లాగమము లగును. అనగా యకారమునకు పూర్వమున ఐకారమును, వకారమునకు పూర్వమున ఔకారమును ఆగమముగా వచ్చునని భావము. సూత్రమున 'పూర్వౌ' అనుపదము 'పూర్వావయవములు' అనునర్థమున ప్రయోగింపఁబడి యుండుటచే ఆగమముగా వగు నను నర్థము లభ్యమైనది.

ఉదా : వ్యాకరణ + అణ్, ఇచట ఆద్యచ్చునకు వృద్ధిరావలసియున్నది అది యీ సూత్రముచే నిషేధింపఁబడినది. ఇందు పదాంతమైన యకారముగలదా? అని శంక కలుగవచ్చును. 'వి + ఆ, కరణ' అనునవి యీ పదముయొక్క అవయవములు. ఇందు 'వి' అనునుపసర్గముయొక్క ఇకారము పదాంతము. 'ఇకోయణచి' అను సూత్రముచే దానికాదేశమైనయకారము కూడ పదాంతమేయగును. కావున

'వ్య' అనుదానికి పరముగానున్న అకారము పదాంతయకారమునకు పరముగా నున్నదియే యగును దాని కీసూత్రముచే వృద్ధినిషేధము కలుగును. పిదప యకారమునకు పూర్వమున ఐకారమాగమముగా వచ్చును. వ్ + ఐయ్ ఆకరణ + అ (ణ్). వైయాకరణ + అ, యస్యేతిచ, అకారలోపము, వైయాకరణ్ + అ=వైయాకరణ + సు = వైయాకరణః. (ఈ సూత్రములేనిచో 'వ్యాకరణః' అనురూపమే యీ యర్థమున నేర్పడవలసి యుండును).

సూ : క్రమాదిభ్యో వున్ 4-2-61.

వృ : క్రమకః, పదకః, శిక్షకః, మీమాంసకః.

ప. వి : క్రమాదిభ్యః (5-3) వున్ (1-1).

అను : తత్ (2-1) అధీతే (క్రి. ప) తత్ (2-1) వేద (క్రి. ప) సమర్థానాం ప్రథమాద్వా, తద్ధితః; ప్రత్యయః.

అర్థ : క్రమాది శబ్దములకు దానినిఅధ్యయనముచేయువాఁడు, దాని నెఱిఁగిన వాఁడు అను నర్థమున 'వున్' ప్రత్యయము వచ్చును ఉదా : క్రమకః మొ॥వి

వివ : క్రమము, పదము అనునవి వేదాధ్యయనములోని పద్ధతులు. శిక్షా, మీమాంసలు శాస్త్రములు వీనితోపాటు 'సామన్' శబ్దము కూడ నీగణమునఁ గలదు. అదియొకవేదము వీని నధ్యయనముచేయుట, అర్థము నెఱుఁగుట అను నర్థములందు, ద్వితీయాంతములగు నీక్రమాదులకు 'వున్' అను తద్ధిత ప్రత్యయము చేరును. ఇందు నకార మిత్తు 'వు' అనుదానికి 'యువోరనాకౌ' అనుసూత్రముచే 'అక' ఆదేశమగును ఇందాదివృద్ధికి నిమిత్తములేదు.

ఉదా : క్రమ మధీతే వేద వా. క్రమము నధ్యయనము చేయువాఁడు, లేక తదర్థము నెఱుఁగువాఁడు క్రమ + అమ్, వున్, విభక్తిలోపము, 'అక' ఆదేశము. క్రమ + అక, యస్యేతిచ అకారలోపము, క్రమ్ + అక = క్రమక + సు= క్రమకః.

ఇట్లే పదమధీతే వేదవా, పద + అమ్, వున్, పద + అక, యస్యేతిచ పద్ + అక = పదక + సు = పదకః.

శిక్షామధీతే వేదవా, శిక్షా + అమ్ + వున్, శిక్షా+అక, యస్యేతిచ ఆకార లోపము, శిక్ష్ + అక = శిక్షక + సు=శిక్షకః.

మీమాంసామధీతే వేదవా, మీమాంసా + అమ్, వున్, మీమాంసా + అక, అకారలోపము, మీమాంస్ + అక = మీమాంసక + సు = మీమాంసకః.

క్రమాదిగణము : క్రమ పద శిక్ష మీమాంసా సామన్ ఇతి క్రమాదిః.

ఇంతవఱకు దీనికి రక్తాద్యర్థిక ప్రకరణముగా నొక విభాగము గలదు. ఇటుపై చెప్పఁబడునవి చాతురర్థిక ప్రత్యయములు.

అవ : చాతురర్థిక ప్రకరణము అనగా నాలుగర్థములందు విధింపఁబడు ప్రత్యయములకు సంబంధించిన ప్రకరణమని యర్థము ఆ నాలుగర్థములును ముందు వివరింపఁబడుచున్నవి.

సూ : తదస్మిన్నస్తీతి దేశే తన్నామ్ని 4-2-67.

వృ : ఉదుమ్బరా స్సన్త్యస్మిన్ దేశే ఔదుమ్బరః.

ప వి : తత్ (1-1) అస్మిన్ (7-1) అస్తి (క్రి. ప) ఇతి (అవ్య) దేశే (7-1) తన్నామ్ని (7-1)

అను : సమర్థానాంప్రథమాద్వా. తద్ధితః; ప్రత్యయః, అణ్ (1-1).

అర్థ : 'అది యిందుఁగలదు' అనునర్థమున, ప్రత్యయాంతముచే దేశము యొక్క నామము తెలియఁబడునపుడు, అణ్ ప్రత్యయము వచ్చును ఉదా : ఉదుంబరములు (ఒకవిధపుగు వృక్షములు) గలదేశము-ఔదుంబరః.

వివ : సూత్రమునందలి 'తత్' పదము ప్రథమాంతమునకు చిహ్నము. 'అవి యిందుఁగలవు' అనునర్థమును దెలుపును. ఏవికలవనిచెప్పుదుమో వానిని వచించు శబ్దముల ప్రథమాంతరూపములకు అణ్ ప్రత్యయము వచ్చును. ఆ ప్రత్యయము చేరిన శబ్దరూపము ఆదేశమునకు నామమగునపుడే యీ ప్రత్యయము చేరును.

ఉదా : ఉదుమ్బరాః సన్త్యస్మిన్‌దేశే, ఉదుంబరములు గల దేశము. ఇందు ప్రథమోచ్చరితమైన ప్రథమాంతపదము 'ఉదుమ్బరాః' అనునది దానికి పరముగా, అవి గలదేశముయొక్క నామమును తెలుపుచు 'అణ్' ప్రత్యయము చేరును. ఉదుమ్బర + జస్, అణ్, ప్రాతిపదికసంజ్ఞ, విభక్తిలోపము, ఆదివృద్ధి (ఉ > ఔ) ఔదుమ్బర + అ, యస్యేతిచ, ఔదుమ్బర్ + అ = ఔదుమ్బర+సు=ఔదుమ్బరః.

ఉదుంబరవృక్షములు గలదేశమున కిదిపేరు. ఇది వక్ష్యమాణమతుప్ ప్రత్యయమున కపవాదము. ఈ సూత్రమునఁ జెప్పఁబడిన అర్థము నాలుగర్థములలో మొదటిది

అవ : రెండవయర్థమున ప్రత్యయము విధింపఁబడుచున్నది.

సూ : తేన నిర్వృత్తమ్. 4-2-68.

వృ : కుశామ్బేన నిర్వృత్తానగరీ కౌశామ్బీ.

ప. వి : తేన (3-1) నిర్వృత్తమ్ (1-1).

అను : సమర్థానాం ప్రథమాద్వా; తద్ధితః; ప్రత్యయః; అణ్ (1-1) దేశే (7-1) తన్నామ్ని (7-1)

అర్థ : 'అతనిచే నేర్పఱుపఁబడినది' అనునర్థమున ఆ పేరుగలదేశము తెలియఁబడునపుడు సమర్థమగు తృతీయాంతపదమునకు అణ్ ప్రత్యయము వచ్చును. ఉదా : కుశాంబునిచే చేయఁబడిననగరి-'కౌశామ్బీ'

వివ : తేన అనునది ఇచట కర్తృవాచక తృతీయాంతమునకు చిహ్నము ఒకదేశవిశేషము ఒకవ్యక్తిచే నేర్పడినదైనచో, కర్తయగు ఆ వ్యక్తిని తెలుపు తృతీయాంతపదమునకు, 'అతనిచే చేయఁబడినది' అను నర్థమున 'అణ్' ప్రత్యయము వచ్చును. ప్రత్యయాంతము ఆదేశమునకు నామమైనపుడే యీ ప్రత్యయము వచ్చును.

ఉదా : కుశామ్బేన నిర్వృత్తానగరీ - కుశాంబునిచే నిర్మింపఁబడిన నగరి. ఇందు సమర్థములగు పదములలో మొదట ఉచ్చరింపఁబడినది 'కుశామ్బేన' అనునది. అది తృతీయాంతము అతనిచే నేర్పఱుపఁబడిననగరి అను నర్థమును తెలుపుచు దానికి 'అణ్' ప్రత్యయమగును. కుశామ్బ + టా, అణ్, విభక్తి లోపము, ఆదివృద్ధి, (ఉ>ఔ) కౌశామ్బ + అ, 'యస్యేతిచ' అకారలోపము, కౌశామ్బ్+అ='కౌశామ్బ' ఇది 'నగరీ' అను స్త్రీలింగశబ్దమునకు విశేషణమగుటచే ఇదియు స్త్రీలింగము కావలయును. 'టిడ్ఢాణఞ్....' ఇత్యాదివక్ష్యమాణసూత్రముచే అణ్ ప్రత్యయాంతములకు స్త్రీత్వమున ఙీప్' ప్రత్యయము వచ్చును. కౌశామ్బ + ఙీప్ (ఙకారపకారములిత్తులు) యస్యేతిచ, అకారలోపము, కౌశామ్బ్ + ఈ = కౌశామ్బీ + సు=కౌశామ్బీ.

'అతనిచే నిర్మింపఁబడినది' అనునది రెండవయర్థము.

అప : మూఁడవ అర్థము.

సూ : తస్య నివాసః 4-2-69.

వృ : శిబీనాం నివాసో దేశః శైబః.

ప వి : తస్య (6-1) నివాసః (1-1)

అను : సమర్థానాం ప్రథమాద్వా, తద్ధితః, ప్రత్యయః, అణ్ దేశే (7-1) తన్నామ్ని (7-1)

అర్థ : 'ఆతని నివాసము' అనునర్థమున షష్ఠ్యంతపదమునకు 'అణ్' ప్రత్యయము వచ్చును ఉదా : శిబుల నివాసమైన దేశము-శైబః

వివ : 'వీరికి ఇది నివాసభూమి' అనునర్థమున ఎవరికి నివాసభూమియో వారిని తెలుపు పదముయొక్క షష్ఠ్యంతరూపమునకు పరముగా అణ్ ప్రత్యయము వచ్చును ప్రత్యయాంతముచే దేశముయొక్క నామము తెలుపఁబడవలయును

ఉదా : శిబీనాం నివాసో దేశః - ఇందు సమర్థములలో మొదటిది 'శిబీనామ్' అను షష్ఠ్యంతపదము 'వారియొక్క నివాసదేశము' అనునర్థమున అణ్ ప్రత్యయము దానికి చేరును శిబి + ఆమ్, అణ్, విభక్తిలోపము ఆదివృద్ధి (ఇ > ఐ) శైబి + అ, యస్యేతిచ - ఇకారలోపము, శైబ్ + అ = శైబః - ఇది శిబులు నివసించుదేశమునకు నామము

మూఁడవ అర్థమీసూత్రమునఁ దెలుపఁబడినది

అప : నాలుగవ అర్థము

సూ : అదూరభవశ్చ 4-2-70.

వృ విదిశాయా అదూరభవం వైదిశమ్.

ప. వి : అదూరభవః (1-1) చ (అవ్య)

అను : సమర్థానాం ప్రథమాద్వా; తద్ధితః, ప్రత్యయః, అణ్, తస్య (6-1) దేశే (7-1) తన్నామ్ని (7-1).

అర్థ : 'దానికి అదూరభవము' అనునర్థమున షష్ఠ్యంతపదమునకు, తన్నామకదేశము తెలియఁబడినపుడు, అణ్ ప్రత్యయము వచ్చును. ఉదా : విదిశకు అదూరభవము, వైదిశమ్.

వివ: దూరభవమనగా దూరమున నున్నది అదికానిది అదూరభవము. అనగా సమీపమున నున్నదనిభావము దేనికి సమీపమునన్నున్న దేశాదికము చెప్పఁబడునో, దానిని చెప్పశబ్దముయొక్క షష్ఠ్యంతరూపమునకు పరముగా అణ్ ప్రత్యయము వచ్చును. ప్రత్యయాంతముచే దేశనామము తెలుపఁబడవలయును.

ఉదా : విదిశాయా అదూరభవం నగరమ్ - విదిశకు దగ్గఱగానున్న నగరము ఇందు ప్రథమోచ్చరితమైన 'విదిశాయాః' అనుషష్ఠ్యంత పదమునకు అణ్ ప్రత్యయము. విదిశా + ఙస్, అణ్, విభక్తి లోపము, విదిశా + అణ్, ఆది వృద్ధి, (ఇ > ఐ) వైదిశా + అ, యస్యేతిచ - ఆకారలోపము వైదిశ్ + అ = వైదిశ + సు = వైదిశమ్ - ఇది విదిశకు దగ్గఱగానున్న నగరమునకు పేరు.

ఇది నాలుగవ యర్థము. 'తన్నామకదేశము వాచ్యమగుట' అను సామాన్య లక్షణముచే నీనాలుగర్థములయందు వచ్చు ప్రత్యయములకు చాతురర్థిక సంజ్ఞ కలిగినది

అవ . ఈ చాతురర్థిక ప్రత్యయమునకు రెండౌకయెడ అదర్శనము విధింపఁ బడుచున్నది.

సూ : జనపదే లుప్ 4-2-81.

వృ : జనపదే వాచ్యే చాతురర్థికస్య లుప్.

ప వి : జనపదే (7-1) లుప్ (1-1)

అర్థ : జనపదము వాచ్యమగునపుడు చాతురర్థిక ప్రత్యయమునకు లుప్పు వచ్చును

వివ : జనపదమనగా కొన్నిగ్రామముల సముదాయము. 'అది యిందుఁ గలదు', 'అతనిచే చేయఁబడినది', 'అతనికినివాసము', 'దానికదూరభవము' అను నాలుగర్థములలో విధింపఁబడిన ప్రత్యయములకు చాతురర్థిక ప్రత్యయములనిపేరు. చాతురర్థిక ప్రత్యయాంతముచేత వాచ్యమగునది జనపదమైనచో ఆప్రత్యయమునకు లుప్పువచ్చును ప్రత్యయముయొక్క అదర్శనమునకు 'లుప్' అను సంజ్ఞ వ్యవహరింపఁబడును (ప్రత్యయస్యలుక్శ్లులుపః).

అవ : పైసూత్రమునకు ఉదాహరణము చూపుటకై 'లుప్' రూపమైన అదర్శనముయొక్క ప్రత్యేకత తెలుపఁబడుచున్నది.

సూ : లుపి యు క్తవద్వ్యక్తి వచనే 1-2-51.

వృ : లుపి సతి ప్రకృతివల్లిఙ్గవచనే స్తః. పఞ్చాలానాం నివాసో జనపదః పఞ్చాలాః; కురవః, అఙ్గాః, వఙ్గాః, కలిఙ్గాః.

ప. వి : లుపి (7-1) యుక్తవత్ (అవ్య) వ్యక్తి వచనే (1-2)

అర్థ : లుప్పు వచ్చినప్పుడు ప్రకృతికి వలె లింగవచనము లగును. ఉదా : పఞ్చాలాః, ఇత్యాది.

వివ : యుక్తమనగా శబ్దమనియు, వ్యక్తి అనగా లింగమనియు, వచన మనగా సంఖ్యయనియు ప్రాచీనులవ్యవహారము లుప్ అను సంజ్ఞతో విధింపఁ బడిన అదర్శనము (ఉన్నది కన్పడకుండుట) జరిగినప్పుడు, ప్రత్యయము దేనికి విధింతురో దాని లింగవచనములే ప్రత్యయాదర్శనము కలిగినదానికిని అగును ఇది యొక పరిభాష. అదర్శనమును జెప్పుటకు నాలుగు సంజ్ఞలు కలవు (1) లోపము (2) లుక్ (3) శ్లు (4) లుప్ సూత్రములలో వీనిప్రయోగ మున్నపుడు అదర్శ నము కలుగుట అనునది సామాన్యలక్షణమే యైనను, వీనికి విడివిడిగా ప్రయోజ నాంతరములు గలవు అందు లుప్పుయొక్క ప్రయోజన మీసూత్రముచే చెప్పఁ బడినది

ఉదా పఞ్చాలానాం నివాసో జనపదః - పంచాలురయొక్క నివాసమైన జనపదము అనునర్థమున 'పఞ్చాల + ఆమ్' అను షష్ఠీ బహువచనాంతమునకు 'తస్యనివాసః' అనుసూత్రముచే 'అణ్' ప్రత్యయము వచ్చును పఞ్చాల + ఆమ్, అణ్, ప్రాతిపదిక సంజ్ఞచే విభక్తిప్రత్యయమగు 'ఆమ్' అనుదానికి లుక్కు వచ్చును. 'జనపదేలుప్' అనుసూత్రముచే ఇచట జనపదము వాచ్యమగు చున్నది కావున చాతురర్థిక ప్రత్యయమగు 'అణ్' అనుదానికి లుప్పువచ్చును 'పఞ్చాల'. ఇప్పుడు ఇది 'జనపదః' అను ఏకత్వసంఖ్యా విశిష్టమగు ద్రవ్యమునే తెలుపునదైనను, ప్రకృత పరిభాషచే ప్రత్యయవిధిఁ పూర్వము 'పఞ్చాలానామ్' అనునది బహువచనాంతమగుటచుబట్టి-యిదియు బహువచనాంతమగును ప్రత్యయ విధికి పూర్వమునను, లుప్పు వచ్చినతర్వాతను ఇది పుంలింగముగనే యుండును. పఞ్చాల + జస్ = పఞ్చాలాః

ఇట్లే కురూణాం నివాసో జనపదః - కురువులనివాసమైన జనపదము' కురు + ఆమ్ + అణ్, విభక్తిలోపము, ప్రత్యయలోపము (జనపదేలుప్) కురు + జస్ = కురవః.

అఙ్గానాం నివాసో జనపదః - అంగులనివాసమైనదేశము అఙ్గ + ఆమ్, + అణ్, అఙ్గ + జస్ = అఙ్గాః

వఙ్గానాం నివాసో జనపదః - వఙ్గ + ఆమ్ + అణ్, వఙ్గ + జస్ = వఙ్గాః

కలిఙ్గానాం నివాసోజనపదః - కలిఙ్గ + ఆమ్ + అణ్, కలిఙ్గ + జస్ = కలిఙ్గాః

వి॥ పై యుదాహరణములన్నింటను 'జనపదేలుప్' అను సూత్రముచే చాతురర్థిక ప్రత్యయమునకు లుప్పువచ్చినపిదప ప్రకృతులగు అంగాది శబ్దములు బహువచనాంతములగుటచే ఏకత్వసంఖ్యాబోధకమైన 'అంగ'మున్నగునవి బహు వచనాంతములైనవి అదియ యిందువిశేషము

సూ : వరణాదిభ్యశ్చ 4-2-82.

వృ : అజనపదార్థ ఆరమ్భః. వరణానా మదూరభవం నగరం వరణాః.

ప వి : వరణాదిభ్యః (5-3) చ (అవ్య).

అను : లుప్ (1-1).

అర్థ : వరణాదిశబ్దములకు పరముగానున్న చాతురర్థిక ప్రత్యయమునకును లుప్పు వచ్చును. జనపదము కాక తక్కిన యర్థము వాచ్యమగునపుడు లుప్పు వచ్చుట కీసూత్రము ఉదా : వరణానామదూరభవం నగరం వరణాః.

వివ : వరణాది శబ్దములకు వచ్చిన చాతురర్థికప్రత్యయముచే జనపదము వాచ్యమగునపుడు లుప్పు వచ్చుటకు ఈ సూత్ర మక్కరలేదు. 'జనపదేలుప్' అనుసూత్రముచేతనే అగును. మఱల నీసూత్రముచే లుప్పు విధించుటవలన జన పదముకాక తక్కిన యర్థము గమ్యమానమగునపుడు లుప్పు వచ్చునని చెప్పుట అయినది అట్టి యెడ వరణాదిశబ్దములకు చేరిన చాతురర్థికప్రత్యయమునకు లుప్పు వచ్చును.

ఉదా : వరణానామదూరభవం నగరమ్ - వరణ యనునదికి సమీపముగా నున్న నగరము - (వరణానది కాశికి ఉత్తరమునఁగలదు. బహువచనమిట పూజార్థ మున నైనది). వరణా + ఆమ్ + అణ్ (వరణాశబ్దము స్త్రీ లింగము) విభక్తి లోపము. ఇచట అదూరభవమైన నగరము ప్రత్యయాంతముచే చెప్పఁబడుచున్నది.

కావున ప్రకృతసూత్రముచే 'అణ్' ప్రత్యయమున కదర్శనము. 'వరణా' - ఇది 'నగరమ్' అనునపుంసకలింగశబ్దమును చెప్పునదియైనను, 'లుపి యుక్తవద్వ్యక్తి వచనే' అను సూత్రము ననుసరించి ప్రకృతియగు 'వరణా'యను నదీవాచక శబ్దమును బట్టియే స్త్రీలింగమును, బహువచనాంతకము నగును వరణా + జస్ = వరణాః.

వరణాదిగణము : వరణా శృఙ్గీ శాల్మలి శుణ్డీ శయాణ్డీ పర్ణీ తామ్రపర్ణీ గోద ఆలిఙ్గ్యాయన జాలపదీ (జానపదీ) జమ్బూ పుష్కర చమ్పా పమ్పా వల్గు ఉజ్జయినీ గయా మథురా తక్షశిలా ఉరసా గోమతీ వలభీ - ఇతి వరణాదిః

సూ : కుముదనడవేతసేభ్యో డ్మతుప్ 4-2-87.

ప. వి. కుముదనడవేతసేభ్యః (5-3) డ్మతుప్.

అను : సమర్థానాం ప్రథమాద్వా, తద్ధితః, ప్రత్యయః

అర్థ : కుముద, నడ, వేతస అనువానికి 'అవిగలవి' అనునర్థమున డ్మతుప్ ప్రత్యయము వచ్చును.

వివ : కుముద, నడ, వేతస అనువాని ప్రథమాంతములకు, అవిగల దేశాదులను దెలుపుచు, డ్మతుప్ ప్రత్యయము వచ్చును ప్రకరణమునుబట్టి తదస్మిన్నస్తీత్యాదులగు నాలుగర్థములలో నీ ప్రత్యయము రావలసియున్నను, అవి అధికముగా గలదేశము' అనునర్థమునందు మాత్రమే యగునని భాష్యకారులు చెప్పియుండుటను బట్టి యాయర్థమునందే వచ్చును ఇందు డకారపకారములు ఇత్తులు (చుటూ, హలన్త్యమ్) ఉకారముచ్చారణార్థకము (డ్), మత్, (ఉ) (ప్). ప్రత్యయము డిత్తగుటవలన పూర్వమున నున్నశబ్దస్వరూపము యొక్క టిభాగమునకు లోపము వచ్చును. (టేః).

ఉదా : కుముదా అస్మిన్ సన్తీతికుముద్వాన్ - కుముదములు అధికముగా గలదేశము - కుముద + జస్ + డ్మతుప్, విభక్తిలోపము, కుముద + మత్ 'టేః' అనుసూత్రముచే టిలోపము 'కుముద్ + మత్'

అవ : పై దశలో క్రిందిసూత్రముచే మకారమునకు వకారాదేశము.

సూ : ఝయః 8-2-10.

వృ : ఝయన్తాన్మతోర్మస్య వః. కుముద్వాన్, నడ్వాన్.

ప. వి : ఝయః (5-1).

అను : మతోః (6-1) వః (1-1)

అర్థ : ఝ యంతమునకు పరముగానున్న 'మతుప్' ప్రత్యయమకారమునకు వకార మాదేశమగును. ఉదా : కుముద్వాన్, నడ్వాన్.

వివ : ఝయ్ ప్రత్యాహారమున అనునాసికములు కాక తక్కిన వర్గాక్షరములు గలవు. 'ఝయః' అనునది పంచమ్యంతము కావున 'తస్మాదిత్యుత్తరస్య' అను పరిభాషచే నిచట విధింపబడిన కార్యము 'ఝయ్' వర్ణమునకు పరముగా నున్నదాని కగును. ఇట పరముగా నుండునది మతుప్ ప్రత్యయము పరముగా నున్న 'మత్' అనుదానికి విధింపబడిన యీ వకారాదేశమను కార్యము 'ఆదేః పరస్య' అను పరిభాషచే తొలివర్ణమగు మకారమునకు వచ్చును. ఇట్లు ఝయ్ప్రత్యాహారములోని వర్ణములకు పరముగానున్న మతుప్ప్రత్యయమకారమునకు వకార మాదేశ మగునను నర్థము సిద్ధించును

ఉదా : కుముద్ + మత్ ఇటదకారము ఝయ్వర్ణము దానికి పరముగా నున్న ప్రత్యయములోని మకారమునకు వకారాదేశము. కుముద్ + వత్ = కుముద్వత్ + సు = కుముద్వాన్

నడః నడ్వస్మిన్నితినడ్వాన్ - (నడమనుఒకవిధమగుగడ్డికలది) నడ + జస్ + డ్మతుప్, నడ + మత్ టేః టి - లోపము, నడ్ + మత్, ఝయః' అను సూత్రముచే వకారాదేశము, నడ్వత్ + సు = నడ్వాన్.

ఆవ : వేతసాః సన్త్యస్మిన్ - వేతసములు గలది వేతస + డ్మతుప్ వేతస + మత్, 'టేః' అనుసూత్రముచే టిలోపము వేతస్ + మత్ ఇచట సకారము ఝయ్ప్రత్యాహారములోనిది కాదు కావున పూర్వసూత్రముచే వకారాదేశము రాకుండుటచే సూత్రాంతరము చెప్పబడుచున్నది

సూ : మాదుపధాయాశ్చమతోర్వోఽయవాదిభ్యః 8-2-9

వృ : మవర్ణాన్తాన్మవర్ణావర్ణోపధాచ్చ యవాదివర్జితాత్పరస్య మతో ర్మస్య వః, వేతస్వాన్.

ప. వి : మాత్ (5-1) ఉపధాయాః (5-1) చ (అవ్య) మతోః (6-1) వః (1-1) అయవాదిభ్యః (5-3).

అర్థ : మవర్ణముగాని అవర్ణముగాని అంతమునఁగలదానికివి, మవర్ణము గాని అవర్ణముగాని ఉపధగా గలదానికిని పరముగానున్న మతుప్ప్రత్యయమకారమునకు వకారమాదేశమగును ఉదా : వేతస్వాన్.

వివ : 'మాత్, ఉపధాయాః' అని విభజించుకొనగా నేర్పడిన మాత్ అను దానిని ఆవృత్తి చేసికొనవలయును ('మాత్, మాత్ అని రెండుపదములున్నట్లుగా భావింపవలయును). మొదటి 'మ' అనగా (మ్ + అ). మకారఅకారములు. దానికి పంచమిచేర్చగా 'మాత్' అగును పరముగా నున్న మతుప్ ప్రత్యయమును బట్టి పూర్వమునందు శబ్దస్వరూప మిట గ్రహింపఁబడగా దానికి 'మాత్' అనునది విశేషణ మగును తదంతవిధిచే 'మవర్ణము అవర్ణమునంతమునఁగల శబ్దస్వరూపమునకు పరముగానున్న' అనునర్థము లభించినది. ఆవృత్తమైన రెండవ 'మాత్' పదము 'ఉపధాయాః' అనుదానికి విశేషణము. కావున మవర్ణ అవర్ణములు ఉపధగాఁగల శబ్దస్వరూపములకు పరముగానున్న' అనునర్థము సిద్ధించును. ఇచట పరభాగమున నున్న మతుప్ ప్రత్యయమునకు విధింపఁబడు వకారాదేశము 'ఆదేఃపరస్య' అను పరిభాషను బట్టి 'మతుప్' అనుదాని తొలివర్ణమగు మకారస్థానమున వచ్చును. 'అయవాదిభ్యః' అనుపదమువలన యవాదిగణపఠిత శబ్దములకు పరముగానున్న మతుప్ ప్రత్యయమకారమునకు వకారాదేశము రాదు ఇట్లు యవాదిశబ్దములలో చేరనిదై, అవర్ణమవర్ణములంతమునఁగలదియు లేక, అవర్ణమవర్ణములు ఉపధగాఁ గలదియునగు శబ్దస్వరూపమునకు పరముగానున్న మతుప్ప్రత్యయ మకారమునకు వకారమాదేశమగునను నర్థము సిద్ధించును

ఉదా : పేతస్ + మత్, 'పేతస్' అనునది అకారోపధము. దానికి పరముగా నున్న మతుప్ప్రత్యయమకారమునకు వకారాదేశము రాఁగా, పేతస్ వత్‌- పేతస్వత్ + సు= పేతస్వాన్ అగును

యవాదిగణము : యవ దల్మి ఊర్మి (ఉర్మి) భూమి కృమి క్రుఞ్చా వశా ద్రాక్షా ధ్రాక్షా ధ్రజి (ధ్వజి) ధ్వజి నిజి సిజి సఞ్జి హరిత్ కకుత్ మరుత్ గరుత్ ఇక్షు ద్రు మధు - ఇతి యవాదిః. ఆకృతిగణః

సూ : నడశాదాడ్డ్వలచ్ 4-2-88.

వృ : నడ్వలః.

ప. వి : నడశాదాత్ (5-1) డ్వలచ్ (1-1)

అను : తత్ (1-1) అస్మిన్ (7-1) అస్తి (క్రియా.ప) సమర్థానాం ప్రథమాద్వా, తద్ధితః, ప్రత్యయః.

అర్థ : నడ, శాద అనువాని ప్రథమాంతములకు 'అవి యందుఁగలవు' అను నర్థమున 'డ్వలచ్' అను ప్రత్యయము వచ్చును. ఉదా : నడ్వలః.

వివ : 'నడాః సన్త్యస్మిన్', 'శాదాః సన్త్యస్మిన్' అనునర్థములందు 'నడాః 'శాదాః' అనుసమర్థ ప్రథమాంతములకు వరుసగా 'డ్వలచ్' ప్రత్యయముచేరును. ఇందు డకారచకారములిత్తులు (చుటూ, హలన్త్యమ్) 'వల' మిగులును ప్రత్యయము డిత్తగుటచే పూర్వముననున్నశబ్దము టిభాగమునకు లోపమువచ్చును (టేః).

ఉదా : నడ + జస్ + డ్వలచ్, విభక్తిలోపము (సుపోధాతు ప్రాతిపదికయోః) టిలోపము (టేః) నడ్ + వల = నడ్వల + సు=నడ్వలః.

నడశబ్దమునకు కుముదనడేత్యాది సూత్రముచే 'డ్మతుప్' ప్రత్యయము కూడ విధింపఁబడియుండుటవలన 'నడ్వాన్' అనురూపము కూడ నుండును

శాద + జస్, డ్వలచ్, విభక్తిలోపము, టిలోపము శాద్ + వల = శాద్వల + సు=శాద్వలః.

సూ : శిఖాయా వలచ్ 4-2-89.

వృ : శిఖావలః.

ప. వి : శిఖాయాః (5 1) వలచ్ (1-1)

అను : సమర్థానాం ప్రథమాద్వా; తద్ధితః; ప్రత్యయః; తప్ (1-1) అస్మిన్ (7-1) అస్తి (క్రి ప) ఇత్యాదులు

అర్థ : 'శిఖలిందుఁగలవు' 'శిఖలచే నిర్వృత్తమైనది' మున్నగు నర్థములందు ప్రథమాద్యంతమగు 'శిఖా' శబ్దమునకు 'వలచ్' ప్రత్యయము చేరును ఉదా : శిఖావలః

వివ : తదస్మిన్నస్తి, తేననిర్వృత్తమ్ మున్నగునర్థములందు, ప్రథమాంతము లేక తృతీయాంతము లేక షష్ఠ్యంతమునగు శిఖాశబ్దమునకు 'వలచ్' అను తద్ధిత ప్రత్యయము చేరును ఇందు చకారమిత్తు.

ఉదా : శిఖాః సన్త్యస్మిన్ - శిఖలుగలది, శిఖాభిః నిర్వృత్తమ్, శిఖలచే చేయఁబడినది - శిఖాయాఃనివాసః - శిఖకునివాసమైనది - శిఖాయాః అదూరభవః - శిఖకు సమీపమున నున్నది - అనునర్థములందు - శిఖా + జస్, శిఖా + భిస్, శిఖా + ఙస్ ఆమ్ అనువానికి 'వలచ్' ప్రత్యయము, విభక్తిలోపము శిఖావల+ సు = శిఖావలః.

ఇది చాతురర్థిక ప్రకరణము.

ప్రకరణావలోకనము : ఈ ప్రకరణమున, దానిచే రంగు వేయఁబడినది, ఆ నక్షత్రముతో కూడిన కాలము, అతనిచే దర్శింపఁబడినసామము, దానితో పరివృతమైన రథము, దానియందు (పాత్రయందు) తీసిఉంచఁబడినది, దానియందు సంస్కరింపఁబడిన భక్షములు, అది దీని దేవత, దానిసమూహము, దానిని చదివెను, దానినెఱిఁగెను అనునర్థములందాయా ప్రత్యయములాయావిభక్త్యంతములకు విధింపఁబడినవి మఱియు అది యిందుఁగలదు, అతనిచే - లేక దానిచే నేర్పడినది, వారికి నివాసము, దానికి సమీపమున నున్నది. అను నాలుగు అర్థములలో ఆ పేరుగల దేశములు గమ్యమానములగునపుడును ప్రత్యయములు విధింపఁబడినవి 'తన్నామిక దేశము' అనుసాధారణలక్షణమునుబట్టి యీ ప్రత్యయములకు చాతురర్థికములను సంజ్ఞ యేర్పడినది 'అది యిందుఁ గలదు' అను సాధారణార్థమునను కొన్ని ప్రత్యయములు విధింపఁబడినవి తండ్రి సోదరుఁడు మున్నగు నర్థములలో పితృవ్యాది శబ్దములు నిపతింపఁబడినవి తిష్యపుష్యయోర్నక్షత్రాణీత్యాదివార్తికమును, రీఙ్ఋతః, ఇనణ్యనపత్యే, ఇసుసుక్తాన్తాత్కః, నద్య్వాభ్యాం పదాన్తాభ్యాం పూర్వౌతు తాభ్యామైచ్, ఝయః, మాదుపధాయాశ్చ మతోర్వోఽయవాదిభ్యః అను సూత్రములును ఆయా కార్యవిశేషములను ప్రదర్శించినవి లుబవిశేషే, జనపదేలుప్ అను సూత్రములు వచ్చిన తద్ధితప్రత్యయములకు అదర్శనమును జెప్పినవి 'లుపి యుక్తవద్వ్యక్తివచనే' అను పరిభాష యొకటి యిందు ఆవశ్యకమైనది

అథ శైషిక ప్రకరణమ్

అవ : శేషమనగా మిగిలినది. మిగిలినది ఏది అను ఆకాంక్షకు చెప్పగా మిగిలినది అను సమాధానము వచ్చును కావున ఇతఃపూర్వము చెప్పఁబడిన అపత్యార్థకములు, రక్తాద్యర్థకములు, చాతురర్థికములును కాక తక్కినవి శేష ప్రత్యయములు. ఈ అష్టాధ్యాయిలో 'శేషే' అను నధికారమున చెప్పఁబడినవి 4-2-92 మొదలుకొని తస్యవికారః 4-3-134 అనుసూత్రమునకు పూర్వము వఱకు శేషాధికారము శేషమునకు సంబంధించిన ప్రత్యయములు శైషికములు. వానిని చెప్పు ప్రకరణము కావున నిది శైషిక ప్రకరణ మాయెను.

సూ : శేషే 4-2-92.

వృ : అపత్యాది చతురర్థ్యన్తా దన్యోఽర్థః శేషః తత్రాణాదయస్స్యుః చక్షుషా గృహ్యతే చాక్షుషం రూపమ్; శ్రావణశ్శబ్దః, ఔపనిషదః పురుషః, దృషదిపిష్టాదార్షదాస్సక్తవః, చతుర్భిరుహ్యతే చాతురం శకటం, చతుర్దశ్యాం దృశ్యతే చాతుర్దశం రక్షః. 'తస్య వికారః' ఇత్యతః ప్రాక్ శేషాధికారః, లక్షణం చ

ప ని · శేషే (7-1).

అను : తద్ధితః, ప్రత్యయః, సమర్థానాం ప్రథమాద్వా

అర్థ : అపత్యార్థము మొదలుకొని చతురర్థి అంతముగా చెప్పగా మిగిలినది శేషము. ఆ యర్థమునందు అణాది ప్రత్యయములగును ఉదా : చక్షుషా గృహ్యతే - చక్షుస్సుతో గ్రహింపఁబడునది - చాక్షుషంరూపమ్ మొ॥ వి. 'తస్య వికారః' అనుసూత్రమునకు పూర్వమువఱకు శేషాధికారము, లక్షణముకూడ.

వివ . దానిచేత గ్రహింపఁబడినది, దానిచే ప్రతిపాదింపఁబడినది, మున్నగు నర్థము లితఃపూర్వము చెప్పఁబడిన అపత్య, రక్తాది, చతురర్థులలో లేవు. ఇంతకు పూర్వము చెప్పగా మిగిలిన అర్థములు శేషములు. ఆ యర్థములందు 'ప్రాగ్దీవ్యతోఽణ్' 'అశ్వపత్యాదిభ్యశ్చ' మున్నగుసూత్రములచేఁ జెప్పఁబడిన సాధారణ ప్రత్యయములు వచ్చును. ఇది అధికారసూత్రమగుటచే నాయాగ్రహణాద్యర్థముల యందు వక్ష్యమాణ ప్రత్యయములును వచ్చును.

ఉదా:చక్షుషాగృహ్యతే - చక్షుస్సుచే గ్రహింపఁ బడునది, చక్షుస్ + టా,

లుక్, విభక్తిలోపము, చక్షుష్ + అణ్, ఆదివృద్ధి, చాక్షుష్ + అ, చాక్షుష + సు = చాక్షుషమ్-కంటిచే గ్రహింపఁబడురూపాదికము: శ్రవణేన గృహ్యతే-శ్రవణముచే గ్రహింపఁబడునది, శ్రవణ + టా + అణ్, శ్రవణ + అ(ణ్), ఆదివృద్ధి. శ్రావణ + అ, యస్యేతిచ-అకారలోపము, శ్రావణ్ + అ = శ్రావణ + సు = శ్రావణః - శ్రవణముచే గ్రహింపఁబడు శబ్దాదికము ఉపనిషద్భిః ప్రతిపాద్యతే - ఉపనిషత్తులచే ప్రతిపాదింపఁ బడువాఁడు, ఉపనిషద్ + భిస్, అణ్, విభక్తిలోపము, ఆదివృద్ధి (ఉ> ఔ) ఔపనిషద్ + అ = ఔపనిషద + సు = ఔపనిషదః - ఉపనిషత్తులచే నిరూపింపఁబడు పురుషుఁడు

దృషదిపిష్టాః - ఱాతియందు నూరఁబడినవి దృషద్ + ఙి, అణ్, విభక్తిలోపము, ఆదివృద్ధి (ఋ> ఆర్) (ద్ ఆర్షద్) దార్షద్ + అ = దార్షద + జస్ = దార్షదాః - ఱాతిపై నూరఁబడిన పేలపిండి మొ॥వి.

చతుర్భిరుహ్యతే - నాల్గింటిచే మోయఁబడునది చతుర్ + భిస్ + అణ్, చాతుర్ + అ = చాతుర + సు = చాతురమ్-నాలుగుగుఱ్ఱములు మున్నగు వానిచే లాగఁబడు శకటము మొ॥వి.

చతుర్దశ్యాం దృశ్యతే - చతుర్దశీ తిథియందు చూడఁబడు రక్షస్సు - కృష్ణచతుర్దశియందు రక్షస్సులు కనఁబడుదురని లగము ప్రసిద్ధము చతుర్దశీ + ఙి, అణ్, విభక్తిలోపము, ఆదివృద్ధి, చాతుర్దశీ + అ, యస్యేతిచ ఈకారలోపము చాతుర్దశ్ + అ = చాతుర్దశ + సు = చాతుర్దశమ్.

ఇది అధికారసూత్రము. కావున వక్ష్యమాణసూత్రములందు 'శేషే' అను పదమధికృతమై అపత్యాద్యర్థములు కాని వానియందు ఆయాప్రత్యయములగు నని చెప్పను. అంతియ కాక ఇది లక్షణసూత్రముకూడ అనగా వక్ష్యమాణసూత్రములందు గ్రహింపఁబడని గ్రహణాద్యర్థములయందు 'చక్షుషా' మున్నగువానికి 'అణ్' ప్రత్యయమీసూత్రముచేతనే యగునని తాత్పర్యము.

సూ : రాష్ట్రావార పారాద్ఘఖౌ 4-2-93.

వృ : ఆభ్యాం క్రమాద్ఘఖౌ స్తః. రాష్ట్రే జాతాదిః, రాష్ట్రియః, అవార పారీణః.

ప. వి : రాష్ట్రావారపారాత్ (5-1) ఘఖౌ (1-2).

అను : సమర్థానాం ప్రథమాద్వా: తద్ధితః; ప్రత్యయః; శేషే (7-1).

అర్థ : రాష్ట్ర, అవారపార అనువానికి శేషార్థమునందు క్రమముగా ఘ ఖ ప్రత్యయము లగును. ఉదా : రాష్ట్రమునందు జాతుఁడు మొదలగువాఁడు-రాష్ట్రియః అవారపారీణః.

వివ యథాసంభవముగ అయావిభక్త్యంతములైన రాష్ట్ర, అవారపార అను శబ్దములకు అందు పుట్టినవాఁడు, దానిని చేరినవాఁడు మున్నగు శేషార్థములందు క్రమముగా ఘ, ఖ అను తద్ధిత ప్రత్యయములు చేరును. ఇందు ఘ అనున 'ఇయ' అగును; ఖ అనునది 'ఈన' అగును 'ఆయనేయీనీయియః' అను సూత్రముచే నీరూపములు సిద్ధించును.

ఉదా : రాష్ట్రే జాతః, రాష్ట్రమునందు పుట్టినవాఁడు, ఇచట సప్తమ్యంత మగు రాష్ట్రశబ్దమునకు ఘ ప్రత్యయము. రాష్ట్ర + ఙి, ఘ, విభక్తిలోపము ఇయాదేశము, రాష్ట్ర + ఘ> ఇయ్ + అ=రాష్ట్ర + ఇయ, యస్యేతిచ - అకార లోపము రాష్ట్ర్ + ఇయ, రాష్ట్రియ + సు = రాష్ట్రియః. రాష్ట్రమును పొందినవాఁడు, రాష్ట్రమునందున్నవాఁడు మున్నగు నర్థములందును రూపమిట్లే యగును

అవారపారంగతః – అవారపారమును (సముద్రమును) చేరినవాఁడు. ఇచట ద్వితీయాంతమగు అవారపారశబ్దమునకు 'ఖ' ప్రత్యయము. అవారపార + అమ్ ఖ, విభక్తిలోపము, ఈనాదేశము, యస్యేతిచ, అకారలోపము అవారపార్ + ఈన=అవారపారీన, నకారమునకు ణత్వము, (అట్కుప్వాఙ్నుమ్వ్యవాయేఽపి) అవారపారీణ + సు=అవారపారీణః. సముద్రమునందున్నవాఁడు మున్నగునర్థము లును దీనికి యథాసంభవముగ నూహించుకొనవలెను.

అవ : అవారపారశబ్దమునకు ఖప్రత్యయము చేరుటలో నొకవిశేషము చెప్పఁ బడుచున్నది.

వా॥ అవారపారాద్విగృహీతాదపి విపరీతాచ్చేతి వక్తవ్యమ్ (1771–1772).

వృ : అవారీణః, పారీణః, పారావారీణః.

ప. వి : అవారపారాత్ (5–1). విగృహీతాత్ (5–1). అపి (అవ్య) విప రీతాత్ (5–1) చ (అవ్య) ఇతి (అవ్య) వక్తవ్యమ్ (1–1)

అర్థ : విభజింపఁబడినదియు, తాఱుమాఱైనదియు నగు అవారపారశబ్దము నకును ఖప్రత్యయమగునని చెప్పఁదగును. ఉదా : అవారీణః, పారీణః, పారావారీణః

వివ : 'అవారపార' అనుశబ్దమునందు అవార, పార అను రెండవయవములు గలవు. 'రాష్ట్రావారపారాద్ఘఖౌ' అనుసూత్రమున అవారపార శబ్దమునకు ఖ' ప్రత్యయము విధింపఁబడినది ఈ వార్తికము లశబ్దమునందలి అవార, పార అను రెండు శబ్దములకు విడివిడిగాను, ఆ శబ్దములను తాఱుమాఱుచేయగా నేర్పడు 'పారావార' అనుశబ్దమునకును శేషార్థమున ఖ' ప్రత్యయమగుటను విధించుచున్నది కావున అవార, పార, పారావారశబ్దములకు శేషార్థమున 'ఖ' ప్రత్యయము వచ్చుననుట ఫలితార్థము

ఉదా : అవారం గతః - ఈవలియొడ్డును జేరినవాఁడు, అవార + అమ్ + ఖ, విభక్తిలోపము, ఈనాదేశము, అకారలోపము-ణత్వము, అవారీణ + సు = అవారీణః. పారంగతః పారీణః - ఆవలియొడ్డును జేరినవాఁడు, పారావారంగతః - పారావారీణః - సముద్రమును జేరినవాఁడు - ప్రక్రియ 'అవారీణః' అనుదానివలెనే అరయునది.

అవ : ఇచట 'గ్రామాద్యఖఞౌ' మున్నగుసూత్రములందు ప్రత్యయములు మాత్రమే చెప్పఁబడుచున్నవి అవియే యర్థములందు ఏయేప్రకృతులకు చేరునో యనుసందేహము కలుగును. దానిని వృత్తికారులు తీర్చుచున్నారు

వృ : ఇహ ప్రకృతి విశేషాద్ఘాదయష్ట్యుట్యులన్తా ఉచ్యన్తే. తేషాం జాతాదయో ర్థవిశేషాస్సమర్థ విభక్తయశ్చ వక్ష్యన్తే.

అర్థ : ఇచట ప్రకృతి విశేషమునకు పరముగా ఘ ప్రత్యయము మొదలు కొని ట్యు, ట్యుల్ అనునంతవఱకు ప్రత్యయములు చెప్పఁబడుచున్నవి. వానియొక్క జాతాద్యర్థవిశేషములును, సమర్థవిభక్తులును తఱువాత చెప్పఁబడును.

వివ : తద్ధిత ప్రత్యయవిధానము నందొక పద్ధతిగలదు. ప్రకృతి ఏది? అది ఏ విభక్త్యంతమై ప్రత్యయమును పొందుచున్నది? అర్థమేది? అను మూఁడంశము లిందు ముఖ్యములు. ఉదా 'తేనరక్తం రాగాత్' ఇందు 'రాగాత్' అనునది రాగ వాచకశబ్దమను ప్రకృతిని తెలుపును. 'తేన' అనునది ఆరాగవాచకశబ్దము తృతీయాంతము కావలయునని చెప్పును. 'రక్తమ్' అనునది 'రంగువేయఁబడిన' అను నర్థవిశేషమును తెలుపును. ఇట్లే మూఁడంశములును జెప్పఁబడినప్పుడే విధానము సమగ్రమగును. ఈ ప్రకరణమున 'గ్రామాద్యఖఞౌ' అను తఱువాతిసూత్రమున

'గ్రామాత్' అను శబ్దముచే ప్రకృతి చెప్పఁబడినది. 'యఖఞౌ' అనునది ప్రత్యయములను జెప్పును. ఇందు సమర్థవిభక్తియేది? అర్థమేది? అను ప్రశ్నలకు పైవృత్తి వాక్యములు సమాధానము చెప్పుచున్నవి ఈప్రకరణమునందు మొదలుకొని (4 2 94) ట్యు, ట్యుల్ (4 3-23) వఱకు ముందు అయాప్రకృతివిశేషములకు, అగు ప్రత్యయములు చెప్పఁబడు చున్నవి. వాని సమర్థవిభక్తులును, అర్థవిశేషములును, తత్రజాతః (4-3-25) అనుసూత్రము మొదలుకొని ప్రకరణాంతమువఱకు (4-3-120) చెప్పఁబడఁగలవు. అనగా 4-3-25 నుండి 4-3-120 వఱకు చెప్పఁబడిన అర్థ విశేషములలో నాయా విభక్త్యంతములకు 4-2-94 మొదలుకొని 4 3-23 వఱకు విధింపఁబడిన ప్రత్యయములు, చేరునని తాత్పర్యము.

అవ : ఇటుపై ప్రకృతులును ప్రత్యయములును పేర్కొనఁ బడు చున్నవి.

సూ : గ్రామాద్య ఖఞౌ 4-2-94.

వృ : గ్రామ్యః, గ్రామీణః.

ప. వి : గ్రామాత్ (5 1) య ఖఞౌ (1-2)

అను : సమర్థానాం ప్రథమాద్వా, తద్ధితః; ప్రత్యయః.

అర్థ : 'తత్రజాతః' మున్నగు వక్ష్యమాణార్థవిశేషములయందు గ్రామశబ్ద ప్రకృతిక సప్తమ్యంతాదిరూపములకు య, ఖఞ్ అను ప్రత్యయములు చేరును. ఉదా : గ్రామ్యః, గ్రామీణః.

వివ : ముందు చెప్పఁబడు 'తత్రజాతః' అందుపుట్టినవాఁడు మున్నగునర్థములయందు, సప్తమీమున్నగు విభక్త్యంతమునఁ గల 'గ్రామ' అనుదానికి య, ఖఞ్ అను ప్రత్యయములు పర్యాయముగా వచ్చును. (పర్యాయమనగా నదివచ్చినపు డిదిరాదు. ఇది వచ్చినపు డది రాదు అని యర్థము.) ఇందు 'ఖఞ్' ప్రత్యయమున ఞకారమిత్తు. ఆదివృద్ధి యగును ఖకారమునకు ఆయనేయీనీయ్యాదిసూత్రముచే ఈనాదేశమగును

ఉదా : గ్రామేజాతః, గ్రామమునందు పుట్టినవాఁడు, గ్రామ + ఙి, య విభక్తిలోపము, యస్యేతిచ అకారలోపము. గ్రామ్ + య=గ్రామ్య + సు = గ్రామ్యః. గ్రామ + ఙి + ఖఞ్, గ్రామ + ఈన, యస్యేతిచ, అకార లోపము గ్రామ్ + ఈన = గ్రామీన, నకారమునకు ణత్వము (అట్కుప్వాఙ్)

గ్రామీణ + సు = గ్రామీణః గ్రామము[redacted]గ్రామమునందు ప్రాయిక ముగా నుండువాఁడు, గ్రామమునుండి వచ్చి[redacted] కరములు చెప్పుకొనవచ్చును. ఈ యర్థము లన్నియు ముందు చెప్పఁబడుచున్నవి.

సూ : నద్యాదిభ్యో ఢక్ 4-2-97.

వృ : నాదేయం, మాహేయం, వారాణసేయమ్

ప వి : నద్యాదిభ్యః (5-3) ఢక్ (1-1):

అను : సమర్థానాం ప్రథమాద్వా తద్ధితః, ప్రత్యయః, శేషే (7-1)

అర్థ : నద్యాదిశబ్దములకు శేషార్థమున ఢక్ ప్రత్యయము వచ్చును. ఉదా : నాదేయమ్ మొ॥వి

వివ : అందు పుట్టినది. దానినుండి వచ్చినది మున్నగునర్థములందు సప్తమ్యాది విభక్తులు అంతమునఁగల నదీమున్నగుశబ్దములకు 'ఢక్' ప్రత్యయము వచ్చును ఇందు కకారంమిత్తు. ఢ్' అనుదానికి ఆయనేయీనీత్యాదిసూత్రముచే 'ఏయ్' ఆదేశము వచ్చును. ఢలోని అకారము ఆదేశమైన ఏయ్ అనుదానిలో కలిసి 'ఏయ' అగును కిత్తగుటచే శబ్దమున కాదివృద్ధియగును.

ఉదా : నద్యాం జాతమ్, నదియందు పుట్టినది నదీ + ఙి, ఢక్, విభక్తి లోపము, నదీ + ఢక్ కితిచ - ఆదివృద్ధి నాదీ + ఢ, ఏయాదేశము, నాదీ + ఏయ, యస్యేతిచ ఈకారలోపము, నాద్ + ఏయ = నాదేయ + సు = నాదేయమ్.

మహ్యాంభవమ్ - మహి (భూమి) యందు ఉన్నది. మహీ + ఙి, ఢక్ విభక్తిలోపము, ఆదివృద్ధి, ఏయాదేశము, మాహీ + ఏయ, ఈకారలోపము- యస్యేతిచ, మాహ్ + ఏయ = మాహేయ + సు = మాహేయమ్. వారాణస్యాం భవమ్, వారాణసియందు ఉన్నది. వారాణసీ + ఙి, ఢక్ విభక్తిలోపాదులు, వారాణసేయమ్.

నద్యాదిగణము : నదీ మహీ వారాణసీ శ్రావస్తీ కౌశామ్బీ వనకౌశామ్బీ (వన కోశామ్బీ) కాశపరీ కాశఫారీ (కాశఫరీ) ఖాదిరీ పూర్వనగరీ పాఠా మాయా శాల్వా దార్వా సేతకీ 'వడవాయా వృషే' 88. ఇతినద్యాదిః.

సూ : దక్షిణా పశ్చాత్పుర సస్త్యక్ 4-2-98.

వృ : దక్షిణాత్యః, పాశ్చాత్యః, పౌరస్త్యః.

ప. వి : దక్షిణా పశ్చాత్పురసః (6-1) త్యక్ (1-1).

అను : సమర్థానాం ప్రథమాద్వా: తద్ధితః; ప్రత్యయః; శేషే (7-1)

అర్థ : దక్షిణా, పశ్చాత్, పురస్ అనుశబ్దములకు 'అందున్నవాఁడు' మున్నగు శేషార్థములందు త్యక్ ప్రత్యయము వచ్చును. ఉదా : దాక్షిణాత్యః మౌని.

వివ : దక్షిణా, పశ్చాత్, పురస్ అను మూఁడును అవ్యయములు దక్షిణ భాగము, వెనుకభాగము, ముందుభాగము అని క్రమముగా వీని కర్థము. పశ్చాత్, పురస్ శబ్దములు పడమర, తూర్పు అను దిగర్థములందును వ్యవహరింపఁబడును అందు పుట్టినవాఁడు, ఉన్నవాఁడు, అటనుండి వచ్చినవాఁడు మున్నగు శేషాధికారమునఁ గల అర్థములందు ఈ అవ్యయములకు పరముగా 'త్యక్' అను తద్ధిత ప్రత్యయము చేరును. ఇది కిత్తగుటచే ఆదివృద్ధి వచ్చును.

దక్షిణా భవః - దక్షిణమున నున్నవాఁడు దక్షిణా + త్యక్, ఆదివృద్ధి, దాక్షిణాత్య + సు = దాక్షిణాత్యః.

పశ్చాత్ భవః - పడమటిదిక్కున నున్నవాఁడు / ఉన్నది పశ్చాత్ + త్యక్ ఆదివృద్ధి, పాశ్చాత్ + త్య = పాశ్చాత్త్యః.

పురః భవః - తూర్పుననున్నవాఁడు / ఉన్నది. పురస్ + త్యక్, ఆదివృద్ధి (ఉ > ఔ) పౌరస్ + త్య = పౌరస్త్య + సు = పౌరస్త్యః.

సూ : ద్యుప్రాగపాగుదక్ ప్రతీచో యత్ 4-2-101

వృ : దివ్యమ్, ప్రాచ్యమ్, అపాచ్యమ్, ఉదీచ్యమ్, ప్రతీచ్యమ్.

ప. వి : ద్యు .... ప్రతీచః (5-1) యత్.

అను : శేషే (7-1) సమర్థానాం ప్రథమాద్వా: తద్ధితః: ప్రత్యయః.

అర్థ : దివ్, ప్రాఞ్చ్, అపాఞ్చ్, ఉదఞ్చ్, ప్రత్యఞ్చ్ అనువానికి శేషార్థమున 'యత్' ప్రత్యయము వచ్చును. ఉదా : దివ్యమ్ ఇత్యాది.

వివ : అందుపుట్టినవాఁడు మున్నగు శేషాధికారమున చెప్పఁబడినయర్థము లందు 'దివ్' మున్నగుశబ్దములయొక్క ఆయావిభక్త్యంతరూపములకు పరముగా యత్ అను తద్ధితప్రత్యయము చేరును. ఇందు తకారమిత్తు.

ఉదా: (1) దివిభవమ్ = స్వర్గమునందున్నది. దివ్ + ఙి + య(త్) విభక్తి లోపము, దివ్ + య= దివ్య + సు = దివ్యమ్.

(2) ప్రాచిభవమ్ - ప్రాఞ్చ్ + ఙి + యత్ సుబ్లోపము, ప్రాఞ్చ్+య 'అనిదితాం హల ఉపధాయాః క్ఙితి' 6-4-24 (హలంతము లైన అంగములయు, ఇదిత్తులుకాని అంగములయు నకారమునకు, కిత్తుగాని ఙిత్తుగాని పరమగు నపుడు, లోపము అగును) అనుసూత్రముచే ఞకారరూపనకారము లోపించును. (ప్ర+అఞ్చ్ + క్విన్ అనునది ప్రాఞ్చ్ అయినది అపటి క్విన్ప్రత్యయమును బట్టి యీ లోపము వచ్చును) 'ప్రఅచ్ + య'. పిదప అచః (6-4-138) (లోపించిన నకారముగల భసంజ్ఞకమగు అఞ్చ్ధాతువుయొక్క అకారమునకు లోపము వచ్చును) అనుసూత్రముచే అకారము లోపించును. 'ప్రచ్ + య'. ఇప్పుడు 'చౌ' (6-3-139) అను సూత్రముచే 'ప్ర'లోని అకారమునకు దీర్ఘము వచ్చును (లోపించిన నకార అకారములు గల అఞ్చ్ధాతురూపము పరమగునపుడు పూర్వమునన్న అకారమునకు దీర్ఘము వచ్చును) ప్రాచ్+య=ప్రాచ్య+సు= ప్రాచ్యమ్. (తూర్పున నున్నది, పుట్టినది మొ॥వి)

ఇట్లే అపాచిభవమ్ - అపాఞ్చ్ + ఙి + యత్, విభక్తిలోపము, అపాఞ్చ్ + య, అప అఞ్చ్య, అఞ్చ్ధాతువునందలి అనునాసికమునకు అకారమునకు లోపమగుట 'అప'లోని తుది అకారమునకు దీర్ఘమగుట పూర్వోదాహరణము నందువలెనే జరుగును. అపాచ్ + య=అపాచ్య+సు=అపాచ్యమ్.

ఉదీచిభవమ్ - ఉదఞ్చ్ + ఙి, యత్, విభక్తిలోపము, ఉద్ అఞ్చ్ + య అనునాసికాక్షరము లోపించిన పిదప 'ఉద్ అచ్ + య' అయియుండ ఉదఈత్ 6-4-139. (ఉద్ అనుశబ్దమునకు పరముగానున్న లుప్తనకారమగు అఞ్చ్ధాతువు యొక్క అకారమునకు ఈకారమాదేశమగును) అను సూత్రముచే ఈకారాదేశము కలిగి ఉద్ ఈచ్ + య=ఉదీచ్య + సు=ఉదీచ్యమ్ అగును

ప్రతీచిభవమ్ - ప్రత్యఞ్చ్ + ఙి, యత్, విభక్తిలోపము ప్రతి + అఞ్చ్ + య, నకారలోపము (ఞకారము లోపించును) అకారలోపము, పూర్వాక్షర దీర్ఘము. ప్రతి + అచ్, ప్రతి + చ్, ప్రతీచ్ + య=ప్రతీచ్య+సు= ప్రతీచ్యమ్.

సూ : అవ్యయాత్త్యప్ 4-2-104.

వా : అమేహక్వతసిత్రేభ్య ఏవ (వా. 2779).

వృ : అమాత్యః, ఇహత్యః, క్వత్యః, తతస్త్యః, తత్రత్యః.

ప వి : అవ్యయాత్ (5-1) త్యప్ (1-1) అమేహక్వతసిత్రేభ్యః (5-3) ఏవ (అవ్య).

అను : శేషే (7-1) సమర్థానాం ప్రథమాద్వా, ప్రత్యయః, తద్ధితః.

అర్థ : అవ్యయమునకు శేషార్థములయందు త్యప్ ప్రత్యయము వచ్చును. అమా, ఇహ, క్వ, తస్ ప్రత్యయాంతములు, త్రప్రత్యయాంతములు అనువవ్యయములకు మాత్రమే యీ ప్రత్యయము వచ్చును. ఉదా : అమాత్యః మొ॥వి.

వివ : సూత్రమున ప్రతి అవ్యయమునకును తత్రభవః మున్నగునర్థముల యందు 'త్యప్' ప్రత్యయము విధింపఁబడగా వార్తికకారుఁడు దానిని సవరించెను. అమా, ఇహ, క్వ అను అవ్యయములకు, తసిల్, త్రల్ అను తద్ధిత ప్రత్యయము లంతమునఁ గల అవ్యయములకును మాత్రమే యీ 'త్యప్' ప్రత్యయమగును ఇందు ప వర్గమిత్తు.

(1) 'అమా' అనునవ్యయమునకు 'సమీపము' అర్థము. అమాభవః – సమీపమున నుండువాఁడు అమా + త్యప్–అమాత్యః–మంత్రి

(2) 'ఇహ' = ఇక్కడ, ఇహభవః – ఇక్కడనుండువాఁడు, ఇహ + త్యప్ = ఇహత్య + సు=ఇహత్యః.

(3) క్వ = ఎక్కడ, క్వభవః = ఎక్కడనుండువాఁడు క్వ + త్యప్= క్వత్య + సు=క్వత్యః.

(4) తతః – ఇది 'తసిల్' ప్రత్యయాంతము, ఎందుండి వచ్చినవాఁడు తతస్+త్యప్ = తతస్త్య + సు=తతస్త్యః.

(5) తత్ర – త్రల్ ప్రత్యయాంతము – అందు, తత్రభవః, అందుండు వాఁడు తత్ర + త్యప్, తత్రత్య + సు=తత్రత్య.

వా॥ త్యబ్నేర్ధ్రువ ఇతి వక్తవ్యమ్ (2780).

ప వి : త్యప్ (1-1) నేః (5-1) ధ్రువే (7-1) ఇతి (అవ్య) వక్తవ్యమ్ (1-1).

అర్థ : 'ని' అను నవ్యయమునకు, 'ధ్రువము' అనునరము గమ్యమగు నపుడు, 'త్యప్' ప్రత్యయము చెప్పనగును.

వివ : 'నియతము' అనువర్థముగల 'ని' అనునవ్యయమునకు, ప్రత్యయాంత మునే 'ధ్రువము' అనునర్థము తెలియఁబడునపుడు 'త్యప్' ప్రత్యయము చెప్పఁదగు నని వార్తికభావము.

ఉదా : నియతం భవః - తప్పక అగునది, ని + త్యప్, పకారమిత్తు నిత్య + సు=నిత్యః.

అవ : 'వృద్ధాచ్ఛః' అను వక్ష్యమాణసూత్రమునందలి వృద్ధసంజ్ఞ వీక్రింది రెండుసూత్రములు వివరించుచున్నవి.

సూ : వృద్ధిర్యస్యాచామాది స్తద్వృద్ధమ్ 1-1-73.

వృ : యస్య సముదాయస్యాచాం మధ్యే ఆదిర్వృద్ధిః తద్వృద్ధ సంజ్ఞంస్యాత్.

ప. వి : వృద్ధిః (1-1) యస్య (6-1) అచామ్ (6-3) ఆదిః (1-1) తత్ (1-1) వృద్ధమ్ (1-1)

అర్థ : ఏ సముదాయముయొక్క అచ్చులయందు మొదటిది వృద్ధిసంజ్ఞకమో ఆ సముదాయమునకు వృద్ధమని సంజ్ఞ

వివ : ఆ ఐ ఔలకు వృద్ధిసంజ్ఞ 'వృద్ధిరాదైచ్' అనుసూత్రముచే కలిగినది. ఒకవర్ణములసముదాయములోని అచ్చులలో మొట్టమొదటిది వృద్ధిసంజ్ఞకల ఆ, ఐ, ఔ అను వానిలో నేదేనొకటి అయినయెడల ఆ సముదాయము మొత్తమునకు 'వృద్ధమ్' అనుసంజ్ఞయుండును ఉదా : 'శాలా' - ఇందు రెండచ్చులు గలవు. అందు మొదటిదగు ఆకారమువృద్ధి, కావున 'శాలా' శబ్దమునకు వృద్ధమని పేరు

సూ : త్యదాదీనిచ 1-1-74.

వృ : వృద్ధ సంజ్ఞాని స్యుః.

ప. వి : త్యదాదీని (1-3) చ (అవ్య)

అను : వృద్ధమ్ (1-1)

అర్థ : త్యద్ మున్నగునవియు వృద్ధసంజ్ఞములగును

వివ : త్యద్ మున్నగువాని తొలియచ్చు వృద్ధి సంజ్ఞకము కాదు. కావున వీనికి పూర్వసూత్రముచే వృద్ధసంజ్ఞకలుగని కారణమున, ప్రక్రియలో అవసర మగుటచే ఈ సూత్రముచే మరల విధింపబడినది.

త్యదాదులు : త్యద్, తద్, యద్ ఏతద్ ఇదమ్ అదస్ ఏక ద్వి యుష్మద్ అస్మద్ భవతు కిమ్॥ ఇది సర్వాదులలో అంతర్గణము.

అవ : పై రెండుసూత్రములచే చెప్పఁబడిన వృద్ధసంజ్ఞకమునకు శేషార్థము లందు ప్రత్యయము విధింపఁబడుచున్నది.

సూ : వృద్ధాచ్ఛః 4-2-114.

వృ : శాలీయః, తదీయః.

ప ఛి : వృద్ధాత్ (5-1) ఛః (1-1)

అను : సమర్థానాం ప్రథమాద్వా: తద్ధితః; ప్రత్యయః; శేషే (7-1).

అర్థ : వృద్ధ సంజ్ఞకలదానికి శేషార్థమున 'ఛ' ప్రత్యయమగును. ఉదా : శాలీయః, తదీయః.

విప : దేనితొలి అచ్చు వృద్ధిసంజ్ఞకమో దానికిని, త్యదాదులకును వృద్ధమని పేరు అట్టి వృద్ధవాచకశబ్దముల యా యా విభక్త్యంతములకు 'అందు పుట్టినవాఁడు' మున్నగు శేషాదికాలమునందలి యర్థములందు 'ఛ' అను ప్రత్యయము వచ్చును. ఇందు 'ఛ్' అను హల్మాత్రమునకు ఆయనేయీనీయ్యాదిసూత్రముచే ఈయ్ 'అనునాదేశము' వచ్చును (ఛ్ + అ = ఈయ్ + అ = ఈయ).

ఉదా : శాలాయాం జాతః-శాలయందు పుట్టినవాఁడు, శాలాశబ్దము వృద్ధము, దాని సప్తమ్యంతముపై ఛ ప్రత్యయము. శాలా + ఙి, ఛ, విభక్తిలోపము, శాలా + ఛ, ఈయాదేశము, శాలా + ఈయ్ + అ, యస్యేతిచ-ఆకారలోపము, శాల్ + ఈయ = శాలీయ + సు = శాలీయః.

తద్ శబ్దమునకు 'త్యదాదీనిచ' అనుసూత్రముచే వృద్ధసంజ్ఞకలదు. తస్య అయమ్ = వానికి సంబంధించినవాఁడు అనువర్థమున షష్ఠ్యంతమగు తచ్ఛబ్దమునకు ఛ ప్రత్యయము తద్ + ఙస్ + ఛ, విభక్తిలోపము, ఈయాదేశము, తద్ + ఈయ = తదీయ + సు = తదీయః.

వా॥ వానామధేయస్యవృద్ధసంజ్ఞా వక్తవ్యా (576).

వృ : దేవదత్తీయః, దైవదత్తః.

వ. ఛి : వా (అవ్య) నామధేయస్య (6-1) వృద్ధసంజ్ఞా (1-1) వక్తవ్యా

అర్థ : నామధేయమునకు వృద్ధసంజ్ఞ వైకల్పికముగా నగునని చెప్పఁదగును. ఉదా : దేవదత్తీయః, దైవదత్తః.

వివ : నామధేయ వాచకములగు 'దేవదత్త' మున్నగువానికి వైకల్పికముగా వృద్ధసంజ్ఞ కలుగును. కనుక వానికి శేషార్థములయందు ఛ ప్రత్యయము వైకల్పికముగా వచ్చునని తాత్పర్యము.

ఉదా : దేవదత్తస్య అయమ్ = దేవదత్తునికి సంబంధించినది అనువర్థమున షష్ఠ్యంతమగు దేవదత్త శబ్దమునకు, వృద్ధసంజ్ఞయున్నపుడు ఛ ప్రత్యయము. దేవదత్త + ఙస్, ఛ, విభక్తిలోపము, దేవదత్త + ఛ, ఈయాదేశము, అకార లోపము, దేవదత్ + ఈయ = దేవదత్తీయ + సు = దేవదత్తీయః.

వైకల్పికమగుటచే వృద్ధసంజ్ఞలేనియెడల 'తస్యేదమ్' అనునర్థమున సామాన్యమగు 'అణ్' ప్రత్యయము. దేవదత్త + ఙస్ + అణ్, విభక్తి లోపము, ఆదివృద్ధి, దైవదత్త + అ, అకారలోపము (యస్యేతిచ) దైవదత్ + అ = దైవదత్త + సు = దైవదత్తః.

సూ : గహాదిభ్యశ్చ 4-2-138

వృ : గహీయః.

ప. వి : గహాదిభ్యః (5-3) చ (అవ్య).

అను : సమర్థానాం ప్రథమాద్వా; తద్ధితః; ప్రత్యయః. ఛః (1-1) శేషే (7-1).

అర్థ : గహాదిశబ్దములకు శేషార్థమున ఛ ప్రత్యయమగును. ఉదా :- గహీయః

వివ : అందున్నవాఁడు మున్నగు శేషార్థములయందు సప్తమ్యాద్యంతములగు గహాదిశబ్దములకు ఛ ప్రత్యయమగును.

ఉ : గహీయః (గహమనుదేశవిశేషమునందున్నవాఁడు) గహ + ఙి + ఛ, విభక్తిలోపము, ఈయాదేశము (ఆయనేయీనీయియః ఫ ఢ ఖ ఛ ఘాం ప్రత్యయాదీనామ్) గహ + ఈయ, యస్యేతి చ - అకారలోపము గహ్ + ఈయ = గహీయ + సు = గహీయః.

గహాదిగణము : గహ అన్తస్థ సమ విషమ. 'మధ్యమధ్యమం చాణ్ చరణే' 87. ఉత్తమ అఙ్గ, వఙ్గ, మగధ, పూర్వపక్ష, అపరపక్ష, అధమ శాఖ ఉత్తమశాఖ ఏకశాఖ సమానశాఖ సమానగ్రామ ఏకగ్రామ ఏకవృక్ష ఏకపలాశ ఇష్వగ్ర ఇష్వనీక అవస్యన్దన కామప్రస్థ ఖాడికాడాయని (ఖాడాయన) కాఠేరణి లావేరణి సౌమిత్రి శైశిరి ఆసుత్ దైవశర్మి శ్రౌతి ఆహింసి ఆమిత్రి

వ్యాఠి పైల అధ్యశ్వ అన్యశసి (అవృశంపి) కౌడ్గ అగ్రిశర్మి లౌటి వారాటకి వాల్మికి (వాల్మీకి) క్షై మవృద్ధి ఆశ్వత్థి ఔద్గాహమాని ఐక బిన్దవి దన్తాగ్ర హంస తత్వగ్ర (తన్త్వగ్ర) ఉత్తర అన్తర (అనన్తర) 'ముఖపార్శ్వతసోర్లోపః' 88. 'జనపర యోఃకుక్చ' 89. 'దేవస్యచ' 90. 'వేణుకాదిభ్యశ్ఛణ్' 91. ఇతిగహాదిః. ఆకృతిగణః.

సూ : యుష్మదస్మదో రన్యతరస్యాం ఖఞ్ చ 4-3-1.

వృ : చాచ్ఛః, పక్షేఽణ్. యువయో ర్యుష్మాకం వా అయం యుష్మదీయః; అస్మదీయః

ప. వి : యుష్మదస్మదోః (6-2) అన్యతరస్యామ్ (అవ్య) ఖఞ్ (1-1) చ (అవ్య).

అను : సమర్థానాం ప్రథమాద్వా; తద్ధితః, ప్రత్యయః; శేషే (7-1).

అర్థ : యుష్మద్, అస్మద్ శబ్దములకు శేషార్థమున ఖఞ్ ప్రత్యయముకూడ వచ్చును. 'కూడ' అనుటచే ఛ ప్రత్యయమునగును వైకల్పికముగాన సాధారణ మగు 'అణ్' ప్రత్యయము వగును. ఉ॥ యువయో ర్యుష్మాకం వా యుష్మదీయః, అస్మదీయః;

వివ : యుష్మద్ అస్మద్శబ్దములు నీ, నా అనునర్థము గల సర్వనామ ములు. శేషార్థములగు సంబంధించినది' మున్నగు సర్థములందు యథావిభక్త్యం తములగు వీనికి ఖఞ్ ప్రత్యయమును, ఛ ప్రత్యయము వైకల్పికముగా నగును. ఇవి రెండును రానిచో ఈ సూత్రము అణధికారములోనిది (ప్రాగ్దీవ్యతోఽణ్) కావున అణ్ ప్రత్యయము వచ్చును.

ఉదా : ఛప్రత్యయమున కుదాహరణము చూపబడుచున్నది. ఖఞ్, అణ్ ప్రత్యయములకు సంబంధించి మఱికొంత ప్రక్రియ యుండుటచే నది ఉత్తర సూత్రమున చూపబడును.

యువయోః అయమ్, యుష్మాకం అయమ్: మీ యిరువురికి సంబంధించినది- సంబంధించినవాడు. మీకు సంబంధించినది - సంబంధించినవాడు, అనుచోట షష్ఠ్యంతమగు 'యుష్మద్' శబ్దమునకు ఛప్రత్యయము యుష్మద్+ఓస్|ఆమ్+ ఛ. విభక్తిలోపము, ఈయాదేశము, యుష్మద్ + ఈయ=యుష్మదీయ + సు = యుష్మదీయః.

అస్మాకం ఆవయోః అస్మాకం వా అయమ్, మా యిరువురికి లేక మాకు సంబం ధించినవాఁడు, అస్మద్ + ఓస్|ఆమ్ + ఛ, విభక్తిలోపము, ఈయాదేశము, అస్మద్ + ఈయ=అస్మదీయ + సు=అస్మదీయః.

ప్రకృతులగు యుష్మదస్మచ్ఛబ్దములు ఏకవచనాంతములగునపుడు వాని కాదేశమొకటి విధింపఁబడుచున్నది గాన యువయోః, యుష్మాకమ్, ఆవయోః, అస్మాకమ్ అను షష్ఠీద్వివచన బహువచనరూపములే యిందుగ్రహింపఁబడినవి.

సూ : తస్మిన్నణిచ యుష్మాకాస్మాకౌ 4-3-2.

వృ : యుష్మదస్మదోరేతావాదేశౌ స్తః ఖఞి అణి చ. యౌష్మాకీణః, ఆస్మాకీనః, యౌష్మాకః, ఆస్మాకః.

ప. వి : తస్మిన్ (7-1) అణి (7-1) చ (అవ్య) యుష్మాకాస్మాకౌ(1-2).

అను : యుష్మదస్మదోః (6-2).

అర్థ : ఖఞ్, అణ్ ప్రత్యయములు పరములగునపుడు యుష్మద్, అస్మద్ శబ్దములకు క్రమముగా యుష్మాక, అస్మాక అనునాదేశములు వచ్చును. ఉదా : యౌష్మాకీణః, ఆస్మాకీనః: యౌష్మాకః, ఆస్మాకః.

వివ : 'తస్మిన్' అను సర్వనామరూపమునకు పూర్వసూత్రమున విధింపఁ బడిన 'ఖఞ్' ప్రత్యయము బోధ్యము ఖఞ్, అణ్ ప్రత్యయములు పరములగు నపుడు 'యుష్మద్' అనుదానికి యుష్మాక అనునదియు, అస్మద్ అనుదానికి 'అస్మాక' అనునదియు నాదేశములగును అనేకవర్ణాదేశములగుటచే నివి సర్వా దేశములుగా వచ్చును.

ఉదా : యువయోర్యుష్మాకం వా అయమ్ అనునర్థమున షష్ఠీద్వివచన బహు వచనాంతములకు ఖఞ్ ప్రత్యయము పూర్వసూత్రముచే వచ్చును. యుష్మద్ + ఓస్ - ఆమ్ + ఖఞ్, విభక్తిలోపము, 'యుష్మాక' ఆదేశము, యుష్మాక+ఖ(ఞ్), ఆదివృద్ధి, యౌష్మాక + ఖ, ఆయనేయీనీయాది సూత్రముచే ఖకారమునకు ఈన ఆదేశము, యౌష్మాక + ఈన, అకారలోపము - యస్యేతిచ, యౌష్మాక్ + ఈన = నకారమునకు ణత్వము, (షకారయోగముచే) యౌష్మాకీణ + సు = యౌష్మాకీణః.

ఇట్లే ఆవయోరస్మాకం వాఅయమ్. అస్మద్ + ఓస్ - ఆమ్ + ఖఞ్, విభక్తిలోపము, అస్మాకఆదేశము, ఆదివృద్ధి, ఈనాదేశము, అకారలోపము ఆస్మాకీన + సు=ఆస్మాకీనః.

అణ్ ప్రత్యయము వచ్చినచో, యుష్మాక + అణ్, ఆదివృద్ధి, యౌష్మాక + అ యస్యేతిచ-అకారలోపము యౌష్మాక్+అ=యౌష్మాక + సు = యౌష్మాకః. ఇట్లే అస్మాక + అణ్, ఆదివృద్ధి, అకారలోపము, ఆస్మాక + సు= ఆస్మాకః.

అవ : తవఅయమ్, మమఅయమ్ - నీసంబంధమైనది, నాసంబంధమైనది అను నర్థమున నేకవచనాంతములగు యుష్మదస్మచ్ఛబ్దములకు ఖఞ్ అణ్ ప్రత్యయములు చేరునపుడు అగు కార్యవిశేషము చెప్పఁబడుచున్నది.

సూ : తవకమమకావేకవచనే 4-3-3.

వృ: ఏకార్థవాచినో ర్యుష్మదస్మదో స్తవకమమకౌ స్తఃఖఞి అణిచ. తావకీనః- తావకః; మామకీనః - మామకః.

ప. వి : తవకమమకౌ (1-2) ఏకవచనే (7-1)

అను : యుష్మదస్మదోః (6-2) ఖఞి (7-1) అణి (7-1).

అర్థ : ఏకార్థవాచకములైన యుష్మద్, అస్మద్ శబ్దములకు, ఖఞ్, అణ్ ప్రత్యయములు పరములగునపుడు క్రమముగా తవక, మమక, అనునాదేశము లగును ఉదా : తావకీనః ఇత్యాది.

వివ : ఖఞ్, అణ్ ప్రత్యయములకు ప్రకృతులగు యుష్మదస్మదచ్ఛబ్దములు ఏకార్థవాచకములైనచో (ఒక ద్రవ్యమును బోధించునవి అయినచో= ఏకవచనాంతములైనచో) వానికి ఆ ప్రత్యయములు పరములగునపుడు క్రమముగా తవక, మమక అనునవి యాదేశములగును ఇవియును సర్వాదేశములే.

ఉదా : తవ అయమ్ = నీకు సంబంధించినది. యుష్మదస్మదోరన్యతరస్యాం ఖఞ్ చ అను సూత్రముచే ఖఞ్ ప్రత్యయము, యుష్మద్+ఙస్ + ఖఞ్, విభక్తిలోపము, తవక - ఆదేశము, తవక + ఖఞ్, ఆదివృద్ధి, తావక + ఖఞ్, ఈనాదేశము(ఆయనేయీనీ....)అకారలోపము; తావక్ + ఈన=తావకీన + సు = తావకీనః.

అణ్ ప్రత్యయమగుచో, తవక + అణ్, ఆదివృద్ధి, అకారలోపము తావక్ + అ=తావక + సు= తావకః.

అస్మే, మమఅయమ్ = నాది, అస్మద్+జస్, ఖఞ్, అస్మద్ + ఖఞ్, మమక + ఖఞ్, మామక + ఖఞ్, మామక + ఈన, మామక్ + ఈన = మామకీన + సు = మామకీనః.

అణ్ ప్రత్యయమగుచో, మమక + అణ్, మామక + అ, మామక్ + అ= మామక + సు=మామకః.

అవ : యుష్మదస్మచ్ఛబ్దము లేకవచనాంతములైనపుడు ఛ ప్రత్యయము పరమైనచో అగురూపమును దెలుపుటకై వృత్తికారుఁడు దానిని గ్రహించుచున్నాఁడు

వృ ఛేతు—

అర్థ : ఛ ప్రత్యయము పరమైనచో-

అవ : అగు కార్యవిశేషము క్రింది సూత్రముచే తెలుపఁబడుచున్నది.

సూ : ప్రత్యయోత్తరపదయోశ్చ 7-2-98.

వృ : మ పర్యన్తయోరనయో రేకార్థవాచినో స్త్వమౌ స్తః ప్రత్యయే ఉత్తర పదేచ పరతః. త్వదీయః, మదీయః; త్వత్పుత్రః, మత్పుత్రః.

ప. వి : ప్రత్యయోత్తరపదయోః (7-2) చ (అవ్య).

అను : యుష్మదస్మదోః (6-2) త్వమౌ (1-2) ఏకవచనే (7-1) మపర్యన్తస్య (6-1)

అర్థ : మపర్యంతములును, ఏకార్థవాచకములును అగు యుష్మదస్మచ్ఛబ్దములకు, ప్రత్యయముగాని ఉత్తరపదముగాని పరమగునపుడు, క్రమముగా 'త్వ' 'మ' అనునాదేశములు వచ్చును. ఉదా : త్వదీయః, మదీయః, త్వత్పుత్రః, మత్పుత్రః.

వివ : ఏకవచనాంతములైన యుష్మద్, అస్మద్ శబ్దములకు ప్రత్యయముగాని ఉత్తర పదముగాని పరమగునపుడు మకారమువఱకుఁగల ఆ శబ్దముల వర్ణసముదాయమునకు క్రమముగా 'త్వ', 'మ' అనునాదేశములగును. యుష్మద్ యుష్మ=త్వద్, అస్మ(ద్)=మద్ అని యగునని తాత్పర్యము.

ఉదా : తవ అయమ్ = నీది, 'యుష్మద్+ఙస్' అనుదానికి ఛ ప్రత్యయము, ('యుష్మదస్మదోరన్యతరస్యాం' అను సూత్రముచే) యుష్మద్+ఙస్ + ఛ

విభక్తిలోపము 'యుష్మ' అనుదానికి 'త్వ' ఆదేశము, త్వద్ + ఛ, ఛకారము ఆయనేయీనీత్యాది సూత్రముచే ఈయాదేశము. త్వద్ + ఈయ= త్వదీయ + సు: త్వదీయః.

సమాసమునందును పూర్వపదమగు యుష్మచ్ఛబ్దమునం దీయాదేశమగున 'తవపుత్రః' నీకొడుకు, యుష్మద్+జస్, పుత్ర + సు, షష్ఠీ అనుసూత్రము సమాసము, విభక్తిలోపము యుష్మద్ + పుత్ర, యుష్మ> త్వ త్వద్ + పుత్ర ఖరిచ, చర్త్వము త్వత్పుత్ర + సు= త్వత్పుత్రః.

మమ అయమ్ - నాది, నావాడు - అస్మద్ + జస్, ఛ, విభక్తిలోప 'అస్మ' అనుదానికి 'మ' ఆదేశము మద్ + ఛ, ఈయాదేశము మద్ + ఈయ : మదీయ + సు= మదీయః

సమాసమున మమపుత్రః, అస్మద్+జస్, పుత్ర + సు, అస్మద్ + పు 'మ' ఆదేశము మద్+పుత్ర, చర్త్వము - మత్పుత్ర + సు= మత్పుత్రః

యుష్మదస్మచ్ఛబ్దములకు శేషార్థములలో ఖఞ్, ఛ, అణ్ అనుమూ ప్రత్యయములు చేరును. అప్పటిస్వరూపము క్రింది విధముగా నుండును.

		యుష్మద్	అస్మద్.
ఏకవచనాంతముపై	ఖఞ్,	తావకీనః	మామకీనః
"	అణ్ -	తావకః	మామకః
"	ఛ -	త్వదీయః	మదీయః.

		యుష్మద్	అస్మద్
ద్వి బహువచనాంతములపై,	ఖఞ్	-యౌష్మాకీణః	ఆస్మాకీనః.
"	అణ్	-యౌష్మాకః	ఆస్మాకః.
"	ఛ	-యుష్మదీయః	అస్మదీయః.

సూ : మధ్యాన్మః 4-3-8.

వృ : మధ్యమః.

వ వి : మధ్యాత్ (5-1) మః (1-1)

అను : శేషే (7-1) సమర్థానాం ప్రథమాద్వా, తద్ధితః, ప్రత్యయః.

అర్థ : మధ్యశబ్దమునకు శేషార్థమున 'మ' ప్రత్యయము వచ్చును. ఉదా మధ్యమః.

వివ : 'మధ్యేభవః' 'మధ్యనున్నవాఁడు' అనునర్థమునందు సప్తమ్యంతమగు మధ్యశబ్దమునకు 'మ' ప్రత్యయము చేరును. ఉదా : మధ్య + ఙి, మ, విభక్తిలోపము, మధ్యమ + సు = మధ్యమః.

సూ : కాలాట్ఠఞ్ 4-3-11.

వృ : కాలికమ్, మాసికమ్, సాంవత్సరికమ్.

ప. వి : కాలాత్ (5-1) ఠఞ్ (1-1)

అను : శేషే (7-1) సమర్థానామిత్యాదులు.

అర్థ : కాలవాచకశబ్దములకు శేషార్థమున ఠఞ్ ప్రత్యయము వచ్చును. : కాలికమ్ మొ॥వి.

వివ : సూత్రమునందలి 'కాలాత్' అనుపదముచే కేవలము కాలశబ్దమునకే కాక కాలవాచకములగు మాస, సంవత్సర, అబ్ద మున్నగువానినికూడ గ్రహించుట భాష్యసమ్మతము. కావున కాలశబ్దమునకును, కాలవాచకశబ్దములకును భవాద్యర్థములయందు 'ఠఞ్' అను తద్ధిత ప్రత్యయము చేరును ఇందు ఞకారమిత్తు. దాని వలన ఆదివృద్ధివచ్చును. 'ఠ' అనుదానికి ఇకాదేశమగును (ఠస్యేకః).

ఉదా : కాలేభవమ్ - కాలమునందున్నది, కాల + ఙి, ఠఞ్, విభక్తిలోపము, ఆదివృద్ధి (అ > ఆ) కాల + ఠ, ఇకాదేశము, కాల + ఇక, అకారలోపము (యస్యేతిచ) కాల్ + ఇక = కాలిక + సు = కాలికమ్.

మాసేభవమ్, మాసమున నుండునది, మాస్ + ఙి, ఠఞ్, విభక్తిలోపము, ఆదివృద్ధి, ఇకాదేశము, మాస్ + ఇక = మాసిక + సు = మాసికమ్.

సంవత్సరేభవమ్, సంవత్సరమునందగునది, సంవత్సర + ఙి, ఠఞ్, విభక్తిలోపము, ఆదివృద్ధి, సాంవత్సర + ఠ, ఇకాదేశము, అకారలోపము, సాంవత్సర్ + ఇక = సాంవత్సరిక + సు = సాంవత్సరికమ్

సాయంప్రాతర్భవః, జాతః. సాయంకాల ప్రాతఃకాలములందుండునది. అనునర్థములలో 'సాయంప్రాతర్' అను అవ్యయమునకును, పునఃపునర్భవః — మాటిమాటికి పుట్టువాఁడు-పుట్టునది అనునర్థమునందు 'పునఃపునర్' అనునవ్యయమునకు 'కాలాట్ఠఞ్' అనుసూత్రముచే ఠఞ్ ప్రత్యయమువచ్చును సాయంప్రాతర్ + ఠఞ్, పునఃపునర్ + ఠఞ్ ఆదివృద్ధి, ఇకాదేశములు రాఁగా సాయంప్రాతర్ + ఇక, పౌనఃపునర్ + ఇక అనియుండ క్రిందివార్తికముచే టిలోపమగును.

వా॥ అవ్యయానాం భమాత్రే టిలోపః (4187)

వృ॥ సాయంప్రాతికః, పౌనః పునికః.

ప. వి : అవ్యయానామ్ (6-3) భమాత్రే (7-1) టిలోపః (1-1).

అర్థ : భసంజ్ఞ కలిగిన మాత్రమున అవ్యయములకు టిలోపమగును ఉదా : సాయంప్రాతికః, పౌనః పునికః.

వివ : సాధారణముగా శబ్దస్వరూపముయొక్క టిభాగమునకు డిత్తు పరమగునపుడే లోపము వచ్చును. (టేః) అట్లు డకారము ఇత్తుగా లేని ప్రత్యయము పరమగునపుడు, భసంజ్ఞగల అవ్యయములకు టిలోపము నీ వార్తికము విధించుచున్నది. యకారాది అజాది స్వాది ప్రత్యయములు పరములగుచో పూర్వమునకు భసంజ్ఞ కలుగును (యచిభమ్).

సాయంప్రాతర్ + ఇక, పౌనఃపునర్ + ఇక ఇట అజాది ప్రత్యయము పరమగుటచే ఈ రెంటికిని 'భ' సంజ్ఞకలుగును. ఈ వార్తికముచే టిభాగము 'అర్' అనునది లోపించును. సాయంప్రాతిక + సు = సాయంప్రాతికః, పౌనఃపునిక + సు=పౌనఃపునికః.

సూ : ప్రావృష ఏణ్యః 4-3-17.

వృ : ప్రావృషేణ్యః.

ప. వి : ప్రావృషః (5-1) ఏణ్యః (1-1).

అను : సమర్థానామిత్యాది. శేషే (7-1) కాలాత్ (5-1).

అర్థ : ప్రావృట్ శబ్దమునకు తత్రభవః అనునర్థమున 'ఏణ్య' అను ప్రత్యయము వచ్చును ఉదా : ప్రావృషేణ్యః

వివ : ప్రావృట్టనగా వర్షకాలము. ఋతువాచకమైన యీ శబ్దముయొక్క సప్తమ్యంతమునకు 'అందుండునది' అను నర్థమున 'ఏణ్య' అను ప్రత్యయము వచ్చును.

ఉదా : ప్రావృషిభవః - ప్రావృష్ + ఙి, ఏణ్య, విభక్తిలోపము. ప్రావృషేణ్య + సు = ప్రావృషేణ్యః - మేఘము మొదలగునది.

సూ : సాయంచిరంప్రాహ్ణేప్రగేఽవ్యయేభ్యష్ట్యుట్యులౌ తుట్ చ 4-3-23.

వృ : సాయమిత్యాదిభ్యశ్చతుర్భ్యోఽవ్యయేభ్యశ్చ కాలవాచిభ్యష్ట్యు ట్యులౌ స్తస్తయోస్తుట్ చ తుటః ప్రాగనాదేశః. తేన 'అనద్యతనే' ఇతినిర్దేశస్సఙ్గచ్ఛతే. సాయన్తనం, చిరన్తనమ్ ప్రాహ్ణే ప్రగే అనయోరేదన్తత్వం నిపాత్యతే. ప్రాహ్ణేతనమ్, ప్రగేతనమ్, దోషాతనమ్.

ప. వి : సాయం .. అవ్యయేభ్యః (5-3) ట్యుట్యులౌ (1-2) తుట్ (1-1) చ (అవ్య).

అను : సమర్థానామిత్యాది; కాలాత్ (5-1) శేషే (7-1).

అర్థ : సాయ, చిర, ప్రాహ్ణ, ప్రగ అనుశబ్దములకును, కాలవాచకములైన అవ్యయములకును ట్యు ట్యుల్ అను ప్రత్యయములు, శేషార్థములందు వచ్చును. వానికి తుడాగమముకూడ నగును. తుడాగమమునకు పూర్వము 'అన' ఆదేశము చేయవలయును. అపుడు 'అనద్యతనే' అను పాణిని నిర్దేశము కుదురును. ఉదా : సాయంతనమ్, చిరంతనమ్ - ప్రాహ్ణ, ప్రగ అనువానికి ఏదంతత్వము ఇందు నిపతింపఁ బడినది. ప్రాహ్ణేతనమ్, ప్రగేతనమ్ అవ్యయమున కుదాహరణము- దోషాతనమ్.

వివ : కాలమును దెలుపుపదములగు సాయ; చిర, ప్రాహ్ణ, ప్రగ అను నాలుగు సుబంతములకును, కాలవాచకములే యగు అద్య, దోషామున్నగు అవ్యయములకును, 'అందున్నవాఁడు' మున్నగు శేషాధికారములోని అర్థవిశేషములందు 'ట్యు', 'ట్యుల్' అను ప్రత్యయములు వచ్చును. ఈ ప్రత్యయములకు 'తుట్' అనునాగమము కూడ వచ్చును ఈ ప్రత్యయములందు టకారలకారము లిత్తులు. రెంటియందును 'యు' మిగులును కావున ఏర్పడురూపమొక్కటియే అయినను స్వరవిశేషము కొఱకు రెండు ప్రత్యయములు విధింపఁబడినవి

'యువోరనాకౌ' అను సూత్రముచే ఈ ప్రత్యయమునకు 'అన' ఆదేశము రావలయును. విధింపఁబడిన తుట్ అగమము (త్ + ఉ + ట్ ఉకారముచ్చారణార్థకము, టకారమిత్తు) 'యు' అనుస్వరూపముగా నున్నపుడు వచ్చునా? 'అన' ఆదేశము వచ్చినపిదప వచ్చునా? అను సందేహమిట జనించును. మొదటిపక్షమున 'తు' అయినచో అనాదేశము వచ్చుటకు వీలులేదు అంగమునకు పరముగానున్న 'యు' అనుదానికే అనాదేశము వచ్చును. 'తు' అనుచోట అంగసంజ్ఞగల 'సాయం' ఇత్యాదులకును, 'యు' అనుదానికి నడుమ తకారమున్నదిగదా! అగమములు దేనికి

విధింపఁబడునో దాని అవయవములే అగునుగదా (యదాగమా స్తద్గుణీభూతా స్తద్గ్రహ ణేన గృహ్యన్తే) దీనినిబట్టి తుడాగమసహిత యు ప్రత్యయము, (త్యు), 'యువో రనాకౌ' అనుసూత్రమున గ్రహింపఁబడదా? గ్రహింపఁబడినచో అనాదేశము వచ్చి 'తన' అగుట కభ్యంతరమేమి? అనరాదు. 'నిర్దిశ్యమానస్యాదేశాభవన్తి' అను నొక పరిభాషగలదు. ఆదేశములు నిర్దిశ్యమానములకే (పేర్కొనఁబడినవానికే) వచ్చును సూత్రమున 'యు' అనునదియే పేర్కొనఁబడినది కాని 'త్యు' కాదుగదా। కావున అనాదేశము రాఁజాలదు. పోనీ ముందు 'యు' అనుదానికి అనాదేశము చేసికొని పిదప తుడాగమము చేయరాదా? అన్నచో దానికొక పరిభాష అడ్డు తగు లును. తుడాగమము ట్యుట్యుల్ ప్రత్యయములకు అంతరంగకార్యము. అనగా అవి శబ్దస్వరూపమునకు చేరునపుడు వీనితో నెడఁబాయక చేరును. ఇఁక అనాదేశ మన్ననో బహిరంగము తుడాగమముతో కూడ వచ్చిన ప్రత్యయములోని 'యు' అనుదానికి అనంతరకాలికమగు కార్యమని భావము. బహిరంగ కార్యముకంటె అంతరంగ కార్యము బలీయము. (పరనిత్యాంతరంగాపవాదానా ముత్తరోత్తరం బలీయః). కావున అంతరంగకార్యమగుతుడాగమమే ముందు జరుగవలయును. ఇట్లే ప్రత్యయము 'తన' అనుస్వరూపమును పొందవలసియుండగా శాస్త్రమంగీక రించుటలేదు. కాని పాణిని మహర్షి 'అనద్యతనే లట్' మున్నగు సూత్రములలో ఈ 'ట్యు' ప్రత్యయమునకు అనాదేశము చేసినతర్వాతనే తుడాగమముచేసి 'అనద్య తనే' మున్నగువానిని ప్రయోగించియున్నారు (అద్య + ట్యు, అద్య + యు, అద్య + అన, తుడాగమము అద్యత్ + అన = అద్యతన) అట్టి ప్రయోగము లను బట్టి ప్రకృతప్రత్యయమునకు ముందే అనాదేశము చేసిపిదప తుడాగమము చేయవలయుననుట నిరూపితమైనది ఈ విషయమునే 'తుడః ప్రాగనాదేశః' ఇత్యాది వృత్తివాక్యము సూచించును.

ఉదా : సాయంతనమ్ - సాయంకాలమున నగునది సాయ + ఙి + ట్యు - ట్యుల్. విభక్తిలోపము, సాయ + యు, 'అన' ఆదేశము సాయ + అన, తుడాగమము, టిత్తగుటచే ఆద్యవయవమగును. సాయ + త్ + అన = సాయ + తన ఈ ప్రత్యయము వచ్చునపుడు సాయ, చిర అనుశబ్దములకు మకా రాంతత్వము 'సాయంచిరం' ఇత్యాది ప్రయోగమువలన నిపతింపఁబడినది. సాయమ్ తన + సు=మకారమున కనుస్వారాదేశపరసవర్ణములు 'సాయన్తనమ్'.

చిరంతనమ్ చిర + ఙి, ట్యు-ట్యుల్, చిర + యు, చిర + అన, చిర + తన, మాంతత్వము చిరన్తన + సు = చిరన్తనమ్.

ప్రాహ్ణ + సు, ట్యు/ట్యుల్, ప్రాహ్ణ + యు, అనాదేశము, తుడాగమము, ప్రాహ్ణ + తన, సూత్రమున 'ప్రాహ్ణేప్రగే' అని ప్రయోగింపఁబడియుండుటచే వీనికి ఏదంతత్వము నిపతింపఁబడినదని తెలియనగును. ప్రాహ్ణేతన + సు = ప్రాహ్ణేతనమ్

ప్రగేభవమ్, ప్రగ + ఙి, ట్యు-ట్యుల్, ప్రగ + యు, అనాదేశము, తుడాగమము, ప్రగ + తన, ఏదంతత్వము ప్రగేతన + సు = ప్రగేతనమ్.

ఈ సూత్రమునందలి సాయ, చిర, ప్రాహ్ణ, ప్రగ అనునవి అవ్యయములు కావు అవ్యయములైనచో సూత్రమునందలి 'అవ్యయేభ్యః' అనుపదముచేతనే వానికిని ఈ ప్రత్యయములు సిద్ధించును 'సాయం, ప్రగే' మున్నగు నవ్యయము లును గలవు. వానికి 'అవ్యయేభ్యశ్చ' అనుపదముచే ఈ ప్రత్యయములు సిద్ధించును.

అవ్యయమున కుదాహరణము - దోషాభవమ్ - దోషా అను నవ్యయమునకు 'రాత్రి' అని అర్థము దోషా + ట్యు - ట్యుల్, దోషా + యు, అనాదేశము దోషా + అన, తుడాగమము, దోషా, త్ + అన = దోషాతన + సు = దోషాతనమ్.

అవ: ఇంతవఱకు ప్రకృతులు ప్రత్యయములు మాత్రమే చెప్పఁబడినవి. ఇటుపై శేషాధికారమునందలి అర్థవిశేషములను, సమర్థవిభక్తులను, మఱికొన్ని ప్రత్యయములను జెప్పఁబడుచున్నవి.

సూ : తత్రజాతః 4-3-25.

వృ : సప్తమీసమర్థాజ్జాత ఇత్యర్థేఽణాదయో ఘాదయశ్చ స్యుః స్రుఘ్నేజాతః స్రౌఘ్నః; ఉత్సేజాతః ఔత్సః, రాష్ట్రేజాతః రాష్ట్రియః, అవారపారే జాతః అవారపారీణః ఇత్యాది.

వ. వి : తత్ర (అవ్య) జాతః (1-1).

అను : సమర్థానాం ప్రథమాద్వా, తద్ధితః, ప్రత్యయః, శేషే (7-1).

అర్థ : సప్తమీసమర్థమునకు అందుపుట్టినవాఁడు అనునర్థమున అణాది ప్రత్యయములును ఘాదిప్రత్యయములను చేరును. ఉదా : స్రుఘ్నే జాతః స్రౌఘ్నః ఇత్యాదులు.

వివ : తత్ర అనునది సప్తమ్యర్థక అవ్యయము. సంధికార్యాదులు చేయఁబడిన సమర్థపదములలో మొదటిదాని విభక్తి నీపదము సూచించును. 'సమర్థమైన సప్తమ్యంత పదమునకు' అని యీ పదముచే నర్థమేర్పడును. 'జాతః' అనునర్థము ఈ సూత్రమున సూచింపఁబడినది. తద్ధిత ప్రకరణారంభమునందలి సాధారణ ప్రత్యయములగు అణాదులు 'తేనదీవ్యతి' అను సూత్రమునకు పూర్వమునఁ గల అర్థములన్నింటను వచ్చునని చెప్పుటచేత నవియును, శేషాధికారమున 'రాష్ట్రావార పారాద్ఘఖౌ' ఇత్యాదిసూత్రములచే విధింపఁబడిన ఘ మున్నగునవియును, 'అందు పుట్టినవాఁడు' అనునర్థమున సప్తమ్యంతపదములకు పరముగా చేరును.

ఉదా : స్రుఘ్నేజాతః – స్రుఘ్నదేశమున పుట్టినవాఁడు, స్రుఘ్న + ఙి, అణ్ (అణధికారములోనిదగుటచే సామాన్యమగు అణ్ ప్రత్యయముచేరినది) విభక్తిలోపము, ఆదివృద్ధి, స్రౌఘ్న + అ, యస్యేతిచ–అకారలోపము, స్రౌఘ్న + అ=స్రౌఘ్న+సు=స్రౌఘ్నః.

ఉత్సేజాతః, ఉత్సమనుచోట పుట్టినవాఁడు, ఉత్స + ఙి + అఞ్ (ఉత్సాదిభ్యోఽఞ్) ఉత్స + అ, ఆదివృద్ధి, అకారలోపము, ఔత్స + సు = ఔత్సః.

రాష్ట్రేజాతః, రాష్ట్రమున పుట్టినవాఁడు, రాష్ట్ర + ఙి, ఘ (రాష్ట్రావార పారాద్ఘఖౌ) విభక్తిలోపము, ఘకారమునకు ఇయాదేశము, అకారలోపము, రాష్ట్ర + ఇయ = రాష్ట్రియ + సు=రాష్ట్రియః

అవారపారేజాతః, సముద్రమున పుట్టినవాఁడు, అవారపార + ఙి, ఖ, (రాష్ట్రావారపారాద్ఘఖౌ) అవారపార + ఖఞ్, అకారలోపము, ఈనాదేశము, ణత్వము, అవారపారీణ + సు=అవారపారీణః మొ॥వి.

సూ : ప్రావృషష్ఠప్ 4-3-26.

వృ : ఏణ్యాపవాదః. ప్రావృషికః.

ప. వి : ప్రావృషః (5-1) ఠప్ (1-1).

అను : తత్ర (7-1) జాతః (1-1) సమర్థానామిత్యాది.

అర్థ : సప్తమ్యంతమగు ప్రావృట్చబ్దమునకు 'అందు పుట్టినవాఁడు' అను నర్థమున 'ఠప్' ప్రత్యయము వచ్చును. ఇది 'ఏణ్య' ప్రత్యయమున కపవాదము, ఉదా : ప్రావృషికః.

వివ : పూర్వము 'ప్రావృషఏణ్యః' అను సూత్రముచే ప్రావృట్ఛబ్దమునకు శేషార్థములందు ఏణ్యప్రత్యయము విధింపఁబడినది. ఇది దానికపవాదము. 'ప్రావృట్కాలమున పుట్టినవాఁడు' అనునర్థమునందు 'ఠప్' ప్రత్యయము వచ్చును. ఇతరార్థములందు ఏణ్య ప్రత్యయమగునని తాత్పర్యము. ఇందు పవర్గమిత్తు. 'ఠ' అనుదానికి ఇకాదేశమగును. (ఠస్యేకః)

ఉదా : ప్రావృషిభవః, ప్రావృష్ + ఙి, ఠప్, విభక్తిలోపము, ఇకాదేశము ప్రావృష్ + ఇక = ప్రావృషిక + సు = ప్రావృషికః - వర్షకాలమున పుట్టినది.

'శేషే' అనునధికారములో 'తత్రజాతః' అనునది ఒక అర్థవిశేషము

అప : ఇదియొక అర్థవిశేషము.

సూ : ప్రాయభవః 4-3-39.

వృ : తత్రేత్యేవ. స్రుఘ్నే ప్రాయేణ, బాహుల్యేన భవతి స్రౌఘ్నః.

ప వి : ప్రాయభవః (1-1).

అను : తత్ర (అవ్య) సమర్థానా మిత్యాది.

అర్థ : 'అందు అధికముగా ఉండునది'అనునర్థమున అణాది సాధారణప్రత్యయములు, ఘాదులగు శైషికప్రకరణ ప్రత్యయములును యథాసంభవముగ నగును.

వివ : సప్తమ్యంతములైన సమర్థపదములకు 'అందుఅధికముగా నుండునది' అనునర్థమున అణాదిప్రత్యయములు వచ్చును.

ఉదా : స్రుఘ్నేప్రాయభవః - స్రుఘ్నదేశమున అధికముగా నుండునది, స్రుఘ్న + ఙి + అణ్, విభక్తిలోపము, ఆదివృద్ధి, అకారలోపము, స్రౌఘ్న + సు = స్రౌఘ్నః.

శేషాధికారములో నిందు చెప్పఁబడిన రెండవయర్థ మీ 'ప్రాయభవః' అనునది.

సూ : సమ్భూతే 4-3-41.

వృ : స్రుఘ్నే సంభవతి స్రౌఘ్నః.

ప. వి : సమ్భూతే (7-1).

అను : తత్ర (అవ్య) సమర్థానా మిత్యాది.

అర్థ : సప్తమ్యంతపదమునకు 'అందు ఉండవచ్చును' అని సంభావింపఁదగిన దానిని చెప్పుచు అణాది ఘాది ప్రత్యయములు యథాసంభవముగ నగును ఉదా : స్రౌఘ్నః.

వివ : సమర్థపదములలో మొదటిదగు సప్తమ్యంతమునకు పరముగా, దానిచే వాచ్యమగు దేశాదికమునందు ఉండవచ్చునని సంభావింపఁబడు వస్తువును / వ్యక్తిని తెలుపుచు, సాధారణప్రత్యయములగు అణాదులును, శైషికప్రత్యయములగు 'ఘ' మున్నగునవియుఁ జేరును.

ఉదా : స్రుఘ్నే సంభవతి (స్రుఘ్నదేశమున నుండవచ్చునని ఊహింపఁబడునది) స్రుఘ్న + ఙి + అణ్, స్రౌఘ్న + సు = స్రౌఘ్నః.

ఈః 'సంభూత్' అనునది శైషికమున మూఁడవ యర్థము.

సూ : కోశాడ్ఢఞ్ 4-3-42.

వృ : కౌశేయం వస్త్రమ్.

ప. వి : కోశాత్ (5-1) ఢఞ్ (1-1).

అను : సమర్థానామిత్యాది.

అర్థ : కోశశబ్దమునకు 'దాని వికారము' అనునర్థమున ఢఞ్ ప్రత్యయము వచ్చును. ఉదా : కౌశేయమ్ వస్త్రమ్.

వివ : ఈ సూత్రమున కనుబంధముగా 'వికారేకోశాడ్ఢఞ్' అను వార్తికము చెప్పఁబడినది కావున షష్ఠ్యంత కోశశబ్దమునకు పరముగా దానియొక్క-వికారము అనునర్థమున, ఢఞ్ ప్రత్యయము చేరును. కోశస్యవికారః – (ఒకవిధమగు కృమియొక్క-కోశము (అంతర్భాగము) యొక్క- వికారము = అందుండి వెలువడిన పదార్థము) కోశ + ఙస్ + ఢఞ్, విభక్తిలోపము, ఆదివృద్ధి, ఢకారమునకు 'ఏయ్' ఆదేశము, కౌశ+ఏయ్+అ, యస్యేతిచ-అకారలోపము కౌశ్+ఏయ= కౌశేయ + సు=కౌశేయమ్. పట్టువస్త్రము.

సూ : తత్రభవః 4-3-53.

వృ : స్రౌఘ్నః, ఔత్సః, రాష్ట్రియః.

ప. వి : తత్ర (అవ్య) భవః (1-1)

అను : సమర్థానామిత్యాది.

అర్థ : 'అందున్నవాఁడు' అనునర్థమున సప్తమ్యంత సమర్థములకు అణాది సాధారణ ప్రత్యయములును, ఘాదిశైషికప్రత్యయములును వచ్చును. ఉదా : స్రౌఘ్నః, ఔత్సః, రాష్ట్రియః.

వివ : భూధాతువునకు ఉనికి అర్థము. కావున 'భవః' అనగా ఉన్న / ఉండు వాఁడు అని అర్థము. 'తత్ర జాతః' అనగా అందు పుట్టినవాఁడు. దానికిని దీనికిని భేద మిది. సప్తమ్యంతపదమునకు పరముగా 'దానిచే వాచ్యమగు దేశాదికమునందున్న వాఁడు' అనునర్థమున సాధారణ ప్రత్యయప్రకరణమున విధింపఁబడిన అణ్ మున్నగు ప్రత్యయములును, శేషాధికారమున చెప్పఁబడిన 'ఘ' మున్నగు ప్రత్యయములును యథాసంభవముగ, వచ్చును. యథాసంభవముగ వచ్చుట యనగా ఏ సూత్రమునందును పేర్కొనని శబ్దములకు అణ్ ప్రత్యయము, ఉత్సాదులకు అఞ్ ప్రత్యయమును (ఉత్సాదిభ్యోఽఞ్) రాష్ట్రశబ్దమునకు ఘప్రత్యయమును, అవారపారశబ్దమునకు 'ఖ' ప్రత్యయమును – ఈ విధముగా ఈ అర్థమునందు వచ్చునని భావము.

ఉదా : స్రుఘ్నేభవః – స్రౌఘ్నః (స్రుఘ్న + ఙి, అణ్) ఉత్సేభవః = ఔత్సః (ఉత్సాదిభ్యోఽఞ్ ఉత్స + ఙి + అఞ్) రాష్ట్రేభవః – రాష్ట్రియః (రాష్ట్రావారపారాద్ఘఖౌ – రాష్ట్ర + ఙి + ఘ, ఘకారమునకు ఇయాదేశము).

సూ : దిగాదిభ్యో యత్ 4-3-54.

వృ : దిశ్యమ్, వర్గ్యమ్.

ప. వి : దిగాదిభ్యః (5-3) యత్ (1-1).

అను : తత్ర (అవ్య) భవః (1-1) సమర్థానామిత్యాదికము.

అర్థ : 'అందున్నది' అనునర్థమున సప్తమ్యంతములగు దిగాదిపదములకు 'యత్' ప్రత్యయము వచ్చును.

వివ : దిశ్, వర్గమున్నగు సప్తమ్యంతపదములకు దానియందున్నది, ఉన్న వాఁడు అనునర్థమును తెలుపుచు యత్ ప్రత్యయము చేరును. ఇందు తకారమిత్తు.

ఉదా : దిశిభవమ్ - దిక్కునందున్నది. దిశ్ + ఙి + యత్, విభక్తి లోపము, దిశ్య + సు=దిశ్యమ్.

వర్గేభవమ్ - వర్గమునందున్నది. వర్గ + ఙి + యత్, విభక్తిలోపము, యస్యేతిచ-అకారలోపము, వర్గ్ + య=వర్గ్య+సు=వర్గ్యమ్.

దిగాదిగణము : దిశ్ వర్గ పూగ గణ పక్ష ధాయ్య మిత్ర మేధా అన్తర పథిన్ రహస్ అలీక ఉఖా సాక్షిన్ దేశ ఆది అన్త ముఖ జఘన మేఘ యూథ, 'ఉదకాత్సంజ్ఞాయామ్' 88. జ్ఞాయ (న్యాయ) వంశ వేశ కాల ఆకాశ-ఇతిదిగాదిః.

సూ . శరీరావయవాచ్చ 4-3-55.

వృ : దన్త్యమ్, కణ్ఠ్యమ్.

ప. వి : శరీరావయవాత్ (5-1) చ (అవ్య).

అను : తత్ర (అవ్య) భవః (1-1) సమర్థానామిత్యాది. యత్ (1-1).

అర్థ : సప్తమ్యంతమగు శరీరావయవవాచకమునకు 'అందున్నది' మున్నగు నర్థమున 'యత్' ప్రత్యయము వచ్చును ఉదా : దన్త్యమ్, కంఠ్యమ్ మొ॥వి.

వివ: శరీర అవయవవాచకములగు దంత, కంఠ, ఓష్ఠ, నాసిక మున్నగువాని సప్తమ్యంతరూపములకు పరముగా, అందు (దంతాదుల యందు) ఉండునది, అగునది, ఏర్పడునది అనునర్థములందు యత్ ప్రత్యయము వచ్చును పైనిజెప్పిన యర్థములు 'భవః' అనుదానికి సందర్భానుసారముగా ఊహించుకొనదగినవి.

ఉదా : దన్తేషుభవమ్ దన్త + సుప్, యత్, విభక్తిలోపము, దన్త + య (త్) యస్యేతిచ - అకారలోపము దన్త్ + య=దన్త్య+సు=దన్త్యమ్-దంతములయందేర్పడు తకారాది వర్ణాదికము.

కణ్ఠే భవమ్, కణ్ఠ + ఙి, యత్, కణ్ఠ + య, కణ్ఠ్ + య=కణ్ఠ్య + సు=కణ్ఠ్యమ్. (కంఠమున నేర్పడు కకారాది వర్ణాదికము).

వా॰ అధ్యాత్మాదేష్ఠఞిష్యతే (2869).

వృ : అధ్యాత్మంభవమాధ్యాత్మికమ్.

ప. వి : అధ్యాత్మాదేః (5-1) ఠఞ్ (1-1) ఇష్యతే (క్రి. ప).

అర్థ : అందుండునది అనునర్థమున అధ్యాత్మాదిశబ్దములకు 'ఠఞ్' ప్రత్యయము వచ్చుట ఇష్టము . ఉదా : అధ్యాత్మంభవ మాధ్యాత్మికమ్.

వివ : 'అధ్యాత్మ' మున్నగువానికి 'అందుండునది' అనునర్థమున 'ఠఞ్' ప్రత్యయము వచ్చును. ఇందు ఞకారమిత్తు. ఠకారమునకు 'ఠస్యేకః' అనుసూత్రముచే ఇకాదేశము వచ్చును.

ఉదా : అధ్యాత్మం భవమ్ ఆధ్యాత్మకశబ్దము 'ఆత్మని' – ఆత్మయందు అను నర్థముగల అవ్యయీభావమగుటచే అవ్యయము : అధ్యాత్మ + ఠఞ్, ఆదివృద్ధి ఆధ్యాత్మ + ఠ, ఇకాదేశము, ఆధ్యాత్మ + ఇక, యస్యేతిచ అకారలోపము ఆధ్యాత్మ్ + ఇక=ఆధ్యాత్మిక + సు = ఆధ్యాత్మికమ్

అవ : దేవేషు 'దేవులయందు' అనునర్థముగల 'అధిదేవ' అనునవ్యయము నకు 'ఠఞ్' ప్రత్యయము. 'అధిదేవ + ఠఞ్' అనియుండ క్రిందిసూత్రముచే ఉభయ పదవృద్ధి విధింపఁబడుచున్నది.

సూ . అనుశతికాదీనాంచ 7-3-20.

వృ : ఏషాముభయపదవృద్ధిర్ఞిణికిత్సుచ. ఆధిదైవికమ్, ఆధిభౌతికమ్, ఐహలౌకికమ్ ఆకృతిగణోఽయమ్.

ప. వి : అనుశతికాదీనామ్ (6-3) చ (అవ్య)

అను : తద్ధితేషు (7-3) అచామ్ (6-3) ఆదేః (6-1) వృద్ధిః (1-1) ఞ్ణితి (7-1) కితి (7-1) ఉత్తర పదస్య (6-1) పూర్వపదస్య (6-1).

అర్థ : అనుశతికాదులకు, ఞిత్తు, ణిత్తు, కిత్తులు పరములగునపుడు ఉభయ పదవృద్ధివచ్చును. ఉదా : ఆధిదైవికమ్ ఇత్యాది.

వివ : ఞకారణకారకకారము లిత్తులుగాఁ గల తద్ధితప్రత్యయములు పరములగు నపుడు పూర్వమున నున్నశబ్దస్వరూపముయొక్క అచ్చులలో తొలియచ్చునకు వృద్ధి వచ్చుటను పూర్వ మనేకోదాహరణములందు చూచితిమి (సూ. తద్ధితేష్వచామాదేః, కితిచ). ప్రకృత సూత్రము, 'అనుశతిక' మొదలగు వానిలోని పూర్వోత్తరపదముల యొక్క తొలిఅచ్చులు రెంటికిని ఞిత్ ణిత్ కిత్తులు పరములగునపుడు వృద్ధి వచ్చుటను విధించుచున్నది.

ఉదా : అధిదేవ + ఠఞ్, ఞిత్తు పరముగానున్నది కావున 'అధిదేవ' అనుదాని యందలి పూర్వపదమైన 'అధి' అను దానితొలిఅచ్చగు అకారమునకు, ఉత్తరపదమగు 'దేవ' అనుదానియందలి తొలిఅచ్చయిన ఏకారమునకు వృద్ధివచ్చును

(క్రమముగా అ, ఐలు వచ్చును) ఆధిదైవ + ఇక, యస్యేతిచ-అకారలోపము - ఆధిదైవ్ + ఇక = ఆధిదైవిక + సు = ఆధిదైవికమ్.

ఇట్లే అధిభూతంభవమ్ - అధిభూతమున నుండునది, అధిభూత + ఠఞ్ (అధ్యాత్మాదేష్ఠఞిష్యతే) ఉభయపదవృద్ధి, ఆధిభౌత+ఇక, అకారలోపము ఆధిభౌతిక + సు = ఆధిభౌతికమ్.

ఇహలోకే భవమ్ - ఈలోకమున నగునది. ఇహలోక + ఙి, ఠఞ్, విభక్తిలోపము, ఉభయపదవృద్ధి, ఐహలౌక + ఇక, అకారలోపము ఐహలౌక్ + ఇక = ఐహలౌకిక + సు=ఐహలౌకికమ్.

(i) అధ్యాత్మాదిగణము : అధ్యాత్మ అధిదేవ అధిభూత - ఇత్యధ్యాత్మాదిః.

(ii) అనుశతికాదిగణము : అనుశతిక అనుహోడ అనుసంవరణ (అను సంచరణ) అను సంవత్సర అఙ్గారవేణు అసిహత్య (అస్యహత్య) అస్యహేతి వధ్యోగ పుష్కరసద్ అనుహరత్ కురుకత కురు - పఞ్చాల ఉదకశుద్ధ ఇహలోక పరలోక సర్వలోక సర్వపురుష సర్వభూమి ప్రయోగ పరస్త్రీ 'రాజ పురుషాత్ ష్యఞ్'సూత్రనడ-ఇత్యనుశతికాదిః. ఆకృతిగణోఽయమ్. తేన అధిగమ అధిభూత అధిదేవ చతుర్విద్యా ఇత్యాదయోఽప్యన్యే విజ్ఞేయాః.

సూ : జిహ్వామూలాఙ్గులేశ్ఛః 4-3-62.

వృ : జిహ్వామూలీయమ్, అఙ్గులీయమ్.

ప. వి : జిహ్వామూలాఙ్గులేః (5-1) ఛః (1-1).

అను : శరీరావయవాత్ (5-1) తత్ర (అవ్య) భవః (1-1) సమర్థానామిత్యాది.

అర్థ : జిహ్వామూల, అఙ్గులి అను శరీరావయవవాచకములకు 'అందగునది' అనువర్థమున 'ఛ' ప్రత్యయము వచ్చును. ఉదా : జిహ్వామూలీయమ్, అంగులీయమ్.

వివ : ఇది 'శరీరావయవాత్' అనుసూత్రమున కపవాదము. శరీరావయవము లగు జిహ్వామూల, అంగులి అనువాని సప్తమ్యంతరూపములకు పరముగా అంద

ఉండునది, ఏర్పడునది అమనర్థమున 'ఛ' ప్రత్యయము వచ్చును. అయనేయీనీయ్యాది సూత్రముచే ఛకారమునకు 'ఈయ్' ఆదేశమగును.

ఉదా : జిహ్వామూలే భవమ్, నాలుకమొదట నేర్పడునది, జిహ్వామూల + ఙి, ఛ, విభక్తిలోపము, ఈయాదేశము, జిహ్వామూల + ఈయ్ + . అ (చ్ + అ) యస్యేతిచ అకారలోపము, జిహ్వామూల్ + ఈయ=జిహ్వామూలీయ+ సు=జిహ్వామూలీయమ్.

అఙ్గులౌభవమ్ - అంగుళియందుండునది అఙ్గుళి + ఙి, ఛ, విభక్తి లోపము, ఈయాదేశము, ఇకారలోపము, అఙ్గుల్ + ఈయ=అఙ్గులీయ + సు = అఙ్గులీయమ్

సూ : వర్గాన్తాచ్చ 4-3-63.

వృ : కవర్గీయమ్.

ప. వి : వర్గాన్తాత్ (5-1) చ (అవ్య).

అను : తత్ర (అవ్య) భవః (1-1) ఛః (1-1) సమర్థానామిత్యాదులు.

అర్థ : వర్గశబ్దమంతమునఁ గలశబ్దములకు 'అందుండునది' అనునర్థమున 'ఛ' ప్రత్యయము వచ్చును ఉదా : కవర్గీయమ్.

వివ : 'వర్గ' అనునది అంతమునఁ గల శబ్దముల సప్తమ్యంతమునకును పరముగా 'అందుండునది' అమనర్థమున 'ఛ' ప్రత్యయమగును.

ఉదా : కవర్గే భవమ్ = కవర్గమున నుండునది. కవర్గ + ఙి, ఛ, విభక్తి లోపము కవర్గ ఛ, ఈయాదేశము కవర్గ + ఈయ, అకారలోపము, కవర్గ్ + ఈయ = కవర్గీయ + సు కవర్గీయమ్.

'తత్ర భవః' అను సూత్రము మొదలుకొని యింతవఱకు అందుండునది అనునర్థమున సప్తమ్యంతసమర్థములకు వివిధప్రత్యయములు విధింపఁబడినవి. శేషాధికారమున నిది నాల్గవ యర్థము.

అవ : పేటొక యర్థమును, సమర్థ విభక్తియు ప్రారంభింపఁబడుచున్నవి.

సూ : తత ఆగతః 4-3-74.

వృ : స్రుఘ్నాదాగత స్రౌఘ్నః.

ప. వి : తతః (అవ్య) ఆగతః (1-1).

అను : సమర్థానామిత్యాదికము.

అర్థ : 'దానినుండి వచ్చినది' అనునర్థమున పంచమ్యంత పదములకు పరముగా సాధారణ ప్రత్యయములగు అణాదులును, శైషికప్రత్యయములగు ఘాదులును వచ్చును. ఉదా : స్రౌఘ్నః.

వివ : తచ్ఛబ్దమునకు 'తసిల్' అనుపంచమ్యర్థక తద్ధితప్రత్యయముచేరగా 'తతః' అగును. ఇది సమర్థపదముయొక్క పంచమీవిభక్తిని సూచించును. పంచమ్యంత పదమునకు పరముగా, 'దానిచే వాచ్యమగు దేశాదికమునుండి వచ్చినవాఁడు' అనునర్థమున సాధారణప్రత్యయప్రకరణమున విధింపఁబడిన అణాదులును, శైషిక ప్రకరణమున విధింపఁబడిన 'ఘ' మున్నగునవియు, వచ్చును.

ఉదా : స్రుఘ్నాదాగతః – స్రుఘ్నదేశమునుండి వచ్చినవాఁడు; స్రుఘ్న + ఙసి+అణ్ (ప్రాగ్దీవ్యతోఽణ్ అనుసూత్రమునుండి 'అణ్' అనునది యీ సూత్రమునకు అధికారముగా వచ్చును). విభక్తిలోపము, ఆదివృద్ధి, అకారలోపము, స్రౌఘ్న + సు = స్రౌఘ్నః.

సూ : ఠగాయస్థానేభ్యః 4-3-75.

వృ : శుల్కశాలాయా ఆగత శ్శౌల్కశాలికః.

ప. వి : ఠక్ (1-1) ఆయస్థానేభ్యః (5-3).
అను : తతః (అవ్య) ఆగతః (1-1) సమర్థానామిత్యాది.

అర్థ : ఆయస్థానవాచకములకు పరముగా 'దానినుండి వచ్చినవాఁడు' అనునర్థమున 'ఠక్' ప్రత్యయము వచ్చును. ఉదా : శుల్కశాలాయా ఆగతః శౌల్కశాలికః.

వివ : ప్రభుత్వమునకు వచ్చురూపములో వచ్చు ధనాదికమును ఆయ మందురు. దానియొక్క శాల ఆయశాల దానిని చెప్పుపదముల పంచమ్యంతరూపమునకు, అందుండి వచ్చినది / వచ్చినవాఁడు అనునర్థమున 'ఠక్' ప్రత్యయము వచ్చును. ఇందు కకారమిత్తు. దానివలన ఆదివృద్ధి వచ్చును. ఠకారమునకు ఇకాదేశము (ఠస్యేకః).

ఉదా : శుల్కశాలాయా ఆగతః. శుల్కశాలనుండి వచ్చినవాఁడు. శుల్కశాలా + ఙసి, ఠక్, విభక్తిలోపము, కిత్తివ – ఆదివృద్ధి,

శాల్కాశాలా + ఇక, యస్యేతిచ - అకారలోపము, శాల్కాశాల్ ఇక = శాల్కాశాలిక + సు = శాల్కాశాలికః.

సూ : విద్యా యోని సమ్బన్ధేభ్యో వుఞ్ 4-3-77.

వృ : ఔపాధ్యాయకః, పైతామహకః.

ప వి : విద్యా యోని సంబంధేభ్యః (5-3) వుఞ్ (1-1).

అను : తత (అవ్య) ఆగతః (1-1) సమర్థానామిత్యాది.

అర్థ : విద్యా యోని సంబంధవాచకములకు పరముగా, అటనుండి వచ్చినది/వచ్చినవాడు అనునర్థమునందు, వుఞ్ ప్రత్యయము వచ్చును.

ఉదా : ఔపాధ్యాయకః, పైతామహకః.

వివ : విద్యాసంబంధమనగా విద్యకు సంబంధించిన గురువు శిష్యుడు మొ॥వి. యోని సంబంధమనగా పుట్టుకకు సంబంధించినది. తండ్రి, తాత, కొడుకు మున్నగునవి. పంచమ్యంతములగు వీనికి, వానినుండి వచ్చినది అనునర్థమున 'వుఞ్' అను ప్రత్యయము చేరును ఇందు ఞకారమిత్తు. దానివలన ఆదివృద్ధి యగును. 'వు' అనుదానికి 'యువోరనాకౌ' అను సూత్రముచే 'అక' ఆదేశము.

ఉదా : ఉపాధ్యాయాదాగతః - ఉపాధ్యాయునివలన వచ్చినది. ఉపాధ్యాయ శబ్దము విద్యకు సంబంధించినది. ఉపాధ్యాయ + ఙసి, వుఞ్, ఆదివృద్ధి (ఉ > ఔ) ఔపాధ్యాయ + వు, 'అక' ఆదేశము ఔపాధ్యాయ + అక, యస్యేతిచ, అకారలోపము ఔపాధ్యాయ్ + అక = ఔపాధ్యాయక + సు = ఔపాధ్యాయకః.

పితామహాదాగతః - తాతనుండి వచ్చినది. పితామహశబ్దము యోని (పుట్టుక) సంబంధమును తెలుపునది. పితామహ + ఙసి + వుఞ్ విభక్తిలోపాదికము పైతామహక + సు = పైతామహకః.

సూ : హేతుమనుష్యేభ్యోఽన్యతరస్యాం రూప్యః 4-3-81.

వృ : సమాదాగతం సమరూప్యమ్. పక్షేగహాదిత్వాచ్ఛః - సమీయమ్, దేవదత్తరూప్యమ్ - దైవదత్తమ్ - దేవదత్తీయమ్

ప. వి : హేతుమనుష్యేభ్యః (5-3) అన్యతరస్యామ్ (అవ్య) రూప్యః (1-1).

అను : తతః (అవ్య) ఆగతః (1-1) సమర్థానామిత్యాది.

అర్థ : హేతువాచకమనుష్యవాచక పంచమ్యంతములకు పరముగా 'వాని నుండి వచ్చినది' అనునర్థమున 'రూప్య' అను ప్రత్యయము వైకల్పికముగా వచ్చును. ఉదా : సమాదాగతం సమరూప్యమ్-రానిపక్షమున, 'గహాదిభ్యశ్చ' అను సూత్రముచే 'ఛ' ప్రత్యయము - సమీయమ్. ఇట్లే దేవదత్తరూప్యమ్, దైవదత్తమ్, దేవదత్తీయమ్.

వివ : పంచమ్యంతములగు హేతువాచకశబ్దములకును, మనుష్యవాచకశబ్దములకును, ఆటనుండి వచ్చినది అనునర్థమున 'రూప్య' అను ప్రత్యయము చేరును అది వైకల్పికము.

ఉదా : సమాదాగతమ్, సమమువలన వచ్చినది ఇచట సమశబ్దము హేతువాచకము. సమ + ఙసి + రూప్య - విభక్తిలోపము-సమరూప్య + సు = సమరూప్యమ్. ఈ ప్రత్యయము రానిచో సమశబ్దము గహాదులలోనిదగుటచే 'ఛ' ప్రత్యయము వచ్చును. సమ + ఙసి + ఛ, విభక్తిలోపము, ఈయాదేశము సమ + ఈయ, యస్యేతిచ అకారలోపము సమ్, ఈయ = సమీయ + సు = సమీయమ్.

మనుష్యవాచకముల కుదాహరణము. దేవదత్తాదాగతమ్ - దేవదత్తునివలన వచ్చినది దేవదత్త + ఙసి, రూప్య, విభక్తిలోపము దేవదత్తరూప్య + సు = దేవదత్తరూప్యమ్. దేవదత్తశబ్దము మనుష్య నామవాచకమగుటచే వృద్ధ సంజ్ఞ దీనికి వైకల్పికముగా నగును (వా నామధేయస్య వృద్ధసంజ్ఞా వక్తవ్యా) కావున రూప్య ప్రత్యయము రానిచో వృద్ధసంజ్ఞయున్నయెడల 'వృద్ధాచ్ఛః' అనుసూత్రముచే ఛ ప్రత్యయము అగును. దేవదత్త + ఙసి, ఛ, విభక్తిలోపము, ఈయాదేశము, అకారలోపము, దేవదత్తీయ + సు = దేవదత్తీయమ్ వృద్ధసంజ్ఞలేనియెడల సాధారణ ప్రత్యయమగు 'అణ్' వచ్చును. దేవదత్త + ఙసి + అణ్, ఆది వృద్ధ్యాదులు 'దైవదత్తమ్'.

సూ : మయట్ చ 4-3-82.

వృ : సమమయమ్, దేవదత్తమయమ్.

వ. వి : మయట్ (1-1) చ (అవ్య).

అను : హేతుమనుష్యేభ్యః (5-3) తతః (అవ్య) ఆగతః (1-1) సమర్థానామిత్యాది.

అర్థ : 'అటనుండి వచ్చినది' అనునర్థమున పంచమ్యంతములగు హేతు మనుష్యవాచకములకు పరముగా మయట్ ప్రత్యయము కూడ వచ్చును. ఉదా : సమమయమ్, దేవదత్తమయమ్.

వివ : పూర్వసూత్రమున విధింపఁబడిన రూప్యప్రత్యయము వచ్చు నర్థములో 'మయట్' ప్రత్యయము కూడనగునని సూత్రార్థము. కావున పంచమ్యంతములగు హేతువాచక మనుష్యవాచకశబ్దములకు పరముగా, 'అటనుండి వచ్చినది' అనునర్థమున 'మయట్' ప్రత్యయమును చేరును. ఇందు టకారమిత్తు (హలన్త్యమ్).

ఉదా : సమాదాగతమ్ - సమ+ఙసి+మయట్, విభక్తిలోపము సమమయ+సు=సమమయమ్.

దేవదత్తాదాగతమ్, దేవదత్త+ఙసి+మయట్, దేవదత్తమయ+సు=దేవదత్తమయమ్

'తతఆగతః' మొదలుకొని యింతవఱకుఁ జెప్పఁబడిన అర్థము ఇందలి శైషికములలో నైదవది.

అవ : మఱియొకయర్థము.

సూ : ప్రభవతి 4-3-83.

వృ : హిమవతః ప్రభవతి హైమవతీగఙ్గా.

ప. వి : ప్రభవతి (క్రి. ప).

అను : తతః (అవ్య) సమర్థానామిత్యాదులు

అర్థ : 'దానివలన పుట్టునది' అనునర్థమున పంచమ్యంత సమర్థమునకు పరముగా అణాదిప్రత్యయములగును. ఉదా : హిమవతః ప్రభవతి హైమవతీ గఙ్గా.

వివ : 'దానివలన పుట్టుచున్నది' అనునర్థమున పుట్టుకస్థానమును దెలుపు శబ్దము యొక్క పంచమ్యంతరూపమునకు పరముగా అణాదిసాధారణ ప్రత్యయములు, ఘాదిశైషిక ప్రత్యయములును అగును.

ఉదా : హిమవతః ప్రభవతి - హిమవంతునియందు పుట్టుచున్నది హిమవత్ + ఙసి, అణ్, విభక్తిలోపము, ఆదివృద్ధి, హైమవత్ + అ = హైమవత, ఇది గంగా అను స్త్రీలింగశబ్దమునకు విశేషణమగుటచే ఇదియును స్త్రీలింగము కావలయును. టిడ్ఢాణఞ్ ఇత్యాదిసూత్రముచే అణంతములకు స్త్రీత్వమున 'ఙీప్' ప్రత్యయము వచ్చును. హైమవత + ఙీప్ (ఙకారపకారములిత్తులు) హైమవత + ఈ,

యస్యేతిచ – అకారలోపము, 'హైమవత్ + ఈ' = హైమవతీ + సు = హైమవతీ.

'ప్రభవతి' అనునది శైషికములలో నాలవ యర్థము.

అవ : అర్థాంతరము వివరింపఁబడుచున్నది.

సూ : తద్గచ్ఛతి పథిదూతయోః 4-3-85.

వృ : స్రుఘ్నం గచ్ఛతి స్రౌఘ్నః పన్థాదూతో వా.

వ. వి : తత్ (2-1) గచ్ఛతి (క్రి. ప) పథిదూతయోః (7-2)

అను : సమర్థానామిత్యాది.

అర్థ : 'దానిని గూర్చి వెళ్ళును' అనునర్థమున ద్వితీయాంతసమర్థమునకు మార్గము, దూత అనునవి గమ్యమానములగునపుడు అణాది ప్రత్యయములుచేరును. ఉదా : స్రుఘ్నంగచ్ఛతి, స్రౌఘ్నః పన్థా, దూతో వా.

వివ : 'తత్' అనునది గమనక్రియలో నుద్దేశ్యమగు దేశాదివాచక ద్వితీయాంతమునకు చిహ్నము. అట్టి ద్వితీయాంతపదమునకు, 'దానిని గూర్చి వెళ్ళువాఁడు' అనునర్థమున అణాది ప్రత్యయములు వచ్చును. ప్రత్యయాంతముచే దూతయో, మార్గమో వ్యక్తము కావలయును.

ఉదా : స్రుఘ్నంగచ్ఛతి – స్రుఘ్నదేశమునకు పోవునది / పోవువాఁడు స్రుఘ్న + అమ్ + అణ్, విభక్తిలోపాదులు, స్రౌఘ్న + సు = స్రౌఘ్నః = స్రుఘ్న దేశమునకు పోవుబాట లేక దూత.

'తద్గచ్ఛతి' అనునది శైషికములలో నేదవ యర్థము.

అవ : మఱియొక యర్థము.

సూ : అభినిష్క్రామతి ద్వారమ్ 4-3-86.

వృ : స్రుఘ్న మభినిష్క్రామతి స్రౌఘ్నం కాన్యకుబ్జ ద్వారమ్.

వ. వి : అభినిష్క్రామతి (క్రి. ప) ద్వారమ్ (1-1)

అను : తత్ (2-1) సమర్థానామిత్యాది.

అర్థ : 'దానిని వెడలుచున్నాఁడు' అనునర్థమున ద్వారముగమ్యమానమగునపుడు, ద్వితీయాంతపదములకు అణాదిఘాదిప్రత్యయములు చేరును. ఉదా : స్రౌఘ్నం కాన్యకుబ్జద్వారమ్.

వివ : 'అభినిష్క్రామతి' అనగా 'అభిముఖముగా నిష్క్రమించుచున్నాఁడు' అని యర్థము. నిష్క్రమింపఁబడునది ద్వారముకావలయును. ఒకవ్యక్తి దేనినుద్దేశించి యొక ద్వారమునుండి వెలువడునో తద్వాచక ద్వితీయాంత పదమునకు అద్వారమును దెలుపుచు అణాది ప్రత్యయములు వచ్చునని తాత్పర్యము.

ఉదా : స్రుఘ్నమభినిష్క్రామతి స్రౌఘ్నం కాన్యకుబ్జద్వారమ్ - స్రుఘ్న దేశము నభిముఖముగా చేసికొని వెలువడుద్వారము. స్రుఘ్న + అమ్, అణ్, విభక్తిలోపము, ఆదివృద్ధి, అకారలోపము-స్రౌఘ్న + సు = స్రౌఘ్నమ్. కాన్యకుబ్జముయొక్క కోటనుండి స్రుఘ్నదేశమువైపు పోవుటకు వీలైన ద్వారమని దీనియర్థము.

'అభినిష్క్రామతిద్వారమ్' అనునది యందెనిమిదవ యర్థము.

సూ . అధికృత్య కృతే గ్రన్థే 4-3-87.

వృ : శారీరక మధికృత్య కృతో గ్రన్థః శారీరకీయః. శారీరకంభాష్యమితి త్వభేదోపచారాత్.

ప వి : అధికృత్య (అవ్య) కృతే (7-1) గ్రన్థే (7-1).

అను : తత్ (2-1) సమర్థానా మిత్యాది.

అర్థ : 'దాని నధికరించి' (విషయముగా చేసికొని) అనునర్థమున, చేయఁబడిన గ్రంథము వాచ్యమగునపుడు ద్వితీయాంత సమర్థపదమునకు అణాదిప్రత్యయములు యథాసంభవముగ నగును. ఉదా : శారీరక మధికృత్య కృతో గ్రన్థఃశారీరకీయః. శారీరకభాష్యమనుచోట విషయ గ్రంథనామముల కభేదోపచారమని యెఱుఁగునది.

వివ : 'దీనిని విషయముగా చేసికొని యీ గ్రంథము వ్రాయఁబడినది' అనునర్థమున విషయమును దెలుపు ద్వితీయాంతపదమునకు, ప్రత్యయాంతముచే గ్రంథము వాచ్యమగునపుడు, అణాదిప్రత్యయములు, శేషాధికార ప్రత్యయములును యథాయోగ్యముగ వచ్చును.

ఉదా : శారీరక మధికృత్య కృతో గ్రంథః - శారీరకమును విషయముగా చేసి వ్రాయఁబడిన గ్రంథము. శారీరక + అమ్ + ఛ - శారీరకశబ్దమున అద్యచ్చు (శ్ + ఆ) వృద్ధిసంజ్ఞకము. కావునశబ్దమునకు వృద్ధమనుపేరుకలుగును (వృద్ధిర్యస్యాచామాదిస్తద్వృద్ధమ్) అందువలన 'వృద్ధాచ్ఛః' అను సూత్రముచే శైషికార్థమున ఛ ప్రత్యయము వచ్చినది. విభక్తిలోపము, ఈయాదేశము, అకారలోపము శారీరక్ + ఈయ=శారీరకీయ + సు=శారీరకీయః.

ఈ సూత్రముచే శారీరకీయమగుభాష్యము అని కావలసియుండ 'శారీరకం భాష్యమ్' అను వ్యవహారమెట్లు కుదురును? అను ప్రశ్నకు విషయమునకు గ్రన్థ నామమునకు అభేదమును భావించుటవలన కుదురునను సమాధానము చెప్పఁబడినది. శకుంతలను చదువుచున్నాను అనగా శకుంతలను గూర్చి వ్రాయఁబడిన గ్రంథమును చదువుచున్నానని భావము. పై 'శారీరకం భాష్యమ్' అనునది అట్టిది. కొన్నియెడల గ్రంథకర్తృనామమునకు గ్రంథనామమునకు అభేదోపచారముండును భారవిని చదువుచున్నాఁడు అనగా భారవికృతకిరాతార్జునీయకావ్యము చదువుచున్నాఁడని అర్థము. ఉపచార మనగా 'సూచన' అని స్థూలమైన అర్థము.

'అధికరించి వ్రాయఁబడిన గ్రంథము' అనునది శైషికములలో నిట తొమ్మిదవది.

సూ : సోఽస్యనివాసః 8-3-89.

వృ : స్రుఘ్నోనివాసోఽస్య స్రౌఘ్నః.

ప. వి : సః (1-1) అస్య (6-1) నివాసః (1-1).

అను : సమర్థానామిత్యాది.

అర్థ : 'ఇది ఇతనికి నివాసము' అనునర్థమున దేశాదికమును జెప్పుసమర్థ ప్రథమాంతమునకు పరముగా అణాదిప్రత్యయములు చేరును. ఉదా : స్రుఘ్న మీతనికి నివాసము. స్రౌఘ్నః.

వివ : ఒకస్థలమును పేర్కొని యిది యితనికి నివాసము అని చెప్పునపుడు దేశవాచకశబ్దముయొక్క ప్రథమాంతమునకు పరముగా, అది నివాసముగాఁగల వ్యక్తిని చెప్పుచు సాధారణప్రత్యయములగు 'అణ్' మున్నగునవియు శైషికములగు 'ఘ' మున్నగునవియు యథాయోగ్యముగ వచ్చును.

ఉదా : స్రుఘ్నోనివాసోఽస్య - 'స్రుఘ్న + సు + అణ్', ఆదివృద్ధ్యాదులు స్రౌఘ్న + సు = స్రౌఘ్నః - స్రుఘ్నమునందు నివసించు వాఁడని అర్థము.

ఇది పదియవయర్థము.

సూ : తేనప్రోక్తమ్ 4-3-101.

వృ : పాణినినా ప్రోక్తం పాణినీయమ్.

ప. వి : తేన (3-1) ప్రోక్తమ్ (1-1).

అను : సమర్థానామిత్యాది.

అర్థ : 'అతనిచే చెప్పఁబడినది' అనునర్థమున తృతీయాంతపదమునకు, పరముగా అణాదిప్రత్యయములు యథాసంభవముగ వచ్చును. ఉదా : పాణినినా ప్రోక్తమ్ - పాణినీయమ్.

వివ : ఒకనిచే చెప్పఁబడిన శాస్త్రాదికమును ఆ వ్యక్తిపేరుతో చెప్పునపుడు కర్తయగు నాతని నామమును దెలుపు శబ్దముయొక్క తృతీయాంతరూపమునకు పరముగా, అణాదిసాధారణ ప్రత్యయములును, శైషికములగు ఛ మున్నగునవియు యథాసంభవముగ వచ్చును.

ఉదా : పాణినినా ప్రోక్తమ్ - పాణినిచే చెప్పఁబడినది, పాణిని + టా + ఛ, పాణిని శబ్దము వృద్ధ సంజ్ఞకము కావున 'వృద్ధాచ్ఛః' అను సూత్రముచే ఛ ప్రత్యయము. విభక్తిలోపము, 'ఈయ్' ఆదేశము, ఇకారలోపము పాణిన్ + ఈయ = పాణినీయ + సు = పాణినీయమ్-పాణినిచే చెప్పఁబడిన వ్యాకరణశాస్త్రము.

ఇది శైషికములలో పదునొకండవ యర్థము.

సూ : తస్యేదమ్ 4-3-120.

వృ : ఉపగోరిద మౌపగవమ్.

ప. వి : తస్య (6-1) ఇదమ్ (1-1).

అను : సమర్థానామిత్యాది.

అర్థ : 'అతనికి సంబంధించినది' అనునర్థమున షష్ఠ్యంతమునకు పరముగా అణాది ప్రత్యయములు వచ్చును. ఉదా : ఉపగువునకు సంబంధించినది-ఔపగవమ్.

వివ : ఒక వస్తువనో వ్యక్తినో పేర్కొని దానికి లేక అతనికి సంబంధించినది అని చెప్పునపుడు సంబంధివాచకశబ్దముయొక్క షష్ఠ్యంతమునకు పరముగా సాధారణప్రత్యయములగు అణాదులును, శైషికములగు ఛాదులును యథాసంభవముగ నగును.

ఉదా : ఉపగోరిదమ్ - ఉపగువునకు సంబంధించినది. ఉపగు + ఙస్ + అణ్, విభక్తిలోపము, ఆదివృద్ధి, ఔపగు+అ, ఓర్గుణః, ఔపగో + అ, అవాదేశము ఔపగవ + సు = ఔపగవమ్.

ఇది శైషికములలో పండ్రెండవ యర్థము.

ఇది శైషిక ప్రకరణము.

ప్రకరణావలోకనము : అపత్యార్థము, రక్తాద్యర్థము, చతురర్థిఅనునవి కాక తక్కినవి ఇట (తస్యవికారః అనునది హద్దుగాఁగలవి) శేషశబ్దవాచ్యములు. ఇందు పంద్రెండు అర్థ విశేషములు చెప్పఁబడినవి. ఆ అర్థవిశేషములలో వచ్చు ప్రత్యయములేవిభక్త్యంతములకు వరముగా వచ్చునో యావిభక్త్యంతములు, తత్ర. తతః, తేన, మున్నగు తచ్ఛబ్దరూపములచే చెప్పఁబడినవి. ఈ ప్రకరణమున ఆయాపదములకు రాఁదగు ప్రత్యయములు ముందు చూపఁబడినవి. 'తత్రజాతః' మున్నగు నర్థ విశేషములు తర్వాత పేర్కొనఁబడినవి ఆ అర్థవిశేషములం దాయా విభక్త్యంతమున రాష్ట్రాదిశబ్దములకు 'ఘ' మున్నగు ప్రత్యయము లగునని తాత్పర్యము. తద్ధిత ప్రకరణారంభమునందలి సాధారణప్రత్యయములకు కూడ అచ్చటి కచ్చట అర్థ నిర్దేశము చేయఁబడలేదు. అవి 'తేన దీవ్యతి ఖనతిజయతి జితమ్'అనునది హద్దుగాఁ గల అర్థములలో వచ్చునని చెప్పఁబడియుండుటచే ఈశైషికార్థములును ఆ పరిధి లోనివే కనుక అందలి అణాది ప్రత్యయములు ఆయాపదములకు వచ్చును. శబ్దమును పేర్కొనక అర్థమును సమర్థ విభక్తిని మాత్రమే సూచించినతావులందెల్ల వేఱుప్రత్యయమున కవకాశము ఉండదు కావున 'ప్రాగ్దీవ్యతోఽణ్' అనుదానినుండి అధికారరూపమున వచ్చు అణ్ ప్రత్యయము వానికి చేరును. ప్రసుప్నశబ్దమున కిట్లు అనేకార్థములలో అణ్ ప్రత్యయమగుట చూపఁబడినది సందర్భమును బట్టి దానికాయాయర్థములు నిర్ణయింపఁబడును. ఆయర్థములందు రాష్ట్రశబ్దమునకు ఘ ప్రత్యయము, ప్రావృట్ఛబ్దమునకు ఏణ్యప్రత్యయము మున్నగు విధములుగా విధింపఁబడినవి. వీనికి ఘాదులే వచ్చును గాని అణు రాదు. ఇట్లు తక్కిన విషయములనూహించుకొనునది.

ఇందు 'వృద్ధ' సంజ్ఞ నిర్వచింపఁబడినది. తస్మిన్నణిచయుష్మాకాస్మాకౌ, తవకమమకావేకవచనే, ప్రత్యయోత్తరపదయోశ్చ అవ్యయానాం భమాత్రేటిలోపః, అనుశతికాదీనాంచ అనునవి కార్యవిశేషములను ప్రపంచించినవి. తక్కినసూత్రములు ప్రత్యయవిధాయకములు. ఇందు చెప్పఁబడిన పంద్రెండర్థము లాయాతావులందు వివరణాంతమున యథోచితముగ పేర్కొనఁబడినవి.

అథ ప్రాగ్దీవ్యతీయ ప్రకరణమ్

అవ : ఇటనుండి 'దాని వికారము', 'దాని అవయవము' అనునర్థములలో తద్ధిత ప్రత్యయములు విధింపఁబడుచున్నవి 'తస్యవికారః' అను నధికారము 4-3-134 తో ప్రారంభమై నాల్గవ అధ్యాయములోని తృతీయపాదము అంతము వఱకు ప్రసరించుచున్నది. చతుర్థ పాదారంభములో దీవ్యత్యర్థములలో ప్రత్యయములు చెప్పఁబడుచున్నవి దానికి పూర్వముననున్నది యగుటచే దీనికి ప్రాగ్దీవ్యతీయ ప్రకరణమని పేరు.

సూ : తస్యవికారః 4-3-134.

వ వి : తస్య (6-1) వికారః (1-1).

అను : సమర్థానాం ప్రథమాద్వా, తద్ధితః, ప్రత్యయః, అణ్ (ప్రాగ్దీవ్యతోఽణ్)

అర్థ : 'దానియొక్క వికారము' అనునర్థమున సమర్థమైన షష్ఠ్యంతమునకు యథాయోగముగా 'అణ్' మున్నగు ప్రత్యయములు వచ్చును

వివ : వికారమనగా విక్రియ, మార్పు. మూలవస్తువునుండి అవస్థాంతరమును పొంది రూపొందిన వస్త్వాదిక మనితాత్పర్యము. గోవునుండి లభ్యమగు క్షీరాదికము గోవుయొక్క వికారము ఈ వికారము దేనిదో దానిని చెప్పు శబ్దము యొక్క షష్ఠ్యంతపదమునకు, ఆ వికారమగు వస్త్వాదికమును తెలుపుటకు సాధారణ ప్రత్యయప్రకరణమున విధింపఁబడిన అణ్ మున్నగునవియు ఈ ప్రకరణమున విధింపఁబడు 'మయట్' మున్నగు విశేష ప్రత్యయములును యథాసంభవముగ వచ్చును. అనగా విశేషప్రత్యయములు వేనివేనికి విధింపఁబడునో వానివానికవియే వచ్చును. అట్లు ప్రత్యేకించి ప్రత్యయము చెప్పనిచోట 'ప్రాగ్దీవ్యతోఽణ్' అను సూత్రమునుండి అధికారముగా వచ్చు అణ్ ప్రత్యయము చేరునని తాత్పర్యము.

ఉదా : అశ్మనః వికారః - రాతియొక్క వికారము; అశ్మన్ + ఙస్, అణ్ ప్రాతిపదికత్వము (కృత్తద్ధితసమాసాశ్చ) విభక్తిలోపము (సుపోధాతు ప్రాతిపదికయోః) ఆదివృద్ధి (తద్ధితేష్వచామాదేః) 'ఆశ్మన్ + అ' అనియుండ 'నస్తద్ధితే' అనుసూత్రముచే ప్రాప్తమగు టిలోపమును 'అన్' అనుసూత్రము వారించినది. కాని యిచట టిలోపము అవసరమగుటచే ఈ క్రింది వార్తికము దానిని మరల విధించుచున్నది.

వా॥ అశ్మనో వికారే టిలోపో వక్తవ్యః (4185)

వృ : అశ్మనో వికార ఆశ్మః.

వ. వి : అశ్మనః (6-1) వికారే (7-1) టిలోపః (1-1) వక్తవ్యః (1-1

అర్థము : అశ్మన్ శబ్దమునకు వికారార్థకమగు అణ్ ప్రత్యయము పరమైన నపుడు టిలోపము చెప్పఁదగును. ఉదా : ఆశ్మః.

వివ : అశ్మన్ శబ్దమునందు 'అన్' అనుభాగము టి. 'న ద్ధితే' అని సూత్రముచే దీనికి లోపము రావలసియుండగా 'అన్' సూత్రముచే లోపనిషేధము చెప్పఁబడి యుండుటచే ఈ వార్తికము 'అశ్మన్'లోని 'అన్' అనుదానికి వికారార్థమున వచ్చిన అణ్ ప్రత్యయము పరమగునపుడు సూత్రము లోపమును విధించుచున్నది.

అశ్మన్ + అ, టిలోపము ఆశ్మ + అ=ఆశ్మ+స = ఆశ్మః.

అవ : మఱి రెండుదాహరణములు వికారార్థమున చూపఁబడుచున్నవి.

వృ : భాస్మనః, మార్తికః.

వివ : భస్మనః వికారః – భస్మముయొక్క వికారము, భస్మన్ + ఙస్ + అణ్, విభక్తిలోపము, ఆదివృద్ధి, భాస్మన్ + అ, టిలోపము రావలసియుండగా 'అన్' అనుసూత్రముచే నిషేధింపఁబడినది భాస్మన + సు=భాస్మనః.

మృత్తికాయాః వికారః, మట్టియొక్క వికారము, మృత్తికా + ఙస్ + అణ్, విభక్తిలోపము, ఆదివృద్ధి (ఋ > అర్) మార్తికా + అ, యస్యేతిచ, ఆకారలోపము, మార్తిక + సు=మార్తికః.

రాతితో చేయఁబడిన విగ్రహము. భస్మముతో నేర్పడిన ఔషధాదికము, మట్టితో చేయఁబడిన పాత్రాదికము వికారములుగా భావింపఁబడవచ్చును.

సూ : అవయవే చ ప్రాణ్యోషధి వృక్షేభ్యః 4-3-135.

వృ : చాద్వికారే. ఏభ్యోఽవయవే వికారే వా మాయూరః; మౌర్వం కాణ్డం భస్మవా; పైప్పలమ్.

వ. వి : అవయవే (7-1) చ (అవ్య) ప్రాణి, ఓషధి, వృక్షేభ్యః (5-3).

అను : తస్య (6-1) సమర్థానామిత్యాది, అణ్ (1-1).

అర్థ : ప్రాణివాచకములయు, ఓషధివాచకములయు, వృక్షవాచకములయు షష్ఠ్యంతములకు దాని అవయవము అనునర్థమునను, చకారమువలన వికారార్థము నందును అఞ్ మున్నగు ప్రత్యయములు వచ్చును. ఉదా : మాయూరః ఇత్యాది.

వివ : అవయవమనగా భాగము, ఏకదేశము. ప్రాణులయొక్కయు, ఓషధులయొక్కయు, వృక్షములయొక్కయు అవయవములు ప్రత్యయాంతములచే వాచ్యములగునపుడు వాని షష్ఠ్యంతరూపములకు అఞ్ మున్నగు సాధారణ ప్రత్యయములు వచ్చును అవయవేచ = అవయవార్థమునందును అనుట ప్రకరణము ననుసరించి యీ ప్రాణ్యాదివాచకములకు వికారార్థమునను ఈ ప్రత్యయము లగు నని తాత్పర్యము

ఉదా : మయూరస్య అవయవో వికారో వా – మయూరము యొక్క అవయవము లేక వికారము, మయూరము ప్రాణివాచకము; మయూర + ఙస్ + అఞ్ ('ప్రాణిరజతాదిభ్యః' అను సూత్రముచే అఞ్ ప్రత్యయము) విభక్తిలోపము, ఆది వృద్ధి, అకారలోపము, మాయూర్ + అ, మాయూర + సు = మాయూరః .. నెమలి పింఛము మొదలగునవయవము కాని, వికారమగు గ్రుడ్డు మొ॥ది కాని దీనిచే వాచ్య మగును

మూర్వాయాః అవయవో వికారో వా, 'మూర్వా' అనునది ఒక ఓషధి విశేషము. ఓషధియనగా తృణలతారూపమైనది మూర్వా + ఙస్ + అఞ్ (సాధారణప్రత్యయము) విభక్తిలోపము, ఆదివృద్ధి (ఊ > ఔ) మౌర్వా + అ, యస్యేతిచ ఆకారలోపము 'మౌర్వ్ + అ' = మౌర్వ + సు = మౌర్వమ్ - అవయవమైనచో కాండమని యర్థము. వికారమయినచో మూర్వయొక్క భస్మమని యర్థము.

పిప్పలస్య అవయవో వికారోవా – పిప్పల మనగా రావిచెట్టు. ఇది వృక్ష వాచకము. పిప్పల + ఙస్ + అణ్, విభక్తిలోపము, ఆదివృద్ధి, (ఇ > ఐ) పైప్పల + అ, అకారలోపము, పైప్పల్ + అ = పైప్పల + సు = పైప్పలమ్ - రావిచెట్టు అవయవము లేక దాని వికారమగు భస్మము మొ॥ది.

సూ : మయడ్వైతయోర్భాషాయామభక్ష్యాచ్ఛాదనయోః. 4-3-143.

వృ : ప్రకృతి మాత్రాన్మయడ్వాస్యాద్వికారావయవయోః. అశ్మమయమ్ - ఆశ్మనమ్. అభక్ష్యేత్యాదికిమ్? మౌద్గస్సూపః, కార్పాసమాచ్ఛాదనమ్.

ప. వి : మయట్ (1-1) వా (అప్య) ఏతయోః (7-2) భాషాయామ్ (7-1) అభక్ష్యాచ్ఛాదనయోః (7-2)

అను : తస్య (6-1) సమర్థానామిత్యాది

అర్థ : ఏ శబ్దమునకైనను దాని వికారము, అవయవము అను నర్థమున, లోకభాషయందు మయట్ ప్రత్యయము వైకల్పికముగా నగును. భక్ష్యము, ఆచ్ఛాదనము అనునవి గమ్యమగునపుడు మాత్రము ఈ ప్రత్యయము రాదు. ఉదా : అశ్మమయమ్ - ఆశ్మనమ్. అభక్ష్య - ఇత్యాదిపదమేల ? మౌద్గః సూపః, కార్పాసమాచ్ఛాదనమ్ అనుచోట మయట్ ప్రత్యయము రాలేదు.

వివ : దాని అవయవమును గాని వికారమునుగాని చెప్పవలసినచో తద్వాచక షష్ఠ్యంతమునకు పరముగా మయట్ ప్రత్యయము వైకల్పికముగా వచ్చును. ఇది లోకభాషయందు వచ్చు ప్రత్యయము. వేదమునందు రాదని భావము. ప్రత్యయాంతముచే వాచ్యమగునది భక్ష్యముగాని ఆచ్ఛాదనముగాని అయినచో నీ ప్రత్యయము రాదు వైకల్పికమనుటచే ఇది రానియెడల తక్కిన అణాదిసాధారణ ప్రత్యయములును, వక్ష్యమాణ విశేషప్రత్యయములును వానికి చేరును. ప్రకృతిమాత్రాత్ అనుటవలన విధి ఏ శబ్దమునకైనను యోగ్యతానుగుణముగ చేయును.

ఉదా : అశ్మనః అవయవో వికారో వా. అశ్మన్ + ఙస్ + మయట్. టకారమిత్తు. 'అశ్మన్ + మయ' 'నలోపః ప్రాతిపదికాన్తస్య' అనుసూత్రముచే నకారలోపము, అశ్మమయ + సు = అశ్మమయమ్ - రాతి అవయవము, లేక వికారము మయట్ ప్రత్యయము రానిచో 'అణ్' ప్రత్యయమగును. అశ్మన్ + ఙస్, అణ్ - విభక్తిలోపము, ఆదివృద్ధి, ఆశ్మన్ + అ, వికారార్థమున మాత్రమే టిలోపము (అశ్మనో వికారే టిలోపో వక్తవ్యః) అవయవార్థమున 'అన్' అను వానికి లోపమురాదు (అన్) ఆశ్మన + సు=ఆశ్మనమ్.

అవయవము, వికారము అగునది భక్ష్యము(తినఁబడునది)లేక ఆచ్ఛాదనము (కప్పునది) అయినపుడు ఈ మయట్ ప్రత్యయమురాదని 'అభక్ష్యాచ్ఛాదనయోః అనుపదమువలన తెలుపఁబడినది. కాన ముద్గానాం వికారః సూపః అనునర్థమున 'ముద్గానామ్' అనుదానికి మయట్ ప్రత్యయమురాదు. బిల్వాదిభ్యోఽణ్ అనుసూత్రముచే

అణ్ ప్రత్యయము వచ్చును. ముద్గ + అమ్, అణ్, విభక్తిలోపము, ఆదివృద్ధి (ఉ > ఔ) అకారలోపము, మౌద్గ + సు = మౌద్గఃసూపః పెసలతో వండఁ బడిన పప్పు.

కర్పాస్యాః అవయవో వికారో వా కర్పాసీ + ఙస్, అణ్, విభక్తి లోపము, ఆదివృద్ధి, కార్పాసీ + అ, యస్యేతిచ-ఈకారలోపము, కార్పాస్ + అ=కార్పాస+సు=కార్పాసమ్. ఇచట 'బిల్వాదిభ్యోఽణ్' అను సూత్రముచే అణ్ ప్రత్యయము.

సూ : నిత్యం వృద్ధశరాదిభ్యః 4-3-144.

వృ : ఆమ్రమయమ్, శరమయమ్

ప వి : నిత్యమ్ (2-1) వృద్ధశరాదిభ్యః (5-3).

అను : మయట్ (1-1) అవయవే (7-1) వికారః (1-1)సమర్థానామిత్యాది.

అర్థ : వృద్ధ సంజ్ఞకములకును, శరాదులకును దానియొక్క అవయవము వికారము అనుసర్థములందు మయట్ ప్రత్యయము నిత్యముగా వగును. ఉదా : ఆమ్రమయమ్, శరమయమ్.

వివ: పూర్వసూత్రముచే వైకల్పికముగా ప్రాప్తమగు మయట్ ప్రత్యయము వృద్ధసంజ్ఞకలవానికిని, శర మున్నగువానికిని నిత్యముగా నగును. ఏ శబ్దస్వరూపము యొక్క తొలిఅచ్చు వృద్ధిసంజ్ఞకమో, ఆ శబ్దస్వరూపము వృద్ధసంజ్ఞకమగును.

ఉదా : ఆమ్రస్య అవయవో వికారో వా-ఆమ్రము (మామిడిచెట్టు) యొక్క అవయవము లేక వికారము, ఆమ్ర + ఙస్ + మయ(ట్) విభక్తిలోపము, ఆమ్ర మయ + సు= ఆమ్రమయమ్. ఇది వృద్ధమున కుదాహరణము.

శరాదులకు :- శరస్య అవయవో వికారో వా-శరముయొక్క అవయవము లేక వికారము శర + ఙస్ + మయట్, శరమయ + సు=శరమయమ్.

శరాదిగణము : శర దర్భ మృద్(మృత్) కుటీ తృణ సోమ బల్వజ- ఇతిశరాదిః.

సూ : గోశ్చ పురీషే 4-3-145.

వృ : గోమయమ్.

ప. వి : గోః (5-1) చ (అవ్య) పురీషే (7-1).

అను : మయట్ (1-1) నిత్యమ్ (2-1) సమర్థానామిత్యాది; తస్య (6-1) వికారః (1-1).

అర్థ : షష్ఠ్యంతమగు గోశబ్దమునకు, దాని వికారమైన పురీషము (పెండ) వాచ్యమగునపుడు మయట్ ప్రత్యయము నిత్యముగా వగును. ఉదా : గోమయమ్.

వివ : గోవుయొక్క వికారమైన పురీషము ప్రత్యయాంతముచే వాచ్యమగు నెడల షష్ఠ్యంతమగు గోశబ్దమునకు 'మయట్' ప్రత్యయము నిత్యముగానగును గోఃవికారఃపురీషమ్ గో + ఙస్ + మయట్, విభక్తిలోపము. గోమయ + సు = గోమయమ్. = ఆవుపేడ.

సూ . గోపయసోర్యత్ 4-3-160

వృ : గవ్యమ్, పయస్యమ్

ప. వి : గోపయసోః (6-2) యత్ (1-1)

అను : తస్య (6-1) వికారః (1-1) అవయవే (7-1) సమర్థానామిత్యాది.

అర్థ : గో, పయస్ అనువానికి దానిఅవయవము, దాని వికారము అనునర్థము లందు 'యత్' ప్రత్యయము వచ్చును. ఉదా : గవ్యమ్, పయస్యమ్.

వివ : గోవుయొక్కవికారము లేక అవయవము అనుసర్థమునందును, పయస్సు యొక్క వికారము అనుసర్థమునందును షష్ఠ్యంతములగు శాశబ్దములకు పరముగా యత్ ప్రత్యయము వచ్చును.

ఉదా : గోర్వికారోఽవయవోవా. గో + ఙస్, యత్, విభక్తిలోపము, తకార మిత్తు - గో+య='వాన్తోయిప్రత్యయే'-అవాదేశము, గవ్య + సు=గవ్యమ్-గోవు యొక్క పాలు మొ॥వి

పయసః వికారమ్-పయస్ + ఙస్ + యత్, విభక్తిలోపము, పయస్+య= పయస్య+సు-పయస్యమ్-పాలనుండి యేర్పడిన తక్రాదికము.

ఇది ప్రాగ్దీవ్యతీయ ప్రకరణము.

ప్రకరణావలోకనము : దానియొక్క వికారము, దానియొక్క అవ యవము అనునర్థములందు షష్ఠ్యంతసమర్థములకు పరముగా అణాదిప్రత్యయము లును, మయట్ ప్రత్యయమును, యత్ ప్రత్యయమును ఇందు విధింపబడినవి. 'అశ్మనో వికారేటిలో వక్తవ్యః' అనువార్తికము ప్రక్రియను దెలుపును. తక్కిన వన్నియు ప్రత్యయవిధాయకములు.

అథ ఠగధికార ప్రకరణమ్

అవ : తద్ధిత ప్రకరణారంభమున 'ప్రాగ్దీవ్యతోఽణ్' అనుసూత్రమున చెప్పఁబడిన 'అణ్' ప్రత్యయముయొక్క అధికార అవధి పూర్తి అయినది. అనగా ఇంతవఱకు చెప్పఁబడిన అర్థములలో విశేషప్రత్యయవిధానము లేనిచోట 'అణ్' అనునది ఉపస్థితమగుచుండెడిది. ఇటుపై దానికి అవకాశములేదు. క్రొత్తగా 'ఠక్' అను ప్రత్యయముయొక్క అధికారము ప్రారంభింపఁబడుచున్నది. 'ఠక్' ప్రత్యయాధికారమునకు సంబంధించిన ప్రకరణమగుటచే దీనికి ఠగధికారప్రకరణమని పేరు.

సూ : ప్రాగ్వహతేష్ఠక్ 4-4-1.

వృ : తద్వహతీత్యతః ప్రాక్ ఠగధిక్రియతే.

ప వి : ప్రాక్ (1-1) వహతేః (5-1) ఠక్ (1-1).

అర్థ . తద్వహతి' ఇత్యాదిసూత్రమువఱకు 'ఠక్' అను ప్రత్యయము యొక్క అధికారము.

వివ : 'తద్వహతి రథయుగ ప్రాసఙ్గమ్' అను సూత్రము సంఖ్య 4 4-76.

ఈ సూత్రమునందలి 'వహతేః' అనుపదము వహతిశబ్దము గల ఆసూత్రమును పరామర్శించును ప్రకృతసూత్రము మొదలుకొని ఆసూత్రమునకు పూర్వము వఱకు విధింపఁబడిన అర్థములందు, విశేష ప్రత్యయములు విధింపఁబడని తావులం దెల్ల 'ఠక్' అను ప్రత్యయము ఉపస్థితమగునని తాత్పర్యము.

సూ : తేన దీవ్యతి ఖనతి జయతి జితమ్ 4-4-2.

వృ : అక్షైర్దీవ్యతి ఖనతి జయతి జితమ్ వా ఆక్షికమ్.

ప. వి : తేన (3-1) దీవ్యతి, ఖనతి, జయతి (క్రియాపదములు) జితమ్ (1-1).

అను : సమర్థానాం ప్రథమాద్వా, తద్ధితః, ప్రత్యయః, ఠక్ (1-1).

అర్థ : దానిచే విరాజిల్లును, త్రవ్వును, జయించును, జయింపఁబడినది అను నర్థములందు తృతీయాంత సమర్థపదమునకు 'ఠక్' ప్రత్యయము వచ్చును.

ఉదా : ఆక్షికమ్.

వివ : 'తేన' అనునద్ది తృతీయాంతపదమును సూచించును. దానిచేత ప్రకాశించును, దానిచేత త్రవ్వను, దానిచేత జయించును, దానిచేత జయింపఁబడినది అను నర్థములందు సమర్థములగు వానిలో ప్రథమోచ్చరితములైన తృతీయాంతపదములకు పరముగా 'ఠక్' అను తద్ధిత ప్రత్యయము చేరును. అనగా ప్రత్యయము చేరిన రూపము ప్రకాశించుదానిని, త్రవ్వు వానిని, జయించువానిని, జయింపఁబడుదానిని వచించును. ప్రకృతియగు తృతీయాంతము ప్రకాశించుట మొదలగువానిలో సాధనములను తెలుపును.

ఉదా : అక్షైర్దీవ్యతి, ఖనతి, జయతి, జితమ్వా. అక్షములతో విరాజిల్లును, త్రవ్వును, జయించును, జయింపఁబడినది. అక్ష + భిస్ + ఠక్ తద్ధితాంతమగుటచే దీనికి ప్రాతిపదిక సంజ్ఞకలుగును. (కృత్తద్ధితసమాసాశ్చ) ప్రాతిపదికావయవము లగు సుప్పులకు (విభక్తిప్రత్యయములకు) లుక్కు వచ్చును (సుపోధాతు ప్రాదికయోః) కితిచ - ఆదివృద్ధి ఆక్ష + ఠ, ఠస్యేకః - ఇకాదేశము, ఆక్ష + ఇక, యస్యేతిచ-అకారలోపము-ఆక్ష్ + ఇక ఆక్షిక + సు = ఆక్షికమ్.

సూ : సంస్కృతమ్ 4-4-3.

వృ : దధ్నా సంస్కృతం దాధికమ్; మారీచికమ్.

ప. వి : సంస్కృతమ్ (1-1)

అను : తేన (3-1) ఠక్ (1-1) సమర్థానామిత్యాదులు.

అర్థ : దానిచేత సంస్కరింపఁబడినది అనునర్థమున తృతీయాంతపదమునకు పరముగా, సంస్కృతమైన దానిని చెప్పుచు, 'ఠక్' ప్రత్యయము వచ్చును. ఉదా : దాధికమ్, మారీచికమ్.

వివ : 'ఒకవస్తువు ఒకవస్తువుచేత సంస్కరింపఁబడినది' అనునది చెప్పవలసినపుడు దేనితో సంస్కరింపఁబడినదో దానిని తెలుపు శబ్దముయొక్క తృతీయాంత రూపమునకు 'ఠక్' ప్రత్యయము చేరును. ఇందు కకారము ఇత్తు. దానివలన ఆది వృద్ధిఅగును.

ఉదా : దధ్నా సంస్కృతమ్ = పెరుగుతో సంస్కరింపఁబడినది దధిన్ + టా, ఠక్, విభక్తిలోపము, ఆదివృద్ధి, ఇకాదేశము దాధిన్ + ఇక, నస్తద్ధితే టిలోపము: దాధ్ + ఇక = దాధిక + సు = దాధికమ్.

మరీచిభిః సంస్కృతమ్ - మిరియములతో సంస్కరింపఁబడినది. మరీచి + భిస్ + ఠక్, విభక్తిలోపము, ఆదివృద్ధి, ఇకాదేశము, ఇకారలోపము మారీచ్ + ఇక = మారీచిక + సు = మారీచికమ్.

సూ : తరతి 4-4-5.

వృ : ఉడుపేన తరతి ఔడుపికః.

ప. వి : తరతి (క్రి. ప)

అను : తేన (3-1) ఠక్ (1-1) సమర్థానామిత్యాది.

అర్థ : 'దానిచే దాటుచున్నాడు' అనునర్థమున తృతీయాంతపదమునకు పరముగా 'ఠక్' ప్రత్యయము వచ్చును. ఉదా : ఔడుపికః.

వివ : తరణసాధనమగుదానిని చెప్పు తృతీయాంతపదమునకు పరముగా ఠక్ ప్రత్యయము వచ్చును. ప్రత్యయాంతముచే దానిచేదాటు వ్యక్త్యాదికము తెలుపబడును.

ఉదా : ఉడుపేన తరతి - తెప్పతో దాటుచున్నాడు - ఉడుప + టా, ఠక్, విభక్తిలోపము, ఆదివృద్ధి, ఔడుప + ఠ ఇకాదేశము, అకారలోపము, ఔడుప్ + ఇక = ఔడుపిక+సు=ఔడుపికః.

సూ : చరతి 4-4-8.

వృ : హస్తినా చరతి హాస్తికః; దధ్నా చరతి భక్షయతి దాధికః.

ప. వి : చరతి (క్రి ప).

అను : తేన (3-1) ఠక్ (1-1) సమర్థానామిత్యాది.

అర్థ : 'దానితో చరించుచున్నాడు' అనునర్థమున సమర్థతృతీయాంతమునకు 'ఠక్' ప్రత్యయము వచ్చును. ఉదా : హాస్తికః, దాధికః

వివ : 'చర గతిభక్షణయోః' - 'చర్' ధాతువు వెళ్ళు, తిను అను రెండర్థములందు వర్తించును. కావున దానితో వేగుచున్నాడు, దానితో తినుచున్నాడు అనునర్థములందు సమర్థములలో ప్రథమమగు తృతీయాంతపదమునకు 'ఠక్' ప్రత్యయము చేరును.

ఉదా : హస్తినా చరతి, హస్తితో తిరుగుచున్నాడు, హస్తిన్+టా, ఠక్ విభక్తిలోపము, ఆదివృద్ధి, హాస్తిన్ + ఠ, ఇకాదేశము, హాస్తిన్+ఇక, నస్తద్ధితే, టిలోపము, హాస్తిక + సు=హాస్తికః.

దధ్నా చరతి - దధితో భక్షించుచున్నాడు, దధిన్ + టా+ఠక్ - విభక్తిలోపాదులు దాధిక + సు=దాధికః.

సూ : సంసృష్టే 4-4-22.

వృ : దధ్నా సంసృష్టం దాధికమ్.

ప. వి : సంసృష్టే (7-2).

అను : తేన (3-1) ఠక్ (1-1) సమర్థానామిత్యాది.

అర్థ : 'దానితో కలుపఁబడినది' అనునర్థమున తృతీయాంతసమర్థమునకు 'ఠక్' ప్రత్యయము వచ్చును. ఉదా : దధ్నా సంసృష్టం దాధికమ్.

వివ : తృతీయాంతపదముతో వాచ్యమగు పదార్థముతో కలుపఁబడినదని చెప్పఁబడునపుడు, తృతీయాంతసమర్థమునకు 'ఠక్' ప్రత్యయము వచ్చును.

ఉదా : దధ్నా సంసృష్టమ్ – పెరుగుతో కలుపఁబడినది దధిన్ + టా, ఠక్ విభక్తిలోపాదులు దాధ్ + ఇక = దాధిక + సు = దాధికమ్.

సూ : ఉఞ్ఛతి 4-4-32

వృ : బదరాణ్యుఞ్ఛతి బాదరికః.

ప. వి : ఉఞ్ఛతి (క్రి. ప).

అను : తత్ (2-1) ఠక్ (1-1) సమర్థానామిత్యాది.

అర్థ : దానిని / వానిని ఏఱుకొనుచున్నాఁడు అనునర్థమున ద్వితీయాంత సమర్థమునకు పరముగా 'ఠక్' ప్రత్యయము వచ్చును. ఉదా : బదరాణి ఉఞ్ఛతిః బాదరికః.

వివ : ఇందనువృత్తిగా వచ్చిన 'తత్'అనుపదము సమర్థములలో ప్రథమోచ్చరితమైన ద్వితీయాంతపదమునకు చిహ్నము. 'వానిని లేక దానిని ఏఱుకొనువాఁడు' అనునర్థమున నట్టిపదమునకు పరముగా 'ఠక్' ప్రత్యయము వచ్చును.

ఉదా : బదరాణి ఉఞ్ఛతి – రేఁగుఁబండ్లను ఏఱుకొనువాఁడు. బదర + శస్ + ఠక్, విభక్తిలోపము, ఆదివృద్ధి, బాదర+ఠ, ఠకారమునకు ఇకాదేశము, యస్యేతి - అకారలోపము బాదర్ + ఇక = బాదరిక + సు = బాదరికః.

సూ : రక్షతి 4-4-33.

వృ : సమాజం రక్షతి, సామాజికః.

ప. వి : రక్షతి (క్రి. ప).

అను : తత్ (2-1) ఠక్ (1-1) సమర్థానామిత్యాది.

అర్థ : దానిని రక్షించువాఁడు అనునర్థమున ద్వితీయాంతమునకు 'ఠక్' ప్రత్యయము వచ్చును. ఉదా : సామాజికః.

వివ : ద్వితీయాంతసమర్థమునకు, 'దానిని రక్షించువాఁడు' అనునర్థమున ఠక్ ప్రత్యయము వచ్చును. సమాజం రక్షతి - సమాజ + అమ్ + ఠక్, విభక్తి లోపాదులు, సామాజిక + సు = సామాజికః - సమాజమును రక్షించుచున్నాడు.

సూ : శబ్ద దర్దురం కరోతి 4-4-34.

వృ : శబ్దంకరోతి శాబ్దికః; దర్దురం కరోతి దార్దురికః.

ప వి : శబ్ద దర్దురమ్ (2-1) కరోతి (క్రి ప)

అను : తత్ (2-1) ఠక్ (1-1) సమర్థానామిత్యాది.

అర్థ : శబ్ద, దర్దుర అనువాని ద్వితీయాంతములకు, 'దానిని చేయుచున్నాఁడు' అనునర్థమున, 'ఠక్' ప్రత్యయము చేరును. ఉదా : శాబ్దికః, దార్దురికః.

వివ : ద్వితీయాంతపదములైన శబ్దమ్, దర్దురమ్ అనువానికి, 'దానిని చేయువాఁడు' అనునర్థమున 'ఠక్' ప్రత్యయము వచ్చును.

ఉదా : శబ్దం కరోతి - శబ్దమును చేయువాఁడు, శబ్ద + అమ్ + ఠక్, విభక్తి లోపము, ఆదివృద్ధి; శాబ్ద + ఠ, ఠకారమునకు ఇకాదేశము, శాబ్ద + ఇక యస్యేతిచ, అకారలోపము, శాబ్ద్ + ఇక = శాబ్దిక + సు = శాబ్దికః

దర్దురం కరోతి - మట్టును చేయువాఁడు, దర్దుర + అమ్, ఠక్, విభక్తి లోపాదులు - దార్దురిక + సు = దార్దురికః.

సూ : ధర్మం చరతి 4-4-41.

వృ : ధార్మికః.

ప. వి : ధర్మమ్ (2-1) చరతి (క్రి. ప).

అను : తత్ (2-1) ఠక్ (1-1) సమర్థానామిత్యాది.

అర్థ : 'ధర్మమును చరించువాడు, అనునర్థమున ద్వితీయాంతమగు ధర్మ శబ్దమునకు 'ఠక్' ప్రత్యయము వచ్చును. ఉదా : ధార్మికః.

వివ : 'ధర్మము నాచరించువాఁడు' అనునర్థమున' ధర్మమ్' అను ద్వితీయాంత పదమునకు పరముగా 'ఠక్' ప్రత్యయము వచ్చును.

ఉదా : ధర్మం చరతి, 'ధర్మ+అమ్+ ఠక్', విభక్తిలోపము, ఆదివృ ఇకాదేశము, అకారలోపము ధార్మ్+ఇక=ధార్మిక+సు=ధార్మికః.

వా॥ అధర్మాచ్చేతి వక్తవ్యమ్ (2966).

వృ : ఆధర్మికః.

వ. వి : అధర్మాత్ (5-1) చ (అవ్య) ఇతి (అవ్య) వక్తవ్యమ్ (1-1)

అర్థ : దాని నాచరించుచున్నాఁడు అనునర్థమున అధర్మశబ్దమునకును ఠక్ ప్రత్యయము చెప్పఁదగును. ఉదా : ఆధర్మికః

వివ : అధర్మం చరతి - అధర్మము నొనరించువాఁడు. అధర్మ + అమ్ ఠక్, విభక్తిలోపము, ఆదివృద్ధి ఆధర్మ + ఠ, ఇకాదేశము, అకారలోపము ఆధర్మ్+ ఇక = ఆధర్మిక+సు=ఆధర్మికః.

సూ : శిల్పమ్ 4-4-55.

వృ : మృదఙ్గ వాదనం శిల్పమస్య మార్దఙ్గికః.

వ. వి : శిల్పమ్ (1-1).

అను : తత్ (1-1) అస్య (6-1) ఠక్ (1-1) సమర్థానామిత్యాది

అర్థ : 'అది యితనికి శిల్పము' అనునర్థమున ప్రథమాంత పదములకు ప ముగా 'ఠక్' ప్రత్యయము వచ్చును. ఉదా : మార్దఙ్గికః.

వివ : శిల్పమనగా ఒకపనియందు నేర్పు. 'ఈపని ఇతనికి శిల్పము' అన నర్థమున ప్రథమాంతసమర్థమునకు 'ఠక్' ప్రత్యయము వచ్చును.

ఉదా : మృదఙ్గవాదనం శిల్పమస్య - మృదంగవాదనము ఇతనికి శిల్పమ ఇచట 'మృదంగము శిల్పముగాఁగలవాఁడు, అనునర్థము చెప్పఁజాలము. మృదంగమ క్రియకాదుగదా; శిల్పమనగా క్రియలయందలి కౌశలమని చెప్పఁబడినది కావున విగ్రహమట్లు చెప్పఁబడినది. ప్రత్యయము మాత్రము 'మృదఙ్గః' అనుదాని వచ్చును. అచట మృదంగమునకు లక్షణచే మృదంగవాదనమర్థము. ఒకయర్థమ పొసఁగనిచో పొసగించుటకు దానికి సన్నిహితమగు నర్థమును గ్రహింతుము. దాని లక్షణార్థమందురు. మృదఙ్గ + సు, ఠక్ = విభక్తిలోపము, ఆదివృద్ధి (ఋ> అర్) మార్దఙ్గ + ఠ ఇకాదేశము, మార్దఙ్గ + ఇక, అకారలోపము, మార్దఙ్గ్ + ఇక = మార్దఙ్గిక + సు=మార్దఙ్గికః.

సూ : ప్రహరణమ్ 4-4-57.

వృ : అసిః ప్రహరణమస్య ఆసికః, ధానుష్కః.

ప వి : ప్రహరణమ్ (1-1)

అను : ఠక్ (1-1) అస్య (6-1) ఠక్ (1-1) సమర్థానామిత్యాది.

అర్థ : 'అది అతనికి ఆయుధము' అనునర్థమున ప్రథమాంతమునకు 'ఠక్' ప్రత్యయము వచ్చును. ఉదా : ఆసికః, ధానుష్కః.

వివ : ప్రహరణమనగా ప్రహరించుసాధనము, ఆయుధము. ఇది ఇతనికి ఆయుధము అనునర్థమున ఆయుధవాచక ప్రథమాంతములకు పరముగా 'ఠక్' ప్రత్యయము వచ్చును.

ఉదా : అసిః ప్రహరణమస్య - ఖడ్గమితనికి ఆయుధము. అసి + సు + ఠక్, విభక్తిలోపము, ఆదివృద్ధి ఆసి + ఠ, ఇకాదేశము, ఇకారలోపము ఆస్ + ఇక = ఆసిక + సు = ఆసికః కత్తి ఆయుధముగాఁ గలవాఁడు.

ధనుః ప్రహరణమస్య - ధనుస్సు ఇతనికి ఆయుధము. ధనుస్ + సు + ఠక్, విభక్తిలోపము, ఆదివృద్ధి, ధానుస్ + ఠ, 'ఇసుసుక్తాన్తాత్కః' అను సూత్రముచే ఉసంతమైన 'ధానుస్' అనుదానికి పరముగా నున్న 'ఠ' అనుదానికి 'క' అనునది ఆదేశమగును ధానుస్ + క, సకారమునకు రుత్వము దానికి విసర్గము నాదేశమగును. 'ధానుః + క' 'ఇణఃషః' అనుసూత్రముచే విసర్గమునకు షకారమాదేశమగును ధానుష్ + క = ధానుష్క + సు = ధానుష్కః (ఇణఃషః 8-3-39 ఇణ్వర్ణములకు పరముగానున్న విసర్గమునకు అపవాదులగు కవర్గ పవర్గములు పరములగునపుడు షకారమగును).

సూ : శీలమ్ 4-4-61.

వృ : అపూపభక్షణం శీలమస్య ఆపూపికః.

ప. వి : శీలమ్ (1-1).

అను : ఠక్ (1-1) అస్య (6-1) ఠక్ (1-1) సమర్థానామిత్యాది.

అర్థ : 'అది యితనికి శీలము' అనునర్థమున సమర్థప్రథమాంతములకు 'ఠక్' ప్రత్యయము వచ్చును. ఉదా : అపూపభక్షణం శీలమస్య = ఆపూపికః.

వివ : శీలమనగా స్వభావము. ఒకపనిని ఒకఁడు స్వభావముగా చేయు చుండును. అట్టిది చెప్పఁబడునపుడు శీలవాచక ప్రథమాంతములకు పరముగా 'ఠక్' ప్రత్యయము వచ్చును.

ఉదా : అపూపభక్షణం శీలమస్య - అప్పములు తినుట యితని శీలము 'అపూప + సు + ' ఇచట అపూపశబ్దమునకు అపూపములు తినుట ఠక్ అని లక్ష్యార్థము. విభక్తిలోపము, ఆదివృద్ధి ఆపూప + ఠ, ఇకాదేశము, అకార లోపము ఆపూప్ + ఇక = ఆపూపిక + సు = ఆపూపికః.

సూ : నికటే వసతి 4-4-73.

వృ : నైకటికో భిక్షుకః.

ప. వి : నికటే (7-1) వసతి (క్రి ప).

అను : తత్ర (అవ్య) ఠక్ (1-1) సమర్థానామిత్యాది.

అర్థ : సప్తమ్యంతమగు నికటశబ్దమునకు 'అందు వసించువాడు' అను నర్థమున 'ఠక్' ప్రత్యయము వచ్చును. ఉదా : నైకటికో భిక్షుః.

వివ : అనువృత్తమైన తత్ర అనుపదము సప్తమీవిభక్తి సూచకము. సప్తమీవిభక్తి అంతమునఁ గల నికటశబ్దమునకు వరుసగా అందు వసించువాఁడు అనునర్థమున 'ఠక్' ప్రత్యయము వచ్చును.

ఉదా : నికటే వసతి - సమీపమున వసించువాఁడు - నికట + ఙి + ఠక్, విభక్తిలోపము, ఆదివృద్ధి, నైకట + ఠ, ఇకాదేశము, అకార లోపము. నైకట్ + ఇక = నైకటిక + సు = నైకటికః. - సమీపమున వసించు భిక్షువు.

ఇది ఠగధికారప్రకరణము.

ప్రకరణావలోకనము : ఇందు తృతీయాంతరూపములపై 'దానిచే విరాజిల్లును, తప్పును, జయించును, జయింపఁబడినది, సంస్కరింపఁబడినది, తరించుచున్నాఁడు, చరించుచున్నాఁడు, కలుపఁబడినది అనునర్థములందును, ద్వితీయాంతపదములపై దానిని ఏఱుకొనుచున్నాఁడు, రక్షించుచున్నాఁడు, (శబ్దదర్దురములను) చేయుచున్నాఁడు, (ధర్మాధర్మములను) ఆచరించుచున్నాఁడు, అను నర్థములందును, ప్రథమాంతములపై అది ఇతనికి శిల్పము, ఆయుధము, శీలము అనునర్థములందును, సప్తమ్యంతమగు నికటశబ్దముపై, అందు వసించుచున్నాఁడు అనునర్థమునందును 'ఠక్' ప్రత్యయము వచ్చుట సోదాహరణముగ ప్రదర్శింపఁబడినది.

అథ ప్రాగ్ఘితీయ ప్రకరణము

అవ : అణ్, ఠక్ ప్రత్యయాధికారములవలె యత్ ప్రత్య ప్రారంభింపఁబడుచున్నది 5-1-5 వ సంఖ్యగల సూత్రము 'తస్మైహితమ్' అనునది దానికి పూర్వమువఱకు చెప్పఁబడిన అర్థములలో సాధారణముగా ఈ 'యత్' ప్రత్యయము వచ్చును. హితశబ్దఘటిత సూత్రమునకు పూర్వమువఱకు విధింపఁబడు ప్రత్యయములకు సంబంధించిన ప్రకరణమగుటచే దీనికి ప్రాగ్ఘి (ప్రాక్ + హి) తీయ ప్రకరణమని పేరు.

సూ : ప్రాగ్ఘితాద్యత్ 4-4-75.

వృ : తస్మైహితమిత్యతః ప్రాగ్యదధిక్రియతే.

ప. వి : ప్రాక్ (1-1) హితాత్ (5-1) యత్ (1-1).

అర్థ : 'తస్మైహితమ్' అనునర్థమునకు పూర్వమువఱకు 'యత్' అనునది అధికారమగును

వివ : సూత్రమునందలి హితశబ్దము, అదిగలసూత్రమును బోధించును. అది 'తస్మైహితమ్' 5-1-5 అనునది. దానికి పూర్వమునఁ జెప్పఁబడిన అర్థములందాయా సమర్థసుబంతములకు 'యత్' ప్రత్యయము సాధారణముగా నగును. విశేష ప్రత్యయములు విధింపఁబడినచో అవి చేరును. ప్రత్యయ మేదియు పేర్కొనఁబడనిచోట ఈ హద్దులో 'యత్' అనునది ఉపస్థితమగునని ఫలితార్థము.

సూ : తద్వహతి రథయుగప్రాసఙ్గమ్ 4-4-76.

వృ : రథం వహతి రథ్యః; యుగ్యః, ప్రాసఙ్గ్యః.

వ. వి : తత్ (2-1) వహతి (క్రి. వ) రథయుగప్రాసఙ్గమ్ (2-1).

అను : సమర్థానామిత్యాది; యత్ (1-1).

అర్థ : దానిని మోయును అనునర్థమున ద్వితీయాంతములైన రథ, యుగ, ప్రాసంగ, అనువానికి యత్ ప్రత్యయము చేరును. ఉదా : రథం వహతి రథ్యః, యుగ్యః, ప్రాసఙ్గ్యః.

వివ : 'తత్' అనునది ద్వితీయాంతపదమును సూచించును. చేయఁబడినసంధిమున్నగు కార్యములు గలిగిన సమర్థములలో ప్రథమోచ్చరితములైన రథ, యుగ, ప్రాసఙ్గ అను వాని ద్వితీయాంతరూపములకు, దానిని మోయు అశ్వాదికమును

దెలుపుచు, యత్ ప్రత్యయము వచ్చును. ఇందు తకారేత్తు. ఈ ప్రత్యయము పరమగునపుడు, పదము తుది అకారమునకు లోపము వచ్చును (యస్యేతిచ).

రథం వహతి – రథమును వహించునది. రథ + అమ్ + యత్, విభక్తి లోపము, అకారలోపము రథ్ + య = రథ్య + సు = రథ్యః – గుఱ్ఱము మొ॥వి.

యుగం వహతి – యుగమనగా కాడి, దానిని మోయునది. యుగ + అమ్ + యత్, విభక్తిలోపఅకారలోపములు యుగ్ + య=యుగ్య + సు = యుగ్యః.

ప్రాసఙ్గం వహతి – ప్రాసంగమనగా క్రొత్తగా బండికి కట్టుటకు శిక్షణ పొందుచున్న అశ్వాదికము యొక్క మెడపైనుంచు కాడికిముందుంచు కాడివంటిది దానిని మోయునది. ప్రాసఙ్గ + అమ్ + యత్, విభక్తిలోపఅకారలోపములు ప్రాసఙ్గ్+య =ప్రాసఙ్గ్య + సు=ప్రాసఙ్గ్యః.

సూ : ధురో యడ్ఢకౌ 4-4-77.

వృ : ధుర్యః, ధౌరేయః.

ప. వి : ధురః (5-1) యత్, ఢకౌ (1-2)

అను : తత్ (2-1) వహతి (క్రి ప) సమర్థానామిత్యాది.

అర్థ : 'దానిని మోయును' అనునర్థమున 'ధుర్' శబ్దమునకు యత్, ఢక్ ప్రత్యయములు పర్యాయముగా వచ్చును. ధుర్యః, ధౌరేయః.

వివ : ధురమనగా భారము. దానిని వహించునది అనునర్థమున ద్వితీయాంతమగు 'ధుర్' శబ్దమునకు పరముగా యత్ ప్రత్యయమును, ఢక్ - ప్రత్యయమును వచ్చును.

ఉదా : ధురంవహతి - ధురమును మోయునది - ధుర్ + యత్, = ధుర్య + సు = ధుర్యః. ధుర్ + ఢక్, కిత్తిచ, ఆదివృద్ధి ధౌర్ + ఢ, ఢకారమునకు 'ఏయ్' ఆదేశము (ఆయనేయీనీయియః ఫ ఢ ఖ ఛ ఘాం ప్రత్యయాదీనామ్) (ఢ్ + అ=ఏయ్+అ=ఏయ) ధౌర్ + ఏయ=ధౌరేయ + సు = ధౌరేయః. (గుఱ్ఱము మున్నగువాని మెడమీద మోయుటకై ఉంచెడు కాడియొక్క ప్రదేశమును ధురమందురు). దానిని మోయు అశ్వాదికము ధుర్యము, ధౌరేయము అనబడును.

(ఇచట 'ధుర్' అను రేఫాంతశబ్దముయొక్క ఉపధకు, యత్ ప్రత్యయ యోగమున 'హలిచ' అను సూత్రముచే ప్రాప్తమగు దీర్ఘము 'నభకుర్ఛురామ్' (8-2-79) అనుసూత్రముచే వారింపఁబడును. భసంజ్ఞకము యొక్కయు, కుర్, ఛుర్ అనువానియొక్కయు ఉపధకు దీర్ఘము రాదు అని సూత్రార్థము).

సూ : నౌవయోధర్మ విషమూల మూల సీతాతులాభ్యస్తార్య తుల్య ప్రాప్యవధ్యానామ్య సమసమిత సమ్మితేషు 4-4-91.

వృ : నావా తార్యం నావ్యంజలం; వయసాతుల్యోవయస్యః, ధర్మేణప్రాప్యం ధర్మ్యమ్, విషేణవధ్యో విష్యః; మూలేన ఆనామ్యం మూల్యమ్, మూలేన సమోమూల్యః; సీతయాసమితం సీత్యంక్షేత్రమ్, తులయా సమ్మితం తుల్యమ్.

ప వి నౌవయో.... తులాభ్యః (5-3) తార్య .... సంమితేషు (7-3)

అను : యత్ (1-1) సమర్థానా మిత్యాది.

అర్థ : నౌ, వయస్, ధర్మ, విష, మూల, మూల, సీతా, తులా అను వాని తృతీయాంతరూపములకు క్రమముగా, తార్యము, తుల్యము, ప్రాప్యము, వధ్యము, ఆనామ్యము, సమము, సమితము, సంమితము అనునర్థములందు, యత్ ప్రత్యయము వచ్చును. ఉదా నావ్యమ్ ఇత్యాది.

వివ : ఈ సూత్రమున తృతీయాంతములగు 'నౌ' మున్నగువానికి యత్ ప్రత్యయ మాయాయర్థవిశేషములందు విధింపఁబడినది 'తృతీయాంతములు' అను పది అర్థాపనను బట్టి సిద్ధించును. అనగా 'తార్యము' అనునర్థము సిద్ధింపవలయు నన్న 'నౌ' శబ్దముయొక్క తృతీయాంతరూపమునకే యత్ ప్రత్యయము చేయవల యును. ఇట్లే తక్కినవానికిని అర్థమును బట్టి తృతీయాంతమనునది ఊహింపఁ బడినది.

(1) నావాతార్యమ్ - నావచే తరింపఁ బడునది. నౌ + టా + యత్, విభక్తిలోపము, నౌ + య, వాన్తోయి ప్రత్యయే అనుసూత్రముచే ఔకారమునకు 'అవాదేశము' నావ్ + య = నావ్య + సు=నావ్యమ్ జలమ్=నావచే దాటఁ బడునీరు.

(2) వయసాతుల్యః - తుల్యుఁడనగా సమానుఁడు; వయస్సుచేత సమానుఁడు, వయస్ + టా + య, వయస్ + య = వయస్య + సు = వయస్యః - మిత్రుఁడు.

(3) ధర్మేణ ప్రాప్యమ్ - ప్రాప్యమనగా పొందఁదగినది, ధర్మముచే పొందఁదగినది. ధర్మ+టా + యత్ - ధర్మ + య, యస్యేతిచ-అకారలోపము ధర్మ్ + య=ధర్మ్య + సు=ధర్మ్యమ్.

(4) విషేణ వధ్యః = వధ్యుఁడనగా వధింపఁదగినవాఁడు, విషముచే వధ్యుఁడు. విష+టా, యత్, విభక్తిలోపము, అకారలోపము, విష్ + య = విష్య + సు=విష్యః.

(5) మూలేన ఆనామ్యమ్-మూలమనగా వర్తకుఁడు కొన్నవెల. ఆనామ్య మనగా మూలముచే పొందఁబడునది. మూలముచే ఆనామ్యమైనది మూల+టా+ యత్, విభక్తిలోపము, అకారలోపము మూల్ + య = మూల్య + సు = మూల్యమ్ = విక్రయమునకు నిర్ణయించినధరలో వర్తకునకు వచ్చులాభము. కాని నేటి వ్యవహారమున లాభముతో కూడిన మొత్తము అమ్మకముధరను మూల్యమను చున్నారు

(6) మూలేన సమః-మూలముతో సమానమైనది. మూల + టా + యత్- మూల్య + సు=మూల్యః.

(7) సీతయా సమితం - సీత అనగా నాగటిచాలు, దానితో కూడినది. సీతా + టా + యత్ = విభక్తిలోపము, అకారలోపము సీత్ + య=సీత్య+సు= సీత్యమ్ క్షేత్రమ్ దున్నఁబడినభూమి.

(8) తులయా సంమితమ్ = తులతో (త్రాసుతో) తూపఁబడినది తులా+ టా + యత్, విభక్తిలోపము, అకారలోపము తుల్ + య=తుల్య+సు= తుల్యమ్

నౌమున్నగు శబ్దముల కీయర్థములందే యత్ ప్రత్యయమగునని తాత్పర్యము. కావున వయస్సుతో తుల్యుఁడగు శత్రువు వయస్యుఁడు కాఁజాలఁడు. తక్కినవానికి నిట్లే యూహించునది.

సూ : తత్ర సాధుః 4-4-98.

వృ : సామసుసాధుః, సామన్యః; కర్మణ్యః, శరణ్యః.

ప. వి : తత్ర (అవ్య) సాధుః (1-1).

అను : యత్ (1-1) సమర్థానామిత్యాది.

అర్థ : 'ఆ విషయమున సాధువు' అనునర్థమున విషయవాచక సప్తమ్యంతము లకు యత్ ప్రత్యయమగును. ఉదా : సామసుసాధుఃసామన్యః ఇత్యాది

వివ : ఇచట సాధుశబ్దముచే ప్రవీణుఁడు, నేర్పరి అనునర్థమును గ్రహింప వలయును. 'ఆ విషయమునందు నేర్పరి' అనునర్థమున విషయవాచకము సప్తమ్యంతమునకు పరముగా 'యత్' ప్రత్యయము వచ్చును

ఉదా : సామసుసాధుః – సామములయందు నేర్పరి – సామన్+సుప్ + యత్, విభక్తి లోపము 'సామన్ + య' అనియుండ 'నస్తద్ధితే' అనుసూత్రముచే ప్రాప్తమగు టిలోపమును 'యే చాభావకర్మణోః' అనుసూత్రము వారించును. సామన్య+సు=సామన్యః.

కర్మసు సాధుః – కర్మములయందు నిపుణుఁడు, కర్మన్ + సుప్+యత్, విభక్తిలోపము, కర్మన్ + య, 'అన్' అను టిభాగమునకు 'యేచాభావకర్మణోః' అను సూత్రముచే ప్రకృతిభావము, రేఫయోగముచే నకారమునకు ణత్వము (అట్కుప్వాఙ్ ....) కర్మణ్య+సు=కర్మణ్యః

శరణేసాధుః – శరణమునందు (రక్షణమునందు) ప్రవీణుఁడు శరణ + ఙి, యత్, విభక్తిలోపము, యస్యేతిచ – అకారలోపము. శరణ్య + సు = శరణ్యః.

సూ : సభాయా యః 4-4-105.

వృ : సభ్యః.

ప వి : సభాయాః (5-1) యః (1-1)

అను : తత్ర (అవ్య) సాధుః (1-1) సమర్థానామిత్యాది

అర్థ : 'అందు సాధువు' అనునర్థమున సప్తమ్యంత సభాశబ్దమునకు 'య' ప్రత్యయము చేరును. ఉదా : సభ్యః.

వివ : 'సభాయాం సాధుః' అనునర్థమున 'సభాయామ్' అనుసప్తమ్యంత రూపమునకు 'య' ప్రత్యయము చేరును. ఇది యత్ప్రత్యయమునకు అపవాదము ఈ రెండు ప్రత్యయములలో నేది చేరినను అగురూపమొక్కటియే కాని ఉదాత్తాది స్వరవిషయక భేదముకొఱకు ప్రత్యయాంతరముగా విధింపఁబడినది

ఉదా : సభాయాం సాధుః - సభయందు నిపుణుఁడు - సభా + ఙి + య, విభక్తి లోపము, అకారలోపము సభ్ + య = సభ్య + సు=సభ్యః

వృ : ఇతి ఛయతోఽవధిః.

అర్థ : ఇంతవఱకు యత్ప్రత్యయము యొక్క హద్దు.

ఇది ప్రాగ్ఘితీయ ప్రకరణము.

ప్రకరణావలోకనము : ఇందు సాధారణముగా యత్ ప్రత్యయము విధింపఁబడినది. 'ఢక్', 'య' అను ప్రత్యయములును విధింపఁబడినవి. 'దానిని మోయునది' అనునర్థమున రథాదిశబ్దముల ద్వితీయాంతములకును, శార్థ్యము మున్నగు నర్థములలో తృతీయాంతనావాది పదములకును, అందు సాధువు అనునర్థమున సప్తమ్యంతపదములకు ఈ ప్రత్యయములు విధింపఁబడినవి.

అథ ఛయద్విధి ప్రకరణమ్.

అవ : ఇటుపై కొన్ని అర్థవిశేషములలో ఛ, యత్ ప్రత్యయములు చెప్పఁబడుచున్నవి వానిని విధించు ప్రకరణమగుటచే దీనికి ఛయద్విధిప్రకరణమని పేరు.

సూ : ప్రాక్క్రీతాచ్ఛః 5-1-1.

వృ : తేన క్రీత మిత్యతః ప్రాక్ ఛోఽధిక్రియతే.

ప వి : ప్రాక్ (1-1) క్రీతాత్ (5-1) ఛః (1-1).

అను . సమర్థానామిత్యాది

అర్థ . 'తేన క్రీతమ్' 5-1-37 అనుదానికి పూర్వమువఱకు 'ఛ' అనునది అధికారము.

వివ : 'తేనక్రీతమ్' అనుసూత్రమునకు పూర్వమువఱకు విధింపఁబడిన యర్థవిశేషములలో ఆయాశబ్దములకు 'ఛ' ప్రత్యయము వచ్చును. అపవాద ప్రత్యయములు చెప్పఁబడినచో అవి దీనిని బాధించును. సూత్రమునందలి 'క్రీతాత్' అనునది క్రీత శబ్దఘటిత సూత్రమును దెలుపును.

సూ : ఉగవాదిభ్యో యత్ 5-1-2.

వృ : ఉవర్ణాన్తాద్గవాదిభ్యశ్చయత్ ఛస్యాపవాదః, శఙ్కవ్యం దారు; గవ్యమ్.

ప, వి : ఉగవాదిభ్యః (5-3) యత్ (1-1).

అను : సమర్థానామ్ (6-3) ప్రథమాత్ (5-1) వా (అవ్య) తద్ధితః (1-1) ప్రత్యయః (1-1) ప్రాక్ (1-1) క్రీతాత్ (5-1).

అర్థ : ఉవర్ణాంతములకును గవాదులకును, 'తేన క్రీతమ్' అను సూత్రమునకు పూర్వమువఱకుఁ గల అర్థములలో 'యత్' ప్రత్యయము వచ్చును. ఉదా : శఙ్కవ్యందారు; గవ్యమ్. ఇది ఛ ప్రత్యయమున కపవాదము.

వివ : ఈ యత్ ప్రత్యయము పైసూత్రమునఁ జెప్పఁబడిన ఛ ప్రత్యయమున కపవాదము. వక్ష్యమాణార్థములలో ఉకారాంతశబ్దములకును, గవాదులకును సాధారణప్రత్యయమగు 'ఛ' అనునది కాక యత్ ప్రత్యయము వచ్చునని సూత్రార్థము. దీనినిబట్టి యీ ప్రకరణమున 'ఛ', 'యత్' అను రెండు ప్రత్యయ

ములను ప్రత్యేకముగా ప్రత్యయమును జెప్పవిచోట ఉపస్థితములగుచుండును అందు ఉకారాంతములకును, గవాదులకును యత్ ప్రత్యయమును, తక్కినవానికి ఛ ప్రత్యయమును అగునని ఫలితార్థము. ఇట్లు దీనికి ఛ యద్విధి ప్రకరణమను పేరు కలిగినది.

ఉదా : శఙ్కవేహితమ్ - శఙ్కు + ఙే + యత్ - శఙ్కుశబ్దము ఉకారాంతము - కావున 'యత్' ప్రత్యయము తస్మైహితమ్ అను వక్ష్యమాణార్థమున వచ్చినది విభక్తిలోపము శఙ్కు + య, ఓర్గుణః. శఙ్కో + య, వాన్తోయి ప్రత్యయే - అవాదేశము శఙ్కవ్ + య=శఙ్కవ్య + సు = శఙ్కవ్యందారు = శంకువు చేయుటకు యోగ్యమైన కొయ్య.

గవేహితమ్ - గోవుకు హితమైనది, గో + ఙే+య(త్) ఇది గవాదుల లోనిది విభక్తిలోపము, గో + య, అవాదేశము గో + య=గవ్య+సు = గవ్యమ్.

౧. సూ : నాభినభంచ (౧౯. 95).

వృ : నభ్యోఽక్షః; నభ్యమఞ్జనమ్.

ప వి : నాభి (లుప్తవిభక్తిక పదము) నభమ్ (1-1) చ (అవ్య).

అర్థ : యత్ ప్రత్యయయోగమున నాభిశబ్దమునకు 'నభ' అను నాదేశము కూడ వచ్చును. ఉదా : నభ్యోఽక్షః; నభ్యమఞ్జనమ్.

వివ : ఇది గవాదిగణములోని సూత్రము. గణములో నేదేని ఒకశబ్దమునకు లేదా కొన్నిశబ్దములకు సంబంధించిన విశేషమొకసూత్రముగా చెప్పఁబడును. అట్టి వానిని గణసూత్రములందురు ఇది అట్టిది. దానికి హితమైనది మున్నగు నర్థము లలో 'నాభి' శబ్దము నభ అనునాదేశమును, యత్ ప్రత్యయమును పొందును. ఇచట 'నాభి' శబ్దము రథముయొక్క నాభి అనునర్థమునందలిదియే గ్రహింపఁబడవలయు నని వ్యాఖ్యాతలచే చెప్పఁబడినది. చక్రమునకు మధ్య నుండురంధ్రమును నాభి యందురు. దానికి హితమైనది అనునర్థమున నీ నభాదేశయత్ప్రత్యయములు వచ్చును.

నాభయేహితః - నాభి + ఙే + యత్, విభక్తిలోపము, నభ + య(త్) 'యస్యేతిచ' - అకారలోపము నభ్+య=నభ్య + సు=నభ్యః - రథముయొక్క నాభికి అనుగుణమైన ఇరుసు. నభ్యమ్ అంజనమ్ = రథముయొక్క నాభికి యోగ్యమైన కారు మున్నగునది.

గవాదిగణము : గో హవిస్ అక్షర విష బర్హిస్ అష్టకా స్వదా యుగ మేధా స్రుచ్. 'నాభినభంచ' 95 'శునః సంప్రసారణం వాచదీర్ఘత్వం తత్సంని యోగేన చాన్తో దాత్తత్వమ్' 96 'ఊధసోఽనఙ్ చ' 97. కూప ఖద దర ఖర అసుర అధ్వస్ (అధ్వన) క్షర వేద బీజ దీస (దీప్త). ఇతిగవాదిః.

సూ : తస్మైహితమ్ 5-1-5.

వృ : వత్సేభ్యో హితో వత్సీయో గోధుక్.

ప వి : తస్మై (4-1) హితమ్ (1-1)

అను : ఛః (1-1) ఉగవాదిభ్యః (5-3) యత్ (1-1) సమర్థానామిత్యాది.

అర్థ : 'దానికొఱకు హితమైనది' అనునర్థమున సమర్థచతుర్థ్యంతమునకు యథాసంభవముగ ఛ, యత్ ప్రత్యయములు వచ్చును. ఉదా : వత్సేభ్యోహితః వత్సీయో గోధుక్

వివ : 'తస్మై' అనునది చతుర్థ్యంత పదమునకు చిహ్నము. 'దానికొఱకు హితమైనది' అనునర్థమున హితము దేనినుద్దేశించి అగునో తద్వాచక చతుర్థ్యంతము ఉకారాంతముగాని గవాదిగాని అయినచో యత్ ప్రత్యయమును, తక్కినది ఛ ప్రత్యయమును పొందును.

ఉదా : వత్సేభ్యోహితః- వత్సములకు హితమైనది. వత్స + ఙే, ఛ విభక్తిలోపము. ఛకారమునకు ఈయ్ఆదేశము వత్స + ఈయ, యస్యేతిచ - అకారలోపము. వత్స + ఈయ = వత్సీయ + సు = వత్సీయః గోధుక్ - వత్సీయుఁడైన పాలుపిదుకువాఁడు. (వత్సశబ్దము గవాదుల లోనిదికాదు).

సూ : శరీరావయవాద్యత్ 5-1-6.

వృ : దన్త్యమ్, కణ్ఠ్యమ్, నస్యమ్.

ప వి : శరీరావయవాత్ (5-1) యత్ (1-1).

అను : సమర్థానా మిత్యాది; తస్మై (4-1) హితమ్ (1-1).

అర్థ : 'దానికొఱకు హితమైనది' అనునర్థమున శరీరావయవవాచక చతుర్థ్యంతములకు 'యత్' ప్రత్యయము వచ్చును.

వివ : శరీరావయవములగు పళ్ళు ముక్కు మున్నగువానికి వాచకములైన దన్త, నాసికా మున్నగువాని చతుర్థ్యంతరూపములకు, వానికి హితమైనది అనునర్థమున 'యత్' ప్రత్యయము వచ్చును. ఇది ఛ ప్రత్యయమునకపవాదము.

ఉదా : దన్తేభ్యోహితమ్ - దంతములకొఱకు హితమైనది. దన్త+భ్యస్+యత్, విభక్తిలోపము, దన్త + య, యస్యేతిచ - అకారలోపము-దన్త్య+అ= దన్త్య + సు=దన్త్యమ్.

కణ్ఠాయ హితమ్ కంఠమునకు హితమైనది. కణ్ఠ + ఙే+యత్, కణ్ఠ్ + య = కణ్ఠ్య + సు = కణ్ఠ్యమ్.

నాసికాయై హితమ్ నాసికకు హితమైనది. నాసికాశబ్దమునకు ఈ ప్రత్యయ యోగమున 'నస్' అనునాదేశము విధింపఁబడినది. నస్ + య = నస్య+సు = నస్యమ్ - ముక్కుపొడి.

'వాని యందేర్పడునది' అనునర్థమునందు దంత్యమ్ మున్నగునవి అగును 'శరీరావయవాచ్చ' (శైషిక) సందర్భమునుబట్టి యర్థభేదమును గమనింప వలయును

సూ : ఆత్మన్విశ్వజనభోగోత్తర పదాత్ఖః 5-1-9.

ప. వి : ఆత్మన్... పదాత్ (5-1) ఖః (1-1).

అను : తస్మై (4-1) హితమ్ (1-1) సమర్థానామిత్యాది

అర్థ : ఆత్మన్, విశ్వజన అనుశబ్దములయు భోగశబ్దము ఉత్తరపదముగాఁ గల వానియొక్కయు చతుర్థ్యంతములను దానికి హితమైనది' అనునర్థమున 'ఖ' ప్రత్యయము వచ్చును

వివ : చతుర్థీ విభక్త్యంతములగు ఆత్మన్, విశ్వజన అనువానికిని భోగ శబ్దము ఉత్తరపదముగాఁ గలవానికిని, దానికి హితమైనది అనునర్థమున 'ఖ' ప్రత్యయము వచ్చును

ఉదా : ఆత్మనే హితమ్ - ఆత్మకు హితమైనది. ఆత్మన్ + ఙే + ఖ, విభక్తి లోపము ఆయనేయీనీత్యాదిసూత్రముచే 'ఈన్' ఆదేశము, 'ఆత్మన్ + ఈన' - ఇట్టి యెడ 'నస్తద్ధితే' అను సూత్రముచే టిలోపము ప్రాప్తించుచుండ నీక్రింది సూత్రము దానిని నిషేధించుచున్నది.

సూ : ఆత్మాధ్వానౌ ఖే 6-4-169.

వృ : ఏతౌ ఖే ప్రకృత్యా స్తః. ఆత్మనే హిత మాత్మనీనమ్.

ప. వి : ఆత్మాధ్వానౌ (1-2) ఖే (7-1).

అను : ప్రకృత్యా (3-1).

అర్థ : ఆత్మన్, అధ్వన్ శబ్దములు ఖ ప్రత్యయము పరమగునపుడు ప్రకృతితో నుండును. ఉదా : ఆత్మనీనమ్

వివ : ప్రకృతితో నుండుననగా వానికి ప్రాప్తమగుటిలోపము రాదనిభావము. 'ఈన' అనునది ఆదేశమగుటచే ఆదేశము స్థానివంటిదగునను పరిభాషనుబట్టి 'ఆత్మన్+ఈన' అనుచోట 'ఖ' ప్రత్యయము పరమయినదనియే భావన. ఆత్మన్+ఈన = ఆత్మనీన + సు = ఆత్మనీనమ్

అవ : విశ్వజన, భోగోత్తర పదముల కుదాహరణములు.

వృ : విశ్వజనీనమ్, మాతృభోగీణః

వివ . విశ్వజనేభ్యోహితమ్ - సమస్తజనులకు హితమైనది. విశ్వజన + భ్యస్ + ఖ, విభక్తిలోపము, ఈనాదేశము, అకారలోపము, విశ్వజనీన + సు= విశ్వజనీనమ్.

మాతృభోగాయహితమ్, మాతృభోగ + ఙే + ఖ, విభక్తిలోపాదులు, మాతృభోగ్ + ఈన=నకారమునకు ణత్వము (ఋకారయోగముచే)

మాతృభోగీణ + సు=మాతృభోగీణః.

ప్రకరణావలోకనము : ఇందు 'తస్మైహితమ్' అనునర్థమున ఛ యత్ ప్రత్యయములును, ఖ ప్రత్యయమును విధింపఁబడినవి 'నాభినభంచ' అను గణ సూత్రము నాభిశబ్దమునకు నభాదేశమును విధించినది. 'ఆత్మాధ్వానౌ ఖే' అనునది టిలోపమును వారించినది.

అథ అర్హీయ ప్రకరణమ్

అవ : 'తదర్హతి' అనునర్థమీప్రకరణమున చెప్పఁబడుచున్నది. మఱికొన్ని యర్థములందును ప్రత్యయములు విధింపఁబడుచున్నవి. 'అర్హము' అనునర్థమున విధింపఁబడు ప్రత్యయములుగల ప్రకరణమగుటచే దీనికి అర్హీయప్రకరణమని పేరు

సూ : **ప్రాగ్వతే ష్ఠఞ్ 5-1-18.**

వృ : **తేన తుల్యమిత్యతః ప్రాక్ ఠఞధిక్రియతే.**

ప వి : ప్రాక్ (1-1) వతేః (5-1) ఠఞ్ (1-1)

అర్థ : 'తేనతుల్యం క్రియా చేద్వతిః' అనుసూత్రమువఱకు 'ఠఞ్' అనునది అధికారము

వివ : సూత్రమునందలి వతిశబ్దము వతిగల సూత్రమును తెలుపును. 'తేన తుల్యం క్రియా చేద్వతిః' అనునది యా సూత్రము అంతవఱకు (5-1-115) విశేష ప్రత్యయములు చెప్పఁబడనిచోట 'ఠఞ్' ప్రత్యయము ఉపస్థితమగునని సూత్రతాత్పర్యము

సూ : **తేన క్రీతమ్ 5-1-37.**

వృ : **సప్తత్యా క్రీతం సాప్తతికమ్, ప్రాస్థికమ్.**

ప వి : తేన (3-1) క్రీతమ్ (1-1).

అను : ఠఞ్ (1-1) ప్రత్యయః, తద్ధితః, సమర్థానాం, ప్రథమాత్, వా.

అర్థ : 'దానిచే కొనఁబడినది'అనునర్థమున తృతీయాంతపదమునకు పరముగా ఠఞ్ ప్రత్యయము వచ్చును. ఉదా : సాప్తతికమ్ః ప్రాస్థికమ్.

వివ : కొనఁబడిన వస్తువును తెలుపుచు, కొనుటలో సాధనమైన దానిని చెప్పు శబ్దముయొక్క తృతీయాంతరూపమునకు పరముగా 'ఠఞ్' అను ప్రత్యయము వచ్చును ఇందు ఞకారమిత్తు. 'ఠ' కారమునకు ఇక' అదేశమగును (ఠస్యేకః).

ఉదా : సప్తత్యా క్రీతమ్. డెబ్బది (రూప్యములు మున్నగువాని)చే కొనఁబడినది. సప్తతి + టా + ఠఞ్ విభక్తిలోపము, ఆదివృద్ధి, ఇకాదేశము, సాప్తతి + ఇక, యస్యేతిచ - ఇకారలోపము, సాప్తత్ + ఇక=సాప్తతిక+సు=సాప్తతికమ్.

ప్రస్థేన క్రీతమ్ - ప్రస్థముచే కొనఁబడినది. ప్రస్థ + టా + ఠఞ్ విభక్తిలోపాదులు, ప్రాస్థిక + సు=ప్రాస్థికమ్.

సూ : తస్యేశ్వరః 5-1-42.

సూ : తత్ర విదిత ఇతి చ 5-1-43.

వృ : సర్వభూమి పృథివీభ్యామణఞౌ స్తః.

ప వి : తస్య (6-1) ఈశ్వరః (1-1) తత్ర (అవ్య) విదితః (1-1) ఇతి (అవ్య) చ (అవ్య)

అను : సర్వభూమిపృథివీభ్యామ్ (5-2) అణఞౌ (1-2) సమర్థానా మిత్యాది.

అర్థ : 'దానియొక్క ఈశ్వరుఁడు' 'అందు తెలియఁబడినవాఁడు' అనునర్థము లందు సర్వభూమి, పృథివీ శబ్దములకు పరముగా అణ్, అఞ్ ప్రత్యయములు వచ్చును.

వివ : దానియొక్క ఈశ్వరుఁడు అనునర్థమున షష్ఠ్యంతసమర్థములును, అందు తెలియఁబడినవాఁడు (ప్రసిద్ధికెక్కినవాఁడు) అనునర్థమున సప్తమ్యంత సమర్థములును అయినసర్వభూమి పృథివీ శబ్దములకు క్రమముగా అణ్, అఞ్ ప్రత్యయములు వచ్చును. ఈ ప్రత్యయములకు రూపభేదములేదు. ణ్, ఞ్-లు ఇత్తు లగుటవలన స్వరములో భేదముండును.

ఉదా : సర్వభూమేః ఈశ్వరః, సర్వభూమౌ విదితో వా - సర్వభూమికి నీశ్వరుఁడు, లేక సర్వభూమియందు ప్రసిద్ధుఁడు, సర్వభూమి + ఙస్/ఙి + అణ్, విభక్తిలోపము, సర్వభూమి + అణ్, ఇది అనుశతికాదులలోనిది కావున 'అను శతికాదీనాంచ' అను సూత్రముచే ఉభయపదవృద్ధి వచ్చును సార్వభౌమ + అ, యస్యేతిచ - అకారలోపము, సార్వభౌమ్+అ = సార్వభౌమ+సు = సార్వభౌమః. (అనుశతికాదీనాంచ అనుసూత్రము తైషికప్రకరణమున వ్యాఖ్యానింపఁబడినది).

పృథివ్యా ఈశ్వరః, పృథివ్యాం విదితోవా - పృథివికి ఈశ్వరుఁడు లేక, పృథివియందు విదితుఁడు పృథివీ + ఙస్/ఙి + అఞ్, విభక్తిలోపము, ఆది వృద్ధి (ఋ > అర్) పార్థివీ + అ, యస్యేతిచ - ఈకారలోపము పార్థివ్+అ= పార్థివ+సు=పార్థివః.

సూ : పఙ్క్తి-వింశతి త్రింశచ్చత్వారింశత్పఞ్చాశత్ షష్టి సప్తత్యశీతి నవతి శతమ్ 5-1-59.

వృ : ఏతేరూఢ శబ్దా నిపాత్యన్తే.

ప వి : పఙ్క్తి.... శతమ్ (1-1)

అను : శత్ (1-1) అస్య (6-1) పరిమాణమ్ (1-1).

అర్థ : పంక్తిమున్నగురూఢి శబ్దము లీసూత్రముచే నిపతింపఁబడుచున్నవి.

వివ : ఈ సూత్రములోనికి 'తదస్య పరిమాణమ్' అనునది అనువృత్త మగును. 'అది దీనిపరిమాణము' అనునర్థమున పంక్తి మున్నగు రూఢిశబ్దములు ఈ సూత్రముచే నిపతింపఁబడుచున్నవి. రూఢియనగా జనవ్యవహారములో నొక యర్థమునందు స్థిరత్వమును పొందుట. అవయవార్థమును బట్టించుకొన నక్కరలేదని భావము వీనిస్వరూపము నీక్రిందివిధముగా నరియఁదగును

(1) పఞ్చ పాదాః పరిమాణమస్య-పంచపాదములు దీనికి పరిమాణము అను నర్థమున పఞ్చన్ శబ్దమునకు తి ప్రత్యయము, టిలోపము, పఞ్చ్ + తి, చకారము నకు కుత్వము పఙ్క్ + తి = పఙ్క్తి+సు=పఙ్క్తిః. ఇది అయిదుపాదములుగల ఛందోవిశేషమునకు సంజ్ఞ.

(2) దశానాం వర్గో దశత్ – పదింటివర్గము 'దశత్' అగును. ద్వౌదశతౌ పరిమాణమస్య – రెండు దశత్తుల పరిమాణముగల సంఘము మున్నగునది. అను నర్థమున ద్విదశత్ శబ్దమునకు 'శతిచ్' ప్రత్యయము, ప్రకృతికి (ద్విదశత్ – అను దానికి) 'విన్' ఆదేశము–విన్+శతి (చ్) నకారమున కనుస్వారాదేశము, వింశతి + సు=వింశతిః – ఇరువదింటియొక్క సంఘము 'వింశతి' శబ్దము స్త్రీలింగము నేకవచనము సగుట లోకవ్యవహారసిద్ధము నేఁడు వింశతి మున్నగునవి ఇరువ దింటి సముదాయము అనునర్థమునందు మాత్రమే కాక 'యిరువది' మున్నగు నర్థము నందును వాడఁబడుచున్నవి అప్పుడు సముదాయమునకు, సంఖ్యకు అభేదము చెప్పఁబడినదని భావింపవలయును.

(3) త్రయః దశతః, పరిమాణమస్య – మూఁడుదశత్తుల పరిమాణముగలది. త్రిదశత్ శబ్దమునకు శత్ ప్రత్యయమును, ప్రకృతియగు 'త్రిదశత్' అనుదానికి త్రిన్ అను నాదేశమును నిపతింపఁబడినవి. త్రిన్+శత్, త్రింశత్ + సు = త్రింశత్ = మూఁడువదుల పరిమాణముగల సంఘము.

(4) చత్వారో దశతః పరిమాణమస్య – నాలుగు దశత్తులు పరిమాణ ముగాఁగలది, చతుర్దశత్ శబ్దమునకు 'శత్' ప్రత్యయము, ప్రకృతికి 'చత్వారిన్' అనునాదేశముమ నిపతింపఁబడినవి. చత్వారిన్ + శత్, అనుస్వారాదేశము, చత్వా రింశత్ + సు=చత్వారింశత్–నాలుగుపదుల లెక్కగలసంఘము.

(5) పఞ్చదశతః పరిమాణమస్య - అయిదు దశత్తులు పరిమాణముగా గలది శత్ ప్రత్యయము. ప్రకృతికి 'పఞ్చా' ఆదేశము, పఞ్చాశత్ + సు = పఞ్చాశత్, అయిదుపదుల పరిమాణముగల సంఘము

(6) షడ్ దశతః పరిమాణమస్య - అఱువదులు పరిమాణముగాఁగల సంఘము 'తి' ప్రత్యయము, ప్రకృతికి 'షష్' అనునాదేశము, షకారమునకు ఝలాంజశోఽన్తే అనుసూత్రముచే ప్రాప్తమగు జశ్త్వమురాకుండుటయు షష్+తి, ష్టుత్వము, షష్టి + సు=షష్టిః.

(7) సప్త దశతః పరిమాణమస్య - ఏడుపదులు పరిమాణముగా గల సంఘము. 'తి' ప్రత్యయము, ప్రకృతికి 'సప్త' ఆదేశమును నిపతింపఁబడినవి సప్తతి + సు = సప్తతిః.

(8) అష్టౌదశతః పరిమాణమస్య - ఎనిమిది పదులు పరిమాణముగాగల సంఘము, 'తి' ప్రత్యయమును, ప్రకృతికి 'అశీ' ఆదేశమునునిపతింపఁ అశీతి + సు = అశీతిః.

(9) నవ దశతః పరిమాణమస్య - తొమ్మిదిపదులు పరిమాణముగాఁగల సంఘము 'తి' ప్రత్యయమును ప్రకృతికి 'నవ' ఆదేశమును నిపతింపఁబడినవి. నవతి + సు=నవతిః.

(10) దశ దశతః ప్రమాణమస్య - పదిపదులు పరిమాణముగాగలసంఘము 'త' ప్రత్యయము, ప్రకృతికి 'శ' అను నాదేశమును నిపతింపఁబడినవి. శత + సు=శతమ్

ఇవి యన్నియు అవ్యుత్పన్నరూపములని భాష్యోక్తి. ప్రకృతిప్రత్యయవిభాగమును సుస్పష్టముగా నిరూపింప వీలులేనివానిని అవ్యుత్పన్నములందురు.

సూ : తదర్హతి 5-1-63.

వృ : శ్వేతచ్ఛత్ర మర్హతి శ్వైతచ్ఛత్రికః.

ప. వి : తత్ (2-1) అర్హతి (క్రి. ప)

అను : ఠఞ్ (1-1) సమర్థానామిత్యాది.

అర్థ : 'దానిని పొందుటకు తగినవాఁడు'అమనర్థమున ద్వితీయాంతపదమునకు పరముగా 'ఠఞ్' ప్రత్యయము వచ్చును. ఉదా : శ్వైతచ్ఛత్రికః.

వివ : ద్వితీయాంతపదమునకు, దానిచేవాచ్యమగుదానిని పొందుటకు తగిన వాఁడు అనునర్థమును వ్యక్తముచేయుచు 'ఠఞ్' ప్రత్యయము వచ్చును.

ఉదా : శ్వేతచ్ఛత్రమ్ అర్హతి - తెలిగొడుగును పొందుటకు తగినవాఁడు శ్వేతచ్ఛత్ర + అమ్ + ఠఞ్, విభక్తిలోపము, ఆదివృద్ధి (ఏ > ఐ) శ్వైత చ్ఛత్ర + ఠ, ఇకాదేశము, అకారలోపము, శ్వైతచ్ఛత్ర్ + ఇక = శ్వైత చ్ఛత్రిక + సు = శ్వైతచ్ఛత్రికః

సూ : దణ్డాదిభ్యో యత్ 5-1-66.

వృ : ఏభ్యో యత్. దణ్డమర్హతి దణ్డ్యః, అర్ఘ్యః, వధ్యః.

ప. వి : దణ్డాదిభ్యః (5-3) యత్ (1-1).

అను : తత్ (2-1) అర్హతి (క్రి. ప) సమర్థానామిత్యాది;

అర్థ : 'దానిని పొందనర్హుఁడు' అనునర్థమున దండాదిప్రకృతిక ద్వితీయాంత ములకు యత్ ప్రత్యయము వచ్చును. ఉదా : దణ్డ్యః.

వివ : 'దండము పొందుటకు యోగ్యుఁడు' అను నిట్టి యర్థమునందు దండాదిశబ్దముల ద్వితీయాంతములకు పరముగా 'యత్' ప్రత్యయము వచ్చును. ఇందు తకారమిత్తు. ఇది 'ఠఞ్' ప్రత్యయమున కపవాదము.

దణ్డమర్హతి - దండమునకు యోగ్యుఁడు దణ్డ + అమ్ + యత్, విభక్తి లోపము, అకారలోపము దణ్డ్ + య=దణ్డ్య+సు=దణ్డ్యః

అర్ఘమర్హతి - పూజకు తగినది. అర్ఘ + అమ్ + యత్, విభక్తిలోపము, అకారలోపము, అర్ఘ్య+సు=అర్ఘ్యః.

వధమర్హతి - వధకు యోగ్యుఁడు - వధ + అమ్ + యత్, వధ్య + సు = వధ్యః.

దండాదిగణము : దణ్డ ముసల మధుపర్క కశా అర్ఘ మేఘ మేధా సువర్ణ ఉదక వధ యుగ గుహా భాగ ఇభ భఙ్గ - ఇతిదణ్డాదిః.

సూ : తేన నిర్వృత్తమ్ 5-1-79.

వృ : అహ్నా నిర్వృత్తమ్ ఆహ్నికమ్

ప. వి : తేన (3-1) నిర్వృత్తమ్ (1-1).

అను : ఠఞ్ (1-1) సమర్థానామిత్యాది. కాలాత్ (5-1).

అర్థ. 'దానిచేత నెఱవేఱినది' అనునర్థమున తృతీయాంతపదమునకు పరముగా 'ఠఞ్' ప్రత్యయము వచ్చును

వివ : ఇది 'కాలాత్' అనునధికారములోనిది. కాలవాచకశబ్దముల తృతీయాంతమునకు 'దానిచేత నెఱవేఱినది' అనునర్థమున 'ఠఞ్' ప్రత్యయము వచ్చును.

ఉదా : అహ్నా నిర్వృత్తమ్ - పగటిచే నెఱవేఱినది - అహన్+టా + ఠఞ్, విభక్తిలోపము, ఆదివృద్ధి, ఆహన్ + ఠ, ఇకాదేశము. ఆహన్ + ఇక, టిలోపము ప్రాప్తించుచుండగా 'అహ్నష్టఖోరేవ' అనునియమముచే నదివారింపఁబడును. 'అల్లోపోఽనః' అను సూత్రముచే హకారమునందలి అకారమునకు లోపము వచ్చును ఆహన్+ఇక=ఆహ్నిక + సు=ఆహ్నికమ్.

వృ। ఇతి ఠఞ్ ఽవధిః

అర్థ : ఇది 'ఠఞ్' ప్రత్యయమునకు హద్దు.

ఇది ఆర్హీయప్రకరణము.

ప్రకరణావలోకనము : ఈ ప్రకరణమున 'దానిచే కొనఁబడినది', దానియొక్క ఈశ్వరుఁడు, దానియందు విదితుఁడు, దానినిఁబొంద నర్హుఁడు, దానిచేత నెఱవేఱినది అనునర్థములందు ఠఞ్, యత్, అణ్, అఞ్ ప్రత్యయములు విధింపఁబడినవి పంక్త్యాదిశబ్దములు 'అది దీనియొక్క పరిమాణము' అనునర్థమున నిపతింపఁబడినవి. అర్హార్థమున విధింపఁబడిన ప్రత్యయమునుబట్టి దీనికి ఆర్హీయ ప్రకరణమను సంజ్ఞకలిగినది.

అథ నఞ్స్నఞధికార ప్రకరణమ్.

అవ : 'స్త్రీ పుంసాభ్యాం నఞ్ స్నఞౌ భవనాత్' అనుసూత్రమున ధాన్యానాం భవనేక్షేత్రే' అనుసూత్రమునకు పూర్వము వఱకుఁగల అర్థములలో స్త్రీపుంస్ శబ్దములకు నఞ్ స్నఞ్ ప్రత్యయములు వచ్చునని చెప్పఁబడినది. ఆయర్థము లీప్రకరణముతో ముగియనున్నవి. కావున నఞ్ స్నఞ్ ప్రత్యయముల అధికారము ముగియు ప్రకరణము కావున దీనికి నఞ్స్నఞధికార ప్రకరణమను నామము ఉంచఁబడినది ఇందు సాధారణముగ భావకర్మార్థములయందు వచ్చు ప్రత్యయములు చెప్పఁబడి యుండుటచే భావకర్మార్థిక ప్రకరణమనియు దీనికి వ్యవహారము గలదు.

సూ : తేనతుల్యం క్రియాచేద్వతిః 5-1-115.

వృ: బ్రాహ్మణేనతుల్యం బ్రాహ్మణవదధీతే క్రియాచేత్ కిమ్? గుణతుల్యే మాభూత్. పుత్రేణతుల్యః స్థూలః.

ప. వి : తేన (3-1) తుల్యమ్ (1-1) క్రియా (1-1) చేత్ (అవ్య) వతిః (1-1).

అను : సమర్థానా మిత్యాదిః

అర్థ : 'దానితో తుల్యమైనది' అనునర్థమున తుల్యమైన క్రియవాచ్యమగు నపుడు తృతీయాంతపదమునకు 'వతి' ప్రత్యయము చేరును. క్రియవాచ్యమగునో అనుటవలన గుణముతుల్యమైనపు డీప్రత్యయము రాదు పుత్రేణతుల్యఃస్థూలః.

వివ : తుల్యమనగా సమానము తుల్యమగు క్రియవాచ్యమైనపుడు తృతీయాంతపదమునకు పరముగా 'వతి' అను తద్ధిత ప్రత్యయము చేరును. ఇందు 'ఇ' కారము ఇత్తు (ఉపదేశేఽజనునాసిక ఇత్).

ఉదా : బ్రాహ్మణేవ తుల్యమధీతే - బ్రాహ్మణునితో తుల్యముగా చదువుచున్నాఁడు-బ్రాహ్మణుఁడు చదివినట్లుగా చదువుచున్నాఁడు ఇచట క్రియతుల్యమైనదికావున బ్రాహ్మణేన'అను తృతీయాంతపదమునకు 'వతి'ప్రత్యయమువచ్చును. బ్రాహ్మణ+టా+వత్ (ఇ). విభక్తిలోపము. బ్రాహ్మణవత్. బ్రాహ్మణుడు చదివినవిధముగా క్షత్రియాదులు చదువుట అయినది అనిదీనికి తాత్పర్యము. ఇచట బ్రాహ్మణశబ్దముచే బ్రాహ్మణాధ్యయనము గ్రాహ్యము.

వతి ప్రత్యయాంతము అవ్యయము కావున దానికి పరముగా చేరినసుప్పులకు లుక్కువచ్చును (అవ్యయాదాప్సుపః).

వతి ప్రత్యయాంతముచే క్రియయే వాచ్యము కావలయునుగుణచే గుణాదులు వాచ్యములగునపు డీప్రత్యయమురాదు ఉదా : పుత్రేణతుల్యః స్థూలః పుత్రునితో తుల్యుఁడైన స్థూలుఁడు - స్థూలత్వము గుణము. ఇచట 'పుత్రవత్'. అనరాదు.

సూ : తత్ర తస్యేవ 5-1-116.

వృ : మధురాయామివ మధురావత్ స్రుఘ్నే ప్రాకారః, చైత్రస్యేవ చైత్రవచ్చైత్రస్య భావః.

ప. వి : తత్ర (అవ్య) తస్య (6-1) ఇవ (అవ్య).

అను : సమర్థానామిత్యాది, వతిః (1-1).

అర్థ : 'దానియందువలె', 'దాని(యొక్క) వలె' అనునర్థములందు సప్త మ్యంత, షష్ఠ్యంతపదములకు పరముగా 'వతి' ప్రత్యయము వచ్చును. ఉదా : మథురా యామివ=మథురావత్ స్రుఘ్నే ప్రాకారః, చైత్రస్యేవ చైత్రవచ్చైత్రస్య భావః.

వివ : తత్ర అనునది సప్తమ్యంతపదమును, తస్య అనునది షష్ఠ్యంతపద మును సూచించును ఇవ అనునది పీనితో ప్రత్యేకముగా నన్వయించును తత్ర ఇవ - దానియందువలె - 'దానియందున్నట్లుదీని యందున్నది' అనునర్థము నందును తస్య ఇవ - దానివలెనిది యున్నది అనునర్థమునందును క్రమముగా సప్తమ్యంత షష్ఠ్యంతపదములకు పరముగా 'వతి' ప్రత్యయముచేరును.

ఉదా : సప్తమ్యంతమునకు - మథురాయామ్ ఇవ - మథురయందు వలె, మథురా + ఙి, వతి, విభక్తిలోపము మథురావత్, మథురావత్. స్రుఘ్నే ప్రాకారః స్రుఘ్నమునందలి ప్రాకారము మథురయందలిప్రాకారమువలె నున్నది అని యర్థము.

షష్ఠ్యంతమునకు-చైత్రస్యేవ - చైత్రుని (భావము)వలె; చైత్ర + ఙస్ + వతి - విభక్తిలోపము చైత్రవత్ చైత్రవత్ మైత్రస్యభావః మైత్రునియొక్క భావము చైత్రునిభావమువలె నున్నది.

సూ : తస్యభావ స్త్వతలౌ 5-1-119.

వృ . ప్రకృతిజన్యబోధే ప్రకారో భావః. గోర్భావో గోత్వమ్; 'త్వాన్తం క్లీబమ్' [లి. 120] 'తలన్తం స్త్రియామ్ [లి. 17].

వ. వి : తస్య (6-1) భావః (1-1) త్వతలౌ (1-2).

అను : సమర్థానామిత్యాది.

అర్థ : వానియొక్క దానియొక్క భావము అనునర్థమైన షష్ఠ్యంతమునకు త్వ, తల్ ప్రత్యయములు వచ్చును. ప్రకృతిజన్యబోధమునందు ప్రకారము భావము. ఉదా : గోర్భావః గోత్వమ్. త్వ ప్రత్యయాంతము నపుంసకమగును. తల్ ప్రత్యయాంతము స్త్రీలింగమగును (లింగానుశాసనము).

వివ : భావమనగా ప్రకృతిజన్య బోధమునందు ప్రకారము అని చెప్పఁబడినది ప్రత్యయము దేనికి విధింపఁబడునో అది ప్రకృతి ప్రకృతిజన్యమనగా ప్రకృతినుండి పుట్టునది, అదిబోధము ప్రకృతిజన్యబోధమనగా ప్రకృతినుండి పుట్టు అర్థజ్ఞానము. 'గోవు' అనగా కుక్క పిల్లి యిత్యాదులుకాని జంతువిశేషముఅని యర్థము తదితర జంతువులకంటె దీనిని వేఱుగా చూపుధర్మవిశేషము ఏదికలదో దానిని ప్రకారమందురు. అనగా ఆ జంతువును ఆ పేరుతో వ్యవహరించుటకు వీలైన సర్వలక్షణముల సమాహారమని తాత్పర్యము దానికి భావమనిపేరు దేనియొక్క భావము వాచ్యమగునో, తద్వాచక షష్ఠ్యంతమునకు వరుసగా 'త్వ', 'తల్' అను ప్రత్యయములు వచ్చును ఇందు 'తల్'లోని లకారము ఇత్తు త్వప్రత్యయము చేరినశబ్దము నపుంసకమనియు, తల్ ప్రత్యయము చేరినరూపము స్త్రీలింగమనియు 'త్వాన్తం క్లీబమ్', 'తలన్తం స్త్రియామ్' అను లింగానుశాసనసూత్రములచే చెప్పఁబడినది.

ఉదా : గోః భావః - గోవుయొక్క భావము గో + ఙస్, త్వ, విభక్తి లోపము - గోత్వ + సు = 'గోత్వమ్' - గోవునందుండు విశిష్టధర్మము. తల్ ప్రత్యయము వచ్చినచో గో+ఙస్ + తల్ = గోత, ఇది స్త్రీలింగము కావున స్త్రీత్వమున 'టాప్' ప్రత్యయము చేరును. గోత+టాప్ (టకార పకారములిత్తులు) గోత + అ = గోతా + సు = గోతా.

సూ : ఆ చ త్వాత్ 5-1-120.

వృ : బ్రహ్మణ స్త్వ ఇత్యతః ప్రాక్ త్వతలౌ వధిక్రియేతే. అపవాదైః సహ సమావేశార్థమిదమ్. చకారో నఞ్స్నఞ్భ్యామపి సమావేశార్థః, స్త్రియా భావః స్త్రైణమ్ - స్త్రీత్వమ్-స్త్రీతా. పౌంస్నమ్ - పుంస్త్వమ్ పుంస్తా.

వ. వి : ఆ (అవ్య) చ (అవ్య) త్వాత్ (5-1).

అను : త్వతలౌ (1-2).

అర్థ : 'బ్రహ్మణ స్త్వః' (5-1-136) అనుసూత్రమునకు పూర్వమువఱకు నీ ప్రత్యయము అధికృతములగును అపవాదములతో కూడనివియును వచ్చుటకై యీ సూత్రము చెప్పఁబడినది నఞ్స్నఞ్ ప్రత్యయములతోకూడ నివి యగునని చెప్పుటకొఱకు చకారము సూత్రమున గ్రహింపఁబడినది. ఉదా : స్త్రియాభావః. స్త్రైణమ్ ఇత్యాది.

వివ : పై సూత్రమున (5-1-120) విధింపఁబడిన త్వ, తల్ ప్రత్యయములు బ్రహ్మణ స్త్వః (5-1-136) అను సూత్రమునకు పూర్వమువఱకు అధికారమువను పోవునని యీ సూత్రముయొక్క యర్థము. ఈ విషయము ప్రత్యేకించి చెప్పనేల? అనువృత్తి చేతనే యీయర్థము సిద్ధింపవచ్చునుగదా! అనుదానికి సమాధానము చెప్పఁబడుచున్నది. కేవలమట్లు అనువృత్తిగా వచ్చినయెడల అపవాద ప్రత్యయములగు 'ఇమనిచ్' మున్నగునని విధింపఁబడిన తావులందు వీనికి ప్రవేశ ముండఁజాలదు. అపవాదప్రత్యయములగుటచే త్వతల్ప్రత్యయములను బాధించి అవియే వచ్చును కావున నీ సూత్రమున వీనిల అధికారమగుట విధింపఁబడినది. అట్లు విధింపఁబడుటవలన అపవాదప్రత్యయములగు ఇమనిచ్' మున్నగునవి రాదగిన ప్రకృతులకు, వానితోపాటు త్వతల్ప్రత్యయములు కూడ వచ్చుననునర్థము సిద్ధించును. అనగా ఇమనిజాదులు త్వతల్ ప్రత్యయములను వైకల్పికముగా బాధించునని తాత్పర్యము. సూత్రమునందలి 'చ' అనుపదము సముచ్చయార్థకము- త్వతల్ ప్రత్యయములుకూడ 'బ్రహ్మణ స్త్వః' అనుసూత్రమునకు పూర్వమువఱకు అధికారములగుననగా వానితోపాటు నఞ్, స్నఞ్ప్రత్యయములుకూడ వచ్చునని తాత్పర్యము. అవి స్త్రీపుంస్ శబ్దములకు విధింపఁబడినవి. కావున స్త్రీశబ్దమునకు భావార్థమున త్వతల్ ప్రత్యయములతోపాటు నఞ్ ప్రత్యయము చేరును అట్లే పుంస్' శబ్దమునకు త్వతల్ ప్రత్యయములతోపాటు స్నఞ్ ప్రత్యయము కూడ చేరును.

ఉదా : స్త్రియాఃభావః స్త్రీయొక్కభావము స్త్రీ + ఙస్ + నఞ్, విభక్తిలోపము, ఆదివృద్ధి, స్త్రైస, ణత్వము = స్త్రైణ + సు = స్త్రైణమ్ త్వ ప్రత్యయముచేరినచో స్త్రీ + ఙస్ + త్వ = స్త్రీత్వ + సు = స్త్రీత్వమ్ అగును. తల్ ప్రత్యయము చేరినచో, స్త్రీ + ఙస్ + త = స్త్రీత, స్త్రీలింగమున స్త్రీతా + సు = స్త్రీతా అగును.

పుంసోభావః - పుంస్ + ఙస్ + స్నఞ్, విభక్తిలోపము ఆదివృద్ధి పౌంస్ + స్న, సకారమునకు 'సంయోగాన్తస్యలోపః' అనుసూత్రముచే లోపము

పౌంస్న + సు = పౌంస్నమ్ త్వప్రత్యయము చేరినచో పుంస్ + జస్ + త్వ, విభక్తిలోపము, సకారలోపము, (సంయోగాన్తస్యలోపః) పుః త్వ, 'పుమః ఖయ్యమ్పరే' ఇత్యాదిసూత్రముచే రుత్వవిసర్గాదేశములు, విసర్గమునకు సకారాదేశము రాఁగా 'పుంస్త్వమ్' అగును తల్ ప్రత్యయము చేరినచో సస్త్రీ 'పుంస్తా' అను రూప మగును. (రూపసిద్ధికి హల్ సంధిపరిచ్ఛేదమునందలి పుమఃఖయ్యమ్పరే' సూత్రో దాహరణముల సిద్ధిక్రమము సరయునది.

సూ : పృథ్వాదిభ్య ఇమనిజ్వా 5-1-122.

వృ : వా వచన మణాది సమావేశార్థమ్

ప. వి : పృథ్వాదిభ్యః (5-3) ఇమనిచ్ (1-1) వా (అవ్య).

అను : తస్య (6-1) భావః (1-1) త్వతలౌ (1-2) సమర్థానామిత్యాది

అర్థ : 'దానియొక్క-భావము' అనునర్థమున షష్ఠ్యంతములగు పృథుమున్నగు వానికి 'ఇమనిచ్' ప్రత్యయము వైకల్పికముగా నగును. 'వా' అనుట అణాది ప్రత్యయముల సమావేశముకొఱకు.

విప : భావార్థమున 'పృథు' మున్నగువానికి 'ఇమనిచ్' ప్రత్యయము చేరును ఇది త్వతల్ ప్రత్యయములకు అపవాదమే అయినను, 'ఆచత్వాత్' అను సూత్రము వలన వానిని వైకల్పికముగా బాధించును అనగా పృథుమున్నగువానికి భావార్థమున ఇమనిచ్ ప్రత్యయమును, త్వతల్ ప్రత్యయములును వచ్చును. ఇట్లు అపవాద ప్రత్యయమగునది వైకల్పికముగా వచ్చునను నర్థము ఆ సూత్రముచేతనే సిద్ధించుచుండగా మఱల నిందు 'వైకల్పికముగా' ననునర్థముగల 'వా' అను దానిని గ్రహింపనేల? అనగా అణాదిప్రత్యయములు వచ్చుటకొఱకని సమాధానము చెప్పఁ బడినది పృథ్వాదులలోని పృథుమృదు మున్నగు శబ్దములకు 'ఇగన్తాచ్చలఘు పూర్వాత్' అను సూత్రముచే అణ్ ప్రత్యయమును, 'దఢ', 'ఖణ్డ' మున్నగు వానికి 'గుణవచన బ్రాహ్మణాదిభ్యః కర్మణిచ' అను సూత్రముచేత ష్యఞ్ ప్రత్య యమును ఈ మొదలగునవి సాధారణప్రత్యయములుగా విధిం ఎతే సూత్రము వానికి బాధకముగా 'ఇమనిచ్' ప్రత్యయమును విధించుచున్నది. సూత్ర మున 'వా' పదములేనిచో పృథుమృదు మున్నగువానికి ఇమనిచ్, త్వతల్ ప్రత్యయ ములు మాత్రమే వచ్చునుగాని పైన చెప్పఁబడిన అణ్, ష్యఞ్ మున్నగునవి వచ్చుటకు వీలుకాదు. అట్టియును రావలయునను తాత్పర్యముతో సూత్రమున

'వా' పదము ఉంచఁబడినది కావున పృథుమున్నగువానికి భావార్థమున, ఇమనిచ్, త్వతల్ ప్రత్యయములతోపాటు అణ్, ష్యఞ్ అఞ్ అను ప్రత్యయములుకూడ వచ్చునని తాత్పర్యము

ఉదా : పృథోర్భావః-పృథువు = గొప్పది, దానియొక్క-భావము. పృథు + ఙస్ + ఇమనిచ్ ఈ ప్రత్యయమున చకారమిత్తు. -'ని' లోని ఇకారము ఉచ్చారణార్థకము ఇమన్' మిగులును విభక్తిలోపము 'పృథు + ఇమన్'-తరువాతి కార్యము నీ క్రింది సూత్రము విధించుచున్నది.

సూ : ర ఋతో హలాదేర్లఘోః 6-4-161.

వృ : హలాదేర్లఘోః ఋకారస్య రః స్యాత్, ఇష్ఠేమేయస్సు.

ప వి : రః (1-1) ఋతః (6-1) హలాదేః (6-1) లఘోః (6-1).

అను : ఇష్ఠేమేయస్సు (7-3) అఙ్గస్య (6-1)

అర్థ : హలాదియైన అంగముయొక్క- లఘువైన హ్రస్వఋకారమునకు, ఇష్ఠన్, ఇమన్, ఈయస్ ప్రత్యయములు పరములగునపుడు, 'ర' అనునాదేశము వచ్చును

వివ : ఇష్ఠన్, ఇమన్, ఈయస్ అను ప్రత్యయములు పరములగునపుడు హల్లు మొదటఁగల అంగము యొక్క-లఘువగు హ్రస్వఋకారము స్థానమున 'ర' (ర్ + అ) అనునాదేశము వచ్చును.

ఉదా : పృథు + ఇమన్ - ఇందు 'పృథు' అను అంగము హలాది అందు లఘువైన ఋకారము గలదు. ఈ అంగమునకు 'ఇమన్' ప్రత్యయము పరముగా నున్నది. కావున ఋకారము పోయి 'ర' అనునది ఆదేశమగును. ప్ + రథు = ప్రథు + ఇమన్' అగును.

అవ : పైదశలో క్రింది సూత్రముచే టిలోపము విధింపఁబడుచున్నది.

సూ : టేః 6-4-155.

వృ : టేర్లోప ఇష్ఠేమేయస్సు.

ప. వి. టేః (6-1)

అను : భస్య (6-1) లోపః (1-1) ఇష్ఠేమేయస్సు (7-3).

అర్థ : ఇష్ఠన్, ఇమన్, ఈయస్ అను ప్రత్యయములు పరములగునపుడు భసంజ్ఞకము యొక్క- టిభాగమునకు లోపము వచ్చును.

వివ : యకారాది ప్రత్యయములుగాని, అజాది ప్రత్యయములు గాని పరము లగునపుడు పూర్వమునకు భసంజ్ఞ కలుగును. అట్టి భసంజ్ఞకముయొక్క 'టి' కి, ఇష్ఠన్, ఇమన్, ఈయస్ ప్రత్యయములు పరములగునప్పుడు లోపము వచ్చును.

ఉదా : ప్రథు + ఇమన్, ఇమన్ ప్రత్యయమజాది కనుక భసంజ్ఞను పొందు 'ప్రథు' అనుదాని 'టి' అగు ఉకారము లోపించును ప్రథ్ + ఇమన్ = ప్రథిమన్ + సు = ప్రథిమా.

అవ : 'రఋతోహలాదేర్లఘోః' అనుసూత్రముచే 'ర' ఆదేశము కొన్నిటికే వచ్చునని యీ క్రింది వార్త్తికము చెప్పుచున్నది.

వా॥ పృథుమృదు భృశకృశ దృఢ పరివృఢానామేవ రత్వమ్ (4211).

ప. వి : పృథు.........నామ్ (6-3) ఏవ (అవ్య) రత్వమ్ (1-1)

అర్థ : రఋతో ఇత్యాది సూత్రముచే విధింపఁబడిన 'ర' ఆదేశము పృథు, మృదు, భృశ, కృశ, దృఢ, పరివృఢ అనుశబ్దములకు మాత్రమే.

వివ : ఈ వార్త్తికముచే 'రఋతో' ఇత్యాది సూత్రమునకు పరిమితి ఏర్పడినది. ఇవికాక తక్కినశబ్దముల కాసూత్రమున చెప్పిన లక్షణములు సరిపడినను రాదేశము రాదని తాత్పర్యము.

ఉదాహరణ ప్రదర్శనము : పృథోర్భావః-ప్రథిమా; పార్థవమ్, మ్రదిమా మార్దవమ్

వివ : 'ప్రథిమా' అనుదాని ప్రక్రియపైని చూపఁబడినది. ఇమనిచ్ ప్రత్యయము రానిచో 'అణ్' ప్రత్యయము ఇగన్తాచ్చలఘుపూర్వాత్ అనుసూత్రముచే వచ్చును. (లఘుపూర్వకమైన ఇగ్వర్ణము అంతమునఁగల శబ్దముయొక్క షష్ఠ్యంతమునకు భావకర్మార్థములయందు అణ్ ప్రత్యయము వచ్చును) పృథు + ఙస్ + అణ్, విభక్తిలోపము, ఆదివృద్ధి పార్థు + అ, ఓర్గుణః, పార్థో + అ, అవాదేశము, పార్థ్ + వ + సు = పార్థవమ్.

ఇట్లే మృదోఃభావః - మృదువుయొక్కభావము; మృదు + ఙస్ + ఇమనిచ్, విభక్తిలోపము, 'ర' ఆదేశము, టిలోపము మ్రదిమన్ + సు = మ్రదిమా, అణ్ వచ్చినచో మృదు + ఙస్, అణ్, మృదు + అణ్, మార్దు + అ, మార్దో + అ, మార్దవ్ + అ = మార్దవ+సు = మార్దవమ్.

వీనికి త్వతల్ ప్రత్యయములును వచ్చును. పృథుత్వమ్, పృథుతా, మృదుత్వమ్, మృదుతా ఇత్యాదులు.

పృథ్వాదిగణము : పృథు మృదు మహత్ పటు తను లఘు బహు సాధు ఆశు ఉరు గురు బహుల ఖణ్డ దణ్డ అకిఞ్చన బాల హోఢ పాక వత్స మన్ద స్వాదు హ్రస్వ దీర్ఘ ప్రియ వృష ఋజు క్షిప్ర క్షుద్ర అణు - ఇతి పృథ్వాదిః

సూ : వర్ణదృఢాదిభ్యః ష్యఞ్ చ 5-1-123.

వృ : చాదిమనిచ్. శౌక్ల్యమ్. శుక్లిమా, దార్ఢ్యమ్, ద్రఢిమా

ప ని : వర్ణదృఢాదిభ్యః (5-3) ష్యఞ్ (1-1) చ (అవ్య).

అను తస్య (6-1) భావః (1-1) సమర్థానామిత్యాది.

అర్థ : వర్ణవాచకషష్ఠ్యంతములకును, దృఢాదిప్రకృతిక షష్ఠ్యంతములకును వికల్పముగా భావార్థమున ష్యఞ్ ప్రత్యయముకూడ వచ్చును కూడ అనుటచే ఇమనిచ్ ప్రత్యయమును వచ్చును. ఉదా : శౌక్ల్యమ్ ఇత్యాది

వివ : శుక్ల, నీల మున్నగు రంగులను తెలుపు పదముల షష్ఠ్యంతములకును, దృఢమున్నగువాని షష్ఠ్యంతములకును భావార్థమున ష్యఞ్,ఇమనిచ్ ప్రత్యయములు వచ్చును ష్యఞ్ ప్రత్యయములో షకార ఞకారము లిత్తులు. (షః ప్రత్యయస్య, హలన్త్యమ్.)

ఉదా : శుక్లస్యభావః - శుక్లముయొక్క భావము, (శుక్లము వర్ణవాచకము) శుక్ల +ఙస్, ష్యఞ్, విభక్తిలోపము, శుక్ల + (ష్) య (ఞ్) ఆదివృద్ధి, అకార లోపము, శౌక్ల్ + య=శౌక్ల్య + సు=శౌక్ల్యమ్. ఇమనిచ్ ప్రత్యయము వచ్చి నచో శుక్ల + ఇమన్ (ఇచ్) టేః, టిలోపము శుక్ల్ + ఇమన్=శుక్లిమన్+సు= శుక్లిమా.

దృఢస్యభావః దృఢముయొక్కభావము, దృఢ + ష్యఞ్, ఆదివృద్ధి (ఋ> అర్) దార్ ఢ + య, యస్యేతిచ అకారలోపము, దార్ ఢ్ య=దార్ఢ్య + సు=దార్ఢ్యమ్. ఇమనిచ్ ప్రత్యయము వచ్చినచో దృఢ + ఇమన్, ర-ఆదేశము ద్రఢ + ఇమన్, టిలోపము ద్రఢిమన్ + సు=ద్రఢిమా.

దృఢాదిగణము : దృఢ వృఢ పరివృఢ భృశ కృశ [వక్ర] శుక్ర చుక్ర ఆమ్ర [కృష్ట] లవణ తామ్ర శీత ఉష్ణ జడ బధిర పణ్డిత మధుర మూర్ఖ మూక. 'వేర్యాతలాభ మతిమనః శారదానామ్' 101. 'సమానమతి మనసోః' 102. జవన - ఇతి దృఢాదిః.

మూ : గుణవచన బ్రాహ్మణాదిభ్యః కర్మణిచ 5-1-124.

వృ : చాద్భావే. జడస్య భావః కర్మ వా జాడ్యమ్; మౌఢ్యమ్. బ్రాహ్మణ్యమ్. ఆకృతిగణోఽయమ్.

ప వి : గుణవచన బ్రాహ్మణాదిభ్యః (5-3) కర్మణి (7-1) చ (అవ్య).

అను : ష్యఞ్ (1-1) తస్య (6-1) భావః (1-1) సమర్థానాంప్రథమాద్వా ఇత్యాది

అర్థ : గుణవాచకశబ్దములకును, బ్రాహ్మణాదులకును అతనిభావము, కర్మము అనునర్థములందు ష్యఞ్ ప్రత్యయము వచ్చును. ఉదా . జాడ్యమ్ ఇత్యాది.

వివ : గుణమును వచించునవి గుణవచనములు షష్ఠ్యంతములగువానికిని, బ్రాహ్మణాదులకును, వానియొక్క భావములేక అతనియొక్క కర్మము (అతడు చేయుపని) అనునర్థమునందు ష్యఞ్ ప్రత్యయము వచ్చును 'చకారాత్' అను సూత్రముచే భావమున త్వతల్ ప్రత్యయములును వచ్చును. ఉదా : జడస్య భావః కర్మ వా, జడునియొక్క భావము లేక కర్మము జడ + ఙస్ + ష్యఞ్, విభక్తి లోపము, ఆదివృద్ధి జాడ + య (షకారఞకారములిత్తులు) అకారలోపము (యస్యేతిచ) జాడ్ + య=జాడ్య + సు=జాడ్యమ్ (జడ శబ్దము గుణమును జెప్పును).

మూఢస్య భావః కర్మ వా, మూఢునియొక్క భావము లేక కర్మము, మూఢ + ఙస్, ష్యఞ్, మూఢ + ష్యఞ్, మౌఢ + య, మౌఢ్ + య=మౌఢ్య + సు=మౌఢ్యమ్.

బ్రాహ్మణాదుల కుదాహరణము - బ్రాహ్మణస్య భావః కర్మ వా, బ్రాహ్మణుని భావము లేక కర్మము, బ్రాహ్మణ + ఙస్, ష్యఞ్, విభక్తిలోపము, ఆదివృద్ధి (అ> ఆ) అకారలోపము బ్రాహ్మణ్య + సు=బ్రాహ్మణ్యమ్.

పై వానికన్నింటికి భావార్థమున త్వతల్ ప్రత్యయములు వచ్చినచో జడత్వం జడతా, మూఢత్వమ్, మూఢతా, బ్రాహ్మణత్వమ్, బ్రాహ్మణతా అనురూపము లేర్పడును.

బ్రాహ్మణాదిగణము : బ్రాహ్మణ వాడబ మాణవ ('అర్హతోనుమ్‌చ' 103) చోర ధూర్త ఆరాధయ విరాధయ అపరాధయ ఉపరాధయ ఏకభావ ద్విభావ త్రిభావ అన్యభావ అక్షేత్రజ్ఞ సంవాదిన్ సంవేశిన్ సంభాషిన్ బహుభాషిన్

ర్షఘాతిన్ విఘాతిన్ సమస్థ విషమస్థ పరమస్థ మధ్యమస్థ అనీశ్వర కుశల చపల నిపుణ పిశున కుతూహల క్షేత్రజ్ఞ నిశ్న బాలిశ అలస దుఃపురుష కాపురుష రాజన్ గణపతి అధిపతి గడుల దాయాద విశస్తి విషమ విపాత నిపాత. 'సర్వవేదాదిభ్యః స్వార్థే' 104 'చతుర్వేదస్యోభయ పదవృద్ధిశ్చ' 105. శౌటీర - ఆకృతిగణోఽయమ్ ఇతిబ్రాహ్మణాదిః.

సూ : సఖ్యుర్యః 5-1-126.

వృ : సఖ్యమ్

ప వి : సఖ్యుః (5-1) యః (1-1).

అను : సమర్థానామిత్యాది, తస్య (6-1) భావః (1-1) కర్మ (1-1).

అర్థ : సఖిశబ్దమునకు దానిభావము లేక కర్మము అనునర్థమున 'య' అను ప్రత్యయము వచ్చును. ఉదా : సఖ్యమ్

వివ : సఖ్యుఃభావః కర్మవా, సఖియొక్క భావము లేక కర్మము అనునర్థమున 'య' అను ప్రత్యయము వచ్చును సఖి + ఙస్ + య, విభక్తిలోపము, ఇకార లోపము, సఖ్ + య = సఖ్య + సు = సఖ్యమ్.

సూ : కపిజ్ఞాత్యోర్ఢక్ 5-1-127.

వృ : కాపేయమ్, జ్ఞాతేయమ్.

ప వి : కపిజ్ఞాత్యోః (6-2) ఢక్ (1-1).

అను : తస్య (6-1) భావః (1-1) కర్మ (1-1) సమర్థానామిత్యాది.

అర్థ : దాని / వానిభావము లేక కర్మము అనునర్థమున కపి, జ్ఞాతిశబ్దముల షష్ఠ్యంతరూపములకు పరముగా 'ఢక్' ప్రత్యయము వచ్చును.

వివ . కపియొక్క భావము లేక కర్మము, జ్ఞాతియొక్క భావము లేక కర్మము అనునర్థమున కపిజ్ఞాతిశబ్దములకు ఢక్ ప్రత్యయము వచ్చును. కకారమిత్తు దానిచే నాదివృద్ధి యగును. ఢకారమునకు ఏయాదేశము.

కపేఃభావఃకర్మవా. కపి + ఙస్ + ఢక్, విభక్తిలోపము, ఆదివృద్ధి, ఏయ్ ఆదేశము, కాపి + ఏయ్, ఇకారలోపము, కాపేయ + సు = కాపేయమ్.

జ్ఞాతేఃభావః కర్మవా : జ్ఞాతి+జస్ + ఢక్, జ్ఞాతి+ఏయ, జ్ఞాత్+ఏయ = జ్ఞాతేయ + సు = జ్ఞాతేయమ్.

సూ : పత్యన్తపురోహితాదిభ్యో యక్ 5-1-128.

వృ : సైనాపత్యం; పౌరోహిత్యమ్.

ప. వి : పత్యన్తపురోహితాదిభ్యః (5-3) యక్.

అను : తస్య (6-1) భావః (1-1) కర్మ (1-1) సమర్థానామిత్యాది.

అర్థ : పతిశబ్దమంతమునఁగల శబ్దములకును, పురోహితాదిశబ్దములకు భావ కర్మార్థములందు 'యక్' ప్రత్యయము వచ్చును ఉదా : సైనాపత్యమ్ పౌరోహిత్యమ్

వివ : వానిభావము లేక కర్మము అనునర్థమున షష్ఠ్యంతములగుపతి శబ్దాంతములకును, పురోహితమున్నగు శబ్దములకును 'యక్' అను తద్ధిత ప్రత్యయము వచ్చును. ఇందు కకారమిత్తు. అగుటచే ఆదివృద్ధి వచ్చును

ఉదా : (1) పత్యంతశబ్దము : సేనాపతేః భావః కర్మవా-సేనాపతియొక్క భావము లేక కర్మము, సేనాపతి + జస్ + యక్, విభక్తిలోపము, ఆదివృద్ధి (కితిచ) సైనాపతి+య, యస్యేతిచ-ఇకారలోపము, సైనాపత్+య=సైనాపత్య+సు=సైనాపత్యమ్.

ii పురోహితాది. పురోహితస్య భావః కర్మవా. పురోహితునిభావము లేక కర్మము, పురోహిత + జస్ + యక్, పురోహిత + యక్, పౌరోహిత + య, పౌరోహిత్ + య=పౌరోహిత్య+సు=పౌరోహిత్యమ్.

పురోహితాదిగణము : పురోహిత, 'రాజా ఽసే' 106. గ్రామిక పిణ్డిక సుహిత బాలమన్ద (బాల మన్ద) ఖణ్డిక దణ్డిక వర్మిక కర్మిక ధర్మిక శీతిక (సూతిక మూలిక తిలక) అఞ్జలిక (అన్తలిక) [రూపిక ఋషిక] పుత్రిక అవిక ఛత్రిక పర్షిక పథిక చర్మిక (ప్రతిక) సారథి ఆస్తిక సూచిక సంరక్షసూచక (సంరక్ష సూచక) నాస్తిక [అజానిక శాక్వర నాగర చూడిక] ఇతి పురోహితాదిః.

ఇదినఞ్ స్నఞధికారప్రకరణము.

ప్రకరణావలోకనము : ఇందు వతిప్రత్యయము దానితోతుల్యము, దానియందువలె, దానివలె అనునర్థములందు క్రమముగా తృతీయా, సప్తమీ షష్ఠ్యంతసమర్థములకు విధింపఁబడినది భావార్థమున త్వతల్ ప్రత్యయములును, ఇమనిచ్ ష్యఞ్ ప్రత్యయములును విధింపఁబడినవి ఇందు మొదటి రెండును సాధారణప్రత్యయములు. తరువాతి రెండును విశేషప్రత్యయములు ష్యఞ్ ప్రత్యయమును, య, ఢక్, యక్ ప్రత్యయములును గుణవచనాదులకు భావార్థముతోపాటు కర్మార్థమునందు కూడ వచ్చును. ఈ భావకర్మార్థములందు విధింపఁబడిన ప్రత్యయములు షష్ఠ్యంత సమర్థములకు పరముగా వచ్చును. ఇందు 'ఆ చ త్వాత్' అనునది త్వతల్ ప్రత్యయముల అధికారమును జెప్పును. రఋతో హలాదేర్లఘోః, టేః అనునవి ఇమనిచ్ప్రత్యయ పరకత్వమున నగు కార్యవిశేషములను దెలుపునవి.

అథ పాఞ్చమిక ప్రకరణమ్

అవ : ఇందు భవనాద్యర్థమునందు ప్రత్యయములు విధింపఁబడుచున్నవి. 'నఞ్ స్నఞ్' ప్రత్యయముల అధికారము ఇంతవఱకే కావున నిటుపైఁ జెప్పఁబడు నర్థములందు స్త్రీపుంస్ శబ్దముల కాప్రత్యయములు చేరవు.

సూ : ధాన్యానాం భవనే క్షేత్రే ఖఞ్ 5-2-1.

వృ : ముద్గానాం భవనం క్షేత్రం మౌద్గీనమ్

ప వి : ధాన్యానామ్ (6-3) భవనే (7-1) క్షేత్రే (7-1) ఖఞ్ (1-1)

అను : తస్య (6-1) సమర్థానామిత్యాది

అర్థ : ధాన్యములయొక్క ఉత్పత్తిస్థానమైన క్షేత్రము అనునర్థమున ధాన్యవాచక షష్ఠ్యంతములకు ఖఞ్ ప్రత్యయము వచ్చును ఉదా : ముద్గానాం భవనం క్షేత్రమ్ - మౌద్గీనమ్.

వివ : ధాన్యములనగా వడ్లు, గోధుమలు, పెసలుమున్నగునవి భవనమనగా ఉత్పత్తిస్థానము క్షేత్రమనగా పంటపొలము ధాన్యములయొక్క ఉత్పత్తిస్థానమగు పంటపొలము ప్రత్యయాంతముచే వాచ్యమగునపుడు ధాన్యవాచక షష్ఠ్యంతములకు పరముగా ఖఞ్ ప్రత్యయము చేరును. భవనశబ్దమునకు ఇల్లుమున్నగు నర్థమును, క్షేత్రశబ్దమునకు పుణ్యస్థలముమున్నగు నర్థమును వేఱుగా నుండుటవలన నా యర్థములందలివి గ్రహింపకుండుటకై సూత్రమున రెండుపదములును గ్రహింపఁబడినవి. ప్రత్యయమునందు ఞకారమిత్తు. దానివలన ఆదివృద్ధివచ్చును. ఖకారమునకు 'ఈన' ఆదేశము (ఆయనేయీనీ....)

ఉదా : ముద్గానాం భవనం క్షేత్రమ్ - పెసలు పండుపొలము, ముద్గ + ఆమ్, ఖఞ్, విభక్తిలోపము, ఆదివృద్ధి, ఈనాదేశము మౌద్గ + ఈన, అకారలోపము, మౌద్గ్ + ఈన = మౌద్గీన + సు = మౌద్గీనమ్.

సూ : వ్రీహిశాల్యోర్ఢక్ 5-2-2.

వృ : వ్రైహేయమ్, శాలేయమ్.

వ. వి : వ్రీహిశాల్యోః (6-2) ఢక్ (1-1).

అను : ధాన్యానామ్ (6-3) భవనే (7-1) క్షేత్రే (7-1) సమర్థానామిత్యాది.

అర్థ : వ్రీహి శాలిశబ్దములకు, వానిభవనమైన క్షేత్రము అనునర్థమున ఢక్ ప్రత్యయము వచ్చును వ్రైహేయమ్, శాలేయమ్.

వివ : వ్రీహి, శాలి అనునవియు ధాన్యవాచక శబ్దములే వీనికి పైసూత్రముచే ప్రాప్తించు ఖఞ్ ప్రత్యయమున కపవాదముగా వీనిచే ఢక్ ప్రత్యయము విధింపఁబడినది కకారమిత్తు ఢకారమునకు 'ఏయ్' ఆదేశము వచ్చును.

ఉదా : వ్రీహీణాం భవనంక్షేత్రమ్ - వ్రీహులకు (వడ్లకు) ఉత్పత్తిస్థానమగు క్షేత్రము వ్రీహి + ఆమ్ + ఢక్, విభక్తిలోపము, ఆదివృద్ధి (ఈ < ఐ) ఏయ్ ఆదేశము(ఢ్ = ఏయ్ + అ = ఏయ), ఇకారలోపము, వ్రైహేయ + సు = వ్రైహేయమ్.

శాలీనాంభవనం క్షేత్రమ్ = శాలిధాన్యమునకు ఉత్పత్తిస్థానమగు క్షేత్రము శాలి+ఆమ్, ఢక్, ఆదివృద్ధ్యాదులు, శాలేయ+సు=శాలేయమ్

సూ : హైయఙ్గవీనం సంజ్ఞాయామ్ 5-2-23.

వృ : నవనీతే నిపాతితోఽయమ్.

ప. వి : హైయఙ్గవీనమ్ (1-1) సంజ్ఞాయామ్ (7-1).

అర్థ హైయఙ్గవీన శబ్దము సంజ్ఞయందగును ఇది నవనీతము అనునర్థమున నిపతింపఁబడిన సంజ్ఞ

వివ : 'హ్యోగోదోహము యొక్క వికారము' అనునర్థమున సంజ్ఞగమ్యమానమగునపుడు ఖఞ్ ప్రత్యయమును, ప్రకృతికి 'హియఙ్గు' అను నాదేశమును ఈ సూత్రముచే నిపతింపఁబడినవి. హ్యోగోదోహమనగా 'నిన్నపిదికిన ఆవుపాలు' అనియర్థము. హ్యః = నిన్న; దోహః = పిదుకఁ బడినది హియఙ్గు + ఖఞ్, ఆదివృద్ధి, హైయఙ్గు + ఈన, ఓర్గుణః, హైయఙ్గో + ఈన, అవాదేశము హైయఙ్గవీన + సు=హైయఙ్గవీనమ్ నిన్న పిదికిన ఆవుపాలనుండి తీయఁబడిన వెన్న అనునర్థమున నిదిసంజ్ఞ.

సూ : తదస్య సంజాతం తారకాదిభ్య ఇతచ్ 5-2-36.

వృ : తారకా స్సంజాతా అస్య తారకితం నభః; పణ్డితః. ఆకృతిగణోఽయమ్.

ప. వి : తత్ (1-1) అస్య (6-1) సంజాతమ్ (1-1) తారకాదిభ్యః (5-3) ఇతచ్ (1-1).

అను : సమర్థానామిత్యాది.

అర్థ : 'అది దీనికి పుట్టినది' అనుసర్థమున ప్రథమాంతములగు తారకాది శబ్దములకు 'ఇతచ్' ప్రత్యయము వచ్చును. ఉదా : తారకితం నభః, పణ్డితః-ఇది ఆకృతిగణము.

వివ : ప్రథమాంతములగు తారకాది శబ్దములకు, అవి దేనికి పుట్టినవో దానిని తెలియఁజేయుచు, ఇతచ్ ప్రత్యయము చేరును. సూత్రమునందలి 'తత్' పదము సమర్థములలో ప్రథమమైనది ప్రథమాంతమగుటను సూచించును. ప్రత్యయము నందలి చకారమిత్తు.

ఉదా : తారకాః సంజాతా అస్య - నక్షత్రములు దీనికి (దీనియందు) పుట్టినవి తారకా + జస్, ఇతచ్, విభక్తిలోపము, యస్యేతిచ-అకారలోపము, తారక్ + ఇత=తారకిత + సు=తారకితమ్, నభః - నక్షత్రములుగల ఆకాశము.

పణ్డా అస్య సంజాతా - వివేకము ఇతనికి కలిగినది పణ్డా + సు + ఇతచ్, విభక్తిలోపము, అకారలోపము, పణ్డ్ + ఇత = పణ్డిత + సు = పణ్డితః.

తారకాదిగణము : తారకా పుష్ప కర్ణిక మఞ్జరీ ఋజీష [క్షణ సూచ] మూత్ర నిష్క్రమణ పురీష ఉచ్చార ప్రచార (విచార) కుడ్మలిత కణ్టక ముసల (ముకుల) కుసుమ కుతూహల స్తబక (స్తవక) కిసలయ పల్లవ (ఖణ్డ) వేగ నిద్రా ముద్రా బుభుక్షా (ధేనుష్యా) పిపాసా శ్రద్ధా అభ్ర పులక అఙ్గారక వర్ణక ద్రోహ దోహ సుఖ దుఃఖ ఉత్కణ్ఠా భర వ్యాధి వర్మన్ వ్రణ గౌరవ శాస్త్ర తరఙ్గ తిలక చన్ద్రిక అన్ధకార గర్వ కుమురు (ముకుర) హర్ష ఉత్కర్ష (రణ) కువలయ గర్ధ క్షుధ్ సీమన్త జ్వర గర రోగ రోమాఞ్చ పణ్డా కజ్జల తృష్ కోరక కల్లోల స్థపుట ఫల కఞ్చుక శృఙ్గార అఙ్కుర శైవల వకుల శ్వభ్ర ఆరాల కలఙ్క కర్దమ (కన్దల) మూర్ఛా అఙ్గార హస్తక ప్రతిబింబ విఘ్నతన్త్ర ప్రత్యయ దీక్షా గర్జ 'గర్భాద్ప్రాణిని' 111. ఇతితారకాదిః ఆకృతిగణః.

సూ : ప్రమాణే ద్వయసజ్దఘ్నఞ్మాత్రచః 5-2-37.

వృ : ఊరూ ప్రమాణమస్య ఊరుద్వయసమ్, ఊరుదఘ్నమ్; ఊరుమాత్రమ్

ప వి : ప్రమాణే (7-1) ద్వయసచ్, దఘ్నచ్, మాత్రచః (1-3).

అను : తత్ (1-1) అస్య (6-1) సమర్థానామిత్యాది.

అర్థ : 'ఇది దీనికి ప్రమాణము' అనునర్థమున ప్రథమాంతములకు ద్వయసచ్, దఘ్నచ్, మాత్రచ్ అను ప్రత్యయములు వచ్చును.

వివ : ప్రమాణమనగా ప్రమను గలిగించునది. 'ప్రమ' అనగా ఒకదానికి సంబంధించిన నిశ్చయజ్ఞానము. ఈ సూత్రమున మాత్రము ప్రమాణశబ్దమునకు 'కొలత' అని అర్థము. కొలతను తెలియఁజేయు ప్రథమాంతపదములకు పరముగా, దేని కొలత తెలుపఁబడునో దానిని తెలుపుచు, ద్వయసచ్, దఘ్నచ్, మాత్రచ్ ప్రత్యయములు పర్యాయముగా వచ్చును.

ఉదా : ఊరూ ప్రమాణమస్య - పొడలలోతుగలది, ఊరు + ఔ +, ద్వయ స(చ్) దఘ్న(చ్) మాత్ర (చ్) - విభక్తిలోపము, ఊరుద్వయస + సు = ఊరుద్వయసమ్, ఊరుదఘ్నమ్, ఊరుమాత్రమ్.

సూ : యత్తదేతేభ్యః పరిమాణే వతుప్ 5-2-39.

వృ : యత్పరిమాణమస్య యావాన్, తావాన్, ఏతావాన్.

ప. వి : యత్తదేతేభ్యః (5-3) పరిమాణే (7-1) వతుప్ (1-1).

అను : తత్ (1-1) అస్య (6-1) సమర్థానామిత్యాది.

అర్థ : ప్రథమాంతములగు యద్, తద్, ఏతద్ అనువానికి పరిమాణార్థమున వతుప్' ప్రత్యయము వచ్చును. ఉదా : యావాన్ ఇత్యాది.

వివ : ఎంత పరిమాణముగలది(యో), అంత పరిమాణముగలది, ఇంత పరిమాణముగలది అనునర్థములను వ్యక్తము చేయుచు ప్రథమాంతములగు యద్, తద్, ఏతద్ శబ్దములకు వతుప్ ప్రత్యయము వచ్చును. ప్రమాణశబ్దము పొడవుయొక్క కొలఁత అనునర్థమునందు మాత్రమే ప్రయోగింతురు. పరిమాణశబ్దము వైశాల్యము, ఘనము, ద్రవ్యము మున్నగువానికొలఁతలకు వ్యవహరింతురు. ప్రత్యయమున ఉకారపకారము లిత్తులు.

ఉదా : యత్పరిమాణమస్య - ఏది దీనికి పరిమాణమో, యద్ + సు + వతుప్, విభక్తిలోపము, 'యద్ + వత్' అనియుండ, ఆసర్వనామ్నః 6-3-91 (సర్వనామమునకు, దృక్, దృశ, వతు అనునవి పరములగునపుడు ఆకారమంతాదేశమగును) అను సూత్రముచే దకారమునకు ఆకారాదేశము. య + అ వత్, సవర్ణదీర్ఘసంధి, యావత్ + సు = యావాన్ = ఎంత (యో).

తత్ పరిమాణమస్య-అది దీనికి పరిమాణము తద్+సు+వతుప్ సులోపము, ఆకారాదేశము, సంధి తావత్ + సు=తావాన్-అంత

ఏతత్ పరిమాణమస్య - ఇది దీనికి పరిమాణము - ఏతద్ + సు+వతుప్, విభక్తిలోపము, ఆకారాదేశము, సంధి, ఏత ⋅ ఆవత్, ఏతావత్ + సు=ఏతావాన్ = ఇంత.

సూ : సంఖ్యాయా అవయవే తయప్ 5-2-42.

వృ ⋅ పఞ్చ అవయవా అస్య పఞ్చతయమ్.

ప. వి : సంఖ్యాయాః (5-1) అవయవే (7-1) తయప్ (1-1).

అను : తత్ (1-1) అస్య (6-1) సమర్థానామిత్యాది

అర్థ : ప్రథమాంతములగు సంఖ్యావాచకములకు, అన్ని అవయవములు గలది అనునర్థమున 'తయప్' ప్రత్యయము చేరును. ఉదా పఞ్చతయమ్

వివ : ప్రథమాంతములైన సంఖ్యావాచకశబ్దములకు 'ఆ సంఖ్యగల అవయవములు గలది' అనునర్థమును తెలుపుచు, తయప్' అను ప్రత్యయము వచ్చును ఇందు వివర్ణమిత్తు.

ఉదా : పఞ్చ అవయవా అస్య - అయిదు అవయవములు దీనికిఁ గలవు. పఞ్చన్ + జస్ + తయప్, విభక్తిలోపము, నకారలోపము (నలోపః ప్రాతిపదికాన్తస్య) పఞ్చతయ ⋅ సు=పఞ్చతయమ్

సూ . ద్విత్రిభ్యాం తయస్యాయజ్వా 5-2-43.

వృ : ద్వయమ్ - ద్వితయమ్; త్రయమ్ - త్రితయమ్.

ప. వి : ద్విత్రిభ్యామ్ (5-2) తయస్య (6-1) అయచ్ (1-1) వా (అవ్య)

అర్థ : ద్వి, త్రి అనుశబ్దములకు పరముగానున్న తయప్ ప్రత్యయము స్థానమున 'అయచ్' ప్రత్యయము వైకల్పికముగా వచ్చును.

ఉదా : ద్వయమ్-ద్వితయమ్: త్రయమ్-త్రితయమ్.

వివ : ద్విత్రి అను సంఖ్యావాచకశబ్దములకు అన్ని అవయవములు గలది అనునర్థమున వచ్చిన తయప్ ప్రత్యయమును తొలగించి 'అయచ్' ప్రత్యయము వైకల్పికముగా వచ్చును.

ఉదా : ద్వౌ అవయవౌ అస్య - రెండవయవములు దీనికిఁ గలవు-ద్వి + ఔ+తయప్, విభక్తిలోపము, 'అయచ్' ఆదేశము (చకారమిత్తు) ద్వి+అయ, యస్యేతిచ-ఇకారలోపము, ద్వ్+అయ=ద్వయ+సు=ద్వయమ్ అయజాదేశము రానిచో, ద్వితయ + సు'ద్వితయమ్' అనియగును.

త్రయోఽవయవా అస్య - మూఁడు అవయవములు దీనికిఁ గలవు-త్రి + జస్, తయప్, విభక్తిలోపము, అయజాదేశము, త్రి + అయ, ఇకారలోపము త్ర్ + అయ=త్రయ+సు=త్రయమ్, రానిచో త్రితయమ్.

సూ : ఉభాదుదాత్తో నిత్యమ్ 5-2-44.

వృ : ఉభయమ్.

ప వి : ఉభాత్ (5-1) ఉదాత్తః (1-1) నిత్యమ్ (2-1).

అను : తయస్య (6-1) అయచ్ (1-1).

అర్థ : ఉభశబ్దమునకు పరముగానున్న 'తయప్' ప్రత్యయమునకు ఉదాత్త స్వరముగల అయజాదేశము నిత్యముగా నగును. ఉదా : ఉభయమ్.

వివ : ఉభశబ్దమునకు 'రెండు అవయవములుగలది' అనునర్థమున 'సంఖ్యాయా అవయవే తయప్' అను సూత్రముచే వచ్చిన తయప్ ప్రత్యయమునకు 'అయచ్' ఆదేశము నిత్యముగా నగును. ఆ ప్రత్యయము (అయచ్) ఆద్యుదాత్తమును అగును.

ఉదా : ఉభౌ అవయవౌ అస్య - రెండు అవయవములు దీనికిఁ గలవు. ఉభ + ఔ, తయప్, విభక్తిలోపము, 'అయ(చ్)' ఆదేశము, ఉభ + అయ అకారలోపము, ఉభయ + సు=ఉభయమ్.

ఇది పాంచమిక ప్రకరణము

ప్రకరణావలోకనము : ధాన్యములకు ఉత్పత్తిస్థానమైన క్షేత్రము అను నర్థమున ఖఞ్ అను సాధారణప్రత్యయమును, 'ఢక్' అను విశేషప్రత్యయమును షష్ఠ్యంతప్రాతిపదికముల కింద విధింపఁబడినవి. హైయంగవీనశబ్దము నిపతింపఁబడినది. (1) అది దీనికి పుట్టినది, (2) అది దీనికి ప్రమాణము, (3) అది దీనికి పరిమాణము, (4) అన్ని అవయవములు దీనికిఁ గలవు అను

నర్థములందు (1) ఇతచ్, (2) ద్వయసచ్, దఘ్నచ్, మాత్రచ్, (3) వతుప్ (4) తయప్ ప్రత్యయములు ప్రథమాంతములకు విధింపఁబడినవి. 'తయప్' ప్రత్యయము సంఖ్యావాచకములకు పరముగా వచ్చును. ద్విత్రిశబ్దములకు పరముగా నున్న 'తయప్' ప్రత్యయమునకు వైకల్పికముగాను, 'ఉభ' శబ్దమునకు పరముగానున్న దానికి నిత్యముగాను 'అయచ్' ప్రత్యయమాదేశముగా విధింపఁబడినది.

అథ మత్వర్థీయ ప్రకరణమ్.

అవ : 'అది దీనికిఁగలదు, అది దీనియందుకలదు' అనునర్థములందు ప్రథమాంతములకు 'మతుప్' అను ప్రత్యయము వచ్చును. కావున మతుప్ ప్రత్యయము కలది, కలవాఁడు అనునర్థము గలది యగును. ఆయర్థమునందు విధింపఁబడిన ప్రత్యయములను ప్రధానముగ చెప్పు ప్రకరణమగుటచే దీనికి మత్వర్థీయ ప్రకరణ మని పేరు. ఇందు ముందు పూరణార్థక ప్రత్యయములు కూడ చెప్పఁబడుచున్నవి.

సూ : తస్య పూరణే డట్ 5-2-48.

వృ : ఏకాదశానాం పూరణః ఏకాదశః.

ప. వి : తస్య (6-1) పూరణే (7-1) డట్ (1-1).

అను : సంఖ్యాయాః (5-1) సమర్థానామిత్యాది.

అర్థ : 'ఆ సంఖ్యను పూరించునది' అనునర్థమున సంఖ్యావాచకశబ్దములకు పరముగా 'డట్' ప్రత్యయము వచ్చును. ఉదా : ఏకాదశానాం పూరణః ఏకాదశః.

వివ : పూరణమనఁగా పూరించునది. లెక్కింపఁబడు వస్తువులలెక్కను తెలుపు సంఖ్యావాచక షష్ఠ్యంతమునకు, 'ఆ సంఖ్యను పూరించునది' అనునర్థమున 'డట్' ప్రత్యయము వచ్చును. ఉదా : ఏకాదశానాం పూరణః, ఏకాదశన్ + ఆమ్, డట్. విభక్తిలోపము. డట్ ప్రత్యయమున డకారటకారము లిత్తులు. (చుటూ, హలన్త్యమ్) 'టేః' అనుసూత్రముచే టి సంజ్ఞకమగు 'అన్' అనుదానికి లోపము, ఏకాదశ్+అ=ఏకాదశ+సు = ఏకాదశః. పదునొకంటవది 'ఏదిలేనిచో 'పదునొకఁడు' అను సంఖ్య పూరింపఁబడదో అది' అని తాత్పర్యము. తెలుఁగున నీయర్థమున 'అవ' అనునది వచ్చును. పూరణార్థమున ఏక శబ్దమునకు ప్రత్యయము రాదు. ఏకత్వమును పూరించుట యుండదుగదా.

సూ : నాన్తాదసంఖ్యాదేర్మట్ 5-2-49.

వృ : మడాగమః పఞ్చానాం పూరణః పఞ్చమః. నాన్తాత్ కిమ్? వింశః.

ప. వి : నాన్తాత్ (5-1) అసంఖ్యాదేః (5-1) మట్ (1-1).

అను : డట్ (1-1).

అర్థ : సంఖ్యావాచకము ఆదియందులేని నకారాంతమగు సంఖ్యావాచకమునకు పరముగానున్న డట్ ప్రత్యయమునకు 'మట్' అనునాగమము వచ్చును. ఉదా : పఞ్చమః, 'నాన్తాత్' అనుటవలన 'వింశః' అనుచోట మట్ ఆగమము లేదు.

వివ : సంఖ్యావాచకము పూర్వపదముగా లేనిదియు, నకారము అంతమునఁ గలదియు నగు సంఖ్యావాచకశబ్దమునకు పరముగా, పూరణార్థమునఁ జేరిన 'డట్' ప్రత్యయమునకు 'మట్' అనునాగమము వచ్చును. ఇందు టకారమిత్తు. అకార ముచ్చారణార్థకము. ఉదా : పఞ్చానాం పూరణః అయిదింటియొక్క పూరణము. పఞ్చన్ + ఆమ్, డట్, విభక్తిలోపము. పఞ్చన్ + అ, మట్ ఆగమము టిత్తుగావున డట్ ప్రత్యయమునకు పూర్వావయవముగా వచ్చును పఞ్చన్+మ్+ అ, 'నలోపః ప్రాతిపదికాన్తస్య' - నకారలోపము, పఞ్చమ + సు = 'పఞ్చమః' - అయిదవవాఁడు.

ఈ మడాగమము నకారాంత సంఖ్యావాచకములకే విధింపఁబడినది. కావున వింశతి శబ్దమున కిదిరాదు. వింశతేః పూరణః - వింశతి + ఙస్+డట్, విభక్తి లోపము

తరువాతి కార్యము నీక్రింది సూత్రము విధించుచున్నది.

సూ : తి వింశతేర్డితి 6-4-142.

వృ : వింశతే ర్భస్య తిశబ్దస్య లోపో డితి పరే. వింశః.

ప. వి : తి (షష్ఠిలోపించినపదము) వింశతేః (6-1) డితి (7-1).

అను : భస్య (6-1) లోపః (1-1).

అర్థ : భసంజ్ఞకమగు 'వింశతి' శబ్దముయొక్క తిశబ్దమునకు, డిత్తుపరమగు నపుడు లోపము వచ్చును. ఉదా : వింశః.

వివ : డట్ ప్రత్యయము పరముగా నుండుటచే 'వింశతి' శబ్దమునకు భసంజ్ఞ కలుగును. దానియొక్క 'తి' అనుభాగమునకు డకారమిత్తుగాఁగల (డట్) ప్రత్యయము పరమగునపుడు లోపము వచ్చును.

ఉదా : వింశతి + అ = వింశ + అ, 'అతోగుణే' అనుసూత్రముచే పరరూప మేకాదేశమై 'వింశ' అగును. వింశ + సు = వింశః - ఇరువదవవాఁడు ఇరువదవది.

అవ : నాన్తాదిత్యాది సూత్రమున 'అసంఖ్యాదేః' అనుపదమునకు సార్థక్య మును చూపుచున్నారు.

వృ : అసంఖ్యాదేఃకిమ్? ఏకాదశః.

వివ : మడాగమము సంఖ్యావాచకము పూర్వపదముగాఁ గలనకారాంతసంఖ్యా వాచకమునకు పరముగానున్నడట్ ప్రత్యయమునకు రాదు. ఉదా : ఏకాదశన్ - ఇందు నకారాంత సంఖ్యావాచకము 'దశన్' అనునది దానికి 'ఏక' అను సంఖ్యా వాచకము పూర్వమువఁ గలదు. ఏకాదశన్ + డట్ - ఏకాదశః (ఇట మడాగమము రాలేదు).

సూ : షట్ కతి కతిపయ చతురాం థుక్ 5-2-51.

వృ : డటి. షణ్ణాం పూరణః. షష్ఠః, కతిథః. కతిపయశబ్దస్య అత ఏవ డట్, కతిపయథః, చతుర్థః;

ప వి : షట్ .... చతురామ్ (6-3) థుక్.

అను : డట్ (1-1).

అర్థ : డట్ ప్రత్యయము పరమగునపుడు షష్, కతి, కతిపయ, చతుర్ శబ్దములకు 'థుక్' అనునాగమము వచ్చును. ఉదా : షష్ఠః ఇత్యాది. కతిపయశబ్ద మున కీసూత్రముచేతనే డట్ ప్రత్యయ మగును. కతిపయథః. చతుర్థః.

వివ : అను వృత్తమైన 'డటి' అనుదానిని సప్తమ్యంతముగా మార్చుకొన వలయును. తస్మిన్నిత్యాదిసూత్రముచే అది పరమగునపు డనునర్థము వచ్చును. డట్ ప్రత్యయము పరమగునపుడు షష్, కతి, కతిపయ, చతుర్ అనుశబ్దములకు 'థుక్' అనునాగమము వచ్చును. ఇందు కకారమిత్తు. ఉకార ముచ్చారణార్థకము.

ఉదా : షణ్ణాం పూరణః - ఆఱింటిని పూరించునది. షష్ + ఆమ్, డట్, విభక్తిలోపము, ఇత్తులకు లోపము. షష్ + అ, ఆగమము కిత్తగుటచే 'షష్' అనుదానికి అంతావయవముగా వచ్చును. షష్థ్ + అ, ష్టుత్వము, షష్ఠ్ + అ=షష్ఠ + సు = షష్ఠః-ఆఱవది/ఆఱవవాఁడు.

కతి = ఎన్ని; 'దీనికి బహుగణవతుడతి సంఖ్యా' (బహు, గణశబ్దములకు, వతు, డతి ప్రత్యయాంతములకును సంఖ్యాసంజ్ఞ కలుగును) అను సూత్రముచే సంఖ్యాసంజ్ఞ కలుగును. ఇది డతి ప్రత్యయాంతము (కిమ్ + డతి=కతి) 'కతీనాం,

పూరణః, ఎన్నిటియొక్క పూరణము కతి + ఆమ్, డట్, కతి + అ, ప్రకృత సూత్రముచే థుగాగమము, కతిథ్ + అ, కతిథ + సు = కతిథః.

కతిపయశబ్దము సంఖ్యావాచకము కాదు, కావున సంఖ్యావాచకములకు మాత్రమే విధింపఁబడిన డట్ ప్రత్యయము దీనికి పరముగా నుండుట కుదురదు. అది పరముగా నుండుటయే జరుగనిచో ఈథుక్ ఆగమము వచ్చుటయెట్లు? కావున నీసూత్రమున నీ పదముండుటనుబట్టియే సంఖ్యావాచకము కాకపోయినను 'కతిపయ' శబ్దమునకు 'డట్' ప్రత్యయము వచ్చుననుట జ్ఞాపితమైనది. కతిపయానాం పూరణః కతిపయ + ఆమ్, డట్, విభక్తిలోపము. థుగాగమము, కతిపయథ్ + అ = కతిపయథ + సు = కతిపయథః.

చతుర్ణాం పూరణః - నాల్గింటిని పూరించునది. చతుర్ + ఆమ్, డట్ చతుర్ + అ, థుక్ - చతుర్థ్ + అ = చతుర్థ + సు = చతుర్థః-నాల్గవది నాల్గవవాఁడు.

సూ : ద్వేస్తీయః 5-2-54.

వృ : డటోఽపవాదః. ద్వయోః పూరణో ద్వితీయః.

ప. వి : ద్వేః (6-2) తీయః (1-1)

అను : తస్య (6-1) పూరణే (1-1).

అర్థ : ద్విశబ్దమునకు పూరణార్థమున 'తీయ' ప్రత్యయము వచ్చును. ఇది 'డట్' ప్రత్యయమున కపవాదము. ఉదా : ద్వితీయః.

వివ : రెండు అనుసంఖ్యను పూరించునది అనునర్థమున షష్ఠ్యంతమగు 'ద్వి' శబ్దమునకు 'తీయ' అను ప్రత్యయము వచ్చును. 'తస్య పూరణేడట్' అను సూత్రముచే ప్రాప్తమగు డట్ ప్రత్యయమున కిది యపవాదము.

ఉదా : ద్వయోః పూరణః-రెంటిని పూరించునది, ద్వి + ఓస్, తీయ-విభక్తిలోపము. ద్వితీయ + సు = ద్వితీయః.

సూ : త్రేస్సంప్రసారణంచ 5-2-55.

వృ : తృతీయః.

ప. వి : త్రేః (6-1) సంప్రసారణమ్ (1-1) చ (అవ్య).

అను : తస్య (6-1) పూరణే (7-1) 'తీయః' (1-1).

అర్థ : 'త్రి' అను సంఖ్యావాచకమునకు పూరణార్థమున 'తీయ' ప్రత్యయ మును, అది వచ్చునపుడు సంప్రసారణమును కలుగును. ఉదా : తృతీయః

వివ : షష్ఠ్యంతమగు త్రిశబ్దమునకు పూరణార్థమునందు 'తీయ' అను ప్రత్యయము వచ్చును. అది పరమగునపుడు 'త్రి' అనుదానికి సంప్రసారణము వచ్చును. అనగా అందలి రేఫమునకు ఋకారాదేశమగును. (సంప్రసారణమనగా యవరలలకు ఇ ఉ ఋ ౡ ఌ వచ్చుట).

ఉదా : త్రయాణాం పూరణః-మూడింటిని పూరించునది/వాడు త్రి +ఆమ్+ తీయ, విభక్తిలోపము, సంప్రసారణము త్ + ఋ + ఇ, సంప్రసారణాచ్చ అను సూత్రముచే ఋ ఇలకు పూర్వరూప మేకాదేశమగును. తృతీయ + సు = తృతీయః

ఇంతవఱకు సంఖ్యావాచకములకు చేరు పూరణార్థకప్రత్యయములు చెప్పఁబడినవి.

సూ : శ్రోత్రియంశ్ఛన్దోఽధీతే 5-2-84.

వృ : శ్రోత్రియః. వేత్యను వృత్తే శ్ఛాన్దసః.

వ వి : శ్రోత్రియన్ (1-1) ఛన్దః (2-1) అధీతే (క్రి. ప).

అను : సమర్థానా మిత్యాది.

అర్థ : 'ఛందస్సును అధ్యయనము చేయువాఁడు' అనునర్థమున ద్వితీయాంతమగు ఛందశ్శబ్దమునకు 'ఘన్' ప్రత్యయమును, ప్రకృతికి శ్రోత్రాదేశము నీ సూత్రముచే నిపతింపఁబడినవి. శ్రోత్రియః. 'వా' అనునది అనువృత్తమగుటచే 'ఛాందసః' అనియు నుండును.

వివ : 'ఛందః' అనగా వేదము. 'దానినధ్యయనము చేయువాఁడు' అనునర్థమున ద్వితీయాంతమగు 'ఛందస్' శబ్దమునకు ఘన్ ప్రత్యయమును, 'శ్రోత్ర' అను ఆదేశమును ఈ సూత్రముచే నిపతింపఁబడినవి.

ఉదా : ఛన్దః అధీతే - ఛన్దస్ + అమ్, ఘన్, విభక్తిలోపము, శ్రోత్ర ఆదేశము, శ్రోత్ర + ఘన్, ఘకారమునకు 'ఇయ్'ఆదేశము, (ఆయనేయీనీయియః ఫ ఢ ఖ ఛ ఘాం ప్రత్యయాదీనామ్) శ్రోత్ర + ఇయన్, యస్యేతిచ-అకార లోపము. శ్రోత్ర్ + ఇయన్='శ్రోత్రియన్' - ఈనిపతింపఁబడిన ప్రాతిపదిక రూపమున నకారమిత్తు. శ్రోత్రియ+సు=శ్రోత్రియః.

'శావశిథం గ్రహణమితిలుగ్వా' (5-2-77) అనుసూత్రమునుండి మండూక ప్లుతితో వాశబ్దమిట కనువృత్తమగుటచే 'శ్రోత్రియః' అమరూపము పై కల్పికముగా నేర్పడునను నర్థము సిద్ధించును. కావున నిది కానిచో 'తదధీతే తద్వేద' అనుసూత్ర ముచే 'అణ్' ప్రత్యయము వచ్చును. ఛందస్ + అణ్, ఆదివృద్ధి, ఛాందస్ + అ = ఛాన్దస + సు = ఛాన్దసః. (కప్పదాటువలె నడుమ నొకసూత్రమునో, కొన్ని సూత్రములనో వదలి ఆవలిసూత్రమున కొకపదము చేరుటను ఇందు మండూక ప్లుతి యందురు.)

సూ : పూర్వాదినిః 5-2-89.

వృ : పూర్వం జ్ఞాత మనేన పూర్వీ.

ప. వి : పూర్వాత్ (5-1) ఇనిః (1-1).

అను : అనేన (3-1) సమర్థానామిత్యాది.

అర్థ : కర్తృవాచక తృతీయాంతముతో సంబంధముగల పూర్వశబ్దమునకు పర ముగా 'ఇని' ప్రత్యయము వచ్చును. ఉదా : పూర్వంజ్ఞాతమనేన పూర్వీ

వివ : అనువృత్తిగా వచ్చిన 'అనేన' అనునది కర్తను దెలుపు తృతీయాం తము. 'దేనికి కర్త' అను ప్రశ్నకు ఏదో ఒకక్రియావిశేషమునకు అను సమా ధానము వచ్చును. ఆక్రియ పూర్వము జరిగినది అనునర్థమున ప్రథమాంతమగు పూర్వశబ్దమునకు పరముగా 'ఇని' ప్రత్యయము వచ్చును. ఇందు తుదిఇకారము ఉచ్చారణార్థకము.

ఉదా : పూర్వం జ్ఞాతమనేన, పూర్వము వీనిచే తెలియఁబడినది. పూర్వ + సు = ఇన్, విభక్తిలోపము, అకారలోపము, పూర్విన్+సు=పూర్వీ.

సూ : సపూర్వాచ్చ 5-2-87.

వృ : కృతపూర్వీ.

ప. వి : స పూర్వాత్ (5-1) చ (అవ్య).

అను : పూర్వాత్ (5-1) ఇనిః (1-1) సమర్థానామిత్యాదిః అనేన (3-1)

అర్థ : సపూర్వమైన పూర్వశబ్దమునకును 'ఇని' ప్రత్యయము వచ్చును.

వివ : పై సూత్రమున వివరింపఁబడిన అర్థములో, పూర్వము మఱియొక శబ్దము గల పూర్వశబ్దమునకు 'ఇని' ప్రత్యయము వచ్చును.

ఉదా : కృతపూర్వమనేన=ఇతనిచే పూర్వము చేయఁబడినది. ఇచట పూర్వ శబ్దమునకు పూర్వము 'కృత' శబ్దము కలదు. కృతపూర్వ + ఇన్, కృతపూర్వ + ఇన్, అకారలోపము, కృతపూర్విన్ + సు=కృతపూర్వీ.

సూ : ఇష్టాదిభ్యశ్చ 5-2-88.

వృ : ఇష్టమనేన ఇష్టీ, అధీతీ.

ప. వి : ఇష్టాదిభ్యః (5-3) చ (అవ్య).

అను : ఇనిః (1-1) సమర్థానామిత్యాది; అనేన (3-1).

అర్థ : కర్తృవాచకమును దెలియఁజేయుచు 'ఇష్ట' మున్నగు వాని ప్రథమాంతములకు 'ఇని' ప్రత్యయము చేరును. ఉదా : ఇష్టీ, అధీతీ.

వివ: 'ఇష్టమ్ అనేన' - ఇతనిచే యజింపఁబడినది, (యజ్ ధాతువునకు 'క్త' ప్రత్యయముచేయగా 'ఇష్టమ్' అగును) ఇతనిచే చదువఁబడినది అనునర్థమునందు, కర్తను దెలుపుచు, ఇష్టాదిశబ్దముల ప్రథమాంతరూపములకు పరముగా 'ఇని' ప్రత్యయము వచ్చును.

ఇష్ట + అమ్+ఇన్; విభక్తిలోపము, అకారలోపము, ఇష్టిన్+సు = ఇష్టీ యజ్ఞముచేసినవాఁడు, అధీత + అమ్ + ఇన్,అధీత్ + ఇన్=అధీతిన్+సు=అధీతీ- అధ్యయనము చేసినవాఁడు.

ఇష్టాదిగణము : ఇష్ట పూర్త ఉపాసాదిత నిగదిత పరిగదిత (పరివాదిత) నికథిత నిషాదిత నిపఠిత సంకలిత పరికలిత సంరక్షిత పరిరక్షిత అర్చిత గణిత అవకీర్ణ ఆయుక్త గృహీత ఆమ్నాత శ్రుత అధీత (అవధాన)ఆసేవిత అవధారిత అవకల్పిత నిరాకృత ఉపకృత ఉపాకృత అనుయుక్త అనుగణిత అనుపఠిత వ్యాకులిత - ఇతీష్టాదిః.

అవ : మతుప్ప్రత్యయము విధింపఁబడుచున్నది దీనియర్థమునందే మఱికొన్ని ప్రత్యయములును విధింపఁబడుచున్నవి.

సూ : తదస్యాస్త్యస్మిన్నితి మతుప్ 5-2-94.

వృ : గావోఽస్యాస్మిన్వా సన్తి గోమాన్.

ప. వి : తత్ (1-1) అస్య (6-1) అస్తి (క్రి, ప) అస్మిన్ (7-1) ఇతి (అవ్య) మతుప్ (1-1).

అను : సమర్థానా మిత్యాది.

అర్థ : ఇది దీనికి ఉన్నది, ఇది దీనియందున్నది అనునర్థములందు ప్రథమాంత ప్రాతిపదికములకు మతుప్ ప్రత్యయము చేరును. ఉదా : గోమాన్.

వివ : ఒక వస్తువు ఒకరికిఁగలదు, ఒకదానియందుఁ గలదు అనునర్థమునందు ఆ వస్తువుతో సంబంధముగల వ్యక్తిని, ఆ వస్తువున కాధారమైన దానిని తెలియఁజేయుచు వస్తువును వచించు ప్రథమాంతపదములకు పరముగా 'మతుప్' ప్రత్యయము చేరును. ఇందు పవర్ణమిత్తు - ఉకారముచ్చారణార్థకము. ప్రత్యయముగా మిగులునది 'మత్'.

ఉదా : గావః అస్య అస్మిన్ వా సన్తి - గోవులు ఇతనికి / దీనికి కలవు లేక దీనియందుఁగలవు-గో + జస్ + మతుప్, విభక్తిలోపము, గోమత్ + సు = గోమాన్ - గోవులు గలవ్యక్తి, గోవులధికముగాఁ గలనగరము మొ॥వి.

ఇట్టి యర్థమునే మత్వర్థమందురు. ఇచట కలది, కలవాఁడు అనుదానికి 'అధికముగా ఉన్న వ్యక్తి అని అర్థము. 'ధనవంతుఁడు' అన్నచో అధికముగా ధనము గలవాఁడు అనియే కాని ఏదో కొంచెము ధనమున్నవానిని అవదముచే వ్యవహరింపము. ఈ ప్రత్యయమును, ఈ యర్థమునందు నిధింపఁబడు నితర ప్రత్యయములును ఏయే యర్థములను వ్యక్తముచేయునో యీ క్రింది శ్లోకము వివరించును.

శ్లో॥ భూమనిందా ప్రశంసాసు నిత్యయోగేఽతిశాయనే
సంసర్గేఽస్తి వివక్షాయాం భవన్తి మతుబాదయః (వా 3183).

భూమమనగా బహుత్వము = గోమాన్ - గోవులు బహుసంఖ్యలో కలవాఁడు, నింద = కకుదావర్తినీ కన్యా. కకుదము - మూపు, అందు సుడిగలది. అది నిందాపాత్రమైన విషయము. ప్రశంస = రూపవాన్ పురుషః - రూపవంతుఁడగు పురుషుఁడు - ప్రశంసింపఁ దగినరూపము గలవాఁడని యర్థము. నిత్యయోగము = ఎల్లపుడు దానితో కలయిక యుండుట - క్షీరిణోవృక్షాః - పాలుగల చెట్లు, ఆ చెట్లయందు పాలు ఎడతెగక యుండునని భావము. అతిశయము-ఉదరిణీ కన్యా = అతిశయమగు ఉదరముగల కన్య. సంసర్గము=సంబంధము, దణ్డీ-దండముతో సంబంధముగల వ్యక్తి అని యర్థము. ఇట్లు మతుప్ మున్నగు ప్రత్యయములు, అస్తివివక్షయందు = కలది, కలవాఁడు అనునర్థమును తెప్పఁగోరినపుడు సాధారణముగా పై యర్థములయందు ఆయా ప్రకృతులకు చేరును.

అవ : మతుప్ప్రత్యయము చేరునపుడు కొన్నిటికగు కార్యవిశేషము తెలుపుటకై క్రింది సూత్రముచే అర్ధివానికి భసంజ్ఞ విధింపఁబడుచున్నది.

సూ : తసౌ మత్వర్థే 1-4-19.

వృ : తాన్త సాన్తౌ భసంజ్ఞౌ మత్వర్థే ప్రత్యయే. సమ్ప్రసారణమ్. విదుష్మాన్.

ప వి : తసౌ (1-2) మత్వర్థే (7-1).

అను : భమ్ (1-1).

అర్థ : మత్వర్థ ప్రత్యయము పరమగునపుడు, తాన్తసాన్తములు భసంజ్ఞ కలవి యగును. అందువలన సంప్రసారణము. ఉదా : విదుష్మాన్.

వివ : 'మతుప్' ప్రత్యయమును, ఆ యర్థమున విధింపఁబడు నితర ప్రత్యయములును పరములగునపుడు తవర్గమును, సవర్గమును అంతమునఁగల శబ్దములకు భసంజ్ఞ కలుగును. సాధారణముగా యకారాదులును అజాదులును అగు స్వాది ప్రత్యయములు పరములగునపుడే భసంజ్ఞకలుగును మత్వర్థక ప్రత్యయములు కొన్ని అజాదులు కానివి పరములగునపుడును, తాంతసాంతములకు భసంజ్ఞ కలుగుటకై యీ సూత్రము చెప్పఁబడినది

విద్వాంసః సన్త్యస్మిన్ = 'విద్వాంసులిందుఁగలరు' అనునర్థమున ప్రథమాంతమగు విద్వచ్ఛబ్దమునకు 'తదస్యాస్త్యస్మిన్నితి మతుప్' అనుసూత్రముచే 'మతుప్' ప్రత్యయము. విద్వస్ + జస్ + మతుప్ విభక్తిలోపము. విద్వస్ + మత్, ప్రకృతసూత్రముచే సకారాంతమగు 'విద్వస్' అనుదానికి భసంజ్ఞ కలుగును. కలుగఁగా వసోః సంప్రసారణమ్ 6-4-131 ('వస్' అనునది అంతమునఁగల భసంజ్ఞకమునకు సంప్రసారణము వచ్చును) అను సూత్రముచే సంప్రసారణము వచ్చును. (వ్ > ఉ) విద్ ఉ అస్ - 'సంప్రసారణాచ్చ' అను సూత్రముచే ఉ+అ లకు పూర్వరూపమేకాదేశమగును. విదుస్ + మత్, ఆదేశప్రత్యయయోః (8-3-59) (ఇణ్ వర్ణములకును, కవర్గమునకును పరమిగానున్న ఒదేశమును, ప్రత్యయావయవమును అగు సకారమునకు షకారమాదేశమగును) అను సూత్రముచే సకారమునకు షత్వము. విదుష్మత్ + సు=విదుష్మాన్ - విద్వాంసులు గలదేశము మొదలైనది.

వా॥ గుణవచనేభ్యో మతుపో లుగిష్టః (3185).

వృ : శుక్లో గుణో௨స్యాస్తీతి శుక్లః పటః, కృష్ణః.

ప. వి : గుణవచనేభ్యః (5-3) మతుపః (6-1) లుక్ (1-1) ఇష్టః (1-1).

అర్థ : గుణవాచకశబ్దములకు పరముగానున్న మతుప్ ప్రత్యయమునకు లుక్కు వచ్చుట ఇష్టము.

వివ : శుక్లత్వము, కృష్ణత్వము మున్నగు గుణములను వచించు శుక్ల, కృష్ణ అనువానికి పరముగా 'అది కలదు' అనునర్థమున చేరిన 'మతుప్' ప్రత్యయమునకు లుక్కువచ్చును.

ఉదా : శుక్లః అస్య అస్తి-తెలుపు దీనికి కలదు. శుక్ల + సు + మత్. విభక్తిలోపము, ప్రకృతవార్తికముచే 'మతుప్' లోపము. శుక్ల + సు = శుక్లః. ప్రత్యయమునకు లుక్కు కలిగినను అర్థమునకు భంగముండదు. కావున నీ 'శుక్లః' అనుపదమునకు తెలుపుగల వస్త్రము ఇత్యాది అర్థముండును. అట్లే కృష్ణఃఅస్యఅస్తి కృష్ణ + సు+మత్, కృష్ణ+సు=కృష్ణః.

సూ : ప్రాణిస్థాదాతో లజన్యతరస్యామ్ 5-2-96.

వృ : చూడాలః-చూడావాన్ ప్రాణిస్థాత్ కిమ్? శిఖావాన్ దీపః.

ప. వి : ప్రాణిస్థాత్ (5-1) ఆతః (5 1) లచ్ (1-1) అన్యతరస్యామ్ (అవ్య).

అను : తద్ (1-1) అస్య (6-1) అస్తి (క్రి. ప) అస్మిన్ (7-1) సమర్థానామిత్యాది.

అర్థ : ప్రాణియందున్న వస్తువును వచించు ఆకారాంత శబ్దముయొక్క ప్రథమాంతమునకు 'అది అతనికి కలదు, లేక అతనియందు గలదు' అనునర్థమున 'లచ్' ప్రత్యయము వైకల్పికముగా నగును. ఉదా : చూడాలః - చూడావాన్. ప్రాణిస్థమనవేల? శిఖావాన్ దీపః.

వివ : ప్రాణియొక్క అవయవాదులను తెలుపు ఆకారాంతముల ప్రథమా విభక్త్యంత రూపములకు, 'అది వీనికి కలదు' అనునర్థమునందు 'లచ్' అను ప్రత్యయము వైకల్పికముగా చేరును. ఇందు చకారమిత్తు. ఉదా : చూడా అస్య అస్తి - చూడ (శిఖ) దీనికిగలదు. చూడాశబ్దము ప్రాణిస్థము, ఆకారాంతము, చూడా + సు, లచ్, విభక్తిలోపము చూడాల + సు = చూడాలః. వైకల్పిక మగుటచే రానిచో సాధారణమగు 'మతుప్' ప్రత్యయము వచ్చును. చూడా + మత్, 'మాదుపధాయా మతోర్వోఽయవాదిభ్యః' అను సూత్రముచే మకారమునకు వకారాదేశము, చూడావత్ + సు= చూడావాన్.

ఈ ప్రత్యయము ప్రాణిస్థవాచకములకే వచ్చుననుటచే శిఖ (జ్వాల) దీనికిఁ గలదు' అనునర్థమున శిఖాశబ్దమునకు లచ్ ప్రత్యయము రాదు. మతుప్ ప్రత్యయము రాఁగా, శిఖా + సు + మత్, శిఖావత్ + సు = శిఖావాన్ దీపః - జ్వాలగల దీపము.

అవ : పైని జెప్పబడిన 'లచ్' ప్రత్యయము ప్రాణిస్థమైన సత్వమునకు రాదని యీ క్రింది వార్తికము తెలుపుచున్నది.

వా॥ ప్రాణ్యఙ్గాదేవ (3189).

వృ : నేహ - మేధావాన్.

ప. వి : ప్రాణ్యఙ్గాత్ (5-1) ఏవ (అవ్య).

అర్థ : 'లచ్' ప్రత్యయము మత్వర్థమున ప్రాణ్యంగవాచకమునకు మాత్రమే వచ్చును. కాన 'మేధావాన్' అనునెడ రాదు.

వివ : 'ప్రాణిస్థాత్' అనుపదమున కిది వివరణప్రాయము. ప్రాణియొక్క అవయవములగు వానిని తెలుపు పదములకే 'లచ్' ప్రత్యయము వచ్చును గాని తక్కినవానికి రాదు. 'మేధా'=బుద్ధి - ఇది అంగము కాదు. అంగమనగా ఆకారము గలది మాత్రమే. బుద్ధికి ఆకారములేదు గాన అది అంగము కానేరదు. కావున దీనికి 'లచ్' ప్రత్యయము రాదు. ఈ వార్తికము లేనిచో మేధకూడ ప్రాణియందే యుండును గాన సూత్రముచే దీనికి 'లచ్' ప్రత్యయము రావలసి యుండెడిది.

మేధా అస్య అస్తి-మేధ ఇతనికి గలదు. మేధా + సు+మతుప్, మేధా + మత్, వకారాదేశము, మేధావత్ + సు=మేధావాన్. (మవర్ణాంతము, అవర్ణాంతము, మకారోపధము, అకారోపధమునయిన శబ్దములకు పరముగానున్న మతుప్ప్రత్యయ మకారమునకు వకారమాదేశమగును. యవాదిశబ్దములకు పరముగా నున్న దానికి కాదు. మాదుపధాయామతోర్వోఽయవాదిభ్యః).

సూ : లోమాది పామాది పిచ్ఛాదిభ్యః శనేలచః 5-2-100.

వృ : లోమాదిభ్యః శః - లోమశః - లోమవాన్-పామాదిభ్యోనః - పామనః.

ప. వి : లోమాది పామాదిపిచ్ఛాదిభ్యః (5-3) శనేలచః 1-3.

అను : తత్ (1-1) అస్య (6-1) అస్తి (క్రి. వ) అస్మిన్ (7-1) పమర్థావామిత్యాది.

అర్థ : 'అది దీనికి లేక దీనియందుకలదు' అనునర్థమున ప్రథమాంతము అగు లోమాదులకు శ ప్రత్యయమును, పామాదులకు న ప్రత్యయమును, పిచ్ఛాదులకు 'ఇలచ్' ప్రత్యయము నగును. ఉదా : లోమశః ఇత్యాది.

వివ : మత్వర్థమున (అది కలది లేక కలవాఁడు అనునర్థమున) 'లోమన్' మున్నగు శబ్దములకు 'శ' ప్రత్యయము వచ్చును.

ఉదా : లోమాని అస్యసన్తి - లోమములు దీనికి / వీనికి గలవు లోమన్ + జస్, శ=విభక్తిలోపము, లోమన్ + శ, 'నలోపః ప్రాతిపదికాన్తస్య' నకారలోపము - లోమశ + సు = లోమశః శరీరమున వెండ్రుకలధికముగా గలవాఁడు.

లోమాదిగణము : లోమన్ రోమన్ బభ్రు హరి గిరి కర్క- కపి ముని తరు-ఇతిలోమాదిః.

పామాది శబ్దములకు మత్వర్థమున 'న' ప్రత్యయము వచ్చును పామాఅస్య అస్తి - పామ (ఒకచర్మరోగము) కలవాఁడు, పామన్ + సు, న, విభక్తిలోపము, నకారలోపము - పామన+సు=పామనః. (గజ్జికలవాఁడు).

అవ : పామాదిగణములోని రెండు గణసూత్రములు వివరింపఁబడుచున్నవి.

i) గ. సూ : అఙ్గాత్కల్యాణే (118)

వృ : అఙ్గనా.

ప. వి : అఙ్గాత్ (5-1) కల్యాణే (7-1).

అర్థ : అంగశబ్దమునకు 'న' ప్రత్యయము కల్యాణార్థమున వచ్చును.

వివ : కల్యాణమైన = సుందరమైన అంగములు గలది అనునర్థమున అంగ శబ్దమునకు పరముగా 'న' ప్రత్యయము వచ్చును. ఉదా : కల్యాణాని అఙ్గాని అస్యాః సన్తి - సుందరములైన అంగము లీమెకుఁ గలవు. అఙ్గ+జస్+న, విభక్తిలోపము, స్త్రీత్వమున టాప్' ప్రత్యయము, అఙ్గన + టాప్, అఙ్గన + ఆ=అఙ్గనా+సు=అఙ్గనా.

ii) లక్ష్మ్యా అచ్చ (గణ 121).

వృ : లక్ష్మణః.

ష. వి : లక్ష్మ్యాః (6-1) అత్ (1-1) చ (అవ్య)

అర్థ : లక్ష్మీశబ్దమునకు అకారాదేశము కూడను.

వివ : 'లక్ష్మిగలవాఁడు' అనునర్థమున ప్రథమాంతమగు లక్ష్మీశబ్దమునకు 'న' ప్రత్యయము వచ్చును. అది పరమగునపుడు హ్రస్వ అకారము అంతాదేశమును అగును

ఉదా : లక్ష్మీః అస్య అస్తి - లక్ష్మి ఇతనికిఁగలదు. లక్ష్మీ + సు+న, విభక్తిలోపము, అకారాదేశము, లక్ష్మ్+అ=లక్ష్మ + న, షకారయోగముచే నకారమునకు ణత్వము. లక్ష్మణ + సు=లక్ష్మణః

పామాదిగణము : పామన్ వామన్ వేమన్ హేమన్ శ్లేష్మన్ కద్రు (కద్రూ) బలి సామన్ ఊష్మన్ కృమి. 'అఙ్గాత్కల్యాణే' 118. 'శాకీపలాలీ దద్రూణాం హ్రస్వత్వంచ' 119. (విష్వగిత్యుత్తరపదలోపశ్చాకృతసన్ధేః) లక్ష్మ్యా అచ్చ' 121 - ఇతిపామాదిః.

వృ : పిచ్ఛాదిభ్య ఇలచ్-పిచ్ఛిలః - పిచ్ఛావాన్.

వివ : 'పిచ్ఛము దీనికిఁగలదు' అనునట్టి అర్థముల 'పిచ్ఛా' మున్నగుశబ్దముల ప్రథమాంతములకు 'ఇలచ్' ప్రత్యయము చేరును.

ఉదా : పిచ్ఛాఅస్య అస్తి - గంజిమీఁది మీఁగడ మున్నగునది గలది - పిచ్ఛా + సు + ఇలచ్ - చకారమిత్తు, విభక్తిలోపము, ఆకారలోపము (యస్యేతిచ) పిచ్ఛ్+ఇల=పిచ్ఛిల + సు=పిచ్ఛిలః, ఇది రానియెడల మతుప్ ప్రత్యయము, మకారమునకు వకారాదేశము పిచ్ఛావాన్.

పిచ్ఛాదిగణము : పిచ్ఛా ఉరస్ ధువక ధ్రువక. 'జటాఘటాకాలాఃక్షేపే' 122. వర్ణ ఉదక పఙ్క ప్రజ్ఞా-ఇతి పిచ్ఛాదిః.

సూ : దన్త ఉన్నత ఉరచ్ 5-2-106.

వృ : ఉన్నతా దన్తా అస్య దన్తురః.

ప. వి : దన్తే (7-1) ఉన్నతే (7-1) ఉరచ్ (1-1).

అను : తత్ (1-1) అస్య (6-1) అస్తి (క్రి. ప).

అర్థ : 'ఉన్నతములైన దంతములు గలది లేక కలవాఁడు' అనునర్థమున ప్రథమాంతమగు దంతశబ్దమునకు పరముగా 'ఉరచ్' ప్రత్యయము వచ్చును. ఉదా : దన్తురః.

వివ : ఈ సూత్రమున 'దంతే' అనుచోట సప్తమి పంచమ్యర్థమున ప్రయుక్తమైనది. ఉన్నతే అనునది దానికి విశేషణము. ఉన్నత అనునది విశేషణముగాఁ గల దంతశబ్దమునకు 'అవి యితనికిఁగలవు' అనునర్థమున 'ఉరచ్' ప్రత్యయము వచ్చును. ఇందు చకారమిత్తు.

ఉదా : ఉన్నతాః దన్తాః అస్య సన్తి - దన్త + జస్ + ఉరచ్, విభక్తి లోపము, దన్త + ఉర, అకారలోపము - దన్ + ఉర=దన్తుర + సు = దన్తురః- ఎత్తైన దంతములు గలవాడు.

సూ : కేశాద్వోఽన్యతరస్యామ్ 5-2-109.

వృ : కేశవః-కేశవాన్.

ప. వి : కేశాత్ (5-1) వః (1-1) అన్యతరస్యామ్ (అవ్య).

అను : తత్ (1-1) వః (1-1) అస్య (6-1) అస్తి (క్రి. ప).

అర్థ : 'అవి యితనికిఁగలవు' అనునర్థమున కేశశబ్దమునకు వైకల్పికముగా 'వ' అను ప్రత్యయము వచ్చును. ఉదా : కేశవః - కేశవాన్.

వివ : (మంచి) కేశములు ఇతనికిఁ గలవు అనునర్థమున ప్రథమాంతమగు 'కేశ' శబ్దమునకు పరముగా 'వ' అను ప్రత్యయము వైకల్పికముగానగును.

ఉదా : కేశాః అస్య సన్తి - మంచికేశములు గలవాఁడు, కేశ + జస్+వ, విభక్తిలోపము, కేశవ + సు = కేశవః. ఇది రానిచో సాధారణమగు మతుప్ ప్రత్యయము వచ్చును. కేశ + మత్, వకారాదేశము, కేశవత్ + సు = కేశవాన్.

వా॥ అన్యేభ్యోఽపిదృశ్యతే (3210).

వృ : మణివః

ప. వి : అన్యేభ్యః (5-3) అపి (అవ్య) దృశ్యతే (క్రి. ప).

అర్థ : 'వ' ప్రత్యయము ఇతరములకును గన్పట్టుచున్నది. ఉదా : మణివః.

వివ: పై సూత్రమున 'వ' ప్రత్యయము కేశశబ్దమునకు మాత్రమే విధింపఁబడినది. ఇది మఱికొన్ని యితరశబ్దములకును గన్పట్టుచున్నదని యీ వార్తికము చెప్పుచున్నది.

ఉదా : మణిః అస్య అస్తి - మణి దీనికిఁగలదు. మణి + సు+వ = విభక్తిలోపము, మణివ + సు = మణివః.

వా॥ అర్ణసో లోపశ్చ (5053).

వృ : అర్ణవః.

ప. వి : అర్ణసః (6-1) లోపః (1-1) చ (అవ్య).

అర్థ : 'అర్ణస్' శబ్దమునకు 'వ' ప్రత్యయముతోపాటు అంత్యాక్షరలోపమును అగును. ఉదా : అర్ణవః

వివ : 'అన్యేభ్యోఽపి దృశ్యతే' అను వార్తికముచే 'వ' ప్రత్యయము 'కేశ' శబ్దమునకే కాక తక్కిన మఱికొన్నిటికిని వచ్చునని చెప్పఁబడినది ఆ ప్రత్యయము 'అర్ణస్' - శబ్దమునకు కూడ వచ్చును. అది వచ్చునప్పుడు సకారమునకు లోపమును అగును. ('అలోఽన్త్యస్య' అను పరిభాషచే అంత్యాక్షరము సకార మిట గ్రహింపఁ బడును).

ఉదా : అర్ణః అస్మిన్ అస్తి - జలము దీనియందధికముగాఁ గలదు - అర్ణస్+సు+వ, విభక్తిలోపము, సకారలోపము, అర్ణవ + సు = అర్ణవః - సముద్రము.

సూ : అత ఇనిఠనౌ 5-2-115.

వృ : దణ్డీ - దణ్డికః.

ప. వి : అతః (5-1) ఇనిఠనౌ (1-2)

అను : తత్ (1-1) అస్య (6-1) అస్తి (క్రి ప) అస్మిన్ (7-1)

అర్థ : మత్వర్థమున అదంతమునకు పరముగా ఇని, ఠన్ ప్రత్యయములు వచ్చును. ఉదా : దణ్డీ - దణ్డికః.

వివ : హ్రస్వఅకారాంతములైన ప్రాతిపదికముల ప్రథమాంతములకు, మత్వర్థమున (అధికలదు అనునర్థమున) 'ఇని', 'ఠన్' ప్రత్యయములు చేరును. 'ఇని' ప్రత్యయమున తుది ఇకార ముచ్చారణార్థకము. 'ఠన్' ప్రత్యయమున నకారమిత్తు.

ఉదా : దణ్డః అస్యఅస్తి - ఇతనికి దండముకలదు, దండశబ్దము అదంతము. దణ్డ + సుః ఇన్, విభక్తిలోపము, అకారలోపము, దణ్డ్ + ఇన్=దణ్డిన్+సు= దణ్డీ. దణ్డ + ఠ, ఠకారమునకు ఇకాదేశము. (ఠస్యేకః), అకారలోపము దణ్డ్ + ఇక=దణ్డిక + సు=దణ్డికః.

సూ : వ్రీహ్యాదిభ్యశ్చ 5-2-116.

వృ : వ్రీహీ. వ్రీహికః.

ప వి : వ్రీహ్యాదిభ్యః (5-3) చ (అవ్య).

అను : తత్ (1-1) అస్య (6-1) అస్తి (క్రి. ప) అస్మిన్ (7-1) ఇని ఠనౌ (1-2).

అర్థ : వ్రీహ్యాది ప్రకృతిక ప్రథమాంతములకును మత్వర్థమున ఇని, ఠన్ ప్రత్యయములు వచ్చును. ఉదా : వ్రీహీ, వ్రీహికః.

వివ : వ్రీహ్యాదిగణములో పఠింపఁబడినశబ్దముల ప్రథమాంతములకును' 'అది వీనికిఁగలదు. అనునర్థమున ఇని, ఠన్ ప్రత్యయములు చేరును. ఇవి అదంతములు కాని కారణమున మరల చెప్పవలసి వచ్చినది

ఉదా : వ్రీహిః అస్య అస్తి - వరిపంట ఇతనికిఁగలదు. వ్రీహి + సు + ఇన్, విభక్తిలోపము, ఇకారలోపము, వ్రీహ్ + ఇన్ = వ్రీహిన్ + సు = వ్రీహీ. వ్రీహి + సు + ఠన్, విభక్తిలోపము, ఇకాదేశము, ఇకార లోపము - వ్రీహ్ + ఇక=వ్రీహిక + సు=వ్రీహికః.

వ్రీహ్యాదిగణము : వ్రీహి మాయా (శాలా) శిఖా మాలా మేఖలా కేకా అష్టకా పతాకా చర్మన్ వర్మన్ దంష్ట్రా సంజ్ఞా బడబా కుమారీ నౌ వీణా బలాకా యవఖదనౌ కుమారీ, 'శీర్షాన్నఞః' 128. ఇతి వ్రీహ్యాదిః.

సూ : అస్మాయామేధాస్రజో వినిః 5-2-121.

వృ : యశస్వీ - యశస్వాన్; మాయావీ; మేధావీ; స్రగ్వీ.

ప. వి : అస్, మాయా, మేధా, స్రజః (5-1) వినిః (1-1).

అను : తత్ (1-1) అస్య (6-1) అస్తి (క్రి. ప) అస్మిన్ (7-1)

అర్థ : అస్‌అంతములు, మాయా, మేధా, స్రక్‌శబ్దములును - వీని ప్రథమాంతములకు మత్వర్థమున 'విని' ప్రత్యయము చేరును. ఉదా : యశస్వీ మొ॥వి.

వివ : 'అస్' అను శబ్దభాగము అంతమునఁ గలవానియొక్కయు, మాయా మేధా, స్రక్ అనువానియొక్కయు ప్రథమాంతములకు, 'అది వీనికిఁ గలదు' అనునర్థమున 'విని' ప్రత్యయము చేరును. ఇందు తుది ఇకారము ఉచ్చారణార్థకము.

ఉదా : యశస్ - ఇది అస్ అంతము. యశః అస్య అస్తి-యశస్సుకలవాఁడు యశస్+సు + విని, విభక్తిలోపము, యశస్ + విన్=యశస్విన్ + సు=యశస్వీ. ఈ సూత్రములోనికి 'అన్యతరస్యామ్' అనుపదమును మండూకప్లుతిచే అను వర్తింపఁజేయఁగా ఈ ప్రత్యయము వీనికి వైకల్పికముగా నగు ననునర్థము కలుగును. కావున నిది రానిచో మతుప్ ప్రత్యయము వచ్చును. యశస్+మత్, అదుపధ మగుటచే వకారాదేశము, యశస్వత్ + సు = యశస్వాన్. (తసౌ మత్వర్థే అను సూత్రముచే భసంజ్ఞయుండును గాన నిచట సకారమునకు రుత్వము లేదు).

మాయా అస్య అస్తి-మాయ ఇతనికిఁ గలదు మాయా+సు+విన్-మాయా విన్ + సు=మాయావీ.

మేధా అస్య అస్తి - మేధ (బుద్ధివిశేషము) ఇతనికిఁ గలదు-మేధా+సు+ విన్-మేధావిన్ + సు=మేధావీ.

స్రక్ అస్య అస్తి - స్రజము ఇతనికిఁగలదు. స్రజ్ + సు + విన్, విభక్తి లోపము. జకారమునకు కుత్వము. (చోః కుః) స్రగ్ + విన్, స్రగ్విన్ + సు = స్రగ్వీ -

పక్షమున వీనికి మతుప్ ప్రత్యయము వచ్చును. మాయావాన్, మేధావాన్, స్రగ్వాన్. మాయాశబ్దము వ్రీహ్యాదులలోని దగుటచే ఇన్, ఠన్ ప్రత్యయములును వచ్చును. మాయీ, మాయికః.

సూ : వాచో గ్మినిః 5-2-124.

వృ : వాగ్మీ.

ప వి : వాచః (5-1) గ్మినిః (1-1).

అను : తత్ (1-1) అస్య (6-1) అస్తి (కి9 ప) అస్మిన్ (7-1) సమర్థానా మిత్యాది.

అర్థ : వాక్ శబ్దమునకు మత్వర్థమున గ్మిని ప్రత్యయము వచ్చును. ఉదా : వాగ్మీ.

వివ : 'మంచివాక్కులుగలవాఁడు' అనునర్థమున 'వాచ్' అనుశబ్దముయొక్క ప్రథమాంతమునకు 'గ్మిని' ప్రత్యయము వచ్చును. ఇందు తుదిఇకారము ఉచ్చారణార్థకము.

ఉదా : వాచః అస్యసన్తి - వాచ్ + జస్ + గ్మిన్, విభక్తిలోపము, చకారమునకు కుత్వము, వాక్ + గ్మిన్, కకారమునకు జశ్త్వము వాగ్గ్మిన్ + సు = వాగ్గ్మీ ప్రత్యయమున గకారములేనియెడల వాగ్ + మిన్ అనుదశలో, 'ప్రత్యయే భాషాయాం నిత్యమ్' అనువార్తికముచే అనునాసికాదేశము నిత్యముగా వచ్చి 'వాఙ్మీ' అను రూపము కావలసియుండును. దానిని వారించుటకై గకారముంచఁబడినది.

సూ : అర్శ ఆదిభ్యోఽచ్ 5-2-127.

వృ : అర్శసః. ఆకృతిగణోఽయమ్.

ప. వి : అర్శ ఆదిభ్యః (5-3) అచ్ (1-1).

అను : తత్ (1-1) అస్య (6-1) అస్తి (క్రి. ప) అస్మిన్ (7-1) సమర్థానామిత్యాది.

అర్థ : మత్వర్థమున 'అర్శస్' మున్నగుశబ్దములకు 'అచ్' ప్రత్యయము వచ్చును. ఉదా : అర్శసః. ఇది ఆకృతిగణము.

వివ : 'అది వీనికి / దీనికి కలదు' అనునర్థమున ప్రథమాంతములగు 'అర్శస్' మున్నగువానికి 'అచ్' ప్రత్యయము వచ్చును చకారమిత్తు.

ఉదా : అర్శాంసి అస్యసన్తి = అర్శస్సులు (మూల అనుపేరుగలరోగము) వీనికిఁ గలవు. అర్శస్ + జస్, అచ్, విభక్తిలోపము, అర్శస్ + అ = అర్శస + సు = అర్శసః - మూలరోగముకలవాఁడు

అర్శ ఆదిగణము : అర్శస్ - ఉరస్ తున్ద చతుర పలిత జటా (ఘటా) ఘాటా అభ్ర (అఘ) (కర్దమ) అమ్ల లవణ, స్వాఙ్గాదీనాత్ 125. వర్ణాత్. ఇత్యర్శ ఆదిః. ఆకృతిగణః.

ఇది మత్వర్థీయ ప్రకరణము.

ప్రకరణావలోకనము : ఈ ప్రకరణమున ముందు సంఖ్యావాచకములకు పూరణార్థక ప్రత్యయములగు డట్, తీయ, ప్రత్యయములు విధింపఁబడినవి. అందు డట్ ప్రత్యయమునకు కొన్నిశబ్దముల విషయమున మడాగమము విధింపఁబడినది. అట్లే డట్ ప్రత్యయము పరమగునపుడు షడాది శబ్దములకు థుగాగమము విధింపఁబడినది. త్రి శబ్దమునకు తీయ ప్రత్యయయోగమున సంప్రసారణము కూడ

కలుగును. 'వింశతి' శబ్దమునకు 'డట్' ప్రత్యయపరకత్వమున 'తి'లోపము విధింపబడినది శ్రోత్రియశబ్దము నిపతింపబడినది పూర్వశబ్దమునకు, ఇష్టాదులకును 'ఇని' ప్రత్యయము విధింపబడినది.

అది వీనికి/దీనికి (లేక) వీనియందు/దీనియందుకలదు అనునర్థమున మతుప్, లచ్,శ,న, ఇలచ్, ఉరచ్, వ, ఇని, రన్, విన్, గ్మిన్, అచ్ ప్రత్యయములు ఆయా శబ్దములకు విధింపబడినవి ఇందు సాధారణప్రత్యయమగు 'మతుప్' అనునది తక్కిన ప్రత్యయములు వచ్చు వానికిని సాధారణముగా పాక్షికముగా వచ్చును. ఈ ప్రత్యయములను మత్వర్థ ప్రత్యయములందురు. మకారము, హ్రస్వ అకారము అనునవి అంతమునను, ఉపధాక్షరముగను గల శబ్దములకును, ఝయంతములకును పరముగా నున్న మతుప్ప్రత్యయమకారమునకు వకారమాదేశమగుట నిందను సంధించుకొననగును.

అథ ప్రాగ్దిశీయ ప్రకరణమ్.

అవ : ఈ ప్రకరణమున విభక్తిసంజ్ఞకల కొన్ని ప్రత్యయములు విధింపఁబడుచున్నవి. 'దిక్ఛబ్దేభ్యః....' (5-3-27) అనుసూత్రమునకు పూర్వమువఱకు విధింపఁబడిన ప్రత్యయములకు విభక్తి సంజ్ఞ కలుగును. 'దిక్' శబ్దముగల సూత్రమునకు పూర్వమున విధింపఁబడిన ప్రత్యయములకు సంబంధించిన ప్రకరణము కావున దీనికి ప్రాగ్దిశీయ ప్రకరణమని పేరు.

సూ : ప్రాగ్దిశో విభక్తిః 5-3-1.

వృ : దిక్ శబ్దేభ్య ఇత్యతః ప్రాగ్వక్ష్యమాణాః ప్రత్యయాః విభక్తిసంజ్ఞాస్స్యుః.

ప. వి : ప్రాక్ (1-1) దిశః (5-1) విభక్తిః (1-1).

అను : తద్ధితః (1-1) ప్రత్యయః (1-1).

అర్థ : 'దిక్ఛబ్దేభ్యః' అను సూత్రమునకు పూర్వమువఱకు విధింపఁబడు వక్ష్యమాణ ప్రత్యయములు విభక్తి సంజ్ఞకములు.

వివ : సూత్రమునందలి దిక్ఛబ్దము, ఆ శబ్దముగల సూత్రమును తెలుపును అది "దిక్ఛబ్దేభ్యః సప్తమీ పఞ్చమీ ప్రథమాభ్యో దిగ్దేశకాలేష్వస్తాతిః" 5-3-27 అనునది. అంతవఱకు 'విభక్తిః' అను పదము అధికారమగును. అనగా 5-3-1 నుండి 5-3-26 వఱకు విధింపఁబడు ప్రత్యయములకు 'విభక్తి' అను సంజ్ఞ యుండును. కావున విభక్తి సంజ్ఞగలవానికి అగు కార్యములు వీని కగునని తాత్పర్యము. 'సమర్థానామ్' 'ప్రథమాత్' అనుపదముల అధికారము ఇది మొదలుకొని లేదు. 'వా' అనుపదము మాత్రము అనువృత్తమగును.

ఈ ప్రత్యయములకు విభక్తి సంజ్ఞను విధించుటవలన ప్రయోజనములు మూఁడు గలవు. (1) "నవిభక్తౌతుస్మాః" 1-3-4 అను సూత్రముచే వీని అంతమునున్న తవర్గ సకారమకారములకు ఇత్సంజ్ఞ కలుగదు. (విభక్తియందు అంత్యములగు హల్లులగుతవర్గసకారమకారము లిత్తులు కావు అని సూత్రార్థము. ఇది 'హలన్త్యమ్' అను సూత్రమున కపవాదము). (2) విభక్తి పరమగునపుడు త్యదాదులకు విధింపఁబడిన అత్వము ఈ ప్రత్యయములు పరములగునపుడును వచ్చును (త్యదాదీనామః - 7-2-102-త్యదాదులకు విభక్తి పరమగునపుడు అకారమంతాదేశమగును.) (3) స్వరవిశేషము.

సూ: కిం సర్వనామబహుభ్యోఽద్వ్యాదిభ్యః 5-3-2.

వృ: కిమ స్సర్వనామ్నో బహుశబ్దాచ్చేతి ప్రాగ్దిశోఽధిక్రియతే.

ప. వి : కిం సర్వనామబహుభ్యః (5-3) అద్వ్యాదిభ్యః (5-3).

అర్థ : కిమః, సర్వనామ్నః, బహుశబ్దాత్ అనునీపదములు మూఁడును దిక్ఛబ్దేభ్య ఇత్యాది సూత్రమువఱకు అధికారములుగా పోవును.

వివ : ఈ సూత్రమునందు విధింపఁబడు ప్రత్యయ మేదియు చెప్పఁబడకుండుటవలన నిది యధికారసూత్రమని తెలిసినది. సూత్రమునందలి 'కిం.........బహుభ్యః' అనుపదముయొక్క పంచమీవిభక్తివలన వక్ష్యమాణ ప్రత్యయములు వీనికి పరముగా వచ్చుననునర్థము కలుగును కావున ముందుఁ జెప్పఁబోవు సూత్రముల యందు (5-3-26 వఱకు) 'కిమః, సర్వనామ్నః, బహుశబ్దాత్' అను పంచమ్యంతపదములు ఉపస్థితములగు ననునర్థము కలిగినది సర్వనామసంజ్ఞకములే అయిన ద్వి మున్నగువానికి ముందు విధింపఁబడు ప్రత్యయములు రావు అని 'అద్వ్యాదిభ్యః' అనుపదమున కర్థము 'కిమ్' శబ్దముకూడ సర్వనామమే. అట్టియెడ మఱల 'కిమ్'శబ్దమును సూత్రమున వేఱుగా గ్రహించుటయేల? అని శంకింపరాదు. ఏలయన అది ద్విమున్నగువానిలోఁ గలదు. కావున దానిని వేఱుగా గ్రహింపనిచో వక్ష్యమాణ ప్రత్యయములు వానికి రాఁజాలవు. వచ్చుట అవసరము కావునమఱల నిది విడిగా గ్రహింపఁబడినది.

ద్వ్యాదులు : ద్వి యుష్మద్ అస్మద్ భవతు (కిమ్) - ఇవి సర్వాదుల లోనివి.

సూ : పఞ్చమ్యాస్తసిల్ 5-3-7.

వృ : పఞ్చమ్యన్తేభ్యః కిమాదిభ్య స్తసిల్ వా స్యాత్.

ప. వి : పఞ్చమ్యాః (5-1) తసిల్ (1-1)

అను : కిం సర్వనామ బహుభ్యః (5-3) విభక్తిః (1-1) వా (అవ్య).

అర్థ : పంచమ్యంతములగు కిమాదులకు తసిల్ ప్రత్యయము వచ్చును. అది విభక్తి సంజ్ఞకమగును.

వివ : కిమాదులనగా కిమ్ శబ్దము, సర్వనామసంజ్ఞగల సర్వాదులు, బహుశబ్దము. పంచమ్యంతములగు వీనికి 'తసిల్' ప్రత్యయము చేరును. దానికి విభక్తి

సంజ్ఞ కలుగును. ఇందు లకారమిత్తు. ఇకార ముచ్చారణార్థకము. ప్రత్యయముగా మిగులునది 'తస్' అనునది. ఇది వైకల్పికముగా కిమాదులకు చేరును.

ఉదా : కస్మాత్ (కింశబ్దముయొక్క పంచమ్యంతరూపము) కిమ్ + ఙసి, తసిల్, తద్ధితాంతమగుటచే ప్రాతిపదికసంజ్ఞ కలిగి, 'సుపోధాతు ప్రాతిపదికయోః' అను సూత్రముచే సుప్పునకు (ఙసి) లుక్కు వచ్చును.

'కిమ్ + తస్' అనియుండగా క్రిందిసూత్రముచే కార్యవిశేషము విధింపఁబడు చున్నది.

సూ : కుతిహోః 7-2-104.

వృ : కిమః కుస్స్యాత్ తాదౌ హాదౌ చ విభక్తౌ. కుతః, కస్మాత్.

ప. వి : కు (ప్రథమా విభక్తిలోపించిన పదము) తిహోః (7-2).

అను : విభక్తౌ (7-1) కిమః (6-1).

అర్థ : తాదియు, హాదియునగు విభక్తిపరమగునపుడు 'కిమ్' శబ్దమునకు 'కు' అనునాదేశము కలుగును ఉదా : కుతః.

వివ : 'తిహోః' అనునది తకారహకారములను బోధించును. ఇందు 'తి' లోని ఇకారము ఉచ్చారణార్థకము. తిహోః అనునది 'విభక్తౌ' అనుదానికి విశేషణము. త్, హ్ అనునవి వర్ణములగుటచే, 'యస్మిన్విధిస్తదాదావల్గ్రహణే' అను పరిభాష చెప్పున తదాదివిధిచే 'తకారాదియు హకారాదియు విభక్తి పరమగునపుడు' అనునర్థము వచ్చును. కు అనునది అనేకవర్ణములు గల ఆదేశమగుటచే (క్, ఉ=2) 'కిమ్' అనుదానిమొత్తమును తొలగించి వచ్చును. (అనేకాల్ శిత్సర్వస్య). కిమ్ + తస్=కుతస్, సకారమునకు రుత్వవిసర్గములు రాఁగా 'కుతః' అగును. తసిల్ ప్రత్యయమునకు విభక్తి సంజ్ఞయుండుటకు నీయాదేశమగుట ఒక ప్రయోజనము. తసిల్ ప్రత్యయాంతము, 'తసిలాదయః ప్రాక్పాశపః' (పాశప్ ప్రత్యయమునకు పూర్వమునఁ గలతసిలాది ప్రత్యయము లంతమునఁ గలవి అవ్యయము లగును) అను సర్వాదిగణ వాక్యము వలన అవ్యయమగును. కావున దీనికి చేరిన సుప్పులకు లుక్కు వచ్చును (అవ్యయాదాప్సుపః). తసిల్ ప్రత్యయము చేరుట వైకల్పికము గావున రానిచో 'కస్మాత్' అను పంచమీ విభక్తిరూపము కూడ నుండును.

అవ : సర్వనామమున కుదాహరణము చూపఁబడుచున్నది.

సూ : ఇదమ ఇశ్ 5-3-3.

వృ : ప్రాగ్దిశీయే. ఇతః.

ప. వి : ఇదమః (6-1). ఇశ్ (1-1)

అర్థ : ప్రాగ్దిశీయ ప్రత్యయములు పరములగునపుడు 'ఇదమ్' శబ్దమునకు 'ఇశ్' అనునాదేశము వచ్చును. ఉదా : ఇతః.

వివ : 'ప్రాగ్దిశీయప్రత్యయములు పరములగునపుడు' అనునర్థము ప్రకరణమును బట్టి సిద్ధించును. అట్టివియగు (5-3-26 వఱకు విధింపఁబడినవియగు) ప్రత్యయములు పరములగునపుడు 'ఇదమ్' అనుసర్వనామమునకు 'ఇశ్' అనునాదేశము వచ్చును. ఇందు శకారమిత్తు. 'అనేకాల్ శిత్సర్వస్య' అను పరిభాషచే 'ఇ' అనునీఆదేశము 'ఇదమ్' శబ్దమును మొత్తముగా తొలగించి వచ్చును.

ఉదా : ఇదమ్ + ఙసి + తసిల్ (పఞ్చమ్యాస్తసిల్ అనుసూత్రముచే ప్రత్యయము) విభక్తిలోపము, 'ఇ' ఆదేశము, ఇ + తస్=ఇతస్, అవ్యయమగుటచే సుబ్లుక్కు. సకారమునకు రుత్వ విసర్గములు. ఇతః. వైకల్పికమగుటచే ఈతసిల్ ప్రత్యయము రానియెడల 'అస్మాత్' అను పంచమ్యంతరూపముండును.

సూ : ఏతదోఽన్ 5-3-5.

వృ : ప్రాగ్దిశీయే. అనేకాల్త్వాత్సర్వాదేశః. అతః.

ప. వి : ఏతదః (6-1) అన్ (1-1).

అర్థ : ప్రాగ్దిశీయ ప్రత్యయము పరమగునపుడు ఏతచ్ఛబ్దమునకు 'అన్' అనునాదేశము వచ్చును. అనేకాలాదేశమగుటచే సర్వాదేశము అతః

వివ : 'ప్రాగ్దిశీయే' అనునది ప్రకరణలబ్ధము ఆ ప్రత్యయము పరమగునపుడు ఏతచ్ఛబ్దమునకు 'అన్' అనునాదేశము వచ్చును. ఇది అనేకవర్ణములుగల ఆదేశమగుటచే మొత్తమును తొలగించి వచ్చును.

ఉదా : ఏతస్మాత్. ఏతద్ + ఙసి + తసిల్ (పఞ్చమ్యాస్తసిల్) సుబ్లుక్కు (విభక్తిలోపము) 'అన్' ఆదేశము అన్ + తస్, నకారమునకు 'నలోపః ప్రాతిపదికాన్తస్య' అనుసూత్రముచే లోపము. అతస్+సు (అవ్యయమగుటచే సుప్పునకు లుక్కు) సకారమునకు రుత్వ విసర్గములు (ససజుషోరుః, ఖరవసానయోర్విసర్జనీయః). అతః.

అవ : కొన్ని సర్వనామములకును, బహుశబ్దమునకు నుదాహరణములు చూపఁబడుచున్నవి.

వృ : అముతః, యతః, తతః, బహుతః.

వివ : పంచమ్యంతములగు అదస్, యద్, తద్, అను సర్వనామములకును, బహుశబ్దమునకు 'పంచమ్యాస్తసిల్' అనుసూత్రముచే 'తసిల్' ప్రత్యయము చేఁగా నేర్పడిన రూపములివి. ప్రక్రియ నరయుదము

(1) అముష్మాత్ - అదస్ + ఙసి + తసిల్, విభక్తిలోపము. అదస్+ తస్, త్యదాదీనామః (త్యదాది సర్వనామములకు విభక్తి పరమగునపుడు అకారమంతాదేశమగును) అద+అ, అతోగుణే అనుసూత్రముచే పరరూపము (అద్, అ + అ = అద) అద + తస్, అదసోఽసేర్దాదుదోమః 8-2-80 (సకారాంతము కాని 'అదస్' లనుదాని దకారమునకు పరముగా నున్నవర్ణమునకు ఉకారాదేశమును, దకారమునకు మకారాదేశమును వచ్చును) అను సూత్రముచే అమ్+ఉ+తస్ = అముతస్ అగును అవ్యయత్వము. సుబ్లుక్కు. సకారమునకు రుత్వ విసర్గములు. అముతః 'తసిల్' ప్రత్యయము రానిచో 'అముష్మాత్' అను పంచమ్యేకరూప ముండును.

(2) యతః : యస్మాత్ = యద్ + ఙసి + తసిల్, విభక్తిలోపము. త్యదాదీనామః అనుసూత్రముచే దకారమునకు అకారాదేశము. య+అ = పర రూపసంధి. య + తస్ = యతస్ = యతః, యస్మాత్ అను రూపముకూడ నుండును.

(3) తతః - తస్మాత్ - తద్ + ఙసి + తసిల్ - తద్ + తస్, పైదాని వలెనే ప్రక్రియ, త + అ+తస్ త + తస్-తతస్=తతః; తస్మాత్ అనియు నుండును.

పైని చూపఁబడినవి సర్వనామముల కుదాహరణములు ఈ ప్రాగ్దిశీయ ప్రత్యయములు 'బహు' శబ్దమునకు కూడ వచ్చును. బహు + భ్యస్ + తసిల్, విభక్తిలోపము. బహుతస్ = బహుతః - రానిచో 'బహుభ్యః' అనియు నుండును.

అవ : కింసర్వనామ్బహుభ్యోఽద్వ్యాదిభ్యః ఇత్యాది సూత్రమునందలి 'అద్వ్యాదిభ్యః' అనుదళము యొక్క సార్థక్యమును గమనింతము.

వృ : ద్వ్యాదేస్తు - ద్వాభ్యామ్.

వివ : ద్వి మున్నగు వానికైనచో 'ద్వాభ్యామ్' అనురూపమే యుండును. అనగా 'ద్వి' మున్నగు సర్వనామములకు తసిలాది ప్రత్యయములు రావని తాత్పర్యము – ద్వాభ్యామ్-పంచమీద్వివచనము.

సూ : పర్యభిభ్యాం చ. 5-3-9.

వృ : తసిల్. పరితః, సర్వత ఇత్యర్థః. అభితః, ఉభయత ఇత్యర్థః.

ప. వి : 'పర్యభిభ్యామ్ (5-2) చ (అవ్య).

అను : తసిల్ (1-1).

అర్థ : పరి, అభి అనునవ్యయములకుఁ గూడ పంచమిగా నీతసిల్ ప్రత్యయము వచ్చును. పరితః – అంతటను అని యర్థము. అభితః – రెండువైపులను-అని యర్థము.

వివ : పరి, అభి అను అవ్యయములు కిమాదులలో చేరినవి కావున వీనికి తసిల్ ప్రత్యయము ఈ సూత్రముచే వేఱుగా చెప్పఁబడినది. వీనికి ఈ ప్రత్యయము సర్వ, ఉభయ అను వాని యర్థమునందే యని 'సర్వోభయార్థాభ్యామేవ' అను వార్తికము చెప్పుచున్నది. కావున 'పరి' కి తసిల్ ప్రత్యయము చేర్చినచో 'సర్వతః = అన్నివైపుల అను నర్థము సిద్ధించును, 'అభి'కి చేర్చినచో ఉభయతః = రెండువైపులను అనునర్థము సిద్ధించును.

ఉదా : పరి + తసిల్ = పరితః, అభి + తసిల్ = అభితః.

అవ : సప్తమ్యర్థమున ప్రత్యయములు విధింపఁబడుచున్నవి.

సూ : సప్తమ్యాస్త్రల్ 5-3-10.

వృ : కుత్ర, యత్ర, బహుత్ర.

ప. వి : సప్తమ్యాః (5-1) త్రల్ (1-1).

అను : కిం సర్వనామబహుభ్యః (5-3) విభక్తిః (1-1) వా.

అర్థ : సప్తమ్యంతములగు కిమాదులకు త్రల్ ప్రత్యయము వైకల్పికముగా వచ్చును. ఉదా : కుత్ర మొ॥వి.

వివ : సప్తమ్యంతములైన 'కిమ్' శబ్దమునకును, సర్వనామసంజ్ఞకముల కును, బహుశబ్దమునకును 'త్రల్' అను తద్ధిత ప్రత్యయము వైకల్పికముగా నగును. ద్వ్యాద్యున్నగువానికి రాదు. ఇందు లకారమిత్తు.

ఉదా : కస్మిన్ = దేనియందు; కిమ్ + ఙి + త్రల్, విభక్తిలోపము కిమ్ + త్ర, 'కుతిహోః' అను సూత్రముచే 'కు' ఆదేశము - కుత్ర - ఇదియు నవ్యయమగుటచే దీనికి పరముగా చేరిన సుప్పునకు లుక్కు వచ్చును. దీనికి పద సంజ్ఞ కలుగును. వైకల్పికమగుటచే 'కస్మిన్' అనురూపము కూడ నుండును.

సర్వనామమున కుదాహరణము. యద్ + ఙి + త్రల్, విభక్తిలోపము, అకారాదేశము, (త్యదాదీనామః) య + అ, త్ర, పరరూపసంధి (అతోగుణే) యత్ర. యస్మిన్ అనియు రూపముండును.

బహుశబ్దమున కుదాహరణము : బహు + సుప్, త్రల్, బహుత్ర-రానిచో 'బహుషు' అనియుండును.

సూ : ఇదమో హః 5-3-11.

వృ : త్రలోఽపవాదః. ఇహ.

ప. వి : ఇదమః (5-1) హః (1-1).

అను : సప్తమ్యాః (5-1) విభక్తిః.

అర్థ : సప్తమ్యంతమగు 'ఇదమ్' శబ్దమునకు 'హ' అను ప్రత్యయము వచ్చును. ఇది 'త్రల్' ప్రత్యయమున కపవాదము. ఉదా : ఇహ.

వివ : 'ఇదమ్' అను సర్వనామమునకు పై సూత్రముచే 'త్రల్' ప్రత్య యము ప్రాప్తించుచుండగా అపవాదముగా 'హ' ప్రత్యయము విధింపఁ బడినది.

ఉదా : ఇదమ్ + ఙి, హ, విభక్తిలోపము. 'ఇదమ్' శబ్దమునకు ఇ (శ్) ఆదేశము. ఇ + హ = ఇహ - అవ్యయమగుటచే సుబ్లుక్కు. పదసంజ్ఞ కలుగును.

సూ : కిమోఽత్ 5-3-12.

వృ : వా స్యాత్.

ప. వి : కిమః (5-1) అత్ (1-1).

అను : సప్తమ్యాః (5-1) విభక్తిః (1-1) వా (అవ్య).

అర్థ : సప్తమ్యంతమగు కిమ్ శబ్దమునకు 'అత్' ప్రత్యయము వైకల్పికముగా నగును.

వివ : ఇదియు త్రల్ ప్రత్యయమున కపవాద[redacted]మిత్తు. అత్ ప్రత్యయమునకు విభక్తిసంజ్ఞ యుం[redacted] అనుసూత్రముచే నిట తకారము ఇత్తు కా వీలులేదుగదా అని శంకింపఁబనిలేదు. 'తవర్గస్యేత్వ ప్రతిషేధోఽతద్ధితే' అనువార్తికము గలదు. తవర్గమునకు ఇత్వనిషేధము తద్ధితభిన్న ప్రత్యయములందు మాత్రమే అనుటవలన నిది తద్ధిత ప్రత్యయమునందలిదగుటచే దీనికి ఇత్సంజ్ఞ కలుగును.

ఉదా : కిమ్ + ఙి, అత్, విభక్తిలోపము. కిమ్ + అ-తరువాతికార్యమును క్రిందిసూత్రము విధించును.

సూ : క్వాతి 7-2-105.

వృ : కిమః, క్వ, కుత్ర.

ప. వి : క్వ (ప్రథమలోపించిన పదము) అతి (7-1).

అను : కిమః (6-1).

అర్థ : కిమ్ శబ్దమునకు 'అత్' పరమగునపుడు 'క్వ' అనునాదేశము వచ్చును ఉదా : క్వ.

వివ : 'అత్' అనుతద్ధిత ప్రత్యయము పరమగునపుడు 'కిమ్' అనుదానికి 'క్వ' అనునాదేశము వచ్చును. (అనేకాల్ సూత్రముచే నిదిసర్వాదేశము) కిమ్ + అ, క్వ + అ, అతోగుణే-పరరూపము 'క్వ' అవ్యయమగుటచే దీనికిచేరిన విభక్తి ప్రత్యయమునకు లుక్కు-వచ్చును.

అత్ ప్రత్యయము వైకల్పికమగుటచే రానియెడల 'త్రల్' ప్రత్యయము వచ్చును. కిమ్ + ఙి, త్రల్, కు ఆదేశము, కుత్ర. అదియు రానిచో 'కస్మిన్' అను విభక్త్యంతరూప ముండును.

సూ : ఇతరాభ్యోఽపి దృశ్యన్తే 5-3-14.

వృ : పఞ్చమీ సప్తమీతర విభక్త్యన్తాదపి తసిలాదయో దృశ్యన్తే.

ప. వి : ఇతరాభ్యః (5-3) అపి (అవ్య) దృశ్యన్తే (క్రి. ప).

అను : తసిల్, త్రల్. ఆదయః,

అర్థ : తసిలాదిప్రత్యయములు పంచమీసప్తమీవిభక్త్యంతములకే కాక ఇతర విభక్త్యంతములకును జేరుట కన్పట్టుచున్నది.

విష్ట : తసిల్ ప్రత్యయాదులు పంచమ్యంతకిమాదులకును, త్రల్ ప్రత్యయాదులు సప్తమ్యంతకిమాదులకును విధింపఁబడినవి. అవి యితరవిభక్త్యంతముల కును చేరుచుండుట ప్రయోగములలో కన్పట్టుచున్నదని యీ సూత్రము తాత్పర్యము.

అవ : పై సూత్రమున కనుబంధముగ క్రిందివార్తికము చెప్పఁబడుచున్నది.

వా॥ దృశిగ్రహణాద్భవదాదియోగ ఏవ (వా 3244).

వృ : సభవాన్, తతోభవాన్, తత్రభవాన్, తతోభవన్తమ్, తత్ర భవన్తమ్. ఏవం దీర్ఘాయుః, దేవానాం ప్రియః, ఆయుష్మాన్.

అవ : దృశిగ్రహణమువలన భవదాదిశబ్దములతో యోగమున్నపుడే ఇతర విభక్త్యంతములైన కిమాదులకు తసిలాదులగునని చెప్పవలయును. ఉదా : సభవాన్. మొ॥వి.

వివ : సూత్రమున 'దృశ్యన్తే' (కన్పట్టుచున్నవి) అను క్రియాపదమువలన నిది ప్రయోగానుసారముగా చూచుకొనవలసిన విషయమని చెప్పినట్లయినది. కావున 'భవత్' మున్నగుపదములతో కలయిక యున్నపుడే, అనగా భవదాదిశబ్దములు అనుసరించి ప్రయోగింపఁబడునపుడే ఇతరవిభక్త్యంతములగు కిమాదులకు తసిలాది ప్రత్యయములు కన్పట్టుచున్నవని వార్తికతాత్పర్యము.

ఉ॥ సభవాన్ – ఇందు 'సః' అనునది ప్రథమాంతము. ఆ యర్థములో తతో భవాన్, తత్రభవాన్ మున్నగునవియు వ్యవహరింపఁబడును. అనగా ఇచటి తతః తత్ర అనునవి ప్రథమాంతమగు తచ్ఛబ్దమునకు తసిల్, త్రల్ ప్రత్యయములు చేరగా నేర్పడిన రూపములని తాత్పర్యము. తతోభవన్తమ్, తత్రభవన్తమ్ అను చోట ద్వితీయాంతతచ్ఛబ్దమునకు తసిల్, త్రల్ ప్రత్యయములు చేరినవి.

భవదాదులలో దీర్ఘాయుః, దేవానాం ప్రియః, ఆయుష్మాన్ అనునవి కలవు. కావున తతోదీర్ఘాయుః, తత్రదీర్ఘాయుః ఇత్యాదులందును ప్రథమాంతతదాదులకు తసిల్, త్రల్ ప్రత్యయములు చేరును.

సూ : సర్వైకాన్యకిం యత్తదః కాలే దా 5-3-15.

వృ : సప్తమ్యన్తేభ్యః కాలే దా స్యాత్

ప. వి : సర్వ, ఏక, అన్య, కిమ్, యత్, తదః (5-1) కాలే (7-1) దా (1-1).

అను : విభక్తిః (1-1).

అర్థ : సర్వ, ఏక, అన్య, కిమ్, యత్, తత్ అను వాని సప్తమ్యంతరూపములకు కాలము తెలియఁబడునపుడు 'దా' ప్రత్యయము చేరును.

వివ : 'కాలము'ను దెలియఁజేసెడు సర్వస్మిన్, ఏకస్మిన్, అన్యస్మిన్, కస్మిన్, యస్మిన్, తస్మిన్ అనువానికి స్వార్థమునందు దా ప్రత్యయమువచ్చును.

ఉదా : సర్వస్మిన్‌కాలే; సర్వ + ఙి, దా, విభక్తిలోపము, సర్వదా - అవ్యయము.

అవ : దీనికి రూపాంతరమును గలదు. అది వివరింపబడుచున్నది.

సూ . సర్వస్యసోఽన్యతరస్యాం ది 5-3-9.

వృ : దాదౌ ప్రాగ్దిశీయే సర్వస్య సోవా. సర్వస్మిన్ కాలే సదా; సర్వదా.

ప. వి : సర్వస్య (6-1) సః (1-1) అన్యతరస్యామ్ (అవ్య)ది (7-1).

అర్థ : దకారాది ప్రాగ్దిశీయప్రత్యయము పరమగునపుడు 'సర్వ' శబ్దమునకు 'స' అనునాదేశము వచ్చును. ఉదా : సదా; సర్వదా.

వివ : 'ప్రాగ్దిశీయే' అనునది ప్రకరణమునుబట్టి గ్రహింపఁబడినది. 'ది' అనునది దానికి విశేషణము. తదాది విధిచే (యస్మిన్విధిస్తదాదావల్గ్రహణే) 'దకారాది ప్రాగ్దిశీయ ప్రత్యయము పరమగునపుడు' అనునర్థము కలిగినది. 'స' అనునది అనేకాలాదేశము (స్ + అ) కావున సర్వ అనుదానికి మొత్తమునకు వచ్చును. ఉదా : సర్వస్మిన్ కాలే, సర్వ + ఙి + దా, విభక్తిలోపము, స ఆదేశము-సదా. ఇది రానిచో సర్వదా అనురూపముండును. దా ప్రత్యయమురానియెడల 'సర్వస్మిన్‌కాలే' అనియుండును.

అవ : ఏకాదులకుదాహరణములు.

వృ : ఏకదా, అన్యదా, కదా, యదా, తదా.

వివ : (1) ఏకస్మిన్‌కాలే - ఒకకాలమునందు ఏక + ఙి, దా విభక్తిలోపము, ఏకదా. (2) అన్యస్మిన్‌కాలే=మతియొకకాలమునందు, అన్య + ఙి,

దా, అన్యదా: (3) కస్మిన్కాలే - ఏకాలమునందు, కిమ్+ఙి, దా, విభక్తిలోపము; కిమ్ + దా, కిమః కః (7-2-103) విభక్తి పరమగునపుడు కిమ్శబ్దమునకు 'క'అను నాదేశము వచ్చును. దా ప్రత్యయము విభక్తి సంజ్ఞకము. కదా. (4) యస్మిన్కాలే- యద్ + ఙి, దా, విభక్తిలోపము, త్యదాదీనామః, య + అ, దా, పరరూప సంధి, యదా. (5) తస్మిన్కాలే, తద్ + ఙి, దా, త + అ, దా, తదా.

దాప్రత్యయాంతము లవ్యయములు. కావున వానికి పరమైన సుప్పునకు లుక్కువచ్చును. ఈ ప్రత్యయము వైకల్పికమగుటచే రానిచో 'ఏకస్మిన్కాలే' మున్నగురూపములుండును.

అవ : సూత్రమునందలి 'కాలే' అనుపదముయొక్క సార్థక్యము పరిశీలింపఁ బడుచున్నది.

వృ : కాలే కిమ్? సర్వత్ర దేశే.

వివ : సర్వాదిశబ్దములచే కాలము వాచ్యమగునపుడే 'దా' ప్రత్యయము వచ్చును. కావున 'సర్వస్మిన్ దేశే' అనుచోట 'దా' ప్రత్యయమురాదు. త్రల్ ప్రత్యయము 'సప్తమ్యా స్త్రల్' అనుసూత్రముచే వచ్చును. సర్వ + ఙి, త్రల్, సర్వత్ర.

సూ : ఇదమో ర్హిల్ 5-3-16.

వృ : సప్తమ్యన్తాత్.

ప. వి : ఇదమః (5-1) ర్హిల్ (1-1).

అను : కాలే (7-1) విభక్తిః (1-1).

అర్థ : సప్తమ్యంతమగు ఇదమ్ శబ్దమునకు కాలార్థమున 'ర్హిల్' ప్రత్యయము వచ్చును.

వివ : 'అస్మిన్ కాలే' అనునర్థమున సప్తమ్యంతమగు 'ఇదమ్' శబ్దమునకు పరముగా 'ర్హిల్' ప్రత్యయము వచ్చును. లకారమిత్తు. ఇది 'ఇదమోహః' అను సూత్రముచే విధింపఁబడిన హ ప్రత్యయమున కపవాదము. ఉదా : అస్మిన్కాలే- ఈ కాలమునందు, ఇదమ్ +ఙి, ర్హిల్, విభక్తిలోపము. ఇదమ్ + ర్హి (ల్). ఇట్టిస్థితిలో వగు కార్యవిశేషము క్రిందిసూత్రముచే విధింపబడుచున్నది.

సూ : ఏతేతౌ రథోః 5-3-4.

వృ : ఇదమః ఏత, ఇత్ ఏతౌస్తో రేఫాదౌ థకారాదౌ చ ప్రాగ్దిశీయే పరే. అస్మిన్ కాలే ఏతర్హి.

ప. వి : ఏతేతౌ (1-2) రథోః (7-2).

అర్థ : ఇదమ్ శబ్దమునకు, రేఫాది ప్రాగ్దిశీయమును, థకారాది ప్రాగ్దిశీయమును పరమగునపుడు క్రమముగా ఏత, ఇత్ అనునాదేశములు వచ్చును. ఉదా : ఏతర్హి.

వివ : ప్రకరణమునుబట్టి ప్రాగ్దిశీయే అనునది లబ్ధమగును. రథోః అనునది దానికి విశేషణము. వర్ణగ్రాహక సప్తమ్యంతము కావున తదాదివిధిచే 'రేఫాది, థకారాది ప్రాగ్దిశీయ ప్రత్యయము పరమగునపుడు' అనునర్థము కలుగును. అట్టి యెడ ఇదమ్ శబ్దమునకు క్రమముగా ఏత, ఇత్ అనునాదేశములు వచ్చును. ఇది అనేకాలాదేశము కావున సర్వమునకు వచ్చును. (అనేకాల్శిత్సర్వస్య).

ఉదా : ఇదమ్ + ఙి, ర్హిల్, ఇదమ్ + ర్హిల్, ఏతఆదేశము, ఏతర్హి. ఈకాలమునందు

థకారాది ప్రత్యయము పరమగునపుడు 'ఇత్' ఆదేశమునకు ఉదాహరణము సందర్భానుగుణముగా చూపఁబడును. ర్హిల్ ప్రత్యయాంతము అవ్యయము.

వృ : కాలే కిమ్ ? ఇహ దేశే.

వివ : 'ర్హిల్' ప్రత్యయము కాలము వాచ్యమగునపుడే వచ్చును కావున అస్మిన్ దేశే' - ఈదేశమునందు అనునర్థమున నదిరాదు. 'హ' ప్రత్యయము వచ్చి ఇహ(దేశే)' - అగును

సూ : అనద్యతనే ర్హిలన్యతరస్యామ్ 5-3-21.

వృ : కర్హి-కదా, యర్హి-యదా, తర్హి-తదా.

ప. వి : అనద్యతనే (7-1) ర్హిల్ (1-1) అన్యతరస్యామ్ (అవ్య).

అను : కిం సర్వనామబహుభ్యః (5 3) అద్వ్యాదిభ్యః (5-3) కాలే (7-1) భక్తిః (1-1)

అర్థ : అనద్యతన మైనకాలము వాచ్యమగునపుడు కిమాదులకు ర్హిల్ ప్రత్యయము వైకల్పికముగా నగును. ఉదా : కర్హి - కదా మునిః.

వివ : అద్య = నేఁడు, అద్యతన = నేటికిసంబంధించినది, అనద్యతన = నేటిదికానిది - అట్టికాలవిశేషము వాచ్యమగునపుడు సప్తమ్యంతములగు కిమ్శబ్దమునకు, సర్వనామములకును, 'ర్హిల్' ప్రత్యయము వైకల్పికముగా వచ్చును.రానిచో 'సర్వైకాన్య' అనుసూత్రముచే 'దా' ప్రత్యయమగును ఉదా : (1) కస్మిన్కాలే, కిమ్ + ఙి, ర్హిల్, విభక్తిలోపము. 'కిమఃకః' అనుసూత్రముచే 'క' ఆదేశము కర్హి, లేనిచో కదా. (2) యస్మిన్కాలే - ఏకాలమునందు, యద్+ఙి, ర్హిల్ విభక్తిలోపము, దకారమునకు అకారాదేశము (త్యదాదీనామః) పరరూపసంధి (అతో గుణే) య+అ=యర్హి, యదా. (3) తస్మిన్కాలే, తద్ + ఙి, ర్హిల్, తద్ + ర్హి, త+అ, ర్హి, తర్హి, తదా.

ర్హిల్ ప్రత్యయాంతము లవ్యయములు.

అవ : ఏతస్మిన్ కాలే-ఈకాలమునందు అనునర్థమున ఏతద్ + ఙి, ర్హిల్, విభక్తికి లుక్కు వచ్చి 'ఏతద్ + ర్హి' అయియుండ క్రిందిసూత్రముచే కార్యవిశేషము చెప్పఁబడుచున్నది.

సూ : ఏతదః 5-3-5.

వృ : ఏత, ఇత్ ఏతౌ స్థో రేఫాదౌ థాదౌ చ ప్రాగ్దిశీయే ఏతస్మిన్కాలే - ఏతర్హి.

ప వి : ఏతదః (6-1).

అను : ఏతేతౌ (1-2) రథోః (7-2).

అర్థ : రేఫాదియు, థకారాదియునగు ప్రాగ్దిశీయ ప్రత్యయము పరమగునపుడు ఏతద్ శబ్దమునకు క్రమముగా ఏత, ఇత్ అను నాదేశములు వచ్చును ఉదా : ఏతర్హి.

వివ : పూర్వము 'ఇదమ్' శబ్దమునకు విధింపఁబడిన ఏత, ఇత్ అనునాదేశములు, ఏతద్ శబ్దమునకును, రేఫాదిథకారాది ప్రాగ్దిశీయ ప్రత్యయములు పరములగునపుడును, క్రమముగా వచ్చును.

ఉదా : ఏతస్మిన్కాలే, ఏతద్ + ఙి, ర్హిల్, విభక్తిలోపము. ఏతద్ ర్హిల్, 'ఏత' ఆదేశము, ఏతర్హి.

సూ : ప్రకారవచనే థాల్ 5-3-23.

వృ : ప్రకారవృత్తిభ్యః కిమాదిభ్యః థాల్. తేన ప్రకారేణ, తథా

వ. వి : ప్రకార వచనే (7-1) థాల్ (1-1).

అను : కింసర్వనామబహుభ్యః (5-3) అద్వ్యాదిభ్యః (5-3) విభక్తిః (1-1).

అర్థ : ప్రకారము అనునర్థమునందు కిమాదులకు 'థాల్' అను తద్ధితప్రత్యయము వచ్చును. ఉదా : తేన ప్రకారేణ – తథా.

వివ : 'ప్రకారవచనే' అనుపదమున సప్తమి పంచమ్యర్థకము. కావున 'ప్రకారవచనములగు కిమాదులకు పరముగా' అనునర్థము వచ్చును. ప్రకారమనగా విశేషము. సామాన్యముకంటె భిన్నముగా నుండుదానిని విశేషమందురు. దానిని వచించునపుడు కిమాదిశబ్దములకు 'థాల్' ప్రత్యయము వచ్చును. ఇందలిప్రకారశబ్దముచే సాదృశ్యమనునర్థమును గ్రహింపరాదు.

తేన ప్రకారేణ – ఆ విధముగా–తద్ + థాల్, దకారమునకు అకారాదేశము (త్యదాదీనామః) త + అ, అతోగుణే-పరరూపసంధి, తథా. ఇది యవ్యయము. కాన దీనికి పరముగా వచ్చిన విభక్తిప్రత్యయమునకు లుక్కు వచ్చును. అట్లిది పదమగును.

సూ : ఇదమస్థముః 5-3-24.

వృ : థాలోఽపవాదః.

వ వి : ఇదమః (5-1) థముః (1-1).

అను : ప్రకారవచనే (7-1) విభక్తిః. (1-1).

అర్థ : ప్రకారవాచకమగు ఇదమ్ శబ్దమునకు 'థము' ప్రత్యయము వచ్చును ఇది థాల్ ప్రత్యయమున కపవాదము.

వివ : 'ఈ ప్రకారముగా' అనునర్థమున 'ఇదమ్' శబ్దమునకు పరముగా 'థముః' ప్రత్యయము వచ్చును. ఇందు తుది ఉకారము ఉచ్చారణార్థకము.

ఉదా : ఇదమ్ + థమ్, 'ఏతేతౌరథోః' అను సూత్రముచే ఇదమ్ శబ్దమునకు 'ఇత్' ఆదేశము. ఇత్ థమ్ = ఇత్థమ్-ఇదియు నవ్యయము.

వా: ఏతదో వాచ్యః (3235)

వృ : అనేన ఏతేన వా ప్రకారేణ ఇత్థమ్.

ప వి : ఏతదః (5-1) వాచ్యః (1-1).

అర్థ : 'థము' ప్రత్యయము 'ఏతద్' అను సర్వనామమునకును చేరును.

వివ : సూత్రమున 'ఇదమ్' శబ్దమునకు మాత్రమే విధింపఁబడిన థము ప్రత్యయము వార్తికముచే 'ఏతద్' శబ్దమునకును వచ్చునని చెప్పఁబడినది. అనేన ఏతేన వా ప్రకారేణ = ఈః ప్రకారముగా, ఏతద్ + థము (ఏతదః)'ఇత్' ఆదేశము = ఇత్థమ్.

'ఏతద్' 'ఇదమ్' అను రెండు సర్వనామములును 'ఈః' అనునర్థమున సంస్కృతమున ప్రయోగింపఁబడును.

సూ : కిమశ్చ 5-3-25.

వృ : కేన ప్రకారేణ, కథమ్.

వృ : కిమః (5-1) చ (అవ్య).

అను . ప్రకార వచనే (7-1) థముః (1-1).

అర్థ : ప్రకారార్థమున 'కిమ్' శబ్దమునకును 'థము' ప్రత్యయము చేరును.
ఉదా : కథమ్

వివ : 'థాల్' ప్రత్యయము ప్రాప్తించుచుండగా అపవాదముగా 'థము' ప్రత్యయము 'కిమ్'శబ్దమునకు 'ఏ ప్రకారముగా' అనునర్థమున విధింపబడినది.

కిమ్ + థము, కిమః కః' అనుసూత్రముచే 'క' ఆదేశము. కథమ్. ఇదియు అవ్యయము.

ఇది ప్రాగ్దిశీయ ప్రకరణము.

ప్రకరణావలోకనము : కిమ్ శబ్దమునకు, ద్విమున్నగునవికాక తక్కిన సర్వనామములకును బహుశబ్దమునకు సాధారణముగా పంచమీ, సప్తమ్యర్థములలో వచ్చు తద్ధిత ప్రత్యయము లీప్రకరణమునఁ జెప్పఁబడినవి. తసిల్, త్రల్, హ, అత్, దా, ర్హిల్, థాల్, థము అను ప్రత్యయము లిందుఁ జెప్పఁబడినవి. ఈ ప్రత్యయములు వచ్చునపుడు కిమాదులకగు ననేకములైన మార్పు లిందు చెప్పఁబడినవి. ఈ ప్రత్యయాంతములన్నియు నవ్యయములు కావున వీనిపై విభక్తి ప్రత్యయము నిలువదు. అది వచ్చి లోపించుటవలన వీనికి పదత్వము సిద్ధించును. ఈ ప్రత్యయములకు విభక్తి సంజ్ఞ యుండుటవలన విభక్తి పరముగా నున్నపుడు జరుగు కార్య విశేషములిందు జరుగును.

అథ ప్రాగివీయ ప్రకరణమ్.

అవ : 'ఇవే ప్రతికృతౌ' అనుసూత్రమునకు పూర్వమువఱకు విధింపఁబడు తమబాదిప్రత్యయములు గలప్రకరణమగుటచే దీనికి ప్రాగివీయప్రకరణ మని పేరు.

సూ : అతిశాయనే తమబిష్ఠనౌ 5-3-55.

వృ : అతిశయ విశిష్టార్థవృత్తేః స్వార్థ ఏతౌ స్తః, అయమేషా మతిశయే నాఢ్యః = ఆఢ్యతమః; లఘుతమః-లఘిష్ఠః.

ప. వి : అతిశాయనే (7-1) తమబిష్ఠనౌ (1-2).

అను : (5-1) తద్ధితః (1-1) ప్రత్యయః.

అర్థ : 'అతిశయముతోఁగూడినది' అనునర్థమును దెలుపు పదమునకు స్వార్థమునందు తమప్, ఇష్ఠన్ అను ప్రత్యయములు వచ్చును. ఉదా : ఇతఁడు వీరిలో అధికముగా ఆఢ్యుఁడు-ఆఢ్యతమః; లఘుతమః, లఘిష్ఠః.

వివ : అతిశాయనమనగా ఉత్కర్షము. అతిశయము అనువిశేషమును వ్యక్తము చేయునపుడు పదమునకు స్వార్థమునందు తమప్, ఇష్ఠన్ అనుప్రత్యయములు చేరును ఈ ప్రత్యయములు చేరిన రూపములు, 'అందఱిలో ఉత్కర్షము కలవాఁడు' అనునర్థమును బోధించును. 'ఇద్దఱిలో నొకఁడు ఉత్కర్ష కలవాఁడు' అనునర్థమున 'ద్వివచన....' ఇత్యాదిసూత్రముచే తరప్, ఈయసున్ ప్రత్యయములు విధింపఁబడుటచే, ప్రకృతసూత్రమునందలి ప్రత్యయములు, ఇద్దఱికంటె నెక్కువమందిలో ఉత్కర్షను చెప్పునపుడే వచ్చునను నర్థము సిద్ధించును.

ఉదా : అయమేషామతిశయేన ఆఢ్యః - ఇతఁడు వీరిలో అతిశయముగా ఆఢ్యుఁడు. అను నీయర్థమునందు 'ఆఢ్యః' అను విశేషణవాచకమునకు ఈ ప్రత్యయములు చేరును. ఆఢ్య + సు, తమప్ (పవర్ణమిత్తు) విభక్తిలోపము. ఆఢ్యతమ + సు=ఆఢ్యతమః.

అయమేషామతిశయేనలఘుః - ఇతఁడు వీరిలో నధికముగా లఘువు అను నర్థమున లఘుశబ్దమునకు తమప్ ప్రత్యయము. లఘు + సు, తమప్, విభక్తి లోపము, లఘుతమ + సు=లఘుతమః. ఇదే యర్థమున ఇష్ఠన్ ప్రత్యయము రాఁగా లఘు + సు + ఇష్ఠన్, (నకారమిత్తు) విభక్తిలోపము. లఘు+ఇష్ఠ-టేః -

(ఇష్ఠ, ఇమ, ఈయస్ అను ప్రత్యయములు పరములగునపుడు టికి లోపము వచ్చును) అను మాత్రముచే టిలోపము. లఘు + ఇష్ఠ = లఘిష్ఠ + సు = లఘిష్ఠః.

సూ : తిఙశ్చ 5-3-56.

వృ : తిఙన్తాదతిశయే ద్యోత్యే తమప్ స్యాత్.

ప. వి : తిఙః (5-1) చ (అవ్య).

అను : తమప్ (1-1).

అర్థ : అతిశయము తెలుపఁబడునపుడు 'తమప్' ప్రత్యయము తిఙంతము నకును పరముగా వచ్చును.

వివ : తద్ధిత ప్రత్యయములు ప్రాతిపదికసంజ్ఞగలవానికి, ఆయావిభక్త్యంత రూపములపై మాత్రమే చేరునని 'ఙ్యాప్ప్రాతిపదికాత్' (4-1-1) అనునధికార సూత్రము చెప్పుచున్నది. తిఙ్ ప్రత్యయములు ప్రాతిపదికములకు చేరవు. ఈతమప్ ప్రత్యయము తిఙంతములకును (క్రియాపదములకు) అతిశయము చెప్పఁబడునపుడు చేరునని యీ సూత్రముచే చెప్పఁబడినది. ఉదాహరణము ముందుఁ జూపఁబడు చున్నది.

సూ : తరప్తమపౌ ఘః 1-1-22.

ప. వి : తరప్, తమపౌ (1-2) ఘః (1-1).

అర్థ : తరప్, తమప్ అను రెండు ప్రత్యయములకును 'ఘ' అని పేరు.

వివ : 'అతిశాయనే తమబిష్ఠనౌ' అనుసూత్రమున విధింపఁబడిన తమప్, అనుదానికి, 'ద్వివచన విభజ్యోపపదే తరబీయసునౌ' అను వక్ష్యమాణ సూత్రముచే విధింపఁబడు 'తరప్' అను ప్రత్యయమునకును 'ఘ' అని సంజ్ఞ కావున నీవ్యా కరణమునందెందైన 'ఘ' అనునది వ్యవహరింపఁబడినచో ఈ రెండు ప్రత్యయ ములను గ్రహింపవలయును.

అవ : ముందు సూత్రమున దీని ప్రయోగము గలదు.

సూ : కిమేత్తిఙవ్యయఘాదామ్వద్రవ్యప్రకర్షే 5-4-11.

వృ : కిమ ఏదన్తాత్తిఙోఽవ్యయాచ్చ యో ఘః తదన్తాదాముః స్యాన్నత్వద్రవ్యప్రకర్షే. కింతమామ్, ప్రాహ్ణేతమామ్, పచతితమామ్, ఉచ్చైస్తమామ్. ద్రవ్యప్రకర్షే తు. ఉచ్చైస్తమః తరుః.

వ. వి : కిమే........ఘాత్ (5-1) అము (1-1) అద్రవ్య ప్రకర్షే(7-1).

అర్థ : ఘ ప్రత్యయాంతములైన కిమ్ శబ్దమునకును. ఏకారాంతమునకును, తిజంతమునకును, అవ్యయమునకు పరముగా 'అము' అను ప్రత్యయము వచ్చును. ద్రవ్యప్రకర్షము వ్యక్తమగునపుడు మాత్రమురాదు. ఉదా : కిన్తమామ్ మొ॥వి.

వివ : 'ఘ' అనగా తరప్, తమప్ అను ప్రత్యయములు అవి అంతమునఁ గల 'కిమ్' శబ్దము, ఏకారాంతశబ్దము, తిజన్తము (క్రియావాచకపదము) అవ్యయము అను వానికి పరముగా 'అము' అను ప్రత్యయము వచ్చును. ఈ ప్రత్యయముచేరిన రూపముచే ద్రవ్యముయొక్క ప్రకర్ష తెలియఁబడునేని ఇదిరాదు. ద్రవ్యమనగా లింగము, సంఖ్య, కారకము అనువానితో కూడినది. 'అము' ప్రత్యయమున ఉకార ముచ్చారణార్థకము.

ఉదా : 'కిమ్' శబ్దమునకు కేవల స్వార్థమున తమ ప్రప్రత్యయము చేరినది. అతిశయార్థమిట పొసఁగదు. వీరిలో అతిశయముగా నెవఁడు అనునట్టి అర్థము అసంభావ్యముకదా ! 'కింతమ' ప్రకృతసూత్రముచే 'అము' ప్రత్యయము. కింతమ + అమ్, యస్యేతిచ - అకారలోపము, కింతమామ్. అమ్ ప్రత్యయాం తము అవ్యయము.

ప్రాహ్ణమనగా పగటియొక్క పూర్వభాగము. 'అతిశయితే ప్రాహ్ణే' 'అతి శయమైన ప్రాహ్ణమునందు' అనునర్థమున 'ప్రాహ్ణే' అనుసప్తమ్యంత రూపమునకు 'తమప్' ప్రత్యయము. ప్రాహ్ణ + ఙి, తమ 'ఘకాల తనేషుకాలనామ్నః' 6-3-17 (ఘ ప్రత్యయమును కాలశబ్దమును, తన ప్రత్యయమును పరమగునపుడు సప్తమికి లుక్కురాదు) అను సూత్రముచే 'ఙి' ప్రత్యయమునకు లుక్కురాదు (సుపోధాతు ప్రాతిపదికయోః అనుదాని కిదిఅపవాదము) కావున 'ప్రాహ్ణే' అని యుండును. 'ప్రాహ్ణేతమ' అనుచోట ఏదంతమునకు పరముగా తమప్ ప్రత్యయమున్నది కావున ప్రకృత సూత్రముచే 'అము' ప్రత్యయము. ప్రాహ్ణేతమ+అమ్, అకారలోపము, ప్రాహ్ణేతమామ్.

'పచతి' అను తిజంతమునకు 'తిజశ్చ' అనుసూత్రముచే 'తమప్ ప్రత్య యము. అతిశయేన పచతి - అతిశయముగా వండుచున్నాఁడు. 'పచతితమ' ప్రకృత సూత్రముచే 'అము' ప్రత్యయము. పచతితమ + అమ్, అకారలోపము. పచతిత మామ్.

'ఉచ్చైః' అనునది అవ్యయము. దీనికి అతిశయార్థమున 'తమప్' ప్రత్యయము. ఉచ్చైస్ + తమప్ = ఉచ్చైస్తమ + అమ్=ఉచ్చైస్తమామ్ - పఠతి' మిక్కిలి ఎక్కువగా పఠించుచున్నాఁడు. పఠనక్రియయందలి ఉచ్చైస్త్వముయొక్క ఆధిక్యమిట తమప్ ప్రత్యయముచే చెప్పఁబడును.

పై అన్ని ఉదాహరణములందును ద్రవ్యప్రకర్ష చెప్పఁబడలేదు. ప్రాహ్ణేతమాం కరోతి, ఉచ్చైస్తమాం పఠతి మున్నగుచోటులందు క్రియయొక్క ఉత్కర్షము వాచ్యమగుచున్నది. ద్రవ్యోత్కర్షము వాచ్యమగుచో 'అద్రవ్య ప్రకర్షే' అనుటవలన నీ 'అము' ప్రత్యయము రాదు. అతిశయేన ఉచ్చైః తరుః- మిక్కిలి ఎత్తైనచెట్టు. ఇచట తరువు ద్రవ్యము. దానియొక్క అతిశయము చెప్పఁబడుటచే ఉచ్చైస్తమశబ్దమున కిచట 'అమ్' ప్రత్యయము రాదు ఉచ్చైస్తమః తరుః.

సూ : ద్వివచన విభజ్యోపపదే తరబీయసునౌ 5-3-57.

వృ : ద్వయో రేకస్యాతిశయే విభక్తవ్యే చోపపదే సుప్తిఙన్తాదేతౌ స్తః. పూర్వయోరపవాదః. అయ మనయో రతిశయేన లఘుర్లఘుతరః. లఘీయాన్; ఉదీచ్యాః ప్రాచ్యేభ్యః పటుతరాః-పటీయాంసః.

ప. వి : ద్వివచన విభజ్యో పపదే (7-1) తరబీయసునౌ (1-2).

వ. వి : అతిశాయనే (7-1) తద్ధితః (1-1) ప్రత్యయః (1-1) తిఙః (5-1)

అర్థ : ఇద్దఱిలో నొకనియొక్క అతిశయమును విభజింపవలసినప్పుడును, ఉపపదముగా నున్నపుడును సుప్తిఙంతములకు పరముగా తరప్, ఈయసున్ అను ప్రత్యయములు వచ్చును. ఇవి తమప్, ఇష్ఠన్ ప్రత్యయముల కపవాదములు. ఉదా : వీరిరువురిలో నితఁడు అతిశయముగా లఘువు - లఘుతరః, లఘీయాన్. ఉదీచ్యులు ప్రాచ్యులకంటె పటుతరులు, పటీయాంసులు.

వివ : ద్వివచనమనగా నిద్దఱను / రెంటిని చెప్పునది. విభజ్యమనగా విభజింపఁబడఁదగినది. విభజ్యమైనది అతిశయము. ద్వివచనము, విభజ్యమునైన ఉపపదమున్నపుడు అనగా రెంటిని చెప్పునదియు, విభజింపఁబడవలసినదియు నుపపదముగా నున్నపుడని యర్థము. అనగా రెండింటిలో నొకదాని అతిశయము

చెప్పవలసియున్నపుడు, ఆ రెంటిని వచించు పదము ఉపపదముగా (సమీపమున నుండు పదముగా) నున్నపుడును, విభజింపఁబడవలసిన దానిని బోధించు పదము ఉపపదముగా నున్నపుడును సుబంతతిఙంతములకు పరముగా తరప్, ఈయసున్ అను ప్రత్యయములు చేరును. తద్ధితప్రత్యయములు సుబంతములకే వచ్చునను సిద్ధాంతమువలన (సుబన్తాత్తద్ధితోత్పత్తిః; సుబంతములకును, తిఙశ్చ అను సూత్రము అనువృత్తమగుటవలన తిఙంతములకును ఇవి చేరుననుట వ్యక్తమైనది

(1) రెంటిలో నొకదాని యతిశయమును చెప్పుటకు ఉదాహరణము : అయ మనయో రతిశయేన లఘుః – ఇతఁడు వీరిరువురిలో మిక్కిలిగా తేలికయైనవాఁడు. 'అనయోః' అనునది యిచట ఉపపదము. లఘు + సు + తరప్, విభక్తి లోపము (పకారమిత్తు) లఘుతర + సు = లఘుతరః. 'ఈయసున్' ప్రత్యయమును ఈ యర్థమున రావచ్చును. లఘు + సు + ఈయసున్. ప్రత్యయమున నకారమిత్తు. ఉకారముచ్చారణార్థకము. లఘు + ఈయస్, టేః అను సూత్రముచే టిలోపము లఘీయస్+సు = లఘీయాన్.

ఇద్దఱుకాక అనేకవ్యక్తులలో నొకని యతిశయము చెప్పవలసినచో ఈ ప్రత్యయములు రావు. తమప్, ఇష్ఠన్ ప్రత్యయములు వచ్చును.

(2) విభజింపఁబడవలసినది ఉపపదముగానున్నపు డుదాహరణము. ఉదీచ్యాః ప్రాచ్యేభ్యః పటుతరాః, పటీయాంసః – ఉదీచ్యులు ప్రాచ్యులకంటె పటుతరులు, పటీయాంసులు. ఇచట ప్రాచ్యులనుండి విభజింపఁబడువారైన ఉదీచ్యులను చెప్పు పదమగు 'ఉదీచ్యాః' అనునది సమీపమున నుచ్చరింపఁబడు పదమగుటచే (ఉపపదమగుటచే) 'పటు' అను విశేషణశబ్దమున కీప్రత్యయములు వచ్చినవి పటు + జస్ + తర, పటుతర + జస్ = పటుతరాః. పటు + ఈయస్ (ఉన్) టేః అను సూత్రముచే టిలోపము. పట్ + ఈయస్ = పటీయస్ + జస్ = పటీయాంసః.

ఈ సూత్రమునందలి 'ఉపపదము' ధాత్వధికారములో నిర్వచింపఁబడినది కాదు. సమీపమున నుచ్చరితమైన పదమను నవయవార్థముతోనే యిందు గ్రహింపవలయును.

ఇట్లు, తరప్, ఈయసున్ ప్రత్యయములు రెంటిలో నొకదాని అతిశయమును జెప్పునపుడును, తమప్, ఇష్ఠన్ ప్రత్యయములు రెండుకంటె నెక్కువైన వానిలో నొకదాని అతిశయమును జెప్పునపుడును వచ్చుననుట వ్యక్తమైనది. ఇవి ఆంగ్లములోని Comparative Degree, Superlative Degree అనువానికి స్థూలముగా సమానార్థకములు.

ఈ నాల్గింటిలో అజాదిప్రత్యయములగు 'ఇష్ఠన్' 'ఈయసున్' అనునవి గుణవాచకములకు మాత్రమే చేరునను నియమము గలదు (అజాదీగుణవచనాదేవ 5-3-58) దీనినిబట్టియే తిజంతములకు, తదితరగుణవచనములు కాని వానికిని తర ప్తప ప్రత్యయములు మాత్రమే చేరుననియు, గుణవాచకములగు లఘు, పటు మున్నగువానికి ఈ నాల్గు ప్రత్యయములును రావచ్చుననియు స్పష్టమైనది.

సూ : ప్రశస్యస్య శ్రః 5-3-60.

వృ . ఇష్ఠేయసోః పరతః.

ప. వి : ప్రశస్యస్య (6-1) శ్రః (1-1).

అను : అజాదీ (1-2).

అర్థ : ఇష్ఠ, ఈయస్ ప్రత్యయములు పరములగునపుడు ప్రశస్య శబ్దమునకు 'శ్ర' అనునాదేశము వచ్చును.

వివ : అనువృత్తిగా వచ్చిన 'అజాదీ' అనుపదమును సప్తమ్యంతముగా మార్చుకొనవలయును. కావున పై ప్రత్యయములు నాల్గింటిలో 'అజాదులగు ఇష్ఠన్, ఈయసున్ అనునవి పరమగునపుడు' అనునర్థము సిద్ధించును (తస్మిన్నితి నిర్దిష్టే పూర్వస్య). అవి పరమగునపుడు 'ప్రశస్య' అనుశబ్దమునకు 'శ్ర' అనునాదేశము కలుగును. అనేకవర్ణములుగల ఆదేశమగుటచే 'ప్రశస్య' అను మొత్తమును తొలగించి వచ్చును (అనేకాల్ శిత్సర్వస్య).

ఉదా : అయమనయోః అతిశయేన ప్రశస్యః - ఇతఁడు వీరిరువురిలో అతిశయముగా ప్రశస్యుఁడు (ప్రశంసించుటకు యోగ్యుఁడు) అనునర్థమున 'ప్రశస్య' శబ్దమునకు ద్వివచనేత్యాది సూత్రముచే 'ఈయసున్' ప్రత్యయము. ప్రశస్య + సు + తరప్, విభక్తిలోపము, శ్రఆదేశము. 'శ్ర + ఈయస్,' ఇట 'టేః' అను సూత్రముచే టిలోపము ప్రాప్తమగుచుండగా క్రిందిసూత్రముచే వారింపఁబడుచున్నది.

సూ : ప్రకృత్యైకాచ్ 6-4-163.

వృ : ఇష్ఠాదా వేకాచ్ ప్రకృత్యా స్యాత్. శ్రేష్ఠః, శ్రేయాన్.

ప. వి. ప్రకృత్యా (3-1) ఏకాచ్ (1-1).

అను : ఇష్ఠేమేయఃసు (7-3).

అర్థ : ఇష్ఠాదులు పరములగునపుడు ఏకాచ్చు ప్రకృతితో నుండును. ఉదా : శ్రేష్ఠః, శ్రేయాన్.

వివ : ఇష్ఠ, (ఇష్ఠన్) ఇమ (ఇమనిచ్) ఈయస్ (ఈయసున్) అను ప్రత్యయములు పరములగునపుడు ఒకే అచ్చుగల శబ్దభాగము ప్రకృతిభావముతో నుండును. 'అల్లోపోఽనః' అనుసూత్రముచే ప్రాప్తమగు అకారలోపమునకును, 'యస్యేతిచ' అనుసూత్రముచే ప్రాప్తమగు ఇకారాకారలోపమునకును, 'న స్తద్ధితే' 'టేః' అనుసూత్రములచే ప్రాప్తమగుటిలోపమునకును ఇది బాధకము. కావున ఇష్ఠాదులు పరములగునపుడు ఏకాచ్చులయెడ నీసూత్రములు ప్రవర్తింపవని తాత్పర్యము.

ఉదా : శ్ర + ఈయస్, గుణము, శ్రేయస్ + సు=శ్రేయాన్. అష్లి అయమేతేషామతిశయేన ప్రశస్యః - ఇతఁడు వీరందఱిలో మిక్కిలిగా ప్రశస్యుఁడు అనునర్థమున, ప్రశస్యశబ్దమునకు ఇష్ఠన్ ప్రత్యయము (అతిశాయనే తమబిష్ఠనౌ) ప్రశస్య + సు + తమప్ = విభక్తిలోపము, 'శ్ర' ఆదేశము శ్ర + ఇష్ఠ, ప్రకృతిభావము విధింపఁబడుటచే 'టేః' అనుసూత్రముచే ప్రాప్తమగు టిలోపము రాదు. గుణ మేకాదేశమగును (అద్గుణః) శ్రేష్ఠ + సు = శ్రేష్ఠ.

సూ : జ్య చ 5-3-61.

వృ : ప్రశస్యస్య జ్యాదేశః ఇష్ఠేయసోః. జ్యేష్ఠః.

వ. వి : జ్య (ప్రథమావిభక్తిలోపించినపదము) చ (అవ్య).

అను : ప్రశస్యస్య (6-1) అజాదీ (1-2).

అర్థ : ఇష్ఠ, ఈయస్ ప్రత్యయములు పరములగునపుడు ప్రశస్యశబ్దమునకు 'జ్య' అనునాదేశము కూడ వచ్చును. ఉదా : జ్యేష్ఠః.

వివ : ఇంతకు పూర్వము ప్రశస్యశబ్దమునకు విధింపఁబడిన శ్రాదేశముతో పాటు 'జ్య' అనునాదేశము కూడ ఇష్ఠ, ఈయస్ ప్రత్యయములు పరములగునపుడు వచ్చును. ఉదా : ప్రశస్య + సు + ఇష్ఠ, జ్య + ఇష్ఠ, టిలోపము ప్రకృత్యైకాచ్ అను సూత్రముచే వారింపఁబడఁగా గుణమేకాదేశమై జ్యేష్ఠ + సు=జ్యేష్ఠః అగును.

అవ : ఈయస్ ప్రత్యయము పరమగునపుడు జ్యాదేశము కలిగి 'జ్య + ఈయస్'అనియుండ క్రిందిసూత్రముచే కార్య విశేషము చెప్పఁబడుచున్నది.

సూ : జ్యాదాదీయసః 6-4-160.

వృ : జ్యాయాన్. 'ఆదేః పరస్య'.

ప. వి. జ్యాత్ (5-1) ఆత్ (1-1) ఈయసః (6-1).

అర్థ : 'జ్య' అనుదానికి పరముగా నున్న ఈయస్ ప్రత్యయమునకు ఆకార మాదేశమగును, ఉదా : జ్యాయాన్, 'ఆదేః పరస్య' అను పరిభాషచే ఆద్యక్షర మున కాదేశమైనది.

వివ : 'జ్య' అనుదానికి పరముగానున్న ఈయస్ ప్రత్యయమునకు విధింపఁబడిన 'ఆ' అనునాదేశము 'ఆదేఃపరస్య' అను పరిభాషచే ఈయస్ అనుదాని తొలివర్ణమగు ఈకారస్థానమున వచ్చును. జ్య+ఈయస్, జ్య + ఆయస్=జ్యాయస్ + సు =జ్యాయాన్. ఈయిరువురిలో ఇతఁడు ప్రశస్యుఁడు అని యర్థము.

సూ . బహోర్లోపో భూచ బహోః 6-4-158.

వృ: బహోః పరయో రిమేయసో ర్లోపస్స్యాద్బహోశ్చ భూరాదేశః. భూమా - భూయాన్.

ప వి : బహోః (5-1) లోపః (1-1) భూ (ప్రథమావిభక్తిలోపించిన పదము) చ (అవ్య) బహోః (6-1).

అను : ఇష్ఠేమేయస్సు (7-3).

అర్థ : బహుశబ్దమునకు పరముగానున్న ఇమన్, ఈయస్ ప్రత్యయముల తొలివర్ణమునకు లోపమగును. 'బహు' అనుదానికి 'భూ' అనునాదేశము కూడనగును. ఉదా : భూమా - భూయాన్.

వివ : మొదటి బహోః' అనునది పంచమ్యంతము కావున 'తస్మాదిత్యుత్తరస్య' అనుపరిభాషచే దానికి పరముగానున్న అనునర్థము కలుగును. పరముగా నుండవలసినవి ఇష్ఠన్, ఇమనిచ్, ఈయసున్ ప్రత్యయములు. వీనికి విధింపఁబడిన లోపమనుకార్యము 'ఆదేః పరస్య' (పరమునకు విహితమైన కార్యము పరముగా నున్నదాని ఆదివర్ణమునకగును) అను పరిభాషచే వీని తొలివర్ణములకు వచ్చును. అందు 'ఇష్ఠన్' ప్రత్యయమునకు కార్యాంతరవిధానము తరువాతి సూత్రమున చేయఁబడుచుండుటవలన నది యిందువదలఁబడినది. కావున బహుశబ్దమునకు పరముగా నున్న ఇమన్, ఈయస్ అను ప్రత్యయములయొక్క తొలివర్ణములగు ఇ ఈ లకు లోపము వచ్చును అనునర్థము సిద్ధించినది. రెంతవ 'బహోః' అనునది

షష్ఠ్యంతము. 'షష్ఠీస్థానేయోగా' అను పరిభాషచే 'బహు అనుదాని స్థానము'న అనునర్థమేర్పడును. 'భూ' అనునాదేశము ఈ ప్రత్యయములు పరములగునపుడు 'బహు' అనుదానికి వచ్చును. 'అనేకాల్ శిత్సర్వస్య' అను పరిభాషచే 'బహు'అను దానిని మొత్తముగా తొలగించి 'భూ' ఆదేశము వచ్చును.

ఉదా : బహోఃభావః - బహుసంఖ్యగలదానిభావము అనునర్థమున బహు శబ్దమునకు 'పృథ్వాదిభ్య ఇమనిజ్వా' అను సూత్రముచే ఇమనిచ్ ప్రత్యయము. బహు + జస్ + ఇమనిచ్, విభక్తిలోపము, బహు + ఇమన్, ప్రకృతసూత్రముచే ప్రత్యయములోని తొలివర్ణమగు ఇకారమునకు లోపము, శబ్దమునకు భూ ఆదేశము భూ + మన్ + భూమన్ + సు=భూమా.

అయమనయోరతిశయేన బహుః ఇతఃడు వీరిరువురిలో మిక్కిలిగా అధి కుఃడు అనునర్థమున 'ఈయసున్' ప్రత్యయము (ద్వివచనవిభజ్యోపపదే తరబీయసు నౌ) బహు + సు+ఈయసున్, విభక్తిలోపము, ఈకారలోపము, భూ ఆదేశము. భూ + యస్=భూయస్ + సు=భూయాన్.

అవ : ఇష్ఠన్ప్రత్యయమునకు సంబంధించిన కార్యవిశేషము చెప్పఃబడు చున్నది.

సూ : ఇష్ఠస్య యిట్ చ 6-4-159.

వృ : బహోః పరస్య ఇష్ఠస్య లోపఃస్యాద్యిడాగమశ్చ. భూ యిష్ఠః.

ప వి : ఇష్ఠస్య (6-1) యిట్ (1-1) చ (అవ్య).

అను : బహోః (5-1) లోపః (1-1).

అర్థ : బహుశబ్దమునకు పరముగామన్న 'ఇష్ఠన్' ప్రత్యయముయొక్క ఇకారమునకు లోపమును, 'యిట్' అనునాగమమును కూడనగును. ఉదా : భూయిష్ఠః.

వివ : ఇది 'బహోర్లోపో భూచబహోః' అనుసూత్రమునకు అనుబంధ ముగా చెప్పఃబడినది. కావున బహుశబ్దమునకు పరముగానున్న ఇష్ఠన్ ప్రత్య యము యొక్క ఇకారమునకు లోపమును, ప్రత్యయమునకు 'యిట్' అనునాగ మమును, బహుశబ్దమునకు 'భూ' అనునాదేశమును కలుగునని తాత్పర్యము. 'యిట్'లో టకారమిత్తు. కావున వది అద్యవయవముగా నాగమమగును, (ఆద్యన్తౌటకితౌ).

ఉదా : అయమేతేషామతిశయేన బహుః - ఇతఁడు వీరిలో మిక్కిలిగా అధికుఁడు. బహు + సు + ఇష్ఠన్ (అతిశాయనే తమబిష్ఠనౌ) విభక్తిలోపము. ఇకారలోపము, బహు + ష్ఠ, 'యి' ఆగమము బహు + యిష్ఠ, భూ ఆదేశము భూయిష్ఠ + సు = భూయిష్ఠః.

సూ : విన్మతోర్లుక్ 5-3-65.

వృ : ఇష్ఠేయసోః. అతిశయేన స్రగ్వీ స్రజిష్ఠః-స్రజీయాన్. అతిశయేన త్వగ్వాన్ - త్వచిష్ఠః-త్వచీయాన్.

ప. వి : విన్మతోః (6-2) లుక్ (1-1).

అను : అజాదీ (1-2).

అర్థ : ఇష్ఠ, ఈయస్ ప్రత్యయములు పరములగునపుడు విన్, మత్ ప్రత్యయములకు లుక్కు వచ్చును. ఉదా : స్రజిష్ఠః-స్రజీయాన్ మొ॥వి.

వివ : 'అది యితనికిఁగలదు' అనునర్థమున వచ్చిన విని, మతుప్ ప్రత్యయములంతమునఁ గల పదములకు, ఇష్ఠ, ఈయస్ ప్రత్యయములు పరములైనచో విన్, మత్ ప్రత్యయములకు లుక్కు (అదర్శనము) వచ్చును.

ఉదా : స్రగ్ అస్యఅస్తీతి స్రగ్వీ - 'అస్మాయామేధాస్రజోవినిః' అను సూత్రముచే 'స్రజ్' శబ్దమునకు మత్వర్థమున 'విని' ప్రత్యయముచేరగా 'స్రగ్వీ' అయినది. అతిశయేన స్రగ్వీ అనునర్థమున 'అతిశాయనే తమబిష్ఠనౌ' అను సూత్రముచే ఇష్ఠన్ ప్రత్యయము. స్రగ్విన్ + సు, ఇష్ఠన్, విభక్తిలోపము, ప్రకృత సూత్రముచే 'విన్' ప్రత్యయమునకు లుక్కు, స్రజ్ + ఇష్ఠ = స్రజిష్ఠ + సు = స్రజిష్ఠః-విన్ ప్రత్యయము నిమిత్తముగా వచ్చిన పదత్వము, అది అదర్శనమగుటచే పోవును గావున చోఃకుః అనుసూత్రముచే కుత్వమురాదు కుత్వము పదసంజ్ఞ కల దానికే వచ్చును.

అయమనయో రతిశయేన స్రగ్వీ - ఇతఁడు వీరిరువురిలో మిక్కిలిగా స్రగ్వి (మాలలుగలవాఁడు) అనునర్థమున 'స్రగ్వీ' అనుదానికి ఈయసున్ ప్రత్యయము. (ద్వివచన విభజ్యోపపదే తరబీయసునౌ) స్రగ్విన్ + సు + ఈయసున్, విభక్తిలోపము, ప్రకృతసూత్రముచే 'విన్' ప్రత్యయమునకు లుక్కు. స్రజ్ + ఈయస్ = స్రజీయస్ + సు = స్రజీయాన్.

మతుప్ప్రత్యయమునకు లుక్కు - అతిశయేన త్వగ్వాన్, త్వగ్వత్ + సు + ఇష్ఠన్, విభక్తిలోపము, మతుబ్లుక్కు, త్వచ్ + ఇష్ఠ = త్వచిష్ఠ + సు = త్వచిష్ఠః. (శ్రేష్ఠమగు చర్మముగలవారిలో నుత్కృష్టకలవాఁడు).

అయమనయో రతిశయేన త్వగ్వాన్, త్వచ్ + మత్ + సు + ఈయస్ సు, మత్ ప్రత్యయములకులుక్కు. త్వచీయస్ + సు = త్వచీయాన్ (మంచిచర్మము గల యిరువురిలో నధికుఁడు).

తరప్ - ఈయసున్, తమప్-ఇష్ఠన్ అను ప్రత్యయములకు సంబంధించిన విధానము పూర్తి అయినది.

సూ : ఈషదసమాప్తౌ కల్పబ్దేశ్య దేశీయరః 5-3-68.

వృ : ఈషదూనో విద్వాన్-విద్వత్కల్పః, విద్వద్దేశ్యః విద్వద్దేశీయః.

ప. వి : ఈషదసమాప్తౌ (7-1) కల్పప్, దేశ్య, దేశీయరః (1-3).

అర్థ : 'కొంచెము తక్కువ' అనునర్థమున సుబంతతిఙంతములకు కల్పప్, దేశ్య, దేశీయర్ అను ప్రత్యయములు వచ్చును. ఉదా : ఈషదూనో విద్వాన్, విద్వత్కల్పః - ఇత్యాది.

వివ : సమాప్తి అనగా తుదిముట్టుట అనియర్థము. అట్లు తుదిముట్టకుండుట అసమాప్తి. అది ఈషత్-కొంచెము అయినచో ఈషదసమాప్తి-అనగా పూర్తి అగుటకు కొంచెము తక్కువ అనియర్థము. అట్టియర్థమును వ్యక్తముచేయుచు సుబంతమునకు తిఙంతమునకు పరముగా స్వార్థమున కల్పప్, దేశ్య, దేశీయర్అను ప్రత్యయములు వచ్చును. ఇందు పవర్ణమును, రేఫమును ఇత్తులు.

ఉదా : ఈషదూనో విద్వాన్-కొంచెము తక్కువ పండితుఁడు, పాండిత్యము యొక్క సమాప్తికి కొంచెము తక్కువలో నున్నవాఁడని భావము. విద్వస్ స + కల్ప, విభక్తిలోపము, 'స్వాదిష్వసర్వనామస్థానే' (1-4 17) (సర్వనామస్థానభిన్నములైన కప్రత్యయావధికములగు స్వాదిప్రత్యయములు పరమగునపుడు పూర్వమునకు పదసంజ్ఞ కలుగును) అను సూత్రముచే 'విద్వస్' అనుదానికి పదసంజ్ఞ కలుగును. 'వసుస్రంసు' అను సూత్రముచే సకారమునకు జశ్త్వము దకారము, అరిచ, చర్త్వము - విద్వత్కల్ప + సు = విద్వత్కల్పః.

అట్లే విద్వస్+దేశ్య,విద్వద్+దేశ్య = విద్వద్దేశ్య + సు = విద్వద్దేశ్యః. విద్వస్, దేశీయర్, విద్వద్+దేశీయ=విద్వద్దేశీయ సు=విద్వద్దేశీయః. ఈ రెండుదాహరణములలో చర్త్వప్రసంగమునకు తావులేదు

సూ : విభాషా సుపో బహుచ్పురస్తాత్తు 5-3-68.

వృ : ఈషదూనః పటుః బహుపటుః; పటుకల్పః, సుపః కిమ్? పచతి కల్పమ్.

ప. వి : విభాషా (1-1) సుపః (5-1) బహుచ్ (1-1) పురస్తాత్ (అవ్య) తు (అవ్య).

అను : ఈషదసమాప్తౌ (7-1).

అర్థ : 'కొంచెము తక్కువ' అనునర్థమున సుబంతములకు బహుచ్ప్రత్యయము ముందుభాగమునఁ జేరును. ఉదా : ఈషదూనః పటుః. బహుపటుః, పటుకల్పః. సుపః అననేల? పచతి కల్పమ్.

వివ : 'కొంచెముతక్కువ' అనునర్థమును వ్యక్తముచేయుచు సుబంతములకు 'బహుచ్' ప్రత్యయము చేరును ప్రత్యయము లన్నియు దేనికి విధింపఁబడునో దానికి పరముగా చేరును. కాని యిది సుబంతమునకు ముందుభాగమునఁ జేరును.

ఉదా : ఈషదూనః పటుః - కొంచెము తక్కువతనముగల పటువు. పటుత్వము కొంచెము తక్కువగా గలవాఁడనిభావము. పటు + సు=బహు (చ్) పటు + సు (చకారమిత్తు) అర్థవదధాతురిత్యాదిసూత్రముచే ప్రాతిపదికసంజ్ఞ. విభక్తిలోపము. బహుపటుః. ఇది వైకల్పికము కాన రానిచో పైసూత్రముచే కల్పప్ మున్నగునవి. పటు + సు+కల్పప్ = పటుకల్ప + సు=పటుకల్పః.

ఈ ప్రత్యయము సుబంతములకే వచ్చుననుటచే క్రియావాచకములయిన తిఙంతములకు రాదు. ఉదా : పచతికల్పమ్-ఈషదూనం పచతి-కొంచెము తక్కువగా వండుచున్నాఁడు. ఇచట పూర్వసూత్రముచే కల్పప్రత్యయము.

సూ : ప్రాగివాత్కః 5-3-70.

వృ : ఇవే ప్రతికృతౌ ఇత్యతః ప్రాక్కాధికారః.

ప. వి : ప్రాక్ (1-1) ఇవాత్ (5-1) కః (1-1).

అర్థ : 'ఇవే ప్రతికృతౌ' అనుసూత్రమునకు పూర్వమువఱకు కప్రత్యయాధికారము.

వివ : సూత్రమునందలి ఇవాత్ అనునది ఇవశబ్దఘటిత సూత్రమువఱకు అనువర్తము నిచ్చును. అది 'ఇవే ప్రతికృతౌ' 5-3-96 అనునది ఈ సూత్రము మొదలుకొని ఆ సూత్రమునకు పూర్వమువఱకు 'కః' అనునది అధికారరూపమున ప్రవేశించును. అనగా విశేషప్రత్యయము విధింపఁబడనిచో ఈ పరిధిలో కప్రత్యయము ఉపస్థితమగునని తాత్పర్యము.

సూ : అవ్యయసర్వనామ్నా మకచ్ ప్రాక్ టేః 5-3-71.

వృ : కాపవాదః.

ప వి : అవ్యయసర్వనామ్నామ్ (6-3) అకచ్ (1-1) ప్రాక్ (1-1) టేః (5-1).

అను : ప్రాక్ (1-1) ఇవాత్ (5-1).

అర్థ : 'ఇవే ప్రతికృతౌ' అనుసూత్రమునకు పూర్వమువఱకుఁ గలసూత్రములలోఁ జెప్పఁబడిన యర్థములందు అవ్యయములయు, సర్వనామములయు టి భాగమునకు ముందు 'అకచ్' ప్రత్యయము వచ్చును. ఇది క ప్రత్యయమున కప వాదము.

వివ : పూర్వసూత్రమున కప్రత్యయాధికారము చెప్పఁబడినది ఈ సూత్రముచే 'అకచ్' ప్రత్యయము విధింపఁబడినది. 'ఇవే ప్రతికృతౌ' అను సూత్రమునకు పూర్వమువఱకుఁ గల అర్థములలో అవ్యయములకును, సర్వనామములకును టికి ముందు అకచ్ ప్రత్యయమును, తదితరములకు పరముగా 'క' ప్రత్యయమును అగునని తాత్పర్యము.

సూ . అజ్ఞాతే 5-3-73.

వృ : కస్యాయమశ్వోఽశ్వకః, ఉచ్చకైః, నీచకైః, సర్వకే.

ప. వి : అజ్ఞాతే (7-1)

అను : కః (1-1) అవ్యయసర్వనామ్నామ్ (6-3) అకచ్ (1-1) ప్రాక్ (1-1) టేః (5-1).

అర్థ : అజ్ఞాతమైనది అనునర్థమున సుబంతములకు క ప్రత్యయ మగును. అవ్యయ సర్వనామములకు వాని టి భాగమునకు ముందు 'అకచ్' ప్రత్యయము వచ్చును. ఉదా : అశ్వకః ఇత్యాది.

వివ : అజ్ఞాతమనగా తెలియఁబడనిది. ఆ యర్థమును వ్యక్తముచేయుచు అవ్యయ సర్వనామేతరములకు క ప్రత్యయము వచ్చును. అవ్యయసర్వనామముల టి భాగమునకు పూర్వమున 'అకచ్' ప్రత్యయము వచ్చును. ఇందు చకారమిత్తు. కలోని అకారముచ్చారణార్థకము.

ఉదా : కస్యాయమశ్వః – ఇది ఎవరిగుఱ్ఱము? అజ్ఞాతమనునర్థమును దెలుపుట కీవాక్య ముపయోగింపఁబడినది. 'అజ్ఞాతోఽశ్వః' అని విగ్రహము, అశ్వ + సు + క, విభక్తిలోపము – 'అశ్వక' అశ్వక + సు = అశ్వకః–ఎవరిదో తెలియని గుఱ్ఱము.

అవ్యయముల కుదాహరణము అజ్ఞాతముచ్చైః – తెలియఁబడని ఎత్తు ఉచ్చైస్ – ఇందు టి భాగము ఐస్, దానికి పూర్వమున అక్ ప్రత్యయము రాగా ఉచ్చ్ అక్ ఐస్ = ఉచ్చకైస్ అగును. ఇది అవ్యయమగుటచే దీనికి చేరిన సువ్వునకు లుక్కు వచ్చును. సకారమునకు రుత్వ విసర్గములు ఉచ్చకైః.

ఇట్లే నీచైః – నీచ్ + ఐస్, నీచ్ అక్ ఐస్ = నీచకైస్ = నీచకైః.

సర్వనామముల కుదాహరణము : సర్వ, ఇందు టి తుది అకారము సర్వ్ + అక్ + అ=సర్వక + జస్ (ప్రథమాబహువచనము). ఇచట జస్ ప్రత్యయమునకు 'శీ' ఆదేశము. సర్వక + ఈ (శకారమిత్తు) గుణము సర్వకే. తెలియఁబడనివారని యర్థము.

సూ : కుత్సితే 5-3-74.

వృ : కుత్సితోఽశ్వోఽశ్వక .

ప. వి : కుత్సితే (7-1).

అను : కః మున్నగునవి.

అర్థ 'కుత్సితమైనది' అనునర్థమును వ్యక్తము చేయుచు క, అకచ్ ప్రత్యయములు యథాసంభవముగ వచ్చును.

వివ : 'యథాసంభవముగ' ననగ అవ్యయసర్వనామముల టి భాగమునకు ముందు 'అకచ్' ప్రత్యయమును, తక్కినవానికి పరముగ క ప్రత్యయమును వచ్చునని తాత్పర్యము.

ఉదా : కుత్సితోఽశ్వః = కుత్సితమైన గుఱ్ఱము. అశ్వ + సు + క విభక్తిలోపము. అశ్వక + సు=అశ్వకః.

సూ : కిం యత్తదో నిర్ధారణే ద్వయోరేకస్య డతరచ్ 5-3-92.

వృ : అనయోః కతరో వైష్ణవః. యతరః, తతరః.

ప. వి : కింయత్తదః (5-1) నిర్ధారణే (7-1) ద్వయోః(7-2)ఏకస్య (6-1) డతరచ్ (1-1).

అర్థ : రెంటిలో నొకదానియొక్క నిర్ధారణమునందు కిమ్, యద్, తద్ అను వానికి డతరచ్ ప్రత్యయము వచ్చును. ఉదా : కతరః.

వివ : నిర్ధారణమనగా వేఱుచేయుట. ఇద్దఱిలో / రెంటిలో నొకనిని / నొకదానిని వేఱుచేయునపుడు నిర్ధరింపఁబడు దానిని / వానిని వచించుపదములగు కిమ్, యద్, తద్ అనువానికి 'డతరచ్' అను తద్ధితప్రత్యయము చేరును. ఇందు డకారచకారము లిత్తులు (చుటూ, హలన్త్యమ్.)

ఉదా : కిమ్+సు+డతరచ్ విభక్తిలోపము, కిమ్ + అతర, టిలోపము (టేః) క్ + అతర = కతర + సు=కతరః - అనయోః కతరో వైష్ణవః - వీరిరువురిలో వైష్ణవుఁడెవరు? కతరశబ్దముచే వైష్ణవత్వగుణము గలవానిని అది లేని వానినుండి వేఱుచేయుచున్నామని తాత్పర్యము.

యద్+సు+డతరచ్, యద్+అతర, టిలోపము, య్ + అతర=యతర+ సు=యతరః తద్ + డతరచ్, తతర + సు = తతరః. అనయోః యతరః వైష్ణవః - వీరిరువురిలో నెవడు వైష్ణవుఁడో, అనయోః తతరః వైష్ణవః - వీరిరువురిలో అతఁడు వైష్ణవుఁడు ఇత్యాదిగా వీని యర్థము నెఱుఁగవలయును.

సూ : వా బహూనాం జాతిపరిప్రశ్నే డతమచ్ 5-3-93.

వృ : జాతి పరిప్రశ్న ఇతి ప్రత్యాఖ్యాత మాకరే. కతమో భవతాం కఠః, యతమః. తతమః వాగ్రహణమకజర్థమ్. యకః. సకః.

ప వి : వా (అవ్య) బహూనామ్ (6-3) జాతి పరిప్రశ్నే (7-1) డతమచ్ (1-1).

అను : కిం యత్తదః (5 1) నిర్ధారణే (7-1) ఏకస్య (6-1).

అర్థ : అనేకులయందొకని నిర్ధరించునపుడు, జాతి పరిప్రశ్నమునందు నిర్ధార్య మాణులను తెలుపు కిమ్, యద్, తద్ శబ్దములకు పరముగా డతమచ్ ప్రత్యయము వచ్చును. జాతి పరిప్రశ్నమనునది సూత్రమునుండి తొలఁగింపఁబడవచ్చునని

భాష్యమునఁ జెప్పఁబడినది. ఉదా : కతమః ఇత్యాది. వాగ్రహణము అకచ్ ప్రత్యయముకొఱకు చేయఁబడినది. ఉదా : యకః, సకః.

వివ : పూర్వసూత్రమున నిద్దఱిలో నొకని నెన్నుట చెప్పఁబడినది. అనేకులలో నొకనిని ఎన్నవలసినపుడు, అట్లెన్నుటలో జాతినిగూర్చిన ప్రశ్నము తెలియఁబడునపుడు, కిమ్, యద్, తద్ అనుపదములకు 'డతమచ్' ప్రత్యయము చేరునని యీ సూత్రము చెప్పుచున్నది ఈ సూత్రమున 'జాతిపరిప్రశ్నే' అనునది తీసివేయఁదగునని భాష్యకారులు చెప్పిరి కావున జాతిని ప్రశ్నించుటయే కాక నామాదులను ప్రశ్నించుటయందును ఈ ప్రత్యయము రావచ్చును.

ఉదా : కిమ్+డతమచ్ (డకారచకారములిత్తులు) కిమ్ + అతమ, టిలోపము క్ + అతమ = కతమ + సు = కతమః యద్ + సు=డతమచ్ య్+ అతమ=యతమ + సు = యతమః, తద్ + సు+డతమచ్, త్ + అతమ = తతమ + సు=తతమః.

కతమో భవతాం కఠః? =మీలో ఎవఁడు కఠశాఖకు చెందినవాఁడు? కఠశాఖనధ్యయనము చేయువారందఱు నొకజాతి. కావున నిచట జాతిప్రశ్నమున్నది యతమో భవతాం కఠః సదేవదత్తః-మీలోనెవఁడు కఠశాఖకు చెందినవాఁడో వాఁడు దేవదత్తుడు. భవతాంతతరః కఠః. మీలోవాఁడు కఠుఁడు. 'జాతిపరిప్రశ్నే' అనుదానిని తొలగింపవచ్చుననుటవలన 'భవతాం కతమోదేవదత్తః' - మీలో నెవఁడు దేవదత్తుఁడు ఇత్యాది విధముగను ఉండవచ్చును.

సూత్రమున 'వా' అనుపదమును గ్రహించుటవలన నిదివైకల్పికము కావున రానిచో నీయర్థమున 'అకచ్' ప్రత్యయము వచ్చును.

ఉదా : య్+అక్+అద్=యకద్ + సు, త్యదాదీనామః అనుసూత్రముచే దకారమున కకారాదేశము, పరరూపసంధి యక + సు=యకః. త్ అక్ +అద్ = తకద్ + సు, త్యదాద్యత్వము, పరరూపసంధి, తక + సు (తదోస్సస్సావనన్త్యయోః 7-2-106) త్యదాదుల అనంత్యములైన తకారదకారములకు సకారము సు ప్రత్యయము పరమగునపుడు అగును). సక + సు=సకః.

ఇది ప్రాగివీయ ప్రకరణము.

ప్రకరణావలోకనము : అనేకులలో నొకని ఆధిక్యమును దెలుపునపుడు వచ్చు తమప్, ఇష్ఠన్ ప్రత్యయములును, ఇద్దఱిలో నొకని అతిశయమును

దెలుపు నపుడువచ్చు తరప్, ఈయసున్ ప్రత్యయములును ఇందు ముందు తెలుపఁబడినవి ఆ ప్రత్యయాంతములకు కొన్నియెడల వచ్చు 'అమ్' ప్రత్యయము విధింపఁబడినది. ఇష్ఠన్, ఈయసున్ ప్రత్యయములు పరములగునపుడువచ్చు కార్యవిశేషములు- శ్ర, జ్య ఆదేశములు, ఈయస్ ప్రత్యయములోని ఈకారమున కాకారాదేశము, బహుశబ్దమునకు పరముగా ఆ ప్రత్యయముల తొలిఅచ్చులకు లోపము వచ్చుట మున్నగునవియు నిందు చెప్పఁబడినవి. కొంచెము తక్కువ అనునర్థమును తెలుపు కల్పప్, దేశ్య, దేశీయర్ ప్రత్యయములును, బహుచ్ ప్రత్యయమును ఇందు విధింపఁబడినవి క, అకచ్ ప్రత్యయములు అజ్ఞాత, కుత్సితార్థములందు ప్రదర్శింపఁబడినవి ఇరువురిలో నొకనిని నిర్ధరించుట యనునర్థమున వచ్చుడతరచ్ ప్రత్యయమును, అనేకులలో నొకనిని నిర్ధరించుటయను నర్థమున వచ్చుడతమచ్ ప్రత్యయమును సోదాహరణముగ ప్రదర్శింపఁబడినవి.

అథ స్వార్థిక ప్రకరణమ్.

అవ : స్వార్థమనగా తనయొక్క అర్థము. ప్రకృతియొక్క అర్థముకంటె భిన్నము కాని యర్థమును ఇట స్వార్థమందురు అట్టి యర్థమునందు విధింపఁబడు ప్రత్యయములు గల ప్రకరణమగుటచే దీనికి స్వార్థికప్రకరణమని పేరు.

సూ : ఇవే ప్రతికృతౌ 5-3-96

వృ : కన్ స్యాత్. అశ్వ ఇవ ప్రతికృతిః అశ్వకః.

ప. వి : ఇవే (7-1) ప్రతికృతౌ (7-1).

అను : కన్ (1-1) తద్ధితః (1-1) ప్రత్యయః (1-1).

అర్థ : ఇవార్థమున వర్తమానమగు ప్రాతిపదికమునకు ప్రతికృతి గమ్యమానమగునపుడు 'కన్' ప్రత్యయము వచ్చును ఉదా: అశ్వమువంటి ప్రతికృతి(బొమ్మ) అశ్వకః.

వివ : 'ఇవ' అనునది పోలికను దెలియఁజేయును. ప్రతికృతి యనఁగా మట్టి మున్నగువానితో చేయఁబడిన ప్రతిమ. ఉపమానవాచకములకు, పరముగా, ఉపమేయమగు ప్రతికృతిని తెలియఁజేయుచు కన్ ప్రత్యయము చేరును. ఇందు నకారమిత్తు. ఉదా : అశ్వ ఇవ ప్రతికృతిః - అశ్వమువంటి ప్రతిమ. అశ్వ + సు + కన్, విభక్తిలోపము. అశ్వక + సు=అశ్వకః. స్వార్థికప్రత్యయములు ప్రకృతిననుసరించియే లింగవచనములను పొందును (స్వార్థికాః ప్రకృతితో లింగవచనాన్య నువర్తన్తే) అనున్యాయము ననుసరించి 'అశ్వక' శబ్దము 'ప్రతికృతి' అను స్త్రీలింగశబ్దమును చెప్పునది అయినను ప్రకృతియగు 'అశ్వ' శబ్దమును బట్టి పుంలింగమైనది.

వా॥ సర్వప్రాతిపదికేభ్యః స్వార్థే కన్.

వృ : అశ్వకః.

ప వి : సర్వప్రాతిపదికేభ్యః (5-3) స్వార్థే (7-1) కన్ (1-1).

అర్థ : సర్వప్రాతిపదికములకును స్వార్థమున 'కన్' ప్రత్యయము వచ్చును. ఉదా : అశ్వకః.

వివ : ప్రాతిపదికములన్నింటికిని విశేషార్థమును దేనిని స్ఫురింపఁజేయకయే దానికి సహజముగాఁ గల అర్థమునందే 'కన్' అను ప్రత్యయము రావచ్చును,

ఉదా : అశ్వ ఏవ అశ్వకః. అశ్వమనగా నేమి యర్థమో అశ్వకమనినను అదియ యర్థము. అశ్వ + కన్ (నకారమిత్తు) అశ్వకః.

సూ : తత్ప్రకృతవచనే మయట్ 5-4-21.

వృ : ప్రాచుర్యేణ ప్రస్తుతం ప్రకృతమ్; తస్యవచనం ప్రతిపాదనమ్. భావేఽధికరణే వా ల్యుట్. ఆద్యే. ప్రకృతమన్నమన్నమయమ్; అపూపమయమ్ ద్వితీయేతు-అన్నమయో యజ్ఞః; అపూపమయం పర్వ

ప. వి . తత్ (1-1) ప్రకృతవచనే (7-1) మయట్ (1-1)

అను : తద్ధితః (1-1) ప్రత్యయః (1-1).

అర్థ : ఆధిక్యముతో ప్రస్తుతమైనది ప్రకృతము. వచనమనగా దానియొక్క ప్రతిపాదనము ప్రకృతము ప్రతిపాదింపఁబడునపుడు ప్రథమాంతములకు 'మయట్' ప్రత్యయము వచ్చును. ఇందు వచనమనునది భావమునఁగాని అధికరణార్థమునఁగాని వచ్చిన ల్యుట్ ప్రత్యయమంతమునఁగలరూపము. మొదటిపక్షమున ప్రకృతమన్నమన్నమయమ్, అపూపమయమ్ మున్నగువిధముగానగును. రెండవపక్షమున నైనచో అన్నమయో యజ్ఞః. అపూపమయం పర్వ అను విధముగా నగును.

విప : 'తత్' అనునది యిట విధింపఁబడిన ప్రత్యయము ప్రథమావిభక్త్యంతములకు పరముగా చేయుటను సూచించును. ప్రకృతవచనము అనుదానికి ప్రకృతముయొక్క వచనము అని యర్థము. ప్రకృతమనగా అధికరూపమున ఉపస్థితమైనది= కూడి ఉన్నది అని యర్థము. వచనము అనునది 'వచ్' ధాతువునకు ల్యుట్ ప్రత్యయము రాఁగా నేర్పడిన రూపము. ఇచటి ల్యుట్ ప్రత్యయము భావార్థమునఁ గాని, అధికరణార్థమునఁగాని వచ్చినదిగా భావింపనగును. భావార్థమైనచో వచనమనగా ప్రతిపాదనము = ప్రతిపాదించుట. ప్రకృతమును ప్రతిపాదించుట యనగా అధికముగా ఉపస్థితమైన వస్తువుయొక్క స్థితిని తెలుపుట - అట్లు తెలుపునపుడు ప్రథమాంతపదమునకు 'మయట్' ప్రత్యయము చేరును.

ఉదా : ప్రకృతమన్నమ్ = అధికముగా ఉపస్థితమైన (ఉన్న) అన్నము - అన్న + సుః మయట్ (టకారమిత్తు) విభక్తిలోపము. అన్నమయ + సు=అన్నమయమ్, ఇచట అన్నము అధికముగా నుండుటను మయట్ ప్రత్యయము వ్యక్తము చేయుచున్నది. ఇట్లే ప్రకృతమపూపమ్ - అధికముగా ఉపస్థితమైన అపూపము (భక్ష్యము) అపూప + సు, మయట్ - అపూపమయ + సు = అపూపమయమ్.

వచనమ్ అనుచోట అధికరణార్థమును భావించినచో ప్రకృష్యుచ్యతే = ప్రతిపాద్యతే యస్మిన్ తత్ ప్రకృతవచనమ్-ప్రకృతమైనది దేనియందు ఉన్నదని చెప్పఁబడునో అది ప్రకృత వచనము అనునర్థము సిద్ధించును. దీనినిబట్టి ప్రకృతమైన (అధికముగా ఉపస్థితమైన) వస్తువు దేనియందుఁగలదని వచింతుమో దానిని (ఆ అధికరణమును) తెలుపుచు వస్తువాచక ప్రథమాంతమునకు పరముగా మయట్ ప్రత్యయము వచ్చును.

ఉదా : ప్రకృత మన్నం యస్మిన్ = దేనియందు అధికముగా సమకూడిన అన్నముగలదో అది. అన్న + సు, మయట్, విభక్తిలోపము. అన్నమయ+ సు=అన్నమయః యజ్ఞః. ఇచట ప్రత్యయము అధికరణమైనదానిని బోధించుచున్నది కాన ఈ పక్షమున నిది స్వార్థిక ప్రత్యయము కాఁజాలదు. అయినను సాధారణముగా స్వార్థమునందే ప్రత్యయములు విధింపఁబడును. క్వాచిత్కముగా ఇతరార్థములందును రానగునని సంభావింపవలయును.

ఇట్లే ప్రకృతాని అపూపాని యస్మిన్ - పర్వణి అధికములైన అపూపములెందుఁ గలవో ఆపర్వము. అపూప + జస్, మయట్, విభక్తిలోపము, అపూపమయ + సు = అపూపమయమ్. అధికరణవాచకమగు పర్వశబ్దము నపుంసకము కావున నిదియు నపుంసకమైనది.

భావార్థమున మయట్ప్రత్యయాంతమునకు సామాన్యమైన నపుంసకత్వము కలుగును.

సూ : ప్రజ్ఞాదిభ్యశ్చ 5-4-38.

వృ : అణ్ స్యాత్. ప్రజ్ఞ ఏవ ప్రాజ్ఞః, దైవతమ్.

ప. వి : ప్రజ్ఞాదిభ్యః (5-3) చ (అవ్య).

అను : అణ్ (1-1).

అర్థ : ప్రజ్ఞమున్నగువానికి స్వార్థమున అణ్ ప్రత్యయము వచ్చును.

ఉదా : ప్రాజ్ఞః, దైవతమ్.

వివ : ప్రకృతియొక్క అర్థముకంటె భిన్నము కాని అర్థమునందు, ప్రజ్ఞమున్నగుశబ్దములకు అణ్ ప్రత్యయము చేరును. అనగా అణ్ ప్రత్యయము రాకముందు ప్రజ్ఞాదుల కేయర్థముండునో వచ్చిన తరువాతకూడ ఆ యర్థమే యుండునని తాత్పర్యము.

ఉదా : ప్రజ్ఞ ఏవ ప్రాజ్ఞః-ప్రజ్ఞ + అణ్, ఆదివృద్ధి, ప్రాజ్ఞ + అ, యస్యేతి చ - అకారలోపము, ప్రాజ్ఞ్ + అ=ప్రాజ్ఞ + సు=ప్రాజ్ఞః-ప్రాజ్ఞః-ప్రాజ్ఞ డాగుగా తెలిసినవాఁడు.

దేవతా + అణ్, ఆదివృద్ధి, దైవతా+అ, యస్యేతిచ - అకారలోపము - దైవత+సు=దైవతమ్ (ఈ శబ్దము పుంనపుంసకములలో నుండును)

ప్రజ్ఞాదిగణము : ప్రజ్ఞ వణిజ్ ఉశిజ్ ఉష్ణిజ్ ప్రత్యక్ష [విద్వస్] విదస్ షోడస్ విద్యా మనస్. 'శ్రోత శరీరే' 145. జుహ్వత్. కృష్ణమృగే 146. చికీర్షత్ చోర శత్రు యోధ చక్షుస్ వసు (ఏనస్) మరుత్ క్రుఞ్చ సత్వన్తు దశార్హ వయస్ (వ్యాకృత) అసుర రక్షస్, పిశాచ, అశని, కార్షాపణ దేవతా బన్ధు-ఇతి ప్రజ్ఞాదిః.

సూ : బహ్వల్పార్థాచ్ఛస్కారకాదన్యతరస్యామ్ 5-4-42.

వృ : బహూని దదాతి బహుశః, అల్పశః.

ప. వి : బహ్వల్పార్థాత్ (5-1) శస్ (1-1) కారకాత్ (5-1) అన్యతరస్యామ్ (అవ్య).

అర్థ : కారకసంజ్ఞగల బహు, అల్ప అనునర్థముగలశబ్దములకు 'శస్' అను ప్రత్యయము వైకల్పికముగా నగును. ఉదా : బహుశః, అల్పశః.

వివ : బహ్వల్పార్థకములై కారకసంజ్ఞగల శబ్దములకు పరముగా శస్ ప్రత్యయము వైకల్పికముగా నగును. కారకములనగా కర్మాదులు. క్రియతో నన్వయించునవి.

ఉదా : బహూనిదదాతి అనేకముల నిచ్చుచున్నాఁడు ఇచ్చుట అను వ్యాపారములో 'బహూని' అనునది కర్మవాచకము కాన కారకము బహు + శస్ + శస్ (మొదటిశస్ అనునది ద్వితీయాబహువచనప్రత్యయము. రెండవది తద్ధితము) విభక్తిలోపము. బహుశస్ ఇది అవ్యయమగును. కావున దీనికిచేరిన సుప్పునకు లుక్కువచ్చును. సకారమునకు రుత్వవిసర్గములు. బహుశః. ఇట్లే అల్పానిదదాతి- అల్ప + శస్ + శస్ - అల్ప + శస్=అల్పశః.

వా : ఆద్యాదిభ్య స్తసే రుపసంఖ్యానమ్ 3339.

వృ : ఆదౌ ఆదితః, మధ్యతః, అన్తతః, పృష్ఠతః, పార్శ్వతః. ఆకృతిగణోఽయమ్, స్వరేణ-స్వరతః, వర్ణతః.

28

వ. వి : అద్యాదిభ్యః - (5-3) తసేః (6-1) ఉపసంఖ్యానమ్ (1-1).

అర్థ : అద్యాది శబ్దములకు పరముగా 'తసి' ప్రత్యయమును చెప్పవలెను. ఉదా : ఆదితః మొ॥వి. ఇది ఆకృతిగణము. కాన స్వరేణ-స్వరతః, వర్ణతః మున్నగునవియగును.

వివ : ఆదిమున్నగు శబ్దములకు అన్ని విభక్తుల యర్థములందును 'తసి' ప్రత్యయము వచ్చును. ఇందు తుది ఇకారము ఉచ్చారణార్థకము.

ఉదా : ఆదౌ - ఆదియందు - ఆది + తస్ = ఆదితస్ = ఇది అవ్యయము. కావున సుప్పులు చేరి లోపించును. సకారమునకు రుత్వవిసర్గములు ఆదితః- ఇది సప్తమీ విభక్త్యర్థమున వచ్చినది. ఇట్లే, మధ్యే - మధ్యతః-మధ్యయందు, పృష్ఠే - పృష్ఠతః = పృష్ఠముపైపు; పార్శ్వే = పార్శ్వతః - పార్శ్వమునందు మున్నగునవి. అద్యాదిగణము ఆకృతిగణము. దానిచే విభక్త్యర్థమున 'తస్' ప్రత్యయము చేరిన వానికన్నింటికిని ఈ వార్తికమే గతియని తాత్పర్యము. ఉదా : స్వరేణ - స్వర + తస్=స్వరతః-స్వరముచేత ఇట తసిప్రత్యయము తృతీయా విభక్త్యర్థకము. ఇట్లే వర్ణేన - వర్ణతః-వర్ణముచేత మొ॥వి.

అద్యాదిగణము : ఆది మధ్య అన్త పృష్ఠ పార్శ్వ - ఇత్యాద్యాదిః - ఆకృతిగణః.

సూ : కృభ్వస్తియోగే సంపద్యకర్తరి చ్విః 5-4-50.

వా॥ అభూతతద్భావ ఇతి వక్తవ్యమ్ (3340).

వృ : వికారాత్మతాం ప్రాప్నువత్యాం ప్రకృతౌ వర్తమానాద్వికారశబ్దాత్ స్వార్థే చ్విర్వాస్యాత్ కరోత్యాదిభిర్యోగే.

వ. వి : కృభ్వస్తియోగే (7-1) సంపద్యకర్తరి (7-1) చ్విః(1-1) అభూత తద్భావే (7-1) ఇతి (అవ్య) వక్తవ్యమ్ (1-1).

అను : వా (అవ్య).

అర్థ : కృ, భూ, అస్, ధాతువులతో యోగమున్నపుడు వికారాత్మత్వమును పొందుచున్న ప్రకృతియందు వర్తమానమగు వికారవాచకమునకు పరముగా 'చ్వి' ప్రత్యయము వైకల్పికముగా నగును.

వివ : సంపద్యకర్త అనగా సంపద్యముయొక్క కర్త అనియర్థము. సంపద్యమనగా అయినది, ఏర్పడినది, సాధింపబడినది అనియర్థము. అట్లు సాధింపబడిన

దానియొక్క కర్తను సంపద్యకర్త యందురు. ఏది ఏదిగా సాధింపఁబడినది? అను ఆకాంక్షకు సమాధానముగా వార్తికకారులు 'అభూతతద్భావే' అని చెప్పిరి. ఇదివఱకు ఆ విధముగా లేనిది ఆ విధముగానగుట యీ పదమున కర్థము. ఒకవస్తువు తనకు పూర్వములేని రూపము ఇప్పుడు పొందుట అని తాత్పర్యము. వికారాత్మతను పొందిన = పూర్వము తనకులేనిరూపమును పొందిన, ప్రకృతియందు=మూలపదార్థమును చెప్పుటయందు, వర్తమానమగు=ఉండు; వికారవాచకశబ్దమునకు=మార్పు చెందినదానిని వచించు శబ్దమునకు పరముగా 'చ్వి' ప్రత్యయము వచ్చును.

ఈ ప్రత్యయము ప్రకృతివాచకమునకు (మార్పుచెందని స్థితిలో నున్నదానిని వచించుదానికి) రాదు. వికారవాచకమునకు (మార్పుచెందిన దాని వచించుదానికి) వచ్చును. ఇట్లనుటలో వ్యాఖ్యానమే శరణ్యము.

ఉదా : అకృష్ణః కృష్ణః సంపద్యతే-ఇదివఱకు కృష్ణవర్ణముగా లేనిది ఇప్పుడు కృష్ణవర్ణము గలదిగా నేర్పడుచున్నది. ఒకవస్తువు పూర్వము నల్లగా లేదు. ఇప్పుడు నల్లగా అగుచున్నది. ప్రకృతి నల్లగాలేని ఆ వస్తువు. వికారాత్మతను పొందినది నల్లగానైన ఆ వస్తువు. కృష్ణః అను వికారస్వరూపమును పొందినదానిని వచించు పదము లక్షణార్థముచే ప్రకృతియగు 'అకృష్ణః' అనుదానియర్థము నొసఁగును. ఇట్టి యర్థమునందు కృష్ణశబ్దమునకు 'చ్వి' ప్రత్యయము వచ్చునని తాత్పర్యము.

ఈ ప్రత్యయమున చకారమిత్తు (చుటూ). ఇకారముచ్చారణార్థకము. 'వ్' అనుదానికి 'వేరపృక్తస్య' అనుసూత్రముచే లోపము వచ్చును. ఇట్లే ప్రత్యయము సర్వలోపి. అయినను దీనిని నిమిత్తముగా చేసికొని కొన్నికార్యవిశేషములు జరుగును. అవి క్రింద చెప్పఁబడుచున్నవి.

సూ : అస్య చ్వౌ 7-4-32.

వృ : అవర్ణస్య ఈత్ స్యాచ్చ్వౌ. అకృష్ణః కృష్ణః సమ్పద్యతే, తంకరోతి కృష్ణీకరోతి; బ్రహ్మీభవతి, గఙ్గీస్యాత్.

ప. వి : అస్య (6-1) చ్వౌ 7-1.

అను : ఈ (1-1).

అర్థ : చ్వి ప్రత్యయము పరమగునపుడు అకారమునకు ఈత్వము వచ్చును. ఉదా : కృష్ణీకరోతి ఇత్యాది.

వివ : చ్వి ప్రత్యయము పరమగునపుడు అవర్ణముయొక్క స్థానమున దీర్ఘ ఈకారము వచ్చును.

ఈ ప్రత్యయము కృ = చేయు, భూ=ఉండు, అగు, అస్=ఉండు, అను ధాతువులతో సంబంధమున్నపుడే వచ్చును. వానికి క్రమముగా ఉదాహరణములు.

అకృష్ణం కృష్ణంకరోతి - కృష్ణము కానిదానిని కృష్ణముగా చేయుచున్నాడు కృష్ణ + సు + చ్వి, విభక్తిలోపమునకు అకారమునకు ఈకారాదేశము కృష్ణ + ఈ= కృష్ణీ' చ్వి ప్రత్యయము సర్వలోపి కావున 'కృష్ణీ' అనియగును. ఇది అవ్యయము - కృష్ణీకరోతి - కృష్ణవర్ణముగా లేనివానిని వేషాదులచేత కృష్ణవర్ణము గలవానినిగా చేయుచున్నాఁడని యర్థము. ఇచట అకృష్ణుఁడనగా కృష్ణుఁడుకాని నటుఁడు. అతఁడు ప్రకృతిభూతుఁడు. అతఁడు కృష్ణభావమను వికారమును పొంది అట్లగుటవలన సంపద్యకర్తయగును. ఇట్లు వికారమును పొందినవానిని తెలుపు 'కృష్ణః' అనునది, ప్రకృతియగు అకృష్ణుని అభేదారోపము (భేదములేదని చెప్పుట)చే చెప్పుచున్నది అట్టి కృష్ణశబ్దమునకు 'చ్వి' ప్రత్యయ మయ్యెనని తెలియఁదగును.

అబ్రహ్మ బ్రహ్మ సంపద్యమానంభవతి - పూర్వము బ్రహ్మము కానిది బ్రహ్మముగా నగుచున్నది. బ్రహ్మ + సు, చ్వి, విభక్తిలోపము, అకారమునకు ఈకారాదేశము బ్రహ్మ + ఈ = బ్రహ్మీ+సు= బ్రహ్మీ భవతి.

అగఙ్గా గఙ్గా సంపద్యమానా స్యాత్-గంగగానిది గంగగా అగును. గఙ్గా + చ్వి, ఈకారాదేశము గఙ్గీ స్యాత్.

అవ : అస్య చ్వౌ అనుసూత్రమున కొక అపవాదము వీక్రింది వార్తికము చెప్పుచున్నది.

వా॥ అవ్యయస్య చ్వా వీత్వం నేతివాచ్యమ్ (5052).

వృ : దోషాభూతమహః, దివాభూతా రాత్రిః.

ప వి : అవ్యయస్య (6-1) చ్వౌ (7-1)ఈత్వమ్ (1-1) న (అవ్య) ఇతి (అవ్య) వాచ్యమ్ (1-1).

అర్థ : అవ్యయమునకు చ్వి ప్రత్యయము పరమగునపుడు ఈత్వము రాదని చెప్పనగును. ఉదా : దోషాభూతమహః, దివాభూతారాత్రిః.

వివ : 'అస్య చ్వౌ' అనుసూత్రముచే విధింపఁబడిన ఈకారాదేశము అవ్యయముల తుది అకారమునకు రాదని తాత్పర్యము.

ఉదా : అదోషాదోషాసంపద్యమానం భూతమ్.-రాత్రికానిది రాత్రి గానయి నది. 'దోషా' శబ్దము రాత్రి అనునర్థముగల అవ్యయము. దోషా + చ్వి-దోషా.

ఈత్వమురాలేదు, దోషాభూతమ్ అహః=రాత్రి గానయిన పగలు. మేఘాదులచే గాఢముగా నావరింపఁబడి చీకటిగానైన పగటిభాగమని దీనికర్థము.

అదివా దివా సంపద్యమానం-పగలుకానిది పగలు గానయినది దివా + చ్వి-దివా, ఈత్వము రాలేదు. దివాభూతా (కుగతిప్రాదయః అనుసూత్రముచే సమాసము) రాత్రిః - పగటివలెనైన రాత్రి. అతిశయమైన దీపములకాంతిచే పగటివలె భాసిల్లు రాత్రియని యర్థము.

సూ : విభాషా సాతి కార్త్స్న్యే (5-4-52.)

వృ : చ్వి విషయే సాతిర్వాస్యాత్ సాకల్యే.

ప వి : విభాషా (1-1) సాతి (ప్రథమలోపించిన పదము) కార్త్స్న్యే (7-1)

అను : కృభ్వస్తియోగే (7-1) సంపద్యకర్తరి (7-1)

అర్థ : చ్విప్రత్యయము వచ్చు విషయమున సాకల్యము గమ్యమానమగు నపుడు 'సాతి' అను ప్రత్యయము వచ్చును.

వివ : కృత్స్నము యొక్క భావము కార్త్స్న్యము. అనగా సాకల్యము = పూర్తి అని యర్థము. అది చెప్పవలసి వచ్చినపుడు కృ, భూ, అస్ ధాతువులతో యోగమున్నపుడు అభూతతద్భావముగల సంపద్యకర్త్రర్థమున 'సాతి' ప్రత్యయము వచ్చును. ఉదాహరణము ముందు సూత్రమునఁ జూపఁబడుచున్నది. (సాతి ప్రత్యయమున ఇకారముచ్చారణార్థకము).

సూ : సాత్పదాద్యోః 8-3-111.

వృ : సస్య షత్వం న. దధిసించతి, కృత్స్నంశస్త్రం అగ్నిస్సంపద్యతే అగ్నిసాద్భవతి.

ప. వి : సాత్పదాద్యోః 6-2.

అను : మూర్ధన్యః (1-1) న (అవ్య) సః (6-1).

అర్థ : పదాది సకారమునకును, సాత్ప్రత్యయసకారమునకును షత్వమురాదు.

ఉదా : దధిసించతి. అగ్నిసాద్భవతి.

వివ : 'ఆదేశప్రత్యయయోః' అను సూత్రముచే ప్రాప్తమగు షత్వమునకు ఇది నిషేధము. ఇణ్వర్ణములకును, కవర్గమునకును పరముగానున్న ఆదేశ ప్రత్యయముల సకారమునకు షత్వము రావలసియున్నది. అట్టి సకారము పదము యొక్క ఆదివర్ణమైనయెడలను, 'సాత్' ప్రత్యయసంబంధమైన యెడలను షత్వము రాదని సూత్రార్థము.

ఉదా : పదాది సకారమునకు : 'దధిసించతి' - 'సించతి'లోని సకారము ఆదేశ రూపమైనది - 'షిచ' అను ధాతువునందు 'ధాత్వాదేః షః సః' అను సూత్రముచే షకారమునకు సకారమాదేశమైనది. సించతి' అనునది యీ ధాతువుయొక్క రూపము. ఇందు సకారము పదముయొక్క ఆదివర్ణము కావున షత్వమీసూత్రముచే నిషేధింపబడినది. దధిసించతి.

సాత్ప్రత్యయమున కుదాహరణము, కృత్స్నంశస్త్రమగ్నిస్సంపద్యతే. శస్త్ర మంతయును అగ్నిగా అగుచున్నది, శస్త్రమనునది అగ్నిగా మారుట అను దానిని ఇట్టి అంతయును అనునర్థము కలదు కావున 'విభాషాసాతి కార్త్స్న్యే' అను సూత్ర ముచే అగ్నిశబ్దమునకు సాతి ప్రత్యయము. అగ్ని+సు+సాత్ (ఇ) విభక్తి లోపము అగ్నిసాత్. ఇట షత్వమీ సూత్రముచే నిషేధింపబడినది (ఇది ప్రత్యయ సకారము కావున 'ఆదేశప్రత్యయయోః' అను సూత్రముచే షత్వము ప్రాప్తమగు చున్నది) అగ్నిసాత్ - ఇది అవ్యయము. దీనికి పరముగా చేరిన సుప్పునకు లుక్కువచ్చును. ఇదిపదమగును. అగ్నిసాద్భవతి.

సాతి ప్రత్యయము పైకల్పికము నావున రానిచో చ్విప్రత్యయము వచ్చును. 'అగ్ని + చ్వి' అనియుండ క్రిందిసూత్రముచే కార్యమొకటి వచ్చుచున్నది.

సూ : చ్వౌ చ 7-4-26.

వృ : దీర్ఘః స్యాత్. అగ్నీభవతి.

ప. వి : చ్వౌ (7-1) చ (అవ్య).

అను : దీర్ఘః (1-1).

అర్థ : చ్వి ప్రత్యయము పరమగునప్పుడు పూర్వమునకు దీర్ఘము వచ్చును.
ఉదా : అగ్నీభవతి.

వివ : అగ్ని + చ్వి అనియుండ ప్రకృతసూత్రముచే విధింపఁబడిన దీర్ఘము 'అలోఽన్త్యస్య' అను పరిభాషచే అంత్యాక్షరమగు ఇకారమునకు వచ్చును అగ్నీ (చ్విప్రత్యయము సర్వలోపి) ను ప్రత్యయము చేరి అదృశ్యమగును, 'అగ్నీ భవతి.

సూ : అవ్యక్తానుకరణాద్ద్వ్యజవరార్ధాదనితౌ డాచ్ 5-4-57.

వృ : ద్వ్యజవరం న్యూనం, నతు తతో న్యూనమ్; అనేకాజితి యావత్. తాదృశమర్ధం యస్య తస్మాడ్డాచ్ స్యాత్ కృభ్వస్తిభి ర్యోగే.

ప వి : అవ్యక్తానుకరణాత్ (5-1) ద్వ్యజవరార్ధాత్ (5-1) అనితౌ (7-1) డాచ్ (1-1)

అను : కృభ్వస్తియోగే (7-1) తద్ధితః (1-1) ప్రత్యయః (1-1).

అర్థ : అవ్యక్తధ్వనిననుకరించునదియు, కనీసము రెండచ్చులు అర్ధభాగముగాఁ గలదియు నగుశబ్దమునకు, ఇతిశబ్దము పరముగా లేనిచో, డాచ్ ప్రత్యయము వచ్చును.

వివ : అకారాదివర్ణములు స్పష్టముగా గుర్తించుటకు వీలులేనిది అవ్యక్తము. కుండలు మొదలుగునవి దొరలిపడునపుడు వచ్చుధ్వనివంటిదని యర్థము. దానిని కొన్ని వర్ణములసముదాయముతో ననుకరింతుము. ధామ్, పటత్, ఫట్ మున్నగునవి. ఇట్టిది ద్వ్యజవరార్ధముకావలయును. ద్వ్యచ్ = రెండచ్చులుగలది, అవరము = న్యూనము, తక్కువ; అర్ధము = సగము. ఇచట ద్వ్యజవర అనుదానికి రెండు అచ్చులకంటె తక్కువగలది అనునర్థము సంభావింపరాదు. రెండు అచ్చులు తక్కువగాఁ గలది. కనీసము రెండచ్చులు గలది అనునర్థమును గ్రహింపవలయును. అట్టి అర్థముగలది కావలయును. అనగా అవ్యక్తానుకరణశబ్దముయొక్క సగభాగమునందు కనీసము రెండచ్చులుండవలయునని ఫలితార్థము. అట్టిదానికి, 'ఇతి' అను శబ్దము పరముగా లేనియపుడు, డాచ్ అను ప్రత్యయము వచ్చును. ఈ ప్రత్యయమున డకారచకారము లితులు.

అవ : దీని కనుబంధముగా ఈ క్రింది వార్తికము చెప్పఁబడుచున్నది.

వా : డాచి వివక్షితే ద్వే బహులమ్ 4661.

వృ : ఇతి డాచి వివక్షితే ద్విత్వమ్.

ప. వి : డాచి (7-1) వివక్షితే (7-1) ద్వే (1-2) బహుళమ్ (2-1).

అర్థ : డాచ్ ప్రత్యయము వివక్షింపఁబడునపుడు ద్విత్వమగును.

వివ : వివక్షితమనఁగా వివక్షింపఁ బడినది. వివక్షయనగా చెప్పఁగోరుట. ఒక పదమునకు 'డాచ్' ప్రత్యయము విధింపవలయునను ఉద్దేశమున్నపుడు ఆపదము రెండుమాఱు లుచ్చరింపఁబడునని తాత్పర్యము.

'పటత్' ఇది అవ్యక్తానుకరణశబ్దము కాని యిందు అర్ధభాగమున రెండచ్చులు లేవు కావున దీనికి డాచ్ ప్రత్యయము రాదు కాని డాచ్ ప్రత్యయము దీనికి చేర్పవలయునను నిచ్చయున్నపుడు ఇది ద్విరుక్తమగును పటత్. పటత్ అప్పుడు ఇందు సగభాగమగు 'పటత్' అనుదానిలో రెండచ్చులుగలవు కావున పటత్ పటత్ అనుదానికి పరముగా 'డాచ్' ప్రత్యయము పైసూత్రముచే వచ్చును. 'పటత్ పటత్ + డాచ్'

వా॥ నిత్యమామ్రేడితే డాచీతి వక్తవ్యమ్ 3638.

వృ : డాచ్పరం యదామ్రేడితం తస్మిన్ పరే పూర్వపరయో ర్వర్ణయోః పరరూపం స్యాత్. ఇతితకారపకారయోః పకారః. పటపటాకరోతి.

ప. వి : నిత్యమ్ (2-1) ఆమ్రేడితే (7-1) డాచి (7-2) వక్తవ్యమ్ (1-1).

అర్థ : డాచ్ ప్రత్యయము పరమునఁగల ఆమ్రేడితము పరమగునపుడు పూర్వపర స్థానములనున్న వర్ణద్వయమునకు పరవర్ణ మేకాదేశమగును. ఉదా : పటపటాకరోతి.

వివ : ఇది పరరూప సంధి ప్రకరణములో చెప్పఁబడిన వార్తికము. కావున పూర్వపర వర్ణములకు పరరూపమేకాదేశమగు నమనర్థము వచ్చినది. డాచ్ ప్రత్యయము పరముగానున్న ఆమ్రేడితము పరమైనపుడు పూర్వమున నున్నశబ్దస్వరూపము యొక్క తుదివర్ణమునకును, పరముగానున్న ఆమ్రేడితముయొక్క తొలివర్ణమునకును, పరవర్ణ మేకాదేశమగునని తాత్పర్యము. ఆమ్రేడితమనగా ద్విరుక్తము యొక్క పరరూపము.

పటత్ + పటత్ + డాచ్, ఇందు మొదటి పటత్‌లోని తకారమునకును, తరువాతి పకారమునకును పకారమేకాదేశమై పటపటత్ + డాచ్ అగును. పట పటత్ + డాచ్, డిత్తుపరముగా నుండుటచే టిలోపము, పటపట్ + అ=పటపటా, ఇది అవ్యయము. కావున దీనికి చేరు సుప్పులు లోపించును పటపటా కరోతి (పటత్, పటత్ అను అవ్యక్త ధ్వనిచేయుచున్నది)

అవ : అవ్యక్తానుకరణాదిత్యాది సూత్రమునందలి దళముల సార్థక్యము విచారింపఁబడుచున్నది.

వృ : అవ్యక్తాను కరణాత్కిమ్? దృషదత్కరోతి. ద్వ్యజవరార్ధాత్కిమ్? అత్కరోతి. అవరేతికిమ్? ఖరటఖరటా కరోతి. అనితౌ కిమ్? ఖటితి కరోతి.

వివ : డాచ్ ప్రత్యయము అవ్యక్తానుకరణశబ్దములకే వచ్చునసుటచే 'దృషద్' అనునది అట్టిదికాదు. కావ దీనికి డాచ్ ప్రత్యయమురాదు. దృషద్ అనునది అరవంతమగుశబ్దము.

అవ్యక్తానుకరణమేయైనను కనీసము రెండచ్చులుగలసగభాగముండవలయుననుటచే 'అత్' అనుదానికి డాచ్ ప్రత్యయమురాదు. దీని యందొక యచ్చేయున్నది.

కనీసము రెండచ్చులుండవలయుననుటచే అంతకంటె ఎక్కువ అచ్చులున్నపుడును ఈడాచ్ ప్రత్యయము వచ్చును. 'ఖరటత్' ఇందు మూఁడచ్చులు గలవు. ద్విత్వము వచ్చినపుడు సగభాగమున మూఁడచ్చులుండును. ఖరటత్ ఖరటత్ + డాచ్, ఖరటఖరటత్ + అ, ఖరట ఖరటాకరోతి (పరరూపము, టిలోపము). సూత్రమున 'అవర' అనుపదములేనిచో రెండచ్చులు గలసగభాగమే యుండవలయునను వర్థము వచ్చును. అప్పుడు ప్రకృతోదాహరణమున డాచ్ ప్రత్యయము రాకపోవును. కావున అవరశబ్దము సార్థకము.

'ఇతి' పరమగునపుడు డాచ్ ప్రత్యయము రాదు. పటత్ ఇతికరోతి-అన్నిలక్షణములు సరిపడియున్నను, ఇతిశబ్దము పరమైనది కావున నిచట డాచ్ ప్రత్యయము రాలేదు. పటత్ + ఇతి అనియుండ 'అవ్యక్తానుకరణస్యాత ఇతౌ' (6-1-98) (అవ్యక్తానుకరణశబ్దముయొక్క 'అత్' అనుభాగమునకు ఇతిశబ్దము పర

మగునపుడు పరరూపమేకాదేశమగును) అనుసూత్రముచే పరరూప మేకాదేశమై పట్ + అత్ + ఇతి - పట్ + ఇతి, పటితి కరోతి అగును.

ఇది స్వార్థికప్రకరణము.

ప్రకరణావలోకనము : ఇందు ఆయా ప్రకృతులకు స్వార్థమునఁ జేరు ప్రత్యయములగు కన్, మయట్, అణ్, శస్, తసి, చ్వి, సాతి, డాచ్ అను ప్రత్యయములను వాని ప్రక్రియయు వివరింపఁబడినవి. ఇందు కొన్ని స్వార్థమునందే కాక యితరార్థములందును వచ్చునవియగుటచే వీనిని స్వార్థికములనుట యౌపచారికము.

ఇంతటితో తద్ధితాధికారము పూర్తియయినది.

తద్ధితాధికారము-సింహావలోకనము :

ఙీ, ఆప్ అనుస్త్రీ ప్రత్యయములంతమునఁగలవానికిని ప్రాతిపదిక సంజ్ఞకములకును జేరిన యాయా విభక్త్యంతరూపములపై ఆయా అపత్యాద్యర్థ విశేషములను వ్యక్తముచేయు ప్రత్యయములు అష్టాధ్యాయియందలి 4,5 అధ్యాయములలో వివరింపఁబడినవి అందలి కొన్నిసూత్రము లీప్రకరణమున వ్యాఖ్యానింపఁబడినవి. ఇందు అర్థవిశేషములను బట్టియు, అణ్ మున్నగు ప్రత్యయముల యధికారావధినిబట్టియు, ప్రకరణముల అంతర్విభాగము చేయఁబడినవి. తద్ధిత ప్రక్రియ యందును సమాస ప్రక్రియయందువలె లౌకికాలౌకిక విగ్రహవాక్యములు, సుప్ప్రత్యయములకు లుక్కు వచ్చుట, మఱల సముదాయమునకు లింగవచనానుగుణముగ విభక్తిప్రత్యయములు చేరుట మున్నగులక్షణములు గలవు. పంచవిధవృత్తులలో నిదియు నొకటి. పరార్థాభిధానమను సాధారణ వృత్తి లక్షణమిందు సర్వత్ర దృశ్యమానమగును. ఇత్సంజ్ఞకములనుబట్టి కార్యవిధానము జరుగుచుండును గావున ప్రత్యయస్వరూపమొకటియే యయ్యును,కొన్నియెడల అణ్, అఞ్ వంటి ప్రత్యయములవలన నేర్పడు రూపములలో భేదము లేకున్నను, ఆ ప్రత్యయభేదమును జాగ్రత్తగా పాటింపవలయును.

ఈ ప్రత్యయములలో నాదివర్ణములగు ల, శ, క వర్గములకు 'అతద్ధితే' అను పర్యుదాసమువలన నిత్సంజ్ఞ యుండదు. ఠ. ఫ, ఢ, ఖ, ఛ, ఘ అనువాని కాయా యాదేశములు విధింపఁబడినవి. సాధారణముగా అజాది యకారాది ప్రత్యయములు పరములుగా నున్నపుడు టిలోపమో, ఇకారాకారలోపమో జరుగుచుండును. వీని కపవాదములును చాల గలవు. అవి యన్నియు ప్రకరణమున

నిరూపింపఁబడినవి. ప్రత్యయములలో అకారాదులు కొన్ని ఉచ్చారణార్థకములగుటయు, 'కొన్నియెడల నవి ప్రత్యయములో నేకదేశములగుటయు మెలఁకువతో పరిశీలింపవలయును. ప్రత్యయాంతమున కవ్యయసంజ్ఞ యున్నచో నరసికొని తదనుగుణమైన ప్రక్రియ నాశ్రయింపవలయును. లేనిచో సాధారణముగ ప్రాతిపదికార్థమున ప్రథమావిభక్త్యేకవచనప్రత్యయము చేర్చి రూపప్రదర్శనము చేయఁబడినది. పదముకానిది ప్రయోగానర్హమగుటచే పదత్వసిద్ధికై సుప్ప్రత్యయము చేర్చుట ఆవశ్యకమని తెలుపుటకై యీ పద్ధతి అవసరమగుచున్నది. ఈ వ్యాఖ్యలో సుప్పులు చేరుటమాత్రము ప్రదర్శింపఁబడినది. అవి పరమగునపుడు జరుగు ప్రక్రియా విధానమంతయు గ్రంథవిస్తరభీతిచే చూపఁబడలేదు. అది శబ్దాధికార ప్రక్రియకు సంబంధించినభాగము.

తద్ధితవిధానము ముఖ్యముగా అర్థమునకు సంబంధించినది యగుటచే నిందలి కృషి శబ్దార్థజ్ఞానమునకు మిక్కిలి ఉపకారకమగును. కావున సంస్కృత భాషయందును, తదుపజీవులగు నితరభాషలయందును కృషిచేయు వారికిది తప్పక ఉపాదేయము.

అథ స్త్రీప్రత్యయ ప్రకరణమ్.

అవ : లోకములో స్తనకేశవతిని స్త్రీ అనియు, లోమశుఁడైన వ్యక్తిని పురుషుఁడనియు నందురు. ఈ విభాగము లేనిదానిని నపుంసకమందురు. (స్తన కేశవతీ స్త్రీ స్యాల్లోమశః పురుషః స్మృతః. ఉభయోరన్తరం యచ్చ తద భావే నపుంసకమ్) కాని వ్యాకరణశాస్త్రమున స్త్రీపుంనపుంసకలింగముల నిర్ణయమున కీవ్యవహారము తోడ్పడఁజాలదు. ఇచట లింగము శబ్దము నాశ్రయించియుండును. అనగా నీశబ్దము పుంలింగము ఈశబ్దము స్త్రీలింగము, ఈ శబ్దము నపుంసకలింగము అని వ్యవహారము. కావున స్త్రీ వ్యక్తిని బోధించుపదము నియతముగా స్త్రీలింగమే కానక్కఱలేదు. ఉదా : కళత్రమ్ అను నపుంసకలింగశబ్దము 'భార్య' అనునర్థ మున వ్యవహరింపఁబడుచున్నది; దారాః అను పుంలింగశబ్దము భార్య అను నర్థము గలది. కావున నేదేని ప్రాతిపదికమునకు స్త్రీత్వమును జెప్పఁదలఁచిన యెడల దానికి కొన్ని ప్రత్యయములు చేరును. అట్టివానిని స్త్రీప్రత్యయములందురు. అష్టా ధ్యాయిలో నాల్గవ అధ్యాయము మొదటిపాదము మూఁడవ సూత్రము మొదలుకొని 81 వ సూత్రమువఱకు 'స్త్రియామ్' అనునధికారము గలదు. అందు విధింపఁబడిన స్త్రీ ప్రత్యయములను వివరించు ప్రకరణమగుటచే దీనికి స్త్రీ ప్రత్యయ ప్రకరణ మని పేరు.

ఇందు ప్రాతిపదిక సంజ్ఞకలవానికి ఈ ప్రత్యయములు చేరుచుండును. ప్రాతి పదిక మనగా అర్థవంతము, ధాతుభిన్నము, ప్రత్యయభిన్నము, ప్రత్యయాంత భిన్నము నైన శబ్దస్వరూపము (అర్థవదధాతురప్రత్యయః ప్రాతిపదికమ్ 1-2-45) ప్రత్యయాంతములైనను కృదంతములును, తద్ధితాంతములును, సమాసములును ప్రాతిపదికములే యగును (కృత్తద్ధితసమాసాశ్చ 1-2-46) స్త్రీ ప్రత్యయము లీల క్షణముగల వానికి పరముగా చేటను ఇవి చేరిన స్వరూపములకు ప్రాతిపదిక సంజ్ఞయుండదు. అయినను 'జ్యాప్ప్రాతిపదికాత్' అను నధికారసూత్రములో ఙీ, ఆప్ అనుస్త్రీప్రత్యయములను గ్రహించినందువలన ఙ్యంత, ఆబంతములకు సుప్ ప్రత్యయములు చేరును. ఆ విధముగా వీనికి పదత్వము సిద్ధించును. తక్కిన ప్రక్రియావిశేషములను ముందు యథాసంభవముగ పరిశీలింతము.

సూ : స్త్రియామ్ 4-1-3.

వృ : ఇత్యధికృత్య.

వ. వి స్త్రియామ్ (7-1).

అర్థ : ఇది యధికారసూత్రము.

వివ : 4-1-81 వఱకుగల సూత్రములలోనికి 'స్త్రియామ్' అను సప్తమ్యంత పదము అధికారముగా చేరును.

సూ : అజాద్యత ష్టాప్ 4-1-4.

వృ : అజాదీనా మకారాంతస్య చ యద్వాచ్యం స్త్రీత్వం తత్ర ద్యోత్యేటాప్ స్యాత్. అజా, ఏడకా, అశ్వా, చటకా, మూషికా, బలాకా, వత్సా, హోడా, మన్దా, బిలాకా, మేధా ఇత్యాది, గఙ్గా, సర్వా. అదన్తాత్పృథ గజాద్యుక్తి ర్జీష్ ఙీషో ర్బాధనాయ.

ప. వి : అజాద్యతః (6-1) టాప్ (1-1).

అను : ప్రాతిపదికాత్ (5-1) స్త్రియామ్ (7-1) ప్రత్యయః (1-1) పరః (1-1) చ (అవ్య).

అర్థ : అజమున్నగు ప్రాతిపదికములయొక్కయు, అదంతప్రాతిపదికముల యొక్కయు స్త్రీత్వము వాచ్యమగునపుడు వానికి పరముగా 'టాప్' ప్రత్యయము వచ్చును. ఉదా : అజామొ॥వి. అదంతములకంటె వేఱుగా అజాదులను జెప్పుట జీప్, ఙీష్ ప్రత్యయములను బాధించుటకొఱకు.

వివ : స్వార్థము, ద్రవ్యము, లింగము, సంఖ్య, కారకము అనునీయైదును ప్రాతిపదికార్థములు (స్వార్థద్రవ్యలింగసంఖ్యాకారకాణిపఞ్చప్రాతిపదికార్థాః). అను సిద్ధాంతము ననుసరించి లింగముకూడ ప్రాతిపదికార్థమే యగును. కావున 'ప్రాతి పదికముయొక్క లింగమైన స్త్రీత్వము వాచ్యమైనపుడు' అనునర్థము 'స్త్రియామ్'అను పదముచే గ్రహింపఁబడును. 'అజాద్యతః అనునది సమాహారద్వంద్వము. అజా దులయొక్కయు అత్తుయొక్కయు సమాహారము 'అజాద్యత్' దానిషష్ఠ్యంతరూపము 'అజాద్యతః' అనునది అనువృత్తమైన ప్రాతిపదికాత్ అనుదానిని షష్ఠ్యంతముగా మార్చుకొనవలయును. 'ప్రాతిపదికస్య' అగును. 'అజాద్యతః' అనునది 'ప్రాతి పదికస్య' అనుదానికి విశేషణము. కావున తదంతవిధిచే 'అజాదుల యొక్కయు, అజాదులంతమునఁగలవాని యొక్కయు, అదంతముల యొక్కయు అనునర్థము వచ్చును. వానియొక్క స్త్రీత్వము గమ్యమానమగునపుడు పరముగా 'టాప్' అను ప్రత్యయము వచ్చును. దేనికి పరముగా అనుఆకాంక్షకుసమాధానముగా అజాదులకును, అదంతములకును పరముగా వచ్చునమనర్థము సిద్ధించును. అజాదిశబ్దములకును,

అవి అంతమునఁ గలవానికిని, అదంత ప్రాతిపదికములకును, స్త్రీత్వము వాచ్యమగు నపుడు 'టాప్' అను ప్రత్యయమగునని ఫలితార్థము ఉదా : అజ + టాప్ (ఇందు టకారపకారము లిత్తులు. చుటూ, హలన్త్యమ్) అజ + అ = సవర్ణదీర్ఘముఅజా + సు = అజా. [అజా అనుదానికి ప్రాతిపదిక సంజ్ఞ యుండదు. ప్రత్యయాంతము గదా. కావుననే 'జ్యాప్ప్రాతిపదికాత్' అనుసూత్రముచే జీ, లప్ అనునవియు గ్రహింపఁబడినవి. వీనికి చేరు 'సు' ప్రత్యయమునకు 'హల్ఙ్యాబ్భ్యోదీర్ఘాత్సుతిస్య పృక్తంహల్' 6-1-68) (హలన్తమునకును, జీ,ఆప్ ప్రత్యయము లంతమునఁ గల దానికిని పరముగనున్న 'సు,తి,సి' అనువాని అపృక్తమైన హల్లు లోపించును) అనుసూత్రముచే లోపము కలుగును. (అపృక్తమనగా నొకేవర్ణముగల ప్రత్యయము. స్ + ఉ-ఉకారమిత్తు) ఈ ప్రక్రియను ముందు సర్వోదాహరణము లలో యథాయోగ్యముగ ననుసంధించుకొనఁదగును. విశేష మున్నచోట చెప్పఁబడును]

ఇట్లే ఏడక + టాప్, ఏడక + అ = ఏడకా, అశ్వ + టాప్ = అశ్వా, చటక + టాప్ = చటకా, మూషక + టాప్ = మూషికా, బాల + టాప్ = బాలా, వత్స + టాప్ = వత్సా; హోడ + టాప్ = హోడా; మన్ద + టాప్ = మన్దా; బిలాత + టాప్ = బిలాతా, మేధ + టాప్ = మేధా. మొదలయినవి.

అదంతముల కుదాహరణములు గఙ్గ + టాప్, గఙ్గ + అ, గఙ్గా + సు = గఙ్గా, సర్వ + టాప్ = సర్వా + సు = సర్వా.

ఇట నొకవిశేషముగలదు. అజాదిగణములోని శబ్దము లన్నియు అదంత ములే కావున 'అతః' అనుపదము వలననే వానికిని స్త్రీత్వమున టాప్ ప్రత్యయము రావచ్చునుగదా; మఱల 'అజాది' పదమును గ్రహింపనేల? అనుశంకకు సమాధానము జీప్, జీష్ అను వక్ష్యమాణప్రత్యయములను బాధించుటకొఱకు అని చెప్పఁబడినది. అజాదిగణములోని అజ, అశ్వమున్నగువానికి 'జాతేరస్త్రీవిషయాత్' ఇత్యాదిసూత్రముచే జీష్ ప్రత్యయము ప్రాప్తమగుచున్నది. బాల మున్నగువానికి 'వయసిప్రథమే' ఇత్యాదిసూత్రములచే జీప్ ప్రత్యయము ప్రాప్తించుచున్నది వానిని బాధించుటకై అజాదిపదము విడిగా గ్రహింపఁబడినది. అది లేనిచో సామాన్య సూత్రమును బాధించి విశేషవిధులగు వక్ష్యమాణసూత్రములు ప్రవర్తించి 'అజీ' మున్నగు న విష్టరూపము లేర్పడవలసి వచ్చును అజాదిపదగ్రహణము వానిని వారించినది.

అజాదిగణము : అజా ఏడకా కోకిలా చటకా అశ్వా మూషికా బాలా హోడా పాకా వత్సా మన్దా బిలాతా పూర్వాపహాణా (పూర్వాపహాణా) అపరాపహాణా, (సంభ

స్త్రాజినశణపిండేభ్యః ఫలాత్ (37) (సదచ్కాణ్డ ప్రాన్తశతైకేభ్యః పుష్పాత్ 38) (శూద్రాచామహత్పూర్వాజాతిః 39) క్రుఞ్చా ఉష్ణిహ దేవవిశా. జ్యేష్ఠా కనిష్ఠా మధ్యమా పుంయోగేఽపి. (మూలాన్నఞః 40) దంష్ట్రా. (త్రిఫలా త్ర్యనీకా ద్విగౌ 41) - ఏతేఽజాదయః.

సూ : ఉగితశ్చ 4-1-6.

వృ : ఉగిదన్తాత్ప్రాతి పదికాత్ ఙీప్ స్త్రియామ్ భవన్తీ, పచన్తీ.

ప. వి : ఉగితః (5-1) చ (అవ్య).

అను : స్త్రియామ్ (7-1) ప్రాతిపదికాత్ (5-1) ఙీప్ (1-1) ప్రత్యయః (1-1) పరః (1-1) చ (అవ్య).

అర్థ : ఉగిదంతమైన ప్రాతిపదికమునకు పరముగా స్త్రీత్వమున ఙీప్ ప్రత్యయము వచ్చును. ఉదా : భవన్తీ, పచన్తీ.

వివ : 'ఉక్' అనునది ఉ ఋ ఌ వర్ణములను బోధించు ప్రత్యాహారము. ఉక్కు ఇత్తుగాఁగలది ఉగిత్తు. అది ప్రాతిపదికాత్ అనుదానికి విశేషణము. కావున తదంతవిధిచే ఉగిదంతమైన ప్రాతిపదికమునకు పరముగా స్త్రీత్వమున ఙీప్ ప్రత్యయము వచ్చునని ఫలితార్థము సిద్ధించినది. ఉ, ఋ ఌ అను వర్ణములు ఇత్తుగాగల ప్రాతిపదికముల యొక్కయు అట్టి ప్రత్యయములు అంతమునఁ గల ప్రాతిపదికముల యొక్కయు స్త్రీత్వము వాచ్యమగునపుడు వానికి పరముగా 'ఙీప్' అను ప్రత్యయము వచ్చునని భావము. ఈ ప్రత్యయమున ఙకారపకారము లిత్తులు (లశక్వతద్ధితే, హలన్త్యమ్).

ఉదా : భవత్, పచత్ ఇవి భూ, పచ్ ధాతువులకు శతృప్రత్యయము చేయఁగా నేర్పడిన రూపములు శతృప్రత్యయమున ఋకారమిత్తు కావున ఇవి ఉగిదంతములు. వీనికి ప్రకృత సూత్రముచే 'ఙీప్' ప్రత్యయము భవత్ + ఙీప్ = ఈ భవత్ + ఈ అనియుండ 'శప్శ్యనోర్నిత్యమ్' అనుసూత్రముచే నుమాగమము వచ్చును (శప్, శ్యన్ ప్రత్యయముల అకారమునకు పరముగనున్న శతృప్రత్యయావయవము అంతమునఁగల అంగమునకు, శీ అనునది గాని నదీసంజ్ఞకము కాని పరముగా నున్నపుడు, నుమాగమము నిత్యముగా వచ్చును) మకారమిత్తుగాఁ గల ఆగమము తుది అచ్చునకు తర్వాతవచ్చును (మిదచోఽన్త్యాత్పరః) భవన్త్ + ఈ=భవన్తీ + సు=భవన్తీ. అట్లే పచన్త్ + ఈ=పచన్తీ + సు=పచన్తీ 'భవతు'

అను ఉకారమిత్తుగాఁగల మఱియొకశబ్దము కలదు. దానికి ఙీప్ ప్రత్యయము వచ్చి నచో 'భవతీ' అనురూపమేర్పడును (దానికి నుమాగమమురాదు).

సూ : అనుపసర్జనాత్ 4-1-14.

వృ : అధికారోఽయం, యూనస్తి రిత్యభివ్యాప్య.

ప. వి. : అను పసర్జనాత్ (5-1).

అర్థ : యూనస్తిః (4-1-77) అను సూత్రమువఱకు పంచమ్యంతమగు నీపదము అధికారమగును.

వివ : ఉపసర్జనసంజ్ఞ సమాస పరిచ్ఛేదమున వివరింపఁబడినది. సమాసవిధా యక సూత్రమున ప్రథమాంతపదముచే నిర్దేశింపఁబడినదియు విగ్రహవాక్యమున నియతమైన విభక్తికలదియు ఉపసర్జనసంజ్ఞకమగును (ప్రథమానిర్దిష్టం సమాస ఉప సర్జనమ్, ఏకవిభక్తి చాపూర్వనిపాతే). ఉపసర్జనము కానిది అనుపసర్జనము. ఇటుపై విధింపఁబడు స్త్రీప్రత్యయములు అనుపసర్జనములైన ప్రాతిపదికములకే వచ్చునని యీ యధికారసూత్రమువలన చెప్పఁబడినది బహువ్రీహి సమాసాదులలో అర్థ ప్రాధాన్యము లేనిపదములు, ఉపసర్జనములుకావున నట్టివానికి పరముగా వక్ష్యమాణ స్త్రీప్రత్యయములు రావవి తాత్పర్యము ఉపసర్జన సంజ్ఞలేనివానికి వక్ష్యమాణ ప్రత్యయము వచ్చునని ఫలితార్థము.

సూ : టిడ్ఢాణఞ్ ద్వయసజ్దఘ్నఞ్మాత్రచ్ తయప్ఠక్ ఠఞ్ కఞ్ క్వరపః 5-1-15.

వృ : అనుపసర్జనం యట్టిదాది తదన్తం యదదన్తం తతః స్త్రియాం ఙీప్, కురుచరీ, నదట్, నదీ, దేవట్-దేవీ, సౌపర్ణేయీ ఐన్ద్రీ ఔత్సీ, ఊరుద్వయసీ, ఊరుదఘ్నీ, ఊరుమాత్రీ, పఞ్చతయీ, ఆక్షికీ, లావణికీ, ప్రాస్థికీ, యాదృశీ, ఇత్వరీ.

ప. వి : డిడ్ఢాణఞ్ ......క్వరపః (5-1).

అను : ప్రాతిపదికాత్ (5-1) అను పసర్జనాత్ (5-1) అతః (5-1) ఙీప్ (1-1) ప్రత్యయః (1-1) పరః (1-1) స్త్రియామ్ (7-1).

అర్థ : అనుపసర్జనములైన టిదాదులంతమునఁ గల అదంత ప్రాతిపదికములకు స్త్రీత్వమున ఙీప్ ప్రత్యయము వచ్చును. ఉదా : కురుచరీ మొ॥వి.

వివ : ఇచట సూత్రమంతయు పంచమ్యేకవచనాంతము. ఇతియు, అను వృత్తిగా వచ్చిన అతః, అనుపసర్జనాత్ అనునవియు ప్రాతిపదికాత్ అనుదానికి విశేషణములు. తదంత విధిచే టిదాద్యంతము, అదంతము, ఉపసర్జనముకానిదియు నగు ప్రాతిపదికమునకు పరముగా స్త్రీత్వమున ఙీప్ ప్రత్యయము వచ్చుననునర్థము కలుగును. సూత్రమున చెప్పఁబడిన వన్నియు సాధారణముగ ప్రత్యయములు (1) టిత్తులు=టకారమిత్తుగాఁ గలవి (2) ఢ ప్రత్యయము (3) అణ్ (4) అఞ్ (5) ద్వయసచ్ (6) దఘ్నచ్ (7) మాత్రచ్ (8) తయప్ (9) ఠక్ (10) ఠఞ్ (11) కఞ్ (12) క్వరప్ - ఇందు కొన్ని కృత్ప్రత్యయములు-మఱికొన్ని తద్ధిత ప్రత్యయములు. అదంతములైన టిత్తులయొక్కయు, అదంతములైన ఢమున్నగు ప్రత్యయములు అంతమునఁగల ప్రాతిపదికములయొక్కయు స్త్రీత్వము వాచ్యమగు నపుడు (చెప్పఁబడునపుడు) ఉపసర్జనసంజ్ఞ లేనివి యగు వీనికి పరముగా 'ఙీప్' ప్రత్యయము వచ్చునని ఫలితార్థము. వీనికి క్రమముగా నుదాహరణములను పరిశీలింతము.

(i) టిత్తులు (i) కురుచర (కురుషు చరతి - కురుదేశములందు తిరుగునది అనునర్థమున 'చరేష్టః' అనుసూత్రముచే 'ట' ప్రత్యయము (ట్ + అ) చేరగా నేర్పడినరూప మిది. కావున నిది టిదంతము) కురుచర + ఙీప్, కురుచర + ఈ యస్యేతిచ - (భసంజ్ఞకలదాని ఇవర్ణ అవర్ణములకు తద్ధితము గాని ఈకారముగాని పరమగునపుడు లోపము వచ్చును) అనుసూత్రముచే అకారలోపము, కురుచర్ + ఈ=కురచరీ + సు=కురుచరీ.

(ii) నదట్, దేవట్ అనునవి పచాదిగణములో టిత్తులుగా పఠింపఁబడినవి. నద + ఈ. అకారలోపము నదీ. దేవ+ఈ=దేవీ.

(2) ఢ=సౌపర్ణేయ - సుపర్ణీశబ్దమునకు అపత్య సంతానము అనునర్థమున 'స్త్రీభ్యోఢక్' అను సూత్రముచే 'ఢక్' ప్రత్యయము రాఁగా నేర్పడిన రూపమిది. ఆదివృద్ధి ఏయ్ ఆదేశము, ఈకారలోపము. ఇట్లిది ఢప్రత్యయాంతము. సౌపర్ణేయ + ఙీప్, సౌపర్ణేయ + ఈ, అకారలోపము సౌపర్ణేయీ+సు = సౌపర్ణేయీ.

(3) అణ్ - ఇన్ద్రోదేవతా అస్యాః-దీనికి ఇంద్రుఁడుదేవత అనునర్థమున 'సాఽస్యదేవతా' అనుసూత్రముచే ఇన్ద్రశబ్దమునకు అణ్ ప్రత్యయము వచ్చి ఇన్ద్ర + అణ్, ఐన్ద్ర + అ, 'ఐన్ద్ర' అగును. (ఆదివృద్ధి, అకారలోపము) ఇది

అణంతము కాన జీప్ ప్రత్యయము రాఁగా ఐన్ద్రి + ఈ, ఐన్ద్రీ (యస్యేతిచ - అకారలోపము).

(4) అఞ్ - ఉత్సస్య ఇయమ్ - ఉత్సుఁడనువానికి సంబంధించినది అను నర్థమున 'ఉత్స + ఙస్ + అఞ్' ఉత్సాదిభ్యోఽఞ్ అనుసూత్రముచే అఞ్ ప్రత్యయము ఆదివృద్ధ్యాదులు. ఔత్స, ఇది అఞంతము, ఔత్స+ఈ ఔత్సీ.

(5), (6), (7) ఊరూ ప్రమాణమస్యాః - తొడలలోఁతుగలది అనునర్థమున 'ప్రమాణేద్వయసజ్దఘ్నఙ్మాత్రచః' అనుసూత్రముచే ద్వయసచ్, దఘ్నచ్, మాత్రచ్ ప్రత్యయములు రాఁగా నేర్పడిన రూపములకు జీప్రత్యయము. ఊరు ద్వయస + ఈ = ఊరుద్వయసీ; ఊరుదఘ్న + ఈ = ఊరుదఘ్నీ; ఊరు మాత్ర + ఈ = ఊరుమాత్రీ.

(8) తయప్-పఞ్చ అవయవా అస్యాః-అయిదు అవయవములు దీనికిఁ గలవు అనునర్థమున 'సంఖ్యాయా అవయవే తయప్' అనుసూత్రముచే పంచన్‌శబ్దమునకు తయప్ ప్రత్యయము చేరగా పఞ్చతయ అగును. దానికి జీప్ ప్రత్యయము, పఞ్చ తయ + ఈ=పఞ్చతయీ.

(9) ఠక్ : అక్షైర్దీవ్యతి - పాచికలతో ప్రకాశించునది అనునర్థమున అక్ష శబ్దమునకు 'తేన దీవ్యతి ఖనతిజయతి జితమ్' అనుసూత్రముచే ఠక్ ప్రత్యయము. అక్ష+ఠక్, ఆదివృద్ధి (కితిచ) ఇకాదేశము (ఠస్యేకః) అక్ష + ఇక, అకారలోపము అక్షిక + ఇది ఠగంతము. అక్షిక + జీప్ - అక్షిక + ఈ, అక్షికీ + సు= అక్షికీ.

(10) ఠఞ్ - (i) లవణం పణ్యమస్యాః - లవణము ఈమెకు అమ్మకొను వస్తువు అనునర్థమున 'లవణాట్ఠఞ్' అనుసూత్రముచే లవణశబ్దమునకు పరముగా 'ఠఞ్' ప్రత్యయము. పూర్వోదాహరణమునందువలె ఆదివృద్ధ్యాదులు రాఁగా 'లావణికో' అగును. ఇది ఠఞంతముగాన జీప్ ప్రత్యయము, లావణిక + ఈ, అకార లోపము. లావణికీ + సు = లావణికీ.

(ii) ప్రస్థేన క్రీతా - ప్రస్థముచే కొనబడినది అనునర్థమున ప్రస్థశబ్దమునకు 'తేన క్రీతమ్' అనుసూత్రముచే ఠఞ్ ప్రత్యయము ఆదివృద్ధ్యాదులు, 'ప్రాస్థిక' ఇదియును ఠఞంతమే. ప్రాస్థిక + జీప్, ప్రాస్థిక + ఈ = ప్రాస్థికీ + సు = ప్రాస్థికీ.

(11) కఞ్ : యచ్ఛబ్ద ముపపదముగానున్న 'దృశ్' ధాతువునకు 'త్యదాదిషు దృశోఽనాలోచనే కఞ్ చ' అనుసూత్రముచే 'కఞ్' ప్రత్యయము. ఇందు కకారఞకారము లిత్తులు. యాదృశ్ + అ ('ఆస్వరనామ్నః' అను సూత్రముచే యచ్ఛబ్దమునకు ఆకార మంతాదేశ మగును) యాదృశ+జీప్ = యాదృశ + ఈ, యాదృశ్+ఈ= యాదృశీ + సు-యాదృశీ.

(12) క్వరప్-తిరుగు స్వభావముగలది అనునర్థమున ఇ(ణ్) ధాతువునకు 'ఇణ్నశజి సర్తిభ్యః క్వరప్' అనుసూత్రముచే క్వరప్ ప్రత్యయము, ఇ + క్వరప్ (కకారపవర్ణము లిత్తులు)ఈ ప్రత్యయము పరమగునపుడు ధాతువునకు తుగాగమము (హ్రస్వస్య పితి కృతి తుక్) ఇత్+వర = ఇత్వర - ఇది క్వరబంతము, కావున జీప్ ప్రత్యయము - ఇత్వర + ఈ, అకారలోపము - ఇత్వరీ + సు=ఇత్వరీ.

ఈ పై యుదాహరణములన్నింటను 'యస్యేతిచ' అనుసూత్రముచే తుది అకారము లోపించుటయు జీబంతమునకు సుప్రత్యయము చేరి హల్ఙ్యాబ్భ్యాది సూత్రముచే లోపించుటయు ననుసంధించుకొనవలయును. ఆయాప్రత్యయములు చేరునపుడగు ప్రక్రియ స్థూలముగా చూపఁబడినది. (ఆయాప్రకరణములలో సమగ్రముగా దానినరయునది).

అవ : ఇట్టి మఱికొన్ని ప్రత్యయాంతములకును ఈజీప్ప్రత్యయము వచ్చుట నీక్రింది వార్తికము విధించుచున్నది.

వా॥ నఞ్ స్నఞీకక్ ఖ్యుం స్తరుణతలునానా ముపసంఖ్యానమ్ (2425).

వృ : స్త్రైణీ, పౌంస్నీ, శాక్తీకీ, ఆఢ్యంకరణీ, తరుణీ, తలునీ.

వ వి ; నఞ్........తలునానామ్ (6-3) ఉపసంఖ్యానమ్ (1-1).

అర్థ : నఞ్, స్నఞ్, ఈకక్, ఖ్యున్ అను ప్రత్యయములంతమునఁగల ప్రాతిపదికములకు, తరుణతలున అనుశబ్దములకు స్త్రీత్వమున జీప్ ప్రత్యయమగును. ఉదా : స్త్రైణీ మొ॥వి.

వివ : పై వానిలో నఞ్ మున్నగు నాలుగును ప్రత్యయములు. తదంతవిధిచే అవి అంతమునఁ గల ప్రాతిపదికములకు అనునర్థము సిద్ధించును. వానికిని, తరుణ, తలున అనుశబ్దములకును స్త్రీత్వమున జీప్ ప్రత్యయము వచ్చును. ఇందు తరుణ, తలున శబ్దములకు 'వయసి ప్రథమే' అను వక్ష్యమాణసూత్రముచే 'జీప్' ప్రత్య

యము రా వీలున్నను, గౌరాదిగణములోనివి పఠింపఁబడియుండుటవలన 'షిద్గౌరాదిభ్యశ్చ' అనుసూత్రముచే 'ఙీష్' ప్రత్యయము రావలసియున్నది. ఇట్లు ఙీప్ప్రత్యయము రాకుండుటవలన నీవార్తికమున మఱల విధింపఁబడినది. ఙీప్, ఙీష్ ప్రత్యయములవలన స్వరూపములలో భేదములేదు కాని స్వరభేదము కలదు.

ఉదా : నఞ్ : 'స్త్రీ' శబ్దమునకు 'స్త్రీపుంసాభ్యాం నఞ్స్నఞౌ భవనాత్' అను సూత్రముచే అపత్యాద్యర్థములయందు నఞ్ ప్రత్యయము. స్త్రీ + న (ఞ్) ఆదివృద్ధి, ణత్వము, స్త్రైణ + ఙీప్ (ప్రకృతవార్తికముచే) స్త్రైణ+ఈ, యస్యేతి చ - అకారలోపము, స్త్రైణీ + సు = స్త్రైణీ.

స్నఞ్ : 'పుంస్' శబ్దమునకు స్త్రీ పుంసాభ్యా మిత్యాదిసూత్రముచే స్నఞ్ ప్రత్యయము - పుంస్ + స్నఞ్, ఆదివృద్ధి, పౌంస్ + స్నఞ్, సంయోగాన్తస్య లోపః అనుసూత్రముచే శబ్దములో సకారమునకు లోపము. పౌంస్న + ఙీప్, పౌంస్న + ఈ = పౌంస్నీ + సు = పౌంస్నీ.

ఈకక్ : శక్తిః ప్రహరణమస్యాః - 'శక్తిఆయుధముగాఁ గలది' అను నర్థమున 'శక్తియష్ట్యోరీకక్', అను సూత్రముచే 'శక్తి' శబ్దమునకు ఈకక్ ప్రత్యయము. శక్తి + సు + ఈకక్, విభక్తిలోపము, ఆదివృద్ధి ఇకారలోపము. శాక్త్ + ఈక = శాక్తీక + ఙీప్, అకారలోపము శాక్తీక్ + ఈ = శాక్తీకీ +

ఖ్యున్: అనాఢ్యః ఆఢ్యః క్రియతే అనయా-ఈమెచేత ఆఢ్యుఁడు కానివాఁడు ఆఢ్యుఁడుగా చేయఁబడును అనునర్థమున ఆఢ్యశబ్దము ఉపపదముగానున్న 'కృఞ్' ధాతువునకు "ఆఢ్యసుభగస్థూలపలిత నగ్నాన్ధప్రియేషు చ్వ్యర్థేష్వచ్వౌ కృఞః కరణే ఖ్యున్" (3-2-56) అనుసూత్రముచే ఖ్యున్ ప్రత్యయము వచ్చును (చ్వి ప్రత్యయార్థము కలవియు, చ్విప్రత్యయాంతములు కానివియునగు ఆఢ్యాది శబ్దములు ఉపపదములుగా నున్నపుడు కృఞ్ ధాతువునకు కరణార్థమున 'ఖ్యున్' ప్రత్యయము వచ్చును) ఆఢ్య + కృ + ఖ్యున్ ఖకారనకారములిత్తులు. 'యు' అనుదానికి అనాదేశము, (యువోరనాకౌ) ధాతువులోని ఋకారమునకు గుణము, సార్వధాతుకార్ధధాతుకయోః, ఆఢ్య + కర్ + అన, ణత్వము ఆఢ్య + కరణ - 'అరుర్ద్విషదజన్తస్య ముమ్' అనుసూత్రముచే ఆఢ్యశబ్దమునకు ముమాగమము, ఆఢ్యమ్ + కరణ, మకారమునకనుస్వారాదేశము, పరసవర్ణము, ఆఢ్యఙ్కరణ - ఇది ఖ్యున్ ప్రత్యయాంతము. ఆఢ్యఙ్కరణ + ఙీప్, ఆఢ్యఙ్కరణ్ + ఈ = ఆఢ్యఙ్కరణీ + సు = ఆఢ్యఙ్కరణీ.

(5) తరుణ + ఙీప్, తరుణ్ + ఈ=తరుణీ+సు=తరుణీ.

(6) తలున + ఙీప్, తలున్ + ఈ=తలునీ + సు=తలునీ.

సూ : యఞశ్చ 4-1-16.

వృ : యఞన్తాన్ఙీప్ స్త్రియామ్. అకారలోపే కృతే.

ప వి : యఞః (5-1) చ (అవ్య).

అను : ప్రాతిపదికాత్ (5-1) స్త్రియామ్ (7-1) అను వర్తనాత్ (5-1).

అర్థ : యఞంతమైన ప్రాతిపదికమునకు స్త్రీత్వమున ఙీప్ ప్రత్యయము వచ్చును. 'గార్గ్య + ఈ' అనియుండ అకారలోపమగును. (యస్యేతిచ) కాగా.

వివ : 'యఞ్' అనునది ప్రత్యయము. తదంతవిధిచే 'యఞ్' ప్రత్యయము అంతమునఁ గల ప్రాతిపదికమునకు అనునర్థము కలుగును. అట్టిదానియొక్క స్త్రీత్వము వాచ్యమగునపుడు, దానికి పరముగా 'ఙీప్' అను ప్రత్యయము చేరును.

ఉదా : గర్గస్య అపత్యం స్త్రీ - గర్గునియొక్క సంతానమైనస్త్రీ అనునర్థమున 'గర్గాదిభ్యో యఞ్' అనుసూత్రముచే 'గర్గ+ఙస్' అనుదానికి యఞ్ ప్రత్యయము. గర్గ + ఙస్+య(ఞ్), విభక్తిలోపము, ఆదివృద్ధి (తద్ధితేష్వచామాదేః) గార్గ + య (ఞకారమిత్తు) యస్యేతి చ-అను సూత్రముచే తుది అకారమునకు లోపము రాఁగా గార్గ్+య=గార్గ్య అగును. ఇది యఞంతము. దీనికి ప్రకృతసూత్రముచే 'ఙీప్' ప్రత్యయము. గార్గ్య + ఙీప్, 'గార్గ్య + ఈ' - మఱల నిందు యస్యేతిచ అనుసూత్రముచే తుది అకారమునకు లోపము కలిగి గార్గ్య్ + ఈ అని యుండును. ఇట్లుండగా క్రిందిసూత్రము ప్రవర్తించుచున్నది.

సూ : హలస్తద్ధితస్య 6-4-150.

వృ : హలః పరస్య తద్ధితయకారస్య లోప ఈతి పరే. గార్గీ.

ప. వి : హలః (5-1) తద్ధితస్య 6-1.

అను : లోపః (1-1) యః (6-1) ఈతి (7-1) ఉపధాయాః (6 1).

అర్థ : హల్లుకు పరముగానున్న ఉపధాభూతమైన తద్ధితయకారమునకు, ఈకారము పరమగునపుడు, లోపము వచ్చును. ఉదా : గార్గీ.

వివ : 'హలః' అనునది పంచమ్యంతము కావున 'తస్మాదిత్యుత్తరస్య' అను పరిభాషచే 'హల్లునకు పరముగానున్న' అనునర్థము వచ్చును. 'ఈతి' - ఈత్ (తపరకరణము) అనుదాని సప్తమ్యంతరూపము. తస్మిన్నితి నిర్దిష్టే పూర్వస్య అను పరిభాషచే అది

పరమగునపు డమనర్థము కలుగును. హల్లుకు పరముగానున్నదియు, ఉపధగానున్నదియునగు తద్ధితప్రత్యయసంబంధియగు యకారమునకు (య్) ఈకారము పరమగునపుడు లోపము వచ్చును. ఉదా : 'గార్గ్య' అనుపదములో యకారము ఉపధ. అకారము లోపించిన పిదప 'గార్గ్య్ + ఈ' అనియుండ, గ్ అను హల్లునకు పరముగా నున్నదియు 'యఞ్' అను తద్ధితప్రత్యయములోనిదియునగు యకారమునకు లోపమురాఁగా గార్గ్ + ఈ గార్గీ అగును. గార్గీ + సు = గార్గీ.

అవ : 'గార్గ్య' అను యఞంత ప్రాతిపదికమునకే స్త్రీత్వమున మఱియొక ప్రత్యయము విధింపఁబడుచున్నది.

సూ : ప్రాచాం ష్ఫ తద్ధితః 4-1-17.

వృ : యఞంతాత్ ష్ఫో వా స్యాత్ నచ తద్ధితః.

ప. వి : ప్రాచామ్ (6-3) ష్ఫ (ప్రథమావిభక్తిలోపించిన పదము) తద్ధితః (1-1).

అను : యఞః (5-1) స్త్రియామ్ (7-1) ప్రాతిపదికాత్ (5-1) ప్రత్యయః (1-1) పరః (1-1).

అర్థ : యఞంతమైన ప్రాతిపదికమునకు స్త్రీత్వమున 'ష్ఫ' అను ప్రత్యయము వైకల్పికముగా వచ్చును. అది తద్ధితమగును.

వివ : ప్రాచామ్ అనగా ప్రాచాంమతే-ప్రాచీనుల అభిప్రాయము ననుసరించి యనిభావము. అనగా తక్కినవారియభిప్రాయము ననుసరించి యీ ప్రత్యయము రాదని యర్థము. కావున వైకల్పికమనునర్థము సిద్ధించినది. 'యఞ్' అను తద్ధిత ప్రత్యయము అంతమునఁ గల ప్రాతిపదికముయొక్క స్త్రీత్వము వాచ్యమగునపుడు దానికి పరముగా 'ష్ఫ' అను ప్రత్యయము వైకల్పికముగా చేరును. దానికి తద్ధితమనియు సంజ్ఞకలుగును. ఇది తద్ధితాధికారములో లేనిదగుటచే, తద్ధిత ప్రత్యయము పరమగునపుడు కావలసిన కార్యము లిందవసరములగుటచే, ఈ సూత్రము చేతనే దీనికి తద్ధితసంజ్ఞ చేయఁబడెను.

ఉదా : గార్గ్య - ఇది యఞంతము. గార్గ్య + ష్ఫ - షః ప్రత్యయస్య-(ప్రత్యయముయొక్క ఆది షకారము ఇత్తగును) అనుసూత్రముచే షకారము ఇత్తయి లోపించును. గార్గ్య + ఫ - ఆయనేయీనీయియః ఫ ఢ ఖ ఛ ఘాం ప్రత్యయాదీనామ్-(ప్రత్యయములయొక్క ఆదివర్ణములైన ఫ్, ఢ్, ఖ్, ఛ్, ఘ్ అనువానికి క్రమముగ్గా ఆయన్, ఏయ్, ఈన్, ఈయ్, ఇయ్ అనువాదేశములగును)

అను సూత్రముచే 'అయన్' ఆదేశము. గార్గ్య + అయన్ + అ(ణ్ + అ) గార్గ్యాయన-రేఫసంబంధముచే నకారమునకు ణత్వము (అట్కు ప్వాఙ్నుమ్ వ్యవాయేఽపి) 'గార్గ్యాయణ'.

అవ : 'గార్గ్యాయణ' అనునది షకారమిత్తుగాఁగల ప్రత్యయము (ష్ఫ) అంతమునఁ గలది యగుటచే క్రిందిసూత్రముచే దానికి 'ఙీష్' ప్రత్యయము విధింపఁబడుచున్నది

సూ : షిద్గౌరాదిభ్యశ్చ 4-1-41.

వృ : ఙీష్స్యాత్. గార్గ్యాయణీ, నర్తకీ, గౌరీ, అనడుహీ, అనడ్వాహీ, ఆకృతిగణోఽయమ్.

ప. వి : షిద్గౌరాదిభ్యః (5-3) చ (అవ్య).

అను : స్త్రియామ్ (7-1) ప్రాతిపదికాత్ (5-1) ఙీష్ (1-1) ప్రత్యయః (1-1) పరః (1-1)

అర్థ : షిదంత ప్రాతిపదికములకును గౌరాది ప్రాతిపదికములకును స్త్రీత్వమున 'ఙీష్' ప్రత్యయము వచ్చును. ఉదా : గార్గ్యాయణీ మొఃణవి.

వివ : 'షిత్' అనగా షకారమిత్తుగాఁ గలది. అది ప్రాతిపదికమునకు విశేషణ మగుటచే తదంతవిధిచే షిత్తు అంతమునగల ప్రాతిపదికమునకు అనునర్థము కలుగును. అట్టిదానికిని, గౌరాదిగణములోని శబ్దములకును, వానిస్త్రీత్వము వాచ్యమగునపుడు, ఙీష్ ప్రత్యయము వచ్చును. ఇందు ఙకారషకారము లిత్తులు (లశక్వతద్ధితే, హలన్త్యమ్) అవి లోపించును (తస్యలోపః) 'ఈ' మిగులును.

ఉదా : 'గార్గ్యాయణ' షిదంతము - గార్గ్యాయణ + ఙీష్ - గార్గ్యాయణ + ఈ, యస్యేతిచ - అకారలోపము - గార్గ్యాయణీ + సు=గార్గ్యాయణీ.

'నర్తకి' ఇదియును షిదంతమే. నృత్‌ధాతువునకు 'శిల్పిని ష్వున్' అను సూత్రముచే ష్వున్ ప్రత్యయము. నృత్ + ష్వున్ (షకారనకారములిత్తులు) 'వు' అనుదానికి 'అక' ఆదేశము (యువోరనాకౌ) నృత్ + అక, 'పుగంతలఘూపధస్యచ' అనుసూత్రముచే ఋకారమునకు గుణము. 'అర్' వచ్చును. నర్త్ + అక = నర్తక - ఇట్లిది షిదంతము. నర్తక + ఙీష్, నర్తక + ఈ, నర్త్క్ + ఈ=నర్తకీ + సు=నర్తకీ.

గౌరాదుల కుదాహరణములు : గౌర + ఙీష్ - గౌర + ఈ, గౌర్ + ఈ = గౌరీ గౌరీ + సు = గౌరీ.

అనడుహ్, అనడ్వాహ్ - అని గౌరాదిగణములో పఠింపఁబడియుండుటవలన అనడుహ్ శబ్దమునకు వైకల్పికముగా 'ఆమ్' ఆగమము వచ్చునని చెప్పినట్లయినది. 'ఆమ్'లో మకారమిత్తు. మిత్తు అంత్యాచ్చునకు పరముగా చేరును. అనడు + ఆహ్ = యణాదేశము. అనడ్వాహ్. ఈ రెండుశబ్దములకు ఙీష్ ప్రత్యయము స్త్రీలింగమున వచ్చును. అనడుహ్ + ఈ = అనడుహీ + సు = అనడుహీ; అనడ్వాహ్ + ఈ = అనడ్వాహీ + సు = అనడ్వాహీ.

గౌరాదిగణము ఆకృతిగణము. ఇతరసూత్రములచే ఙీష్ విధానములేనివాని కీ సూత్రమే గతియనిభావము.

గౌరాదిగణము : గౌర మత్స్య మనుష్య శృఙ్గ పిఙ్గల హయ గవయ ముకయ ఋష్య [పుట తూణ] ద్రుణ ద్రోణ హరిణ కోకణ (కాకణ) పటర ఉణక [ఆమల] ఆమలక కువల బిమ్బ బదర ఫర్కరక (కర్కర) తర్కార శర్కార పుష్కర శిఖణ్డ సలద శష్కణ్డ సనన్ద సుషమ సుషవ అలిన్ద గడుల షాణ్డశ ఆఢక ఆనన్ద ఆశ్వత్థ సృపాట ఆఖక (ఆపచ్చిక) శష్కుల సూర్య (సూర్మ) శూర్మ సూచ యూష (పూష) యూథ సూప మేథ వల్లక ధాతక సల్లక మాలక మాలత సాల్వక వేతస వృక్ష (వృస) అతస [ఉభయ] భృఙ్గ మహ మఠ ఛేద పేశ మేద శ్వన్ తక్షన్ అనడుహీ అనడ్వాహీ 'ఏషణః కరణే' 42. దేహ దేహల కాకాదన గవాదన తేజన రజన లవణ ఔద్గాహమాని (ఔద్గాహమాని) గౌతమ (గోతమ)[పారక] అయస్థూణ (అయఃస్థూణ) భౌరికి భౌలికి భౌలిఙ్గి యాన మేధ ఆలమ్బి ఆలజి ఆలబ్ధి ఆలక్షి కేవాల ఆపక ఆరట నట టోట నోట మూలాట శాతన [పోతన] పాతన పాఠన (పానత) ఆస్తరణ అధికరణ అధికార ఆగ్రహాయణీ (ఆగ్రహాయణీ) ప్రత్యవరోహిణీ [సేచన] 'సుమఙ్గలాత్సంజ్ఞాయామ్' 43. అణ్డర సున్దర మణ్డల మన్థర మఙ్గల పట పిణ్డ [షణ్డ] ఊర్ద గుర్ద శమ సూద ఆర్ద (ఆర్ద్రా) హృద (హ్రద) పాణ్డ [భాణ్డల] భాణ్డ (లోహాణ్డ)కదర కన్దర కదల తరుణ తలున కల్మాష బృహత్ మహత్ (సోమ) సౌధర్మ. 'రోహిణీ నక్షత్రే' 44. 'రేవతీనక్షత్రే' 45. వికల నిష్కల పుష్కల 'కటాచ్ఛ్రోణివచనే' 46. :పిప్పల్యాదయశ్చ' 47 పిప్పలీ హరీతకీ (హరీతకీ) కోశాతకీ శమీ వరీ శరీ పృథివీ క్రోష్టు మాతామహ పితామహ-ఇతిగౌరాదిః.

సూ : వయసి ప్రథమే 4-1-20.

వృ : ప్రథమవయోవాచినోఽదన్తస్య ఙీప్. కుమారీ.

ప వి : వయసి (7-1) ప్రథమే (7-1).

అను : స్త్రియామ్ (7-1) ప్రాతిపదికాత్ (5-1) అతః (5-1) ఙీప్ (1-1) ప్రత్యయః (1-1) పరః (1-1)

అర్థ : ప్రథమవయోవాచకమైన అదంతప్రాతిపదికమునకు స్త్రీత్వమున ఙీప్ ప్రత్యయము వచ్చును ఉదా : కుమారీ.

వివ : ప్రాణులకు కాలముచేనైన అవస్థావిశేషమును వయస్సు అందురు బాల్యము, కౌమారము, యౌవనము, వార్ధకము అని వయస్సుయొక్క దశలు నాలుగు. అందు ప్రథమవయస్సునందున్న స్త్రీవ్యక్తిని వచించు అదంత ప్రాతిపదికమునకు 'ఙీప్' ప్రత్యయము వచ్చును. ఉదా : కుమార + ఙీప్, కుమార్+ ఈ = కుమారీ + సు = కుమారీ. (వయోదశలు మూఁడనియొక అభిప్రాయము. అందు మొదటిది కౌమారము. నాలుగను పక్షమున మొదటివి బాల్య కౌమారములని వ్యవహారము).

సూ : ద్విగోః 4-1-21.

వృ : అదన్తాద్ద్విగోర్ఙీప్. త్రిలోకీ. అజాదిత్వాత్ త్రిఫలా, త్ర్యనీకా.

ప. వి : ద్విగోః (5-1).

అను : స్త్రియామ్ (7-1) ప్రాతిపదికాత్ (5-1) అతః (5-1) ఙీప్(1-1) ప్రత్యయః (1-1) పరః (1-1).

అర్థ : అదంతమైన ద్విగువునకు స్త్రీత్వమున ఙీప్ ప్రత్యయము వచ్చును. ఉదా: త్రిలోకీ. అజాదిగణములోనివగుటచే త్రిఫలా, త్ర్యనీకా అనునవి టాబంతము లైనవి.

వివ : 'తద్ధితార్థోత్తరపదసమాహారేచ' అను తత్పురుషాధికారములోని సూత్రమువలన నేర్పడిన సమాసము సంఖ్యావాచకము పూర్వపదముగా నున్నయెడల ద్విగువనఁబడును (సంఖ్యాపూర్వోద్విగుః). అతః అనునది 'ద్విగోః' అనుదానికి విశేషణము. కావున 'అదంతమైన ద్విగువునకు' అనునర్థము కలుగును ఇది యంతయు ప్రాతిపదికమునకు విశేషణము హ్రస్వఅకారము అంతమునఁ గలదియు,

ద్విగుసంజ్ఞ కలదియునగు ప్రాతిపదికముయొక్క స్త్రీత్వము వాచ్యమగునపుడు, దానికి పరముగా 'జీప్' ప్రత్యయము వచ్చును.

ఉదా : త్రయాణాంలోకానాం సమాహారః-మూఁడులోకముల సమాహారము. త్రి + ఆమ్, లోక + ఆమ్, విభక్తిలోపము 'త్రిలోక' -'స నపుంసకమ్' అను సూత్రముచే ఇది నపుంసకము కావలసియున్నను "అకారాన్తోత్తరపదోద్విగుః స్త్రియామిష్టః" (అకారాంతము ఉత్తరపదముగాఁగలద్విగువు స్త్రీలింగమున నుండుట యిష్టము) అనువార్తికము ననుసరించి యిది స్త్రీలింగమగును త్రిలోక + జీప్, యస్యేతిచ - అకారలోపము. త్రిలోక్ + ఈ = త్రిలోకీ + సు = త్రిలోకీ.

త్రిఫల, త్ర్యనీక అను ద్విగువులకు ఈ సూత్రముచే జీప్ ప్రత్యయము రావలసియుండగా అజాదులలో వీనిని పఠించిరి. కావున దీనిని బాధించి టాప్ ప్రత్యయము వచ్చును. త్రిఫల + టాప్, త్రిఫల + ఆ = త్రిఫలా + సు = త్రిఫలా, త్ర్యనీక + ఆ = త్ర్యనీకా + సు = త్ర్యనీకా. (త్రయాణాం ఫలానాం సమాహారః - మూఁడు ఫలముల సమాహారము, త్రయాణామనీకానాం సమాహారః - మూఁడు అనీకముల (సేనల) సమూహము అని వీనికి అర్థము).

సూ : వర్ణాదనుదాత్తాత్తోపధాత్తో నః 4-1-39.

వృ : వర్ణవాచీ యోఽనుదాత్తాన్త స్తోపధ స్తదన్తా దనుపసర్జనాద్వా జీప్, తకారస్య చ నః. ఏతా - ఏనీ, రోహితా - రోహిణీ.

ప వి : వర్ణాత్ (5-1) అనుదాత్తాత్ (5-1) తోపధాత్ (5-1) తః (6-1) నః (1-1)

అను : వా (అవ్య) జీప్ (1-1) ప్రాతిపదికాత్ (5-1) అనుపసర్జనాత్ (5-1).

అర్థ : అనుదాత్తాంతమును, తోపధమును అయినవర్ణవాచకము అంతమునఁ గల అనుపసర్జనమైన ప్రాతిపదికమునకు పరముగా, స్త్రీత్వమున, జీప్ ప్రత్యయము వైకల్పికముగా వచ్చును. తకారమునకు నకారాదేశము కూడనగును. ఉదా : ఏనీ-ఏతా; రోహిణీ-రోహితా.

వివ : వర్ణమనగా రంగు. రంగునుతెలుపుశబ్దముయొక్క తుదిఅచ్చు అనుదాత్తమైనచో, ఆశబ్దము తకారోపధమైనచో దానియొక్క స్త్రీత్వము వాచ్యమగునపుడు, దానికి పరముగా జీప్ ప్రత్యయము వచ్చును. అది వచ్చునపుడు శబ్దములోని తకారమునకు నకారాదేశముకూడ వచ్చును.

ఉదా : ఏత - తెలుపు అనునర్థముగల వర్ణవాచకశబ్దము. 'వర్ణానాంతణతి నితాన్తానామ్' అనుఫిట్ సూత్రముచే 'త' అనునది అంతముననున్న వర్ణవాచకము యొక్క ఆద్యచ్చు ఉదాత్తమగును. తక్కినవి అనుదాత్తములని భావము. కావున నిది అనుదాత్తాంతము కాన 'ఙీప్' ప్రత్యయము వచ్చును ఏత+ఙీప్, ఏక + ఈ, తకారమునకు నకారాదేశము, ఏన+ఈ, యస్యేతిచ - అకారలోపము-ఏనీ+సు = ఏనీ - వైకల్పికమగుటచే ఙీప్ప్రత్యయనకారాదేశములు రానిచో ఏత + టాప్ (అజాద్యతష్టాప్) ఏతా + సు+ఏతా అగును.

ఇట్లే 'రోహిత' అనుదాత్తాంతమైన వర్ణవాచకము (ఎఱుపు) ఙీప్ ప్రత్యయము, నకారాదేశము, రోహిత+ఈ, రోహిన + ఈ, అకారలోపము, రోహినీ, రేఫయోగముచే నకారమునకు ణత్వము - రోహిణీ + సు = రోహిణీ. రానిచో రోహిత + టాప్ = రోహితా + సు = రోహితా. తకారమునకు నకారాదేశము ఙీప్ప్రత్యయము వచ్చునపుడే వచ్చును.

సూ : వోతో గుణవచనాత్ 4_1_44.

వృ : ఉదన్తాద్గుణవాచినో వాఙీప్. మృద్వీ, మృదుః.

ప వి : వా (అవ్య) ఉతః (5-1) గుణ వచనాత్ (5-1).

అను : స్త్రియామ్ (7-1) ప్రాతిపదికాత్ (5-1) ప్రత్యయః (1-1) పరః (1-1).

అర్థ : ఉదంతమైన గుణవాచక ప్రాతిపదికమునకు స్త్రీత్వమున ఙీప్ ప్రత్యయము వైకల్పికముగా వచ్చును. ఉదా : మృద్వీ మృదుః.

వివ : ఈ సూత్రములోనికి 'అన్యతో ఙీష్' అను సూత్రమునుండి 'ఙీష్' అనునది అనువృత్తము కావలసి యున్నది. కాని 'గుణవచనా న్ఙీబాద్యుదాత్తః' అనువార్తికము ననుసరించి 'ఙీప్' అనునదియేయిట ఉపస్థితమగును. గుణవచనప్రాతిపదికమునకు ఙీప్ ప్రత్యయమగును. అది ఆద్యుదాత్తమగును అని వార్తికార్థము. ఉతః అనునది గుణవచనాత్ అనుదానికి విశేషణము. కావున తదంతవిధిచే హ్రస్వ ఉకారము అంతమునఁ గలగుణవచనమున కనునర్థము కలుగును. అది ప్రాతిపదికాత్ అనుదానికి విశేషణము. ఉదంతమైన గుణవాచక ప్రాతిపదికముయొక్క స్త్రీత్వము వాచ్యమగునపుడు, దానికి పరముగా ఙీప్ ప్రత్యయము వచ్చునని సూత్రార్థము. ద్రవ్యములు నుండునది. కొన్ని ద్రవ్యముల యందుండనిది. వేర్వేఱుజాతులయందు

గోచరించునది, ఉత్పాద్యము, అనుత్పాద్యము అను రెండుభేదములు గలది. ద్రవ్యముకంటె భిన్నమైనది అను లక్షణములు గుణమునకుఁ జెప్పఁబడినవి.

సత్త్వేనివేశతేఽపైతి పృథగ్జాతిషుదృశ్యతే

ఆధేయశ్చాక్రియాజశ్చ సోఽసత్త్వప్రకృతిర్గుణః-భాష్యము

మృదు,శుచిమున్నగునవి గుణవాచకములు అందు ఉదంతగుణవాచములకు ప్రకృత సూత్రముచే ఙీప్ ప్రత్యయము. మృదు+ఙీప్, మృదు - ఈ, యణాదేశము, మృద్వీ సు=మృద్వీ; వైకల్పికము కాన రానిచో మృదు + సు=మృదుః అనియు స్త్రీత్వమున రూపముండును.

సూ : బహ్వాదిభ్యశ్చ 4-1-45.

వృ : వాఙీష్. బహ్వీ, బహుః.

ప. వి : బహ్వాదిభ్య (5-3) చ (అవ్య).

అను : స్త్రియామ్ (7-1) ఙీష్ (1-1) ప్రాతిపదికాత్ (5-1) వా (అవ్య) ప్రత్యయః (1-1) పరః (1-1),

అర్థ : బహుమున్నగు ప్రాతిపదికములకును స్త్రీత్వమున ఙీష్ ప్రత్యయము వైకల్పికముగా వచ్చును. ఉదా : బహ్వీ, బహుః.

వివ : బహుమున్నగుశబ్దముల స్త్రీత్వము వాచ్యమగునపుడు వానికి పరముగా 'ఙీష్' ప్రత్యయము వైకల్పికముగా పచ్చును ఉదా : బహు+ఙీష్ ఙకారష కారములిత్తులు బహు + ఈ, యణాదేశము బహ్ వ్ ఈ=బహ్వీ+సు = బహ్వీ. రానిచో బహు + సు=బహుః.

బహ్వాదిగణములోని రెండుగణసూత్రము లిట వ్యాఖ్యానింపఁ బడుచున్నవి.

గ. సూ : కృదికారాదక్తినః (50).

వృ : రాత్రిః - రాత్రీ

ప వి : కృదికారాత్ (5 1) అక్తినః (5-1).

అర్థ : క్తిన్ ప్రత్యయముకాక తక్కిన కృత్ప్రత్యయసంబంధమైన ఇకారము అంతమునఁగల ప్రాతిపదికమునకు స్త్రీత్వమున ఙీష్ ప్రత్యయము వైకల్పికముగా వచ్చును. ఉదా : రాత్రిః-రాత్రీ.

వివ : ధాతువునకుఁ జేరుతెఱ్పన్నప్రత్యయములు కృత్తులు. 'క్తిన్' (స్త్రియాం క్తిన్) అనునది కాక తక్కిన కృత్ప్రత్యయములకు సంబంధించిన

ఇకారము అంతమునఁ గల ప్రాతిపదికమునకు స్త్రీత్వము వాచ్యమగునపుడు 'ఙీష్' ప్రత్యయము వైకల్పికముగా వచ్చును. ఉదా : రాత్రి - 'రా' దానే అనుధాతువునకు 'రాశదిభ్యాం త్రిప్' అను సూత్రముచే 'త్రిప్' అను ప్రత్యయము చేయగా 'రాత్రి' అగును ఇది కృదికారము అంతమునఁ గలప్రాతిపదికము. దీనికి ప్రకృత సూత్రముచే ఙీష్ ప్రత్యయము రాఁగా రాత్రి + ఙీష్, రాత్రి + ఈ ఇకారలోపము రాత్ర్ + ఈ = రాత్రీ + సు = రాత్రీ. ఙీష్‌రానిచో రాత్రి + సు = రాత్రిః అని యగును.

అవ : పై గణసూత్రమునకు కొంతసవరణము నీక్రింది గణసూత్రము చేయుచున్నది

గ. సూ : సర్వతోఽక్తిన్నర్థాదిత్యేకే (51).

వృ : శకటిః, శకటీ.

ప వి : సర్వతః (అవ్య) అక్తిన్నర్థాత్ (5-1) ఇతి (అవ్య) ఏకే (1-3)

అర్థ : క్తిన్నర్థముకాని యే ఇకారాంతమునకైనను ఙీష్ ప్రత్యయము వైకల్పికముగా నగునని కొందఱందురు. ఉదా : శకటిః, శకటీ.

వివ : పై గణసూత్రముచే కృత్ప్రత్యయమునకు సంబంధించిన ఇకారము అంతమునఁ గలదానికే ఙీష్ ప్రత్యయము చెప్పఁబడగా 'క్తిన్' ప్రత్యయమును, ఆ అర్థముగల యితరప్రత్యయమును కాక తక్కినయే ప్రత్యయముయొక్క ఇకారము అంతమునఁ గల ప్రాతిపదికమునకైనను ఙీష్ ప్రత్యయము వైకల్పికముగా నగునని యీ సూత్రము చెప్పుచున్నది. ఇది కొందఱఅభిప్రాయమని 'ఏకే' అను పదము వలన తెలియుచున్నది.

ఉదా : 'శకటి' - ప్రకృతిప్రత్యయవిభాగముచేయుటకు వీలులేని అవ్యుత్పన్నప్రాతిపదిక మియ్యది కావున కృదంతము కాదు. కృదికారాంతమునకేఅనినచో దీనికి ఙీష్ ప్రత్యయము రాకపోవును. శకటి + ఙీష్, శకట్ + ఈ = శకటీ + సు = శకటీ; రానిచో శకటి + సు = శకటిః.

బహ్వాదిగణము : బహు పద్ధతి అఞ్చతి అఙ్కతి అంహతి శకటి (శకతి). 'శక్తిః శస్త్రే' 48. శారి వారి రాతి రాధి (శాధి) అహి కపి యష్టి ముని 'ఇతః ప్రాణ్యఙ్గాత్' 49 'కృదికారాదక్తినః' 50. సర్వతోఽక్తిన్నర్థాదిత్యేకే' 51. చణ్డ అరాల కృపణ కమల వికట విశాల విశఙ్కట భరుజ ధ్వజ. 'చన్ద్రభాగా

స్నద్యామ్' 52 (చన్ద్రభాగా నద్యామ్) కల్యాణ ఉదార పురాణ అహన్ క్రోడ నఖ ఖుర శిఖా బాల శఫ గుద–ఆకృతిగణో ఽయమ్. తేన భగ గల రాగ ఇత్యాది - ఇతి బహ్వాదయః.

సూ : పుంయోగాదాఖ్యాయామ్ 4-1-48.

వృ : యా పుమాఖ్యా పుంయోగాత్ స్త్రియాం వర్తతే తతో ఙీష్. గోపస్య స్త్రీ గోపీ.

ప. వి : పుంయోగాత్ (5-1) ఆఖ్యాయామ్ (7-1).

అను : స్త్రియామ్ (7-1) ఙీష్ (1-1) ప్రత్యయః (1-1) పరః (1-1) ప్రాతిపదికాత్ (5-1).

అర్థ : ఏ పురుషనామము పురుషసంబంధముగల స్త్రీయందు వర్తించునో అట్టి ప్రాతిపదికమునకు ఙీష్ ప్రత్యయము వచ్చును. ఉదా : గోపస్యస్త్రీ గోపీ.

వివ : 'ఆఖ్యాయామ్' అనునది పంచమ్యర్థమున సప్తమిచేరినరూపము. కావున ఆఖ్యావాచకశబ్దమునకు అనునర్థము వచ్చును. ఆఖ్య అనగా పేరు ఎవని పేరు' అను ఆకాంక్షకు సమాధానముగా 'పుంయోగాత్' అను పదమునుబట్టి 'పురుషుని పేరు' అనునర్థము సిద్ధించును. పుంయోగమనగా పురుషునియొక్క సంబంధము. ఇచటి పంచమికి హేతువు అర్థము. పురుషునితో స్త్రీకిఁగల సంబంధమును బట్టి ఏ పురుషనామము స్త్రీయందు వర్తించునో అట్టి పురుషవాచక ప్రాతిపదికమునకు ఙీష్ ప్రత్యయము వచ్చునని సూత్రార్థము అనగా నొక స్త్రీవ్యక్తి తనకు సంబంధించిన పురుషునిపేరితో వ్యవహరింపఁబడునెడల ఆ నామమును వచించు ప్రాతిపదికమునకు పరముగా ఙీష్ ప్రత్యయము వచ్చునని ఫలితార్థము.

ఉదా : గోపస్యస్త్రీ - ఇచట గోపునిభార్య తనభర్తకు పేరైన గోప అను శబ్దముతో వ్యవహరింపఁబడుచున్నది. కావున 'గోప' అనునది యిచట పుంయోగము వలన స్త్రీయందు వర్తించు ఆఖ్య (=పేరు)ను తెలుపుశబ్దము గోప + ఙీష్ - గోప + ఈ, యస్యేతిచ - అకారలోపము గోప్ + ఈ = గోపీ + సు=గోపీ.

పుంయోగమున ఙీష్ ప్రత్యయము సాధారణముగా అదంతములకే వచ్చును. ('అతః' అనుపదము ననువర్తింపఁజేయుటచే ఈ యర్థము కలుగును) మఱియు పుంయోగము అనుపదముచే సాధారణముగా భార్యాభర్తృత్వసంబంధమునే గ్రహింపవలయు నని భాష్యకారులశాసనము. కావున గోపుని కూతురు, గోపుని తల్లిమున్నగు

నర్థములందు జీష్ ప్రత్యయము ఈ సూత్రముచే రాదని యెఱుంగునది. మఱియు స్వయముగా గోవులను పాలించునది అనునర్థమునందును ఈ ప్రత్యయమురాదు.

అవ : పై సూత్రమునకొక అపవాదము చెప్పఁబడుచున్నది.

వా॥ పాలకాన్తాన్న (2461).

వృ గోపాలికా, అశ్వపాలికా.

ప. వి : పాలకాన్తాత్ (5-1) న (అవ్య).

అర్థ : పాలక శబ్దమంతమునఁ గల పురుషనామము స్త్రీయందు వర్తించు నపుడు దానికి పరముగా జీష్ ప్రత్యయము రాదు. ఉదా : గోపాలికా, అశ్వపాలికా.

వివ : 'గోపాలక' అనునది పురుషనామము. గోపాలకుని స్త్రీ అనునర్థమునందు పై సూత్రముచే ప్రాప్తమగు జీష్ ప్రత్యయము నీ వార్తికము వారించుచున్నది 'జీష్' ప్రత్యయము రానిచో అదంతమగుటచే టాప్ ప్రత్యయము వచ్చును (అజాద్యతష్టాప్) గోపాలక + టాప్, టకార పకారము లిత్తులు. గోపాలక + ఆ, ముందుఁ జెప్పఁబడు సూత్రముచే 'ల'లోని అకారమునకు ఇకారాదేశము. గోపాలిక+ఆ, సవర్ణదీర్ఘము, గోపాలికా+సు=గోపాలికా. అట్లే అశ్వపాలకస్య స్త్రీ - అశ్వపాలికా.

అవ : పై ఉదాహరణములందు అత్వమున కిత్వమును ఈ క్రింది సూత్రము విధించుచున్నది.

సూ : ప్రత్యయస్థాత్కాత్పూర్వస్యాత ఇదాప్యసుపః 7-3-44

వృ: ప్రత్యయస్థాత్కాత్పూర్వస్యాకారస్యేకారస్యాదాపి నఆప్సుపః పరో న చేత్. సర్వికా, కారికా, అతః కిమ్? నౌకా. ప్రత్యయస్థాత్కిమ్? శక్నోతీతి శకా. అసుపః కిమ్? బహు పరివ్రాజకా. నగరీ.

ప. వి : ప్రత్యయస్థాత్ (5-1) కాత్ (5-1) పూర్వస్య (6-1) అతః (6-1) ఇత్ (1-1) ఆపి (7-1) అసుపః (5-1).

అర్థ : సుప్పునకు పరముగాలేని అప్పు పరమగునపుడు, ప్రత్యయస్థమైన కకారమునకు పూర్వమున నున్న అత్తునకు హ్రస్వఇకార మాదేశమగును ఉదా : సర్వికా, కారికా. అతఃఅనుటవలన నౌకా అనుచోటను, 'ప్రత్యయస్థాత్' అనుట వలన 'శకా' అనుచోటను, అసుపః అనుటవలన బహుపరివ్రాజకా (నగరీ) అను చోటను ఇత్వము రాదు.

వివ : ప్రత్యయస్థమనగా ప్రత్యయమునందున్నది ప్రత్యయము లనగా 3,4,5 అధ్యాయములందు విధింపఁబడిన సనాదులు, అట్టివానిలోనున్న కకారమునకు పూర్వమున నున్న హ్రస్వ అకారమునకు హ్రస్వఇకారము ఆదేశముగా వచ్చును ఇట్లు వచ్చుటకు ఆప్ప్రత్యయము నిమిత్తము. అనగా 'ఆప్' అనునది పరముగా నుండవలయును. (టాప్, డాప్, చాప్ అనుమూఁడు స్త్రీప్రత్యయములకు 'ఆప్' అని సామాన్య వ్యవహారము) మఱియు నొక నియమము. ఆ అప్రత్యయము సుప్పునకు (నామవిభక్తికి) పరముగా నుండునది కారాదు.

ఉదా : సర్వ అను సర్వనామమునకు 'అకచ్' అను తద్ధిత ప్రత్యయము చేరఁగా 'సర్వక' అనియగును (అవ్యయసర్వనామ్నామకచ్ ప్రాక్టేః) దీనికి 'అజాద్య తష్టాప్' అనుసూత్రముచే స్త్రీత్వము టాప్ ప్రత్యయము చేయగా సర్వక + టాప్, 'సర్వక+ఆ' అనియుండును ఇందలికకారము ప్రత్యయములోనిది (అకచ్) దీనికి పరముగా 'ఆప్' ప్రత్యయము గలదు 'సర్వక' అనుదానికి సుప్పుచేరకముందే 'ఆప్' ప్రత్యయము వచ్చినది కావున 'ఆప్' అనునది సుప్పునకు పరము లేనిదియే. ఇట్టిస్థితిలో కకారమునకు పూర్వమున నున్న 'ర్వ' లోని అకారమున కీసూత్రముచే ఇకారాదేశము రాగా సర్విక + ఆ - సర్వికా + సు = సర్వికా అగును.

కృధాతువునకు కర్త్రర్థమున 'ణ్వుల్తృచౌ' అను సూత్రముచే ణ్వుల్ ప్రత్యయము. ఇందు ణకారలకారము లిత్తులు, కృ + వు-ప్రత్యయము ణిత్తగుటచే ధాతువులోని ఋకారమునకు వృద్ధివచ్చును. (అచోఞ్ణితి) (ఋ> ఆర్-ఉరణ్ రపరః) కార్ + వు, 'యువోరనాకౌ' అనుసూత్రముచే 'వు' అనుదానికి 'అక' ఆదేశము. కార్ + అక = కారక. ఇట్లిందలికకారము ప్రత్యయస్థము. దీనికి స్త్రీత్వమున టాప్ ప్రత్యయము. కారక + ఆ, ఇత్వము, కారిక + ఆ=కారికా + సు=కారికా. 'గోపాలికా' ఇత్యాదులందు లకారముమీఁది అకారమున కికార మీసూత్రముచేతనే వచ్చినది.

ఈ సూత్రమునందలి యాయాదశముల సార్థక్యమును చూపుచున్నారు.

అతః అనుటవలన హ్రస్వఅకారముకాక తక్కిన అచ్చునకు ఈఇకారాదేశము రాదు. ఉదా : నౌక + ఆ ప్రత్యయస్థమైన కకారమునకు, ఆప్ పరముగానున్నది. కాని కకారమునకు పూర్వమున నున్న అచ్చు ఔకారము. అట్టిదానికి ఇత్వము రాకుండుటకై 'అతః' అనుపదము సూత్రమున నవసరమగుచున్నది. అది లేనిచో 'నికా' వంటి అనిష్టరూపము లేర్పడును.

'ప్రత్యయస్థాత్' – ప్రత్యయములోనున్న అనుటవలన కకారము ప్రత్యయమునందలిది కానిచో తత్పూర్వమున నున్న హ్రస్వ అకారమునకు ఇత్వము రాదు. ఉదా : శక్నోతీతి – శకా 'శక' ఇందలి కకారము ధాతువునకు సంబంధించినది ('శక్') ప్రత్యయము 'అ' అనునదిమాత్రమే. కాన 'శక' అనుదానికి టాప్పు పరమగునపుడు 'శ'లోని అకారమునకు ఇత్వమురాదు. సూత్రమున 'ప్రత్యయస్థాత్' అను పదములేనిచో 'శికా' వంటిఅనిష్టరూపము లేర్పడును ('శక' అనుచోట 'నన్దిగ్రహిపచాదిభ్యో ల్యుణిన్యచః' అను సూత్రముచే 'అచ్' ప్రత్యయము వచ్చినది).

అసుపః – ఆప్ ప్రత్యయము సుప్పునకు పరముగా నున్నది కారాదు అనుటవలన 'బహుపరివ్రాజకానగరీ' అనుచోట ఇత్త్వమురాలేదు. బహవః పరివ్రాజకాః యస్యాం నగర్యాం సా బహుపరివ్రాజకా–అనేకపరివ్రాజకులు (సన్న్యాసులు) గలనగరి. పరివ్రాజకశబ్దములోని కకారము ప్రత్యయస్థమే. పరి, వ్రజ్ + ణ్వుల్=పరివ్రాజక అగును. దానికి పూర్వమున హ్రస్వ అకారము గలదు. పరముగా 'ఆప్' ప్రత్యయము ఉన్నది కాని అది సుప్పునకు (నామవిభక్తికి)పరముగా వచ్చినది. 'బహు+జస్, పరివ్రాజక+జస్' అనియుండ 'అనేకమన్యపదార్థే' అను సూత్రముచే సమాససంజ్ఞ కలుగును. సమాసమైనది ప్రాతిపదికమగును (కృత్తద్ధిత సమాసాశ్చ) ప్రాతిపదికావయవమగు సుప్పునకు లుక్కువచ్చును (సుపో ధాతు ప్రాతిపదికయోః). 'బహుపరివ్రాజక' అనియుండ దీనికి స్త్రీత్వమున 'టాప్' ప్రత్యయము వచ్చినది. ఇది అదర్శనమును పొందియున్న 'జస్' అనుసుప్పునకు పరముగా నున్నదికదా! కావున అట్టి ఆ ప్రత్యయము పరమగునపుడీ ఇత్వము రాకుండుటకై సూత్రమున 'అసుపః' అనుపదము ఉంచఁబడినది. కావున 'జ' లోని అకారమునకు ఇత్వమురాదు. బహుపరివ్రాజక + ఆ=బహు పరివ్రాజకా + సు= బహుపరివ్రాజకా నగరీ.

అవ : పుంయోగమున నొక అపవాదము చెప్పఁబడుచున్నది.

వా॥ సూర్యాద్దేవతాయాం చాప్ వాచ్యః (2471).

వృ : సూర్యస్య(స్త్రీ) దేవతా సూర్యా.

ప. వి : సూర్యాత్ (5-1) దేవతాయామ్ (7-1) చాప్ (1-1) వాచ్యః (1-1).

అర్థ : సూర్యశబ్దమునకు పుంయోగమున, దేవత చెప్పఁబడునపుడు, 'చాప్' అను ప్రత్యయము వచ్చును. ఉదా : సూర్యుని స్త్రీయగు దేవత-సూర్యా.

వివ - సూర్యశబ్దముతో వ్యవహరింపఁబడు సూర్యునిస్త్రీని చెప్పవలసినపుడు సూర్యశబ్దమునకు పరముగా 'చాప్' ప్రత్యయము వచ్చును. ప్రత్యయాంతముచే వాచ్యయగునది దేవజాతి స్త్రీయైనపుడే యిది వచ్చును. ఇది పుంయోగా దిత్యాది సూత్రముచే వచ్చుఙీష్ ప్రత్యయమున కపవాదము. ఉదా : సూర్యస్య స్త్రీ దేవతా. సూర్యునిభార్య (దేవత) సూర్య + చాప్ (చకారపకారము లిత్తులు) సూర్య +, అ సవర్ణదీర్ఘ సంధి, సూర్యా + సు=సూర్యా.

వృ: దేవతాయామ్ కిమ్ ?

అర్థ : దేవత గమ్యమానమగునపుడు అనవేల ? సూర్యునిస్త్రీ యైన మానవ జాతి స్త్రీవాచ్యయగునేని ఈ ప్రత్యయము రాదు. "పుంయోగాదాఖ్యాయామ్" అను సూత్రముచే 'ఙీష్' ప్రత్యయమే వచ్చును. ఉదా : సూర్యస్త్రీ సూరీ కున్తీ. సూర్యునియొక్క స్త్రీ అయిన కుంతి. ఈమె దేవజాతికాదు. మానుషికావున చాప్ ప్రత్యయము రాదు. ప్రక్రియక్రింద చూపఁబడుచున్నది.

వా: సూర్యాగస్త్యయోశ్ఛే చ ఙ్యాఞ్చ 4199.

వృ : యలోపః సూరీకున్తీ, మానుషీయమ్.

ప. వి : సూర్యాగస్త్యయోః (6-2) ఛే (7-1) చ (అవ్య) ఙ్యామ్ (7 7) చ (అవ్య).

అర్థ : సూర్య, అగస్త్యశబ్దములకు ఛ, ఙీ ప్రత్యయములు పరములగునపుడు ఉపధయగు యకారమునకు లోపము వచ్చును. ఉదా : సూరీ.

వివ : 'సూర్యతిష్యా గస్త్యమత్స్యానాం య ఉపధాయాః' అనుసూత్రము సూర్యాదిశబ్దముల ఉపధయగు యకారమునకు లోపమును విధించుచున్నది. ఆ సూత్రమున కనుబంధముగా ఈ వార్తికము చెప్పఁబడినది. సూర్య, అగస్త్య శబ్దములయొక్క ఉపధయగు యకారమునకు ఛ ప్రత్యయమును, ఙీప్రత్యయమును పర మగునపుడు లోపము వచ్చునని తాత్పర్యము. ఇందు యథాసంఖ్యనియమమ్ములేదు.

ఉదా : సూర్య + ఙీష్ - మానుషియగు కుంతి సూర్యశబ్దముచే, సూర్యునితోఁ గల సంబంధమును బట్టి చెప్పఁబడునపుడు 'దేవతాయామ్' అనుపదమువలన 'చాప్' రాదు కావున ఙీష్ వచ్చినది. సూర్య + ఈ, యస్యేతి చ-అకారలోపము - ప్రకృతవార్తికముచే యకారలోపము, సూర్ + ఈ = సూరీ + సు = సూరీ.

సూర్యా = సంజ్ఞాదేవి, లేక ఛాయాదేవి (చాబంతము) సూరీ = కుంతి ఙీషంతము.

అవ : పుంయోగలక్షణమున ఙీష్ప్రత్యయముతోపాటు కొన్నింటికి ఆనుగాగమము వచ్చుట చెప్పఁబడుచున్నది.

సూ : ఇన్ద్రవరుణభవశర్వరుద్ర మృడహిమారణ్య యవయవనమాతులాచార్యాణామానుక్ 4-1-49.

వృ : ఙీష్ చ. ఇన్ద్రస్య స్త్రీ ఇన్ద్రాణీ, వరుణానీ, శర్వాణీ, రుద్రాణీ, మృడానీ.

ప. వి : ఇన్ద్ర.........చార్యాణామ్ (6-3) ఆనుక్ (1-1).

అను : ఙీష్ (1-1) స్త్రియామ్ (7-1) పుంయోగాత్ (5-1) ఆఖ్యాయామ్ (7-1).

అర్థ : ఇంద్ర, వరుణ, భవ, శర్వ, రుద్ర, మృడ, హిమ, అరణ్య, యవ, యవన, మాతుల, ఆచార్య అనుశబ్దములకు ఆనుగాగమము ఙీష్ప్రత్యయమును వచ్చును. ఉదా : ఇన్ద్రాణీ మొ॥వి.

వివ : ఇంద్ర, వరుణ, భవ, శర్వ, రుద్ర, మృడ, మాతుల, ఆచార్య అనుశబ్దములకు, 'పుంయోగాదాఖ్యాయామ్' అనుసూత్రముచే అతనిభార్య అనునర్థమున 'ఙీష్' ప్రత్యయము వచ్చునపుడు ప్రకృతసూత్రముచే 'ఆనుక్' అనునాగమము వచ్చును. హిమ, అరణ్య, యవ, యవన అనువానికి పుంయోగలక్షణము లేదు కావున వానికి స్త్రీత్వమున ఆనుగాగమము ఙీష్ప్రత్యయమును ఈ సూత్రముచేతనే వచ్చును. వీనికి ఏ యే యర్థములందు ఈ ప్రత్యయమును ఈ యాగమమును వచ్చునో ముందు వివరింపఁబడును. ఈ ఆగమమునందు కకారముఇత్తు. ఉకారము ఉచ్చారణార్థకము. 'ఆన్' మిగులును. ఇది కిత్తగుటచే ఇంద్రాది శబ్దములకు అంతభాగమున వాని అవయవముగా చేయును. (ఆద్యన్తౌటకితౌ).

ఉదా : (1) ఇన్ద్రస్య స్త్రీ - ఇంద్రునియొక్క-భార్య-ఇన్ద్ర + ఆనుక్ + ఙీష్ ఇన్ద్ర + ఆన్ + ఈ = ఇన్ద్రానీ, రేఫయోగముచే నకారమునకు ణత్వము (అట్కుప్వాఙ్నుమ్వ్యవాయేఽపి) ఇన్ద్రాణీ + సు = ఇన్ద్రాణీ (2) వరుణస్య స్త్రీ - వరుణునిభార్య - వరుణ + ఆన్ + ఈ = వరుణానీ + సు = వరుణానీ. (3) భవస్య స్త్రీ-భవునిభార్య-భవ + ఆన్ + ఈ = భవానీ - సు = భవానీ. (4) శర్వస్య స్త్రీ, శర్వుని భార్య - శర్వ + ఆన్ + ఈ, శర్వానీ ణత్వము, శర్వాణీ + సు = శర్వాణీ. (5) రుద్రస్య స్త్రీ - రుద్రునిభార్య రుద్ర + ఆన్ + ఈ = రుద్రానీ, ణత్వము, రుద్రాణీ + సు = రుద్రాణీ (6) మృడస్య స్త్రీ, మృడునిభార్య, మృడ + ఆన్ + ఈ = మృడానీ + సు = మృడానీ.

అవ : హిమ, అరణ్య, యవ, యవన అనుశబ్దములకు పుంయోగలక్షణము సరిపడదు కావున వానికేయేయర్థములందీ ఆనుగాగమఙీష్ప్రత్యయములు వచ్చునో క్రిందివార్తికములచే చెప్పఁబడుచున్నది.

వా॥ హిమారణ్యయోర్మహత్త్వే 2472.

వృ : మహద్ధిమం హిమానీ; మహదరణ్య మరణ్యానీ.

ప. వి : హిమారణ్యయోః (6-2) మహత్త్వే (7-1).

అర్థ : హిమ, అరణ్యశబ్దములకు మహత్త్వము వ్యక్తమగునపుడు ఆనుగాగమ ఙీష్ ప్రత్యయములు వచ్చును. ఉదా : హిమానీ, అరణ్యానీ.

వివ : మహత్త్వమనఁగా గొప్పతనము. పెద్దది, గొప్పది అనునర్థమును వ్యక్తము చేయుచు హిమ, అరణ్యశబ్దములకు ఆనుగాగమమును, ఙీష్ ప్రత్యయమును వచ్చును.

ఉదా: మహద్ హిమమ్ = గొప్పమంచు, హిమ + ఆన్ + ఈ. సవర్ణదీర్ఘము- హిమానీ + సు = హిమానీ. మహదరణ్యమ్-గొప్పఅరణ్యము-అరణ్య + ఆన్ + ఈ = అరణ్యానీ + సు = అరణ్యానీ.

వా॥ యవాద్దోషే 2473.

వృ : దుష్టో యవో యవానీ.

ప. వి : యవాత్ (5-1) దోషే (7-1).

అర్థ : యవశబ్దమునకు, దుష్టమైనది అనునర్థమునందు, ఆనుగాగమ ఙీష్ ప్రత్యయములు వచ్చును.

వివ : 'దుష్టమైనది' అనునర్థమును వ్యక్తముచేయుచు యవశబ్దమునకు పర ముగా అనుగాగమమును, జీష్ ప్రత్యయమును వచ్చును. దుష్టః యవః = చెడిన యవము-యవ + ఆన్ + ఈ=యవానీ + సు=యవానీ.

వా॥ యవనాల్లిప్యామ్ 2474.

వృ : యవనానాం లిపిర్యవనానీ.

ప వి : యవనాత్ (5-1) లిప్యామ్ (7-1)

అర్థ : యవనశబ్దమునకు, 'వారిలిపి' అనునర్థమునందు అనుగాగమ జీష్ప్రత్యయములు వచ్చును. యవనానీ=యవనులలిపి.

వివ : యవనశబ్దమునకు అనుగాగమమును జీష్ ప్రత్యయమును చేరిన శబ్ద మునకు 'యవనులలిపి'అని యర్థమగునని తాత్పర్యము. యవన+ఆన్ + ఈ = యవనానీ+సు=యవనానీ.

వా॥ మాతులోపాధ్యాయయోరానుగ్వా 2475.

వృ : మాతులానీ - మాతులీ; ఉపాధ్యాయానీ - ఉపా ధ్యాయీ.

ప. వి : మాతులోపాధ్యాయయోః (6-2) ఆనుక్ (1-1) వా (అవ్య).

అర్థ : మాతుల, ఉపాధ్యాయశబ్దములకు అనుగాగమము వైకల్పికము. ఉదా : మాతులానీ-మాతులీ; ఉపాధ్యాయానీ-ఉపాధ్యాయీ

వివ : ఇందు మాతుల శబ్దమునకు అనుగాగమము నిత్యముగా వచ్చుచున్నది. ఉపాధ్యాయశబ్దమునకు అనుగాగమము వచ్చుటకు విధిలేదు. అట్టియెడ నీరెంటికిని ప్రకృతవార్తికముచే వైకల్పికముగా అనుగాగమము విధింపఁబడుచున్నది. జీష్ ప్రత్యయము మాత్రము "పుంయోగాదాఖ్యాయామ్" అనుసూత్రముచే నిత్యముగనే వచ్చును.

ఉదా : మాతులస్య స్త్రీ - మేనమామభార్య, మాతుల + ఆనుక్ + జీష్ = మాతుల + ఆన్ + ఈ, సవర్ణదీర్ఘము = మాతులానీ + సు = మాతులానీ, అనుగాగమము రానిచో మాతుల + జీష్, మాతుల + ఈ, యస్యేతిచ-అకార లోపము. మాతుల్ + ఈ=మాతులీ + సు=మాతులీ.

ఉపాధ్యాయస్య స్త్రీ - ఉపాధ్యాయ + ఆన్ + ఈ = ఉపాధ్యాయానీ +

సు=ఉపాధ్యాయానీ, అనుక్కరానిచో ఉపాధ్యాయ + ఈ,ఉపాధ్యాయ్+ఈ=ఉపాధ్యాయీ + సు=ఉపాధ్యాయీ.

[విభాష మూఁడు విధములు - ఒకకార్యము ఒకసూత్రముచే నిత్యముగా ప్రాప్తించుచుండగా వైకల్పికమని చెప్పినచో దానిని ప్రాప్తవిభాష యందురు ఒక కార్యమునకు ప్రాప్తియే లేనియపుడు వైకల్పికముగా విధించినచో దానిని అప్రాప్త విభాషయందురు. ఒకకార్యము కొన్ని లక్ష్యములందు నిత్యముగా ప్రాప్తించుచుండగా కొన్నింటియందు ప్రాప్తింపకుండగా, వైకల్పికముగా విధించినచో దానిని, ప్రాప్తాప్రాప్త విభాషయందురు. ఇందు ప్రకృత వార్తికము ప్రాప్తాప్రాప్త విభాష కుదాహరణము].

వా॥ ఆచార్యాదణత్వం చ 2477.

వృ : పుంయోగే. ఆచార్యానీ. ఆచార్యా స్వయం వ్యాఖ్యాత్రీ.

ప. వి : ఆచార్యాత్ (5-1) అణత్వమ్ (1-1) చ (అవ్య).

అర్థ : ఆచార్యశబ్దమునకు పుంయోగలక్షణమున ఆనుగాగమజీష్ప్రత్యయములు వచ్చునపుడు నకారమునకు ణత్వము రాకుండుటయు నగును

ఉదా : ఆచార్యానీ. ఇది పుంయోగమునందే. స్వయముగా వ్యాఖ్యానము చేయు స్త్రీ అనునర్థమున 'ఆచార్యా' అగును.

వివ : ఆచార్యశబ్దమునకు ఇంద్రవరుణేత్యాది సూత్రముచే ఆనుగాగమును, పుంయోగాదాఖ్యాయామ్ అనుసూత్రముచే జీష్ ప్రత్యయమును వచ్చును. ఈశబ్దములో రేఫముగలదు. దానికి అవ్యవహితముగాఁగాని, కొన్నివర్ణములతో వ్యవహితముగాఁగాని పరముగనున్న నకారమునకు ణకారాదేశము రావలయును. (అట్కుప్వాఙ్ నుమ్ వ్యవాయేఽపి) ఈ వార్తికముచే ఆ ణత్వము విషేధింపఁబడుచున్నది. ఆనుగాగమములోని నకారమునకు ఆచార్యశబ్దమునందు ణత్వమురాదు. ఆచార్యస్యస్త్రీ - ఆచార్యనిభార్య - ఆచార్య + ఆన్ + ఈ = ఆచార్యానీ+సు= ఆచార్యానీ.

పుంయోగము లేనిచో ఈ ఆనుగాగమజీష్ప్రత్యయములు రావు. స్వయముగా వేదాదులను బోధించునది అనునర్థమున పురుషనామముతో పురుషసంబంధమును బట్టి వ్యవహరింపఁబడుటలేదు కావున జీష్ ప్రత్యయమును, దానితోపాటు వచ్చు ఆనుగాగమమును రావు. ఆచార్యశబ్దమదంతమగుటచే 'అజాద్యత ష్టాప్'

అనుసూత్రముచే 'టాప్' ప్రత్యయము వచ్చును. అచార్య + టాప్, ఆచార్య + అ, సవర్ణదీర్ఘ సంధి, అచార్యా + సు=అచార్యా.

వా।। అర్యక్షత్రియాభ్యాం వా స్వార్థే 2478.

వృ : అర్యాణీ-అర్యా, క్షత్రియాణీ-క్షత్రియా; పుంయోగే అర్యీ, క్షత్రియీ.

ప. వి ; అర్యక్షత్రియాభ్యామ్ (5-2) వా (అవ్య) స్వార్థే (7-1).

అర్థ : అర్య, క్షత్రియశబ్దములకు స్వార్థమునందు అనుగాగమఙీప్ప్రత్యయములు స్త్రీత్వమున వచ్చును. ఉదా : అర్యాణీ - అర్యా; క్షత్రియాణీ-క్షత్రియా-పుంయోగమున నైనచో అర్యీ-క్షత్రియీ అనియగును.

వివ : అర్య, క్షత్రియ - అనునీశబ్దములయొక్క- స్త్రీత్వము వాచ్యమగునపుడు వానికి అనుగాగమఙీప్ప్రత్యయములు స్వార్థమునందే వైకల్పికముగా వచ్చును. స్వార్థమునందే యనగా వైశ్యజాతిస్త్రీ క్షత్రియస్త్రీ అనునర్థమునందు వచ్చును అర్యుని (వైశ్యుని) భార్య, క్షత్రియునిభార్య అనునర్థమునందు ఈ ఆనుగాగమము రాదు. ఙీష్ ప్రత్యయము మాత్రము రావచ్చును. ఉదా : అర్య + ఆన్ + ఈ = అర్యానీ, నకారమునకు ణత్వము, అర్యాణీ - (వైశ్యవనిత) క్షత్రియ + ఆన్ + ఈ= క్షత్రియానీ, ణత్వము, క్షత్రియాణీ + సు= క్షత్రియాణీ. (క్షత్రియవనిత). వైకల్పికముగా ననుటచే ఇవి రానిపక్షమున టాప్ ప్రత్యయము వచ్చును. అర్య + అ = అర్యా + సు=అర్యా, క్షత్రియ+అ=క్షత్రియా+ సు=క్షత్రియా.

అర్యునిభార్య, క్షత్రియునిభార్య అనునర్థము సంధైనచో 'పుంయోగా దాఖ్యాయామ్' అనుసూత్రముచే ఙీష్ప్రత్యయము మాత్రము వచ్చును ఉదా : అర్య+ ఙీష్ - అర్య + ఈ, యస్యేతిచ-అకారలోపము, అర్యీ + సు=అర్యీ. క్షత్రియ + ఙీష్; క్షత్రియీ + సు=క్షత్రియీ. ఇంతవఱకు పుంయోగలక్షణ ఙీష్ ప్రత్యయము మనకు సంబంధించిన విషయము చెప్పఁబడినది.

సూ : క్రీతాత్కరణపూర్వాత్ 4-1-51.

వృ : ఙీష్. వస్త్రక్రీతీ, క్వచిన్నధవ. క్రీతా.

ప. వి : క్రీతాత్ (5-1) కరణపూర్వాత్ (5-1).

అను : స్త్రియామ్ (7-1) ప్రాతిపదికాత్ (5-1) అతః (5-1) ప్రత్యయః (1-1).

అర్థ : కరణవాచకము పూర్వమునఁ గల క్రీతశబ్దాంతమగు నదంత ప్రాతిపదికమునకు స్త్రీత్వమున ఙీష్ ప్రత్యయము వచ్చును. ఉదా : వస్త్రక్రీతీ. ఈ ప్రత్యయము కొన్నియెడల రాదు. ధనక్రీతా.

వివ : కరణమనగా క్రియాసిద్ధియందు మిక్కిలిగా నుపకరించు సాధనము. అట్టికరణవాచకము పూర్వపదమును, క్రీతశబ్దము ఉత్తరపదముగాను ఉన్న ప్రాతిపదికముయొక్క స్త్రీత్వము వాచ్యమగునపుడు దానికి పరముగా ఙీష్ ప్రత్యయము వచ్చును ఉదా : వస్త్రైః క్రీతా - వస్త్రములచే కొనఁబడినది. ఇచట వస్త్రశబ్దము కరణవాచకము వస్త్ర + భిస్ + క్రీత అని అలౌకిక విగ్రహము. "గతికారకోపపదానాం కృద్భిస్సహ సమాసవచనం ప్రాక్సుబుత్పత్తేః" (గతులకు, కారకములకును, ఉపపదములకును సుప్పులుచేరని కృదంతములతో సమాసమగును) అను పరిభాషచే సమాస మేర్పడగా విభక్తిలోపించును, 'వస్త్రక్రీత' అనియగును. ఇట్టి స్థితిలో ప్రకృతసూత్రముచే ఙీష్ ప్రత్యయము. వస్త్రక్రీత+ఙీష్ (ఙ్, ష్‌లు ఇత్తులు) వస్త్రక్రీత + ఈ, అకారలోపము, వస్త్రక్రీతీ + సు = వస్త్రక్రీతీ

ఈ సూత్రములోనికి 'అజాద్యతష్టాప్' అనుసూత్రమునుండి 'అతః' అను పదము ననువృత్తి చేసికొని అదంతములకే యీ కార్యమగునని చెప్పవలయును కావున 'ధనక్రీతా' అను ఆకారాంత క్రీతశబ్దమునకు 'ఙీష్' ప్రత్యయము రాదు. ఎట్లన ధనేన క్రీతా, ధనముచేత కొనఁబడినది అనునర్థమున ధనేన అను కరణవాచక పదము 'కృతా' అను కృదంతరూపసుబంతముతో 'కర్తృకరణే కృతాబహులమ్' అను సూత్రముచే సమసించినచో ధన + టా, క్రీతా+సు, విభక్తిలోపము కలిగి 'ధనక్రీతా' అగును ఇది అదంతముకాదు. కావున దీనికి ప్రకృతసూత్రముచే 'ఙీష్' ప్రత్యయమురాదు.

పూర్వోదాహరణమునందువలె నిందును సుప్పుచేరని 'క్రీత' అనుదానితోడనే సమాసము గతికారకోపపదానామిత్యాది పరిభాషచే చేయరాదా? అన్నచో కర్తృకరణే ఇత్యాది సూత్రమునందలి బహుళపదముచే గతికారకేత్యాది పరిభాష అనిత్యమని చెప్పఁబడినది. కావున నది అన్నియెడలను ప్రవర్తింపఁజాలదు. కావున కొన్నియెడల కృదంతములు సుబుత్పత్తి అయినతర్వాత కూడ సమసింపవచ్చును. 'ధనక్రీతా' అనునది అట్టిది. కావున అది అదంతము కాలేదు. ఙీష్‌రాలేదు. ఈ యంశమునే క్వచిన్న = కొన్నియెడలరాదు అనువృత్తివాక్యము చెప్పుచున్నది.

అవ : స్వాంగలక్షణ ఙీష్ ప్రత్యయము విధింపఁబడుచున్నది.

సూ : స్వాఙ్గా చ్చోపసర్జనా దసంయోగోపధాత్ 4-1-54.

వృ అసంయోగోపధ ముపసర్జనం యత్స్వాఙ్గం తదన్తా న్ఙీష్. కేశానతిక్రాన్తా అతికేశీ - అతికేశా, చన్ద్రముఖీ - చన్ద్రముఖా. అసంయోగోపధాత్కిమ్ ? సుగుల్ఫా. ఉపసర్జనాత్ కిమ్ ? సుశిఖా.

ప. వి : స్వాఙ్గాత్ (5-1) చ (అవ్య) ఉపసర్జనాత్ (5-1) అసంయోగోపధాత్ (5-1).

అను : స్త్రియామ్ (7-1) ప్రాతిపదికాత్ (5-1) ఙీష్ (1-1) ప్రత్యయః (1-1) పరః (1-1) వా (అవ్య).

అర్థ : అసంయోగోపధమై యుపసర్జనమైన స్వాంగవాచక మంతమునఁ గల ప్రాతిపదికమునకు స్త్రీత్వమున ఙీష్ ప్రత్యయము వైకల్పికముగా నగును. ఉదా : అతికేశీ - అతికేశా; చంద్రముఖీ-చంద్రముఖా. అసంయోగోపధాత్ అనుటవలన 'సుగుల్ఫా' అనునెడ, ఉపసర్జనాత్ అనుటవలన 'సుశిఖా' అనునెడను ఙీష్ ప్రత్యయము రాదు.

వివ : సంయోగమనగా అచ్చులతో వ్యవధానములేని హల్లుల సముదాయము (హలోఽనన్తరా స్సంయోగః). ఉపధయనగా తుదివర్ణమునకు ముందుండునది (అలోఽన్త్యాత్పూర్వ ఉపధా) సమాసవిధాయకసూత్రమున ప్రథమావిభక్త్యంత పదముచే నిర్దేశింపఁబడినదియు, విగ్రహమున నియతమైన విభక్తి గలదియు నుపసర్జన మనఁబడును (ప్రథమానిర్దిష్టం సమాస ఉపసర్జనమ్, ఏకవిభక్తిచాపూర్వనిపాతే). సంయోగాక్షరము ఉపధగాలేనిదియు, ఉపసర్జనసంజ్ఞ కలదియు నగుస్వాంగవాచక శబ్దము అంతమునఁగల ప్రాతిపదికమునకు, స్త్రీత్వము వాచ్యముగునపుడు, ఙీష్ ప్రత్యయము వైకల్పికముగా నగును. ఇది రానిచో 'టాప్' ప్రత్యయము వచ్చునని తాత్పర్యము.

స్వాంగమనగా శరీరావయవము. అది యిట్లు నిర్వచింపఁబడినది.

(1) అద్రవం మూర్తి మత్స్వాఙ్గం ప్రాణిస్థ మవికారజమ్.

(2) అతత్స్థం తత్రదృష్టంచ (3) తేన చేత్తత్తథాయుతమ్.

(1) ద్రవముకానిదియు, ఆకారము గలదియు, ప్రాణియందుండునదియు, రోగాది వికారములవలన పుట్టనిదియు నగు అవయవమును స్వాంగమందురు. కన్ను కాలు, ముక్కు, ముఖము మున్నగునవి. (2) ఒకప్పుడు ప్రాణియందుండి అప్పుడు (దానినిగూర్చి చెప్పునపుడు లేనిదియు) స్వాంగమనఁబడును (తీసివేయఁబడిన నఖములు, దంతములు, కేశములు మున్నగునవి) (3) ప్రతిమాదులలో ప్రాణి యందెట్లుండునో యట్టిస్థితిగల అవయవములును స్వాంగములగును. దీనినిబట్టి స్వేదము ద్రవమగుటచేతను, జ్ఞానము, బుద్ధి మున్నగునవి ఆకారములేనివగుట చేతను, శోఫమున్నగునవి వికారమువలన పుట్టినవగుటచేతను స్వాంగములనఁబడవు. ఇట్టి స్వాంగవాచకములు ఉపసర్జనసంజ్ఞకలవియై ప్రాతిపదికముల అంతమునందున్న యెడల అట్టి ప్రాతిపదికములకు స్త్రీత్వమున ఙీష్ ప్రత్యయము వైకల్పికముగా నగును.

ఉదా : కేశానతిక్రాన్తా-కేశముల నతిక్రమించినది అనునర్థమున 'అతి, కేశ + శస్' అనియుండ 'అత్యాదయః క్రాన్తాద్యర్థేద్వితీయయా' అను వార్తికముచే సమాససంజ్ఞ కలుగును. విభక్తులులోపించి 'అతికేశ' అనియుండును. ఇందు కేశ శబ్దము స్వాంగవాచకము. ఇందు ఉపధ సంయోగముకాదు. ఇది విగ్రహమున మార్పుటకు వీలుకాని విభక్తిగలది యగుటచే 'ఏకవిభక్తి చాపూర్వనిపాతే' అను సూత్రముచే ఉపసర్జన సంజ్ఞను పొందును. కావున ఇది అంతమునఁగల 'అతికేశ' అను ప్రాతిపదికమునకు ఙీష్ప్రత్యయము వచ్చును. అతికేశ + ఙీష్, అతికేశ+ ఈ, అకారలోపము అతికేశీ + సు = అతికేశీ. ఇది రానిచో ఆదంతమగుటచే 'అజాద్యతష్టాప్' అనుసూత్రముచే టాప్ ప్రత్యయము వచ్చును. అతికేశ + అ= సవర్ణదీర్ఘము, అతికేశా+సు=అతికేశా.

చన్ద్ర ఇవ ముఖం యస్యాః సా-'చంద్రునివంటి ముఖముగలది'అను నర్థమున 'చన్ద్ర+సు, ముఖ+సు'అనుదానికి'అనేకమన్యపదార్థే'అనుసూత్రముచే సమాస సంజ్ఞ కలుగును. 'ప్రథమానిర్దిష్టం సమాస ఉపసర్జనమ్' అనుసూత్రముచే ఇవిరెండును ఉపసర్జనములే యగును. కావున ముఖశబ్దము ఉపసర్జనసంజ్ఞగలదియు, సంయోగో పధముకానిదియు నగుస్వాంగవాచకము. కావున తదంతమునకు 'ఙీష్' ప్రత్యయము వచ్చును. చన్ద్రముఖ+ఈ, చంద్రముఖీ + సు=చంద్రముఖీ, 'ఙీష్' రానిచో టాప్ ప్రత్యయము వచ్చును. చన్ద్రముఖ + అ = చన్ద్రముఖా + సు = చన్ద్రముఖా.

సూత్రమునందలి కొన్నిదళముల సార్థక్యము తరిశీలింపఁబడుచున్నది.

'అసంయోగోపధాత్' - సంయోగోపధముకాని స్వాంగవాచకమునకు అనుటచేత, 'సుగుల్ఫ' అనుచోట ఙీష్ ప్రత్యయమురాదు. 'గుల్ఫ' అనునది స్వాంగమే, ఉపసర్జనమేకాని, ఇందు ఉపధాక్షరమగు ఫకారము సంయోగము యొక్క అంగము. కావున ఇది అంతమున గల ప్రాతిపదికమునకు ఙీషురాదు. అదంతమగుటచే టాప్ ప్రత్యయము వచ్చును సుగుల్ఫ + టాప్ = సుగుల్ఫా.

'ఉపసర్జనాత్' అనుటవలన శోభనాశిఖా - శోభనమైన శిఖ అనుచోట 'ఙీషు' రాదు 'కుగతి ప్రాదయః' అనుసూత్రముచే నిచట సమాస మేర్పడును. అందు ప్రథమానిర్దిష్టము ప్రాది యగు 'సు' అనునది. కావున దానికే ఉపసర్జనసంజ్ఞ యుండును. అగుటచే నిట ఙీష్ ప్రత్యయము రాదు. [ఇచట 'సుశిఖా' అను నుదాహరణము ప్రామాదికము. ఏలయన, ఈ స్వాంగలక్షణఙీష్ప్రత్యయము అదంతములకే వచ్చును 'సుశిఖా' అనుదానికి అదంతము కాకపోవుటవలననే ఙీష్ ప్రత్యయము రాదు. కావున కేవలము 'శిఖా' అనుదానినే యిట ప్రత్యుదాహరణముగా చూపుట మంచిది. 'శిఖ' అనుదానికి ఉపసర్జనసంజ్ఞలేదు 'ఙీషు' రాదని చెప్పుట సరిపడును - ఈ విషయము బాలమనోరమావ్యాఖ్యయందు నిరూపింపఁబడినది]

అవ : పై సూత్రమునకు కొన్నియెడల నిషేధము చెప్పఁబడుచున్నది

సూ : న క్రోడాదిబహ్వచః 4-1-56.

వృ : క్రోడాదేర్బహ్వచశ్చ స్వాఙ్గాన్న ఙీష్. కల్యాణక్రోడా, ఆకృతిగణోఽయమ్. సుజఘనా.

ప. వి : న (అవ్య) క్రోడాది బహ్వచః (5-1).

అను : స్త్రియామ్ (7-1), స్వాఙ్గాత్ (5-1) ప్రాతిపదికాత్ (5-1) ఙీష్ (1-1).

అర్థ : క్రోడాదులున్ను, బహ్వచ్కములును అగు స్వాంగవాచకములకు పరముగా ఙీష్ప్రత్యయము రాదు. ఉదా : కల్యాణక్రోడా. ఇది ఆకృతిగణము. సుజఘనా.

వివ : 'క్రోడా' మున్నగు స్వాంగవాచకములకును, అనేకములగు అచ్చులు గల స్వాంగవాచకములకును, పూర్వసూత్రముచే విధింపఁబడిన ఙీష్ ప్రత్యయము రాదు. ఇచట 'బహ్వచ్' పదముచే రెండుకంటె ఎక్కువ అచ్చులు గలదానిని గ్రహింపవలయును.

ఉదా : కల్యాణీక్రోడాయస్యాః సా. కల్యాణియగు క్రోడముగలది (క్రోడ మనగా గుఱ్ఱముయొక్క ఱొమ్ము) 'అనేకమన్యపదార్థే' అనుసూత్రముచే పుంవద్భావము. 'కల్యాణక్రోడా' 'గోస్త్రియోరుపసర్జనస్య' అనుసూత్రముచే తుదిదీర్ఘమునకు హ్రస్వము 'కల్యాణక్రోడ' - దీనికి పూర్వసూత్రముచే జీష్ ప్రత్యయము ప్రాప్తించుచుండగా నిషేధింపఁబడినది. అదంతమగుటచే టాప్' ప్రత్యయము. కల్యాణక్రోడ + అ=కల్యాణక్రోడా+సు=కల్యాణక్రోడా.

క్రోడాదిగణము ఆకృతిగణము కావున ఙీష్ ప్రత్యయనిషేధమునకు ఇతర విధానములేని స్వాంగవాచకములనిందు చేర్చుకొనవలయును.

బహ్వచ్కమున కుదాహరణము. శోభనం జఘనం యస్యాఃసా-అందమైన జఘనముగలది. ఇందు స్వాంగవాచకమగు 'జఘన' శబ్దమునందు మూఁడచ్చులు గలవు. కాన 'సుజఘన' అనుచోట ఙీష్ప్రత్యయము రాదు. అదంతమగుటచే 'టాప్' ప్రత్యయము సుజఘన + అ=సుజఘనా+సు=సుజఘనా.

క్రోడాదిగణము : క్రోడ నఖ ఖుర గోఖా ఉఖా శిఖా వాల శప గుద - ఆకృతిగణోఽయమ్-ఇతిక్రోడాదయః.

సూ : నఖముఖాత్సం జ్ఞాయామ్ 4-1-58.

వృ : న ఙీష్.

ప. వి : నఖముఖాత్ (5-1) సంజ్ఞాయామ్ (7-1)

అను ; స్వాఙ్గాత్ (5-1) న (అవ్య) ప్రాతిపదికాత్ (7-1) స్త్రియామ్ (7-1) ఙీష్ (1-1).

అర్థ : సంజ్ఞ గమ్యమానమగునపుడు నఖముఖ అను స్వాంగవాచకములంత మునఁ గల ప్రాతిపదికమునకు స్త్రీత్వమున ఙీష్ ప్రత్యయము రాదు.

వివ : నఖ, ముఖ అనుస్వాంగవాచకములు అంతమునఁగల ప్రాతిపదిక మొకదానికి సంజ్ఞయైనచో, అట్టి ప్రాతిపదికమునకు పరముగా స్త్రీత్వమున ఙీష్ ప్రత్యయము రాదు. స్వాంగాచ్చోపసర్జనాదిసూత్రమున కిది యపవాదము.

ఉదా : శూర్పాణీవ కరరుహాః యస్యాః సా - చేటలవంటిగోళ్ళు కలది. 'శూర్ప + జస్, నఖ + జస్' అనియుండ 'అనేకమన్యపదార్థే' అనుసూత్ర ముచే సమాససంజ్ఞ. విభక్తులు లోపించును. 'శూర్ప, నఖ' అనియుండ క్రింది సూత్రముచే నకారమునకు ణత్వము విధింపఁబడుచున్నది.

సూ : పూర్వపదాత్సంజ్ఞాయామగః 8-4-3

వృ : పూర్వపదస్థా న్నిమిత్తా త్పరస్య నస్య ణః స్యాత్సంజ్ఞాయాం, నతు గకారవ్యవధానే. శూర్పణఖా.

ప వి. పూర్వ పదాత్ (5-1) సంజ్ఞాయామ్ (7-1) అగః (5-1).

అను : రషాభ్యామ్ (5-2) నః (6-1) ణః (1-1).

అర్థ : పూర్వపదమునందున్న నిమిత్తమునకు పరముగా నున్న నకారమునకు ణత్వము, సంజ్ఞయందు, వచ్చును. గకారవ్యవధానమున్నచో రాదు. ఉదా : శూర్పణఖా.

వివ : నకారము ణకారముగా మాఱుటకు నిమిత్తములు రేఫషకారములు. అవి సమాసమున పూర్వపదములోనుండినను ఉత్తరపదములో నున్న నకారమునకు ణత్వము వచ్చును కాని నిమిత్తములగు రేఫషకారములకును, స్థానియగు నకారమునకు నడుమ గకారముండరాదు. మఱియు సముదాయముచేత సంజ్ఞ వాచ్యమగు నపుడే యీ కార్యము జరుగును 'రషాభ్యాంనోణస్సమానపదే' అను సూత్రములోని 'సమానపదే' అనుదానినిబట్టి యిట్టియెడల ణత్వము సిద్ధింపక పోవుటచే నీసూత్రముచే చెప్పఁబడెను.

శూర్ప + నఖ - పూర్వపదమునందలి రేఫము నిమిత్తము ఉత్తరపదములోని నకారమునకు ణత్వము రాఁగా 'శూర్పణఖ' అయినది 'అట్కుప్వాఙ్నుమ్వ్యవాయేఽపి' అనుసూత్రముచే ప్, అ, అనునవి మధ్యనున్నను ఈకార్యము జరుగును. 'శూర్పణఖ' అనునది యొక స్త్రీకి సంజ్ఞ కావున దీనికి ఙీష్నిషేధము. అదంతమగుటచే టాప్ ప్రత్యయము. శూర్పణఖ + టాప్ = శూర్పణఖా + సు = శూర్పణఖా.

అవ : నఖముఖాదిత్యాదిసూత్రమునందలి ముఖశబ్దాంతమున కుదాహరణమును, సంజ్ఞాయామ్ అనుపదముయొక్క ప్రయోజనమును చూపఁబడుచున్నవి.

వృ ; గౌరముఖా. సంజ్ఞాయాం కిమ్? తామ్రముఖీ కన్యా.

అర్థ : ఉదా : గౌరముఖా. సంజ్ఞయందే యననేల? తామ్రముఖీ కన్య అనుచోట నీనిషేధము ప్రవర్తింపదు.

వివ : గౌరం వదనం యస్యాః సా - తెల్లనిముఖముగలది. 'గౌరముఖ' ఇది యొకస్త్రీకి పేరు. కావున ఙీష్నిషేధము. అదంతమగుటచే టాప్ ప్రత్యయము (అజాద్యతష్టాప్) గౌరముఖ + అ = గౌరముఖా + సు = గౌరముఖా.

ఈ నిషేధము సంజ్ఞావాచ్యమగునపుడే యనుటచే 'తామ్రం ముఖం యస్యాః సా' తామ్రమైన ముఖముగలది అనుఅవయవార్థము కలచోట ఈ నిషేధము ప్రవర్తింపదు. 'తామ్రముఖ'+ఙీష్=తామ్రముఖీ ఇది సంజ్ఞ కాదని తెలుపుటకై 'కన్యా' అను విశేష్యము చూపఁబడినది.

[శూర్పణఖా, గౌరముఖా అనునవి సంజ్ఞలు కావున నిత్యసమాసములు. అట్టి వానికి స్వపదములతో విగ్రహముండదు కావున శూర్పాణీవకరరుహా యస్యాః సా, గౌరం వదనం యస్యాః సా అనువిధముగా విగ్రహము చూపఁబడినది]

ఇంతవఱకు స్వాంగలక్షణ ఙీష్ ప్రత్యయమునకు సంబంధించిన విషయములు చెప్పఁబడినవి.

అవ : జాతిలక్షణ ఙీష్ ప్రత్యయము చెప్పఁబడుచున్నది

సూ : జాతేరస్త్రీవిషయాదయోపధాత్ 4-1-63.

వృ : జాతివాచి యన్నచ స్త్రియాం నియత మయోపధం తతో ఙీష్ తటీ, వృషలీ, కఠీ, బహ్వృచీ-జాతేః కిమ్? ముణ్డా. అస్త్రీవిషయాత్ కిమ్? బలాకా - అయోపధాత్కిమ్? క్షత్రియా.

ప. వి : జాతేః (5-1) అస్త్రీవిషయాత్ (5-1) అయోపధాత్ (5-1)

అను : స్త్రియామ్ (7-1) ప్రాతిపదికాత్ (5-1) ఙీష్ (1-1) ప్రత్యయః (1-1).

అర్థ : నియతముగా స్త్రీలింగము కానిదియు, యకారోపధముకానిదియు నగుజాతి వాచకప్రాతిపదికమునకు స్త్రీత్వమున ఙీష్ప్రత్యయము వచ్చును. ఉదా : తటీ మొ॥వి. జాతేః అనుటవలన 'ముణ్డా' ఇత్యాదులందును, అస్త్రీవిషయాత్ అనుట వలన 'బలాకా' మున్నగువానియందును, అయోపధాత్ అనుటవలన క్షత్రియా మున్నగువానియందును ఙీష్ ప్రత్యయము రాలేదు.

వివ : అస్త్రీవిషయమనగా 'నిత్యస్త్రీలింగము కానిది' అని భావము. యకార ముపధగాఁగలది యోపధము. అదికానిది అయోపధము. జాతిని తెలుపునది జాతి వాచకము. నిత్యస్త్రీలింగముకానిదియు, యకార ముపధగాలేనిదియు నగుజాతి వాచకశబ్దముయొక్క స్త్రీత్వము వాచ్యమగునపుడు, దానికి పరముగా 'ఙీష్' అను ప్రత్యయము వచ్చును. జాతియనఁగానేమో యీ క్రింది శ్లోకముచే నిర్వచింపఁ బడుచున్నది.

శ్లో॥ ఆకృతిగ్రహణా జాతిః లిఙ్గానాం చ న సర్వభాక్
సకృదాఖ్యాత నిర్గ్రాహ్యా గోత్రం చ చరణైః సహ.

మూడువిధములుగా జాతిత్వము నిర్ణీతమగును (1) ఆకృతిగ్రహణాజాతిః. ఆకృతిగ్రహణముగాఁగలది. ఆకృతి యనగా అవయవముల కూర్పు గ్రహణ మనగా గ్రహించుటకు సాధనము ఆకారమునుబట్టి వస్తుజ్ఞానమును పొందుటకు వీలున్నయెడల నట్టిదానిని 'జాతి' అందురు. ఉదా : తటమనఁగా నది మున్నగు వానితీరము. ఎత్తైనకట్ట, ఒకవిధమగు మట్టి, జలసామీప్యము మున్నగు ఆకార విశేషము గలదానిని చూచి ఇది తటము అనుజ్ఞానమును పొందుచున్నాము. కావున తటత్వము ఒకజాతి. దానిని వచించు 'తటః' అనునది జాతివాచకము ఇట్లే మనుష్యజాతి, గోజాతి, మృగజాతిమున్నగునవి. ఈ నిర్వచనమునుబట్టి బ్రాహ్మణత్వాదులకు జాతినామము కలుగుటలేదు. అందుచే మఱియొక లక్షణము చెప్పఁబడుచున్నది. (2) లింగానాం చ న సర్వభాక్, సకృదాఖ్యాతనిర్గ్రాహ్యా - అన్ని లింగములయందును ఉండనిదియు, ఒక మాఱొక వ్యక్తియందు వ్యవహరించుటచే అతనికి సంబంధించిన వ్యక్త్యంతరమునందు వ్యవహారము లేకపోయినను దెలియుటకు వీలయినదియు జాతి యనఁబడును ఉదా : వృషలః - శూద్రుఁడు ఈశబ్దము పుంనపుంసకములయం దుండును. నపుంసకలింగమునం దుండదు. కావున నిది సర్వలింగములయందు లేనిది. మఱియు నొకవ్యక్తిని చూపి ఇతఁడు వృషలుఁడు అని వ్యవహరించినచో అతనిపుత్రాదులు వృషలులు అనునది ప్రత్యేకించి చెప్పనవసరము లేకయే తెలియును ఇట్టిదియు జాతి యగును

(3) గోత్రంచచరణైస్సహ. గోత్రమనగా అపత్యముగా (సంతానముగా) వివక్షింపఁబడిన పౌత్రాదులు. (అపత్యంపౌత్ర ప్రభృతి గోత్రమ్) చరణములనగా వేదశాఖలు. ఆయాగోత్రములందలి వ్యక్తులును, ఆయావేదశాఖలను అధ్యయనముచేయు వ్యక్తులును 'జాతి' పదముచే వ్యవహరింపఁబడుదురు. ఉదా : ఆత్రేయులు-అత్రిమూలపురుషుఁడుగాఁగలవారు. కఠుఁడు. కఠమను వేదభాగమును అధ్యయనము చేయువాఁడు.

ఇట్లుమూఁడు విధములైనజాతివాచకములకును స్త్రీత్వమున ఙీష్ ప్రత్యయము వచ్చును. నిత్యస్త్రీలింగమైన జాతివాచకములకును, యోపధమైన జాతివాచకమునకును ఈ ప్రత్యయము రాదు.

(1) తట + ఙీష్ = తట+ఈ, యస్యేతిచ-అకారలోపము తటీ + సు = తటీ. (2) వృషల+ఙీష్=వృషలీ+సు = వృషలీ. (3) కఠ + ఙీష్ =

కలీ + సు = కలీ, బహవః ఋచః అధ్యేయా యస్యాఃసా - ఏస్త్రీకి అనేక ఋక్కులు అధ్యేయములో ఆమె బహ్వృచ (ఋక్పూరబ్ధూః పథామానక్షే అనుసూత్రముచే 'అ' అను సమాసాంతప్రత్యయమురాగా నిది అకారాంత మగును)బహ్వృచ + జీష్ - బహ్వృచీ + సు=బహ్వృచీ. (బహ్వృచ శబ్దము వేదశాఖనధ్యయనము చేయువానిని వచించునది యగుటచే జాతివాచకము)

సూత్రమునందలిపదముల సార్థక్యము చర్చింపఁబడుచున్నది. (1) జాతేః కిమ్ - జాతివాచకమున కననేల? జాతివాచకము కానిచో జీష్‌ప్రత్యయమురాదు. ఉదా : ముణ్డ-ముండత్వము అనగా నున్నగా చేయఁబడిన తలగలిగియుండుట. ఇది జాతివాచకము కాదు కావున అదంతమగుటచే టాప్ ప్రత్యయము వచ్చును. ముణ్డ+టాప్=ముణ్డా + సు=ముణ్డా.

(2) నియతస్త్రీలింగములైనవానికి ఈ ప్రత్యయము రాకుండుటకై 'అస్త్రీ విషయాత్' అనుపదము గ్రహింపఁబడినది, ఉదా : 'బలాక' ఇది నిత్యస్త్రీలింగము కావున జాతి వాచకమే యైనను దీనికి జీష్ ప్రత్యయమురాదు. 'టాప్' ప్రత్యయము వచ్చి 'బలాకా' అగును.

(3) యకారోపధమైన జాతివాచకమునకు జీష్ ప్రత్యయము రాకుండుటకై 'అయోపధాత్' అనుపదము గ్రహింపఁబడినది. ఉదా : క్షత్రియ ఇది యోపధము-కాన టాప్ ప్రత్యయము వచ్చును. క్షత్రియ + అ = క్షత్రియా + సు = క్షత్రియా.

అవ : యోపధవిషయమున కొన్నింటిని పరిహరింపవలయునని యీ క్రింది వార్తికము చెప్పుచున్నది.

వా॥ హయ గవయ ముకయ మనుష్య మత్స్యానా మప్రతిషేధః (2495).

వృ : యోపధప్రతిషేధే - హయీ, గవయీ, ముకయీ హల స్తద్ధితస్య ఇతియలోపః - మనుషీ.

ప వి : హయ....మత్స్యానామ్ (6-1) అప్రతిషేధః (1-1).

అర్థ : యోపధవిషయమున హయ, గవయ, ముకయ, మనుష్య, మత్స్య అనుశబ్దములకు జీష్‌నిషేధములేదు. ఉదా : హయీ మొ॥వి

వివ : జాతివాచకములయిన 'హయ' మున్నగు శబ్దములకు 'జాతే రస్త్రీ' ఇత్యాది సూత్రమునందలి 'అయోపధాత్' అనుపదమువలన జీష్ ప్రత్యయము రాకపోవు చున్నది: యోపధములకు జీష్‌రాకపోవుటలో హయ, గవయ, ముకయ,

మనుష్యమత్స్య అనుశబ్దములను పరిహరింపవలయునని యీ వార్తికము చెప్పు చున్నది. అనగా వీనికి జీష్ ప్రత్యయము వచ్చునని తాత్పర్యము. ఉదా : హయ + ఈః, అకారలోపము, హయీ + సు = హయీ; గవయ + ఈః, గవయీ, ముకయ + ఈః = ముకయీ.

'మనుష్య' శబ్దమునకు జీష్ ప్రత్యయము వచ్చి మనుష్య + ఈః అని యుండ అకారమునకు 'యస్యేతిచ' అనుసూత్రముచేతను, యకారమునకు 'హల స్తద్ధితస్య' అనుసూత్రముచేతను లోపమగును ('మనోర్జాతావఞ్యతౌ షుక్ చ' అను విధిచే మనుశబ్దమునకు యత్ప్రత్యయమును షుగాగమమును రాఁగా 'మనుష్య' అను శబ్దమేర్పడినది. కాన నిందలిది తద్ధితయకారము). మనుష్ + ఈః = మనుషీ

అవ : మత్స్యశబ్దమున క్రిందివార్తికముచే యలోపము విధింపఁబడు చున్నది.

వా॥ మత్స్యస్య ఙ్యామ్ 4198.

వృ : యలోపః. మత్సీ.

ప. వి : మత్స్యస్య (6-1) ఙ్యామ్ (7-1).

అర్థ : మత్స్యశబ్దముయొక్క ఉపధాయకారమునకు ఙీ ప్రత్యయము పర మగునపుడు లోపము వచ్చును. ఉదా : మత్సీ.

వివ : ఇది 'సూర్యతిష్యాగస్త్యమత్స్యానాం య ఉపధాయాః' అనుసూత్ర మున కనుబంధముగా చెప్పఁబడిన వార్తికము. కావున ఉపధాయకారమునకు లోపము వచ్చుట అనువర్తము దానినిబట్టి వచ్చును. ఆ సూత్రముచే విధింపఁబడిన యలో పము ఙీ ప్రత్యయము పరమగునపుడే వచ్చునని యీవార్తికముయొక్క తాత్పర్యము. మత్స్య + ఙీష్ + మత్స్య + ఈః = అకారలోపము, యకారలోపము, మత్స్ + ఈః = మత్సీ + సు = మత్సీ.

సూ : ఇతో మనుష్యజాతేః 4-1-65.

వృ : ఙీష్. దాక్షీ.

ప. వి : ఇతః (5-1) మనుష్య జాతేః (5-1).

అను : ప్రాతిపదికాత్ (5-1) స్త్రియామ్ (7-1) ఙీష్ (1-1) ప్రత్యయః (1-1) పరః (1-1).

అర్థ : ఇదంత మనుష్యజాతివాచక ప్రాతిపదికమునకు స్త్రీత్వమున జీష్ ప్రత్యయము వచ్చును. ఉదా : దాక్షీ.

వివ : దక్షస్య అపత్యం స్త్రీ – దక్షుని సంతానమగు స్త్రీ అమనర్థమున దక్షశబ్దమునకు 'అతఇఞ్' అను సూత్రముచే ఇఞ్ ప్రత్యయము చేయగా 'దాక్షి' అగును (ఆదివృద్ధి, అకారలోపములుగలిగినవి). ఇది గోత్రవాచకము గాన జాతివాచకమగును (గోత్రంచ చరణైస్సహ). ఇది మనుష్యజాతివాచకము. హ్రస్వ ఇకారాంతము. కావున ప్రకృతసూత్రముచే జీష్ ప్రత్యయము. దాక్షి + జీష్, దాక్షి + ఈ, యస్యేతిచ - ఇకారలోపము - దాక్షీ + సు=దాక్షీ. (జాతేరిత్యాది సూత్రములోనికి అజాద్యత ష్టాప్ సూత్రమునుండి 'అతః' అనునది అనువృత్త మగుటవలన ఆ సూత్రముచే జీషురాదు కావున మరల విధింపబడినది).

ఇంతటితో జీష్ ప్రత్యయవిధానము పూర్తి అయినది.

అవ : ఇటుపై 'ఊఙ్' అనుస్త్రీ ప్రత్యయము చెప్పబడుచున్నది.

సూ : ఊఙుతః 4-1-66.

వృ : ఉదన్తా దయోపధా న్మనుష్యజాతి వాచినః స్త్రియా మూఙ్. కురూః. అయోపధాత్ కిమ్ ? అధ్వర్యుర్బ్రాహ్మణీ.

ప. వి : ఊఙ్ (1-1) ఉతః (5-1).

అను : స్త్రియామ్ (7-1) ప్రాతిపదికాత్ (5-1) అయోపధాత్ (5-1) మనుష్యజాతేః (5-1).

అర్థ : అయోపధమును, మనుష్యజాతివాచకమును, ఉదంతమును అయిన ప్రాతిపదికమునకు స్త్రీత్వమున ఊఙ్ ప్రత్యయము వచ్చును. ఉదా : కురూః. అయోపధాత్ అనుటవలన 'అధ్వర్యుః' అనుచోట ఊఙ్ ప్రత్యయము రాలేదు.

వివ : 'ఉతః' అనునది విశేషణమగుటచే తదంత విధిచే 'ఉదంతమైన' అనునర్థము వచ్చును. తపరకరణమువలన 'హ్రస్వఉకారాంతమైన' అనునర్థము కలుగును. హ్రస్వ ఉకారము అంతమునందుగలదియు, యకారము ఉపధగా లేనిదియు, మనుష్యజాతిని వచించునదియు నగు ప్రాతిపదికమునకు స్త్రీత్వము వాచ్యమగు నప్పుడు ఊఙ్ అను ప్రత్యయము వచ్చును. ఇందు ఙకారమిత్తు.

ఉదా : కురోరపత్యం స్త్రీ - కురువుయొక్క సంతానమైన స్త్రీ అనునర్థమున 'కురునాదిభ్యో ణ్యః' అనుసూత్రముచే (4-1-170) ణ్యప్రత్యయము కురు + ణ్య. 'స్త్రియామవన్తికున్తి కురుభ్యశ్చ' అనుసూత్రముచే ఆ ప్రత్యయమునకు లుక్కు వచ్చును (అవన్తి, కున్తి, కురుశబ్దములకు పరముగానున్న తద్రాజప్రత్యయము నకు స్త్రీత్వమున లుక్కువచ్చును) కురు ఇది గోత్రవాచకమగుటచే జాతివాచకము. అదియు మనుష్యజాతివాచకము ఉదంతము కాన 'ఊఙ్ ప్రత్యయము రాఁగా కురు + ఊఙ్, సవర్ణదీర్ఘ సంధిచే కురూ' అగును. స్వాది ప్రత్యయములు జ్యంతములకును, ఆబంతములకును (జీప్, జీష్, జీన్, టాప్ డాప్, చాప్ అను స్త్రీ ప్రత్యయాంతములకని భావము) ప్రాతిపదికసంజ్ఞ కలవానికిని మాత్రమే చేరును. ఊఙంతము పై వానిలో లేదు ప్రత్యయాంతమగుటచే ప్రాతిపదికసంజ్ఞ కలుగదు. కావున "ప్రాతిపదిక గ్రహణే లింగవిశిష్టస్యాపి గ్రహణమ్" అను పరిభాష యిట నాశ్రయింపఁబడినది ప్రాతిపదికమును గ్రహించు నపుడు లింగవిశిష్టమైనదానికిని గ్రహణ ముండును అనగా లింగమునకు సంబంధించిన కార్యములను బొందిన వానినికూడ ప్రాతిపదికసంజ్ఞచే గ్రహింపవలయునని తాత్పర్యము 'కురూ' అను చోట ఊఙ్ ప్రత్యయము లింగవిధానమునకు చేర్పఁబడిన దగుటచే ప్రత్యయము చేరిన రూపము ప్రాతిపదికముగా పరిగణింపఁబడును. కావున సుప్ ప్రత్యయములు చేరును. కురూ + సు, సకారమునకు రుత్వము (ససజుషోరుః) రేఫమునకు విసర్గము (ఖరవసానయోర్విసర్జనీయః) కురూః.

[వక్ష్యమాణ ఊఙంతోదాహరణములయందును ఈవిషయమును స్మరించునది]

ఈ ఊఙ్ ప్రత్యయము యకారము ఉపధగాఁ గల ఉదంతమనుష్యజాతి వాచకమునకు రాదని అనువృత్తమైన 'అయోపధాత్' అనుపదమువలనఁ దెలియు చున్నది కావున 'అధ్వర్యు' శబ్దమునకు ఊఙ్ ప్రత్యయమురాదు ఇది పుంలింగస్త్రీలింగములలో నొకేరూపమున నుండును. కావున స్త్రీలింగమని స్పష్టము చేయుటకై అధ్వర్యుః బ్రాహ్మణీ-అధ్వర్యువగు బ్రాహ్మణి అని విశేష్య సహిత ముగ ఉదాహరింపఁబడినది.

సూ : పఙ్గోశ్చ 4-1-68.

వృ : పఙ్గూః.

ప. వి : పఙ్గోః (5-1) చ (అవ్య).

అను : స్త్రియామ్ (7-1) ప్రాతిపదికాత్ (5-1) ఊఙ్ (1-1) ప్రత్యయః (1-1) పరః (1-1).

అర్థ : పఙ్గు అను ప్రాతిపదికమునకు స్త్రీత్వమున ఊఙ్ ప్రత్యయము వచ్చును. ఉదా : పఙ్గూః.

వివ : పంగుశబ్దము జాతివాచకము కాదు కావున ప్రత్యేకించి ఊఙ్ ప్రత్యయము విధింపబడినది పఙ్గు + ఊఙ్, సవర్ణదీర్ఘము = పఙ్గూ + సు = పఙ్గూః - కుంటిది

వా॥ శ్వశురస్యోకారాకారలోపశ్చ 5039.

వృ : శ్వశ్రూః.

ప వి : శ్వశురస్య (6-1) ఉకారాకారలోపః (1-1) చ (అవ్య).

అర్థ : శ్వశురశబ్దమునకు స్త్రీత్వమున ఊఙ్ ప్రత్యయమును, అది పరమగునపుడు ఉకార-అకారములకు లోపమును కలుగును. ఉదా : శ్వశ్రూః.

వివ : 'శ్వశుర' అనుశబ్దము స్త్రీలింగమున వర్తించునపుడు ఊఙ్ ప్రత్యయము వచ్చును. అది పరమగునపుడు శ్వశురశబ్దములోని ఉకారఅకారములకు లోపము వచ్చును క్రమమునుబట్టి 'శు' లోని ఉకారమును, 'ర' లోని అకారమును లోపించునని భావింపవలయును. 'శ్వ' లోని అకారమునకు లోపము రాదు. శ్వశ్ ర్ + ఊఙ్ = శ్వశ్రూ + సు = శ్వశ్రూః - అత్త. (ఇచట 'పుంయోగాదాఖ్యాయామ్' అనుసూత్రముచే ఙీష్ ప్రత్యయము రావలసియుండగా అపవాదముగా ఈ వార్తికము చెప్పబడినది). [శ్వశ్రూశబ్దము అవ్యుత్పన్నప్రాతిపదికమని వ్యాఖ్యాతల అభిప్రాయము. అప్పుడీ ప్రత్యయవిధానమును, ఉకార-అకారములలోపమును కృతకమని తాత్పర్యము].

సూ : ఊరూత్తరపదాదౌపమ్యే 4-1-69.

వృ : ఉపమానవాచి పూర్వపదమూరూత్తరపదం యత్ ప్రాతిపదికం తస్మాదూఙ్. కరభోరూః.

ప వి : ఊరూత్తరపదాత్ (5-1) ఔపమ్యే (7-1).

అను : స్త్రియామ్ (7-1) ప్రాతిపదికాత్ (5-1) ఊఙ్ (1-1) ప్రత్యయః (1-1) పరః (1-1)

అర్థ : ఉపమానవాచకము పూర్వపదముగను, ఊరుశబ్దము ఉత్తరపదముగను గల ప్రాతిపదికమునకు స్త్రీత్వమున ఊఙ్ ప్రత్యయము వచ్చును. ఉదా : కరభోరూః.

వివ : ఉపమయే ఔపమ్యము ఉపమీయతే౽నయేత్యుపమా దేనిచేత నొకటి ఉపమింపఁబడునో అది ఉపమ ఊరుశబ్దముత్తరపదముగా నున్నదానికి అనుటచే ఉపమానవాచకము పూర్వపదముగా నుండవలయుట సిద్ధమగును. కావున పూర్వపదము ఉపమానవాచకమైనదియు ఉత్తరపదము ఊరుశబ్దమైనదియునగు ప్రాతిపదికమునకు స్త్రీత్వమున ఊఙ్ ప్రత్యయము వచ్చును

ఉదా : కరభౌ ఇవ ఊరూ యస్యాః సా - కరభములవంటి ఊరువులుగలది. కరభమనగా మణికట్టునుండి చిటికెనవ్రేలికొనవఱకుఁగల చేతియొక్క వెలుపలి భాగము - (మణిబన్ధా దాకనిష్ఠంకరస్య కరభో బహిః) - ఇందు కరభశబ్ద ముపమానవాచకము. కరభోరు + ఊఙ్, సవర్ణదీర్ఘము కరభోరూ + సు = కరభోరూః.

సూ : సంహితశఫలక్షణ వామాదేశ్చ 4-1-70

వృ : అనౌపమ్యార్థం సూత్రమ్. సంహితోరూః; శఫోరూః; లక్షణోరూః, వామోరూః.

ప వి : సంహితశఫలక్షణ వామాదేః (5-1) చ (అవ్య).

అను : స్త్రియామ్ (7-1) ఊఙ్ (1-1) ప్రాతిపదికాత్ (5-1) ప్రత్యయః (1-1) పరః (1-1) ఊరూత్తర పదాత్ (5-1).

అర్థ : సంహిత, శఫ, లక్షణ, వామశబ్దములు పూర్వపదములుగాగల ఊరూత్తరపదప్రాతిపదికమునకు స్త్రీత్వమున ఊఙ్ ప్రత్యయము వచ్చును. ఔపమ్యములేని సందర్భమునందు ఊఙ్ ప్రత్యయవిధానమునకై యీ సూత్రము చెప్పఁబడినది. ఉదా : సంహితోరూః మొ॥వి.

వివ : పూర్వసూత్రమున ఊరుశబ్ద ముత్తరపదముగాఁ గలప్రాతిపదికము యొక్క పూర్వపదము ఉపమానవాచకముగా నున్నపుడే ఊఙ్ ప్రత్యయము విధింపఁబడినది ఉపమానవాచకములు కాని సంహిత, శఫ, లక్షణ, వామశబ్దములు పూర్వపదములుగా నున్నపుడును ఊరుశబ్దముత్తరపదముగాఁ గలప్రాతిపదికమునకు ఊఙ్ ప్రత్యయము సిద్ధించుటకై యీ సూత్రము చెప్పఁబడినది.

ఉదా : సంహితౌ ఊరూయస్యాఃసా (మిక్కిలిసన్నిహితముగా నున్న ఊరువులు కలది) 'అనేకమన్య పదార్థే' అనుసూత్రముచే సమాసము. సంహితోరు + ఊఙ్, సంహితోరూ+సు=సంహితోరూః.

శఫములనగా కాలిగిట్టలు, వానివలె మిక్కిలి సంశ్లిష్టముగానున్న ఊరువులు గలది అనునర్థమున లక్షణార్థమున ప్రయోగింపఁబడిన శఫశబ్దము పూర్వపదముగాఁ గల ఊరు శబ్దాంత ప్రాతిపదికమునకు ఊఙ్ ప్రత్యయము-శఫౌ ఊరూయస్యాః సా (శఫములైన=శఫములవలెనంటియున్న ఊరువులు గలది) శఫోరు + ఊఙ్ = శఫోరూ + సు=శఫోరూః (ఇచట శఫశబ్దమును ఉపమానవాచకముగాఁ గాక విశేషణ ముగనే గ్రహింపవలయును.)

లక్షణౌ ఊరూయస్యాః సా - లక్షణములైన ఊరువులుగలది - లక్షణోరు (అనేకమన్య పదార్థే అనుసూత్రముచే బహువ్రీహిసమాసము) లక్షణోరు+ఊఙ్, లక్షణోరూ + సు=లక్షణోరూః.

వామౌ ఊరూ యస్యాః సా (అందములయిన ఊరువులు గలది). బహువ్రీహి సమాసము - వామోరు + ఊఙ్ = వామోరూ + సు=వామోరూః

ఊఙ్ ప్రత్యయవిధానము పూర్తి అయినది.

అవ : ఙీన్ ప్రత్యయము విధింపఁబడుచున్నది.

సూ : శార్ఙ్గరవాద్యఞో ఙీన్ 4-1-73.

వృ : శార్ఙ్గరవాదేరఞో యోఽకారస్తదన్తాచ్చ జాతివాచినో ఙీన్. శార్ఙ్గరవీ, బైదీ, బ్రాహ్మణీ.

ప. వి : శార్ఙ్గరవాది (పంచమీవిభక్తిలోపించినపదము) అఞః (6-1) ఙీన్ (1-1).

అను : అతః (5-1) ప్రాతిపదికాత్ (5-1) స్త్రియామ్ (7-1) జాతేః (5-1) ప్రత్యయః (1-1) పరః (1-1).

అర్థ : శార్ఙ్గరవ మున్నగు శబ్దములకును, అఞ్ ప్రత్యయముయొక్క అకారము అంతమునఁ గల ప్రాతిపదికములకు, స్త్రీత్వము వాచ్యమగునపుడు, ఙీన్ ప్రత్యయము వచ్చును. ఉదా : శార్ఙ్గరవీ, బైదీ, బ్రాహ్మణీ.

వివ : 'అతః' అనునది 'జాతేః' అనుదానికి విశేషణము. కావున తదంత విధిచే 'అదంతమైనజాతివాచకమునకు' అనునర్థము కలుగును. అహ్రస్వ అకారము 'అఞ్' ప్రత్యయమునకు సంబంధించినది కావలయునని 'అఞః' అను

షష్ఠ్యంతపదమున కర్థము శార్ఙ్గరవాది ప్రాతిపదికములకును, 'అఞ్' ప్రత్యయము యొక్క అకారము అంతమునఁ గలజాతివాచక ప్రాతిపదికములకును, స్త్రీత్వమున 'ఙీన్' ప్రత్యయము వచ్చునని ఫలితార్థము. ఇందు ఙకార, నకారము లిత్తులు. 'ఈః' మిగులును

ఉదా. శార్ఙ్గరవ' శృఙ్గరోరపత్యం స్త్రీ - శృఙ్గరువుయొక్క అపత్యమైన స్త్రీ అనునర్థమున అణ్ ప్రత్యయము రాఁగా, శార్ఙ్గరవఅగును శార్ఙ్గరవ+ఙీన్, శార్ఙ్గరవ్ + ఈః (అకారలోపము) శార్ఙ్గరవీ+సు=శార్ఙ్గరవీ

'బిదస్య అపత్యంస్త్రీ' - బిదునియొక్క అపత్యమైనస్త్రీ- 'అనృష్యానన్తర్యే బిదాదిభ్యోఽఞ్' అనుసూత్రముచే అఞ్ ప్రత్యయము బిద+ఙస్ + అఞ్, విభక్తిలోపము, ఆదివృద్ధి, అకారలోపము బైద్ + అ=బైద + ఙీన్, బైద్ + ఈః=బైదీ + సు=బైదీ. బ్రాహ్మణ + ఙీన్. బ్రాహ్మణ + ఈః, అకార లోపము. బ్రాహ్మణీ + సు=బ్రాహ్మణీ (బ్రాహ్మణశబ్దము శార్ఙ్గరవాదులలో పఠింపఁబడినది) ఈపై ఉదాహరణములందు జాతిలక్షణ ఙీష్ ప్రత్యయము రావలసియుండగా దానిని బాధించుటకై ఙీన్ ప్రత్యయము విధింపఁబడినది. ఈ ప్రత్యయములలో నేదిచేరినను ఏర్పడు రూపమొక్కటియే యైనను స్వరభేదము కొఱకు ప్రత్యయభేదము చెప్పఁబడినది.

అవ : శార్ఙ్గరవాదిగణములోని గణసూత్రమొకటి చెప్పఁబడుచున్నది.

× సూ : నృనరయోర్వృద్ధిశ్చ (54).

వృ : నారీ.

ప. వి : నృనరయోః (6-2) వృద్ధిః (1-1) చ (అవ్య)

అర్థ : నృనరశబ్దములకు ఙీన్ ప్రత్యయముతోపాటు వృద్ధియును వచ్చును. ఉదా : నారీ.

వివ : నృ, నరశబ్దములు శార్ఙ్గరవాదులగుటచే ఙీన్ ప్రత్యయము వచ్చును. అది వచ్చునపుడు 'నృ' లోని ఋకారమునకు 'నర'లోని మొదటిఅకారమునకును వృద్ధి వచ్చును. (ఇచట వృద్ధియనగా నాదివృద్ధియే) నృ + ఙీన్, వృద్ధి (ఋ> ఆర్) నార్ + ఈః=నారీ+ సు=నారీ, నర+ఙీన్ వృద్ధి(అ> ఆ) నార+ ఈః, యస్యేతి చ-అకారలోపము-నారీ+సు=నారీ.

శార్ఙ్గరవాదిగణము : శార్ఙ్గరవ కాపటవ గౌగ్గులవ బ్రాహ్మణ బైద గౌతమ కామణ్డలేయ బ్రాహ్మణ కృతేయ (అనిచేయ) అనిధేయ ఆశోకేయ వాత్స్యాయన మౌఞ్జాయన కైకస కావ్య (కావ్య) శైబ్య ఏహి పర్యేహి ఆశ్మరథ్య ఔదపాన అరాల చణ్డాల వతణ్డ "భోగవద్గౌరిమతోః సంజ్ఞాయాం ఘాదిషు నిత్యం హ్రస్వార్థమ్' 53. 'నృనరయోర్వృద్ధిశ్చ' 54.

అవ : 'తి' అను స్త్రీ ప్రత్యయము విధింపఁబడుచున్నది.

సూ : యూనస్తిః 4-1-77.

వృ : యువన్ శబ్దాత్ స్త్రియాం తిఃస్యాత్. యువతి.

ప వి : యూనః (5-1) తిః (1-1).

అను : స్త్రియామ్ (7-1) ప్రాతిపదికాత్ (5-1) ప్రత్యయః (1-1) తద్ధితః (1-1).

అర్థ : యువన్ శబ్దమునకు స్త్రీత్వము వాచ్యమగునపుడు 'తి' అను ప్రత్యయము వచ్చును. ఉదా : యువతిః.

వివ : 'యువన్' అనునది నకారాంత ప్రాతిపదికము. కావున 'ఋన్నేభ్యో ఙీప్' 4-1-52 (ఋదంతశబ్దములకును, నకారాంతశబ్దములకును స్త్రీత్వమున ఙీప్ ప్రత్యయము వచ్చును) అనుసూత్రముచే 'ఙీప్' ప్రత్యయము రావలసియుండగా నపవాదముగా నీ సూత్రముచే 'తి' ప్రత్యయము విధింపఁబడినది. ఈ సూత్రము తద్ధితాధికారములోనిది. కావున ఈ ప్రత్యయమునకు తద్ధితమని పేరు కల్గును. ఉదా : యువన్ + తి, 'స్వాదిష్వసర్వనామస్థానే' అనుసూత్రముచే 'తి' ప్రత్యయము పరమగునపుడు పూర్వమునకు పదసంజ్ఞ కలుగును. కాన 'నలోపః ప్రాతిపదికాన్తస్య' అను సూత్రముచే నకారలోపమురాగా 'యువతి' అగును. ఇది తద్ధితాంతమగుటచే దీనికి ప్రాతిపదికసంజ్ఞ కలుగును. (కృత్తద్ధితసమాసాశ్చ) సుప్పుచేరును. యువతి + సు=యువతిః. (యువతీ అను ఈకారాంతశబ్దముకూడకలదు.'యువత్' అనుశతృప్రత్యయాంతముపై 'ఉగితశ్చ' అను సూత్రముచే 'ఙీప్' ప్రత్యయము చేరగా నది యేర్పడునని తెలియఁదగును).

ఇది స్త్రీప్రత్యయప్రకరణము.

ప్రకరణావలోకనము : అయాప్రాతిపదికములకు స్త్రీత్వము వాచ్యమగునపుడు (వానియొక్క స్త్రీలింగరూపములు కావలసినపుడు) చేరుప్రత్యయము

స్త్రీప్రకరణమునఁ జెప్పఁబడినవి. టాప్, చాప్, జీప్, జీష్, జీన్, ఊఙ్, తి అను ప్రత్యయము లిందు విధింపఁబడినవి. 'ష్ఫ' అను ప్రత్యయముకూడ యఞంతమునకు స్త్రీత్వమునందే విధింపఁబడినది. పైవానిలో ఇత్సంజ్ఞలను దొలగించినచో ఆ, ఈ, ఊ, తి అనుస్వరూపములు మిగులును. ప్రధానముగా స్వరభేదమునకై ప్రత్యయము లిన్ని భిన్నరూపములతో చెప్పఁబడినవి ఇందు చాప్, చాప్, జీప్, జీష్, జీన్ ప్రత్యయములు సాధారణముగా అదంతములకే వచ్చును క్వాచిత్కముగా వేఱువర్ణములు అంతమునఁగలవానికిని విధింపఁబడినవి. ఇందు జీష్ ప్రత్యయమునకు సంబంధించి పుంయోగలక్షణము, స్వాంగలక్షణము, జాతిలక్షణము అనుమూఁడు ప్రధానవిభాగములు గలవు ఇవికాక వేఱుగా కూడ నీ ప్రత్యయము కొన్నింటికి విధింపఁబడినది. హలస్తద్ధితస్య, ప్రత్యయస్థాత్కాత్పూర్వస్యాత ఇదాప్యసుపః, పూర్వపదాత్సంజ్ఞాయామగః అను సూత్రములును, కతిపయవార్తికములు ఈస్త్రీ ప్రత్యయప్రక్రియలో కార్యవిశేషములను వివరించినవి. స్త్రియామ్, అనుపసర్జనాత్ అను నధికారసూత్రము లిందు అవసరములయినవి. ఇందింకను విస్తృతమైన అంశములు గలవు వానిని సిద్ధాంతకౌముదిమున్నగువానిలో నరయుట శ్రేయము.

శాస్త్రాన్తరే ప్రవిష్టానాం బాలానాం చోపకారికా
కృతా వరదరాజేన లఘుసిద్ధాన్త కౌముదీ.

తర్కము మున్నగు నితరశాస్త్రములలో ప్రవేశించినవారికిని, వ్యాకరణశాస్త్రమున ప్రారంభకులగు బాలురకును ఉపకారికయగు నీ లఘుసిద్ధాంతకౌముది వరదరాజ పండితునిచే నొనరింపఁబడినది.

ఓమ్ తత్సత్

సూత్రసూచి

వార్త్తికసూచి

అ